వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

శాంతి పర్వం - 3



డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

శాంతి పర్వం - 3

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894.827 81/
రామ - మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

శాంతి పర్వం - 3

ప్రథమ ముద్రణ : వినాయకచవితి (సెప్టెంబరు 2010)

20 సంపుటాల వెల : రూ. 720/- C-27490

సుందరయ్య గ్రంథాలయం హైస్కూల్
A C.No. 96366
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, **పోలకంపాడు,**
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ 9440346287

కీ॥శే॥ కరెడ్ల గోపాలకృష్ణమూర్తి గారి స్మృత్యర్థం

వారి ధర్మపత్ని కమలమ్మ

కుమారులు - కోడళ్లు :

వెంకట సీతారామశాస్త్రి - అనంతలక్ష్మి

సుందరశర్మ - లలితా రాజేశ్వరి, శ్రీనివాస్ - రోజామీనాక్షి

టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్మిల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.



కీ॥శే॥ మోచర్ల రామకృష్ణ శర్మ గారు

వారి స్మృత్యర్థం

టైటిల్ బోర్డు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని వరలక్ష్మి

కుమారుడు :

పూర్ణ వెంకట రామశర్మ



కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి స్మృత్యర్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని సుభద్ర

కుమారులు - కోడళ్లు :

శ్రీయుతులు శ్రీనివాస్ - సౌభాగ్యలక్ష్మి

సత్యనారాయణ (చినబాబు) - యామినీలక్ష్మి

కుమార్తెలు :

భవాని, విశాలాక్షి

రచయిత :

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి,
వారి ధర్మపత్ని శ్రీమతి సీత

రచయిత :

డాక్టర్ సూరం శ్రీనివాసులు,
వారి ధర్మపత్ని శ్రీమతి సులోచన

ఎందరో మహానుభావులు

శాంతి పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి, శ్రీ వెలంపల్లి దాశరథి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతాజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంత తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది అభిగమ్యకృతే దానం అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కొరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వం తానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతాజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకొంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా। సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా॥ ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా। ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	॥	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.	॥	శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

వీటిని అందంగా డి.టి.పి. తయారుచేసిన బెవర వెంకటరమణ, వి.యస్.గ్రాఫిక్స్ వారికి మా కృతజ్ఞతాభివందనములు.

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది, ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణ మని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజ; ధృతరాష్ట్ర, దుర్యోధనులను ప్రతినిధులుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని

అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. ఆంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమృతవీరులను కూడా చూపించాడు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యథాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం - వ్యాస మహాభారతం (తెలుగు వచనం).*

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాజ్గేషు యే
లోకానాం స్థితి మావహన్త్యవిహతాం ప్రీపుంసయోగోద్భవాం
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై
ర్వ్యాయాసుః పురుషోత్తమాబ్జభవ శ్రీకన్దరా శ్రేయసే

ఇట్లు
అనువక్తలు

---

* మహాభారతం యథాతథంగా అనగా అధికపాఠాలతో సహా ఇచ్చాం. అధికపాఠాలు చిన్నసైజులో, బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
247.	మహాభూతాది తత్త్వవివేచన. (25)★	19
248.	బుద్ధిశ్రేష్ఠత - ప్రకృతి పురుష వివేకము. (24)	20
249.	జ్ఞాన సాధన - జ్ఞాని లక్షణాలు. (14)	22
250.	పరమాత్మ ప్రాప్తి సాధన వర్ణన. (25)	23
251.	బ్రహ్మవేత్త లక్షణము - పరబ్రహ్మ ప్రాప్త్యుపాయము. (24)	25
252.	శరీరములో పంచభూతముల కార్యము. (12)	27
253.	యోగ మార్గమున పరమాత్మ సాక్షాత్కారము. (15)	27
254.	ముక్తిప్రాప్త్యుపాయము. (14)	29
255.	పంచభూత - మనోబుద్ధి గుణవర్ణన. (13)	30
256.	ఆకంపన నారద సంవాదము. (21)	31
257.	బ్రహ్మ రోషాగ్నిని ఉపసంహరించుట - మృత్యూత్పత్తి. (22)	32
258.	మృత్యువు ప్రాణిసంహార కార్యమును స్వీకరించుట. (42)	33
259.	ధర్మా ధర్మ స్వరూపనిర్ణయము. (27)	36
260.	ధర్మప్రామాణికతపై సందేహము. (20)	38
261.	జాజలి తులాధారుని కడకుపోవుట. (51)	40
262.	ధర్మమును గూర్చి జాజలి తులాధారుల సంవాదము. (55+$\frac{1}{2}$)	43
263.	ధర్మమును గూర్చి జాజలి తులాధారుల సంవాదము. (45)	46
264.	జాజలికి పక్షుల ఉపదేశము. (23)	50
265.	విచఖ్ననరపాలుడు అహింసను ప్రశంసించుట. (14)	52
266.	గౌతమ చిరకారి వృత్తాంతము. (78)	53

★ బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
267.	ద్యుమత్సేన సత్యవంతుల సంవాదము. (36)	58
268.	స్యూమరశ్మి కపిలుల సంవాదము. (40)	60
269.	గో కపిల సంవాదము - 2. (68)	63
270.	స్యూమరశ్మి కపిల సంవాదము - 2 చతురాశ్రమాలు బ్రహ్మప్రాప్తికి సాధనాలు (47)	68
271.	కుండధారోపాఖ్యానము. (56)	71
272.	అహింసా ప్రాశస్త్యము. (20)	74
273.	చతుఃప్రార్థికము. (24)	76
274.	యోగాచారాను వర్ణనము. (19)	
275.	నారదాసిత సంవాదము. (జీవాత్మకు దేహాభిమాన విముక్తి) (39)	77 78
276.	మాండవ్య జనక సంవాదము. తృష్ణా త్యాగము. (14)	81
277.	పితా పుత్ర సంవాదము. (39)	82
278.	హారీత గీత. (22+1)	85
279.	వృత్ర గీత - 1. (34)	86
280.	సభ్యుల లక్షణములు చెప్పుట. వృత్రగీతలు - 2 ($70+\frac{1}{2}$)	88
281.	వృత్రాసుర వధ ($44+\frac{1}{2}$)	93
282.	బ్రహ్మ హత్యా విభాగము. (65+1)	96
283.	దక్షయజ్ఞ భంగము - జ్వరోత్పత్తి. ($63+\frac{1}{2}$)	99
284.	దక్షప్రోక్త శివసహస్ర నామస్తోత్రము. (203)	102
285.	అధ్యాత్మ జ్ఞానము - ఫలము. (46)	114
286.	సమంగ నారద సంవాదము. (21)	117
287.	శ్రేయో వాచికము. (59)	118

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
288.	సగర అరిష్టనేమి సంవాదము. (47)	122
289.	శుక్రుని వృత్తాంతము. (38)	124
290.	పరాశరుడు జనకునికి శ్రేయస్సాధనను ఉపదేశించుట - పరాశరగీత. (26)	127
291.	కర్మఫలప్రాప్తి అనివార్యత, పుణ్యకర్మవలన లాభము. (23)	129
292.	పరాశరగీత - సత్కర్మాదులు. (23)	131
293.	సజ్జన సాంగత్య మహత్త్వము - మానవకర్తవ్యము. (21+1)	133
294.	వర్ణధర్మము, త్యాగ మహత్త్వము. (31)	135
295.	తపోమహత్త్వము - స్వధర్మాచరణము. (39)	137
296.	నానావిధ ధర్మ కర్తవ్యముల ఉపదేశము. (39)	139
297.	పరాశరగీతలు - చేయవలసిన నానాధర్మాలు. (41)	142
298.	జనకుని వివిధ ప్రశ్నలకు పరాశరుని సమాధానము. (47)	145
299.	హంసగీత - హంసరూపిబ్రహ్మ సాధ్యులకు చేసిన ఉపదేశము. (45+2)	149
300.	యోగస్వరూప సాధనఫల ప్రభావములు. (62)	154
301.	సాంఖ్యయోగానుసారము - సాధన ఫలములు. (116)	158
302.	వసిష్ఠ కరాళజనక సంవాదము - క్షరాక్షరతత్త్వ నిరూపణము. (49)	166
303.	జీవలక్షణవివరణము. (54)	170
304.	ప్రకృతి సంసర్గమువలన జీవుని పతనము. (11)	174
305.	ప్రకృతి పురుష స్వరూప సంబంధ వివరణము. (39)	175
306.	యోగ సాంఖ్య స్వరూప కథనము. (50)	179
307.	విద్యావిద్య, అక్షరక్షర ప్రకృతిపురుషుల స్వరూపము. (48)	183
308.	వసిష్ఠ కరాళజనక సంవాద సమాప్తి. (51+$\frac{1}{2}$)	187
309.	వసుమనునికి - ఒక మహర్షికి మధ్య జరిగిన సంవాదము. (25)	191

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
310.	యాజ్ఞవల్క్య జనక సంవాదము - సాంఖ్యమతానుసారము ఇరువది నాలుగు తత్త్వముల, నవసృష్టుల నిరూపణము. (26)	194
311.	సృష్టి వర్ణనాదులు. (21)	195
312.	ప్రళయ వర్ణనము. (17)	197
313.	ఆధ్యాత్మికాధిభౌతికాధిదైవికములు, సత్త్వరజస్తమో గుణములు. (28)	198
314.	సాత్త్విక రాజస తామస ప్రకృతులకు కల్గుగతులు. (18)	200
315.	ప్రకృతి పురుషుల వివేకము. (20)	201
316.	యోగశాస్త్ర మహత్త్వము. (27)	202
317.	మృత్యుసూచక లక్షణములు. (21)	204
318.	యాజ్ఞవల్క్య వృత్తాంతము - జీవాత్మ పరమాత్మల ఏకత్వము. (112+1)	206
319.	పంచశిఖ జనక సంవాదము. (15)	215
320.	సులభా జనక సంవాదము. (193)	216
321.	వ్యాసుడు శుకునికి చేసిన ధర్మోపదేశము - పావకాధ్యయనము. (94)	230
322.	శుభా శుభ కర్మ ఫలానుభవము. (ధర్మమూలికము) (20)	238
323.	శుకమహర్షి వృత్తాంతము, పుత్రప్రాప్తికి వ్యాసమహర్షి తపస్సు, శంకరుని వలన వరప్రాప్తి. (29)	240
324.	శుకజననము, ఉపనయనము, వేదాధ్యయన సమావర్తనములు. (27)	242
325.	శుకుని మిథిలా గమనము. (45)	244
326.	శుక జనక సంభాషణము. (51)	247
327.	శుకదేవుని తిరుగుప్రయాణము, వేదాధ్యయన విధానము. (52)	251
328.	అనధ్యాయ నిమిత్త కారణకథనము. (57)	254
329.	శుకునికి నారదుడు చేసిన వైరాగ్యజ్ఞానోపదేశము. (59)	258
330.	శుకాభిపతనము. (30)	262

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
331.	కర్మఫల ప్రాప్తి పరతంత్రము – శుకాభిగమనము. (65)	265
332.	శుకాభిపతనము. (31)	269
333.	శుకుని పరమ పదప్రాప్తి. (42)	271
334.	నారాయణీయము – పరమాత్మ సర్వ పూజనీయత. (45+$\frac{1}{2}$)	273
335.	నారాయణీయము – శ్వేత ద్వీపము. (55+1)	276
336.	ఉపరిచరవసు వృత్తాంతము – శ్వేతద్వీప భగవన్మహిమావర్ణనము. (65)	280
337.	ఉపరిచరుని అధః పతనము, పునరుత్థానము. (41+1)	284
338.	ద్విశతనామములతో నారదుడు భగవంతుని స్తుతించుట. (3)	287
339.	చతుర్వ్యూహ స్వరూపము – భవిష్యదవతార కార్యములు (141+15$\frac{1}{2}$)	290
340.	నారాయణీయము. (119)	299
341.	శ్రీకృష్ణుడు అర్జునునకు చెప్పిన స్వప్రభావము, భగవన్నామవ్యుత్పత్తి, మహత్త్వము. (51)	306
342.	సృష్ట్యారంభము, బ్రాహ్మణమహిమ, భగవన్నామహేతువు, శివకేశవయుద్ధము. (142+2)	310
343.	నారాయణీయము – 10. (66)	324
344.	నరనారాయణులు చెప్పిన వాసుదేవ మాహాత్మ్యము. (27)	328
345.	వరాహస్వామి స్థాపించిన పితృపూజా విధి. (28)	329
346.	నారాయణ మహిమోపాఖ్యానోప సంహారము. (22)	331
347.	హయగ్రీవావతార వృత్తాంతము. (96)	333
348.	సాత్వత ధర్మోపదేశ పరంపర. (88)	339
349.	అపాంతరతముని జన్మ వృత్తాంతము. (74)	344
350.	నారాయణ మహిమా వర్ణనము. (27)	349
351.	బ్రహ్మరుద్ర సంవాదము – నారాయణ మహిమా వైశిష్ట్యము. (23)	351

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
352.	ఉంఛవృత్త్యుపాఖ్యానము - 1. (11)	353
353.	ఉంఛవృత్త్యుపాఖ్యానము - 2. (9)	354
354.	ఉంఛవృత్త్యుపాఖ్యానము - 3. (16)	354
355.	ఉంఛవృత్త్యుపాఖ్యానము - 4. (11)	355
356.	ఉంఛవృత్త్యుపాఖ్యానము - 5. (11)	356
357.	ఉంఛవృత్త్యుపాఖ్యానము - 6. (13)	357
358.	ఉంఛవృత్త్యుపాఖ్యానము - 7. (13)	358
359.	ఉంఛవృత్త్యుపాఖ్యానము - 8. (16)	358
360.	ఉంఛవృత్త్యుపాఖ్యానము - 9. (20)	359
361.	ఉంఛవృత్త్యుపాఖ్యానము - 10. (16)	360
362.	ఉంఛవృత్త్యుపాఖ్యానము - 11. (18)	361
363.	ఉంఛవృత్త్యుపాఖ్యానము - 12. (6)	363
364.	ఉంఛవృత్త్యుపాఖ్యానము - 13. (10)	363
365.	ఉంఛవృత్త్యుపాఖ్యానము - 14. (9)	364

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
శాంతి పర్వం - 3

247. మహాభూతాది తత్త్వవివేచన.

శుకు డిలా అడిగాడు. 'స్వామీ ! ఋషిశ్రేష్ఠా ! అధ్యాత్మజ్ఞానాన్ని గూర్చియే నాకు మరలా వివరంగా చెప్పు. అధ్యాత్మమంటే ఏమిటి ? దాని నెలా గ్రహించాలి ?' వ్యాసు డిలా చెప్తున్నాడు. 'పుత్రా ! మనుష్యులకోసం శాస్త్రాలలో చర్చించిన అధ్యాత్మజ్ఞానాన్ని గురించి నీకు వివరిస్తాను. ఈ అధ్యాత్మవ్యాఖ్యను విను. భూమి, నీరు, తేజస్సు, వాయువు, ఆకాశం - ఇవి పంచమహాభూతాలు. ఇవి సముద్రంలో అలలవలె ప్రాణుల శరీరాలలో జన్మించి లీనమవుతూ ఉంటాయి. తాబేలు తన శరీరావయవాలను బయటకు ప్రసరింపజేసి మరలా తనలోనికి లాగుకొనినట్లు మహాభూతాలు స్వల్పశరీరాలలో ఉద్భవించి, లీనమవుతూ ఉంటాయి. సమస్త స్థావరజంగమాత్మ కమయిన జగత్తు మహాభూతమయం. సృష్టి వేళలో పంచభూతాలనుండి మొత్తం ఉద్భవిస్తుంది. ప్రళయవేళలో అంతా ప్రళయంలో లయ మవుతుంది. సర్వప్రాణులలోనూ పంచభూతాలే ఉంటాయి. కానీ ప్రాణులలో వైషమ్యం కనిపిస్తుంది. అది ప్రాణుల కర్మానుసారం సృష్టి కర్త బ్రహ్మ కలిగించిన వైషమ్యం.' శుకు డిలా అడిగాడు. 'ప్రాణులలో సృష్టికర్త వైషమ్యాన్ని కలిగించాడు. సరే ! దానిని గుర్తించటమెలా ? శరీరంలో ఇంద్రియాలున్నాయి. గుణాలున్నాయి. వాటిలో ఏది ఏభూతానికి సంబంధించినదో తెలియట మెలా ?'

వ్యాసు డిలా చెప్తున్నాడు. 'నేను దీనిని క్రమంగా యథాతథంగా చెప్తాను. సర్వవిషయ తత్త్వాన్ని ఉన్నదున్నట్టు వివరిస్తాను. సావధానంగా విను. శబ్దం, శ్రోత్రం, శరీరగత రంధ్రాలు ఆకాశంనుండి పుట్టినవి. ప్రాణం, చేష్ట, స్పర్శ - ఈ మూడు వాయుగుణాలు. రూపం, కన్ను, జఠరాగ్ని - ఈ మూడు తేజస్సు కర్మలు. రసం, నాలుక, స్నేహం - ఈ మూడు జలగుణాలు. గంధం, నాసిక, శరీరం - ఈ మూడు

పృథివీ గుణాలు. ఈ రీతిగా ఇంద్రియసముదాయంతో కూడిన ఈ శరీరం పాంచభౌతికం. స్పర్శ వాయుగుణం. రసం జలగుణం, రూపం తేజోగుణం. శబ్దం ఆకాశగుణం. గంధం పృథివీగుణం. మనస్సు, బుద్ధి, స్వభావం - ఈ మూడు కారణభూతమయిన పూర్వజన్మ సంస్కారం నుండి పుట్టినవి. ఇవి కూడా పాంచభౌతికాలే అయినా శ్రోత్రాదులకన్న శ్రేష్ఠమైనవి. కానీ గుణాలను అతిక్రమించలేవు. తాబేలు తన శరీరావయవాలను వెలుపలికి ప్రసరింపజేసి మరలా లోనికి లాగుకొనినట్లు బుద్ధి ఇంద్రియసమూహాన్ని విషయాలపై ప్రవర్తింపజేస్తూ మరలిస్తూ ఉంటుంది. మనిషి ఆపాదమస్తకం తన సంపూర్ణశరీరాన్ని అహంభావంతో చూస్తాడు. ఆ పని బుద్ధియొక్క ప్రవృత్తియే. బుద్ధియే శబ్దాది లయిన ఇంద్రియగుణాలను ఇంద్రియాల దగ్గరకు లాగుతుంది. మనస్సుతో పాటు ఇంద్రియాలను విషయంవైపు నడుపుతుంది. బుద్ధి లేకపోతే ఇంద్రియాలద్వారా విషయానుభవ ముండదు. ఇంద్రియాలు అయిదు. మనస్సు ఆరవ ఇంద్రియం. ఏడవది బుద్ధి. క్షేత్రజ్ఞుడు ఎనిమిదవాడు. కన్ను చూస్తుంది. మనస్సు సంశయిస్తుంది. బుద్ధి నిర్ణయిస్తుంది. క్షేత్రజ్ఞుడు వీటికన్నింటికీ సాక్షి. రజస్సు, తమస్సు, సత్త్వం - ఈ మూడు మూలప్రకృతి నుండి పుట్టిన గుణాలు. ఇవి సర్వప్రాణులకు సమానాలు. వాటి పనులద్వారా వాటి ఉనికిని గుర్తించాలి. **తనలో ప్రసన్నత, ప్రశాంతత, పవిత్రత కనిపిస్తే అది సత్త్వగుణప్రవృత్తి అని నిర్ణయించాలి. శారీరకంగా కానీ, మానసికంగా కానీ సంతాపంతో కూడిన ప్రవృత్తి కనిపిస్తే అది రజోగుణప్రవృత్తి అని నిర్ణయించాలి. మోహభావన, ఏ విషయంలోనూ స్పష్టత లేకపోవటం, తార్కికదృష్టి పనిచేయకపోవటం, ఏదీ అవగాహనకు రాకపోవటం - ఈ లక్షణాలు కనిపిస్తే అది తమోగుణ ప్రవృత్తి. హర్షాతిశయం, ప్రేమ, ఆనందం, సమత్వం, ప్రశాంత చిత్తత - ఈ లక్షణాలు నిష్కారణంగా కానీ, సకారణంగా కానీ కనిపిస్తే అవి సాత్త్విక గుణాలు. అభిమానం, అసత్యభాషణం, లోభం, మోహం, అపహ్నవం - ఈ లక్షణాలు సకారణంగా కానీ, నిష్కారణంగా కానీ కనిపిస్తే అవి రజోగుణలక్షణాలు. మోహం, అసావధానత, నిద్ర, అలసత్వం, అజ్ఞానం - ఈ లక్షణాలు ఏదో ఒక కారణంవలన కలుగుతుంటే అవి తమోగుణ కార్యాలు.'**

248. బుద్ధిశ్రేష్ఠత - ప్రకృతి పురుష వివేకము.

వ్యాసు డిలా చెప్తున్నాడు. 'కర్మప్రేరణ మూడురకాలుగా ఉంటుంది. మనస్సు భావాలను సృష్టిస్తుంది. బుద్ధి నిశ్చయిస్తుంది. హృదయం ప్రియాప్రియాలను భావిస్తుంది.

ఇంద్రియాలకన్న ఇంద్రియార్థాలు బలవత్తరాలు. ఇంద్రియార్థాలకన్న మనస్సు ప్రబలం. మనస్సుకన్న బుద్ధి బలవత్తరం. బుద్ధికన్న ఆత్మ బలవత్తరం. బుద్ధి ప్రాణులకు జీవాత్మవంటిది. బుద్ధియే తనలోతాను విషయగ్రహణం కోసం మార్పులను కల్పించుకొన్నప్పుడు నానారూపాలు ధరిస్తుంది. అప్పు డది మనస్సు అవుతుంది. ఇంద్రియాలు వేరు వేరు కాబట్టి ఇంద్రియకార్యాలు కూడా వేరువేరు. అందువలన బుద్ధి నానారూపధారణ చేస్తుంది. వినేటప్పుడు చెవి అవుతుంది. స్పృశించే వేళ చర్మ మవుతుంది. చూసేటప్పుడు కన్ను అవుతుంది రుచిచూసేటప్పుడు నాలుక అవుతుంది. వాసనచూసేటప్పుడు నాసిక అవుతుంది. ఇలా బుద్ధియే వేరువేరుగా మారుతుంది. ఈ బుద్ధి వికారాలనే ఇంద్రియా లంటాము. అదృశ్యుడైన జీవుడు వీటిలో నిలిచి ఉంటాడు. బుద్ధి జీవునిలోనే ఉంటూ సాత్త్విక, రాజస, తామసభావాల్లో కూడా ప్రవేశిస్తుంది. ఒకొక్కప్పుడు ఆనందిస్తుంది. ఒక్కొక్కప్పుడు దుఃఖిస్తుంది. ఒక్కొక్కప్పుడు సుఖదుఃఖాలు లేక తటస్థంగా ఉంటుంది. నదీవల్లభుడైన సముద్రుడు అలలతో కలిసియున్నా చెలియలికట్టను దాటనట్టు బుద్ధి భావాత్మక మయినా భావాలను అతిక్రమించదు. ఏదైనా కోరిక కలిగినప్పుడు ఆ బుద్ధి మనస్సు అవుతుంది. వేరువేరుగా కనిపించే ఇంద్రియాలన్నీ బుద్ధిలో నున్నవే అని గ్రహించాలి. రూపాది జ్ఞానం మేధ. మేధకు సహకరించేది కాబట్టి ఇంద్రియాలు మేధ్యాలు. యోగి ఇంద్రియాలను పూర్తిగా జయించాలి. బుద్ధి ఇంద్రియాలతో కలిసి ఉంటుంది. ఎప్పుడు ఏ ఇంద్రియంతో అది కలుస్తుందో అప్పుడు మనస్సులోనూ, ఇంద్రియార్థాలలోనూ కూడా ఉంటుంది. బుద్ధియే ఇంద్రియంగా, ఇంద్రియార్థంగా, మనస్సుగా నిలుస్తుంది.

విశ్వంలో కనిపించే సమస్తభావాలూ సత్త్వ రజస్తమో గుణాలలో చేరినవే. రథం యొక్క ఇరుసుతో ఆకులన్నీ అనుసంధింపబడినట్లు సర్వభావాలు త్రిగుణాలతో సంబంధం గలవే. బుద్ధి అనే అధిష్ఠానంలో ఉదాసీనంగా ఉన్న ఇంద్రియాలు స్వభావాన్ని అనుసరించి, యథాసంభవంగా ఇంద్రియార్థాల వైపు ప్రసరిస్తాయి. అప్పుడు మనస్సు దీపంవలె ఇంద్రియార్థాలను ఇంద్రియాల ద్వారా చూసి, గ్రహిస్తుంది. ఈ రీతిగా జగత్తుయొక్క ఈ పరివర్తన స్వాభావిక మని గ్రహించిన జ్ఞాని మోహానికి లోనుగాడు. ఎప్పుడూ హర్షశోకాలకూ, రాగద్వేషాలకూ దూరంగా ఉంటాడు. ఇంద్రియాలు అన్యాయంగా మనస్సు కోరిన విషయాలపై ప్రసరిస్తుంటాయి. కాబట్టి దుష్కర్మశీలురు, కలుషితాంతఃకరణులు అయిన అజ్ఞానులు ఆ ఇంద్రియాల ద్వారా ఆత్మను చూడలేరు. నిర్మల మనస్సుతో మనిషి ఇంద్రియా లనే అశ్వాలను నియంత్రించగలిగినప్పుడు దీపపు వెలుగులో కనిపించిన వస్తువువలె ఆత్మ సాక్షాత్కరిస్తుంది. చీకటి తొలగిపోయినపుడు సమస్త జీవులకు వెలుగు గోచరించినట్లుగా

ఆత్మ సాక్షాత్కారాన్ని కూడా భావించాలి. **జలచరమైన పక్షి నీటిలో తిరుగుతూ కూడా నిర్లిప్తంగా ఉండగలిగినట్లు ముక్తాత్ముడైన యోగి సంసారంలో ఉన్నా గుణదోషాల సంబంధం పొందడు.** అలాగే కృతప్రజ్ఞుడు పుత్ర భార్యాది సంబంధాలపై ఆసక్తి లేని కారణంగా విషయాలను సేవిస్తున్నా కూడా ఆ విషయాలచే ఏ రీతిగాను స్పృశింపబడడు. పూర్వ కర్మజనితమైన సంస్కారాలను వీడి, ఎప్పుడూ పరమాత్మపై ఆసక్తి గలవాడు సర్వప్రాణులను తనలా భావిస్తాడు. ఎప్పుడూ విషయాసక్తుడు కాడు. జీవాత్మ ఒకప్పుడు బుద్ధి వైపు, మరొకప్పుడు గుణాలవైపు ప్రసరిస్తుంది. గుణాలకు ఆత్మ తెలియదు. ఆత్మకు గుణాలు తెలుసు. ఎందుకంటే గుణాలకు స్రష్ట, ద్రష్టకూడా ఆత్మయే. సూక్ష్మస్వరూపు లయిన బుద్ధి, క్షేత్రజ్ఞుల మధ్య భేదమిదే. బుద్ధి దృశ్యం. ఆత్మ ద్రష్ట. ఈ రెండింటిలో బుద్ధి గుణాలను సృష్టిస్తుంది. ఆత్మ గుణాలను సృష్టించదు. స్వరూపాన్ని బట్టి అవి వేరువేరు. కానీ ఎప్పుడూ కలిసియే ఉంటాయి. నీరు వేరు, చేప వేరు. అయినా నీరు, చేపా కలిసియే ఉంటాయి. మేడిపండు, దానిలోని పురుగులూ వేరువేరే. అయినా ఎప్పుడూ కలిసే ఉంటాయి. దర్భ, దాని ఈనెలు వేరువేరు. అయినా కలిసి ఉంటాయి. అదేరీతిగా బుద్ధి, క్షేత్రజ్ఞుడు వేరువేరు. అయినా ఒకటి మరొక దానిని ఆశ్రయించియే ఉంటాయి.'

249. జ్ఞాన సాధన - జ్ఞాని లక్షణాలు.

వ్యాసు డిలా అన్నాడు. 'ప్రకృతి గుణాలను సృష్టిస్తుంది. క్షేత్రజ్ఞుడు - ఆత్మ ఉదాసీనునివలె వికారశీల మయిన ఆ గుణాలన్నింటినీ చూస్తుంటాడు. ఆత్మ స్వాయత్తం. గుణాలకు అధిష్ఠానం. సాలెపురుగు తన శరీరం నుండి దారాలను సృష్టించినట్లు ప్రకృతి తననుండియే సమస్త త్రిగుణాత్మక పదార్థాలను సృష్టిస్తుంది. ప్రకృతి చేసే ఈ విషయ సృష్టి వాటి స్వభావం నుండి కలిగినదే. తత్త్వజ్ఞుడు తత్త్వజ్ఞానంతో గుణాలను నశింపజేసినప్పుడు వాటితో సంబంధం తొలగిపోతుందని కొంతమంది అభిప్రాయం. గుణాలు తమ అస్తిత్వాన్నే కోల్పోతాయని మరికొందరి మతం. ఈ రెండు అభిప్రాయాలను నీ బుద్ధితో ఆలోచించి నిర్ణయాన్ని తీసికో. ఈ రీతిగా ఆలోచించి నిర్ణయించటంవలన గర్భస్థుడైన జీవుడు మహాత్ముడు కాగలడు. ఆత్మ అనాదీ, అనంతం. దానినెరిగిన మనిషి సదా హర్షక్రోధాలకూ, ఈర్ష్యాద్వేషాలకూ దూరంగా ఉంటాడు. ఈ రీతిగా సాధకులు బుద్ధియొక్క చింతనాది ధర్మాలతో, దృఢమయిన, అనిత్యమయిన హృదయగ్రంథిని భేదించి శోకసంశయ రహితులై, సుఖంగా పరమాత్మ స్వరూపంతో నిలవాలి. ఈతరానివారు నిండుగా పారుతున్న నదిని

దాటలేక తీరం నుండి నీటిలోపడి మునిగిపోతూ బాధపడినట్లు అజ్ఞానులు ఈ సంసారసాగరాన్ని దాటలేక దీనిలో మునిగి కష్టపడతారు. కానీ ఈతవచ్చిన వాడు ఆ రీతిగా బాధపడడు. నేలమీద నడచినట్టే నీటిలో కూడా పయనించగలడు. అదేరీతిగా జ్ఞానస్వరూపు డయిన విశుద్ధపరమాత్మను తెలిసిన జ్ఞాని సంసార సాగారాన్ని తరించగలడు.

ఈ రీతిగా ప్రాణుల గమనాగమనాలను, విషమావస్థలను గూర్చి ఆలోచించినవాడు పరమోత్తమ శాంతిని పొందగలడు. **ఈ రీతిగా మనుష్యులందరిలోనూ, ప్రత్యేకించి బ్రాహ్మణునిలో ఈ జ్ఞానాన్ని పొందేశక్తి జన్మసిద్ధం. ఇంద్రియ నిగ్రహమూ, ఆత్మజ్ఞానమూ మోక్షప్రాప్తికి తగిన సాధనాలు.** సంయమనాన్నీ, ఆత్మతత్త్వాన్నీ తెలిసినవాడు అత్యంతం శుద్ధుడూ, బుద్ధుడూ అవుతాడు. ధీమంతులు ఈ ఆత్మతత్త్వాన్ని తెలిసికొని కృతార్థులు, ముక్తులు అవుతారు. పరలోకాన్ని గురించి అజ్ఞానులు మరీతీవ్రంగా భయపడతారు. కానీ జ్ఞానులకు అసలు భయముండదు. జ్ఞాని పొందే సనాతనగతికన్న అధిక మయిన గతిని ఎవ్వడూ పొందలేడ్కు. లోకంలో కొందరు బాధపడేవారిని చూసి, వారిలో తప్పులెన్నుతారు. మరికొందరు వారిని చూసి దుఃఖిస్తారు. కానీ కార్య కారణాలను రెండింటిని తాత్త్వికంగా గ్రహించినవాడు శోకించడు. అటువంటివారు ఆ విషయంలో నిపుణులు. **నిష్కామభావంతో కర్మలను అనుష్ఠానం చేస్తే పురాకృతాలైన శుభాశుభకర్మలను కూడా అది నశింపజేస్తుంది. ఆ రీతిగా కర్మల నాచరించిన వానిని ఇహపరాలలో ప్రియం కానీ, అప్రియం కానీ ఏమీ చేయలేవు.'**

250. పరమాత్మ ప్రాప్తి సాధన వర్ణన.

శుకు డిలా అడిగాడు. 'ఈ లోకంలో ఏ ధర్మంకన్న గొప్పది మరొక టుండదో, ఏది శ్రేష్ఠధర్మమో దానిని నాకు చెప్పండి. వ్యాసు డిలా అంటున్నాడు. 'సర్వధర్మాలలో శ్రేష్ఠమయిన ధర్మాన్నిగురించి చెపుతాను. ఇది ప్రాచీన మహర్షులు చెప్పినది. సావధానంగా వినుము. **ప్రయత్నపూర్వకంగా బుద్ధితో నియంత్రించి ఇంద్రియాలను అణచివేయాలి. అవి విషయాలపై పడుతుంటాయి. తండ్రి చిన్నపిల్లలను ఒడిలో నిలుపుకొని నియంత్రించినట్లు ఇంద్రియాలను నియంత్రించాలి. మనస్సు, ఇంద్రియాల యొక్క ఏకాగ్రత అన్నింటికన్న గొప్పతపస్సు. సర్వధర్మాల కన్న అది గొప్పది. అదే శ్రేష్ఠమైనది. మనస్సును, పంచేంద్రియాలను బుద్ధిద్వారా స్థిరంగా నిలుపుకొని, అనేక విధాలుగా ఆలోచింపదగిన విషయాలను గురించి ఆలోచించకుండా తనలో తాను తృప్తినంది, నిశ్చలంగా ఉండాలి. ఇంద్రియాలు ఇంద్రియార్థాలనుండి మరలి తమ**

నివాసస్థావంలోనే నిలిచివప్పుడు స్వయంగానే ఆ సనాతన పరమాత్మను సందర్శించవచ్చు. పొగలేని నిప్పువలె ప్రకాశించే ఆ పరమాత్మయే సర్వాత్ముడు, మహాత్ముడు. బుద్ధిమంతులు, మహనీయులు అయిన బ్రాహ్మణులు ఆయనను చూడగలరు. చాలా కొమ్మలు గలిగి ఫలపుష్పాలతో నిండియున్నచెట్టు తన పూలు, పండ్లు ఎక్కడున్నాయో గ్రహించదు. అట్లే జీవునకు తాను ఎక్కడ నుండి వచ్చారో, ఎక్కడకు వెళతాడో తెలియదు. కానీ అంతరాత్మ అన్నీ నిరంతరంగా చూస్తూనే ఉంటుంది. వెలుగుతున్న జ్ఞానదీపంతో పురుషుడు పరమాత్మను చూడవచ్చు. అలా ఆత్మతో పరమాత్మను సాక్షాత్కరించుకొంటే సర్వజ్ఞుడవు, స్వాభిమానరహితుడవు కావచ్చు. కుబుసం విడిచిన పామువలె సర్వపాపవిముక్తుడవై, ఉత్తమ బుద్ధిని పొంది పాపాలకు, చింతకు దూరం కాగలవు.

ఈ సంసారం ఘోరమయిన నది. లోకమంతా ప్రవహిస్తుంటుంది. దాని ప్రవాహం అన్ని దిక్కులకూ సాగుతుంది. పంచేంద్రియాలు దానిలోని మొసళ్ళు. మనస్సంకలమే దాని ఒడ్డు. లోభమోహా లనే గడ్డి దానిని కప్పుతుంది. కామక్రోధాలనే సర్పాలు దానిలో ఉంటాయి. సత్యం దానికి రేవు. అసత్యం దానిలోని కల్లోలం. క్రోధం బురద. ఇది ఇతరనదుల కన్న గొప్పది. అది అవ్యక్తం నుండి పుట్టినది. వేగం ఎక్కువ. ఆత్మనియంత్రణ లేనివారు దానిని దాటలేరు. కోరికలనే మొసళ్ళు దానిలో తిరుగుతుంటాయి. ఇది సంసార సాగరంలో కలుస్తుంది. పూర్వజన్మ కర్మలవలననే పుడుతుంది. నాలుక దానిలోని సుడి. దానిని దాటటం దుష్కరం. నీ నిర్మలాంతఃకరణంతో ఆ నదిని దాటాలి. కృతప్రజ్ఞులు, ధీరులు అయిన బుద్ధిమంతులు దానిని దాటగలరు. దానిని దాటి సర్వబంధవిముక్తుడవై, నియత చిత్తుడవై, ఆత్మజ్ఞుడవై, పవిత్రుడవు కమ్ము. ఉత్తమ జ్ఞానాన్ని ఆశ్రయించి, సర్వసంసార బంధనాలను ఛేదించి, పాపరహితుడవై, ప్రసన్నుడవై, బ్రహ్మభావాన్ని పొందగలవు. పర్వతశిఖరం మీద నిలిచి, భూమిపై నున్న ప్రాణులను చూసినట్లు నీవు జ్ఞానశిఖరం మీద నిలిచి సర్వప్రాణులను చూడు. హర్షక్రోధాలకు, క్రౌర్యానికీ దూరంగా నిలు. అప్పుడు సర్వప్రాణుల జననమరణాలను చూడగలవు. ధర్మాత్ములలో శ్రేష్ఠులు, తత్త్వద్రష్టలు, పండితులు అయిన మునులు ఈ ధర్మాన్నే సమస్త ప్రాణులకూ ఉత్తమ ధర్మమని భావించారు. పుత్రా ! ఈ ఉపదేశం వ్యాపక మయిన ఆత్మకు సంబంధించిన జ్ఞానం. సంయతచిత్తుడు, హితైషి అయిన అనుయాయికి దీనిని ఉపదేశించాలి. ఈ ఆత్మజ్ఞానం రహస్యం. అన్నింటినీ మించిన రహస్యం. విశిష్టం. పుత్రా ! నేను నీకు ఉపదేశించిన ఈ జ్ఞానం ప్రత్యక్షంగా నేను అనుభవించిన జ్ఞానం. సుఖదుఃఖ రహితమూ, భూతభవిష్య

ద్వర్తమాన స్వరూపమూ అయిన ఈ బ్రహ్మం స్త్రీ కాదు. పురుషుడూ కాదు. నపుంసకమూ కాదు. దీనినెరిగిన స్త్రీ కానీ, పురుషుడు కానీ మరల ఈ లోకంలో జన్మించరు. మోక్షసాధన కోసమే ఈ ధర్మం విధింపబడింది. కుమారా ! విభిన్నమతాలను యథాతథంగా నీకు వివరించాను. వీటి ననుసరించినవారు ముక్తి నందగలరు. అనుసరించకపోతే ముక్తి లేదు. సత్కుమారా ! ప్రీతి యుక్తుడు, గుణాన్వితుడు, దమాన్వితుడు అయిన కొడుకు అడిగినప్పుడు తండ్రి సంతోషించి ఉన్నదున్నట్లుగా ఈ జ్ఞానాన్ని ఉపదేశించాలి. అందుకే నేను నీకు చెప్పాను.'

251. బ్రహ్మవేత్త లక్షణము - పరబ్రహ్మ ప్రాప్త్యుపాయము.

వ్యాసు డిలా చెప్తున్నాడు. 'సాధకుడు గంధాలను, రసాలను సేవించరాదు. విషయోప భోగ సుఖాలను ఆశించకూడదు. రకరకాల ఆభరణాలను ధరించాలని మనసు పడకూడదు. మానం, వృద్ధి, యశస్సు కోరుకొన కూడదు. ఇది బ్రాహ్మణుని నడవడి కావాలి. బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ, గురుశుశ్రూష చేస్తూ, సర్వవేదాలను అధ్యయనం చేయాలి. బుక్కులను, యజుస్సులను, సామలను గ్రహించాలి. అలా చేసినవాడే ద్విజుడు. సర్వప్రాణులను జ్ఞాతులనువలె ఆదరించాలి. తెలియదగినవన్నీ తెలియాలి. సర్వవేదాలు గ్రహించాలి. కామాలకు దూరం కావాలి. అటువంటి వానికి మృత్యువు లేదు. ఈ లక్షణా లున్నవాడే నిజమైన బ్రాహ్మణుడు. ఎన్ని ఇష్టులను చేసినా, భూరిదక్షిణలతో ఎన్నియాగాలను అనుష్ఠించినా ఆత్మజ్ఞానం లేనివాడు ఏ రీతిగానూ బ్రాహ్మణత్వాన్ని పొందజాలడు. తాను దేనికీ భయపడకూడదు. తనను చూసి ఎవ్వరూ భయపడకూడదు. దేనినీ కోరకూడదు. దేనినీ ద్వేషించకూడదు. అప్పుడే బ్రహ్మభావం కలుగుతుంది. సర్వప్రాణులమీద మనసా, కర్మణా, వాచా పాపభావనలు లేనప్పుడే బ్రహ్మభావం సిద్ధిస్తుంది. లోకంలో కోరిక ఒక్కటియే బంధం. మరే బంధమూ లేదు. కామబంధన ముక్తు డైతే బ్రహ్మభావాన్ని పొందటానికి సమర్థు డవుతాడు. బూడిదరంగుమేఘం చాటునుండి బయటపడిన చంద్రునిలా కోరికలనుండి బయటపడినవాడు నిర్మలుడై, ధైర్యంగా కాలానికై నిరీక్షిస్తాడు. సముద్రం నింపబడుతూనే ఉంటుంది. నిశ్చలంగా ఉంటుంది. జలం దానిలో చేరినా దానిని కదిలించలేవు. అదే రీతిగా భోగాలు తనలో ప్రవేశించినా నిర్వికారంగా ఉండగల స్థితప్రజ్ఞుడే కోరికలకు దూరమై శాంతి నందగలడు. భోగాలే స్థితప్రజ్ఞుని కోరుకొంటాయి. కానీ స్థితప్రజ్ఞుడు భోగాలను కోరుకొనడు. కామభోగాలను కోరుకొనేవాడు తత్ఫలంగా స్వర్గానికి చేరుతాడు (ముక్తి నందలేడు).

వేదం యొక్క సారం సత్యవచనం. సత్యసారం దమం. దమసారం దానం. దానసారం తపస్సు. **తపస్సారం త్యాగం. త్యాగసారం సుఖం. సుఖసారం స్వర్గం. స్వర్గసారం శాంతి.**

మనిషి సంతోషంగా ఉండి శాంతికి ఉత్తమోపాయమైన సత్త్వగుణాన్ని సొంతం చేసికొనే ప్రయత్నం చేయాలి. సత్త్వగుణం మనస్సులోని తృష్ణా, శోక, సంతాపాలను పచనం చేస్తుంది. **శోకరహితుడు, మమతారహితుడు, శాంతుడు, ప్రసన్న హృదయుడు, మాత్సర్యహీనుడు, సంతోషి -ఈ ఆరులక్షణాలు గల మనిషి పూర్తిగా జ్ఞానతృప్తుడై, మోక్షాన్ని పొందగలడు.** దేహాభిమాన విముక్తుడై సత్త్వప్రధానాలైన సత్య, దమ, దాన, తపస్త్యాగ శమ గుణాలతో; శ్రవణ మనన నిదిధ్యాసన రూపాలయిన సాధనాలతో పొందదగిన ఆత్మను శరీర మున్నప్పుడే గ్రహించగలవాడు పరమశాంతి నందగలడు. ఉత్పత్తి వినాశరహితమూ, స్వభావసిద్ధమూ, సంస్కార శూన్యమూ అయిన శరీరంలో నిలిచి సుకృతమని వ్యవహరింపబడే బ్రహ్మ పదార్థాన్ని పొందినవాడు అక్షయ సుఖాల ననుభవించగలడు. **మనస్సును ప్రసరించకుండా ఆపి, సంపూర్ణంగా ఆత్మయందే నిలిపిన పురుషుడు పొందే సంతోషాన్ని, సుఖాన్ని మరే ఉపాయం ద్వారా పొందే అవకాశం లేదు.** బ్రహ్మజ్ఞానం కలిగితే భుజింపకపోయినా తృప్తి కలుగుతుంది. ధనం లేకపోయినా ఆనందం కలుగుతుంది. స్నేహం లేకపోయినా బలాన్ని ఇస్తుంది. ఇది తెలిసినవాడే వేదవేత్త. ఇంద్రియ ద్వారాలను రక్షించుకొంటూ, అన్నివైపులా వాటిని బంధించి, నిత్యబ్రహ్మను గురించి విచారించేవాడు శ్రేష్ఠ బ్రాహ్మణుడు. అతడే ఆత్మారాముడు. తన కోరికల నన్నింటినీ క్షీణింపజేసి, పరతత్త్వరూపమైన పరమాత్మయందు ఏకాగ్రచిత్తతతో నిలిచినవాడు పొందే సుఖం శుక్లపక్షచంద్రునివలె దినదినాభివృద్ధి నందుతుంది. సాధారణంగా సర్వభూతాలనూ, భౌతిక గుణాలనూ పరిత్యజించిన మునియొక్క దుఃఖం సూర్యోదయంతో చీకటి తొలగిపోయినట్లు అనాయాసంగా తొలగిపోతుంది. గుణాల ఐశ్వర్యాన్నీ, కర్మలనూ పరిత్యజించి, విషయ వాసనలకు దూరమైన బ్రహ్మవేత్తను జరామరణాలు సమీపించవు. సర్వబంధవిముక్తుడై, సమత్వంలో నిలిచినవాడు తాను శరీరంలోనే ఉన్నా ఇంద్రియాలను, ఇంద్రియార్థాలను అతిక్రమించగలడు. ఈ రీతిగా పరమకారణ స్వరూపుడైన పరబ్రహ్మను పొంది, కార్యరూప మయిన ప్రకృతిని అతిక్రమించినవాడు పరమపదాన్ని పొందుతాడు. ఆ జ్ఞానికి పునర్జన్మ ఉండదు.'

252. శరీరములో పంచభూతముల కార్యము.

వ్యాసు డిలా చెప్తున్నాడు. 'ధర్మార్థాలను అనుష్ఠించి, ద్వంద్వాలను సహించి మోక్షజిజ్ఞాసతో దరిచేరిన శ్రద్ధాళువైన శిష్యునకు గుణవంతుడైన వక్త ముందుగా మహత్త్వపూర్ణమైన అధ్యాత్మశాస్త్రాన్ని వినిపించాలి. ఆకాశం, గాలి, తేజస్సు, నీరు, పృథ్వి - ఈ పంచభూతాలు, భావపదార్థాలయిన గుణ, కర్మ, సామాన్య, విశేష, సమవాయాలు, అభావం, కాలం - ఇవన్నీ పాంచభౌతిక దేహధారు లందరిలో ఉంటాయి. ఆకాశం అవకాశ స్వరూపం. ఆకాశమయమైన ఇంద్రియం చెవి. దానిగుణం శబ్దం. శరీర శాస్త్రవిధాన వేత్త దీనిని గ్రహించాలి. కదలటం వాయుధర్మం. ప్రాణం, అపానం వాయుమయాలు. స్పర్శేంద్రియం (చర్మం), స్పర్శగుణం కూడా వాయుమయాలని గ్రహించాలి. తాపం, పాకం, ప్రకాశం, నేత్రం - ఇవన్నీ తేజస్సు కార్యాలు. శ్యామం, తామ్రం, గౌరం మొదలయిన రంగులన్నీ రూపగుణాలని గ్రహించాలి. కుళ్ళజేయుట, సూక్ష్మత, స్నిగ్ధత - ఇవి జలధర్మాలు. రక్తం. మజ్జ, ఇతర స్నిగ్ధ పదార్థాలు జలాత్మకాలు. రసనేంద్రియం, జిహ్వ, రసం - ఇవి జలగుణాలు. శరీరంలోని సంఘాతం పృథివీకార్యం. ఎముకలు, దంతాలు, గోళ్ళు - ఇవి పృథివి.

గడ్డం, మీసం, వెంట్రుకలు, నాడులు, ప్రేగులు, చర్మం - ఇవి కూడా పృథివి నుండి ఏర్పడినవే. నాసిక అని పేరుబడ్డ ఘ్రాణేంద్రియం కూడా పృథివి అంశం. గంధ మనబడే గుణం కూడా పార్థివలక్షణమే. ఉత్తరోత్తరభూతాలలో పూర్వపూర్వ భూతాల గుణాలు ఉంటాయి. భావన, అజ్ఞానం, కర్మ - ఇవి మూడు పంచభూత సముదాయం యొక్క సంతతి. వీటినే అవిద్య, కామం, కర్మ అని కూడా అంటారు. ఇవి ఎనిమిది తత్త్వాలు. మనస్సు తొమ్మిదవ తత్త్వం. బుద్ధి పదవతత్త్వం. అవినాశి అయిన ఆత్మ పదకొండవ తత్త్వం. అదే సర్వమూ, అదే శ్రేష్ఠమూ. బుద్ధి నిశ్చయాత్మకం. మనస్సు సంశయాత్మకం. కర్మవేత్త జడుడయ్యే అవకాశం లేదు. ఈ అనుమాన ప్రమాణంతోనే క్షేత్రజ్ఞుని - జీవాత్మనుగా తెలిసి కోవాలి. ఈ సమస్త విశ్వాన్నీ కాలాత్మకమయిన భావసంపన్నంగా చూడగలవాడు పుణ్యకర్మలు చేస్తాడు. మోహంలో పడడు.'

253. యోగ మార్గమున పరమాత్మ సాక్షాత్కారము.

వ్యాసు డిలా అన్నాడు. 'యోగశాస్త్ర మెరిగినవాడు శాస్త్రోక్తకర్మల ద్వారా స్థూల శరీరంనుండి బయటపడి సూక్ష్మస్వరూపు డైన జీవాత్మను చూడగలడు. సూర్యకిరణాలు కలసియే కదులుతుంటాయి. ఒక్కటిగానే కనిపిస్తుంటాయి. అలాగే అలౌకికుడైన జీవాత్మ

స్థూలశరీరంనుండి బయటపడి, అన్నిలోకాలలోనూ తిరగగలడు. విభిన్న జలాశయాల్లో సూర్యకిరణాలు వేరువేరుగా కనిపించినట్లు సజీవ శరీరాలన్నింటిలోనూ సూక్ష్మరూపంగా జీవుడు వేరువేరుగా కనిపిస్తాడు. యోగి వాటిని చూడగలడు. శరీరతత్త్వ యోగి, జితేంద్రియులయిన యోగులు స్థూలశరీరం నుండి బయటపడి సూక్ష్మలింగ శరీరాలతో కూడిన జీవులను ఆత్మద్వారా చూడగలుగుతారు. రజోగుణ జనితాలయిన కామాదులను యోగబలంతో పరిత్యజించి ప్రకృతి తాదాత్మ్యభావం నుండి విముక్తులై, యోగపరాయణులైన యోగుల జీవాత్మ పగలైనా, రేయి అయినా, నిదురిస్తున్నా, మేల్కొన్నా నిరంతరమూ వారి అదుపులోనే ఉంటుంది. నిత్య స్వరూపుడైన ఆ జీవుడు ఎప్పుడూ ఏడు సూక్ష్మ గుణాలతో (మహత్తత్త్వం, అహంకారం, పంచతన్మాత్రలు) కూడి, అజరామరులైన దేవతలవలె ఎప్పుడూ తిరుగుతుంటాడు. జీవాత్మ మనస్సుకు, బుద్ధికి లొంగినపుడు స్వపరశరీర తత్త్వ మెరిగిన మనుష్యుడు స్వప్నదశలో కూడా సూక్ష్మశరీరంతో సుఖదుఃఖాలను అనుభవిస్తుంటాడు. స్వప్నంలో కూడా దుఃఖాన్ని పొందుతాడు. స్వప్నంలో కూడా సుఖాన్ని పొందుతాడు. ఆ కలలో కూడా క్రోధలోభాలకు లోనై కష్టాలలో పడతాడు. కలలో కూడా మహాధనాన్ని పొంది ప్రీతినందుతాడు. అక్కడ కూడా పుణ్యకార్యాలు చేస్తాడు. జాగ్రదవస్థలో వలె స్వప్నావస్థలో కూడా సర్వవస్తువులను చూస్తాడు. **గర్భభావాన్ని పొందిన జీవుడు పదివేలలు తల్లి గర్భంలో నివసించినా, జఠరాగ్నిచే తపింప జేయబడుతున్నా అన్నంలాగా జీర్ణమై పోవటం లేదు. ఎంత ఆశ్చర్యం ?** జీవాత్మ పరమాత్మ అంశయే. దేహధారులు హృదయాలలో ప్రకాశిస్తుంటారు. అయినా రజస్తమోగుణాలచే బాధింపబడినవాడు తనలోనే ఉన్న ఆ జీవుని చూడలేడు, తెలియలేడు. శరీరాలు మూడు రకాలు. జడమైన స్థూలశరీరం, అమూర్తమైన సూక్ష్మశరీరం. వజ్రతుల్యమైన కారణ శరీరం. ఆత్మతత్త్వ మెరుగదలచిన యోగులు యోగశాస్త్ర పరాయణులై వాటి నధిగమించగలరు. సంన్యాసాశ్రమ ధర్మాలు రకరకాలుగా చెప్పబడ్డాయి. వాటిలో సమాధి పేర నేను నీకు చెప్పిన దానిని శాండిల్యుడు 'శమం' అన్నాడు. సూక్ష్మతత్త్వాలను ఏడింటిని తెలిసికొని, షడంగ యుక్తుడైన మహేశ్వరునకు సంబంధించిన జ్ఞానాన్ని పొంది, త్రిగుణాత్మకమైన ప్రకృతి పరిణామమే ఈ జగత్తు అని గ్రహించినవాడు పరబ్రహ్మ సాక్షాత్కారాన్ని పొందగలడు.*

---

* *సర్వజ్ఞత్వం, తృప్తి, అనాదిజ్ఞానం, స్వాతంత్ర్యం, లోపించని దృష్టి, అనంతశక్తి - ఇవి మహేశ్వరుని షడంగాలు (వాయుపురాణం)*

254. ముక్తిప్రాప్త్యుపాయము.

వ్యాసు డిలా చెప్తున్నాడు. 'మనుష్యుల హృదయాలలో మోహబీజం నుండి పుట్టిన కామవృక్ష మున్నది. క్రోధం, మానం దాని కాండం. కర్మేచ్ఛ కడవ. అజ్ఞానం దాని మూలం. ఏమరు పాటు జలం. అసూయ దాని ఆకులు. గతజన్మలో చేసినపాపం దాని చేవ. శోకం దాని కొమ్మలు. సమ్మోహం, చింత దానిరెమ్మలు. భయం దాని అంకురం. మోహాన్ని కల్గించే తృష్ణాలతలు దానిని చుట్టిముట్టి ఉంటాయి. లోభులు ఇనుప గొలుసులువంటి వాసనా బంధనాలలో చిక్కుకొని, పండ్ల నిచ్చే ఆ చెట్టును నాలుగువైపులా చుట్టి కూర్చుంటారు. ఆ పండ్లను పొందాలని ఆశపడుతుంటారు. ఆ పాశాలను వశం చేసికొని, ఆ చెట్టును పెకలించగలిగిన వాడు జరామృత్యువులవలన కలిగే రెండు దుఃఖాలను దాటి పోగలడు. కానీ మూర్ఖుడు పండ్లమీది ఆశతో ఎప్పుడూ దానిని ఎక్కుతుంటాడు. విషగుళిక రోగిని చంపినట్లు ఆ చెట్టే ఆ మూర్ఖుని చంపివేస్తుంది. ఆ కామవృక్షపు కొమ్మలు చాలా దూరం వ్యాపించి ఉంటాయి. పండితుడు జ్ఞానయోగ ప్రసాదం వలన సమత అనే ఉత్తమ ఖడ్గంతో శక్తినంతా వాడి, ఆ చెట్టును మొదలంటా నరుకుతాడు. ఈ రీతిగా ఒంటరినైనా కామాన్ని మరలించే ఉపాయాన్ని, కామశాస్త్రం కేవలం బంధనమనే అంశాన్నీ గ్రహించినవాడు దుఃఖాలను దాటిపోతాడు.

శరీరాన్ని పుర మంటారు. బుద్ధి దానికి రాణి. నిశ్చయాత్మక మయిన ఆ బుద్ధి అనే రాణికి ఆర్థచింతనలో సహకరించే మంత్రి మనస్సు. ఇంద్రియాలు మన స్సనే మంత్రి అధీనంలో నున్నపౌరులు. ఆ పౌరులకై మనస్సు గొప్పగొప్ప పనులు చేయవలసివస్తుంది. వాటిలో దారుణమైన దోషాలు రెండు. అవి తమస్సు, రజస్సు. పురేశ్వరు లయిన మనస్సు, బుద్ధి, జీవులతో కలసి పౌరు లయిన ఇంద్రియాలు విషయాలను అనుభవిస్తాయి. రజస్తమో గుణాలు నిషిద్ధమార్గం ద్వారా ఆ విషయ సుఖాలను ఆశ్రయిస్తాయి. బుద్ధి తిరుగులేని దయినా మనస్సాహచర్యంవలన మనస్సుతో సమాన మవుతుంది. ఇంద్రియ రూపపౌరులు కూడా మనస్సుకు భయపడి, మనస్సువలె చంచలు లవుతారు. బుద్ధి కూడా ఆ అనర్థాన్నే నిశ్చయిస్తుంది. దానితో ఆ అనర్థం స్థిరంగా నిలుస్తుంది. బుద్ధి అవలంబించిన విషయాన్నే మనస్సు కూడా ఆశ్రయిస్తుంది. బుద్ధితో మనస్సు వేరుపడినప్పుడు అది ఒంటరిగా ఉంటుంది. అప్పుడు వివేకశూన్య మయిన మనస్సును రజోగుణం చుట్టుముడుతుంది. ఆ మనస్సు రజోగుణంతో సఖ్యతను ఏర్పరచుకొంటుంది. ఆ పై మనస్సు ఇంద్రియా లనే పురజనులను రజోగుణం - కామం - చేతిలో పెడుతుంది.'

255. పంచభూత - మనోబుద్ధి గుణవర్ణన.

భీష్ముడిలా చెప్తున్నాడు. 'అనఘా ! పుత్రా ! యుధిష్ఠిరా ! ద్వైపాయనుడైన వ్యాస మహర్షి వర్ణించిన పంచమహాభూతనిరూపణను మరలా చెప్తున్నాను. సంపూర్ణ స్పృహతో విను. పుత్రా ! పొగగప్పిన నిప్పులా ఉన్న శుకునకు ప్రజ్వలించే అగ్నిలా ఉన్న వ్యాసభగవానుడు దీనిని చెప్పాడు. దానిని నీకు మరలా చెప్తున్నాను. దర్శన శాస్త్రాన్ని విను. స్థిరత్వం, బరువు, కఠినత, గింజలు మొలిపించే శక్తి, గంధం, విశాలత్వం, శక్తి, సంఘాతం, స్థాపన, ధారణశక్తి - ఇవి పృథివీ గుణాలు. చల్లదనం, రుచి, తేమ, ద్రవత్వం, స్నేహం, సౌమ్యత, నాలుక, ప్రవహించుట, గడ్డకట్టుట, మొలిపించుట (నాన్చుట) - ఇవి జలలక్షణాలు. ఎగయటం, మండటం, తపింపజేయటం, పక్వంచేయటం, ప్రకాశింపజేయటం, శోకం, రాగం, తేలికదనం, తీక్ష్ణత, ఎప్పుడూ ఊర్ధ్వ జ్వలనం - ఇవి తేజోలక్షణాలు. అనియతస్పర్శ, వాగింద్రియం, స్వాతంత్ర్యం, బలం, వేగం, ఉత్క్షేపణాది కర్మ, క్రియా శక్తి, ప్రాణం, జననమరణాలు - ఇవి వాయులక్షణాలు. శబ్దం, వ్యాపకత్వం, రంధ్రాలు, ఆశ్రయ రాహిత్యం, ఆధార రాహిత్యం, అవ్యక్తత్వం, నిర్వికారిత్వం, దెబ్బతినకపోవటం, శ్రవణేంద్రియ కారణత్వం, వికృతం - ఇవి ఆకాశలక్షణాలు. ఈ రీతిగా పంచమహాభూత లక్షణాలు ఏబది. **ధైర్యం, ఉపపత్తి, వ్యక్తి, విసర్గం, కల్పన, క్షమ, సత్తు, అసత్తు (శుభాశుభ సంకల్పాలు), చాంచల్యం - ఈ తొమ్మిది మనోలక్షణాలు. ఇష్టానిష్ట వృత్తినాశం, విచారం, సమాధానం, సంశయం, నిశ్చయం - ఈ అయిదూ బుద్ధిలక్షణాలు.**

యుధిష్ఠిరుడిలా అడిగాడు. 'పితామహా ! బుద్ధికి అయిదుగుణాలే ఎందుకున్నాయి? పంచేంద్రియాలు భూతగుణా లెలా అవుతాయి ? ఈ సూక్ష్మజ్ఞానాన్ని నాకు తెలియజేయి.' భీష్ముడిలా చెప్తున్నాడు. 'పుత్రా ! యుధిష్ఠిరా ! బుద్ధికి అరవై గుణాలున్నాయని మహర్షు లన్నారు. ఏబది మహాభూత గుణాలు, అయిదు బుద్ధిగుణాలు కలిసి ఏబది అయిదు. పంచమహాభూతాలను కూడా బుద్ధిగుణాలుగా భావిస్తే మొత్తం అరవై. పంచమహాభూతాలు, వాటి విభూతులు కూడా అక్షర పరమాత్మ సృష్టియే. కానీ పరివర్తన స్వభావం వలన తత్త్వజ్ఞులు వాటిని నిత్యాలుగా పరిగణించరు. వత్సా ! యుధిష్ఠిరా ! ఇతరప్రవక్తలు జగదుత్పత్తి గురించి చెప్పినవన్నీ వేదవిరుద్ధాలు. చర్చకు నిలవనివి. ఇప్పుడు నీవు పరమాత్మ యొక్క యథార్థతత్త్వాన్ని విని, పరమేశ్వర ప్రసాదం వలన శాంతబుద్ధివి కమ్ము.'

256. అకంపన నారద సంవాదము.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'అనేకనరపాలురు భూతలంలో సేనలమధ్య చచ్చిపడి ఉన్నారు. చూడు ! వీరంతా బలసంపన్నులైనా పేరులేకుండా పడిఉన్నారు. ఒక్కొక్కరూ భీమబలులు. పదివేల ఏనుగుల బలం కలవారు. వీరంతా తమతో సమానంగా తేజస్సు, బలం గల రాజులచేత చంపబడ్డారు. ఆ రాజులందరూ పరాక్రమ సంపన్నులు, తేజోబల సమన్వితులు, అటువంటి వారిని యుద్ధంలో చంపగలగటమా? నేనలా భావించలేకపోతున్నాను. మహాప్రాజ్ఞ లయిన ఆ రాజులందరూ ఇదిగో ఇప్పుడే ప్రాణాలు కోల్పోయి, పండుకొనిఉన్నారు. ప్రాణాలు పోగానే 'చచ్చిపోయా'రని అంటుంటాం. భీమవిక్రములయిన ఈ రాజు లందరూ మృత్యువు వాతబడ్డారు. వీరిని మృతులని ఎందుకంటున్నాం ? నాకది సందేహం. అసలు ఎవరు చనిపోతారు ? ఎలా చనిపోతారు? ప్రాణు లందరినీ మృత్యువు ఎందుకు అపహరిస్తుంది ? దేవసమానా ! నాకీ విషయం చెప్పు.' భీష్మ డిలా చెప్తున్నాడు. 'నాయనా ! తొల్లి కృతయుగంలో అకంపనుడు అనే రాజు ఉండేవాడు. యుద్ధంలో వాహనాన్ని కోల్పోయి, ఆయన శత్రువులకు చిక్కాడు. ఆయన కొడుకు హరి. బలంలో నారాయణుడంతటి వాడు. అతడు కూడా సేనలతో, సేవకులతో సహా యుద్ధంలో చనిపోయాడు. శత్రువులకు చిక్కిన అకంపనుడు పుత్రశోక సమన్వితుడై, శాంతికై ఆరాటపడుతుండగా ఆకస్మికంగా భూలోక సంచారం చేస్తున్న నారదుడు కనిపించాడు. ఆ రాజు యుద్ధంలో తనకుమారుడు మరణించటం, తాను శత్రువులకు చిక్కటం – జరిగినది జరిగినట్టు నారదునకు చెప్పాడు. అప్పుడు ఆయన మాట విని, తపోధనుడైన నారదుడు పుత్రశోకాన్ని పోగొట్టడానికి ఈ కథ చెప్పాడు.

నారదు డిలా చెప్తున్నాడు. రాజా ! ఈ రోజు ఒకపెద్ద కథ చెపుతా విను. జరిగినది జరిగినట్లుగా నేను విన్నది నీకు వినిపిస్తా. సృష్టికాలంలో మహాతేజస్వి అయిన బ్రహ్మ చాలా మంది ప్రజలను సృష్టించాడు. జన సంఖ్య బాగా పెరిగింది. అంత జనాభాను బ్రహ్మ సహించలేకపోయాడు. ఆ సమయంలో ప్రాణిరహితమైన స్థలమంటూ కొంచెం కూడా లేకుండా పోయింది. మూడులోకాలూ స్తంభించాయి. గాలి పీల్చుకోవటం కూడా కష్టమైంది. అప్పుడు బ్రహ్మకు సంహారాన్ని గురించి ఆలోచన వచ్చింది. కానీ ఎంత ఆలోచించినా ప్రజాసంహారానికై యుక్తి సహమైన కారణం స్ఫురించలేదు. మహారాజా ! ఆయనకు కలిగిన కోపంతో ఆకాశం నుండి నిప్పు పైకి లేచింది. దానితో పితామహుడు సర్వదిక్కులను దహించాడు. బ్రహ్మకోపం నుండి పుట్టిన ఆ అగ్ని అప్పుడు స్వర్గాన్ని, భూమిని, ఆకాశాన్ని, చరాచర ప్రపంచమంతటినీ దహించింది. ప్రపితామహుడైన బ్రహ్మ

కోపించగా ఆ కోపతీవ్రతతో చరాచర ప్రాణులన్నీ మండిపోసాగాయి. అప్పుడు యాగజటుడు, వేదాలకు యాగాలకు పరిపాలకుడు, స్థాణువు, శత్రుసంహారకుడు అయిన మహేశ్వరుడు బ్రహ్మను శరణుజొచ్చాడు. ప్రజలహితాన్ని కోరి, స్థాణువు బ్రహ్మను శరణుకోరగా ఆ పితామహుడు ప్రజ్వలిస్తూనే శివునితో ఇలా అన్నాడు. శంభూ ! నీవు వరాల పొందదగినవాడవని నా అభిప్రాయం. చెప్పు. నీ కోసం ఏం చేయాలి ? నీ మనస్సులోని కోరిక ఏమిటో చెప్పు. తీరుస్తాను.

257. బ్రహ్మ రోషాగ్నిని ఉపసంహరించుట - మృత్యూత్పత్తి.

మహేశ్వరు డిలా అడిగాడు. 'ప్రభూ ! పితామహా ! ప్రజాసంరక్షణకై నిన్ను ప్రార్థించటానికే వచ్చాను. ఒక మాట విను. ఈ ప్రజలను నీవే సృష్టించావు. వారిపై కోపించదగదు. జగత్ప్రభూ ! దేవా ! నీ క్రోధాగ్నివలన ప్రజలందరూ తగలబడుతున్నారు. వారిని చూస్తే నాకు జాలి కలుగుతోంది. వారిపై కోపగింపదగదు.' ప్రజాపతి ఇలా అన్నాడు. 'నేను కోపపడటం లేదు. ప్రజ లుండకూడ దన్నది నా అభిమతం కాదు. కానీ భూభారం తగ్గాలంటే ప్రజాసంహారం అవసరమవుతోంది. మహాదేవా ! ఈ భూదేవి భారంతో బాధపడుతూ నన్ను ఎప్పటినుండియో సంహారం కోసం ఒత్తిడిచేస్తోంది. ఇది భారం ఎక్కువై నీటిలో మునిగిపోయేటట్టుంది. నేను బుద్ధితో ఎంత ఆలోచించినా పెరుగుతున్న ఈ ప్రజలను సంహరించే ఉపాయం తోచలేదు. దానితో కోపం వచ్చింది.' స్థాణువు ఇలా అన్నాడు. 'విబుధేశ్వరా ! సంహారంకోసం కోపించవద్దు. ప్రసన్నుడవుకమ్ము. స్థావర జంగమ ప్రాణులేవీ నశించకూడదు. ఈ జలాశయాలన్నీ, ఈ తృణాలు, ఈ గట్లు, నాల్గువిధాలయిన ప్రాణులు, స్థావర జంగమాలు, సర్వజగత్తు తగలబడుతోంది. బూడిదవుతోంది. ప్రళయం సంభవిస్తోంది. స్వామీ ! ప్రసన్నుడవు కమ్ము ! ఇదే నేను కోరే వరం. నశించిన ఈ ప్రజలు ఏరీతిగానూ తిరిగిరాలేరు. కాబట్టి నీ తేజస్సుతోనే ఈ క్రోధాగ్నిని నివర్తింపజేయి. పితామహా ! ప్రాణిహితం కోరి భూభారాన్ని తగ్గించటానికి మరేదైనా ఉపాయాన్ని ఆలోచించు. ఈ ప్రాణులన్నీ ఒక్కసారే తగలబడకూడదు. లోకేశ్వరేశ్వరా ! ప్రజాసంతతి విచ్ఛిన్నమయితే సమస్త ప్రజలు అసలు లేకుండా పోతారు. అలా జరగరాదు. నన్ను దేవతలకధిపతిగా నియమించావు కాబట్టి ఇలా కోరుతున్నాను. జగన్నాథా ! మహాదేవా ! ఈ స్థావరజంగమ ప్రపంచమంతా నీ సృష్టియే. నిన్ను ప్రార్థిస్తూ అడుగుతున్నాను. ఈ ప్రజలంతా మరణించినా మరలా జన్మించాలి.'

నారదు డిలా అన్నాడు. 'మహేశ్వరుని ప్రార్థన విని బ్రహ్మ మనస్సును,

వాక్కును నియంత్రించుకొని, తన కోపాన్ని మరలా తనలోనే దిగమ్రింగుకొన్నాడు. ఆ తరువాత లోకపూజితుడు, సమర్థుడు అయిన ఆ బ్రహ్మ కోపాన్ని ఉపసంహరించుకొని మరల జననమరణ వ్యవస్థను కల్పించాడు. తన కోపాగ్ని ఉపసంహరించుకొంటున్న సమయంలో మహోత్కృష్టమైన ఆ బ్రహ్మ సకలేంద్రియాలనుండి ఒక స్త్రీమూర్తి ఉద్భవించింది. ఆమె నల్లని, ఎర్రని వస్త్రాలను ధరించిఉన్నది. కళ్ళ పై భాగం, లోభాగం కూడా ఎర్రగా ఉన్నాయి. దివ్య కుండలాలను, దివ్యాభరణాలనూ ఆమె అలంకరించుకొని ఉన్నది. ఆమె బ్రహ్మ ఇంద్రియాలనుండి వెలువడి, దక్షిణదిక్కును ఆశ్రయించింది. బ్రహ్మ, మహేశ్వరులిరువురూ ఆ కన్యను చూశారు. మహారాజా ! లోకాలకు ఆదికారణ మయిన బ్రహ్మ 'మృత్యూ' అని ఆమెను సంబోధించి, పిలిచి "ఈ ప్రజలను తగిన వేళలో నశింపజేస్తూ ఉండు" అని ఆదేశించాడు. "నేను ప్రజోపసంహార భావనతో కోపంతో నిండిపోయి, నీగురించి ఆలోచించాను. కాబట్టి నీవు పండితులను, పామరులను అందరినీ సంహరించు. కామినీ ! నా ఆదేశాన్ని పాటిస్తూ ప్రజలనందరినీ ఏ తేడా లేకుండా సంహరించు. నీకు పరమశ్రేయస్సు కలుగుతుంది." బ్రహ్మ ఇలా ఆదేశించగానే కమలమాలను అలంకరించుకొని ఉన్న ఆ బాల - ఆ మృత్యుదేవి కన్నీరు కార్చుతూ ఎంతో ఆలోచించింది. అప్పుడు బ్రహ్మ మానవహితాన్ని కోరి ఆ మృత్యుదేవత కన్నీటిని రెండు చేతులతో పట్టుకొన్నాడు. మరల ఆమెను ఇలా ప్రార్థించాడు.'

258. మృత్యువు ప్రాణిసంహార కార్యమును స్వీకరించుట.

నారదు డిలా అన్నాడు. 'ఆపై ఆ విశాలాక్షి తనంత తానుగా దుఃఖాన్ని దిగమ్రింగుకొని, లతలా వంగి చేతులు జోడించి, బ్రహ్మతో ఇలా అన్నది. 'వాగ్మిశ్రేష్ఠా ! నావంటి స్త్రీ నెందుకు సృష్టించావు ? నా వంటి స్త్రీ సమస్తప్రాణులకు భయాన్ని కలిగిస్తూ ఇటువంటి రౌద్రకర్మను ఎలా చేయగలదు ? నాకు అధర్మమంటే భయం కలుగుతోంది. నాకు ధర్మబద్ధంగా పనిచేయగల ఆదేశ మివ్వు ? భయభీతనయిన నన్ను చూడు. శుభకరమయిన చూపుతో నన్ను గమనించు. **ప్రాణిపతీ ! నిరపరాధు లయిన బాలురను, వృద్ధులను, యువకులను సంహరించను. నీకు వమస్సు. నాపై ప్రసన్నుడవు కావలసినది.** ప్రియపుత్రులను, మిత్రులను, సోదరులను, తల్లులను, తండ్రులను నేను చంపుతుంటే వారిబంధువులు నా అనిష్టాన్ని తలపోస్తారు. వారంటే భయంగా ఉంది. దీనులయిన వారు కార్చిన కన్నీరు వారిని తడిపి, నన్ను సంవత్సరాల పర్యంతం దహిస్తుంది. వారంటే నాకు చాలా భయం కలుగుతోంది. అందుకే నిన్ను శరణుకోరుతున్నాను.

వరదా ! దేవా ! పాపాత్ములు యమసదనంలోనికి నెట్టబడుతున్నారు. నిన్ను ప్రతిమలాడుతున్నాను. నన్ను అనుగ్రహించు. పితామహా ! మహేశ్వరా ! నా కోరిక నొకదానిని తీర్చాలి. నీ అనుగ్రహంకోసం నేను తపస్సు చేయాలనుకొంటున్నాను."

పితామహు డిలా అన్నాడు. 'మృత్యూ ! ప్రజాసంహార కారణంగానే నేను నిన్ను సృష్టించాను. వెళ్ళు. ప్రజల నందరినీ సంహరించు. దుఃఖించవద్దు. ఇది తప్పక ఇలాగే జరగాలి. మరొకరీతిగా జరిగే అవకాశం లేదు. నేను చెప్పినది యథాతథంగా పాటించు. ఇది నీకు పాపాన్ని కలిగించదు.' బ్రహ్మ అలా అనగానే మృత్యువు మరేమీ మాటాడలేదు. చేతులు జోడించి పితామహున కెదురుగా నిలబడింది. బ్రహ్మ ఎన్నిసార్లు చెప్పినా ఆ భామిని ప్రాణాలు పోయినట్లు మౌనంగా నిలిచింది. అప్పుడు దేవదేవుడు, ఈశ్వరేశ్వరుడు, లోకనాథుడు అయిన బ్రహ్మ చాలా ప్రసన్నుడై, చిరునవ్వు నవ్వుతూ లోకా లన్నింటివైపు చూడసాగాడు. అపరాజితుడైన ఆ పితామహుని కోపం తగ్గిపోయిన తర్వాత ఆ మృత్యుకుమారి అక్కడ నుండి వెళ్ళిపోయిందని మేము విన్నాం. రాజేంద్రా ! అప్పుడు ప్రజాసంహరణ విషయంలో ఏ ప్రతిజ్ఞ చేయకుండానే ఆ మృత్యుకన్య అక్కడ నుండి బయలుదేరి, వేగంగా ధేనుకాశ్రమానికి వెళ్ళింది. ఆ దేవి అక్కడ దుష్కరమయిన ఘోరతపస్సు చేసింది. పదిహేను పద్మాల* సంవత్సరాలు ఒంటికాలిపై నిలిచి తపస్సు చేసింది. ఆ రీతిగా అక్కడ పరమదుష్కర మయిన తపస్సు చేస్తున్న ఆమెతో మహాతేజస్వి అయిన బ్రహ్మ మరలా ఇలా అన్నారు. 'మృత్యూ ! నా మాటను పాటించు !' వత్సా మానదా ! బ్రహ్మ అలా చెప్పినా కూడా వినకుండా మృత్యువు మరొక ఇరవై పద్మాల సంవత్సరాలవరకు అలా ఒంటికాలిపై తపస్సు చేసింది. నరశ్రేష్ఠా ! మరల ఆమె పదివేల పద్మాల సంవత్సరాల కాలం వరకు మృగాలతో పాటు సంచరించింది. ఆపై ఇరవైవేల సంవత్సరాలు గాలి భోంచేస్తూ గడిపింది. ఆ తరువాత పరమోత్తమమైన మౌనవ్రతాన్ని ఆశ్రయించింది. పార్థివా ! ఎనిమిది వేల సంవత్సరాలు నీటిలో నిలిచి తపస్సు చేసింది. ఆ తరువాత అది కౌశికీనదీతీరానికి వెళ్ళింది. అక్కడ గాలిని, నీటిని ఆహారంగా స్వీకరిస్తూ నియమపూర్వకంగా మరల తపస్సు చేసింది. ఆ తరువాత ఆ మహాభాగ గంగా తీరానికీ, మేరుగిరి మీదకూ వెళ్ళింది. అక్కడ ప్రజాహితాన్ని కోరుతూ కట్టెలా నిశ్చేష్టంగా నిలిచింది. ఆ తరువాత తొలుత దేవతలు యాగాలు చేసిన హిమాలయ పర్వత శిఖరంపై ఆ మృత్యుకన్య పదివేల కోట్ల సంవత్సరాల పర్యంతం బొటనవ్రేలిపై నిలిచి, తపస్సు చేసింది.

* *విగ్ర పద్మం = 100 కోట్ల సంవత్సరాలు*

ఈ రీతిగా ప్రయత్నించి బ్రహ్మను సంతోషపెట్టింది. అప్పుడు లోకాల ఉత్పత్తి విలయాలకు కారణ భూతు డైన బ్రహ్మ ఆమెతో "కుమారీ ! ఏమిటీ పని ? నేను చెప్పినట్టు చేయి" అన్నాడు. అప్పుడు మృత్యువు మరలా పూజ్యపితామహునితో ఇలా అన్నది. 'దేవా ! నేను ప్రజలను నశింపజేయలేను. నీ అనుగ్రహాన్ని కోరుతున్నాను.' అధర్మానికి భయపడి మరల యాచిస్తున్న ఆ మృత్యువు మాటలను నిరోధించి, బ్రహ్మదేవుడు ఇలా అన్నాడు.

'మృత్యు కుమారీ ! నీవు చేసేది అధర్మంకాదు. కళ్యాణీ! ఈ ప్రజలను సంహరించు. నేను చెప్పిన మాట ఏదీ అసత్యం కాదు. సనాతన ధర్మం ఇక్కడే నీలో ప్రవేశిస్తుంది. నేను, దేవతలు కూడా నీ హితం మీదనే ఎప్పుడూ ఆసక్తి కలిగి ఉంటాం. **ఇదిగో ! నీ మనస్సుకు నచ్చిన మరొక వరాన్ని కూడా నీ కిస్తున్నాను. రోగపీడితు లయిన ప్రజలు నిన్ను దోషదృష్టితో చూడరు. నీవు పురుషులలో పురుషుడవై, స్త్రీలలో స్త్రీవయి, నపుంసకులలో నపుంసక మయి నిలుస్తావు.**' మహారాజా ! బ్రహ్మ అలా అనగానే చేతులు జోడించి మృత్యువు మహాత్ముడైన పితామహునితో "నేను ప్రాణులను సంహరించలేను" అని మరలా అన్నది. అప్పుడు బ్రహ్మ మృత్యువుతో ఇలా అన్నాడు. 'మృత్యువా! నీవు మానవులను సంహరించు. నీకు పాపం కలుగదు. కళ్యాణి ! ఆ మేరకు నేను నీకై ధ్యానిస్తాను. **మృత్యూ ! నీవు మొదటనే కన్నీరు కార్చటం చూశాను. వాటిని చేతులలోకి పట్టాను. అవే అవసరపడినపుడు ఘోరవ్యాధులుగా మారి మానవులను కాలానికి గురిచేస్తాయి. సమస్త ప్రాణుల అంత్యకాలంలో నీవు కామ క్రోధాలను వారిలో ప్రవేశపెట్టు. ఈ రీతిగా అప్రమేయమైన ధర్మం నిన్ను చేరుతుంది. నీవు సమవర్తివి కాబట్టి నిన్ను పాప మంటదు.** ఈ రీతిగా నీవు ధర్మాన్ని పాలిస్తావు. నిన్ను నీవు పాపంలోనికి త్రోసికొనవు. కాబట్టి నీకు లభించిన ఈ అధికారాన్ని ఇష్టపడు. కామాన్ని ఈ పనిలో తోడుతీసికొని ప్రాణులను సంహరించు.'

అప్పుడు మృత్యుకాంత శాపభయంతో "అలాగే" అని బ్రహ్మతో పలికింది. ఆ మృత్యువే ప్రాణుల అవసానదశలో కామక్రోధాలను ప్రేరేపించి, వారిని మోహంలో పడవేసి చంపుతుంది. మృత్యువు కార్చిన కన్నీరే జ్వరాదిరోగా లయ్యాయి. అవి మానవుల శరీరాలను రోగగ్రస్తం చేస్తున్నాయి. అంత్యకాలంలో అవి మానవులను సమీపిస్తాయి. రాజా ! నీ కొడుకుకోసం నీవు శోకించవద్దు. బుద్ధితో ఈ విషయాన్ని గ్రహించు. **రాజసింహా ! ప్రాణుల ఇంద్రియాలు సుషుప్తావస్థలో నిష్క్రియాలై లీనమై మరల మెలకువలో చైతన్యాన్ని పొందినట్లు ప్రాణులు మరణానంతరం కర్మానుసారంగా**

స్వర్గానికో, వరకానికో పోయి కర్మ క్షీణించగానే మరల జన్మిస్తారు. భయంకర శబ్దం కలిగి, భయంకరమై, మహాబలిష్ఠమైన ప్రాణవాయువు సమస్త ప్రాణులకూ ప్రాణం. దేహం నశించినప్పుడు అది అనేక ప్రకారాలుగా ప్రసరిస్తుంది. కాబట్టి శరీరంలోపల దేవాధిదైవ మయిన గాలియే శ్రేష్ఠం. రాజసింహా ! పుణ్యకర్మ క్షీణిస్తే దేవతలందరూ మనుష్యులే. పుణ్యకర్మ వికసిస్తే మరణానంతరం మనుష్యులందరూ దేవతలే. కాబట్టి నీవు కొడుకును గురించి శోకించవద్దు. అతడు స్వర్గాన్ని పొంది ఆనందంగా ఉంటాడు. ఈ రీతిగా బ్రహ్మ సృష్టించిన మృత్యువు కాలం సమీపించినప్పుడు అందరినీ ఉన్నవారినున్నట్లుగా సంహరిస్తుంది. ఆ వ్యాధుల రూపంలో ఉన్న ఆ కన్నీరు కూడా సమయమాసన్నమైనప్పుడు ప్రాణులను సంహరిస్తుంది.'

259. ధర్మా ధర్మ స్వరూపనిర్ణయము.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. పితామహా ! ఈ మానవులందరూ ధర్మవిషయంలో సంశయిస్తుంటారు. ధర్మమంటే ఏమిటో, అది ఎక్కడ నుండి పుడుతుందో నాకు చెప్పండి. పితామహా ! ధర్మం ఇహలోక ప్రయోజన కారియా ? పరలోకంలో కూడా ప్రయోజన కారియా ? లేక ఇహపర ప్రయోజన కారియా ? నాకు చెప్పండి.' భీష్ము డిలా చెప్తున్నాడు. వేదాలు, స్మృతులు, సదాచారం - ఇవి మూడూ ధర్మ లక్షణాలు. కొందరు పండితులు అర్థాన్ని కూడా నాలుగవ ధర్మ లక్షణంగా చెప్తుంటారు. శాస్త్రాలలో ధర్మానుకూల కార్యాలుగా చెప్పిన వాటిని పెద్ద, చిన్నా అందరూ ధర్మమనే భావిస్తారు. లోకయాత్రా నిర్వహణ కోసమే ధర్మనియమాలను ఏర్పరచారు. ధర్మానుసారంగా ప్రవర్తిస్తే ఇహపరలోకాలు - రెండింటి సుఖం దక్కుతుంది. పాపాత్ముడు ధర్మాన్ని సరిగా పాటించలేక పాపకర్మలలో పడి దుఃఖాన్ని అనుభవిస్తాడు. పాపాత్ములు కొందరు ఆపదలలో కష్టాల ననుభవించి కూడా పాపప్రవృత్తి నుండి బయటపడలేరు. ధర్మాత్ములు ఆపత్కాలంలో కూడా పాపాన్ని సమర్థించరు. ధర్మవిష్ఠ ఆచారం మీదనే. నీవు ఆ ఆచారాన్ని ఆశ్రయించి, ధర్మ స్వరూపాన్ని గ్రహించాలి.

ఒక దొంగ ధర్మకార్యాలు చేస్తూ పరులసొమ్ము నపహరిస్తాడు. అరాజకవ్యవస్థలలో పరాయిసొమ్ము నపహరించిన ఆ దొంగ సుఖంగానే జీవిస్తాడు. కానీ ఇతరులు తన ధనాన్ని అపహరించినప్పుడు ఆ దొంగ కూడా రక్షించే రాజు కావా లంటాడు. తమ సొమ్ముతో తృప్తిగా జీవించే వారి లాగా తాను కూడా ఆలోచిస్తూ

పరులసొమ్ము అపహరించటం పాప మంటాడు. పవిత్రాచరణం గలవాడు భయంలేకుండా, బెరుకులేకుండా రాజసన్నిధికి వెళ్ళగలడు. తన అంతరాత్మలో దుష్ప్రవృత్తి లేదు కాబట్టి నిరాఘాటంగా సంచరించగలడు. సత్యభాషణం శ్రేయస్కరం. సత్యాన్ని మించినది ఏదీ లేదు. సత్యమే అన్నింటినీ పట్టి నిలుపుతుంది. సత్యమే అన్నింటికీ ప్రతిష్ఠాస్థానం. క్రూర స్వభావంగల పాపాత్ములు కూడా ఇతరేతర విషయాలలో సత్యశపథం చేసియే ద్రోహాలనుండి, వివాదాలనుండి బయటపడతారు. సత్యాన్ని ఆశ్రయించియే తమతమ పనులలో ప్రవర్తిస్తారు. పాపాత్ములు కూడా పరస్పరం శపథాలను విడనాడితే నిస్సందేహంగా నశిస్తారు. పరులధనాన్ని అపహరించకూడదన్నది సనాతన ధర్మం. కొందరు బలవంతులు దుర్బలుల ప్రవృత్తిమార్గంగా ధర్మాన్ని భావిస్తారు. కానీ విధివశాన వారు కూడా దుర్బలు లయితే వారికి కూడా ధర్మమార్గమే రుచిస్తుంది.

లోకంలో ఎంత బలవంతు డయినా సుఖంగా ఉంటాడన్న నమ్మకం లేదు. కాబట్టి నీవు ఎప్పుడూ కుటిలకర్మలపై బుద్ధిని ప్రసరింపజేయదగదు. ఎవ్వరికీ కీడు చేయనివాడికి దుర్మార్గులవలన కానీ, దొంగలవలన కానీ, పాలకునివలన కానీ భయంలేదు. పవిత్రాచారం గలవాడు నిర్భయంగా జీవించగలడు. గ్రామంలోనికి ప్రవేశించిన జింకవలె దొంగ అందరికీ భయపడుతుంటాడు. తాను ఇతరుల విషయంలో పాపకర్మల నాచరించినట్లు అందరినీ అలాగే పాపాత్ములుగానే భావిస్తాడు. శుద్ధాచారం గలవాడు ఎప్పుడూ చింతకు లోనుకాడు. అంతటా నిర్భయంగా సంచరించగలడు. తనకు ఎవరో కీడు చేస్తారని కూడా ఇతరులను భావించడు. భూతహితాన్ని కోరేవారు "దానం చేయాలి" అనుకొంటూ దానాన్ని కూడా ధర్మంగా భావించారు. కానీ ధనవంతులు దానిని దరిద్రధర్మంగా భావిస్తారు. లోకంలో ఎంత ధనవంతు లయినా సుఖంగా ఉంటారన్న నమ్మకం లేదు. విధివశాన వారు దుఃస్థితికి లోనయితే వారుకూడా ధర్మాన్నే ఇష్టపడతారు. మనిషి తన విషయంలో ఇతరులు చేయకూడదని భావించిన పనిని ఇతరుల విషయంలో తాను కూడా చేయరాదు. తనకు అప్రియమైనది ఇతరులకు కూడా అప్రియమే కదా !*

---

* *విఱతె॥ దీనికి తిక్కన చేసిన అనువాదం తెలుగునాట బాగా ప్రసిద్ధి కెక్కింది. అది*
ఒరులేమేమి యొనర్చిన నరవర యప్రియము దనమనంబున కగుఁదా
నొరులకు నవిసేయకునికి పరాయణము పరమధర్మపథములకెల్లన్ (శాంతిపర్వం 51220)

ఎవడైనా తాను వ్యభిచరిస్తూ ఇతరులకు ఏమి చెప్పగలడు? కానీ వ్యభిచారం కారణంగా ఇతరులను తాను నిందించినప్పుడు ఇతరులు తననలాగే నిందిస్తే భరించలేడు అని నా నమ్మకం. తాను జీవించాలని కోరుకొనే వాడు ఇతరుల జీవితాలను భంగ పరచకూడదు గదా ! తాను తనకు కావాలని కోరుకొనే వాటిని ఇతరులు కూడా పొందాలని ఆశించాలి గదా ! **తన దగ్గర అవసరానికి మించి ఉంటే దానిని లేనివారికై వినియోగించాలి. అందుకోసమే బ్రహ్మ వడ్డీకి అప్పు ఇచ్చే ఏర్పాటు చేశాడు.** ఏ మార్గంలో దేవతలు నడుస్తారో అదే మార్గంలో మనుష్యులు కూడా నడవాలి. కనీసం ధనలాభ సమయంలో అయినా ధర్మబద్ధంగా ఉండటం మంచిది. **యుధిష్ఠిరా ! అందరితో ధర్మబద్ధంగా ప్రేమపూర్వకంగా ప్రవర్తించటమే ధర్మమని ధీమంతు లంటారు. దీనికి భిన్నమైనది అధర్మం. సంక్షేపంగా ధర్మాధర్మస్వరూపమిదే అని గ్రహించు.** తొలుత బ్రహ్మదేవుడు సత్పురుషులకై విధించిన ఉత్తమాచారమే లోకకళ్యాణ కారకం. దానిద్వారానే ధర్మసూక్ష్మతను, అర్థసూక్ష్మతను తెలుసుకోవాలి. కురుసత్తమా ! ఈ విధంగా నీకు ధర్మలక్షణాన్ని తెలిపాను. కాబట్టి నీవు ఎప్పుడూ కుటిలమార్గంపై నీ బుద్ధిని ప్రసరించనీయరాదు.

260. ధర్మప్రామాణికతపై సందేహము.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'ధర్మలక్షణాన్ని సూక్ష్మంగా, చక్కగా చెప్పావు. నాకు మరికొంత స్ఫురిస్తోంది. హేతుబద్ధంగా దాన్ని చెపుతాను. నా మనస్సులోనున్న ప్రశ్న లన్నింటికీ సమాధానాలు వచ్చాయి. మరొక విషయ మడుగుతున్నాను. తెలుసుకోవాలన్న కోరికతోనే కానీ కుతర్కంతో కాదు. భారతా ! ధర్మమే ప్రాణులను సృష్టిస్తుంది. జీవింపజేస్తుంది, తరింపజేస్తుంది కూడా. వేదపఠన మాత్రం చేత ధర్మాన్ని గ్రహించగలగటం అసాధ్యం. మంచిస్థితిలో ఉన్నవారి ధర్మం వేరే. ఆపదలలో నున్న వాడి ధర్మం వేరే. కేవలం వేదపాఠం చేత ఆపద్ధర్మాన్ని తెలియలేము. సత్పురుషుల ఆచారాన్ని ధర్మ మంటున్నావు. ధర్మాన్ని పాటించేవారిని సత్పురుషు లంటున్నావు. ఇది అన్యోన్యాశ్రయదోషం. కాబట్టి సాధ్యాసాధ్య నిర్ణయం కుదరదు. అందువలన సదాచారం ధర్మలక్షణ మనటం పొసగదు. ఎంతో మంది అజ్ఞానులు ధర్మంలా కనిపించే అధర్మాన్ని ఆచరిస్తూ కనిపిస్తారు. విశిష్టులు చాలామంది అధర్మంలా కనిపించే ధర్మాన్ని పాటిస్తూ కనిపిస్తారు. శాస్త్రకోవిదులు వేదాలే ధర్మానికి ప్రమాణ మన్నారు. కానీ వేదాలూ యుగయుగానికీ క్షీణిస్తాయని విన్నాను. ఆ దశలో ధర్మానికి సంబంధించిన వేదనిశ్చయాలు కూడా మారుతాయి గదా ! కృతయుగ

ధర్మాల దొకరీతి. త్రేతాయుగ ధర్మాల దొకపద్ధతి. ద్వాపరయుగ ధర్మాలదొక తీరు. కలియుగ ధర్మాల తీరే వేరు. బహుశః ప్రజలశక్తిని బట్టి వీటిని నియమించారేమో ! వేదవచనమే సత్యమనటం లోకరంజన కోసమేనేమో ! స్మృతులు కూడా వేదాలనుండియే ఉద్భవించి ప్రసారమవుతున్నాయి కదా ! వేదాలన్నీ ప్రమాణాలే అయితే స్మృతులు కూడా ప్రమాణాలే. యుగాలను బట్టి ధర్మాలు మారుతాయంటే వేదాలు, వేదమూలక స్మృతులు కూడా అప్రామాణికాలు కావలసి వస్తుంది. స్మృతులు శ్రుతులతో వైరుద్ధ్యముంటే అవి శాస్త్రాలు కాలేవు గదా !

ధర్మాన్ని అనుష్ఠింపబడే సమయంలో బలవంతు లయిన దుర్మార్గుల ద్వారా ధర్మవికృతి ఏర్పడితే ధర్మమర్యాద కూడా నశిస్తుంది గదా ! ధర్మం తెలుసో తెలియదో, తెలిసికొనగలమో లేదో ? కానీ అది కత్తివాదర కన్న సూక్ష్మమైనదీ, పర్వతం కన్న విశాలమైనదీ అన్నది మాత్రం యథార్థం. ధర్మం ముందుగా గంధర్వనగరాకారంలో కనిపిస్తుంది. ఆ తరువాత పండితులు బాగా ఆలోచిస్తుంటే అది కనిపించకుండా పోతుంది. **భారతా ! చాలా గోవులు త్యాగినందువలన చిన్న చిన్న దొరువులు, చాలా పాలాలను తడపటంవల్ల చిన్నకాలువలు ఎండి పోయినట్లు వైదికధర్మం, స్మృతులు క్రమక్రమంగా క్షీణించి (కలియుగంలో) కనిపించకుండా పోతున్నాయి.** కొందరు స్వార్థంతో, మరికొందరు ఇతరుల కోరికతో, ఇంకాకొందరు విభిన్న కారణాలతో ధర్మాన్ని ఆచారిస్తున్నారు. ఎందరో దుర్మార్గులు కూడా నిరర్థకంగా ధర్మాచారాన్ని నటిస్తున్నారు. ఈ రోజుల్లో సకామ ధర్మాచరణమే కనిపిస్తోంది. ఎవరైనా యథార్థంగా ధర్మాన్ని పాటించినా మూఢులు దాన్ని కేవలం ప్రలాప మంటారు. అంతేకాక ఆ ధర్మాత్ములను ఉన్మాదులంటూ పరిహసిస్తారు కూడా. మహాజను లెందరో స్వధర్మాన్ని పరిత్యజించి, రాజ ధర్మాన్ని ఆశ్రయించారు. అందరికీ హితకరమై, అందరూ పాటించే ధర్మ మంటూ అసలేదీ ఉండదు. ఒక వ్యక్తి ధర్మాన్ని ఆచరించి, ఉన్నతస్థితికి వస్తాడు. మరొకడు ఆ ధర్మాన్నే ఆశ్రయించి ఇతరులను బాధిస్తాడు. యాదృచ్ఛికంగా మాత్రమే అది అందరికీ సమానంగా వర్తిస్తూ కనిపిస్తుంది. ఒక వ్యక్తి ధర్మాన్ని పాటించి, దానిని ఉన్నతస్థితికి తెస్తాడు. మరొకడు దానితో ఇతరులను కూడా పీడిస్తాడు. ఆచారాలు అందరికీ ఒకే రీతిగా వర్తిస్తున్న ట్లనిపించదు. విద్వాంసులు చిరకాలంగా ఆచరిస్తున్న ధర్మాన్నే తొలుత ఉదాహరించావు. ఆ పూర్వాచారం చేతనే సమాజమర్యాద దీర్ఘకాలం నిలుస్తుంది.'

261. జాజలి తులాధారుని కడకుపోవుట.

భీష్ముడిలా చెప్తున్నాడు. 'ఈ విషయంలో కూడా జాజలి తులాధారుల మధ్య జరిగిన సంవాదాన్ని ప్రాచీనేతి హాసంగా ఉదాహరిస్తుంటారు. జాజలి అనుపేరుగల ఒకానొక ద్విజుడు అరణ్యంలో నివసిస్తూ, అక్కడే తిరుగుతుండేవాడు. ఆ మహాతపస్వి సాగర తీరానికి వచ్చి తపస్సు చేశాడు. ఆ ముని నియమశీలుడై, నియమపూర్వకంగా భుజిస్తూ, నారచీరలను, జటలను, జింక చర్మాలను ధరించేవాడు. ఆ ధీమంతుడు చాలా సంవత్సరాలు శరీరంపై మలాన్ని, బురదను ధరిస్తూ నిలిచాడు. రాజా ! ఒకప్పుడు సముద్ర తీరంలో జలప్రదేశంలో నివసిస్తున్న ఆ మహాతేజస్వియైన విప్రర్షి సర్వలోకాలనూ చూడాలని మనోవేగంతో సంచరించసాగాడు. వనకాననాలతో సహా సముద్ర పర్యంతమూ ఉన్న భూమిని చూసి వచ్చి, ఆ ముని జలప్రదేశంలో తిరిగి వసిస్తూ ఇలా ఆలోచించసాగాడు. ఈ లోకంలోని చరాచర ప్రాణులలో నాతో సమానమైన వాడు లేడు. జలంలో కానీ, గగనతలంలో కానీ నాతో సమానంగా సంచరింపగలవాడు లేడు. రాక్షసులకు కనిపించకుండా జలమధ్యంలో నిలిచి ఉన్న జాజలి అలా అనగానే అక్కడ అదృశ్యంగా ఉన్న పిశాచాలు అతనితో ఇలా అన్నాయి. 'నీ విలా మాట్లాడరాదు. ద్విజసత్తమా ! వారాణసిలో మహాయశస్వి అయిన తులాధారు డున్నాడు. ఆయన వ్యాపారి. ఆయన కూడా నీవలె ఇలా మాట్లాడలేడు.' పిశాచాలు అలా అనగానే మహాతపస్వి అయిన జాజలి "ప్రాజ్ఞుడు, యశస్వి అయిన ఆ తులాధారుని నేను చూడాలి" అని అన్నారు. జాజలి అలా అనగానే ఆ పిశాచాలు సాగరతీరం నుండి ఆయనను పైకి లేపి "ద్విజోత్తమా ! ఈ మార్గాన్నే ఆశ్రయించి కాశీనగరానికి వెళ్ళు" అని పలికాయి. పిశాచాలు అలా అనగానే జాజలి కలతపడ్డాడు. వారాణసిలో తులాధారుని సమీపించి ఇలా అన్నాడు. యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'పితామహా ! జాజలి గతంలో ఏదుష్కర కార్యాన్ని చేశాడు? దేని ద్వారా ఉత్తమసిద్ధిని పొందగలిగాడు. అది నాకు చెప్పవలసినది.'

భీష్ముడిలా చెప్తున్నాడు. 'జాజలి మహాతపస్వి. అత్యంత ఘోరతపస్సు చేస్తున్నాడు. ప్రాతస్సాయంకాలాలలో స్నానమాచరించి, సంధ్యోపాసన చేసి, అగ్నిహోత్రాన్ని అనుష్ఠించి, వేదాధ్యయనం చేసేవాడు. వానప్రస్థవిధి నెరిగిన వాడై తేజస్సుతో ప్రజ్వలించేవాడు. అరణ్యంలో తపస్సు చేస్తూండేవాడు. స్వధర్మాన్ని ఎప్పుడూ తక్కువగా చూడలేదు. వానకాలంలో పైకప్పు లేకుండా పడుకొనేవాడు. హేమంతంలో నీటిలో నిలిచేవాడు. గ్రీష్మ వేళలో ఎండా, గాలీ భరించేవాడు. కానీ ధర్మస్వరూప మెరుగలేకపోయాడు. నేలపైనే పొర్లేవాడు. ఎప్పుడో నిదురించేవాడు కానీ సుఖంగా కాదు. ఆ తరువాత ఒకసారి ఆ జాజలిముని

వర్షర్తువులో ఆకాశంలో నిలిచి, పైనుండి పడుతున్న వర్షధారలను మాటిమాటికి శిరసా గ్రహించాడు. ప్రభూ ! అప్పుడు బాగా తడిసిన ఆయన జటలు ముడిపడిపోయాయి. నిత్యమూ అరణ్యంలో సంచరిస్తున్న కారణంగా శరీరం మలినమైంది. అయినా అంతఃకరణం నిర్మలంగా ఉంది. ఒకప్పుడు ఆ మహాతపస్వి మరే ఆహారమూ స్వీకరించకుండా, గాలిని మాత్రమే భుజిస్తూ, కట్టెలా నిలిచాడు. మనస్సులో వ్యగ్రతలేకుండా క్షణంకూడా కదలకుండా నిలిచాడు.

భారతా ! రాజా ! చేష్టలుడిగి స్థాణువులా నిలిచిన ఆయనతలపై పిచ్చుకల జంట గూడుకట్టుకొన్నది. తలమీద గడ్డిపోచలతో గూడుకట్టుకొంటున్న ఆ పక్షులజంటను గమనించి, దయాళువైన ఆ బ్రహ్మర్షి వాటిని ఉపేక్షించాడు. తరమివేసే ప్రయత్నం చేయలేదు. స్థాణువుగా నున్న ఆ మహాతపస్వి నిశ్చలంగా నిలవటంతో ఆ పక్షులు అక్కడ సుఖానికి లోటులేదని ఆయనను విశ్వసించి, అక్కడే నివసించసాగాయి. వర్తర్తువు గడచిపోయి, శరత్కాలం రాగానే కామమోహంతో ఆ పక్షులు ప్రాజాపత్య విధానంతో సంగమించి, నమ్మకం కలిగింది కాబట్టి జాజలి తలమీదనే గ్రుడ్లుపెట్టాయి. వ్రతశీలుడైన ఆ తేజస్వి ఆ బ్రాహ్మణుడు అది గ్రహించాడు. పక్షులు తలమీద గ్రుడ్లు పెట్టినట్టు గ్రహించి మహాతేజస్వి అయిన జాజలి కదలకుండా నిలిచాడు. నిత్యమూ ధర్మలగ్న హృదయుడు ఆయన. అధర్మాన్ని ఇష్టపడడు. విభూ ! ఆ పక్షులు ప్రతిదినమూ ఆహారానికై వెళ్ళి, మరల వచ్చి, ఆ జాజలి తలమీదనే నమ్మకంతో ఆనందంగా నివసించసాగాయి. ఎదిగిన గ్రుడ్ల నుండి పక్షిపిల్లలు బయటపడ్డాయి. ఆయన తలమీదనే పెరగసాగాయి. అయినా జాజలి కంపించలేదు. ధృతవ్రతుడు, ధర్మాత్ముడు, ఏకాగ్రచిత్తుడు అయిన ఆ జాజలి పిచ్చుకల పిల్లలను కాపాడుతూ మునుపటివలెనే నిశ్చేష్టంగా నిలిచాడు. కొంతకాలానికి ఆ పక్షిపిల్లలు ఎదిగాయి. వాటికి రెక్కలు వచ్చాయి. ఆ పిచ్చుక పిల్లలకు రెక్కలు వచ్చాయని జాజలి గ్రహించాడు.

ఆ తరువాత ఒకసారి ధీమంతులలో శ్రేష్ఠుడు, నియత వ్రతుడు అయిన జాజలి ఆ పక్షిపిల్లలను చూసి పరమానందపడ్డాడు. పక్షుల జంటకూడా పెరిగిన తమ పిల్లలను చూసి, సంతోషించి, పిల్లలతో పాటు అక్కడే నిర్భయంగా నివసించసాగింది. రెక్కలు వచ్చిన తరువాత అవి ఎగిరిపోవటం, మరలా ప్రతిసాయంత్రం వెనుతిరిగి రావటం జాజలి చూశాడు. అయినా ఆయన చలించలేదు. ఒక్కొక్కసారి మరలివచ్చి మరలా ఎగిరిపోతుండేవి. పెద్ద పక్షులు వాటిని వదలివెళ్ళినప్పుడు అలా జరిగేది. అయినా జాజలి చలించలేదు. రాజా ! అలా ఆ పక్షులన్నీ పగలంతా తిరిగి సాయంకాలం మరల

నివాసంకోసం గూటిదగ్గరకు వచ్చేవి. ఒకసారి ఎగిరిపోయి, అయిదురోజులు ఎక్కడెక్కడో తిరిగి, ఆ పక్షులు ఆరవరోజు మరలివచ్చాయి. అయినా జాజలి చలించలేదు. క్రమంగా ఆ పక్షులన్నీ చాలారోజులకు ఒకసారి వచ్చిపోసాగాయి. అవి బాగా పుష్టిగా తయారయ్యాయి. అందువలన వెళ్ళిన వెంటనే మరలి వచ్చేవి కాదు.

రాజా ! ఒకసారి ఎగిరిపోయిన ఆ పక్షులు నెలరోజులైనా మరలిరాలేదు. అప్పుడు జాజలి అక్కడనుండి కదిలాడు. అలా అవి కనిపించకుండా పోయాయి. జాజలికి ఆశ్చర్యం కలిగింది. తాను సిద్ధిపొందినట్లు భావించాడు. దానితో అహంభావం ఆయనలో అడుగుపెట్టింది. నియతవ్రతుడు, భావితాత్ముడు అయిన జాజలి ఆ రీతిగా వెళ్ళిపోయిన పక్షులను తలచుకొని తన సిద్ధిని తానే భావించుకొని మనస్సులో పరమానందపడ్డాడు. ఆ మహాతపస్వి నదికి పోయి, స్నానమాచరించి, సంధ్యా తర్పణ చేసి, అగ్నిని సంతృప్తుని చేసి, ఉదయిస్తున్న సూర్యుని ఉపాసించాడు. అప్పుడు తనతలపై పక్షులు పుట్టి పెరిగిన విషయాన్ని తలచుకొని, జపిశ్రేష్ఠుడైన జాజలి చేతులు పైకెత్తి చప్పట్లు చరుస్తూ "నేను ధర్మాన్ని సాధించాను" అని అరిచాడు. అప్పుడు అంతరిక్షం నుండి ఇలా వినిపించింది. 'జాజలీ! నీవు ధర్మవిషయంలో తులాధారునితో సమానం కావు. వారాణసిలో తులాధారుడున్నాడు. ఆయన మహా బుద్ధిమంతుడు. ఆయన కూడా నీలాగా ఇలా మాటాడడానికి సాహసించడు.' జాజలి అది విన్నాడు. రాజా ! ఆ జాజలి అమర్షానికి లోనయి తులాధారుని చూడాలని సంచారం మొదలుపెట్టాడు. ఎక్కడ సూర్యాస్తమయమైతే అక్కడే ఆ రాత్రి గడిపేవాడు. చాలా కాలానికి ఆయన వారాణసీ నగరాన్ని చేరి, సరుకులు అమ్ముకొంటున్న తులాధారుని చూశాడు. సరుకు లమ్మి జీవించే ఆ తులాధారుడు కూడా తన దగ్గరకు వస్తున్న జాజలిని చూసి, లేచి, ఆనందంగా ఎదురేగి, స్వాగతించి, సత్కరించాడు. తులాధారుడిలా అడిగాడు. 'బ్రాహ్మణా ! నీవు వస్తున్నట్లు నాకు ముందే తెలుసు. సందేహం వద్దు. ద్విజోత్తమా ! నేను చెప్పేది సావధానంగా విను. సాగరతీర జల ప్రదేశంలో మహాతపస్సు చేశావు. కానీ నీకు అంతకుముందెప్పుడు ఇప్పటిలా ధర్మవంతుడ నన్న భావన కలగలేదు. బ్రాహ్మణా ! తపస్సిద్ధిని పొందిన నీ తలమీద పక్షులు వెంటనే గ్రుడ్లు పెట్టాయి. అవి పిల్లలయ్యాయి. నీ ఆదరణను చూరగొన్నాయి. ద్విజా ! అవి రెక్కలు వచ్చి గగనసంచారానికై అటు, ఇటూ వెళ్ళిపోగానే ఆ పక్షులను ఆదరించిన ధర్మాన్నే నీవు గొప్పగా భావించావు. ద్విజసత్తమా ! అప్పుడు ఆకాశవాణి ద్వారా నాగురించి విన్నావు. అమర్షానికి లోనయ్యావు. దానితో నా దగ్గరకు వచ్చావు. ద్విజోత్తమా ! చెప్పు నీకై నేను చేయగల ప్రియకార్యమేది ?'

262. ధర్మమును గూర్చి జాజలి తులాధారుల సంవాదము.

భీష్ముడిలా చెప్తున్నాడు. 'బుద్ధిమంతుడైన తులాధారుడు అలా అనగానే జపిశ్రేష్ఠుడు - ధీమంతుడు అయిన జాజలి ఇలా అడిగాడు. 'వాణిజా ! సర్వరసాలను, సర్వగంధాలను, వనస్పతులను, ఓషధులను వాటిపండ్లను, వేళ్ళను నీవు విక్రయిస్తున్నావు. అలా విక్రయిస్తూ కూడా ఈ నైష్ఠిక బుద్ధిని ఎలా సంపాదించుకొన్నావు. మహామతీ ! దీనినంతా నాకు సవిస్తరంగా చెప్పు.' భీష్ముడిలా చెప్తున్నాడు. 'రాజా ! యశస్వి, మహతపస్వి అయిన జాజలి అలా అడగగానే ధర్మార్థతత్త్వవేత్త, జ్ఞానతృప్తుడు అయిన తులాధారుడు ధర్మసూక్ష్మాలను ఇలా వినిపించాడు. **'జాజలీ ! నాకు గూఢరహస్యాలతో కూడా సనాతన ధర్మం తెలుసు. అది సర్వభూతహితాన్ని కోరుతుంది. మైత్రిని కలిగిస్తుంది. ప్రజలు దానిని ప్రాచీన ధర్మంగా భావిస్తారు. జాజలీ ! ప్రాణులకు ద్రోహం చేయకూడదు. తప్పని పరిస్థితులలో స్వల్పద్రోహమే జరగాలి. అటువంటి సూత్రానికి కట్టుబడ్డ ధర్మం ఉత్తమధర్మం. ఆ ధర్మమార్గంలో నేను జీవిస్తున్నాను.** ఇతరులు నరికిన కొయ్యలతో, గడ్డితో నేను ఈ ఇల్లు కట్టుకొన్నాను. లక్క, పద్మకం, తుంగ, చందనం, వగైరా చిన్న, పెద్ద వస్తువులను కొని అమ్ముతున్నాను. విప్రర్షీ ! మద్యం మినహా మిగిలిన ఎన్నో రసాలను ఇతరులనుండి కొని, మోసం లేకుండా తిరిగి విక్రయిస్తున్నాను. జాజలీ ! అందరకూ నిత్యమూ మిత్రుడుగా ఉంటూ, మనసా వాచా కర్మణా అందరి హితాన్ని కోరేవాడే ధర్మాన్ని తెలియగలడు. **నేను ఎవ్వరివెంటా పడను. ఎవ్వరితో గొడవ పడను. ఎవ్వరినీ ద్వేషించను. ఎవ్వరినీ ప్రేమించను. సర్వప్రాణులను సమానంగానే చూస్తాను. ఇది నా వ్రతం. జాజలీ ! నా త్రాసు అందరి విషయంలో ఒకటిగానే ఉంటుంది.** నేను ఇతరుల పనులను అభినందించను. అసహ్యించుకొనను. విప్రేంద్రా ! ఆకాశం వలె అనాసక్తంగా నిలిచి, లోకవైచిత్రిని చూస్తుంటాను. జాజలీ ! ఈ రీతిగా నీవు నన్ను తెలిసికో. సర్వసమానునిగా గ్రహించు. నాకు మట్టి బెడ్డ, రాయి, బంగారం - అన్నీ సమానమే. ఎందరో గ్రుడ్డివారు, చెవిటివారు, పిచ్చివారు లోకంలో ఉన్నారు. దేవతలు వారి నేత్రాది ద్వారాలను మూస్తే వారు కేవలం గాలి పీలుస్తుంటారు (బ్రతుకుతుంటారు). కళ్ళున్న నేను కూడా వారివంటి వాడనే. వృద్ధులు, రోగులు, బలహీనులు విషయోపభోగాలపై అనాసక్తులై ఉన్నట్లే నాకు కూడా అర్థకామాలపై కోరిక తొలగిపోయింది. **మన మెవ్వరికీ భయపడకూడదు. మనలను చూసి ఎవ్వరూ భయపడకూడదు.**

మనకంటూ రాగం కానీ, ద్వేషం కానీ ఉండకూడదు. అప్పుడే బ్రహ్మత్వం లభిస్తుంది.* సర్వభూతాల విషయంలోనూ మనసా, వాచా, కర్మణా పాపభావన లేనప్పుడే బ్రహ్మత్వం లభిస్తుంది. గతంలో కానీ, భవిష్యత్తులో కానీ ఏ పనీ లేనివాడు, ఏ ధర్మాన్ని పాటించనవసరం లేనివాడు, సర్వప్రాణులకు అభయప్రదాత. అటువంటివాడు నిర్భయ బ్రహ్మపదాన్ని పొందగలడు. కొందరు కటువుగా మాటాడుతూ, తీవ్రంగా దండిస్తూ ఉంటారు. వాళ్ళను చూస్తుంటే లోకమంతా మృత్యుముఖాన్ని చూసినట్టు బెదరుతుంది. అటువంటివారు మహాభయాన్ని అనుభవించవలసి వస్తుంది. **వృద్ధులు, పుత్ర పౌత్ర సంపన్నులు, శాస్త్రానుసారంగా ప్రవర్తించే వారు, ఎవ్వరినీ హింసించనివారు కొందరు మహాత్ములున్నారు. వారి అడుగుజాడలనే నేను అనుసరిస్తాను.** అనాచార మోహంవలన శాశ్వతధర్మం నశిస్తుంది. ఆ అనాచారం వలన పండితు డయినా, తపస్వి అయినా, బలవంతు డైనా వ్యామోహంలో పడతాడు. **జాజలీ ! జితేంద్రియుడైన ప్రాజ్ఞుడు ద్రోహచింతన లేని సజ్జనులు ఆచరించిన ధర్మాలను ఆచరించటం ద్వారా త్వరగా ధర్మజ్ఞానాన్ని పొందగలడు.** నదిలోని అలలపై ఎన్నో కొయ్యలు విధివశాన కొట్టుకొని పోతుంటాయి. యాదృచ్ఛికంగా ఒకటి మరొకదానితో కలుస్తుంది. అలాగే చిన్న చిన్న కొయ్యలు, గడ్డి, చిదుకులు, పిడకలు ఒకదాని నొకటి కలుస్తుంటాయి. అయితే అదంతా యాదృచ్ఛికమే కానీ తెలిసి జరిగేది కాదు. అలాగే లోకంలోని సంయోగవియోగాలు.

మునీ ! ఎవరివలన ఏ ప్రాణీ, ఎప్పుడూ, ఏ రీతిగాను కలతపడదో అతడు సర్వప్రాణులనుండి అభయాన్ని పొందగలడు. **మహామతీ ! విద్వాంసుడా ! తీరం దగ్గరకు చేరి కోలాహలం చేసే వాళ్ళను చూసి, చేపలు భయపడినట్లు; కొందరిని చూసి, లోకులంతా తోడేలును చూసినట్లు బెదురుతారు. అటువంటి వారు సర్వప్రాణులనుండి భయాన్నే పొందుతారు.** ఈ కారణంగా అభయదాన మనే ఆచారం ప్రారంభమైంది. దాని నలాగే పాటించినవాడు సహాయాన్నీ, ధనాన్నీ, సౌభాగ్యాన్నీ పొందగలడు. శ్రేష్ఠుడుగా పరిగణింపబడేది అతడే. అభయదానం చేసేవారినే పండితులు శాస్త్రాలలో ప్రశంసిస్తారు. అల్పహృదయులు, విషయాసక్తులు కీర్తికోసం; సమర్థులు పరమపదప్రాప్తి కోసం ఈ అభయదానవ్రతాన్ని పాటిస్తారు. తపస్సు, యజ్ఞాలు, దానాలు, జ్ఞానబోధలు – వీటి ద్వారా ఇహలోకంలో పొందే ఫలాల నన్నింటినీ అభయ దానం ద్వారా పొందవచ్చు.

---

* **యదా చాయం న బిభేతి యదా చాస్మాన్న బిభ్యతి ।**
యదా నేచ్ఛతి న ద్వేష్టి బ్రహ్మ సంపద్యతే తదా ॥ 15

లోకంలోని సర్వప్రాణులకు అభయదక్షిణ నిచ్చినవాడు సర్వయజ్ఞాలను అనుష్ఠించినట్లే. అతడు కూడా అన్నివైపుల నుండి అభయదక్షిణను పొందగలడు. **అహింసను మించిన ధర్మమేదీ ప్రాణులకు లేదు. మహాముని ! ఎవరివలన ఏ ప్రాణీ, ఎప్పుడూ, ఏ రీతిగాను భయపడదో అతడు సర్వప్రాణుల నుండి అభయాన్ని పొందగలడు. ఇంటిలో దూరిన పాముకు భయపడినట్లు, ఎవనివలన లోకం ఉద్వేగానికి గురి అవుతుందో వాడు ఇహపరలోకాలలో ధర్మఫలితాన్ని పొందలేడు.** సమస్త ప్రాణులకు ఆత్మయై సమస్త ప్రాణులనూ తనలాగే భావించేవానికి ప్రత్యేకస్థాన మంటూ లేదు. తాను బ్రహ్మస్వరూపు డవుతాడు. అటువంటి వారి జాడ తెలిసి కొనటంలో దేవతలు కూడా వ్యామోహానికి లోనవుతారు. ప్రాణులకు అభయదానమే సర్వదానాలలో శ్రేష్ఠం. జాజలీ, నీకీ సత్యాన్ని చెపుతున్నాను. శ్రద్ధగా గ్రహించు. కోరికలతో ధర్మకార్యాలు చేసేవాడు సౌభాగ్యవశాన స్వర్గాది ఫలాలు పొంది, మరల సౌభాగ్యం ముగియగానే స్వర్గం నుండి క్రిందకు వస్తాడు. ఈ రీతిగా కర్మవినాశాన్ని చూస్తున్న జనులు సకామకర్మలను అసహ్యించుకొంటారు. జాజలీ ! నిరర్థక మయిన ధర్మమేదీ ఉండదు. దాని స్వరూపం అత్యంత సూక్ష్మం. స్వర్గప్రాప్తిని లేదా బ్రహ్మప్రాప్తిని ఉద్దేశించియే ధర్మం వివరించబడింది.

ధర్మం అత్యంతం సూక్ష్మం కాబట్టి దానిని తెలియటం కష్టం. దానిలో రహస్యాలు చాలా ఉంటాయి. మధ్యలో వివిధ సత్పురుషుల ఆచారాలను చూసి, ధర్మం యొక్క యథార్థస్వరూపాన్ని గ్రహిస్తారు. కొందరు ఎద్దులను నపుంసకాలుగా చేసి, ముకుత్రాడు వేసి, వాటిచే బరువులు మోయిస్తున్నారు. అదుపుచేసి పనులు చేయించుకొంటున్నారు. ఎన్ని ప్రాణాలనో తీసి పంటలు పండించి తింటున్నారు. మనుష్యులే మనుష్యులను బానిసలను చేసికొంటున్నారు. వారినెందుకు నిందించవు ? చంపినా, బంధించినా ఎంత బాధకలుగుతుందో తనకు తెలిసినా ఇతరులను చంపుతున్నారు, బంధిస్తున్నారు. చెరసాలలో పెట్టి పగలూ, రేయి పని చేయించుకొంటున్నారు. వారి నెందుకు నిందించవు ? పంచేంద్రియాలలో సూర్యుడు, చంద్రుడు, వాయువు, బ్రహ్మ, ప్రాణం, యజ్ఞం, యముడు - ఈ దేవతలందరూ ఉంటారు. బ్రతికుండగానే ప్రాణులను అమ్మేస్తున్నాం. ఇక మరణించిన వారి గురించి ఆలోచన ఎందుకు ? మేక అగ్ని, గొర్రె వరుణుడు, గుర్రం సూర్యుడు, పృథివి విరాడ్రూపం, ఆవు, దూడ చంద్రుడు - వీటిని అమ్మితే శుభం జరుగదు. బ్రాహ్మణా ! తైలాన్నీ ! నేతిని, తేనెను, మందులను అమ్మితే హాని ఏముంది ? ఈగలు, దోమలు లేని తావులో సుఖంగా పెరుగుతున్న పశువులను అవి తమ తల్లులకు ప్రియాలని తెలిసికూడా, వాటిని బలవంతంగా ఆక్రమించుకొని ఈగలు, దోమలు, బురద ఎక్కువగా

ఉండే చోటుకు తీసికొనిపోతున్నారు. బరువులు మోసే పశువులు బరువెక్కువై ఎన్ని రకాలుగా అనుచితంగా బాధపడటం లేదు ? ఆ పనికన్న భ్రూణహత్య కూడా తక్కువే నని నే ననుకొంటున్నాను. వ్యవసాయం మంచిదనుకొంటుంటారు కానీ అది కూడా చాలా దారుణమైనదే. జాజలీ ! నాగేటి కర్రు భూమినీ, భూమిలో నున్న ప్రాణులను కూడా హింసిస్తుంది. నాగేటికి కట్టిన ఎద్దుల స్థితిని కూడా చూడు. ఎంత దారుణమో ! గోవునకు అఘ్న్య (చంపరానిది) అని వేదాలలో పేరు. వాటిని చంపే సాహస మెవరు చేయగలరు ? ఆవులను, ఎద్దులను చంపేవాడు ఎంత పాపానికి ఒడిగడుతున్నాడు?

ఒకప్పుడు ఋషులు, యతులు నహుషుని దగ్గరకు వెళ్ళి ఇలా అన్నారు. 'తల్లిలాంటి గోవును, ప్రజాపతివంటి ఎద్దును నీవు చంపావు. చేయరాని పని చేశావు. దీనికి మేమంతా బాధపడుతున్నాము.' జాజలీ ! అలా అని నహుషుని ప్రశంసల నంది ఆ మునులు పాపాన్ని నూటొక్క భాగాలు చేసి, ప్రాణు లందరిపై పడవేశారు. నహుషుని భ్రూణహత్య చేసిన వానిగా నిర్ణయించి "యాగాలలో నీకు హవిస్సులను ఆహుతి నివ్వ" మని చెప్పారు. ఆ రీతిగా పలికి తత్త్వార్థద్రష్టలు, మహాత్ములు అయిన ఆ ఋషులు, యతులు తపస్సు ద్వారా విషయాన్ని గ్రహించి, 'నహుషుడు అజ్ఞానంతో తప్పుచేశాడు కాబట్టి నిర్దోషి' యని భావించి, శాంతించారు. జాజలీ ! ఇటువంటి ఘోరాచారాలు, అమంగళాచారాలు ఎన్నో లోకంలో వ్యాప్తిలో ఉన్నాయి. మనకన్న ముందున్నవారు ఆచరించారన్న దొక్కటే ఇక్కడ కారణం. కానీ నీవు నేర్పరివై కూడా దానిని గ్రహించలేకున్నావు. **హేతుబద్ధంగా ధర్మాన్ని ఆచరించాలి కానీ ఎవరో చేశారు కదా అని మనం చేయకూడదు. జాజలీ ! నన్ను హింసించేవారూ ఉంటారు, స్తుతించేవారూ ఉంటారు. దానిని గురించి చెపుతా విను. వారిద్దరూ నాకు సమానులే. నాకు ప్రియా ప్రియాలు లేవు. ఇటువంటి ధర్మాన్నే ధీమంతులు అభినందిస్తారు.** ఇదియే యుక్తిసంపన్నం. యతులు కూడా దీనినే సేవిస్తారు. ధర్మశీలులైన మనుష్యులు బాగా విచారించి సదా అనుష్ఠించే ధర్మ మిదే.'

263. ధర్మమును గూర్చి జాజలి తులాధారుల సంవాదము.

జాజలి ఇలా చెప్తున్నాడు. 'చేత త్రాసును పట్టి నీవు ప్రతిపాదిస్తున్న ఈ ధర్మం స్వర్గద్వారాన్ని, ప్రాణుల జీవికావృత్తులను కూడా ప్రతిబంధించే టట్లున్నది. వ్యవసాయం ద్వారానే అన్నం దొరుకుతుంది. దానితోనే నీవు కూడా బ్రతుకుతున్నావు. వాణిజా ! ఓషధులు, పశువుల ద్వారానే మనుష్యులు జీవించగలుగుతున్నారు. దానిద్వారానే యజ్ఞకర్మలు

కూడా జరుగుతున్నాయి. నీవు నాస్తికునివలె మాట్లాడుతున్నావు. పశుహింస అన్న ఒక్క మాటను బట్టి వ్యవసాయాది వృత్తులను వీడితే లోకమే నిలవదు ?' తులాధారు డిలా చెప్పాడు. 'జాజలీ ! వృత్తిని గురించి చెపుతాను. బ్రాహ్మణా ! నేను నాస్తికుడను గాను. యజ్ఞాన్ని కూడా నేను నిందించటం లేదు. యజ్ఞస్వరూపాన్ని సరిగా తెలిసినవాడు దొరకటం కష్టం. విప్రా ! బ్రాహ్మణులకై కల్పించిన యజ్ఞానికి నమస్కారం. యజ్ఞవేత్తల కందరకూ నమస్కారం. అయితే ఇప్పుడు బ్రాహ్మణులు స్వయజ్ఞాన్ని వీడి, క్షత్రియయజ్ఞాన్ని చేపట్టారు. బ్రాహ్మణా ! ధనాసక్తు లయిన లోభులు, మరెందరో నాస్తికులు వేదవచనాల తాత్పర్యాన్ని గ్రహించకుండా సత్యంలా కనిపించే మిథ్యాయజ్ఞాలను ప్రవర్తింపజేస్తున్నారు. జాజలీ ! 'ఇది ఇవ్వాలి' 'ఇది ఇవ్వాలి' అంటూ శ్రుతులు, స్మృతులు దక్షిణలను విధించి, దక్షిణల ద్వారానే యాగాలను ప్రశంసించాయి. శక్తి ఉండీ ఇవ్వకపోతే దొంగతన మన్నారు. కర్మ సిద్ధించ దన్నారు. **వాస్తవానికి శుభకర్మల ద్వారా ఇచ్చిన హవ్యంతో దేవతలు తృప్తి పడతారు. శాస్త్ర విధిని బట్టి నమస్కారంతో, హవిస్సుతో, స్వాధ్యాయంతో, ఓషధులతో దేవతలను పూజించాలి.**

కాముకులై యాగాలను నిర్వర్తించినా, చెరువులు త్రవ్వించినా, తోటలు నిర్మించినా గుణహీను లయిన పిల్లలు పుడతారు. లోభులకు లోభులే పుడతారు. సమదర్శులకు సమదర్శులే పుడతారు. యజమానులు, ఋత్విక్కులు ఎటువంటివారైతే వారి పిల్లలూ అటువంటివారే అవుతారు. ఆకాశంనుండి నిర్మలజలం కురిసినట్లు పవిత్రభావంతో చేసిన యజ్ఞం వలన సత్పుత్రులు పుడతారు. బ్రాహ్మణా! అగ్నికి ఇచ్చిన ఆహుతి ఆదిత్యునకు చేరుతుంది. ఆదిత్యుని వలన వర్షం కురుస్తుంది. వర్షం ద్వారా అన్నం, అన్నం నుండి ప్రజలు పుడతారు. కాబట్టి ప్రాచీనులు చక్కగా యజ్ఞాలు నిర్వహించి, సర్వకామాలనూ పొందారు. భూమి దున్నకపోయినా పండేది. వారి శుభాశీస్సులతోనే చెట్లు ఫలించేవి. వారు యాగనిర్వహణలో తమకోసం ఏమీ ఆశించే వారుకాదు. యజ్ఞఫలాన్ని శంకిస్తూ, ఏదో ఒక రీతిగా యజ్ఞాన్ని నిర్వహించినవారు ధనాపేక్షగల లుబ్ధులు, ధూర్తులుగా పరిగణింపబడతారు. ద్విజోత్తమా ! ప్రామాణికమైన వేదాన్ని తన అప్రామాణిక తర్కంతో అశుభ కర్మల వైపు ప్రవర్తింపజేసేవాడు బుద్ధి హీనుడు, నిత్య పాపాత్ముడు. అతడు తన అశుభకర్మల ద్వారా పాపాత్ములు పొందే లోకాలనే పొందుతాడు. **కర్తవ్యాన్ని కర్తవ్యంగా స్వీకరిస్తూ, దానిని పాటించలేక పోతే భయపడుతూ, లోకంలో సమస్తాన్ని (యాంగాంగాలను) బ్రహ్మగానే భావిస్తూ, కర్తవ్యాహంకారాన్ని వీడి, ప్రవర్తించినవాడే నిజమైన బ్రాహ్మణుడు.**

కర్మ నిర్వహణలో ఏదైనా లోపం జరిగినా నిష్కామభావంతో చేస్తే అది గొప్పదే. మంచి ఫలితాలనే ఇస్తుంది. అంటరాని జంతువుల ద్వారా కర్మ మలినపడినా కూడా నిష్కామదృష్టితో చేస్తే అది శ్రేష్ఠమే. కాబట్టి ఫలాపేక్షను ఎప్పుడూ నియంత్రించుకోవాలి. ప్రాచీనకాలంలో బ్రాహ్మణులు సత్యయజ్ఞాన్ని, ఇంద్రియసంయమ యజ్ఞాన్ని పాటించేవారు. పరమపురుషార్థ (మోక్ష)ం మీదనే వారి లోభం. దానితోనే వారు తృప్తి పడేవారు. వారంతా లభించిన వస్తువులను కూడా త్యజిస్తూ మాత్సర్యరహితులై ఉండేవారు. క్షేత్ర క్షేత్రజ్ఞ తత్త్వాన్ని తెలిసి, వారు ఆత్మయజ్ఞ పరాయణులై, ఉపనిషత్తులు అధ్యయనం చేస్తూ, తాము సంతోషించి, ఇతరులను సంతోషపెట్టేవారు. బ్రహ్మ సర్వస్వరూపం. దేవతలంతా బ్రహ్మ రూపంతోనే ఉంటారు. ఆ బ్రహ్మ బ్రహ్మవేత్తలయిన బ్రాహ్మణులలో ఉంటుంది. జాజలీ ! కాబట్టి బ్రాహ్మణులు తృప్తి చెందితే దేవతలంతా తృప్తి చెందినట్లే. సర్వరసాలతోనూ తృప్తి పడిన మనిషి వాటిలో ఏ ఒక్కదానినో ప్రత్యేకంగా అభినందించనట్లు, ప్రజ్ఞానంతో తృప్తిపడినవానికి అక్షయ సుఖహేతు వయిన నిత్యతృప్తి లభించినట్లే.

మనలో చాలామందికి ధర్మమే ఆధారం. ధర్మమే సుఖం, వారు కర్తవ్యాకర్తవ్యాలను నిశ్చయించగలరు. కానీ మన కన్న గొప్పవాడై, వ్యాపకుడైన పరమాత్మ అంతటా, అన్ని రూపాలలో ప్రకాశిస్తూ ఉంటాడని జ్ఞానులు మాత్రమే సందర్శించగలరు. సంసార సాగరాన్ని తరించాలన్న కోరిక గల కొందరు జ్ఞాన విజ్ఞానసంపన్నులు పరమపవిత్రమూ, పుణ్యదాయకమూ, పుణ్యాత్మ సేవితమూ అయిన బ్రహ్మలోకాన్ని చేరుతారు. అక్కడ వారికి శోక ముండదు. వ్యథ ఉండదు. అక్కడనుండి అధోగతి కూడా ఉండదు. సాత్వికులు ఆ బ్రహ్మపదాన్ని పొందుతారు. వారికి స్వర్గాభిలాష ఉండదు. కీర్తికోసమో, ధనం కోసమో వారు యాగాలు చేయరు. సజ్జనుల మార్గాన్ని అనుసరిస్తూ హింసలేని యజ్ఞాలనే చేస్తారు. వనస్పతులను, ఓషధులను, ఫలమూలాలను వారు హవిస్సుగా స్వీకరిస్తారు. అందుకే ధనలుబ్ధు లయిన ఋత్విక్కులు వారిచేత యాగాలు చేయించరు. జ్ఞానులయిన బ్రాహ్మణులు తమనే యజ్ఞోపకరణంగా భావించి, మానసిక యజ్ఞాన్ని అనుష్ఠిస్తారు. అది కూడా లోకకళ్యాణాన్ని మాత్రమే కోరుతూ. లోభులయిన ఋత్విక్కులు అశుభ యజ్ఞాలనే చేయిస్తుంటారు. శ్రేష్ఠులు స్వధర్మాచరణంచేతనే ప్రజలను స్వర్గానికి చేర్చగలరు. జాజలీ ! ఇదంతా ఆలోచించియే నా మనస్సు అంతటా సమానంగా ప్రసరిస్తుంది. మహామునీ ! ప్రాజ్ఞులయిన ద్విజోత్తములు నిత్యమూ తాము యాగనిర్వహణకు వినియోగించే పదార్థాల

ద్వారానే దివ్యమార్గాలలో పుణ్యలోకాలను పొందగలుగుతారు. జాజలీ ! సకామ కర్మలు చేసేవాడు మరల సంసారంలో పడతాడు. నిష్కామంగా ఉన్న జ్ఞాని మరల జన్మించడు. ఇద్దరూ దేవమార్గంలోనే పుణ్యలోకాలు పొందుతారు. అయినా సంకల్పభేదం వలన ఫలభేదం కనిపిస్తుంది. జ్ఞానులు సంకల్పిస్తే వారి మనస్సిద్ధి ననుసరించి, ఎద్దులు తమంత తాముగా కాడెకు కట్టుబడి వారిబండిలాగుతాయి. ఆవులు తమంత తాముగా పాల నిస్తాయి. యోగ సిద్ధుల దగ్గరకు యూపం తనంత తానుగా వస్తుంది. దానితో వారు చాలినంత దక్షిణలతో యాగం చేయగలుగుతారు. ఆ ఋత్విక్కుల దగ్గరకు దక్షిణలు కూడా తమంత తాముగా వచ్చి చేరుతాయి. అలా అంతఃకరణాన్ని నిలుపుకొన్నవాడే భూమిని కూడా పొందగలడు. బ్రాహ్మణా ! **అందువలననే సిద్ధయోగులు ఓషధులతోనే యజ్ఞాలు నిర్వహిస్తారు. సకామకర్ము లయిన మూఢులు అటువంటి యాగాలు చేయలేరు. కర్మఫలత్యాగం చేయగలవారికే అటువంటి మాహాత్మ్య ముంటుంది. కాబట్టియే నేను త్యాగాన్ని ప్రధానం చేసి నీకు ఇలా చెప్తున్నాను.**

ఆశలు లేనివాడు, సకామ కర్మలు చేయనివాడు, నమస్కారాలకు, స్తుతులకు దూరంగా నిలిచేవాడు, ధర్మక్షయం లేనివాడు, కర్మబంధాలు తొలగినవాడు బ్రాహ్మణు డని దేవతలు భావిస్తారు. జాజలీ ! అధ్యయనం చేయకుండా, యజనాన్ని మాని, బ్రాహ్మణులకు దానం చేయటాన్ని వీడి, భోగపదార్థప్రాప్తికి అనుగుణమైన ప్రవృత్తిని కోరుకొంటున్నవాడు కుత్సితగతిని పొందుతాడు. కానీ నిష్కామ ధర్మాన్నే దైవంగా భావించి, ఆరాధించినవాడు యథార్థమైన యజ్ఞఫలాన్ని - మోక్షాన్ని పొందగలడు. జాజలి ఇలా అడిగాడు. 'వాణిజా ! మునుల దగ్గర ఎప్పుడూ నీవు చెప్తున్న ఆత్మయాగతత్త్వాన్ని నేను వినలేదు. ప్రాచీన మహర్షు లెవ్వరూ దీనిపై పెద్దగా దృష్టి పెట్టలేదు. వారు గొప్పవారే. ఆలోచించినవారే. కానీ ఇటువంటి ధర్మాన్ని వారు స్థాపించలేదు. అందుకే నిన్ను అడుగుతున్నాను. వాణిజా ! ఈ రీతిగా ఆత్మయజ్ఞాన్ని తెలియలేని అజ్ఞానులు దీని సౌభాగ్యాన్ని పొందలేరు గదా ! మరి వారికి ఏ కర్మ సుఖాన్ని ఇస్తుంది. మహాప్రాజ్ఞా ! దానిని నాకు చెప్పు. చాలా శ్రద్ధగా వింటాను.'

తులాధారు డిలా అన్నాడు. **'డాంబికుల యజ్ఞాలను యజ్ఞమని వ్యవహరించటం కూడా తగదు. వారికి మానసికయజ్ఞానికి కాని కర్మయజ్ఞానికి కానీ అధికారం లేదు. నేయి, పాలు, పెరుగు, పూర్ణాహుతులతోనే శ్రద్ధాళువులు యజ్ఞాన్ని ముగిస్తారు. వారికి ఒకవేళ శక్తిలేకపోతే ఆవు తన తోకతో, కొమ్ములతో, పాదధూళితో వారి యాగాన్ని సుసంపన్నం చేస్తుంది. ఈ రీతిగా దేవతల నర్చించటానికి**

శ్రద్ధనుకూడా పత్నిగా చేసికొని, యజ్ఞాన్నే దేవతలను వలె ఆరాధించి, ఉన్నరూపంతోనే యజ్ఞపురుషుడైన విష్ణువును పొందవచ్చు. యజ్ఞ విధిలో నున్న సర్వపశువుల పాలతో చేసిన పురోడాశమే పవిత్ర మైనది. నదులన్నీ సరస్వతీ స్వరూపాలే. పర్వతాలన్నీ పవిత్రాలే. జాజలీ ! ఆత్మయే తీర్థం. తీర్థసేవన మంటూ దేశాలుపట్టి తిరగవద్దు. ఇప్పుడు నేను చెప్పిన అహింసా ధర్మాన్ని పాటిస్తూ, విశేష కారణాలతో ధర్మాన్ని అనుసంధానం చేస్తూ, పుణ్య లోకాలను చేరవచ్చు.' భీష్ముడిలా చెప్తున్నాడు. 'ఈ ప్రకారంగా హింసారహితమై, యుక్తిసంగతమై, సతతమూ సజ్జనసేవితమైన ధర్మాన్నే తులాధారుడు అభినందిస్తాడు.'

264. జాజలికి పక్షుల ఉపదేశము.

తులాధారుడిలా చెప్తున్నాడు. 'నేను చెప్పిన ఈ ధర్మమార్గాన్ని మంచివారు స్వీకరించారా? చెడ్డవారు స్వీకరించారా ? బాగా పరిశీలించి తెలుసుకో. అప్పుడు నీకు వాస్తవం ఆకళింపుకు వస్తుంది. ఆకాశంలో ఎన్నో డేగలు, మరెన్నో పక్షిజాతులు అంతటా తిరుగుతుంటాయి. వాటిలో నీ నెత్తిన గ్రుడ్లుపెట్టిన పక్షులు కూడా ఉన్నాయి. ఇవి అక్కడక్కడ గూళ్ళలో జొరపడి ఉన్నాయి. చూడు. వీటి కాళ్ళూ, చేతులూ ముడుచుకొని శరీరాలలోనికి చొచ్చుకొని ఉన్నాయి. వాటినన్నింటిని పిలిచి, అడుగు. జాజలీ ! నీవు పిలిస్తే నీవు ఆదరించి రక్షించిన ఆ పక్షులు నిను తండ్రివలె సంభావిస్తాయి. నిజంగా నీవు వాటికి తండ్రివే. నీ పిల్లలను పిలు.'

భీష్ముడిలా చెప్తున్నాడు. 'అప్పుడు జాజలి పిలువగా, ధర్మయుక్తంగా ఉన్న ఆయన మాటలను విని, ఆ పక్షులు వచ్చి ఇలా పలికాయి. "బ్రాహ్మణా ! బ్రాహ్మణా ! అహింసతో చేసిన కర్మ ఇహపరలోకాలలో ఉత్తమఫలాన్ని ఇస్తుంది. హింసాభావన శ్రద్ధను నశింపజేస్తుంది. నశించిన శ్రద్ధ హింస చేస్తున్న కర్తనే సర్వనాశనం చేస్తుంది. ద్వంద్వాలను సమానంగా భావిస్తూ, శ్రద్ధాళువులు, జితేంద్రియులు, సుమనస్కులు అయిన వారు తమ కర్తవ్యంగా భావించి, యజ్ఞాన్ని నిర్వహిస్తే అది ఎప్పుడూ నిష్ఫలం గాదు. బ్రాహ్మణా ! శ్రద్ధ సూర్యుని పుత్రి. అందుకే ఆమెను వైవస్వతి, సావిత్రి, ప్రసవిత్రి అని కూడా పిలుస్తారు. వాక్కు, మనస్సు కూడా శ్రద్ధ తరువాతివే. భారతా ! వాగ్వ్యద్ధుని, మనోవ్యద్ధుని శ్రద్ధ కాపాడుతుంది. (వాఙ్మనో దోషాలను శ్రద్ధ పోగొట్టగలదు) కానీ శ్రద్ధా వ్యద్ధుని కర్మను వాక్కు, మనస్సు కాపాడలేవు. (శ్రద్ధలోపిస్తే మంత్ర ధ్యానాలు కాపాడలేవు). ఈ విషయంలో ప్రాచీన వృత్తాంతాలు

తెలిసినవారు బ్రహ్మగీతాలను కీర్తిస్తారు. శ్రద్ధ లేకుండా పవిత్రంగా ఉన్నా, శ్రద్ధతో అపవిత్రంగా ఉన్నా వారి యాగద్రవ్యాన్ని దేవతలు సమానంగానే చూస్తారు. కృపణుడైన వేదవేత్తను, వదాన్యుడైన వడ్డీవ్యాపారిని కూడా బాగా ఆలోచించి, ఒకటిగానే లెక్కించి, దేవతలు ఉభయుల హవిస్సులను సమంగానే పరిగణించారు. ఒకసారి బ్రహ్మ యజ్ఞసమయంలో వారి ప్రవర్తన చూసి ఇలా అన్నాడు. 'మీరు తప్పు చేశారు. ఉదారుని హవిస్సు శ్రద్ధకారణంగా పవిత్ర మవుతుంది. లోభిహవిస్సు అతని అశ్రద్ధకారణంగా అపవిత్ర మవుతుంది.'

వదాన్యుని అన్నాన్నే స్వీకరించాలి. కృపణుడైన శ్రోత్రియుని అన్నాన్ని, వడ్డీవ్యాపారి అన్నాన్ని స్వీకరించరాదు. శ్రద్ధలేనివానికి ఒంటరిగా నిలిచి, దేవతలకు హవిస్సు నిచ్చే అధికారంలేదు. అటువంటివాని అన్నాన్ని అంగీకరించరాదు అని ధర్మవేత్త లంటారు. అశ్రద్ధ మహాపాపం. శ్రద్ధ పాపవిమోచని. పాము కుబుసాన్ని విడిచినట్లు శ్రద్ధాళువు పాపాన్ని వదలుతాడు. శ్రద్ధతో పాపనివృత్తిని పొందటం పవిత్ర కర్మలన్నింటిలో గొప్పది. నడవడిలో తప్పులేని శ్రద్ధావంతుడు ఎప్పుడూ పవిత్రుడే. శ్రద్ధావంతునకు మరే తపస్సు అవసరం లేదు. మరే ఆచారవ్యవహారాలు అవసరంలేదు. ఆత్మవిచారణలూ అవసరంలేదు. సాత్త్విక రాజస తామసాలలో దేనిపై శ్రద్ధ ఉంటే అటువంటి స్వభావమే కలుగుతుంది. ధర్మార్థతత్త్వం తెలిసినవారు ఇలా ధర్మస్వరూపాన్ని చెప్పారు. మేము జిజ్ఞాసతో ధర్మదర్శను డను మహర్షి ద్వారా ఈ జ్ఞానాన్ని పొందాము. మహాప్రాజ్ఞా ! జాజలీ ! ఈ విషయంపై శ్రద్ధపెట్టు. ఆ తరువాత దీని ననుసరించి, ఆచరించి, పరమగతిని పొందవచ్చు. శ్రద్ధావంతుడై శ్రద్ధాళువు అయినవాడు సాక్షాత్తు ధర్మస్వరూపుడే! శ్రద్ధా పూర్వకంగా ధర్మంపై నిలిచిన వాడు అందరికన్న శ్రేష్ఠుడుగా పరిగణింపబడతాడు." భీష్ముడిలా అన్నాడు. 'తరువాత కొంతకాలానికే మహాప్రాజ్ఞు లైన జాజలితులాధారులు పరమధామాన్ని చేరి, శుభకర్మల కనుగుణంగా తమకు లభించిన స్థానాలను పొంది, సుఖంగా విహరించసాగారు. ఈ రీతిగా తులాధారుడు మంచి మంచి విషయాలతో చక్కగా ప్రసంగించాడు. సనాతన ధర్మాన్ని ప్రతిపాదించాడు. ప్రఖ్యాత ప్రభావం గల ఆ తులాధారుని మాటలను విని, జాజలి చక్కగా అవగాహన చేసికొన్నాడు. కౌంతేయా ! తులాధారుని భాషణ బహుజనసమ్మత మైనది. దానిని విని జాజలి పరమశాంతిని పొందాడు. దానిని యథాతథంగా సోదాహరణంగా నీకు చెప్పాను. ఇంకా ఏమి వినా లనుకొంటున్నావు?

A.C.No 96366

265. విచఖ్ఞువరపాలుడు అహింసను ప్రశంసించుట.

భీష్ముడిలా చెప్తున్నాడు. 'పూర్వకాలంలో విచఖ్ఞునరపాలుడు సమస్త ప్రాణులపై దయచూపుతూ ప్రకటించిన విషయాలను ఈ సందర్భంలో ప్రాచీనేతిహాసంగా ఉదాహరిస్తుంటారు. ఒకసారి ఒకయజ్ఞ వాటిలో గొంతుతెగి ఉన్న ఒక ఎద్దును ఆ రాజు చూశాడు. అక్కడున్న గోవులన్నీ ఆర్తనాదం చేస్తున్నాయి. యజ్ఞశాల ప్రాంగణంలో ఎన్నో గోవులు నిలిచి ఉన్నాయి. అది చూసి ఆ రాజు ఇలా అన్నాడు. "లోకంలోని గోవులన్నీ సుఖంగా ఉండాలి." హింస ప్రారంభం కాగానే ఆ రాజు గోవులకు శుభం కలగాలని ప్రకటించి హింసను నిషేధిస్తూ ఇలా అన్నాడు. "ధర్మమర్యాదల నతిక్రమించిన మూర్ఖులు, నాస్తికులు, సంశయాత్ములు, అప్రసిద్ధులు హింసను సమర్థించారు. ధర్మాత్ముడైన మనువు సర్వకర్మలలోనూ అహింసనే ప్రతిపాదించాడు. మనుష్యులు తమ ఇష్టం వచ్చినట్టు బహిరంగంగా వేదికపై పశువులను హింసిస్తున్నారు. కాబట్టి విజ్ఞులు వైదికప్రమాణాల ననుసరిస్తూ ధర్మసూక్ష్మాన్ని నిర్ణయించాలి. సర్వప్రాణులకై విధింపబడిన ధర్మాలలో అహింసయే అన్నింటికన్న గొప్పదిగా భావించబడింది. ఉపవాసనియమాలను పాటించండి. వేదాలలో చెప్పిన కామ్య కర్మలను విడనాడండి. ఆచార మన్న పేరుతో సాగుతున్న కామ్య కర్మలు అనాచార మని గ్రహించండి. క్షుద్రులు మాత్రమే ఫలాన్ని కోరుతూ కర్మ నాచరిస్తారు. యూపనిర్మాణం కోసమే చెట్లు నరుకుతున్నా మని, యజ్ఞం కోసమే పశుబలి, మాంసభక్షణమూ జరుగుతున్నాయి కాబట్టి ఇది వ్యర్థం కాదు, ధర్మమే అని కొందరనవచ్చు. కానీ ఈ ధర్మాన్ని ఎవ్వరూ మెచ్చుకోరు. సుర, చేపలు, మధువు, మాంసం, కల్లు, పులగం- ఇటువంటి పదార్థాల నన్నింటినీ ధూర్తులు యజ్ఞాలలో ప్రవేశపెట్టారు. ఇది వేదవిధి కాదు. ధూర్తులు మానమోహాలోభాలకు లొంగి, ఆ పదార్థాలపై తమకున్న లోలుపత్వాన్ని ఇలా ప్రకటించారు. సర్వయజ్ఞాలలోనూ బ్రాహ్మణులు విష్ణువునే సంభావిస్తారు. పాయసం, పూలు మొదలయిన పదార్థాలతోనే విష్ణుయజనం విహితం. వేదాలలో విధింపబడిన వృక్షాలనే యజ్ఞాలలో ఉపయోగించాలి. పవిత్ర భావన, మహాసత్త్వగుణం గల పురుషులు ప్రోక్షణాదికాల ద్వారా సంస్కరించి, తయారు చేసిన హవిస్సే సర్వదేవతలకూ సమర్పించదగినది." యుధిష్ఠిరు డిలా అన్నాడు. హింసను విడనాడితే శరీరం, ఆపదలు పరస్పరం ఘర్షణ పడతాయి. ఆపదలు శరీరాన్ని కలతపెడతాయి. శరీరం ఆపదల నుండి బయటపడాలి. హింస అనే భావనతో వ్యవసాయం వంటి పనులు మానితే శరీరయాత్ర ఎలా కొనసాగుతుంది.' భీష్ముడిలా అన్నాడు. 'శరీరం శోషించకుండా ఉండటానికి, మరణానికి లోనుగాకుండ నిలవటానికి

ఎంత మేర కర్మ ప్రవృత్తి అవసరమో అంతమేర కర్మల నాచరించాలి. శరీర సామర్థ్య మున్నప్పుడే కదా ధర్మాన్ని ఆచరించగలిగేది.'

266. గౌతమ చిరకారి వృత్తాంతము.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'తప్పని సరిగా పని చేయవలసి వచ్చినప్పుడు ఎలా పరిశీలించాలి ? వెంటనే చేయాలా ? లేక ఆలస్యంగా చేయలా ? ఇలాంటి కార్యసంకటాలను బోధించటానికి తమరే మాకు పరమగురువులు.' భీష్ము డిలా చెప్తున్నాడు. 'ఆంగిరస వంశంలో పుట్టిన చిరకారికి కలిగిన సంఘటన ఈ విషయంలో ప్రాచీనేతిహాసంగా ఉదాహరిస్తుంటారు. "చిరకారీ ! నీకు శుభం కలుగుగాక ! చిరకారికా ! నీకు మంగళ మగుగాక." చిరకారి మేధావి. కర్తవ్యపాలనలో ఎప్పుడూ తప్పు చేయడు. గౌతమునకు చిరకారి అనుపేర ఒక కొడుకుండేవాడు. ఆ బాలుడు మహాప్రాజ్ఞుడు. ఏ పని నయినా బాగా ఆలోచించి, ఆలస్యంగా చేస్తాడు. ఏ విషయాన్నైనా దీర్ఘంగా ఆలోచిస్తాడు. చాలాసేపు మేల్కొంటాడు. చాలా సేపు నిదురిస్తాడు. ఆలస్యంగానే పనులు చేస్తాడు. అందువలన అతనిని చిరకారి అంటారు. సుదీర్ఘంగా బుద్ధిలాఘవంతో విషయాన్ని ఆలోచింపలేని మందబుద్ధులు చిరకారిని దుర్బుద్ధి అన్నారు. ఆలస్యానికి అతడు ఉపాధి అన్నారు. ఒకసారి తన భార్య ఏదో తప్పు చేసిందని భావించి గౌతముడు కోపించి ఇతరకుమారులను కాదని "ఈ నీ తల్లిని సంహరించు" అని చిరకారిని ఆదేశించాడు. అలా ఆదేశించి జపిశ్రేష్ఠుడు, మహాభాగుడు అయిన గౌతముడు మరేమీ ఆలోచించకుండా అరణ్యంలోనికి వెళ్ళిపోయాడు. చిరకారి తన స్వభావం మేరకు చాలాసేపటికి 'అలాగే' అని తాను చిరకారి కాబట్టి ఆ విషయాన్ని గురించి చాలా సేపు ఆలోచించాడు. 'తండ్రి ఆదేశాన్ని పాటించాలి. తల్లిని చంపకూడదు. ఎలా చేయాలి ? ధర్మ నిర్ణయంలో పెద్ద చిక్కు వచ్చింది. అసాధువులవలె ఈ ధర్మసంకటంలో ఎలా మునిగి పోయేది ? **పితృవాక్యపాలన ఉత్తమధర్మం. మాతృరక్షణం స్వధర్మం. కొడుకు అస్వతంత్రుడు. ధర్మహాని రూపమైన పీడకలుగకుండా ఏం చేయాలి ?** స్త్రీని, అందునా తల్లిని చంపి ఎప్పుడైనా ఎవ్వడైనా సుఖపడతాడా ? తండ్రి మాటను తిరస్కరించి, ఎవడైనా పేరు తెచ్చుకొనగలడా ?

తండ్రిని నిరాదరించటం తగదు. మాతృరక్షణం పుత్ర ధర్మం. రెండూ తగినవే. రెండూ ధర్మాలే. ఇవి నన్ను మించిపోకుండా ఏం చేయాలి ? తండ్రి తన శీలాన్ని, చారిత్రాన్ని గోత్రాన్ని, వంశాన్ని రక్షించు కొనేందుకు భార్యయందు తననుతాను నిక్షేపించుకొని కొడుకుగా పుడతాడు. కాబట్టి తండ్రి, తల్లి ఇద్దరూ కొడుకుగా నాకు జన్మ నిచ్చారు.

ఈ ఇరువురూ నా పుట్టుకకు కారకులే. ఈ జ్ఞానం నాకు సదా ఉండాలి గదా! జాతకర్మ సమయంలో, ఉపనయన సమయంలో తండ్రి ఆశీస్సు నిస్తాడు. తండ్రి గౌరవాన్ని కాపాడటానికి సరిపోయిన దృఢమైన ప్రమాణ మది. తండ్రి ఆలన పాలన చేస్తూ, విద్యాబుద్ధులు నేర్పుతాడు కాబట్టి కొడుకుకు తానే ప్రధానగురువు, పరమ ధర్మంకూడా. తండ్రి ఆదేశాన్ని పాటించాలి. వేదాలుకూడా దాన్నే ధర్మమని నిశ్చయించాయి. తండ్రికి కొడుకు ప్రీతిమాత్రమే. కొడుకుకు తండ్రి సర్వస్వం. తండ్రి మాత్రమే శరీరాది సమస్త వస్తువులను పుత్రున కివ్వగలడు. కాబట్టి తండ్రి మాటను ఆచరించాలి. ఎప్పుడూ ఎటువంటి విచారణ చేయరాదు. తండ్రి మాటను పాటించే కుమారుని పాపాలు కూడా నశిస్తాయి. కొడుకుకు భోగ్యవస్తువులను, భోజ్య పదార్థాలను, వేదాధ్యయనాన్ని, లోకవ్యవహారాన్ని, గర్భాధాన, పుంసవన, సీమంతోన్నయనాది సంస్కారాలను కలిగించేది తండ్రియే. **తండ్రియే ధర్మం. తండ్రియే స్వర్గం. తండ్రియే పరమ తపస్సు. తండ్రి ఆనందిస్తే సమస్త దేవతలు ఆనందించినట్లే.* తండ్రి కటువుగా మాటాడినా బిడ్డల కవి ఆశీస్సులే. తండ్రి ప్రేమగా కొడుకును అభినందిస్తే పుత్రునకు సర్వపాపప్రాయశ్చిత్తం జరిగినట్లే.** తొడిమనుండి పూవు రాలుతుంది. చెట్టునుండి పండు రాలుతుంది. కానీ కష్టాలు పడుతున్నా కూడా తండ్రి పుత్ర స్నేహాన్ని వదలడు. పుత్రుడు తండ్రి నెంతగా గౌరవించాలో ఆలోచించాడు. తండ్రి కొడుకుకు ఎంతగొప్ప ఆశ్రయమో ! ఇక తల్లిని గురించి ఆలోచిస్తాను.

నేను మర్త్యుడుగా నిలువడానికి అవసరమైన పాంచభౌతిక శరీరానికి తల్లియే కారణం. అది అగ్నిపుట్టుకకు కారణమైన అరణివంటిది. తల్లి బిడ్డలదేహోత్పత్తికి అరణివంటిది. ఆర్తులకు అందరకూ సాంత్వన చేకూర్చేది తల్లియే. తల్లి ఉంటే దిక్కు ఉన్నట్టు. తల్లి లేకపోతే దిక్కు లేనట్లు. తల్లి దగ్గరుంటే బాధ లేదు. ముసలితనం లాగ లేదు. దరిద్రుడైనా 'అమ్మా' అంటూ ఇంటికే చేరుతాడు. పుత్ర పౌత్ర సంపన్నుడైనా తల్లిదగ్గర ఉన్నవాడు వయస్సు నూరుసంవత్సరాలు అయినా రెండేళ్ళ బిడ్డలాగానే ప్రవర్తిస్తాడు. కొడుకు సమర్థుడైనా, అసమర్థుడైనా, బలహీనుడైనా, బలవంతుడైనా, తల్లి కాపాడుతూనే ఉంటుంది. తల్లితప్ప మరొకరు విధిపూర్వకంగా బిడ్డలను సాకలేరు. తల్లిని కోల్పోయి నప్పుడే కొడుకు వృద్ధుడవుతాడు. దుఃఖానికి లోనవుతాడు. అప్పుడే ప్రపంచమంతా శూన్యంగా బిడ్డకు అనిపిస్తుంది. **తల్లితో**

* పితా ధర్మః పితా స్వర్గః పితా హి పరమం తపః ।
పితరి ప్రీతిమాపన్నే సర్వాః ప్రీయంతి దేవతాః ॥ 21

సమానమైన నీడలేదు. తల్లితో సాటిరాగల గతి లేదు. తల్లితో సమానమైన రక్షణలేదు. తల్లివంటి ప్రియవస్తువు లేదు.* గర్భంలో మోస్తుంది కాబట్టి ధాత్రి. జన్మ నిస్తుంది కాబట్టి జనని. శరీరాన్ని పోషిస్తుంది కాబట్టి అంబ. వీరులనుగా తీర్చి దిద్దుతుంది కాబట్టి వీరపుత్ర. శిశువుకు శుశ్రూష చేస్తుంది కాబట్టి శుశ్రువు. తల్లియే సన్నిహిత శరీరం. తలలో ఆలోచనలున్నంతకాలం బుద్ధిగల ఏ కొడుకూ తల్లిని చంపలేడు.

తల్లిదండ్రులు సమాగమకాలంలో సత్సంతానాన్ని అభిలషిస్తారు. తల్లిదండ్రు లిద్దరిలో ఆకోరిక ఉన్నా వాస్తవానికి అది తల్లిలోనే నికరంగా ఉంటుది. పుత్రుని గోత్రాన్ని, పుత్రుని తండ్రిని తెలిసినది తల్లి ఒక్కటే. తల్లి గర్భంలో ధరిస్తుంది కాబట్టి ఆమెకు బిడ్డపై ప్రేమ మిక్కుటం. తండ్రి పిల్లలకు అధికారి మాత్రమే. స్వయంగా పాణిగ్రహణం చేసి, సహధర్మచారిణినిగా అంగీకరించి, పురుషులు అన్యస్త్రీల సమాగమం కోరుకొంటే అది స్త్రీల తప్పు కాదు. స్త్రీని భరిస్తాడు కాబట్టి భర్త. రక్షిస్తాడు కాబట్టి పతి. ఆ గుణాలు లోపిస్తే అతడు భర్తా కాదు, పతీ కాదు. ఇలా ఆలోచిస్తే స్త్రీ ఎప్పుడూ తప్పు చేయదు. మగవాడే తప్పు చేస్తాడు. వ్యభిచారమనే మహాదోషాన్ని మగవాడే చేస్తాడు. కాబట్టి అతడే దోషి. **స్త్రీకి భర్తయే పరముడు. భార్యకు భర్తయే పరదేవత. నాతల్లి శరీర వేషభూషాదులలో తండ్రివలె నున్న వానికి తనను అర్పించుకొన్నది.** ఇటువంటి పరిస్థితిలో స్త్రీ తప్పు ఏమీలేదు. మగవానిదే తప్పు. అబలాత్వం స్త్రీని సర్వకార్యాలలోనూ వివశురాలిని చేస్తుంది. కాబట్టి పరాధీన అయిన ఆమె నిరపరాధిని. స్త్రీ మైథునతృప్తిని కోరుతూ ఎలాంటి సంకేతాన్నీ ఇవ్వకపోయినా, ఆమెలో కామాన్ని ఉద్దీపింపజేస్తే అది నిస్సంశయంగా పురుషుని అధర్మప్రవర్తనమే. ఇలా ఆలోచిస్తే స్త్రీ, అందునా తల్లి కాబట్టి చంపదగదు. అంతేగాక తండ్రి కన్న తల్లికే గౌరవమెక్కువ. నా తల్లి ఆ స్థానంలో నున్నది. జ్ఞానంలేని పశువులు కూడా స్త్రీని, తల్లిని చంపరాదనే భావిస్తాయి. తండ్రి అంటే ఒక్కటిగా చేరిన దేవతల సమూహమంటారు. కానీ స్నేహంకారణంగా దేవతలూ, మానవులూ కూడా గుమిగూడి తల్లిలో ఉంటారు.'

చిరకారి కాబట్టి ఈ రీతిగా ఎంతగానో ఆలోచిస్తూనే ఉన్నాడు. చాలా కాలం గడచిపోయింది. అంతలోనే తండ్రి మరలివచ్చాడు. మహాజ్ఞానీ, తపోనిష్ఠుడు అయిన మేధాతిథి గౌతముడు భార్యను చంపటంలోని అనౌచిత్యాన్ని గూర్చి ఆలోచించి, బాధపడ్డాడు.

---

* **నాస్తి మాతృసమా ఛాయా నాస్తి మాతృసమా గతిః ।**
నాస్తి మాతృసమం త్రాణం నాస్తి మాతృసమా ప్రియా ॥ 31

దుఃఖంతో కన్నీరు కారుస్తూ కూడా వేదాధ్యయన ధైర్య ప్రభావం వలన తనను తాను సంబాలించుకొని, పశ్చాత్తాపపడుతూ ఇలా అనుకొన్నాడు. 'త్రిలోకాధిపతి అయిన ఇంద్రుడు బ్రాహ్మణస్వరూపాన్ని ధరించి నా ఆశ్రమానికి వచ్చాడు. నేను అతిథివ్రతాన్ని పాటిస్తూ ఆదరవచనాలతో అనునయించి, స్వాగత సత్కారాలు చేసి, తగిన రీతిగా అర్ఘ్యపాద్యాదుల నిచ్చి, యథావిధిగా నేనే స్వయంగా పూజించాను. ఆయన ఆనందిస్తాడన్న ఆలోచనతో "నేను నీ అధీనంలో ఉన్నాను" అని కూడా అన్నాను. కానీ ఇంద్రుని లోలుపత్వం వలన ఇక్కడ జరగకూడనిది జరిగింది. నా భార్య తప్పేమీ లేదు. ఇలా చూస్తే నా భార్యతప్పులేదు. నా తప్పు లేదు. బాటసారిగా, అతిథిగా వచ్చిన ఇంద్రుని తప్పు లేదు. నేను స్త్రీని చంపమని ఆదేశించి ధర్మవిషయంలో పొరపాటుపడ్డాను. ఈ అపరాధానికి అదే మూలం. ఊర్ధ్వరేతస్కులైన మునులు ఏమరుపాటువలననే ఈర్ష్యా జనితమైన ఇబ్బంది కలుగుతుందన్నారు. ఈర్ష్య నన్ను పాపసముద్రంలో ముంచింది. నేను మునిగిపోయాను. భార్యగా ఇంటిలో ఆశ్రయమిచ్చాను. ఆమె పతివ్రత. భార్య కాబట్టి భరించి పోషించవలసిన బాధ్యత నాదే. అటువంటి ఆమెను నా ఏమరు పాటువలన వ్యసనానికి లోనయి, ఆమెను చంపమన్నాను. ఇప్పుడు ఈ పాపంనుండి నన్నెవరు బయటపడవేయగలరు. అయితే నేను ఉదారబుద్ధి అయిన చిరకారిని తల్లిని చంపమని ఆదేశించాను. నిజంగా వాడు ఈ రోజు చిరకారి అయితే నన్ను ఈ పాపం నుండి రక్షిస్తాడు. చిరకారిక ! నీకు శుభంగలుగుగాక ! చిరకారికా ! నీకు మేలు జరుగుగాక ! ఈ రోజు నీవు చిరకారిఅయితే నీవు నిజంగా చిరకారికుడవే. ఈ రోజు చిరకారికుడవై నన్ను, నీ తల్లిని, నేను సముపార్జించిన తపస్సును, నిన్ను కూడా పాపంనుండి బయటపడవేయి. నీవు మరీమేధావివి కాబట్టి చిరకారిత్వం నీకు సహజగుణం. అది ఇప్పుడు సఫలం కావాలి. ఈ రోజు నీవు నిజంగా చిరకారివి కావాలి. నీ తల్లి చాలా కాలం నీ జననాన్ని ఆశించింది. చాలా కాలం గర్భంలో ధరించింది. కాబట్టి నేడు నీవు నీ తల్లిని రక్షించి, చిరకారిత్వాన్ని సఫలం చేయి. ఎంత సంతాపం కలిగినా ప్రతిక్రియ చేయటంలో ఆలస్యాన్ని వీడడు. నివారిస్తున్నా సరే నిదురపోతూనే ఉంటాడు. ఈ రోజు మా (తల్లిదండ్రుల) సంతాపాన్ని చూసి, నిజంగా చిరకారి కావాలి.'

రాజా ! ఆ రీతిగా బాధపడుతూ గౌతమమహర్షి తనకు దగ్గరలోనే ఉన్న చిరకారిని చూశాడు. చిరకారి తండ్రిని చూసి, తీవ్రంగా దుఃఖించి, ఆయుధాన్ని వీడి, తండ్రి పాదాలపై తలవాల్చి, అనునయించ నారంభించాడు. గౌతముడు శిరసా పాదాలపైబడిన కుమారుని, నిశ్చేష్టయై నిలిచిన భార్యను చూసి, పరమానందాన్ని పొందాడు. ఏకాంతవనంలో ఆశ్రమంలో నివసిస్తున్న ఆ మహాత్ముడు గౌతముడు భార్యను కానీ, ఏకాగ్ర చిత్తుడైన

పుత్రుని కానీ తరువాత ఎప్పుడూ దూరం చేసికొనలేదు. గౌతముడు తన పనులకై ఆశ్రమాన్ని వీడివెళ్ళిన తర్వాత చిరకారి శస్త్రపాణియై నిలిచికూడా, వినయంతో ఏదో ఆలోచిస్తూనే ఉన్నాడు. అందువలన తండ్రిమాటను అమలుచేయలేక పోయాడు. తన పాదాలపై బడిన కుమారుని చూసి, తండ్రి చిరకారి భయపడి, ఆయుధాన్ని పట్టే చాపల్యాన్ని అణచుకొన్నాడని భావించాడు. ఆ తరువాత తండ్రి చిరకారిని చాలాసేపు స్తుతించి, చాలాసేపు శిరస్సున మూర్కొని, చాలాసేపు భుజాలతో కౌగిలించి "చిరంజీవ" అని దీవించాడు. ఈ రీతిగా ప్రీతిహర్షాలతో కూడి మహాప్రాజ్ఞుడైన ఆ గౌతముడు కుమారుని అభినందించి, ఇలా అన్నాడు. 'చిరకారికా ! నీకు మేలు జరగుతుంది. చిరకారీ ! చిరంజీవ! సౌమ్యుడా ! నీ ఆలస్యం వల్ల దీర్ఘకాల దుఃఖానికి లోనుగాక నిలిచాను.' మునిశ్రేష్ఠుడైన గౌతముడు చిరకాలం ఆలోచించి పనిచేసే ధీరులలోని గుణాలను గూర్చి గాథలను కూడా పలికాడు.

చాలాకాలం ఆలోచించి స్నేహం చేయాలి. విడిపోవలసి వస్తే బాగా ఆలోచించి విడిపోవాలి. చిరకాల మాలోచించి చేసిన స్నేహమే చిరకాలం నిలుస్తుంది. రాగం, దర్పం, అభిమానం, ద్రోహం, పాపకర్మ, అప్రియ కార్యం - ఇవి చేయవలసినప్పుడు బాగా ఆలోచించి చేసేవాడే ప్రశంస నందుతాడు. బంధువులు, మిత్రులు, భృత్యులు, స్త్రీలు, నిరూపణ కాని అపరాధాలు - వీటివిషయంలో ఆలోచించి చేసేవాడే ప్రశంస నందుతాడు.' కౌరవ్యా ! భారతా ! ఈ విధంగా గౌతముడు తనపుత్రుని ఆలస్యంగా పనిచేసే స్వభావంవలన ఎంతో సంతోషించాడు. ఈ ప్రకారంగా సర్వకార్యాలయందు దీర్ఘంగా ఆలోచించి, నిశ్చయించి, పనిచేసినవాడు దీర్ఘకాల దుఃఖానికి లోనుకాడు. రోషాన్ని చాలాకాలం నియంత్రించుకొని, ప్రతీకార కర్మను చిరకాలం నియంత్రించుకొని పనిచేసేవాడు పశ్చాత్తాపపడవలసిన పని ఏదీ చేయడు. దీర్ఘకాలం పెద్దలను సేవించాలి. చిరకాలం వారి సాంగత్యాన్ని పొంది, పూజించాలి. చిరకాలం ధర్మాన్ని సేవించాలి. దీర్ఘకాలం ధర్మానుసంధానం చేయాలి. **పండితులతో చిరకాలం సాంగత్యాన్ని పొందాలి. చిరకాలం శిష్టులను సేవించాలి. చిరకాలం మనస్సును అదుపు చేసికొనగలగాలి. అప్పుడే చిరకాలం హేళనకు గురికాడు.** ధర్మోపదేష్టలు కూడా ఎవరైనా ఏదైనా ప్రశ్నించినప్పుడు దీర్ఘకాలం ఆలోచించియే సమాధానమివ్వాలి. అప్పుడే చిరకాలం పశ్చాత్తాపపడవలసిన పరిస్థితి రాదు. విప్రుడు, మహాతపస్వి అయిన గౌతముడు ఆ ఆశ్రమంలో చాలా సంవత్సరాలు గడిపి, ఆ పై పుత్రునితో సహా స్వర్గానికి వెళ్ళాడు.

267. ద్యుమత్సేన సత్యవంతుల సంవాదము.

యుధిష్ఠిరుడు అడిగాడు. పితామహా ! ఎవరినీ హింసించకుండా రాజు ప్రజలను ఎలా రక్షించాలి ? దీన్ని గురించి నాకు తెలుపు.' భీష్ముడు చెపుతున్నాడు. 'ఈ విషయంలో కూడా ఒక పూర్వేతిహాసం చెపుతారు. సత్యవంతునికి ద్యుమత్సేనునికి జరిగిన సంవాదం అది. అది ఇలా విన్నాం. తండ్రి ఆజ్ఞతో కొంతమందిని వధించటానికి తీసుకొని వెడుతున్నారు. అపుడు సత్యవంతుడు తండ్రి దగ్గరకు వెళ్లి సాహసించి, ఇలా అన్నాడు. "తండ్రీ ! ఒక్కొక్కప్పుడు ధర్మం అధర్మం అవుతుంది. అధర్మం ధర్మంగా పరిణమిస్తుంది. ఆ పరిస్థితిలో ప్రాణి వధ ధర్మం అవుతుందా ? అలా ఎన్నడూ కాకూడదు కదా !" అపుడు ద్యుమత్సేనుడు ఇలా చెప్పాడు. 'సత్యవంతా ! అపరాధిని వధించకపోవటం ధర్మమే అయితే ఇక అధర్మం ఏముంటుంది ? దొంగలను చంపకపోతే ధర్మ, వర్ణ సాంకర్యం ఏర్పడుతుంది. 'కలియుగం వచ్చాక ఇది నాది. అతనిది కాదు' అని ఇతరుల ధనం దోచుకొంటారు. ఇలా అయితే లోకయాత్ర సాగదు. నీకు తెలిస్తే చెప్పు.' అపుడు సత్యవంతుడు ఇలా చెప్పాడు. 'క్షత్రియాది వర్ణాలు మూడింటిని బ్రాహ్మణాధీనం చెయ్యాలి. నాలుగు వర్ణాలవారూ ఇలా ధర్మబద్ధులయితే ఇతరులు కూడా అలాగే ప్రవర్తిస్తారు. అలా ప్రవర్తించని వానిని గురించి బ్రాహ్మణుడు "ఇతడు నా మాట వినటం లే"దని చెప్పాలి. అపుడు రాజు అతనిని దండిస్తాడు. తత్త్వాన్ని భేదింపకుండా శాస్త్రం ప్రయోగించాలి. మరోవిధంగా చేయరాదు. (అనగా మనిషిని చంపరాదు). నీతి శాస్త్రాన్ని సమీక్షించకుండా దండనం విధించరాదు. ఎక్కువ అపరాధం చెయ్యని దొంగలను చంపితే వారి భార్యా పుత్రులను, తలిదండ్రులను చంపినట్లే. అందుచేత దండం విధించేటప్పుడు చక్కగా ఆలోచించి విధించాలి. ఒకప్పుడు సత్సాంగత్యం వలన దుర్జనుడు కూడా మంచి శీలం అలవరచుకొంటాడు. సత్సాంగత్యం వలన దుర్జనులకు కూడ సత్ప్రవర్తన కలవారు పుట్టవచ్చును. అందుచేత మరణదండన విధించి, మూలచ్ఛేదం చేయరాదు. ఇది సనాతన ధర్మం కాదు. స్వల్ప మయిన దండనతో ప్రాయశ్చిత్తం విధించాలి. సంపదనంతా స్వాధీనం చేసుకొంటామని భయపెట్టటమో, బంధించటమో, విరూపిని చేయటమో విధించాలి. అంతేకాని వధ అనే దండం విధించి కుటుంబాన్ని బాధించరాదు. అపరాధి పురోహితుని శరణం పొందితే కూడా వానిని వధించరాదు. 'ఇటువంటి తప్పు పని మేము చెయ్యమని పురోహితుని శరణుకోరిన అపరాధిని విడిచిపెట్టాలి. ఇది బ్రహ్మశాసనం. ముండనం చేసుకొని, దండమూ, జింకచర్మమూ ధరించిన సన్యాసి అయిన బ్రాహ్మణుడు కూడా ఈ బ్రహ్మశాసనానికి అర్హుడే. మళ్లీ మళ్లీ తప్పులు చేస్తుంటే ధర్మాధికారులు వారిని శిక్షించవచ్చును. మొదటి

తప్పుకు వదలినట్లు వదలరాదు.'

ద్యుమత్సేనుడు ఇలా అన్నాడు. వీలయినంత వరకూ ధర్మ వర్తనలో నియమించగలిగితే అది ధర్మమే, ధర్మోల్లంఘనం జరగకుండా ఉండే వరకూ ఈ శాసనం తగినదే. ధర్మోల్లంఘనం చేసేవారిని కూడా దండించకపోతే వారు అందరినీ పరాభవిస్తారు. పూర్వమూ, ఇంకా పూర్వమూ కూడా ప్రజలను తేలికగా శాసించే వారు. వారు మృదు శీలం, సత్యనిష్ఠ కల్గి ఉండేవారు. కోపం, ద్రోహం చాలా తక్కువగా ఉండేవి. బాగా పూర్వకాలంలో 'ధిక్' అని అసహ్యించుకొనేవారు. అదే వారికి పెద్ద శిక్ష. తరువాత నిందించడం శిక్షగా భావించారు. ఇది వాగ్దండం. వాగ్దండం తరువాత అర్థదండం ఏర్పడింది. అనగా అపరాధి ఆస్తిని రాజు స్వాధీనం చేసుకోవటం మొదలయింది. ఇప్పుడు వధదండం అమలులో ఉంది. మరి కొంతమందిని ఈ శిక్షతో కూడా నియంత్రించలేక పోతున్నాను. చోరులు మానవులకూ, దేవతలకూ కూడా ఆత్మీయులు కారు. గంధర్వులకు, పితృదేవతలకూ కూడా సంబంధించరు. అసలు చోరుడు ఎవని వాడూ కాదు. కొందరు శ్మశానం నుండి, పిశాచాదుల నుండి పద్మాది అలంకారాలు, దేవతాలంకారాలు దొంగిలిస్తారు. అటువంటి బుద్దిలేని వారిని ఎవరు నియమించగలరు ? సత్యవంతుడు చెప్పాడు. **దొంగలను వధించి సజ్జనులను రక్షించలేకపోయినా, అహింసా మార్గంలో దొంగలను సజ్జనులుగా మార్చలేకపోయినా. త్రికాలాలోని వారి పారమార్థిక లాభం దృష్టితో ఒక ఉత్తమ ఉపాయంతో వారి చోర వృత్తిని అంతం చేయవచ్చును.** తమ ప్రజల జీవనయాత్ర కోసం రాజులు ఉత్తమ తపస్సు చేస్తూ ఉంటారు. ఇటువంటి దొంగలను చూసి సిగ్గుపడి, ఆ రాజులు అటువంటి ప్రవృత్తిని అలవరచుకొంటారు.

దండ భయం పెట్టి ప్రజలను ధర్మవర్తనులుగా రాజులు చేస్తారు. ఇష్టం వచ్చినట్లు దండించరు. ఇట్టి సత్ప్రవర్తనతోనే రాజులు చాలా కాలం ప్రజలను పరిపాలిస్తారు. ప్రజలందరు ఉత్తము డయిన రాజునే అనుసరిస్తారు. సహజంగా మానవులు ఉత్తములను అనుసరిస్తారు కదా ! రాజు తన మనస్సును నిగ్రహించకుండా, ఇంద్రియవశుడై ప్రవర్తిస్తూ, ప్రజలను నియంత్రించా లనుకొంటే, ఆ రాజును చూసి ప్రజలు పరిహసిస్తారు. దంభమోహాలతో ఎవరయినా రాజుపట్ల అనుచితంగా ప్రవర్తిస్తే అతనిని అన్ని ఉపాయాలతోనూ నియంత్రించాలి. అపుడతడు ఆ పాపం నుండి నివారింపబడతాడు. **చెడ్డపనిని నియంత్రించే ముందు రాజు తనను తాను నియంత్రించుకోవాలి. తరువాత బంధువులను కూడ మహాదండంతో శిక్షించాలి.** పాపాలు చేసే నీచుడు మహాదుఃఖం పొందకపోతే ఆ రాజ్యంలో పాపాలు పెరిగి పోతాయి. ధర్మాలు తరిగిపోతాయి. ఇది నిశ్చయం. నాయనా !

ఒక కరుణాపరుడు నాకీ ఉపదేశం చేశాడు. అపుడతడు "నాకీ ఉపదేశం నన్ను ఓదారుస్తూ నా తాతలు చేశారు" అని చెప్పాడు. అందుచేత ధర్మం నాలుగు పాదాలతో నడిచే కృతయుగంలో రాజులు అహింసాపూర్వకంగానే ప్రజలను పాలించారు. త్రేతాయుగంలో ఒకపాదం ధర్మం తగ్గింది. ద్వాపరయుగంలో రెండు పాదాలు తగ్గాయి. కలియుగంలో ఒక పాదమే మిగిలింది ధర్మం. అలా కలియుగం వచ్చాక రాజు యొక్క దుష్ప్రవర్తనతోనూ, కాల ప్రభావంతోనూ ధర్మంలో పదహారో భాగం మాత్రమే 1/16 మిగులుతుంది. అహింసాత్మక దండంతో ధర్మాధర్మాలకు సంకరం ఏర్పడితే దండింపబడే వ్యక్తి యొక్క వయస్సు, శక్తి, కాలం – వీటిని బట్టి దండించాలి. స్వాయంభువ మనువు ప్రాణులపై కృప చూపించటానికే ధర్మం ఉపదేశించాడు. సత్యరూపు డయిన పరమాత్మను పొందటమే ధర్మం యొక్క మహాఫలం. దాన్ని విడవరాదు.'

268. సూ్యమరశ్మి కపిలుల సంవాదము.

యుధిష్ఠిరుడు ఇలా అడిగాడు. 'పితామహా ! ప్రాణులకు విరోధం లేకుండా, మానవులకు శమదమాది షడ్గుణాలను కలిగించే యోగం, భోగమోక్షాలు రెండూ కలిగించే ధర్మాన్ని తెల్పు. పితామహా ! గృహస్థ ధర్మమూ, యోగ ధర్మమూ ఈ రెండూ దగ్గర దగ్గరగానే ఉంటాయి. వీనిలో ఏది శ్రేయస్కరమో చెప్పు.' భీష్ముడు ఇలా చెపుతున్నాడు. 'రెండు ధర్మాలూ ఆత్మగుణ పూర్ణాలే. ఆచరించటానికి కష్టమైనవే. అయితే మహాఫలాన్ని ఇస్తాయి. రెండూ పూర్వం సజ్జనులు ఆచరించినవే. పార్థా ! ఈ రెండు ధర్మాల ప్రామాణ్యాన్నీ చెపుతాను. నీ ధర్మార్థ సంశయాలను తొలగిస్తాను. ఏకాగ్రతతో విను. పూర్వం ఈ విషయమై కపిల మహర్షికి, ఒక గోవునకు జరిగిన సంవాదం ఉదాహరిస్తారు. అది విను చెపుతాను.

పూర్వం నహుషుడనే రాజు ప్రాచీనమూ, శాశ్వతమూ, స్థిరమూ అయిన ఆమ్నాయాన్ని అనుసరించేవాడు. అతడు తనయింటికి అతిథిగా వచ్చిన 'త్వష్ట'కోసం గోవును ఆలంభనం చేయబోయాడు. అపుడు ఆ గోవును కపిల మహర్షి చూశాడు. అతడు సాత్వికుడు. చక్కని సంయమం కలవాడు. జ్ఞాని, మితాహారి. అతని బుద్ధి ఉత్తమం, నిర్భయం, స్థిరం. సద్భావంతోను, ఉత్సాహంతోను కూడినది. అటువంటి బుద్ధితో కపిల మహర్షి "హా వేదమా" ! అన్నాడు ఒక్కసారి. (అనగా "వేదం పేరుతో ఎంత అధర్మం జరుగుతోందో !" అని అభిప్రాయం. వేదం అసలు ప్రమాణం అవునా

కాదా ! అని). అపుడు స్యూమరశ్మి అనే మహర్షి ఆ గోవులో ప్రవేశించి, కపిలునితో ఇలా అన్నాడు. "వేదాలు ప్రమాణమా అని సందేహం కలిగితే ఇతర ధర్మ శాస్త్రాలను ఏ ఆధారంతో ప్రమాణంగా భావిస్తారు ?" అని అడిగాడు. తపస్సులై, ధృతిమంతులై, వేదవిజ్ఞానదృష్టి కల ఋషులు "వేదం పరమేశ్వరుని నిశ్శ్వాస"మని భావిస్తారు. "ఆశలు లేవు - తాపంలేదు - కోరికలు లేవు - ప్రయత్నాలు లేవు. అటువంటి పరమేశ్వరుని నిశ్శ్వాసంతో పుట్టిన వేదం గురించి విపరీతంగా ఎందుకు భావిస్తున్నారు ?"

అపుడు కపిల మహర్షి ఇలా అన్నాడు. 'నేను వేదాలను నిందించటం లేదు. విపరీతార్థాలు చెప్పటం లేదు. బ్రహ్మచర్యం మొదలయిన ఆశ్రమాలన్నిటిలోని కర్మల ఉద్దేశ్యం ఒకటే అని విన్నాను. సన్యాసి పరమపదం చేరుతున్నాడు. అలాగే వానప్రస్థుడూ చేరుతున్నాడు. గృహస్థు, బ్రహ్మచారి కూడా పరమపదం చేరుతున్నారు. నాలుగు ఆశ్రమాలూ శాశ్వత దేవయానా లనే చెప్పబడ్డాయి. ఇందులో ఎక్కువ తక్కువలు, బలాబలాలు వాటి ఫలాలను బట్టి చెప్పబడతాయి. ఈ విషయం తెలిసి సర్వకార్యాలూ ఆరంభించాలని వైదికమతం చెపుతుంది. కాని వేదంలో మరొకచోట కర్మలను ఆరంభించవద్దని సిద్ధాంతంగా కూడా వినిపిస్తుంది. **యజ్ఞాదులలో ఆలంభం చేయకపోతే దోషం లేదు. ఆలంభనం చేస్తేనే ఎక్కువ దోషం. ఇలా శాస్త్రం చెపుతున్నపుడు ఈ రెంటిలో ఏది బలీయమో, ఏది దుర్బలమో చెప్పటం కష్టం.** వేదాలు, ఆగమాలు తప్ప ఇతరత్ర హింసను బోధించే శాస్త్రం యొక్క ఫలం ఏదయినా, యుక్తితో కాని, ప్రత్యక్షంగా కాని నీవు గమనించావా చెప్పు !' అపుడు స్యూమరశ్మి ఇలా చెప్పాడు. 'స్వర్గం కోరుకొనే వారు యజ్ఞం చెయ్యాలి' అని వేదం ఎపుడూ చెపుతూనే ఉంది. మానవుడు మొదట ఫలం సంకల్పించి, తరువాతనే యజ్ఞం ప్రారంభిస్తాడు. గొట్టె, గుఱ్ఱం, మేక, గోవు, పక్షులు, గ్రామాలలోని, అరణ్యాలలోని ఓషధులు, సస్యాలు, ప్రాణానికి అన్నం అని శ్రుతి చెపుతోంది. ప్రతిరోజూ ప్రొద్దుట, సాయంకాలమూ, ప్రాణానికి ఆహారంగా అన్నం చెప్పబడింది. పశువులు, ధాన్యం, యజ్ఞానికి అంగం అని కూడా వేదం చెపుతోంది. వీటి నన్నిటిని ప్రజాపతి యజ్ఞంతో పాటు సృష్టించాడు. ఆ ప్రజాపతియే దేవతలచేత ఈ సామగ్రితో యజ్ఞాలు చేయించాడు. ఏడు విధాలుగా చెప్పబడిన ఈ గ్రామ్యప్రాణులూ, ఆరణ్య ప్రాణులూ ఒక దాని కంటె మరొకటి శ్రేష్ఠాలు - వీనిలో ఉత్తము డయిన పురుషుడు కూడ యజ్ఞానికే ఉద్దేశింపబడినాడు. పూర్వులు అందరూ వీటి నన్నిటినీ యజ్ఞాంగాలుగానే చెప్పారు. అందుచేత పండితు డెవడయినా తన శక్తికి అనుగుణమైన దానిని తప్పక

ఎంచుకొంటాడు. మనుష్యులూ, పశువులూ, వృక్షాలూ, ఓషధు లన్నీ స్వర్గాన్నే కోరుతున్నాయి. యజ్ఞంతో కాక మరొకదానితో స్వర్గం లభించదు. ఓషధులు, పశువులు, వృక్షాలు, లతలు, నెయ్యి, పాలు, పెరుగు, హవిస్సు, భూమి, దిక్కులు, శ్రద్ధా, కాలం అనే పన్నెండు (తరువాతి శ్లోకంతో అన్వయం) ఋక్కులు యజుస్సులు, సామలు, యజమాని, (ఇక్కడికి 16), గార్హపత్యాగ్ని (17) ఇవన్నీ (యజ్ఞాంగాలు) ఈ 17 యజ్ఞానికి అంగాలు. ప్రపంచమంతటికీ యజ్ఞం మూల మని వేదం చెపుతోంది. నెయ్యి, పాలు, పెరుగు, గోమయం, చర్మం, తోకలు, కొమ్ములు, పాదాలు - వీటితో గోవు యజ్ఞాన్ని సంపన్నం చేస్తుంది. యజ్ఞానికి విధింపబడిన వన్నీ ప్రత్యేకంగా ఇలా సంపాదించుకోవాలి. దక్షిణలతో కూడి ఋత్విక్కులు యజ్ఞాన్ని నిర్వహిస్తారు. ఈ వస్తువు లన్నిటిని సమకూర్చుకొని యజమానుడు యజ్ఞం నిర్వర్తిస్తాడు. ఈ వస్తువులు యజ్ఞంకోసం సృష్టింపబడ్డాయని శ్రుతి చెప్పిన మాటలు యథార్థాలే. పూర్వు లందరూ ఇలా యజ్ఞాలు నిర్వర్తించారు. నిష్కామంగా, తన కర్తవ్యంగా భావించి, యజ్ఞం చెయ్యాలి. అలా చేసేవాడు ఎవరినీ హింసించినట్లు కాదు. ఎవరికీ ద్రోహం చేసినట్లు కాదు. అహంకారంతో చేసినట్లు కాదు. యజ్ఞవిధానంలో వరుసగా చెప్పబడిన యజ్ఞాంగా లన్నీ యథావిధిగా ప్రయోగిస్తే, పరస్పరం ఉపకరించుకొని, సమగ్ర ఫలం ఇస్తాయి. ఆమ్నాయం / సంప్రదాయం / ధర్మశాస్త్రం ఋషులు నిర్దేశించినట్లు గమనిస్తున్నాం. దానిలోనే వేదాలు నిలిచిఉన్నాయి. బ్రాహ్మణాలలో కనిపిస్తున్నందు వల్ల విద్వాంసులు ఆ సంప్రదాయ బద్ధమయిన వేదాలను పరంపరగా అనుశీలిస్తున్నారు. బ్రాహ్మణుల / బ్రాహ్మణాల నుండి యజ్ఞం పుట్టింది. బ్రాహ్మణులకే అర్పించబడుతోంది. జగత్తు అంతా యజ్ఞాన్ని అనుసరిస్తుంది. యజ్ఞమూ జగత్తునే సదా అనుసరిస్తుంది. 'ఓమ్' అనేది వేదాలకు మూలం. ఓమ్, నమః, స్వాహా, స్వధా, వషట్ - ఇవి యథాశక్తిగా ప్రయోగింపబడితే యజ్ఞం సమగ్రంగా చేసినట్లు భావింపబడుతుంది. యజ్ఞకర్తకు మూడు లోకాలలోను భయం లేదు. ఈ విషయం వేదాలు, సిద్ధులు, మహర్షులు చెపుతున్నారు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, సామవేదంలోని స్తోభాలు ఇవన్నీ నేర్చిన వాడే ద్విజుడు. అగ్నికార్యంవలన, సోమయాగంవలన, ఇతర మహాయజ్ఞాలవలన కలిగే ఫలం ఏమిటో తమకు తెలిసినదే. విప్రోత్తమా ! అందుచేత నిర్విచారంగా బ్రాహ్మణుడు యజ్ఞం చేయవచ్చు, చేయించవచ్చు. స్వర్గవిధితో యజ్ఞం చేసినవాడు శరీరం విడిచిన తరువాత స్వర్గఫలం పొందుతాడు. యజ్ఞం చేయని వానికి ఇహలోకమూలేదు, పరలోకమూ లేదు. వేద వాదాలు తెలిసిన వారు రెంటినీ ((ప్రవృత్తి-నివృత్తి) ప్రమాణంగా భావిస్తారు."

269. గోకపిల సంవాదము - 2.

కపిల మహర్షి చెపుతున్నాడు. 'యతులు జ్ఞానమార్గాన్ని అనుసరిస్తూ పరమాత్మను దర్శిస్తారు. కనపడే ప్రపంచం వారి దృష్టిలో అశాశ్వతం. వారికి అన్ని లోకాలలోను ఏ అడ్డూ ఉండదు. శీతోష్ణాలు, సుఖ దుఃఖాలు మొదలయిన ద్వంద్వాలు వారికి ఉండవు. ఎవరికీ వారు నమస్కరించరు. ఎవరినీ ఆశీర్వదించరు. బంధాలు లేని పండితులు. పాపాలు తొలగినవారు. శుచులు, నిర్మలులు అయి సంచరిస్తూ ఉంటారు. వారు మోక్షవిషయంలో, సర్వస్వం త్యాగంచేసే విషయంలో, నిశ్చయబుద్ధికలవారు. సర్వదా పరబ్రహ్మ ధ్యానమం దుంటారు. బ్రహ్మస్వరూపులై, బ్రహ్మనే ఆలయంగా చేసుకొంటారు. వారికి శోకం, రాగం లేని లోకాలు కలుగుతాయి. ఇట్టి ఉత్తమగతి పొందిన వారికి గృహస్థాశ్రమంతో పనేమిటి ? ఏ ప్రయోజనమూ లేదు. అపుడు స్యూమరశ్మి ఇలా అన్నాడు. జ్ఞానం పొంది పరబ్రహ్మలో లీన మవటమే పరాకాష్ఠ, పరమగతి అయితే అపుడు గృహస్థాశ్రమ ప్రాధాన్యం ఇంకా పెరుగుతుంది. గృహస్థాశ్రమం లేకుండా ఏ ఆశ్రమమూ సాగదు. **తల్లిని ఆశ్రయించుకొని ప్రాణులన్నీ బ్రతుకుతున్నట్లు గృహస్థాశ్రమాన్ని ఆశ్రయించుకొనియే ఇతరాశ్రమాలు ప్రవర్తిస్తాయి.** గృహస్థుడే యజ్ఞం చేస్తాడు. గృహస్థుడే తపస్సు చేయగలడు. ఏ ప్రవృత్తిధర్మాని కయినా గృహస్థాశ్రమమే మూలం అవుతుంది. ప్రాణులన్నీ సంతానోత్పత్తి మున్నగు వానితో సుఖం అనుభవిస్తాయి. ఈ సంతానోత్పత్తి గృహస్థాశ్రమంలో తప్ప ఇతరత్ర ఎక్కడా కనపడదు. **బర్హిస్సు, (దర్భలలో ఒకరకం) ఓషధులు, (గ్రామాల వెలుపల, పర్వతాలపై పుట్టునవి) గృహస్థాశ్రమాన్ని, యజ్ఞాన్ని ఆధారం చేసుకొనియే ప్రవర్తిస్తున్నాయి. యజ్ఞంవలన మేఘాలు వర్షాలు ఓషధులు ప్రాణాలు - ఇట్లు క్రమంగా ఓషధులు ప్రాణాలవుతాయి.**

గృహస్థాశ్రమం వలన మోక్షం రాదు అని చెప్పేవారెవరు ? వారిమాట ఎలా నిజమవుతుంది. శ్రద్ధలేని మూఢులు, సూక్ష్మదృష్టిలేనివారు, చపలత్వమూ, అలసత్వమూ కలవారు, పూర్వకర్మలతో అలసి, తపించే వారు మాత్రమే సన్యాసాశ్రమం స్వీకరిస్తారు. గృహస్థాశ్రమంలో శాంతి లేదని చెపుతారు. **మూడు లోకాలకూ హితం కలిగించడమే వైదికధర్మం యొక్క శాశ్వతలక్షణం. బ్రాహ్మణు డనగా భగవంతుడే. అతడు పుట్టుక నుండీ పూజ్యుడే.** ద్విజులలో (విప్ర, క్షత్రియ వైశ్యులు) గర్భాధానానికి పూర్వం నుండి వేదమంత్రాలు ప్రవర్తిస్తాయి. లౌకిక కృత్యాలలోను, పారలౌకిక కృత్యాలలోను నిస్సంశయంగా వేదమంత్ర ప్రయోగం ఉంది. మృతునికి దహన సంస్కారం చేసేటప్పుడు,

దేహం ధరించినపుడు (జన్మించినపుడు), మృతునికి తర్పణ శ్రాద్ధాదులు చేసేటప్పుడు, గోదానాదులు చేసేటప్పుడు, పిండాలను నీటిలో నిమజ్జనం చేసేటప్పుడు కూడా వేదమంత్రాలు ఉపయోగిస్తున్నారు. అర్చిష్మంతుడు, బర్హిషదుడు, క్రవ్యాదుడు అనే పేర్లు కల పితృదేవతలు మృతుని శాంతికోసం వేదమంత్రాలను అనుమతిస్తున్నారు. సర్వధర్మాలకూ ఆ వేదమంత్రాలే మూలం. పుట్టుకతోనే జీవుడు మూడు ఋణాలతో (ఋషిఋణం, దేవఋణం, పితృఋణం)పుడుతున్నాడని వేదాలు చెపుతున్నాయి. గృహస్థాశ్రమం పాటించి, ఆ ఋణాలు తీర్చుకోకుండా మోక్షం ఎలా కలుగుతుంది ? దరిద్రులు, సోమరులు అయిన పండితులు కర్మలను విడిచి పెడితే మోక్షం వస్తుందని చెపుతారు. ఇది సత్యంకాదు. సత్యంవలె అనిపిస్తుంది. వారికి వేదపరిజ్ఞానం లేదు. అందుచేత అలా చెపుతారు. వేద శాస్త్రాల ననుసరించి యజ్ఞం చేసినవానికి పాపాలు అంటవు. దరిచేరవు. యజ్ఞంలో ఉపయోగించిన పశువులతో పాటు అతడు పుణ్యలోకాలకు చేరి, సకలభోగాలూ పొంది, ఇతరులకూ తృప్తి నిస్తాడు. వేదాలను అవమానపరిచినంత మాత్రాన, మూర్ఖతతోను, మాయతోను ఎవ్వరూ పరబ్రహ్మను పొందలేరు. వేదాన్ని అనుసరించిన వారు పరమాత్మను పొందుతారు.

కపిలుడు చెపుతున్నాడు.ధీమంతునికి దర్శం, పౌర్ణమాసం, అగ్నిహోత్రం, చాతుర్మాస్యాలు మొదలగు వానిని చేసే విధానం ఉంది. అందులోనే సనాతన ధర్మం నిలుస్తుంది. చక్కని ధైర్యమూ, శుచిత్వమూ కల సన్యాసులు పర బ్రహ్మ స్వరూపు లవుతారు. అలా హవిస్సు, స్వాధ్యాయం, సంతానం అనే అమృతాన్ని కోరే దేవ, ఋషి, పితృదేవతలను బ్రహ్మజ్ఞానామృతంతో తృప్తి పరుస్తారు. **సర్వభూతాత్మ రూపుడై, సర్వభూతాలనూ ఆత్మరూపంగా చూసే నిర్గుణుని వెదకే మార్గంలో దేవతలు కూడ మోహం చెందుతారు. మనుష్యులకు నాల్గు ద్వారాలు ఉంటాయి. అవి 1. కాళ్లు చేతులు 2. వాక్కు 3. ఉదరం 4. ఉపస్థ. వీటికి పాలకుడుగా ఉండేవానికి నిగ్రహం ఉండాలి. ఋక్, యజుస్, సామ, అథర్వ రూపాలయిన నాలుగు ముఖాలతో కూడిన పరమ పురుషుని భక్తియోగం, జ్ఞానయోగం, కర్మయోగం, అష్టాంగ యోగం అనే నాలుగు ఉపాయాలతోను పొందాలి. తెలివైనవాడు జూదం ఆడకూడదు. ఇతరుల సొమ్ము గ్రహించకూడదు. అనర్హమైన పుట్టుక కలవానిచే యాగం చేయించరాదు. కోపంతో ఎవరినీ తన్నరాదు కొట్టరాదు. ఇలా చేతుల్ని కాళ్లను రక్షించుకోవాలి. ఎవరినీ తిట్టకూడదు. అనవసరంగా మాట్లాడకూడదు. చాడీలు చెప్పకూడదు. నిందించరాదు. సత్యాన్ని నియమంతో పాటించాలి. మితంగా మాట్లాడాలి. అన్ని వేళలా ప్రమత్తుడై / జాగరూకుడై ఉండాలి. ఇలా వాక్ ద్వారాన్ని**

రక్షించుకోవాలి. అసలు తినకుండా ఉండకూడదు. ఎక్కువగా తినకూడదు. జిహ్వా చాపల్యం ఉండరాదు. సజ్జనులతోనే మైత్రి చెయ్యాలి. జీవించటానికి తగినంత ఆహారమే తినాలి. ఇలా ఉదర ద్వారాన్ని రక్షించుకోవాలి. ధర్మపత్నీత్వాన్ని విభజించరాదు. అనగా అర్థకామాల దృష్ట్యా మరొక స్త్రీతో విహరించరాదు. ధర్మపత్నితో కూడ ఋతుమతి కానపుడు సంగమించరాదు. మనసులో కూడ ఏకపత్నీ వ్రతం ఆచరించాలి. ఇలా ఉపస్థ ద్వారాన్ని రక్షించుకోవాలి. మానవుని నాలుగు ద్వారాలూ - ఉపస్థ, ఉదరం, కాలుచేతులు, మాట - వీటిని రక్షించుకొన్నవానినే ద్విజుడని అంటారు. ఈ నాలుగు ద్వారాలూ సురక్షింతగా లేనివాని సత్కర్మలన్నీ వ్యర్థాలే. వానికి తపస్సు కాని, యజ్ఞం కాని, ఆత్మచింతన కాని అన్నీ నిష్ఫలాలే అవుతాయి. పైబట్ట లేకుండా అంగవస్త్రమో, గోచియో పెట్టుకొని, వస్త్రమయినా పరుచుకోకుండా నేల మీద పండుకొనే వానిని, తన చేతిని మాత్రమే తలగడగా పెట్టుకొనే శాంత స్వభావుని దేవతలు బ్రాహ్మణునిగా భావిస్తారు. శీతోష్ణాలు, సుఖ దుఃఖాలు, నిందాస్తుతులు మొదలయిన ద్వంద్వా లనే వనాల్లో ఒంటరిగా ఆనందించే మునిని, ఇతరులను గూర్చి ఆలోచించకుండా ఉండేవానిని దేవతలు బ్రాహ్మణు డని తలుస్తారు. ఈ లోకమంతా సృష్టించిన వానిని, ప్రకృతి, వికృతులు తానే అయిన వానిని, సర్వభూతాలకు పరాయణమయిన భగవంతుని తెలిసిన వానిని బ్రాహ్మణు డని దేవతలు భావిస్తారు. **సర్వభూతాల నుండి భయం లేనివాడు, అన్ని ప్రాణులకు అభయమిచ్చేవాడు, సర్వప్రాణులకు ఆత్మరూపమయిన వాడు - వీనిని దేవతలు బ్రాహ్మణు డని అంటారు.**

ఈ బ్రాహ్మణ స్వభావాన్ని తెలియని మూడులు దాన, యజ్ఞ, కర్మల ఫలాలను తప్పించి ఇతరాలను తెలుసుకో లేకపోతున్నారు. వాటి ఫలం నిజానికి చిత్తశుద్ధి. అది తెలియక స్వర్గాది ఫలాలను కోరుతున్నారు. అనాది, శాశ్వతం, ధ్రువం, యౌగికం అయిన సదాచారాన్ని పాటించే కర్తవ్య పరాయణులయిన జ్ఞానుల తపస్సు తీవ్రంగా ఉంటుంది. ప్రవృత్తి మార్గం అవలంబించే మానవులు యోగసూత్రాల్లో చెప్పబడిన యమనియమాదులు పాటించలేరు. ఈ యౌగికాచారం ఆపదలేనిది, ప్రమాదంలేనిది, పరాభవం పొందదు. యోగశాస్త్రంలో చెప్పిన కర్మలు శ్రేష్ఠఫలాన్ని ఇస్తాయి. ఉన్నతి నిచ్చి స్థిరంగా ఉంటాయి. అయినా ప్రవృత్తి మార్గాన్ని అవలంబించేవారు వీనిని గుణరహితాలనీ, అస్థిరాలనీ (అనిశ్చితాలనీ) భావిస్తారు. గుణాల నిచ్చేవిగా భావించే యజ్ఞాదుల విధి విధానాలు తెలుసుకోవటమే కష్టం. ఒకవేళ తెలిసినా ఆచరించటం ఇంకా కష్టం. ఆచరించినా అవి నశ్వరమైన ఫలితాన్నే

ఇస్తాయి. ఈ విషయం నీవూ చూస్తున్నావు.' స్యూమరశ్మి అడుగుతున్నాడు. 'కర్మను ఆచరించు, కర్మను వదలు - ఇలా పరస్పర విరుద్ధంగా చెప్పే వేదాలు ప్రమాణం ఎలా అవుతాయి ? అసలు విడిచిపెట్టడం (త్యాగం) ఎలా ఫల మిస్తుంది ? మహాత్మా ! అది నాకు చెప్పండి.' అపుడు కపిలుడు ఇలా అన్నాడు. 'సన్మార్గంలో ఉన్న మీరు యోగమార్గ ఫలాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నారు. మీ రనుసరించే కర్మమార్గంలో ప్రత్యక్ష ఫలం ఏమిటో చెప్పగలరా ? వెంటనే స్యూమరశ్మి ఇలా అన్నాడు. 'బ్రాహ్మణా ! నేను స్యూమరశ్మిని. జ్ఞానం పొందాలని ఇక్కడకు (ఈ గోవులోనికి) వచ్చాను. శ్రేయోభిలాషినై నిష్కపటంగా నా అభిప్రాయం చెప్పాను. అంతేకాని వివాదం పెట్టుకోవాలని కాదు. ఘోరమయిన ఈ నా సంశయం తీర్చండి. సన్మార్గంలో ఉండే మీరు యోగమార్గ ఫలాన్ని ప్రత్యక్షంగా చూడవచ్చు నన్నారు. మీరు దేనిని ఆచరిస్తారు ? దాని ప్రత్యక్షఫలం ఏమిటి ? తర్కశాస్త్రాపేక్ష లేకుండా నాకు విషయం చెప్పండి. మీరు చెపితే నాకు ఆగమార్థం ఏమిటో స్పష్టంగా తెలియాలి. వేదమతాన్ని అనుసరించే శాస్త్రమే ఆగమం. తర్కశాస్త్రం, వేదార్థం నిర్ణయించే పూర్వ మీమాంస, ఉత్తర మీమాంసలు కూడా ఆగమాలే. ఆ యా ఆశ్రమాలకు విధించిన ధర్మాలను ఆ యా ఆశ్రమాలలో ఆచరించాలి. అపుడు ఆ ఆగమం సిద్ధిస్తుంది. ఇలా శాస్త్ర నిశ్చయంతో సిద్ధి ప్రత్యక్షంగా కనిపిస్తుంది. ఒకనావకు మరోపడవను కట్టితే ప్రవాహంతో కొట్టుకొని పోయి ఎవరినీ దరిచేర్చవు. మనం పూర్వము వేర్వేరు కర్మ వాసనలు కలవారం. మన కర్మమయ నౌక ఈ సంసార సాగరం నుండి మనలను ఎలా తరింపజేస్తుంది ? నేను తమ శరణుకోరుతున్నా. నాకు ఉపదేశించండి. నిజానికి ఈ ప్రపంచంలో త్యాగి కాని, సంతృప్తుడు కాని, శోకరోగాలు లేనివాడు కాని లేడు. కర్మ చేయాలనే కోరికలేని వాడూ లేడు. అలాగే ఆసక్తిలేనివాడు కాని, కర్మలను పూర్తిగా విడిచిన వాడు కాని ఉండడు. మావలె మీరూ సంతోషిస్తున్నారు. దుఃఖిస్తున్నారు. సర్వప్రాణులకూ, తమకూ శబ్ద స్పర్శాది విషయ గ్రహణం సమానంగానే ఉంది. ఇలా అన్ని వర్ణాలవారూ, అన్ని ఆశ్రమాల వారూ కర్మలు చేయటానికి మూలం సుఖపడాలనే కోరికే. నశించని ఆ సుఖం ఏమిటో తెలపండి.'

కపిలుడు చెపుతున్నాడు. 'ఆ యా శాస్త్రాలు చెప్పిన అర్థాలను ఆచరిస్తే అవి సఫలమవుతాయి. సాధనానికి తగిన ఆచరణ చేస్తే అక్కడ అక్షయమైన సుఖం దొరకుతుంది. **జ్ఞాన మార్గాన్ని అనుసరిస్తే ఆ జ్ఞానమే సంసారాన్ని దాటిస్తుంది. జ్ఞాన రహితమైన కర్మ ప్రజలను జవనమరణ చక్రంలో పడవేసి వశింపజేస్తుంది.** మీరు జ్ఞానులు. ఈ విషయం అందరికీ తెలుసు. మీరు రోగ రహితులు. కాని మీలో ఎవరైనను

ఏకాత్మతను పొందారా ? (అందరిలోని ఆత్మ ఒకటే అనే జ్ఞానాన్ని అనుభవించారా ?) తాత్త్వికంగా శాస్త్రం తెలియకుండానే కొంతమంది తమ వాద పటిమతో రాగద్వేషాదులకు లోనయి అహంకారానికి వశ మవుతారు. **శాస్త్రాల యథార్థ తత్త్వం తెలియకుండా శాస్త్రానికి అర్థం చెప్పేవారు శాస్త్రచోరులు. అలాగే పరబ్రహ్మను గూర్చి తాత్త్వికంగా తెలియనివారు బ్రహ్మచోరులు. వారు శమదమాది సాధనాలు లేక దంభ, మోహాలకు వశ మయి ప్రవర్తిస్తారు. వారికి ఫలరాహిత్యమే కనిపిస్తుంది. జ్ఞానం, ఐశ్వర్యం మొదలయిన గుణాలను ముందు తనలో తెలుసుకొని తరువాత ఇతరులకు వాటిని చేకూర్చటానికి ప్రయత్నించాలి. (రాయి మునుగుతుందికాని ఇతరులను ఉద్ధరించలేదు.) వారి శరీరాలు తమఃశరీరాలు. వారు తమస్సులోనే లీన మవుతారు.** ప్రతీప్రాణీ తమ స్వభావానికి వశమై ప్రవర్తిస్తుంది. వారిని ద్వేషం, కామం, క్రోధం, దంభం, అసత్యం, మదం మొదలయిన ప్రకృతి గుణాలే నిత్యమూ చుట్టుముడతాయి. పరమ పదం కోరే సంయములు, యతులు ఇలా ఆలోచించి శుభాన్ని, అశుభాన్ని కూడా విడిచి పెడతారు.'

స్యూమరశ్మి ఇలా అన్నాడు. శాస్త్రం చెప్పిన దానినే నేనూ చెప్పాను. శాస్త్రార్థం తెలియకుండా ఎవరూ ఏపనీ చెయ్యరు. న్యాయోచిత మయిన ఆచరణమంతా శాస్త్రమే. అన్యాయ పూరితమైన ఆచారమంతా అశాస్త్రమని వేదంలో వినపడుతోంది. శాస్త్రాన్ని ఉల్లంఘించిన ప్రవృత్తి ఏదీ సఫలం కాలేదు. ఇది నిశ్చయం. వేదవాక్యానికి విరుద్ధమైనది అశాస్త్ర మని వేదమే చెపుతుంది. చాలా మంది ప్రత్యక్షాన్నే అంగీకరిస్తారు. శాస్త్రం నుండి వేరుగా ఈ లోకం మీదనే దృష్టిపెడతారు. శాస్త్ర దోషాలను వారు చూడరు. మనం శోకించినట్లే వారూ శోకిస్తారు. మీకు కూడా సర్వప్రాణులతో సమానంగా ఇంద్రియ జ్ఞానం ఉంటుంది కదా ! ఇలా నాలుగు వర్ణాశ్రమాలలో ప్రవర్తించేవారు సుఖాన్ని మాత్రమే కోరుతారు. వారిలో అజ్ఞానంతో బుద్ధిహీనులు మావలె తమోగుణంతో ఆవరింపబడి ఉంటారు. మీరు ఊహాపోహాలలో సమర్థులు. సార్వదేశిక సిద్ధాంత రూపంలో మోక్షసుఖం యొక్క అనంతత్వాన్ని తెలిపి, మాకు శాంతి కలిగించారు. ఏకాకి, యోగసహితుడు, కృతకృత్యుడు, మనసును జయించి శరీర పోషణకోసం మాత్రమే భిక్ష స్వీకరించేవాడు, న్యాయ శాస్త్రం పరిత్యజించి, నశ్వరమైన లోకాన్ని నిందించేవాడు మాత్రమే వేదవాక్యానుసారంగా మోక్షం ఉందని సాధికారికంగా చెప్పగలుగుతాడు. గృహస్థాశ్రమాన్ని ఆశ్రయించి ఉన్న దానం, స్వాధ్యాయం, యజ్ఞం, సంతానం, ఆర్జవం - ఇవన్నీ మిక్కిలి దుష్కరాలు. ఇలా ఇంతటి దుష్కరమైన వాటిని ఆచరించినా కూడా మోక్షం లభించకపోతే ఆ కార్యాన్ని,

కర్తనూ కూడా నిందించాలి. ఆ శ్రమ కూడ వ్యర్థమే. అలా అని కర్మ కాండను వ్యర్థంగా భావించి, విడిచిపెడితే అది నాస్తికత్వం అవుతుంది. వేదాలను అవహేళన చేసినట్లవుతుంది. అందుచేత సులభంగా మోక్షం కలిగించే కర్మకాండను మీ నుండి వినా లనుకొంటున్నాను. బ్రాహ్మణోత్తమా ! నాకు తత్త్వం తెలియజేయండి. మీకు శిష్యుడను – మీకు తెలిసిన మోక్ష స్వరూపాన్ని యథాతథంగా ఉపదేశించండి.'

270. శ్యామరశ్మి కపిల సంవాదము - 2
చతురాశ్రమాలు బ్రహ్మప్రాప్తికి సాధనాలు.

కపిల మహర్షి చెపుతున్నాడు. 'లోకా లన్నిటికీ వేదాలే ప్రమాణం. అందుచేత వేదాలను అవహేళన చేయకూడదు. బ్రహ్మరూపాలు రెండు. శబ్ద బ్రహ్మ – పరం బ్రహ్మ. అని. శబ్దబ్రహ్మ విషయంలో నిష్ణాతుడు పరం బ్రహ్మను పొందుతాడు. తలిదండ్రులు వేదోక్తమయిన గర్భాధాన శరీరానికి వేదోక్తమయిన సంస్కారం చేస్తున్నారు. అలా సంస్కరింపబడినవాడు బ్రహ్మజ్ఞానానికి అర్హు డవుతున్నాడు. ఇక అక్షయసుఖ రూప మయిన మోక్షానికి కర్మ ఎలా కారణ మవుతుందో చెపుతా – విను. తన ధర్మంగా భావించి, భోగేచ్ఛ లేకుండా యజ్ఞం చేసే వానికి కలిగే ఫలం వేదాలు, ఇతిహాసాలు తెలుపవు. ఇది ప్రత్యక్షంగా ప్రజలు చూస్తారు. **లోభం లేకుండా ఫలాన్ని విడిచి పెట్టినవారు, రాగద్వేషాలు లేనివారు, ధనానికి సత్పాత్రదానమే మార్గమని భావించేవారు, పాపకృత్యాలు చేయనివారు కర్మయోగులు. వీరు సంకల్పించినది తప్పక సిద్ధిస్తుంది. విశుద్ధ జ్ఞాన రూప మయిన పరబ్రహ్మ విషయంలో వీరు దృఢనిశ్చయంతో ఉంటారు.** వీరు ఎవరి మీదా కోపపడరు. అసూయపడరు. అహంకారం, మాత్సర్యం వీరికి ఉండవు. వీరి జన్మ, కర్మ, విద్య – ఈ మూడూ శుద్ధంగా ఉంటాయి. సర్వప్రాణులకూ హితం చేస్తూ ఉంటారు. **పూర్వం చాలా మంది బ్రాహ్మణులు, రాజులు కూడా గృహస్థాశ్రమంలో ఉంటూ, కర్మలను విడువకుండా యథావిధిగా నిష్కామభావంతో చేసేవారు. సర్వప్రాణులపట్ల సమభావంతో త్రికరణ శుద్ధికలిగి ఉండేవారు. నిత్యసంతుష్టులై జ్ఞాననిష్ఠతో ప్రత్యక్ష ఫలాన్నిచ్చే ధర్మాలను ఆచరించేవారు. పరిశుద్ధులై శబ్ద బ్రహ్మ, పరబ్రహ్మలపై శ్రద్ధ కలిగి ఉండేవారు.** నియమంతో యథావిధిగా కర్మలను ఆచరిస్తూ, చిత్తశుద్ధిని పొందుతారు. దాటరాని కష్టాలలో ఉన్నా, వారు కలిసి మెలసి ధర్మం ఆచరించే వారు. వారి కిందులో సుఖానుభూతియే కలిగేది. ఎన్నడూ ప్రాయశ్చిత్తం చేసుకోవలసిన స్థితి ఏర్పడేది కాదు. **సత్యాన్ని, ధర్మాన్ని ఆశ్రయించి**

ఇతరులకు ఏమాత్రమూ ఎదిరింపపీలుగాకుండా ఉంటారు. స్వబుద్ధిని కాకుండా శాస్త్రాన్ని అనుసరించే ఉంటారు. ప్రాణం పోతున్నా కపటధర్మం ఆచరించరు. ఉత్తమ ధర్మాన్నే ఆచరించేవారు. వారికి ఎన్నడూ ప్రాయశ్చిత్తం చేసుకోవలసిన పరిస్థితి రాలేదు. ఉత్తమ ధర్మాచరణం చేసే వారికి ప్రాయశ్చిత్తం కలగదు. దుర్బల హృదయులకే ప్రాయశ్చిత్తం ఏర్పడింది అని వేదం.

ఇలా పూర్వపు బ్రాహ్మణులు ఎన్నో విధాల యజ్ఞం నిర్వహించేవారు. వారు వైదిక విజ్ఞానంలో వృద్ధులు. శుచులు. శీలవంతులు. కీర్తిమంతులు. అట్టి విద్వాంసులు నిష్కాములై, బంధ రహితులై, ప్రతిరోజూ యజ్ఞాలు చేసేవారు. వారి యజ్ఞాలూ, వేదాలూ, కర్మలూ అన్నీ శాస్త్రానుగుణంగానే ఉంటాయి. వారు కామక్రోధరహితులు. దుష్కరమైన కర్మలను సుకరంగా చేస్తారు. వారి మనస్సులలో క్రమంగా సమయోచితమైన సత్సంకల్పాలూ, శాస్త్రజ్ఞానమూ కలుగుతాయి. వారు చేసే కర్మలచేత వారు ప్రశంసింప బడతారు. స్వభావం చేత కూడా ప్రశస్తమయిన బుద్ధికలవారు. ఆర్జవం, శమం కల్గి ఉంటారు. స్వధర్మ పరాయణులై ఉంటారు. ఉదార హృదయులై, దుష్కర కర్మలను కూడ సుకరంగా చేయగల వారి కర్మలన్నీ మోక్షప్రదాలే అని పూర్వం నుండీ వింటున్నాం. వారు స్వకర్మలతో సంపూర్ణులు. అవిద్యను పోగొట్టగల తపస్సును చేసినవారు. వారి సదాచారం ఆశ్చర్యకరం. వారికి పురాతనమూ, శాశ్వతమూ, నాశరహితమూ అయిన బ్రహ్మఫలం లభించేది. **చాలామంది ధర్మసూక్ష్మం ఆచరింపలేరు. నిజానికి వేదధర్మాలూ, ఆచారాలు ఆపత్తి లేనివి. ప్రమాదం కాని, పరాభవం కాని లేనివి.** వర్ణాశ్రమాల విషయంలో పూర్వం ఏ మాత్రం వ్యతిక్రమం ఉండేదికాదు. ఒకే ఆశ్రమం అవస్థాభేదంతో నాలుగుగా విభజింపబడిందని బ్రాహ్మణులు ఎరుగుదురు.

సజ్జనులు నాలుగు ఆశ్రమాలను యథావిధిగా ఆచరించి పరమ గతిని పొందుతారు. కొందరు గృహస్థాశ్రమం విడిచి సన్యాసం పొందుతారు. మరికొందరు వానప్రస్థం నుండి సన్యాసం పొందుతారు. ఇంకా కొందరు గృహస్థాశ్రమంలో ఉండే పరమగతిని పొందుతారు. మరికొందరు బ్రహ్మచర్యా శ్రమంలో ఉండే పరమగతిని పొందుతారు. ఇలా ద్విజాతులు ఆకాశంలో దివ్య జ్యోతులుగా కనిపిస్తారు. వేర్వేరు ప్రదేశాల్లో నక్షత్రాల వలె ఎన్నో తారాగణాలున్నాయి. వీరంతా సంతోషం / వైరాగ్యం చేతనే ఆ ఉత్తమపదం పొందారని వైదిక సిద్ధాంతం. ఇట్టి పుణ్యాత్ములు మళ్లీ జన్మ ఎత్తరు. ఒక వేళ పూర్వ కర్మ ప్రాబల్యం చేత జన్మ ఎత్తినా వారికి పాపకర్మలు అంటవు. ఇలా గురుసేవచేస్తూ దృఢనిశ్చయం కల బ్రహ్మచారి యోగయుక్తు డయి బ్రాహ్మణు

డవుతాడు. ఇతరుడు అల్ప బ్రాహ్మణు డవుతాడు. మంచి, చెడు కర్మలకు అనుగుణంగా పురుషునికి పేరు వస్తుంది. రాగద్వేషాదులు పరిపక్వమైన వారికి, ఆశలు కోరికలను విడచిన మనసుకల వారికి అంతరంగశుద్ధి ఏర్పడుతుంది. అతని బుద్ధి మోక్షమందు ఆసక్త మవుతుంది. అట్టి శుభదృష్టి కల వారికి అంతా బ్రహ్మస్వరూపమే అవుతుందని శ్రుతి చెపుతోంది. ఉపనిషత్తులలోని శమదమాదిషట్క ధర్మాలన్నీ వర్ణాశ్రమ నిష్ఠలకు సమానమే అని స్మృతి చెపుతోంది. కాని నియత చిత్తులు, తపస్సిద్ధులు, బ్రహ్మనిష్ఠులయిన వారు మాత్రమే ఈ ధర్మాన్ని పొందగలరు. **సంతోషం వల్ల త్యాగబుద్ధి కలుగుతుంది. ఆ త్యాగంకల ఆత్మయే జ్ఞానానికి ఆధారం. నిత్యమూ బ్రహ్మసాక్షాత్కారం కలిగించే సన్యాసాశ్రమరూపమైన ధర్మం చాలా సనాతన మయింది.** ఈ యతిధర్మం ఇతరాశ్రమ ధర్మాలతో కలిసినా, కలవక స్వతంత్రంగా ఉన్నా యతులు తమ వైరాగ్య బలాన్ని అనుసరించి దీన్ని ఆశ్రయిస్తారు. అలా బలిష్ఠమైన ఉపాసన చేసే వారికి శ్రేయస్సు కల్గుతుంది. దుర్బలులు కష్టపడతారు. బ్రహ్మానుసంధానం చేసే పవిత్రులు సంసారబంధం నుండి మోక్షం పొందుతారు.'

స్యూమరశ్మి అడిగాడు. 'ధనంతో భోగం అనుభవించే వారు, దానం చేసేవారు, యజ్ఞం చేసేవారు, స్వాధ్యాయం పఠించేవారు, త్యాగం చేసేవారు - చనిపోయాక వీరిలో ఎవరు స్వర్గాన్ని పొందుతారు ? నాకు యథాతత్త్వంగా దీనిని చెప్పండి.' కపిల మహర్షి చెపుతున్నాడు. 'పరిగ్రహాలు / ధనాలు అన్నీ శుభప్రదాలే. గుణాన్ని బట్టి మరింత అభ్యుదయాన్నే కలిగిస్తాయి. కాని త్యాగంలో ఉన్న సుఖాన్ని మిగిలినవి అందించలేవు. ఈ విషయం నీవు కూడా చూస్తున్నావు.' స్యూమరశ్మి అడిగాడు. 'మీరు జ్ఞాన నిష్ఠులు, గృహస్థులు, కర్మనిష్ఠులు. అన్ని ఆశ్రమాలు నిష్ఠావిషయంలో సమానమే అని మీరు చెపుతున్నారు. ఈ జ్ఞాన కర్మలు రెండూ ఒకటేనా ? లేక వేరా ? ఈ రెండింటి తేడా స్పష్టంగా తెలియటం లేదు. యథోచితంగా యథార్థంగా చెప్పండి.' కపిల మహర్షి చెపుతున్నాడు. 'కర్మలు స్థూలశరీరాన్ని, సూక్ష్మశరీరాన్నీ కూడా శుద్ధిచేస్తాయి. జ్ఞానం పరమగతి స్వరూపం. కర్మల ద్వారా చిత్తంలోని రాగాది దోషాలు పక్వమయి నశించిన తరువాత, రసరూప జ్ఞానం / బ్రహ్మానందం పురుషునిలో నిలుస్తుంది. భూతదయ, క్షమ, శాంతి, అహింస, సత్యం, ఆర్జవం, అద్రోహం, అభిమానం లేకపోవటం, లజ్జ, తితిక్ష, శమం - ఇవి పరబ్రహ్మ ప్రాప్తికి మార్గాలు. వీటితో పరమాత్మను పొందుతాడు. మనసుతో కర్మల వాస్తవ పరిణామాన్ని పండితుడు నిశ్చయించుకోవాలి. అన్ని వైపులనుండి శాంతమైన చిత్తంతో సంతుష్టులు, పరిశుద్ధులు, జ్ఞాననిష్ఠులు పొందే గతినే పరమగతి

అంటారు. వేదాలను, పరబ్రహ్మను యథార్థంగా తెలిసిన వాడే వేద వేత్త అనబడతాడు. మిగిలిన వారంతా వాతరేచకులు (గాలి పీల్చేవారు) మాత్రమే. వేదం తెలిసిన వారు అన్నీ తెలుసుకొంటారు. వేదంలో అన్నీ ఉన్నాయి. ఉన్నదీ, లేనిదీ అంతా వేదమందు ప్రతిష్ఠింపబడింది. శాస్త్రాలన్నీ చెప్పేది ఇదే. కనపడే పదార్థాలన్నీ ఆ సమయంలో ఉన్నట్టు భాసిస్తాయి. కాని పరమార్థ జ్ఞానంతో బాధింపబడి లేనివే అవుతాయి. జ్ఞాని దృష్టిలో సత్తు, అసత్తు అంతా బ్రహ్మమే. ఈ జగత్తు, ఆది మధ్యాంతా లన్నీ బ్రహ్మమే. త్యాగం వల్లనే పరబ్రహ్మ సాక్షాత్కారం కలుగుతుందని వేదాలన్నీ చెపుతున్నాయి. ఆ బ్రహ్మ ఆనందరూపంలో అన్నిటిలోనూ ఉంటుంది. మోక్షంలో నిలిచి ఉంటుంది. ఇలా ఆ పరబ్రహ్మ ఋతమూ, సత్యమూ, తెలిసినది, తెలుసుకోదగినది, అన్నిటికీ ఆత్మ, స్థావర, జంగమరూపం, సంపూర్ణ సుఖరూపం, శుభరూపం, శ్రేష్ఠరూపం, అవ్యక్తరూపం, ఉత్పత్తి రూపం, వినాశం చెందనిది. ఆ బ్రహ్మ ఆకాశం వలె దేనితోనూ కలవదు. దానికి వినాశం లేదు. రసైకరూప మయిన తత్త్వజ్ఞానం కలవారు తేజస్సు, క్షమ, శాంతి, నిత్యత కల సాధనాలతో సాక్షాత్కారించుకొంటారు. బ్రహ్మవేత్తకంటె భిన్నం కాని పరబ్రహ్మకు నమస్కారం.'

271. కుండధారోపాఖ్యానము.

ధర్మరాజు ఇలా అడిగాడు. 'పితామహా ! వేదాలు ధర్మాన్ని, అర్థాన్ని, కామాన్ని కూడా ప్రశంసిస్తాయి కదా ! ఈ మూడింటిలో దేన్ని పొందటం మంచిదో తెల్పండి.' భీష్ముడు చెపుతున్నాడు. 'ఈ విషయమై ఒక ప్రాచీనేతిహాసం చెపుతాను. ఈ కథలో కుండధారుడు ప్రీతితో ఒక భక్తునికి ఉపకరించాడు. నిర్ధనుడయిన బ్రాహ్మణుడొకడు ఒక కోరికతో ధర్మాన్ని ఆచరించాలనుకొన్నాడు. యజ్ఞం చేయటానికి ధనం కోసం కఠిన తపస్సు చేయనిశ్చయించాడు. అలా నిశ్చయించుకొని ఆ బ్రాహ్మణుడు భక్తితో దేవతలను ఆరాధించాడు. అయినా అతడు ధనం పొందలేక పోయాడు.' అపుడు అతడు ఇలా ఆలోచించాడు. 'మనుష్యులచేత జడీభూతం కాకుండా త్వరగా ప్రసన్న మయ్యే దైవతం ఎవరా ?' అని ఆలోచించాడు. అంతలో సౌమ్యభావంగల మనసుతో దేవతల అనుచరుడైన కుండధారుడనే మేఘం తన సమీపంలో ఉన్నట్లు చూశాడు. మహాబాహు వయిన మేఘుని చూసిన ఆ బ్రాహ్మణునిలో భక్తి అంకురించింది. ఇతడు నాకు మేలు చేస్తాడనే భావం అతనికి కలిగింది. ఇతడు దేవతలకు సన్నిహితుడు. ఇతరు లెవరూ ఇతనిని సమీపించలేరు. ఇతడు నాకు తగినంత ధనం శీఘ్రంగా ఇస్తాడు. అపుడు ఆ బ్రాహ్మణుడు ధూప, గంధాలు, పూలమాలలతో వివిధ బలులతో కుండధార మేఘుని పూజించాడు. స్వల్పకాలంలోనే

మేఘుడు సంతోషించి, ఆ బ్రాహ్మణునికి ఉపకారం చేసే మాటలు ఇలా మాట్లాడాడు. **'బ్రాహ్మణుని చంపినవానికి, సురాపానం చేసినవానికి, దొంగకు, వ్రతభంగం కలిగిన వానికి సజ్జనులు ప్రాయశ్చిత్తం విధించారు కాని కృతఘ్నునికి ప్రాయశ్చిత్తం విధించలేదు. ఆశకు పుత్రుడు ధర్ముడు. అసూయకు పుత్రుడు క్రోధం. వంచనకు లోభం పుత్రుడు. కాని కృతఘ్నునికి పంతానమే ఉండదు.'** అపుడా బ్రాహ్మణుడు కుండధారుని ప్రభావంతో కలలో దర్భశయ్యపై ఉన్న ప్రాణి లన్నిటినీ చూశాడు. శమం, తపస్సు, భక్తిభావాలతో పరిశుద్ధుడై ఉన్నాడు. కుండధారుని మీద తన భక్తికి నిదర్శనాన్ని ఆ బ్రాహ్మణుడు ఆ రాత్రి చూశాడు. మహాతేజస్వియై, మహాత్ముడయిన యక్షరాజు మణిభద్రుడు యాచకులకు ఫలాల నివ్వటం ఆ బ్రాహ్మణుడు చూశాడు. అచట శుభకర్మలు చేసిన వారికి రాజ్యాలు, ధనాలు ఇస్తున్నారు. అశుభకర్మలు చేసిన వారిని తొలగిస్తున్నారు. యక్షులంతా చూస్తూ ఉండగానే మహాతేజస్వి అయిన కుండధారుడు భూమిపై పడి, దేవతలకు సాష్టాంగ నమస్కారం చేశాడు. తరువాత దేవతల మాటననుసరించి మణిభద్రుడు తనకు నమస్కరించిన కుండధారునితో 'నీ కేమి కావాలి'? అని అడిగాడు.

అపుడు కుండధారుడు ఇలా అన్నాడు. 'ఈ బ్రాహ్మణుడు నా భక్తుడు. నా మీద దేవతలకు అనుగ్రహం కలిగితే ఈ బ్రాహ్మణునికి సుఖం కలిగేటట్లు అనుగ్రహించండి.' దేవతల మాటతోనే అపుడు మహాద్యుతి అయిన మణిభద్రుడు కుండధారునితో ఇలా అన్నాడు. 'కుండధారా ! లెమ్ము. నీకు శుభం కలుగుగాక. కృతకృత్యుడవు అయ్యావు. సుఖీభవ. ఈ బ్రాహ్మణునికి ధనం కావలిస్తే ధనం ఇయ్యి. ఈ బ్రాహ్మణుడు నీ స్నేహితుడు గదా ! అతడు కోరినంత ధనం దేవానుగ్రహంతో నేను ఇస్తున్నాను. **మానవ జీవితం చంచలమని, అస్థిరమని భావించి కుండధారుడు ఆ బ్రాహ్మణునికి తపోబలాన్ని పెంచా లనుకొన్నాడు.'** అపుడు కుండధారుడు ఇలా అన్నాడు. **'ధనప్రదా ! నేనితనికి ధనం కోరటంలేదు. భక్తుని అనుగ్రహించటానికి మరొకటి కోరుతున్నాను. రత్నపూర్ణ మయిన భూమిని కాని, రత్నరాశిని కాని కోరటంలేదు. ఇతడు ధార్మికుడు కావాలి. ఇతని బుద్ధి సదా ధర్మం మీదే నిలవాలి. ధర్మంతోనే బ్రతకాలి. ఇతనికి అన్నిటికన్న ధర్మమే ప్రధానం కావాలి. ఇదే నాకు అనుగ్రహించండి.'** మణిభద్రుడు అన్నాడు. 'రాజ్యమూ, వివిధ సుఖాలూ సదా ధర్మఫలాలే. కాయ కష్టం లేకుండా ఇతడు ధర్మఫలం అనుభవిస్తాడు.' 'మణిభద్రుడు ఇలా చెప్పిన తరువాత కూడ కుండధారుడు చాలా సార్లు అదే మాట చెప్పాడు. దానికి దేవతలు సంతోషించారు. మణిభద్రుడు అన్నాడు. "నీ మీద, బ్రాహ్మణుని మీద దేవత లందరు సంతుష్ట లయ్యారు. ఈ

విప్రుడు ధర్మాత్ముడవుతాడు. ఇతని బుద్ధి ధర్మం మీదనే నిలుస్తుంది." ధర్మజా ! ఇతరులు పొందరాని కోరిక తీరి కుండధారుడు కృతకృత్యుడై ఎంతో సంతోషించాడు.' అంతలో ఆ బ్రాహ్మణుడు తనకు దగ్గరగా చుట్టు ప్రక్కల సూక్ష్మవస్త్రాలను నారబట్టలను చూశాడు. దానితో అతనికి నిర్వేదం / వైరాగ్యం కలిగింది.

అపుడు బ్రాహ్మణుడు ఇలా అనుకొన్నాడు. "నా సుకృతం ఏమిటో ఈ కుండధారునికే తెలియదు. ఇతరులకు ఎలా తెలుస్తుంది ? నేనిక అరణ్యాలకు వెళతాను. ధార్మికమైన జీవితం గడపటం మేలు." భీష్ముడు చెపుతున్నాడు. 'నిర్వేదంతోను, దైవానుగ్రహంతోను ఆ బ్రాహ్మణుడు అడవికి పోయి గొప్ప తపస్సు చేయ నారంభించాడు. దేవతలకు, అతిథులకు పెట్టగా మిగిలిన ఫలాలను, కందమూలాలను భుజిస్తూ ఉన్న ఆ బ్రాహ్మణునికి ధర్మం మీద దృఢబుద్ధి ఏర్పడింది. కొంతకాలానికి ఫలాలు, కందమూలాలు విడిచి, ఆకులు తినడం మొదలుపెట్టాడు. ఇంకా కొంతకాలానికి ఆకులు కూడా మాని, కేవలం నీళ్లు త్రాగాడు. తరువాత కొంతకాలానికి కేవలం గాలి మాత్రమే పీలుస్తూ తపస్సు చేశాడు. అయినా అతని ప్రాణం పోలేదు. ఇది చాలా ఆశ్చర్య మనిపించింది. ధర్మం మీద శ్రద్ధతో ఉగ్రమయిన తపస్సు చేస్తూంటే చాలా కాలానికి అతనికి దివ్యదృష్టి లభించింది. 'సంతుష్టుడనై ఈ లోకంలో ఎవనికో ఒకనికి నేను ధనం ఇస్తే నా మాట అసత్యం కాదు కదా !" ఈ సంకల్పం కలిగిన వెంటనే సంతోషంతో మళ్లీ తపస్సు చేయటం మొదలు పెట్టాడు. మళ్లీ సిద్ధి లభించాక తన మనసులోని సంకల్పం ప్రత్యక్ష మయింది. అపుడు బ్రాహ్మణుడు ఇలా అనుకొన్నాడు. 'నేను సంతుష్టుడనై ఒకనికి రాజ్యం ఇస్తే అతడు త్వరలోనే రాజు అవుతాడు. నా మాట అసత్యం కాదు గదా !" బ్రాహ్మణుని తపశ్శక్తితోను, స్నేహంతోనూ కుండధారుడు బ్రాహ్మణునికి ప్రత్యక్ష మయ్యాడు. అతనిని చూసి బ్రాహ్మణుడు యథావిధిగా పూజించాడు. కుండధారుని దర్శనం బ్రాహ్మణునికి ఆశ్చర్యం కలిగించింది. అపుడు కుండధారుడు బ్రాహ్మణునితో 'నీకు దివ్య దృష్టి లభించిందిగదా ! ఆ దృష్టితో రాజులకు లభించే గతులూ, లోకాలూ చూడు' అన్నాడు. అపుడా బ్రాహ్మణుడు దివ్యదృష్టితో దూరం నుండియే నరకంలో మునిగి ఉన్న వేలమంది రాజులను చూశాడు.

అపుడు కుండధారుడు ఇలా అన్నాడు. 'ఎంతో భక్తితో నన్ను పూజించిన నీవు దుఃఖం పొందితే నా వల్ల నీకు కల్గిన ఉపకారం ఏమిటి ? అనుగ్రహం ఏమిటి ? **చూడు. బాగా చూడు. ఇలా బాధలుపడే వారిని చూశాక కూడా మానవులు కోరికలు**

ఎలా కోరుతారు? అందుచేత మానవులు తమ స్వర్గద్వారం తామే మూసివేసి కొంటున్నారు.' అపుడు భీష్ముడు అంటున్నాడు. 'అపుడు బ్రాహ్మణుడు భోగాభిలాష కలవారి చుట్టూరా ఉన్న కామం, క్రోధం, లోభం, భయం, మదం, నిద్ర, బడలిక, సోమరితనం - వీటిని చూశాడు. కుండధారుడు ఇలా అన్నాడు. 'ఈ గుణాలతో కూడిన మానవులకు భయపడి దేవతలు స్వర్గాన్ని మూసి వేశారు. అలాగే దేవతలవచనం చేత కామక్రోధాదులు మానవులకు విఘ్నం కలిగిస్తాయి. దేవతల అనుజ్ఞ లేకపోతే ఎవడూ ధార్మికుడు కాలేడు. ఆ అనుజ్ఞ నీకు లభించినందువల్ల నీవే ఇతరులకు రాజ్యమూ ధనాలూ ఇవ్వగలుగుతున్నావు.' భీష్ముడు చెపుతున్నాడు. 'అపుడు ధర్మాత్ముడైన బ్రాహ్మణుడు కుండధారునికి పాదాభివందనం చేసి మహాత్మా ! నా మీద మీరు చాలా అనుగ్రహం చూపించారు. అది నేను తెలుసుకోలేక కామంతోను, లోభంతోను మీలో దోషం భావించాను నన్ను మీరు క్షమించాలి" అన్నాడు. 'నేను నిన్ను మొదట్లోనే క్షమించాను' అని కుండధారుడు బ్రాహ్మణుని కౌగలించుకొని, అక్కడే అంతర్ధాన మయ్యాడు. కుండధారుని అనుగ్రహంతో తపస్సిద్ధిని పొంది, ఆ బ్రాహ్మణుడు అన్ని లోకాలలోనూ సంచరించాడు. ఇలా ఆ బ్రాహ్మణునికి ఆకాశ గమనం, సంకల్పసిద్ధి, ధర్మ, శక్తి, యోగాల వల్ల పరమగతి కూడా లభించాయి. దేవతలు, బ్రాహ్మణులు, సజ్జనులు, యక్షులు, మానవులు, చారణులు, ధార్మికులనే పూజిస్తారు కాని ధనవంతులను, కాముకులను పూజించరు. నీ మీద దేవతలకు అనుగ్రహం కలిగింది. అందుకే నీ బుద్ధి ధర్మం మీద ఆసక్తి కలిగిఉంది. ధనంలో కేవలం సుఖం యొక్క అంశ మాత్రమే ఉంది. ధర్మంలో అయితే పరమ సుఖం ఉంది.

272. అహింసా ప్రాశస్త్యము.

ధర్మరాజు ఇలా అడిగాడు. పితామహా ! యజ్ఞాలు, తపస్సులు అన్నీ చిత్తశుద్ధి, ఈశ్వర ప్రీతి కోసం చేసేవే అయినా సుఖార్థాదులు కోరకుండా కేవల ధర్మం కోసమే చేసే యజ్ఞం ఎలా ఉంటుంది ? భీష్ముడు చెపుతున్నాడు. 'పూర్వం ఉంఛవృత్తితో జీవించే బ్రాహ్మణుని యజ్ఞంకోసం జరిగిన కథను నారదుడు నాకు చెప్పాడు. దాన్ని నీకు చెపుతాను.

నారదుడు ఇలా చెప్పాడు. 'ధర్మ ప్రధానమూ, శ్రేష్ఠమూ అయిన విదర్భరాష్ట్రంలో ఋషి అయిన విప్రు డొకడు ఉంఛవృత్తితో జీవించేవాడు. అతడు యజ్ఞం చేయాలని

సంకల్పించాడు. అక్కడ చామల అన్నం, సూర్యపర్ణి, సువర్చల అనే చేదు, రసహీనమూ అయిన కూరలు కూడా ఆతని తపస్సు చేత రుచికరాలుగా ఉండేవి. వనంలో అతడు అలా తపస్సిద్ధి పొంది ఏ ప్రాణినీ హింసించకుండా, కందమూల ఫలాలతో స్వర్గం పొందే యజ్ఞం చేశాడు. ఆతని భార్య పుష్కరధారిణి. ఆమె శుచియై వ్రతాలతో కృశించింది. బ్రాహ్మణుని పేరు సత్యుడు, అతడు హింసా ప్రధానమైన యజ్ఞం చేయదలచినపుడు ఆమె వ్యతిరేకించింది. అయినా ఆమెను యజ్ఞపత్నిగా పట్టుబట్టి ఆహ్వానించేవాడు. ఆమె అతని శాపానికి భయపడి, భర్త స్వభావానికి అనుగుణంగా ప్రవర్తించేది. ఆమె ఊడిపడిపోయిన నెమలి పించాలను, ఈకలను కలిపి వస్త్రంగా ధరించేది. హోత యొక్క ఆజ్ఞ ననుసరించి, ఆమె నిష్కామంగా యజ్ఞం చేసింది. శుక్ర వంశీయు డయిన పర్ణాదుడనే ధర్మజ్ఞుడు హోతగా నిర్వహించాడు. ఆ వనంలో సత్యుని సన్నిహితు డొకడు మృగ మయ్యాడు. అతడొకనాడు మనుష్యభాషతో సత్యునితో 'నీవు పాపపు పని చేస్తున్నావు' అన్నాడు. 'చేసే యజ్ఞం మంత్రాంగ హీన మయితే అది యజమానికి దుష్కరమే అవుతుంది. అందుచేత నీవు నన్ను హోతకు ఇచ్చి, దోషరహితుడవై స్వర్గానికి వెళ్లు' అన్నాడు. తరువాత యజ్ఞంలో సాక్షాత్తుగా సావిత్రి వచ్చి ఆ మృగాన్ని ఆహుతి ఇమ్మని సలహా ఇచ్చింది. కాని ఆ బ్రాహ్మణుడు నా సహవాసిని వధించలే నని చెప్పాడు. వెంటనే సావిత్రి తిరిగి యజ్ఞాగ్నిలో ప్రవేశించింది. యజ్ఞంలో ఏ పొరపాటు జరుగుతుందో అని చూడటానికి వచ్చి, ఆమె మళ్లీ రసాతలానికి వెళ్లి పోయింది.

లేడి రూపంలో ఉన్న సహవాసి సత్యుని మళ్లీ 'తనను హోమం చేయ'మని యాచించాడు - సత్యుడు సహవాసిని కొగలించి 'నీవు వెళ్లు' అని తిరస్కరించాడు. అపుడు ఆ లేడి ఎనిమిది అడుగులు వేసి తిరిగివచ్చి "సత్యా ! నన్ను హోమం చెయ్యి. అపుడు నేను ఉత్తమగతి పొందుతాను. నీకు దివ్యదృష్టి ఇస్తున్నాను. దానితో చూడు ఆకాశంలో దివ్యు లయిన అప్సరసలను, గంధర్వుల విమానాలను చూడు' అంది. అపుడు సత్యుడు కోరికతో ఆకాశదృశ్యాన్ని చూసి, మళ్లీ మృగాన్ని చూశాడు. హింసలోనే స్వర్గ సుఖం ఉందని నిశ్చయించుకొన్నాడు. నిజానికి ధర్ముడే మృగరూపం దాల్చి చాలాసంవత్సరాలు వనంలో ఉన్నాడు. సత్యునికి నిష్కృతి కలిగించాలనే అతని ఉద్దేశం. అంతేకాని పశుహింసతో యజ్ఞం చేయించాలని కాదు. కాని సత్యుడు మృగహింసతో స్వర్గం పొందుదా మనుకొన్నాడు. వెంటనే అతని తపస్సు అంతా నశించిపోయింది. అందుచేత హింస అనేది యజ్ఞంలో ఉండరాదు. అపుడు భగవంతుడయిన ధర్మ పురుషుడే సత్యుని చేత యజ్ఞం చేయించాడు.

తరువాత సత్యుడు తపస్సు చేసి, భార్యను అహింసతో సమాధాన పరిచాడు. ఇలా సత్యునికి అహింస మీద నమ్మకం కలిగింది. **అందుచేత అహింసయే సంపూర్ణ ధర్మం. హింస అహితాన్ని కలిగించే అధర్మం. ఇపుడు సత్యాన్ని గురించి చెపుతాను. అది సత్యవాదుల పరమ ధర్మం.'**

273. చతుః ప్రాశ్నికము.

ధర్మరాజు అడిగాడు. 'మానవుడు పాపం ఎలా పొందుతాడు ? ధర్మం ఎలా ఎలా ఆచరిస్తాడు ? దేనిచేత నిర్వేదం పొందుతాడు ? దేని చేత మోక్షం పొందుతాడు ?' భీష్ముడు చెపుతున్నాడు. 'నీకు అన్ని ధర్మాలూ తెలుసును. కాని వాని లోకస్థితి కోసం నీవు నన్ను అడుగుతున్నావు. మోక్షం, నిర్వేదం, పాపం, ధర్మం సమూలంగా విను. శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం - ఈ అయిదు అనుభవించాలని ఇచ్ఛ కలుగుతుంది. ఒక దాన్ని పొందిన తరువాత దానిపై ఆసక్తి కాని, ద్వేషం కాని కలుగుతుంది. తరువాత దానికోసం ప్రయత్నిస్తాడు. పెద్ద పెద్దగా కర్మలు చేస్తాడు. ఇష్టాలైన రూపరస గంధాలను సేవించా లనుకొంటాడు. దానితో రాగం కలుగుతుంది. తరువాత ద్వేషం కలుగుతుంది. దానితో లోభం కలుగుతుంది. తరువాత మోహం కల్గుతుంది. లోభమోహాలు, రాగద్వేషాలు ఆవరించిన వానికి ధర్మం మీద బుద్ధి కలగదు. కాని కపటంతో ధర్మం ఆచరిస్తాడు. **కపటంతోనే ధర్మం ఆచరిస్తాడు. కపటంతోనే ధనం సంపాదిస్తాడు. అలా కపటత్వంతో ధన సంపాదన మీద బుద్ధి నిలిపి పాపం చెయ్యా లనుకొంటాడు. మిత్రులు పండితులు వారించినా, విధిప్రేరితుడై న్యాయ బద్ధంగా సమాధాన మిస్తాడు.** రాగ మోహాలతో అతనికి మూడు విధాలయిన అధర్మం (కాయిక, వాచిక, మానసిక) పెరుగుతుంది. పాపం గురించే ఆలోచిస్తాడు. పాపం గురించే మాట్లాడతాడు, పాపమే చేస్తాడు. అధర్మంలో ప్రవర్తించే వాని దోషాలను సజ్జనులు కనిపెడతారు. సమాన శీలం కలవారితోనే పాపులు స్నేహం చేస్తారు. వారు ఇహలోకంలోనే సుఖం పొందరు. ఇక పరలోకంలో ఎలా పొందుతారు.

ఇలా మానవుడు పాపాత్ముడవుతాడు. ఇక ధర్మాత్ముని గురించి విను. శుభప్రదమయిన ధర్మాలు ఆచరించేవాడు శుభం పొందుతాడు. ఆ నిపుణధర్మంతోనే ఇష్టమయిన గతిని పొందుతాడు. తన తెలివి / ప్రజ్ఞతో రాగాది దోషాలను మొదట్లోనే చూడగలిగివాడు సుఖ దుఃఖాలను నేర్పుగా తెలుసుకొంటాడు. వాడు సజ్జనులను సేవిస్తాడు. సజ్జనసేవ, సత్కర్మాచరణం వలన బుద్ధి పెరుగుతుంది. అపుడు బుద్ధి ధర్మం మీదనే రమిస్తుంది. ధర్మంతోనే జీవిస్తుంది. ధర్మంతో లభించే ధనం మీదనే మనస్సు లగ్న

మవుతుంది. అతనికి మనసు ఆర్ద్రంగా ఉంటుంది. సద్గుణాలను పరికిస్తాడు. ఇలా ధర్మాత్ము డవుతాడు. శుభంకర మయిన మిత్రుని పొందుతాడు. మిత్రు డనే ధనం పొంది అతడు ఇహ పరలోకాల్లో ఆనందిస్తాడు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాల మీద అధికారం కలుగుతుంది. ఇది ధర్మఫలం. ధర్మఫలం పొంది పొంగిపోడు రాజా ! విషయ భోగాలతో తృప్తి పొందనివానికి జ్ఞాన నేత్రంతో వైరాగ్యం కలుగుతుంది. జ్ఞాన దృష్టి కలిగితే మనసు శబ్దాదులను భావించదు. అపుడు కామం నుండి విముక్తు డవుతాడు. కాని ధర్మాన్ని విడవడు. లోకమంతా నశించేదే అని తెలిసి అన్నీ త్యజించటానికి ప్రయత్నిస్తాడు. యోగ్య మయిన ఉపాయంతోనే మోక్షానికి ప్రయత్నిస్తాడు. మెల్లగా నిర్వేదం పొందుతాడు. పాపకృత్యాలు విడిచిపెడతాడు. ధర్మాత్ము డవుతాడు. మోక్షం పొందుతాడు. పాపం, ధర్మం, నిర్వేదం, మోక్షం విషయమై నీవు అడిగిన వన్నీ చెప్పాను. ధర్మజా ! అందుచేత సర్వకాల సర్వావస్థలలోనూ ధర్మంతోనే ప్రవర్తించాలి. ధర్మం మీద నిలిచిన వారికి మోక్షం లభిస్తుంది.'

274. యోగాచారాను వర్ణనము.

ధర్మరాజు మళ్లీ అడిగాడు. 'పితామహా ! మీరు యోగ్యమయిన ఉపాయంతో మోక్షం పొందాలి. ఉపాయరహితంగా కాదు అని చెప్పారు. ఆ ఉపాయం ఏదో మీనుండి వినా లనుకొంటున్నాను.' భీష్ముడు చెపుతున్నాడు. 'మహాప్రాజ్ఞా ! యోగ్యమయిన ఉపాయంతోనే పురుషార్థాలను తెలుసుకొంటావు. విషయ పరిశీలనకు కావలసిన నిపుణబుద్ధి నీకు ఉంది. ఘటాన్ని చేసేందుకు కావలసిన బుద్ధి కుండచేసిన తరువాత అవసరం లేదు. అలాగే చిత్తశుద్ధికి ఉపాయా లయిన యజ్ఞాది ధర్మాలు చిత్తశుద్ధి కలిగిన తర్వాత మోక్షసాధనలకు ఉపయోగించవు. తూర్పు సముద్రానికి వెళ్లే దారి పశ్చిమ సముద్రానికి వెళ్లదు. అలాగే మోక్షానికి ఒకటే మార్గం. దాన్ని చెపుతా విను.

మోక్షం కోరేవాడు క్షమతో క్రోధాన్ని తొలగించుకోవాలి. సంకల్పం విసర్జించి కామాన్ని తొలగించుకోవాలి. జ్ఞానం, ధ్యానం మొదలయిన సాత్విక గుణాలతో నిద్రను తొలగించుకోవాలి. సదా సావధానతతో లోకాపవాద భయం పోగొట్టుకోవాలి. క్షేత్రజ్ఞుని దర్శిస్తూ శ్వాసను నిరోధించాలి. ధైర్యంతో ఇచ్ఛను, ద్వేషాన్ని, కామాన్ని తొలగించుకోవాలి. తత్త్వవేత్త శాస్త్రాభ్యాసంతో భ్రమ, మోహం, సంశయం తొలగించుకోవాలి. జ్ఞానాభ్యాసంతో నిద్రను, ప్రతిభను తొలగించుకోవాలి. శరీరానికి సంబంధించిన ఉపద్రవాలను, రోగాలను, హితమై జీర్ణమయ్యే మితభోజనంతో

తొలగించుకోవాలి. లోభమోహాలను సంతోషంతో తొలగించుకోవాలి. విషయాలను తత్త్వదర్శనంతో తొలగించుకోవాలి.

దయతో అధర్మాన్ని జయించాలి. చక్కని ఆలోచనతో ధర్మాన్ని పొందాలి. సంయమంతో / నిగ్రహంతో ఆశను జయించాలి. అభిలాషను విడిచి అర్థాన్ని జయించాలి. వస్తువుల అనిత్యతతో స్నేహం విడవాలి. యోగాభ్యాసంతో ఆకలిని జయించాలి. కరుణతో ఆత్మాభిమానాన్ని, సంతృప్తితో తృష్ణను జయించాలి. ప్రయత్నంతో సోమరితనాన్ని, శాస్త్రనిశ్చయంతో విపరీత తర్కాన్ని, మౌనంతో అతివాగుడును, శౌర్యంతో భయాన్ని విడిచిపెట్టాలి. మనస్సును, వాక్కును బుద్ధితో వశపరుచుకోవాలి. బుద్ధిని జ్ఞాననేత్రంతో వశపరుచుకోవాలి. జ్ఞానాన్ని ఆత్మజ్ఞానంతో, ఆత్మను పరమాత్మతో వశపరుచుకోవాలి. యోగ సంబంధు లయిన కామ, క్రోధ, లోభ, భయ, నిద్రలు అనే అయిదు దోషాలను ఊచముట్టుగా తొలగించాలి. వాక్కును నియంత్రించి, యోగసాధనాలను పాటించాలి. ధ్యానం, అధ్యయనం, దానం, సత్యం, లజ్జ, ఆర్జవం, క్షమ, శుచిత్వం, ఆహారశుద్ధి, ఇంద్రియనిగ్రహం ఇవి యోగసాధనాలు. వీటితో తేజస్సు వృద్ధి చెంది, పాపం నశిస్తుంది. సంకల్పాలు సిద్ధించి, ఆత్మ విజ్ఞానం కలుగుతుంది. ఇలా పాప నిర్మూలనం చేసుకొన్నవాడు తేజస్వి, మితాహారుడు, జితేంద్రియుడై, కామక్రోధాలను వశమందుంచుకొని బ్రహ్మపదానికి తాను వెళ్లాలి అనుకోవాలి. అమూఢత, అనాసంగం, కామక్రోధవివర్జనం, దైన్యం లేకపోవడం, అహంకారరాహిత్యం, నిర్భయత్వం, గృహమునందుండక పోవుట త్రికరణాలను నియంత్రించటం, సిద్ధులను కోరకుండుట – ఇది మోక్షానికి ప్రసన్నమూ, నిర్మలమూ, పవిత్రమూ అయిన మార్గం.'

275. నారదాసిత సంవాదము.
(జీవాత్మకు దేహాభిమాన విముక్తి)

భీష్ముడు చెపుతున్నాడు. 'ఈ విషయంలో నారదునకు అసితదేవలునకు జరిగిన సంవాదం అనే పూర్వేతిహాసం ఉదాహరిస్తారు. ఒకసారి వృద్ధుడు, బుద్ధిమంతులలో శ్రేష్ఠుడూ అయిన దేవలుడు కూర్చుండి ఉంటే నారదుడు వెళ్లి ఆయనను ప్రాణుల సృష్టిసంహారాలను గూర్చి ఇలా అడిగాడు. 'బ్రాహ్మణా ! ఈ సకల చరాచర జగత్తు ఎవని వలన సృజింపబడింది ? ప్రళయ కాలంలో ఎవనిలో లయమవుతుంది ? నాకు చెప్పండి.' అసితుడు చెప్పాడు. 'సృష్టికాలంలో పరమాత్మ ప్రాణుల వాసనలచేత ప్రేరేపింపబడి,

సృష్టించిన పరిపూర్ణ భూతాలను అయిదింటిని పంచభూతాలు అంటారు. పరమాత్మ ప్రేరణతో కాలం పంచ భూతాలద్వారా ప్రాణులను సృష్టిస్తుంది. మరొకటి సృష్టికి కారణ మనడం అసత్యమే అవుతుంది. పంచభూతాలు, కాలం ఈ ఆరు శాశ్వతాలు, అచలాలు, ధ్రువాలు. ఇవి తేజోమయమైన మహత్తు యొక్క స్వాభావికాంశాలు. జలం, ఆకాశం, భూమి, వాయువు, అగ్ని. ఈ భూతాల కంటె వేరైన తత్త్వం ఏదీ లేదు. ఇది నిస్సంశయం. ప్రమాణంతోనో, యుక్తితోనో ఈ ఆరింటికంటె భిన్నంగా మరి ఏది చెప్పినా అది అసత్యమే. ఈ ఆరింటిని గూర్చి తెలుసుకో. పంచభూతాలు, కాలం, భావా భావాలు (నిత్యమయిన ఆత్మతత్త్వం, పరివర్తన శీలమయిన మహత్తత్త్వం) నిత్యాలు. ప్రాణుల ఉత్పత్తి వినాశాలకు ఆధారాలు. ప్రాణులన్నీ వీనిలోనే లయం చెందుతాయి. వీని నుండే పుడతాయి. శరీరం నశించినపుడు అయిదు భాగా లయి తమ తమ కారణాల్లో కలిసి పోతాయి.

ప్రాణుల శరీరం భూమి మయం. శ్రోత్రాలు (చెవులు) ఆకాశ సంభవాలు. చక్షురింద్రియం సూర్యుని నుండి, ప్రాణం వాయువు నుండి, రక్తం జలం నుండి ఏర్పడతాయి. నేత్రాలు, ముక్కు, చెవులు, చర్మం, నాలుక అనే పంచజ్ఞానేంద్రియాలూ విషయాలను గ్రహిస్తాయి. చూడటం, వినటం, వాసన చూడటం, స్పృశించటం, రుచిచూడటం – ఇవి పంచేంద్రియాల పనులు. గుణాలు కూడా. ఈ అయిదు ఇంద్రియాలూ అయిదు విషయాల్లో అయిదు విధాలుగా ప్రవర్తిస్తాయి. రూపం, గంధం, రసం, స్పర్శ, శబ్దం అనే అయిదు గుణాలూ దర్శనం మొదలయిన అయిదు విధాల గ్రహించబడతాయి. ఈ రూప గంధ రస స్పర్శ శబ్దాలను ఇంద్రియాలు గ్రహించవు. ఇంద్రియాల ద్వారా జీవుడు తెలుసుకొంటాడు. ఇంద్రియ సముదాయం కంటె చిత్తం శ్రేష్ఠం. చిత్తం కంటె మనస్సు శ్రేష్ఠం. మనస్సు కంటె బుద్ధి శ్రేష్ఠం. బుద్ధి కంటె జీవుడు శ్రేష్ఠుడు. మొదట జీవుడు ఇంద్రియాల ద్వారా విషయాలను వేర్వేరుగా గ్రహిస్తాడు. తరువాత మనసుతో ఆలోచించి, బుద్ధితో నిశ్చయిస్తాడు. బుద్ధితో కూడిన జీవుడే ఇంద్రియాల ద్వారా లభించే విషయాలను అనుభవిస్తాడు. అయిదు ఇంద్రియాలు, చిత్తం, మనస్సు, బుద్ధి – ఈ ఎనిమిదింటిని జ్ఞానేంద్రియాలు అంటారు. చేతులు, కాళ్లు, గుదం, ఉపస్థ, ముఖం – ఇవి కర్మేంద్రియాలు. వీటిని గురించి విను. ముఖం మాట్లాడటానికి, తినటానికి ఉపయోగపడుతుంది. కాళ్లు నడకకు, చేతులు పనిచేయటానికి ఉపయోగిస్తాయి. గుదం, ఉపస్థ ఈ రెండూ విసర్జనం అనే సమాన కర్మలు చేస్తాయి. మల విసర్జనం గుదం, వీర్య విసర్జనం ఉపస్థ చేస్తాయి. ఈ అయిదూ కాక ఆరవది కర్మేంద్రియాల బలం. అనగా ప్రాణసమూహం. ఇలా నా చేత జ్ఞానేంద్రియ

గుణాలూ, కర్మేంద్రియగుణాలూ చెప్పబడ్డాయి.

ఇంద్రియాలు తమ పనులతో శ్రమించి, విశ్రమించినపుడు జీవుడు ఇంద్రియాలను విడచి నిద్రిస్తాడు. ఇంద్రియాలు విశ్రమించినా మనస్సు విశ్రమించకుండా విషయాలను సేవించడమే స్వప్నావస్థ అంటారు. సాత్త్విక రాజస తామస భావాలు భోగప్రదా లయిన కర్మలతో కలిసి ఉన్నపుడు స్వప్నావస్థలో కూడా భాసిస్తాయని చెపుతారు. ఆనందం, కర్మసిద్ధి, జ్ఞానం, పరాగతి ఈ నాలుగూ సాత్త్విక భావాలు. సాత్త్విక పురుషుల స్మృతి ఈ నాలుగు నిమిత్తాలనూ ఆశ్రయిస్తుంది. (అంటే సాత్త్వికులు జాగ్రదవస్థలో లాగా స్వప్నావస్థలో కూడా ఆనందాది భావాలను స్మరించగలరు). ఇతర రాజస, తామస ప్రాణులలో కలిగే భావనలను (కర్మగతులను ఆశ్రయించి ఉండే వాసనలను) ఆ స్మృతి గ్రహిస్తుంది. అనగా జాగ్రదవస్థలోనూ, స్వప్నావస్థలోను జీవులకు తమ అభిరుచికి అనుకూలంగా రాజస తామస పదార్థాలు ప్రత్యక్షంగా కనిపిస్తాయి. కర్మేంద్రియాలు (5), జ్ఞానేంద్రియాలు (5) చిత్తం, మనస్సు, బుద్ధి, ప్రాణం, సాత్త్విక, రాజస, తామస భావాలు (7) కలిపి ఈ పదిహేడూ గుణాలు. వీటికి అధిష్ఠాత, దేహా భిమాని అయిన జీవాత్మ పదునెనిమిదవది. జీవాత్మ శరీరంలో ఉంటుంది అది శాశ్వతం. ఈ పదిహేడు గుణాలూ శరీర ధారులను ఆశ్రయించుకొని ఉంటాయి. జీవుడు శరీరంలోంచి వెళ్లిపోతే శరీరం ఉండదు, తత్త్వాలూ గుణాలూ ఉండవు (లేదా) వీని అన్నిటి సముదాయమే పాంచ భౌతిక శరీరం. మహత్తత్త్వం ఒకటి + జీవసహితమైన 18 గుణాలు. ఈ తత్త్వా లన్నిటినీ జఠరాగ్నితో కలిపి లెక్కిస్తే మొత్తం ఇరవై అవుతాయి. మహత్తత్త్వం ప్రాణ వాయువుతో కలిసి ఈ శరీరాన్ని ధరిస్తుంది.

ప్రభావ సహితమైన మహత్తత్త్వానికి ఈ ప్రాణవాయువు దేహం భేదించటంలో నిమిత్తం మాత్రమే. వస్తువులన్నీ పుట్టి నట్లే నశిస్తాయి. అలాగే ప్రారబ్ధమైన, పుణ్యపాపాలు నశించినపుడు శరీరం నశిస్తుంది. సంచితా లయిన పుణ్యపాపాలతో ప్రేరేపింపబడిన జీవుడు ఆ యా కాలాలలో చేసిన కర్మలవల్ల ప్రాప్తించిన ఇతర శరీరాల్లో ప్రవేశిస్తాడు. (పాడయిన ఇంటిని వదలి మరో ఇంటిలో చేరినట్లు) అప్పటి దాకా ఆశ్రయ మిచ్చిన దేహం పోగానే జీవుడు కాలప్రేరితుడై ఆ శరీరం విడిచి మరో శరీరంలో చేరుతాడు. నిశ్చయజ్ఞానం కలిగిన ప్రాజ్ఞులు శరీరవియోగంతో బాధపడరు. కాని అజ్ఞులు దేహంతో తనకు సంబంధం భావించి, దేహం పోయిందని పరితపిస్తారు. నిజానికి ఈ జీవుడు ఎవరికీ ఏమీ కాడు. ఎవరూ ఈ జీవునికి ఏమీ కారు. ఎల్లపుడూ ఒంటరియే. కాని శరీరంలో ఉండి, ఆ శరీరం తనదిగా భావించుకొని, సుఖ దుఃఖాలు అనుభవిస్తున్నాడు.

జీవుడు ఎన్నడూ కొత్తగా పుట్టడు. ఎన్నడూ చావడు. ఈ తత్వం తెలిసిన వాడు దేహాభిమానం విడిచి మోక్షం పొందుతాడు. ఈ శరీరం తన పుణ్య పాపాలతో ఏర్పడింది. కర్మనాశం అయితే శరీరం నశిస్తుంది. తరువాత ముక్తుడై బ్రహ్మభావం పొందుతాడు. పుణ్యపాపాలను క్షీణింప జేసుకొనే సాధనం జ్ఞానం. అవి నశించాక బ్రహ్మభావం పొందటమే పరమగతి అంటారు.'

276. మాండవ్య జనక సంవాదము - తృష్ణా త్యాగము.

యుధిష్ఠిరుడు అడిగాడు. పితామహా ! మేము చాలా క్రూరులం. పాపకర్ములం. ధనం కోసం అన్నదమ్ములను, తండ్రులను, మనుమలను, జ్ఞాతులను, స్నేహితులను, పుత్రులను చంపుకొన్నాం. ధనాశతో ఇంత పాపానికి ఒడిగట్టాం. ఈ ఆశను దూరం చెయ్యడం ఎలాగో చెప్పు.' భీష్ముడు చెపుతున్నాడు. 'ఇందులో కూడా మాండవ్యునికి జనకుడు చెప్పిన పురాతనేతి హాసాన్నే ఉదాహరిస్తారు. జనకుడు ఇలా అన్నాడు. "నేను ఎంతో సుఖంగా జీవిస్తున్నాను. ఈ లోకంలో నాది అనబడే వస్తు వేదీ లేదు. మిథిలానగరం తగులబడి పోతున్నా నాదేదీ తగలబడటం లేదు." **తెలిసిన వారికి సంపదల సమృద్ధి కూడా ఎంతో దుఃఖకరంగా అనిపిస్తుంది. తెలియని వారిని సమృద్ధిలేని తుచ్ఛ సంపదలు కూడ మోహపెడతాయి. ఈ లోకంలో కామ సుఖం కాని, స్వర్గ సుఖం కాని తృష్ణాక్షయం వల్ల కలిగే సుఖంలో పదహారో వంతుతో కూడ సమానం కావు. కాలాన్ని బట్టి ఆవుకొమ్ము ఆవు శరీరంతో పాటు పెరుగుతుంది. అలాగే ధనం పెరుగుతున్న కొద్దీ ఆశకూడా పెరుగుతూ ఉంటుంది.*** 'నాది' అని అనుకొన్న వస్తువు చిన్నదయినా అది నశిస్తే మనకు పరితాపం కలిగిస్తుంది.

కోరికల వెంటపడి పరుగెత్తరాదు. కోరికల మీద ఆసక్తి దుఃఖం కలిగిస్తుంది. ధనం పొంది, ధర్మంకోసం ఉపయోగించాలి. కామభోగాలను విడిచిపెట్టాలి. విద్వాంసుడు తనతో సకల ప్రాణులను పోల్చుకొంటాడు. (తనవలెనే అందరికీ సుఖం కలగాలని కోరుతాడు). ఈ భావన కలవాడు పరిశుద్ధ మనస్సుతో కృతకృత్యుడై దోషాలన్నీ విడుస్తాడు. ప్రాణు లన్నిటినీ తనవలె చూచుకొనేవాడు సత్యమూ, అసత్యమూ; శోకమూ; ఆనందమూ; ప్రియమూ; అప్రియమూ; భయమూ, నిర్భయమూ విడిచి, ప్రశాంతుడై దోషరహితుడై

---

* యచ్చ కామసుఖం లోకే యచ్చ దివ్యం మహత్సుఖమ్ ।
తృష్ణాక్షయసుఖస్యైతే నార్హతః షోడశీం కలామ్ ॥ 6

ఉంటాడు. ఈ ఆశను దుర్బుద్ధులు విడవలేరు. శరీరం పోయినా ఆశపోదు. అది ప్రాణాంతకమైన రోగం. దాన్ని విడిచిన వానికే సుఖం లభిస్తుంది. తన ప్రవర్తన చంద్రునివలె పరిశుద్ధంగా, దోషరహితంగా నిలుపుకోగల ధర్మాత్ముడు ఇహలోకంలోనూ పరలోకంలోనూ సుఖాన్నీ కీర్తినీ పొందుతాడు. జనక మహారాజు మాటలను విని, మాండవ్య మహర్షి సంతుష్టి డయ్యాడు. ఆ మాటలను ప్రశంసించి మోక్షం పొందాడు.'

277. పితా పుత్ర సంవాదము.

యుధిష్ఠిరుడు ఇలా అడిగాడు. 'పితామహా ! ప్రాణు లన్నిటికీ భయావహ మయిన కాలం గడిచిపోతూ ఉంటుంది ఈ స్థితిలో మానవుడు పొందే శ్రేయస్సు ఏమిటో వివరించండి.' భీష్ముడు చెపుతున్నాడు. 'ఈ విషయమై పితాపుత్ర సంవాదం అని ఒక ప్రాచీనేతి హాసం ఉదాహరిస్తారు. వేదాధ్యయన తత్పరుడైన ఒక బ్రాహ్మణునికి మేధావియైన మేధావి అనే పుత్రుడు ఉన్నాడు. మోక్షధర్మాలు నిపుణంగా తెలిసిన పుత్రుడు స్వాధ్యాయ పరుడై, మోక్షధర్మం తెలియని తండ్రితో ఇలా అన్నాడు. తండ్రీ ! మానవుల ఆయువు త్వరగా గడిచిపోతోంది ఇది తెలిసిన ధీరుడు ఏ ధర్మం ఆచరించాలి ? యథార్థంగా చెప్పండి. ఆ ధర్మాన్ని ఆచరిస్తాను.' తండ్రి చెపుతున్నాడు. 'పుత్రా విప్రుడు బ్రహ్మచర్యాశ్రమంలో వేదాధ్యయనం చెయ్యాలి. గృహస్థాశ్రమంలో పితరులను ఉద్ధరించటానికి పుత్రులను పొందాలి. యథావిధిగా అగ్నిస్థాపనంతో యజ్ఞాలు చెయ్యాలి. వానప్రస్థాశ్రమంలో మునివృత్తితో గడపాలి.' పుత్రు డన్నాడు. 'ఈ లోకాన్ని ఎవరో బాధిస్తున్నారు అంతటా చుట్టుముడుతున్నారు. అమోఘాలైన వేవో పడుతున్నాయి కాని నీవు ధీరుని వలె మాట్లాడుతున్నావు'

తండ్రి అన్నాడు. 'ఈ లోకం ఎలా బాధింపబడుతోంది ? ఎవరిచేత చుట్టుముట్టబడింది ? ఏవి మీద పడుతున్నాయి ? నన్ను భయపెడుతున్నావా ?' పుత్రు డన్నాడు. 'ఈ లోకం మృత్యువుచేత బాధింపబడుతోంది. ముసలి తనంతో చుట్టుముట్టబడింది రాత్రింబవళ్లు మీద పడుతున్నాయి. ఇవి నీకెందుకు తెలియటం లేదు ? **మృత్యువు ఒక్క క్షణం కూడా (మనకోసం) నిలవదని నాకే తెలుసును. అయినా జ్ఞానమనే కవచం లేకుండానే తిరుగుతున్నాను. నేను శ్రేయస్సుకోసం క్షణమయినా ఎలా విరీక్షిస్తాను ?** ఒక్కొక్క రాత్రీ గడిచే కొద్దీ ఆయువు తగ్గిపోతోంది. ఇంకిపోయే నీటిలో ఉన్న చేప లాగా ఎవడు సుఖం పొందుతాడు ? పూలు పోగు చేసుకొంటూ ఇతర

విషయాల్లో మనసుంచి, కోరికలు తీరకుండానే ఉన్న మానవునికి మృత్యువు వచ్చి మీద పడుతుంది. **అందుచేత రేపటి పని ఈ రోజే చెయ్యాలి. మధ్యాహ్నం పని ప్రొద్దుటే చెయ్యాలి. వాని పని పూర్తి అయిందా ? లేదా ? అని మృత్యువు నిరీక్షించదు.* శ్రేయస్కరమైన పనిని ఈ రోజే చెయ్యి. కాలం చాలా గొప్పది. అది నిన్ను అతిక్రమించరాదు. ఈ రోజు ఎవరి మృత్యుకాలమో ఎవరికి తెలుసును ? మన పనులు పూర్తి కాకుండానే మృత్యువు తనవైపు మనలను లాగుతుంది. యౌవనంలోనే ధర్మం ఆచరించాలి. జీవితానికి (ఎపుడుంటుంది ? ఎపుడు పోతుంది అనేది తెలుసుకొనటానికి) శకునాలు లేవు (ముందుగా తెలియనిది).** ధర్మాచరణం చేస్తే ఇహపరలోకాల్లో శాశ్వతమైన ప్రీతి కలుగుతుంది. మోహవశంతో భార్యా పుత్రులకోసం మంచో, చెడో చేసి మానవుడు వారికి సంతోషం కలిగిస్తాడు. ఇలా కుటుంబంతో, పశుసంపదలతో ఆసక్తు డయిన వానిని నది ఒడ్డున నిద్రించే పెద్దపులిని వరద లాక్కుపోయినట్లు మృత్యువు లాక్కుపోతుంది. **భోగసాధనాలన్నీ కూర్చుకొని, కోరికలతో తృప్తి పడని వానిని తోడేలు మేకపిల్లను లాక్కుపోయినట్లు మృత్యువు లాక్కుపోతుంది.** ఈ పని చేశాను. ఈ పని చెయ్యాలి. ఈ పని సగం చేశాను. ఇలా కోరికలతో కూడిన వానిని ఎపుడో మృత్యువు వచ్చి లాక్కు పోతుంది.** కర్మలలో మునిగి తేలుతూ పొలాలు, వ్యాపారాలు, ఇళ్లూ... ఇలాంటి వాటి మీద ఆసక్తితో ఉన్న వానిని ఎపుడో చెప్పకుండా మృత్యువు వచ్చి లాక్కు పోతుంది. మానవుడు దుర్బలు డయినా బలవంతు డయినా, ప్రాజ్ఞు డయినా, శూరు డయినా, జడు డయినా, కవి అయినా... ఎవరయినా అర్థకామాలు సంపాదించని వా డయినాసరే మృత్యువు వచ్చి లాక్కుపోతుంది. ముసలితనం, వ్యాధి, దుఃఖం - ఇలా ఎన్నో కారణాల వల్ల మృత్యువు కలుగుతుంది. దీన్ని మనం విడిపించుకోలేము. కాని నీవు నిశ్చింతగా ఎలా ఉండగలవు ? జీవుడు పుట్టగానే యముడు, ముసలితనమూ రెండూ వెంటనే ఉంటారు. చరాచర ప్రాణు లన్నిటికి జరామరణాలు వెంటనంటి ఉంటాయి. ఎదుటికి వస్తున్న మృత్యువును సత్యం తప్ప మరెవరూ అడ్డుకోలేరు. సత్యంలోనే అమృతం (బ్రహ్మ) ప్రతిష్ఠింపబడి ఉంటుంది. గ్రామవాసం మీద ఆసక్తియే మృత్యువు యొక్క నిలయం.

---

* శ్వః కార్యమద్య కుర్వీత పూర్వాహ్ణే చాపరాహ్ణికమ్ ।
న హి ప్రతీక్షతే మృత్యుః కృతం వాస్య న వా కృతమ్ ॥ 13

**సంచిన్వానకమేవైనం కామానామవితృప్తకమ్ ॥ 18
వృకీవోరణమాసాద్య మృత్యురాదాయ గచ్ఛతి ।

'యదరణ్యం' అనే శ్రుతిని అనుసరించి వానప్రస్థాశ్రమం దేవతల గోశాల వంటిది. గ్రామవాసం మీద ఆసక్తియే మానవుని బంధించే త్రాడు. పుణ్యాత్ములు ఈ బంధనం ఛేదించగలరు. పాపులు త్రెంచలేరు. త్రికరణ శుద్ధిగా ఏ ప్రాణినీ హింసించనివాడు ఇతర ప్రాణుల వలన వధ, బంధనం మొ కష్టాలు పొందడు. అందుచే సత్యవ్రతం ఆచరిస్తూ, సత్యవ్రతమే పరమగతిగా భావించాలి. సత్యాన్నే ఆశించాలి. సర్వభూతాలను తాను తనతో సమంగా చూడాలి. ఇలా ఇంద్రియ నిగ్రహంతోనూ, సత్యంతోను మృత్యువును జయించాలి.

అమృతం, మృత్యువు రెండూ ఈ దేహంలోనే ఉంటాయి. మోహం వల్ల మృత్యువు కల్గుతుంది. సత్యంతో అమృతం లభిస్తుంది. అందుచేత కామ క్రోధాలను వదలి అహింసను పాటిస్తాను. సత్యాన్ని ఆశ్రయించి, క్షేమం, సుఖం పొంది, అమరునివలె మృత్యువును తరిమివేస్తాను. ఉత్తరాయణంలో శాంతి యజ్ఞాలలో ఆసక్తితో, ఇంద్రియనిగ్రహం కలిగి బ్రహ్మయజ్ఞం చేస్తూ ఉంటాను. జపస్వాధ్యాయ రూపాలయిన వాగ్యజ్ఞమునూ, ధ్యానరూప మనోయజ్ఞమునూ, నిష్కామంగా కర్మయజ్ఞాన్ని చేస్తాను. **నావంటివాడు హింసా యుక్తము లయిన పశుయజ్ఞాలు ఎలా చేస్తాడు ? పిశాచాలవలె నశ్వరాలైన క్షత్రియ యజ్ఞాలు ఎలా చేస్తాడు ?** తండ్రీ నేను ఆత్మయందే ఆత్మచేతనే పుట్టాను. ఆత్మలోనే ఉంటాను. నాకు సంతానం లేదు. ఆత్మయజ్ఞం చేస్తాను. సంతానం నన్ను గట్టెక్కించదు. తరింపజేయదు. మాట, మనస్సు చక్కగా ప్రాణుల హితం మీదనే సదా నిలిచే వానికి తపస్సు కాని, త్యాగం కాని, యోగం కాని అన్నీ ప్రాణిహితం వల్లనే ఫలిస్తాయి. **విద్యతో సమానమైన కన్ను లేదు. విద్యతో సమమైన ఫలం లేదు. రాగంతో సమానమైన దుఃఖం లేదు. త్యాగంతో సమానమైన సుఖం లేదు.*** ఏకత్వం సమత్వం, సత్యపరాయణత, శీలం, దండత్యాగం, (అహింస) ఆర్జవం, తరువాత బ్రహ్మభావం పొంది నిష్కామ కర్మాచరణం చేస్తూ ఉండటం. వీటితో సమానమైన ధనం బ్రాహ్మణునికి మరొకటిలేదు. తండ్రీ ! బ్రాహ్మణా ! నీకీ ధనాలు ఏమీ చెయ్యవు. బంధువులు ఏమి చెయ్యలేరు. చనిపోయే నీకు దారా పుత్రాదులూ ఏమీ చెయ్యరు. నీ హృదయగుహలో ఉన్న ఆత్మను అన్వేషించు. నీ తాత తండ్రులు ఎక్కడకు వెళ్లారు ?' భీష్ముడన్నాడు. 'పుత్రుని మాటలు విని తండ్రి అలాగే ఆచరించాడు. రాజా ! నీవు కూడా అలాగే సత్యధర్మపరాయణుడవై ప్రవర్తించు.'

---

* **నాస్తి విద్యాసమం చక్షుః నాస్తి విద్యాసమం ఫలమ్ ॥ 35**
నాస్తి రాగసమం దుఃఖం నాస్తి త్యాగసమం సుఖమ్ ॥ 36

278. హారీత గీత.

యుధిష్ఠిరుడు ఇలా అడిగాడు. 'ప్రకృతి కంటె పరం, ధ్రువం అయిన పరబ్రహ్మపదాన్ని ఏ స్వభావం, ఏ ప్రవర్తన, ఏ విద్యకలవాడు పొందుతాడు ? ఏ ఆశయం కలవాడు పొందుతాడు ?' భీష్ముడు చెపుతున్నాడు. మోక్ష ధర్మాల మీద ఆసక్తితో, పరిమితంగా భుజిస్తూ, ఇంద్రియనిగ్రహం కలవాడు ఆ బ్రహ్మపదాన్ని పొందుతాడు.

ఈ విషయంలో కూడ హారీతుడు చెప్పిన ఇతిహాసం ఉదాహరిస్తారు. ధర్మజా వినుము.

మోక్షార్థి లాభనష్టాలను సమంగా చూడగలగాలి. ముని అయి ఉండాలి. ఎదుట భోగాలు సిద్ధంగా ఉన్నా వాటి మీద అపేక్ష లేకుండా ఇంటినుండి బయటకు పోయి సన్యసించాలి. కళ్లతో కాని, మనసుతో కాని, వాక్కుతో కాని ఇతరుల దోషాలు చూడరాదు. ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని ఇతరుల దోషాలను ఎన్నడూ చెప్పరాదు. ఇవన్నీ సన్యాస ధర్మాలు. ఏ ప్రాణినీ హింసించరాదు. మిత్ర భావంతో సూర్యుని వలె వేర్వేరు మార్గాల్లో సంచరిస్తూ, ఒక రాత్రి కంటె ఎక్కువగా ఏగ్రామంలోనూ ఉండరాదు. జీవించి ఉండగా ఎవరితోనూ వైరం పెట్టుకో రాదు. ఇతరులు నిందించినా సహించాలి. గర్వంతో ఎన్నడూ ప్రవర్తించకూడదు. ఎదుటివారు కోపించినా ప్రియంగా మాట్లాడాలి. దూషించినా హితం పలకాలి. గ్రామ మధ్యంలో కుడి ఎడమలకు పోరాదు. ఆపద లేనపుడు ముందుగా ఆహ్వానించినా సరే భిక్షాటనం చేయరాదు. ఇతరులు తనపై దోషారోపణం చేస్తే తన్ను తాను రక్షించుకోవాలి గాని అప్రియంగా మాట్లాడరాదు. మృదు ప్రవర్తన ఉండాలి. తనపై క్రూరంగా ప్రవర్తించినా తాను అక్రూరుడు కావాలి. నిశ్చింతగా ఉండాలి కాని గొప్పలు చెప్పరాదు. వంటింటి పొగతగ్గిన తర్వాత, రోకలి చప్పుళ్లు తగ్గాక, పొయ్యిలోని నిప్పు చల్లారిన తరువాత, జనులు భోజనం చేశాక, పాత్రల చప్పుళ్ళ సంచారం తగ్గిన తర్వాత ముని భిక్షాటనం చేయాలి. ప్రాణం నిలుపుకోటానికి మాత్రమే భుజించాలి. ఎక్కువ పరిమాణం లభించాలనే భావం మీద ఆదరణ చూపరాదు. భిక్ష దొరకకపోతే కలత పడరాదు. దొరికితే పొంగిపోరాదు.

అందరితో సమానంగా లాభం / ప్రాప్తిని కోరుకోరాదు. విశేషంగా పూజింపబడినచోట భుజించరాదు. మోక్షార్థి పూజా సత్కారాలను అసహ్యించుకోవాలి. భిక్షాన్నంలో దోషాలున్నా భిక్షపెట్టిన వారినీ, అన్నాన్నీ నిందింపరాదు. అలాగే గుణాలను పొగడరాదు. శయ్య కాని, ఆసనం కాని, ఏకాంతంలోనే నిత్యమూ గ్రహించాలి. శూన్య గృహంలో కాని, చెట్టు మొదట కాని, అరణ్యంలో కాని, పర్వత గుహలో కాని ఇలా ఏదైన అజ్ఞాతప్రదేశంలో ఉంటూ భగవద్ధ్యానం చెయ్యాలి. అనురోధ విరోధాలు లేకుండా సమభావంతో

స్థిరుడు, నిశ్చలుడై ఉండాలి. తాను చేసే కర్మల పుణ్య పాపాలను అనుసరించరాదు. నిత్యమూ సంతృప్తితో, సంతోషంతో, ప్రసన్నమైన ముఖమూ, ఇంద్రియాలూ కల్గి ఉండాలి. నిర్భయంగా జపపరుడై, మౌనం పాటిస్తూ వైరాగ్యం ఆశ్రయించాలి. భౌతిక మంతా పరిణామ శీలమయిన దని నశించే దని గ్రహించాలి. ప్రాణుల జనన మరణాలు కూడా అంతే అని తెలియాలి. దేని మీదా కోరిక లేకుండా, అందరిని సమదృష్టితో చూడాలి. అన్నంతో, ఫలాదులతో బ్రతుకు వెళ్లబుచ్చాలి. ఇలా లఘువుగా తింటూ జితేంద్రియుడై, ప్రశాంత మనస్కుడై గడపాలి. సన్యాసి అయిన తపస్వి వాక్కు, మనస్సు, క్రోధం, హింస, ఉదరం, ఉపస్థల తీవ్రతను సహించాలి. ఇతరులు నిందించినా మనసులో బాధడరాదు. ప్రశంసను, నిందను మధ్యస్థుడై సమంగా గ్రహించాలి. సన్యాసాశ్రమంలో ఇది పరమ పవిత్రమైన ప్రవర్తన. మహాత్ముడై, అన్ని విషయాల్లోనూ జితేంద్రియుడై, అన్నిటా అనాసక్తుడై, పూర్వ పరిచిత ప్రదేశాలు విడిచి, ఒకేచోట నివాసం ఉండకుండా, ఏకాగ్రచిత్తంతో ఉండాలి. వానప్రస్థులతోను, గృహస్థులతోను ఎన్నడూ కలవరాదు. రుచితో సంబంధం లేకుండా లభించింది తినాలి. కోరిన భోజనం దొరికినా సంతోషం పొందరాదు. సన్యాసాశ్రమం తెలిసిన వారికి మోక్షస్వరూపమే. తెలియని వారికి మాత్రం శ్రమ కలిగిస్తుంది. తెలిసిన వారికోసం హారీత మహర్షి ఈ ధర్మా లన్నిటినీ మోక్ష సాధకాలుగా చెప్పాడు. సర్వప్రాణులకు అభయం ఇచ్చి, గృహం నుండి బయట పడినవానికి తేజోమయ లోకాలు లభిస్తాయి. అలాగే అనంతమైన మోక్షం పొందుతాడు.'

279. వృత్ర గీత - 1.

ధర్మరాజు ఇలా ప్రశ్నించాడు. పితామహా ! జను లందరూ మమ్మల్ని ధన్యులు, ధన్యులు అంటూ ఉంటారు. కాని మా కంటె ఎక్కువ దుఃఖం పొందిన వా డెవడయినా ఉన్నాడా ? మేము దేవతల వలన ఈ లోకంలో జన్మించాం. జనులందరి మన్ననలూ పొందాం. అయినా మాకు ఇంత దుఃఖం కలిగింది. దుఃఖనాశకమయిన ఈ సన్యాసం మేము ఎపుడు స్వీకరిస్తామో ! కురుసత్తమా ! ఈ శరీరం ధరించడమే అసలు దుఃఖం అనిపిస్తుంది. పితామహా ! జ్ఞానేంద్రియ (5) కర్మేంద్రియ (5) ప్రాణ (5) మనో - బుద్ధులు 17 తత్వాలు, కామ, క్రోధ, లోభ, భయ, స్వప్నాలు (5) సంసార హేతువులు, శబ్దాదులు (5) త్రిగుణాలు (3) పంచభూతాలు, అవిద్య, అహంకార, కర్మలు ఈ మొత్తం 38 తత్వాలు. తీవ్రతపస్సు చేసిన మునులు ఈ తత్వాల నుండి విముక్తులయి పునర్జన్మను పొందరు. మేము కూడా రాజ్యం విడిచి ఈ స్థితిని ఎపుడు పొందుతామో !'

భీష్ముడు చెపుతున్నాడు. 'రాజా ! దుఃఖం అనంతమైనది కాదు. అంతా లెక్కకు లొంగేదే. లెక్కించరానివి కావు. పునర్జన్మ కూడా నశిస్తుంది. ఏ వస్తువూ స్థిరమైనది కాదు. ఐశ్వర్యం / రాజ్యం దోషమని, అది మోక్షానికి ప్రతిబంధక మనీ అనుకోరాదు. ధర్మజ్ఞులైన మీరు ప్రయత్నంతో కొద్దికాలం లోనే (మోక్షం) పొందుతారు. **రాజా ! జీవుడు పుణ్యపాపాల ఫలాలు అనుభవించడంలో స్వతంత్రుడు కాడు. ఆ పుణ్యపాపాల వలన రాగద్వేషాలు అనే అంధకారంతో కప్పబడతాడు.** అంధకారంతో నిండిన వాయువు మనశ్శిలా చూర్ణంలో ప్రవేశించి, అన్ని దిక్కులూ రంగులతో నిండినట్లు చూపిస్తుంది. అంటే... సహజంగా వర్ణంలేని జీవుడు అజ్ఞానంతో కప్పబడి, కర్మఫలాలతో కలిసి, శరీరధర్మాలు పొంది, ప్రాణుల శరీరాల్లో సంచరిస్తూ ఉంటాడు. అజ్ఞానం వల్ల కలిగిన అంధకారాన్ని జీవుడు తత్త్వజ్ఞానంతో తొలగించుకొంటే అపుడు అతని హృదయంలో సనాతన బ్రహ్మ ప్రకాశిస్తాడు. "బ్రహ్మప్రాప్తి కర్మరూపయత్నంతో సాధ్యం కాదు." అని మునులు చెపుతారు. అందుచేత దేవతలు, జగత్తుతో పాటు నీవూ కూడా ఆ మునులను ఉపాసించాలి. అందుచేత మహర్షి సంఘాలకు నమస్కరిస్తున్నాను. రాజా ! ఈ విషయంలో పూర్వం వృత్రుడు చెప్పిన దాన్ని శ్రద్ధగా విను. పూర్వం వృత్రాసురుడు ఒకసారి యుద్ధంలో ఓడిపోయి ఐశ్వర్య భ్రష్ట డయ్యాడు. అసహాయు డైనాడు. దేవతల చేత రాజ్యం అపహరింపబడింది. శత్రుమధ్యంలో నిరాసక్తంగా చింతాశూన్య బుద్ధితో ఉన్నాడు. రాజ్యం పోయిన వృత్రుని చూసి శుక్రుడు ఇలా అన్నాడు. "పరాజయం పొందిన నీకు ఏ వ్యథా లేదు గదా".

అపుడు వృత్రుడు ఇలా అన్నాడు. 'సత్యంతోనూ, తపస్సుతోనూ ప్రాణుల జనన మరణాలను నిస్సంశయంగా తెలిసికొనడంవల్ల నేను సంతోషించను. విచారించను. యుగానురూపంగా కాలప్రేరితులై జీవులు కొందరు తమ పాపకర్మల వలన నరకంలో మునిగి పోతారు. కొందరు పుణ్యకర్మల వలన స్వర్గం చేరి ఆనందిస్తారని జ్ఞానులు చెపుతారు. అలా నరకంలోనో, స్వర్గంలోనో కర్మఫలం అనుభవించాక, మిగిలిన కర్మఫలం అనుభవించటానికి కాలప్రేరణచేత మళ్లీ మళ్లీ పుడుతూ ఉంటారు. కామపాశాలతో బంధింపబడి వివశు లయిన జీవులు వేల సార్లు పశుపక్ష్యాదులుగా పుట్టి నరకంలోపడి, అనుభవించి తరువాత బయట పడతారు. ఇలా తిరుగుతూ ఉండే జీవులను నేను జ్ఞానంతో చూశాను. కర్మ ననుసరించియే ఫలం లభిస్తుందని శాస్త్రం చెపుతోంది. ప్రాణులు సుఖదుఃఖాలను, ప్రియా ప్రియాలను పొందుతూ కర్మానుసారంగా నరకాన్ని, పశుపక్ష్యాది శరీరాలను, మానవ, దివ్య శరీరాలను పొందుతారు. తాము చేసుకొన్న కర్మల ననుసరించి,

విధి విధానాన్ని అనుసరించి లోకమంతా సుఖదుఃఖాలు పొందుతుంది. ప్రాణులన్నీ నడిచిన దారిలోనే వెళుతూ ఉంటాయి. కాలనామంతో ప్రఖ్యాతు డయి, సృష్టి స్థితి పరాయణుని గురించి చెపుతున్న వృత్రునితో శుక్రుడు ఇలా అన్నాడు 'నీవు బుద్ధిమంతుడవు అయినా ఇలా దుష్టప్రలాపాలు ఎందుకు చేస్తున్నావు ?"

అపుడు వృత్రుడు ఇలా అన్నాడు. 'నేను పూర్వం జయకాంక్షతో ఘోరతపస్సు చేశాను. ఆది మీకూ, బుద్ధిమంతులకూ తెలిసినదే. దానితో నా తేజస్సుతో మూడులోకాలనూ ఆక్రమించి పెరిగాను. సకల ప్రాణుల గంధాలను, రసాలను బలవంతాన గ్రహించాను. అగ్నిజ్వాలలతో నిండిన శరీరంతో నిర్భయంగా ఆకాశంలో సంచరిస్తూ, ప్రాణు లన్నిటికి జయింప శక్యం కాని వాడ నయ్యాను. మహాత్మా ! తపస్సుతో నేను ఐశ్వర్యం పొందాను. నేను చేసిన కర్మలతో దాన్ని పోగొట్టుకొన్నాను. అందుచేత అప్పటి నుండి ధైర్యం పొంది, విచారించటం లేదు. మహాత్ము డయిన ఇంద్రునితో నేను యుద్ధానికి వెళ్లినపుడు ఇంద్రునికి సాయం చేయటానికి వచ్చి నారాయణుడు నాకు కనిపించాడు. ఆ ప్రభువు వైకుంఠవాసి, అనంతుడు, శుక్లుడు విష్ణువు, సనాతనుడు, ముంజకేశుడు, హరిశ్మశ్రుడు, సర్వభూత పితామహుడు. నేనపుడు చేసిన తపః ఫలం కొద్దిగా మిగిలి ఉంటుంది. అందుకే ఆ కర్మల ఫలం ఏమిటో ప్రశ్నించా లనుకొంటున్నాను. ఐశ్వర్య రూపు డయిన మహాద్బహ్మ ఏ వర్ణంలో నిలిచి ఉంటాడు ? ఆ ఉత్తమైశ్వర్యం ఎలా తొలగి పోతుంది ? ప్రాణులు ఎందుకు జీవిస్తాయి ? ఎందుకు కర్మలు చేస్తాయి ? జీవుడు ఏ ఫలం పొంది, శాశ్వతంగా నిలుస్తాడు ? విప్రోత్తమా ! ఎ కర్మతో, ఏ జ్ఞానంతో ఆ ఫలం కలుగుతుంది ? ఈ విషయం నాకు చెప్పండి.' ధర్మజా ! వృత్రాసురుడు ఇలా అడిగితే శుక్రుడు ఏం చెప్పాడో దాన్ని నీకు చెపుతాను సోదరులతో కలిసి శ్రద్ధగా విను.

280. సభ్యుల లక్షణములు చెప్పుట - వృత్రగీతలు - 2.

శుక్రుడు చెపుతున్నాడు. 'ఆకాశంతో కూడిన భూమిని తన బాహువులపై నిలిపిన మహాప్రభావశాలి ఐన విష్ణునకు నమస్కారం. ఆయన శిరస్సు, స్థానం అనంతమైనవి. ఆ విష్ణువు యొక్క మాహాత్మ్యాన్ని నీకు చెపుతాను. ఇలా వారు మాట్లాడుకొంటూ ఉండగా వారి సంశయం తీర్చటానికి ధర్మాత్ము డయిన సనత్కుమారుడు అక్కడకు వచ్చాడు. వెంటనే వృత్రుడు, శుక్రుడు అతనిని పూజించారు. సనత్కుమారుడు మహార్హ మయిన ఆసనం మీద కూర్చున్నాడు. అలా కూర్చున్న మహాజ్ఞాని సనత్కుమారునితో శుక్రుడు "ఈ వృత్రునికి విష్ణుమాహాత్మ్యం తెలపండి" అన్నాడు. ఆ మాట విని

సనత్కుమారుడు వృత్రాసురునకు విష్ణుప్రభావాన్ని తెలుపుతూ ఇలా అన్నాడు.

వృత్రా ! ఉత్తమ మయిన విష్ణుమాహాత్మ్యం విను. లోకమంతా విష్ణువులోనే ఉందని తెలుసుకో ! ఇతడే చరాచరమయిన భూత సముదాయాన్ని సృష్టిస్తాడు. సమయం వచ్చినపుడు లోపలకు లాక్కుంటాడు (సంహరిస్తాడు). సమయం వస్తే మళ్లీ బయటకు విసర్జిస్తాడు (సృష్టిస్తాడు). ఈ జగత్తు ఇతనిలోనే లయ మవుతుంది. మళ్లీ ఇతని నుండియే పుట్టుతుంది. ఇతనిని జ్ఞానంతో కాని, తపస్సుతో కాని, యజ్ఞంతో కాని పొందలేం. ఇంద్రియ నిగ్రహంతోను, యోగంతోను పొందగలం. బాహ్యాభంతర కర్మలతో మనసును శుద్ధ మొనర్చుకొనినవాడు ముందు పరలోకాన్ని, తరువాత మోక్షాన్ని పొందుతాడు. స్వర్ణకారుడు చాలాసార్లు వెండిని అగ్నిలో శుద్ధి చేసినట్లు, జీవుడు ఎంతో ప్రయత్నంతో ఎన్నో జన్మలలో మనస్సును శుద్ధి చేసుకొంటాడు. ఒక్కొప్పుడు (యజ్ఞాదులతో శమదమాదులతో) గొప్ప ప్రయత్నం చేస్తే ఒక జన్మలోనే మనశ్శుద్ధి కలగవచ్చును. మన శరీరానికి అంటిన మురికిని స్వల్పప్రయత్నంతోనే పోగొట్టుకొంటాము. అలాగే చాలా ప్రయత్నంతో రాగద్వేషాది దోషాలను కూడా పోగొట్టుకోగలం. చిన్న పూలమాలతో చుట్టబడిన నువ్వులు, ఆవాలూ తమ సహజ వాసనను విడవలేవు. అలాగే చిన్న ప్రయత్నంతో రాగద్వేషాది దోషాలు పోవు. అలాగే బ్రహ్మసాక్షాత్కారం తేలికగా కలగదు. అవే నువ్వులూ, ఆవాలూ చాలా పూలమాలలతో చాలా సార్లు వాసితం చేస్తే అవి తమ వాసనపోయి ఆ పూలవాసనతోనే ఉంటాయి. అలాగే వందల జన్మల దోష సమూహం నిరంతరాభ్యాసం అనే ప్రయత్నంతోను, బుద్ధితోను తొలగిపోతుంది. వృత్రా ! ప్రాణులు కర్మతోనే అనురక్తు లవుతారు. కర్మతోనే విరక్తు లవుతారు. అలా రాగవిరాగాలకు నిమిత్తాలయిన కర్మవిశేషాలను పొందే తీరు విను. జీవులు కర్మలలోనికి ఎలా ప్రవర్తిస్తారో, ఎలా నిలుస్తారో క్రమంగా చెపుతాను. శ్రద్ధగా విను.

ఆద్యంతాలు లేని శ్రీహరి, నారాయణుడు చరాచరప్రాణు లన్నిటిని సృష్టిస్తాడు. ఆ శ్రీహరియే అన్ని ప్రాణులలోను క్షరుడు, అక్షరుడు అనే రూపాలతో ఉంటాడు. పదకొండు ఇంద్రియాల రూపంలో ఉన్న వైకారిక సృష్టి అతని స్వరూపమే. అతడే తన కిరణాలతో జగత్తును గ్రహిస్తాడు. ఆయన పాదాలు భూమి. శిరస్సు స్వర్గం. బాహువులు దిక్కులు. చెవులు ఆకాశం. కన్ను సూర్యుడు. మనస్సు చంద్రుడు. జ్ఞానవృత్తి మహత్తత్వం. నాలుక జలం. గ్రహాలన్నీ అతని కనుబొమల మధ్య ఉన్నాయి. నక్షత్ర మండలం కనుల నుండి ఏర్పడింది. పాదాల నుండి భూమి ఏర్పడింది.

ఆ శ్రీహరియే భూత స్వరూపుడు. విశ్వానికి ఆది అని, నాదు డని తెలుసుకో రజోగుణం, తమోగుణం, సత్త్వగుణం మూడూ నారాయణ స్వరూపాలే

ఆశ్రమాలన్నిటికీ, కర్మలన్నిటికీ ఫలం అతడే అని విద్వాంసులు అంటారు. కర్మత్యాగానికి / కర్మ సన్యాసానికి ఫలం అతడే. అతడే వ్యయంకాని పరమాత్మ. వేద ఛందస్సులు ఆయన రోమాలు. ప్రణవం అతని వాక్కు. వర్ణాశ్రమా లన్నిటికీ ఆశ్రయం శ్రీహరియే ఆయనకు ఎన్నో ముఖాలు. ఆయన ధర్మానికి ఆశ్రయం. అతడే బ్రహ్మ. అతడే ఆత్మదర్శన రూప మయిన యోగదర్శనం. అతడే తపస్సు, సదసత్ స్వరూపుడు. వేదాలు, శాస్త్రాలు, గ్రహాలతో కూడిన పదహారుగురు ఋత్విక్కులు, యజ్ఞమూ శ్రీహరియే. బ్రహ్మ, విష్ణువు, అశ్వినీ దేవతలు, ఇంద్రుడు మిత్రుడు, వరుణుడు, యముడు, కుబేరుడు అంతా శ్రీహరియే. ఆ ఋత్విజులు వేరుగా కనపడినా వారు తమ ఎకత్వాన్ని ఎరిగినవారే. ఈ జగత్తు అంతా ఒకే దేవుని వశంలో ఉందని తెలుసుకో. దైత్యేంద్రా ! ఎన్నో రూపాలతో ఉన్న పరమాత్మకు వేదం ఎకత్వాన్ని చెపుతోంది. జీవుడు విజ్ఞానం వల్ల బ్రహ్మను చూడగల్గుతాడు అపుడే పరబ్రహ్మ ప్రకాశిస్తాడు. ఎంతోమంది జీవులు వేలకోట్ల కల్పాల కాలం స్థిరంగా ఒకే చోట ఉంటారు. మరికొందరు తిరుగుతూ ఉంటారు. అందుచే ప్రజల సృష్టిపరిమాణం వేల బావులు. బావి అనగా అయిదు వందల యోజనాల పొడవు, అంతే వెడల్పు, ఒక క్రోశం లోతు గలబావి దానిలోని నీటిని ఒక వెండ్రుకతో రోజుకు ఒకసారి ఒక బిందువును తీస్తూ ఉంటే ఎంతకాలానికి బావిలోని నీరు శూన్య మవుతుందో అంతకాలం సృష్టి పరిమాణం అని తెలియాలి (అనగా తెలుసుకోలేమని భావం).

ప్రాణుల వర్ణాలు ఆరురకాలు కృష్ణ, ధూమ్ర, నీల, రక్త, హరిద్రా (పసుపుపచ్చ) శుక్లాలు. ఇందులో కృష్ణ, ధూమ్ర, నీల వర్ణాల వారికి మధ్యమ సుఖం లభిస్తుంది. రక్త వర్ణం వారు ఎక్కువ బాధలను సహించవలసి వస్తుంది. పసుపు పచ్చవర్ణం కాంతిని, సుఖాన్ని కలిగిస్తుంది. తెలుపు మిక్కిలి సుఖం ఇస్తుంది. శుక్ల వర్ణం నిర్మలం, శోక రహితం, అలసట కలగదు కాబట్టి సిద్ధి నిస్తుంది. జీవుడు కొన్నివేల జన్మలనెత్తి తరువాత సిద్ధిని పొందుతాడు. ఇంద్రుడు శుభంకర మయిన తత్త్వజ్ఞానం పొంది; గతి, దర్శనము రెండూ ప్రాణుల వర్ణాల వలన ఏర్పడతాయని, శుక్లవర్ణం కలవారికి ఇట్టి సిద్ధిలభిస్తుందని, ఆ వర్ణం కాలకృతమనీ తెలుసుకొన్నాడు. సకల జీవుల పరాగతి పదునాలుగు లక్షలుగా చెప్పబడింది. జీవుని ఊర్ధ్వలోకగతి కూడా పదునాలుగు కరణాల ద్వారానే జరుగుతుంది. స్థిర నివాసం కాని, అధః పతనం కాని ఇవన్నీ పదునాలుగు సంబంధాల వల్లనే కలుగుతాయి.

వీటిని సాత్త్విక మార్గాభిముఖంగా మరల్చాలి. కృష్ణవర్ణుల గతి నికృష్ట మయినది. వీరు అధర్మంతో నరకంలో పడి, అగ్నిలో పక్వమవుతారు. పై 14 కరణాల ద్వారా పాపం చేసి, చాలా కల్పాలకాలం నరకవాసం చేస్తూ ఉంటారు అని చెపుతారు. లక్షల సంవత్సరాలు నరకంలో చరించి, తరువాత హరిత వర్ణం పొందుతాడు. (అనగా పశుపక్ష్యాదుల జన్మఎత్తి) ఎంతో దుఃఖం అనుభవిస్తూ, కర్మాధీనుడై నివసిస్తాడు. యుగక్షయ మయిన తరువాత పూర్వకృత పుణ్యకర్మచేత సురక్షితు డవుతాడు.

ఆ జీవుడు సత్త్వగుణం కలిగియున్నపుడు బుద్ధితో తమోగుణ ప్రవృత్తిని దూరం చేసుకొని, శుభాలు పొందటానికి ప్రయత్నిస్తాడు. అప్పుడు సత్త్వగుణం వృద్ధిపొందితే రక్తవర్ణం పొందుతాడు. సత్త్వగుణం పూర్తి అవడంలో లోపం ఉంటే ఆ జీవుడు నీలవర్ణం పొంది మనుష్యలోకంలో సంచరిస్తాడు. అపుడా జీవుడు మానవ లోకంలో స్వధర్మ బంధనాలతో క్లేశం అనుభవిస్తూ, పసుపు పచ్చని వర్ణం (దేవతాభావం) పొందుతాడు. ఆ వర్ణంతో చాలా కల్పాలు నివసించాక పుణ్యక్షయం అయి మనుష్యత్వం పొందుతాడు. అలా దేవతాభావంతో సంచరిస్తూ ఉన్నా భోగాసక్తి విడవక పాపకర్మల ఫలం నరకంలో అనుభవిస్తాడు. అలా పందొమ్మిది వేల గతులను పొందుతాడు. అపుడు నరకం నుండి విముక్తి కలుగుతుంది. ఒక్క మానవ జన్మలో తప్ప ఇతర జన్మలలో సుఖ దుఃఖానుభవం మాత్రమే ఉంటుంది కాని మోక్షం కలగటానికి అవసర మయిన యోగం లభించదు - తెలుసుకో. ఆ జీవుడు చాలా సార్లు దేవలోకంలో విహరించి, తరువాత మనుష్యత్వం పొందుతాడు. మనుష్యలోకంలో ఎనిమిది కల్పాలు నివసించి, శుభకర్మలు చేసి జ్ఞానం పొంది మోక్షం పొందుతాడు. కాలయోగం వల్ల ఒక్కొక్కప్పుడు మానవలోకం నుండి కూడా అధోలోకానికి దిగజారుతాడు. నీచమైన కృష్ణవర్ణం పొంది, స్థావర యోనిని పొందుతాడు. ఇలా ఊర్ధ్వ-అధోలోకాలలో సంచరించే జీవులకు ముక్తి లభించే మార్గం చెపుతాను.

ఈ జీవుడు రక్తవర్ణం, హరిద్రవర్ణం, శుక్లవర్ణం పొంది ఏడు వందల దివ్య శరీరాలను, వ్యూహాలను ఆశ్రయించి, భూలోకం మొదలయిన ఏడులోకాల్లో సంచరించి బ్రహ్మలోకం చేరుతాడు. ప్రకృతి, మహత్తత్త్వం, అహంకారం, పంచతన్మాత్రలు (8) అరువది తత్త్వాలూ వీటి వేల కొలదీ వృత్తులూ వీటిని యోగులు మనసుతో నిరోధిస్తారు. అపుడు శుక్లవర్ణ లయిన సనకాదులకు లభించే ఉత్తమగతి వీరికీ లభిస్తుంది. ఆరవదైన శుక్ల వర్ణం వారికి లభించే యోగ్యతను పోగొట్టుకొన్నవారికి, అనగా సుఖ భోగాలను విడవలేని వారికి ఒక కల్పకాలం మహర్లోక, జనోలోక, తపోలోక, సత్యలోకాలలో నివాసం

దొరుకుతుంది. కల్పాంతంలో ముక్తి లభిస్తుంది. యోగసాధన పూర్తికాకుండా భ్రష్టు డయినవాడు నూరు కల్పాల కాలం ఏడు ఊర్ధ్వలోకాల్లో నివసించి, తరువాత మనుష్యలోకంలో మహామనుష్యత్వం పొందుతాడు. కులశీల విద్యాదులు కల మహాపురుషుడుగా పుడతాడు తరువాత ఉత్తమ జాతులలో, దేవాది జాతులలో పుడతాడు. సమాధి వ్యుత్థానముల ప్రభావంతో ఎడులోకాలలో ఒక కల్పకాలం నివసిస్తాడు. ఆ యోగి భూమ్యాది సప్తలోకాలను క్షణభంగురాలని తలుస్తాడు. శోకమోహాలు లేకుండా నివసిస్తాడు. శరీరం నశించిన తరువాత అవ్యయమూ, అనంతమూ అయిన పరమ పదం చేరుతాడు. ఈ పరమపదం కొందరు కైలాసం అంటారు కొందరు వైకుంఠం అని కొందరు బ్రహ్మలోక మయిన సత్యలోకమని, కొందరు అనంతుని లోకమని, కొందరు జీవుని (నరుని) లోకమే అని కొందరు పరబ్రహ్మాధి తుర్యమూర్తి లోక మని అంటారు జ్ఞానాగ్నితో స్థూల సూక్ష్మ కారణశరీరాలను యోగులు దహింపజేసుకొని పరమాత్మను పొందుతారు. బ్రహ్మలోకం కంటె క్రింది లోకాల్లో ఉండే సాధనశీలులు ధైవీ ప్రకృతితో సాధకత్వం పొంది, వారూ పరబ్రహ్మను పొందుతారు కర్మల ఫలం సంపూర్ణంగా పొందకుండా ప్రళయం వస్తే, మిగిలిన కర్మఫలం అనుభవించటానికి పూర్వస్థానాలు పొందుతారు. పూర్తిగా అనుభవించిన వారు వారి కర్మానుసారంగా మనుష్యత్వం పొందుతారు సిద్ధలోకం నుండి పతితులై మర్త్యలోకం చేరినవారు, సాధనబలం కల ఇతర యోగులూ క్రమంగా సిద్ధపురుషుల లోకానికి వెళతారు. సాధనబలం లేనివారు పై నుండి తమ తమ క్రింది లోకాలకు వెళతారు.

శుద్ధభావం కల సిద్ధపురుషులు ఇంద్రియనిగ్రహం కలిగి, మిగిలిన ప్రారబ్ధకర్మను అనుభవించేవరకు వారి శరీరంలో ఇంద్రియాలూ, దేవతలూ, పరా, అపరా విద్యలు ఉంటాయి. **సాధకుడు నిత్యమూ శుద్ధమనస్సుతో విశుద్ధ మయిన పరమగతిని ధ్యానిస్తే ఆ గతి అతనికి తప్పక లభిస్తుంది. తరువాత దుర్లభమైన సనాతనబ్రహ్మపదాన్ని పొందుతాడు.** వృత్రా ! ఇలా నీకు శ్రీమన్నారాయణుని బలం వివరించాను.'

వృత్రుడు ఇలా అన్నాడు. 'మహాత్మా ! ఇది ఇంతే అయితే నాకు ఏమీ చింతలేదు. మీ మాటను చక్కగా తెలుసుకొని నిజంగా భావిస్తున్నాను. నా పాపాలు తొలగి పోయాయి. **మహర్షి ! మహా తేజస్వి, అనంతపరాక్రముడు అయిన విష్ణువు యొక్క శక్తిమంత మయిన పంపారచక్రం అతని సనాతన స్థానం. సృష్టి అంతా అక్కడి నుండే జరుగుతోంది. అతడు మహాత్ముడు. పురుషోత్తముడు. జగత్తు అంతా అతనిలోనే విలిచిఉంది.**' భీష్ముడు చెప్పాడు. ఇలా చెప్పి 'వృత్రాసురుడు తన

ఆత్మను పరమాత్మతో అనుసంధానం చేశాడు. పరమాత్మను ధ్యానిస్తూ, ప్రాణాలు విడిచి పరమాత్మను చేరాడు.' ధర్మరాజు ఇలా అన్నాడు. పితామహా ! సనత్కుమారుడు వృత్రునికి వివరించిన శ్రీమహావిష్ణువు ఈ జనార్దనుడే కదా !' భీష్ముడు అన్నాడు. 'మూలకారణంగా ఉన్న మహాదేవుడు శ్రీమన్నారాయణుడే. అతడు తన చిన్మయ రూపంలో నిలిచి, తన దివ్యప్రభావంతో సకల పదార్థాలను సృష్టిస్తాడు. ఆతని నాల్గవ భాగంతో ఏర్పడిన వాడే ఈ కేశవుడు. ఎనిమిదవ భాగంతో శ్రీకృష్ణుడు లోకాలను మూడింటిని సృష్టిస్తాడు. సనాతనుడైన శ్రీమన్నారాయణుడు కల్పాంతమందు కూడా ఉంటాడు. బలవంతు డయిన అతడు కల్పాంతంలో నీటి మీద శయనిస్తాడు. ప్రసన్నాత్ము డయిన అతడు శాశ్వతంగా లోకాలలో సంచరిస్తాడు. అనంతు డయిన నారాయణుడు లోకాలలో సంచరిస్తూ లోకాలను పరిపూర్ణం చేస్తాడు. వాని గమనాన్ని ఎవరూ అరికట్టలేరు. అతడు అనిరుద్ధుడు. జగత్తును అతడే సృష్టిస్తాడు. జగత్తు అంతా అతనిలోనే ఉంది.'

యుధిష్ఠిరుడు అడిగాడు. పితామహా ! వృత్రుడు ఆత్మస్వరూపాన్ని దర్శించాడని నేను అనుకొంటున్నాను. అందుకే అతడు దుఃఖం పొందకుండా సుఖమే పొందాడు. వృత్రుడు సత్కులంలో పుట్టాడు. స్వభావం శుద్ధ మయింది. సాధ్యుడు. మళ్లీ తిరిగిరాడు. పశుపక్ష్యాది జాతులలోకానికి కాని, నరకానికి కాని పోడు. పసుపు పచ్చని వర్ణం కలవారు (దేవసర్గంలో వారు), రక్తవర్ణం కలవారు (అనుగ్రహ సర్గంలోవారు) ఎపుడో ఒకప్పుడు తామస కర్మలచేత ఆవరించబడి తిర్యగ్జాతులలో పుడుతూ ఉంటారు. మేమయితే చాలా ఆపదలు పొందాం. సుఖంతో కలిసిన దుఃఖంలోను, కేవల దుఃఖంలోను ఆసక్తుల మయ్యాం. మేము ఏ గతి పొందుతామో ! నీల వర్ణ మయిన మానవ జాతిలోనా? కృష్ణవర్ణం కల స్థావరజాతిలోనా ? అని.' భీష్ముడు చెప్పాడు. 'పాండవులారా ! మీరు విశుద్ధ జన్మ సంపన్నులు. కఠిన వ్రతాలు చేసినవారు. అందుచేత దేవలోకాల్లో విహరించి, మళ్లీ మానవ శరీరం పొందుతారు. కాలానుగుణంగా, సుఖంగా సంతానంపొంది, స్వర్గం చేరి సుఖానుభవం పొంది సిద్ధిపొందుతారు. మీ మనస్సులో దుర్గతి భయం కలగదు. అందరూ పరిశుద్ధులు, నిర్మలులు కదా !'

281. వృత్రాసుర వధ.

ధర్మరాజు అన్నాడు. పితామహా ! అమిత తేజస్వి అయిన వృత్రుని ధర్మనిష్ఠ ఆశ్చర్యకరం. అతని విజ్ఞానం సాటిలేనిది. విష్ణుభక్తి కూడా అటువంటిదే. అమితతేజస్వి అయిన విష్ణుని స్థానం తెలియరానిది. అట్టి పదాన్ని వృత్రుడు ఎలా తెలుసుకోగలిగాడు ?

మీరు చెప్పినదంతా నేను నమ్ముతున్నాను. అయినా అవ్యక్తమయిన దర్శనంవల్ల నాకు స్పష్టంగా తెలియటం లేదు. వృత్రుడు ధార్మికుడు, విష్ణుభక్తుడు వేదాంత పదాలను సమన్వయించిన తత్త్వజ్ఞుడు. వానిని ఇంద్రు డెలా చంపగలిగాడు ? ఇది నా సంశయం. వృత్రాసురుని ఇంద్రుడు ఎలా చంపగలిగాడో చెప్పు. నాకు చాలా కుతూహలంగా ఉంది. వారిద్దరికీ ఎలా యుద్ధం జరిగిందో కూడా వివరంగా చెప్పు.' భీష్ముడు చెపుతున్నాడు. 'ఇంద్రుడు రథమెక్కి, దేవగణాలతో కలిసి బయలు దేరి ఎదుటగా పర్వతంలా నిలిచిన వృత్రుని చూశాడు. ఆ వృత్రుడు అయిదువందల యోజనాల ఎత్తు, మూడువందల యోజనాల లావు ఉన్నాడు. దేవతలు వృత్రుని భయంకర రూపం చూసి, మూడులోకాలకూ అతడు జయింప శక్యం కాని వాడని తలచారు భయంతో శాంతిని పొందలేక పోయారు. వృత్రుని ఉత్తమ రూపం చూసి, ఇంద్రునికి భయంతో ఊరువులు స్తంభించి పోయాయి. దేవదానవ యుద్ధప్రారంభం సూచిస్తూ యుద్ధభేరుల ధ్వని వెల్లువెత్తింది. ఎదుట నిలిచిన ఇంద్రుని చూసిన వృత్రునికి తొట్రుపాటు కాని, భయం కాని, ప్రయత్నం కాని కలగలేదు అంతలో మహాత్ముడయిన వృత్రునకు, దేవేంద్రు డయిన శక్రునకు త్రిలోకభయంకరంగా యుద్ధం ప్రారంభ మయింది దేవాసుర సైన్యం కత్తులతో, పట్టిసాలతో, శూలాలతో శక్తులతో, తోమరాలతో, ముద్గరాలతో, రాళ్లతో, ధ్వనించే ధనుస్సులతో, దివ్య శస్త్రాలతో అగ్ని జ్వాలలతో నిండి పోయింది. బ్రహ్మమొదలయిన దేవతాగణాలు ఋషులు, సిద్ధులు, గంధర్వులు, అప్సరసలు ఆయుద్ధం చూడటానికి విమానాల మీద అచ్చటకు వచ్చారు వృత్రుడు ఆకాశమంతా ఆవరించి, వేగంగా దేవేంద్రునిపై రాళ్ల వర్షం కురిపించాడు దేవగణాలు కోపించి, వృత్రుడు వర్షించే శిలావర్షాన్ని బాణ వర్షంతో తొలగించారు. వృత్రుడు మహాబలుడు, మహామాయావి. అతడు మాయాయుద్ధంతో అంతటా దేవేంద్రుని మోహింపజేశాడు. వృత్రాసురుని చేత పీడింపబడిన ఇంద్రునికి మోహం ఆవేశించింది అపుడు వసిష్ఠ మహర్షి రథంతరసామగానంతో ఇంద్రుని మేల్కొలిపాడు.

అపుడు వసిష్ఠుడు ఇలా అన్నాడు. 'దేవేంద్రా ! నీవు దేవతలలో శ్రేష్ఠుడవు మూడు లోకాలలోను బలవంతుడవు. దైత్యులను అసురులను సంహరిస్తావు. ఎందుకు మోహపడుతున్నావు ? ఇరుగో ! బ్రహ్మ విష్ణువు జగత్పతియైన శివుడు, చంద్రుడు, మహర్షులందరు, (కలత నొందిన నిన్నుచూసి నీ విజయం కోసం స్వస్తి పలుకుతున్నారు). ఇతరుల వలె విషాదం పొందకు. ఇంద్రా ! యుద్ధమందు బుద్ధి నిలిపి శత్రువులను జయించు. సర్వలోకులూ నమస్కరించే లోకగురువైన పరమేశ్వరుడు నిన్ను కృపతో

చూస్తున్నాడు దేవేంద్రా ! మోహం విడు బృహస్పతి పురస్సరులైన బ్రహర్షులు నీ జయంకోసం దివ్యస్తవంతో స్తుతిస్తున్నారు ' 'మహాత్ముడయిన వసిష్ఠుడు ఇలా ఉద్బోధిస్తే దానితో ఇంద్రునికి ఎంతో బలం కలిగింది అపుడు దేవేంద్రుడు తెలివినొంది మహాయోగంతో కూడి వృత్రాసురుని మాయను తొలగించాడు. అపుడు అంగిరసుని పుత్రుడయిన బృహస్పతి దేవర్షులు వృత్రుని పరాక్రమం చూసి, శంకరుని దగ్గరకు వెళ్లి, లోకహితం కోసం వృత్రాసురుని వినాశానికి శంకరుని ప్రార్థించారు అపుడు జగత్పతియైన శంకరుని దివ్యతేజస్సు రుద్ర జ్వరమై వృత్రాసురుని ఆవరించింది. లోక సంరక్షణ కాంక్షతో సర్వలోకాభిపూజితు డయిన విష్ణువు ఇంద్రుని వజ్రాయుధంలో ప్రవేశించాడు. తరువాత ధీమంతు డయిన బృహస్పతి మహాతేజస్వి అయిన వసిష్ఠుడు, మహర్షు లందరు కలిసి ఇంద్రుని దగ్గరకు వచ్చి ఏకాగ్రమనస్సుతో ఇంద్రునితో 'వృత్రుని జయించు' అని పలికారు

అపుడు మహేశ్వరుడు అన్నాడు 'ఇంద్రా ! ఈ వృత్రుడు ఎంతో బలంతో నిండినవాడు విశ్వాత్ముడు అన్ని చోట్లకు వెళ్లగలవాడు. చాలా మాయావి అని ప్రసిద్ధి చెందిన వాడు ఇంద్రా ! ముల్లోకాలకూ జయింప శక్యం కాని ఈ వృత్రాసురుని నీవు యోగం ఆశ్రయించి జయించు. అతనిని అవమానించకు/తక్కువగా భావించకు. ఇంద్రా ! ఇతడు బలంకోసం అరవై వేల సంవత్సరాలు తపస్సు చేశాడు అపుడు బ్రహ్మ వరమిచ్చాడు యోగమహిమ మహామాయ, మహాబలం, తేజస్సు కలుగుతుందని వర మిచ్చాడు ఇంద్రా ఇపుడు నా తేజస్సు నీలో ప్రవేశిస్తోంది. చంచలంగా ఉన్న ఈ రాక్షసుని వజ్రాయుధంతో సంహరించు అపుడు ఇంద్రుడు ఇలా అన్నాడు 'భగవన్ ! నీ అనుగ్రహంతో దురాసదు డయిన దానవుని మీరు చూస్తూ ఉండగానే ఈ వజ్రంతో సంహరిస్తాను భీష్ముడు చెపుతున్నాడు 'వృత్రాసురునిలో రౌద్రజ్వరం ప్రవేశిస్తూ ఉండగా హర్షంతో దేవతలు, మహర్షులు మహానాదం చేశారు వెంటనే వేలకొద్దీ దుందుభులు, శంఖాలు మురజాలు డిండిమాలు మ్రోగింప బడ్డాయి రాక్షసులందరికీ జ్ఞాపకశక్తి పోయింది. క్షణంలో రాక్షసుల బలమూ మాయ నశించి పోయాయి శివుని తేజస్సు ప్రవేశించిందని తెలిసి ఋషులూ, దేవతలూ ఈశానుని ఇంద్రునీ స్తుతిస్తూ ప్రచోదన చేశారు. యుద్ధ సమయంలో రధస్థుడయి ఋషులచే స్తుతింపబడే ఇంద్రుని యొక్క రూపం తేరిపారి చూడ శక్యం కాలేదు

282. బ్రహ్మ హత్యా విభాగము.

భీష్ముడు చెపుతున్నాడు. 'రాజా ! జ్వరం ఆవేశించిన వృత్రాసురుని శరీరంలో కనపడిన చిహ్నాలు చెపుతాను విను. ముఖం నిప్పులు క్రక్కుతోంది. శరీరం వివర్ణమయింది. శరీరంలో పెద్ద వణుకు పుట్టింది. శ్వాసలు పెద్ద వయ్యాయి. తీవ్రంగా గగుర్పాటు కలిగింది. నిట్టూర్పులు కలిగాయి. అతని ముఖం నుండి మిక్కిలి అమంగళకరంగా, దారుణంగా, నక్కరూపంలో అతని జ్ఞాపకశక్తి బయలు వెడలింది. వృత్రుని ప్రక్కనే మండుతూ, వెలుగులు విరజిమ్ముతూ ఉల్కలు పడ్డాయి గ్రద్దలు, రాబందులు, కొంగలు దారుణంగా అరుస్తూ, వృత్రునిపై చక్రాకారంలో తిరుగుతున్నాయి. రుద్రతేజస్సుతో పుష్టినొందిన ఇంద్రుడు రథమెక్కి యుద్ధంలో వజ్రాయుధం ఎత్తి, వృత్రాసురుని చూశాడు వృత్రాసురుడు తీవ్రజ్వరంతో పీడితుడై, అమానుషంగా అరిచి, ఆవలించాడు. వృత్రాసురుడు ఆవులిస్తూ ఉండగానే ఇంద్రుడు వృత్రునిపై వజ్రాయుధం ప్రయోగించాడు అది ప్రళయ కాలాగ్ని వలె మండి పోయింది. వెంటనే వజ్రం పెద్ద శరీరం కల వృత్రుని క్రింద పడవేసింది. పడిపోయిన వృత్రుని చూసి, దేవతలంతా సింహనాదాలు చేశారు. ఇంద్రుడు విష్ణుతేజస్సు నిండిన వజ్రంతో వృత్రుని సంహరించి స్వర్గానికి వెళ్లాడు. అపుడు వృత్రుని శరీరంనుండి మహాఘోరమూ భయంకరమూ అయిన బ్రహ్మహత్యా పాతకం బయల్వెడలింది. అది నల్లని కోరలతో, నలుపు పసుపు రంగులతో వికృతంగా భీకరంగా ఉంది. జుట్టు విరబోసుకొని ఉంది. నేత్రాలు భయంకరగా ఉన్నాయి. పుర్రెమాల ధరించి కృత్యవలె ఉంది. నెత్తురుతో తడిసిన నారబట్టలు ధరించి, ఆ భయంకర రూపం దాల్చిన బ్రహ్మహత్యాపాతకం బయటకు వచ్చి, ఇంద్రుని వెదకటం మొదలు పెట్టింది అపుడు లోకహితం కోరి, స్వర్గానికి వెళుతున్న ఇంద్రుని చూసి, బ్రహ్మ హత్యాపాతకం అతనిని సమీపించింది. బ్రహ్మహత్య దేవేంద్రుని పట్టుకొని అతని శరీరానికి అంటుకు పోయింది. బ్రహ్మహత్యాభయంతో పారిపోయి ఇంద్రుడు కమల నాళంలోనికి ప్రవేశించి, చాలా సంవత్సరాలు అందులోనే దాగి ఉన్నాడు. బ్రహ్మహత్యకూడ ఇంద్రుని ప్రయత్నంతో అనుసరించి, పట్టుకొన్నది అపుడు ఇంద్రుడు తేజోహీను డయ్యాడు. ఆ బ్రహ్మహత్యాపాతకం పోగొట్టుకొనేందుకు చాలా ప్రయత్నించాడు, కాని ఇంద్రునికి శక్యం కాలేదు. బ్రహ్మహత్యతోనే దేవేంద్రుడు బ్రహ్మ వద్దకు వెళ్లి, పాదాభివందనం చేశాడు. వృత్రాసురుని వధించినందువలన ఇంద్రునికి బ్రహ్మహత్యాపాతకం కలిగిందని బ్రహ్మ తెలిసికొని ఆలోచించాడు. బ్రహ్మదేవుడు బ్రహ్మహత్యాపాతకాన్ని ఉద్దేశించి మధురంగా నచ్చచెపుతున్నట్లు ఇలా అన్నాడు. 'భావినీ !

ఈ యింద్రుని విడిచిపెట్టు, నాకు ప్రీతి కలిగించు. నీ కోరిక ఏమిటో చెప్పు చేస్తాను.'

అప్పుడు బ్రహ్మహత్య ఇలా అంది. 'త్రిలోకకర్త, త్రిలోక పూజితుడు అయిన దేవుడు ప్రీతి చెందాడు అంటే నా పని అయినట్లే అనుకొంటున్నాను. నాకొక నివాసం ఏర్పరచండి. లోక రక్షణ కోసం నీవు చేసిన ఈ నియమం లోకంలో ఒక క్రొత్త సంప్రదాయాన్ని స్థాపించినట్లవుతుంది. నీవు సంప్రీతుడ వయితే నేను ఇంద్రుని నుండి తొలగి పోతాను. కాని నాకొక నివాసం చూపించు.' 'అపుడు పితామహుడు అలాగే అని బ్రహ్మహత్యతో చెప్పి ఇంద్రుని బ్రహ్మహత్యా పాతకాన్ని తొలగించాడు. వెంటనే బ్రహ్మ అగ్నిని తలచుకొన్నాడు. వెంటనే అగ్ని బ్రహ్మను చేరి, "దేవా ! మీ దగ్గరకు వచ్చాను, నేను ఏమి చేయాలో చెప్పండి"అన్నాడు. అపుడు బ్రహ్మ ఇలా అన్నాడు. 'ఇంద్రుని పాప విమోచనం కోసం ఈ బ్రహ్మహత్యను చాలా విధాలుగా విభజిస్తున్నాను. నీవు నాలుగవ భాగం తీసుకో ! వెంటనే అగ్ని ఇలా అన్నాడు. 'ప్రభూ ! నేను ఈ పాపం విడిపించుకొనటానికి ఉపాయం కూడా ఆలోచించండి. అదేదో తెలుసుకోవా లనుకొంటున్నాను.' బ్రహ్మ ఇలా అన్నాడు. 'జ్వలించే నీలో ఎవరయినా తమోగుణంతో బీజాలు కాని, ఓషధులుకాని, ఫలరసాలు కాని హోమం చెయ్యకపోతే వెంటనే అతనిలో ఈ బ్రహ్మహత్య ప్రవేశిస్తుంది. చింతించకు.' ఆ బ్రహ్మ మాటలు విని అగ్ని సంతోషించాడు. వెంటనే బ్రహ్మహత్యలోని నాల్గవ భాగం అగ్నిలో ప్రవేశించింది. తరువాత బ్రహ్మ వృక్షాలను, ఓషధులను, తృణాలను పిలిచి ఇలా చెప్పాడు.

'మహాభయంకరమైన ఈ బ్రహ్మహత్య వృత్రాసుర సంహారం వల్ల ఇంద్రునికి సంక్రమించింది. దాని నాల్గవ భాగం మీరు తీసుకోండి.' బ్రహ్మ మాటలు విని వృక్షాలు, ఓషధులు, తృణాలు అగ్నిలాగానే వ్యథచెంది ఇలా అన్నాయి. 'పితామహా ! మాకు వచ్చే ఈ బ్రహ్మ హత్యకు అంతం ఎలా ? ఇంతకుముందే మేము దైవోపహతులమై స్థావరాలుగా పుట్టాము. మళ్లీ మీరు మమ్ము బాధింపదగునా ! మేము ఇప్పటికే ఎల్లప్పుడూ వేడినీ, చలినీ, గాలినీ, ఛేదనమూ, భేదనమూ అన్నీ సహిస్తున్నాం. మీ ఆజ్ఞతో ఈ బ్రహ్మహత్యను కూడ భరిస్తాం. కాని త్రిలోకేశా ! మాకు దీనినుండి మోక్షం ఎపుడో ఆలోచించండి.' అపుడు బ్రహ్మ అన్నాడు. 'పర్వకాలాల్లో (సంక్రమణం, గ్రహణం, పూర్ణిమ అమావాస్య) అజ్ఞానంతో వృక్షాదులను ఛేదించేవానిని ఈ బ్రహ్మహత్య పొందుతుంది.'

భీష్ముడు చెపుతున్నాడు. 'తరువాత ఇలా అన్న బ్రహ్మను వృక్షాలు, ఓషధులు, తృణాలు పూజించి, వచ్చిన దారిలో వెళ్లి పోయాయి. తరువాత బ్రహ్మ అప్సరసలను పిలిచి, మధురమైన వాక్కుతో ఓదార్చుతున్నట్లు ఇలా అన్నాడు. 'వరాంగనలారా ! ఈ

బ్రహ్మహత్య ఇంద్రుని నుండి వచ్చింది. దీని నాల్గవ భాగాన్ని మీరు స్వీకరించండి.' అప్సరస లన్నారు. 'తమ ఆజ్ఞతో నాల్గవ భాగం స్వీకరిస్తాం కాని మాకు దీనినుండి విముక్తి ఎలా కలుగుతుందో ఉపాయం ఆలోచించండి.'

బ్రహ్మ అన్నాడు. 'రజస్వల అయిన స్త్రీలతో సంగమించే వారిని ఈ బ్రహ్మ హత్యాపాతకం పొందుతుంది. మీ మనోవ్యధ త్వరగా పోవుగాక ' అలాగే అని అప్సరసలు తమ తమ నివాసాలకు వెళ్లి సంతోషించారు. వెంటనే త్రిలోకకర్త, మహాతపస్వి యయిన బ్రహ్మ జలాలను ధ్యానించాడు. వెంటనే జలాలు బ్రహ్మను చేరాయి ఆ జలాలు వచ్చి బ్రహ్మకు నమస్కరించి, ఇలా అన్నాయి. తమ ఆజ్ఞతో నీవద్దకు మేము వచ్చాం. ప్రభూ ! ఆజ్ఞాపించండి.

బ్రహ్మ అన్నాడు. 'ఈ బ్రహ్మహత్య వృత్రుని సంహారం వల్ల ఇంద్రునికి వచ్చింది దీని నాల్గవ భాగాన్ని మీరు స్వీకరించండి. జలా లన్నాయి. 'ప్రభూ ! మీరు చెప్పినట్లే చేస్తాం కాని దీని నుండి మాకు విముక్తి కలిగే ఉపాయం కూడా ఆలోచించండి. దేవేశా ! మీరే జగత్తులకు పరాయణం మమ్ము ఈ కష్టం నుండి ఉద్ధరించడం కంటె అనుగ్రహం లేదు.' బ్రహ్మ అన్నాడు. 'జలాలను చులకనచేసి బుద్ధిమోహంతో నీటిలో శ్లేష్మం, మూత్రం మలం విసర్జించిన వానికి బ్రహ్మహత్య సంక్రమిస్తుంది. అలా మీకు ఈ పాతకం పోతుంది. ఇది నిజం.' వెంటనే ఇంద్రుని విడిచి, బ్రహ్మహత్య బ్రహ్మఆజ్ఞతో ఆయా స్థానాలకు చేరింది.

ఇలా ఇంద్రునికి బ్రహ్మహత్య సంక్రమించింది. తరువాత బ్రహ్మ అనుజ్ఞతో ఇంద్రుడు అశ్వమేధం చేశాడు అలా అశ్వమేధం చేసి తన బ్రహ్మహత్యాపాతకం నుండి ఇంద్రుడు పరిశుద్ధు డయ్యాడు. రాజా ! ఇంద్రుడు వేల కొద్దీ శత్రువులను చంపి, రాజ్యలక్ష్మిని చేపట్టి సాటిలేని సంతోషం పొందాడు వృత్రుని రక్తం నుండే పుట్ట గొడుగులు పుట్టాయి. వాటిని ద్విజాతులు భక్షింపకూడదు. దీక్షితులైన తపస్సులు కూడ తినరాదు. కురునందనా ! నీవు కూడా ఈ ద్విజులకు ప్రియం చెయ్యి. వీరే భూదేవులుగా ప్రసిద్ధి చెందారు. అమితతేజస్వి అయిన ఇంద్రుడు ఉపాయంతో సూక్ష్మబుద్ధితో వృత్రాసురుని సంహరించాడు. కౌంతేయా ! నీవు కూడా భూమిపై ఓటమి లేకుండా ఇంద్రుని వలె శత్రువులను జయిస్తావు ఇంద్రుని ఈ కథను ప్రతిపర్వంలోనూ బ్రాహ్మణ మధ్యంలో చెప్పిన వారికి ఏ పాపమూ అంటదు. వృత్రాసురునికి సంబంధించిన ఇంద్రుని అత్యాశ్చర్యకరమైన కథ నీకు చెప్పాను. ఇంకా ఎమి వినా లనుకొంటున్నావు ?'

283. దక్షయజ్ఞ భంగము - జ్వరోత్పత్తి.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'సర్వశాస్త్ర విదుడా ! పితామహా ! ఈ వృత్రవధ విషయమై ఒకటి అడగాలనుకొంటున్నాను. జ్వరంతో మోహితుడయిన వృత్రుని ఇంద్రుడు వజ్రంతో సంహరించాడని చెప్పారు గదా ! మహాప్రాజ్ఞా ! ఆ జ్వరం ఎందుకు పుట్టింది ? ఆ జ్వరోత్పత్తిని గురించి లోతుగా, నిపుణంగా వినాలనుకొంటున్నాను.' భీష్ముడు ఇలా చెపుతున్నాడు. 'రాజా ! లోక ప్రసిద్ధ మయిన జ్వరోత్పత్తిని గురించి విస్తారంగానే చెపుతాను విను.

సుమేరు పర్వతానికి జ్యోతిష్కమనే పేరుకల శిఖరం ఉంది. అది త్రిలోక పూజితం. సవిత్రునితో (సూర్యునితో) సంబంధం కలిగి సావిత్రం అనే పేరు ఉండేది. సర్వరత్నాలు అందులో ఉండేవి. ఇంత ఎత్తు అని ఎవరూ చెప్పలేనిది. ఎవరూ ప్రవేశింపరాకుండా ఉండేది. బంగారు ధాతువులతో నిండిన ఆ కొండశిఖరాన శయ్యామాద ఉన్నట్లుగా మహాదేవుడు ఉండేవాడు. అతని ప్రక్కనే నిత్యమూ పార్వతికూడా శోభించేది. మహాత్ములయిన దేవతలు, అపార శక్తికల వసువులు, దేవవైద్య లయిన అశ్వినీ దేవతలు, గుహ్యకులతో పరివేష్టింపబడి శంఖపద్మాది నిధులతో పరమైశ్వర్యంతో ఉన్న యక్షరాజు కుబేరుడు, మహాత్ము డయిన శుక్రాచార్యులు, శంకరుని ఉపాసిస్తున్నారు. సనత్కుమారుడు మొదలయిన మహర్షులు, అంగిరసుడు మొదలయిన వారు, అలాగే దేవర్షులూ, విశ్వావసు డనే గంధర్వుడు, నారద పర్వతులు, అప్సరోగణాలు - ఇలా ఎంతో మంది అక్కడికి వచ్చారు. ఎన్నో పవిత్ర గంధాలను మోసుకొని వచ్చి వాయువు సుఖకరంగా వీస్తున్నాడు. చెట్లన్నీ అన్ని ఋతువుల పూలతోనూ నిండి ఉన్నాయి. అలాగే విద్యాధరులు, సిద్ధులు, తపోధనులూ మహాదేవుని సేవిస్తున్నారు. నానారూపాలను ధరించిన భూతాలు, మహారౌద్రులయిన రాక్షసులు, బలవంతమైన పిశాచాలు, అలాగే మహాదేవుని అనుచరులు ఎన్నో రూపాలూ, ఆయుధాలూ దాల్చి సంతోషంతో అగ్నులవలె శోభిల్లుతూ ఉన్నారు. అక్కడ నందీశ్వరుడు ప్రజ్వలించే తేజస్సుతో శూలం తీసుకొని శివుని అనుమతితో నిలిచాడు. గంగానది సకలతీర్థాల జలాలతో రూపు దాల్చి, మహాదేవుని సేవిస్తోంది. ఇలా భగవంతుడయిన మహాదేవుడు దేవతలచేత, దేవర్షులచేత పూజింపబడుతూ మహాతేజస్వియై అక్కడ ఉన్నాడు.

కొద్ది సేపటికి దక్ష ప్రజాపతి పూర్వోక్త విధానంతో యజ్ఞం చేయాలని వచ్చాడు. తరువాత ఆతని యజ్ఞానికి ఇంద్రాది దేవతలంతా వెళ్లాలని కలిసి నిశ్చయించుకొన్నారు. మహాత్ము లయిన దేవతలు సూర్యాగ్ని సమతేజస్సు లీనే విమానాలెక్కి మహాదేవుని

అనుమతితో గంగాద్వారానికి (హరిద్వారం) వెళ్లారని విన్నాం. బయలుదేరిన దేవతలను చూసి, సతీదేవి పతి అయిన పశుపతితో ఇలా అంది. 'భగవన్ ! ఇంద్రుని ముందిడుకొని ఈ దేవతలంతా ఎక్కడకు వెళ్లుతున్నారు ? ఇది నాకు చాలా సంశయంగా ఉంది. నిజం చెప్పు' అంది అపుడు మహాదేవుడు అన్నాడు. 'ప్రజాపతులలో ఉత్తము డయిన దక్షుడు అశ్వమేధయాగం చేస్తున్నాడు. దేవతలు అక్కడకు వెళుతున్నారు.' అపుడు ఉమాదేవి అన్నది. 'మహాదేవా ! ఆ యజ్ఞానికి మీరు ఎందుకు వెళ్లటం లేదు ? ఏ ప్రతిబంధకం చేత మీరు వెళ్ళరు ?' మహేశ్వరుడు అన్నాడు. 'సాధ్వీ ! ఇదంతా దేవతలే పూర్వం నిశ్చయించారు. అన్ని యజ్ఞాలలోను నాకు భాగం కల్పించబడలేదు. సుందరీ పూర్వం నిశ్చయించిన నియమాన్ని అనుసరించే దేవతలు నాకు యజ్ఞంలో భాగం ఇవ్వలేదు' అపుడు ఉమాదేవి ఇలా అంది. భగవన్ ! మీరు సర్వభూతాలలోను ప్రభావంచేత, గుణాలచేత అధికులు. ఎవరూ మిమ్మల్ని జయించలేరు. తేజస్సుచేత, కీర్తిచేత సంపదచేత మిమ్ము ఎవరూ అవమానింపలేరు కూడా. మీకు భాగం ఇవ్వకుండా ప్రతిషేధించడం చేత నాకు చాలా దుఃఖం కలుగుతోంది. శరీరం కంపించి పోతోంది.'

భీష్ముడు చెపుతున్నాడు. 'భర్త అయిన పశుపతితో ఆమె ఇలా అని, మనసు మండిపోతుంటే మాటాడలేకపోయింది అపుడు భార్య మనసులో కోరుకొంటున్నది మహాదేవుడు తెలిసికొని నందీశ్వరుని 'నీవిక్కడే ఉండు' అని ఆజ్ఞాపించాడు. యోగేశ్వరేశ్వరు డయిన మహాదేవుడు వెంటనే యోగబలం ప్రయోగించి భయంకరులైన అనుచరులతో ఆ యజ్ఞాన్ని ధ్వంసం చేయించాడు. కొంతమంది అనుచరులు సింహనాదాలు చేశారు. కొంతమంది వికటాట్టహాసాలు చేశారు. ఇంకా కొంతమంది యజ్ఞకుండంలో రక్తం చల్లారు. కొంతమంది యూపస్తంభాలు పెకలించి వికృత ముఖాలతో సంచరించారు. కొంతమంది ఆ యజ్ఞపరిచారకులను, ఇతరులను మ్రింగేశారు ఇలా అంతటా ధ్వంసం చేయబడుతున్న యజ్ఞం మృగరూపం ధరించి, ఆకాశంలోకి వెళ్లిపోయింది. యజ్ఞం ఇలా మృగరూపం దాల్చి వెళుతూ ఉండటం చూసి శివుడు ధనుర్బాణాలు దాల్చి మృగాన్ని వెంటనంటాడు. అపుడు తేజస్వి అయిన రుద్రుని క్రోధం వలన అతని నుదుటి నుండి పెద్ద స్వేద (చెమట) బిందువు పడింది అది భూమి మీద పడగానే ప్రళయాగ్ని లాగా మండిపోసాగింది. అపుడు అందులో నుండి ఒక పురుషుడు పుట్టాడు. పొట్టిగా ఉన్నాడు ఎర్రని కళ్లు, కపిలగడ్డంతో భయంకరంగా ఉన్నాడు. నిక్కపొడిచి ఒంటినిండా రోమాలు కలిగి డేగలా, గుడ్లగూబలా ఉన్నాడు. నల్లని శరీరంతో ఎర్రని వస్త్రాలు ధరించాడు. దావాగ్ని ఎండిన అడవిని దహించివేసినట్లు ఆ మహాబలుడు ఆ యజ్ఞాన్ని దహించివేశాడు. అతడంతటా

తిరుగుతూ దేవతల వైపు ఋషులవైపు పరుగెత్తాడు. దేవతలు భయపడి, అన్ని దిక్కులకూ పారి పోయారు. రాజా ! ఆ పురుషుడు అలా సంచరిస్తూ ఉంటే భూమి కూడా కంపించిపోయింది. జగత్తు అంతా హాహా కారాలు చేసింది. అది చూసి పితామహుడు మహాదేవునికి లోకస్థితిని చూపించి/చెప్పి ఇలా అన్నాడు.'

బ్రహ్మ అన్నాడు. 'ప్రభూ ! దేవతలు యజ్ఞంలో మీకు కూడా భాగం ఇస్తారు. మీరు కోపం ఉపసంహరించండి. మహాదేవా ! మీ క్రోధం వల్ల ఋషులూ, ఈ దేవతలందరూ శాంతి పొందలేకపోతున్నారు. ధర్మజ్ఞా ! నీ స్వేదం నుండి పుట్టిన పురుషుడు జ్వర మనే పేరుతో లోకంలో ప్రచారం పొందుతాడు. ఒక్కడుగా ఉంటే అతని తేజస్సును భూమి భరించలేదు. అందుచేత ఇతనిని చాలా విధాలుగా విభజించు.' ఇలా చెప్పి బ్రహ్మ మహాదేవునికి కూడా భాగం కల్పించాడు. శివుడు 'సరే ! అలాగే' అన్నాడు. శంకరుడు చిరునవ్వు నవ్వుతూ చాలా ప్రీతిని పొందాడు. బ్రహ్మ చెప్పినట్లు శివుడు యజ్ఞభాగం పొందాడు. సర్వ ధర్మజ్ఞుడయిన శివుడు సర్వప్రాణుల శాంతి కోసం జ్వరాన్ని విభజించాడు. దాన్ని కూడా విను. జ్వరం ఏనుగులకు శిరస్తాపం అయింది. పర్వతాలకు శిలాజతురూపం (రాళ్లు పగిలి క్రిందకు పడటం), నీటికి నాచు, పాములకు కుబుసం, ఆవులకు ఖోరకం (గిట్టలలో కలిగే వ్యాధి), భూమికి చవిటినేల, పశువులకు చూపు మందగించడం జ్వరం. గుర్రాలకు కంఠరోగం జ్వరం, నెమిలికి పింఛం ఊడిపోవడం జ్వరం, కోకిలలకు నేత్రరోగం జ్వరం. గొర్రెలకు పిత్తభేదం జ్వరం, చిలుకలకు హిక్కిక (వెక్కిళ్లు/తుమ్ము) జ్వరం. శార్దూలాలకు శ్రమయే జ్వరం, మనుష్యులకు జ్వరమే జ్వరం. ఈ జ్వరం మహేశ్వరుని తేజోరూపం. దారుణమైనది. మరణ సమయంలో, ప్రసవ సమయంలో, మధ్యలో కూడా ఈ జ్వరం వస్తుంది. దీనికి ప్రాణులన్నీ నమస్కరించవలసిందే. గౌరవించాలి కూడా. ఇటువంటి జ్వరం వృత్రాసురుని ఆక్రమించింది. జ్వరపీడితుడై వృత్రుడు ఆవులించాడు. వాని మీద వెంటనే ఇంద్రుడు వజ్రాయుధం ప్రయోగించాడు. ఆ వజ్రం వృత్రాసురుని చీల్చివేసింది. వజ్రంతో చీల్చబడి, మహాయోగి అయిన వృత్రుడు తేజస్సంపన్నుడైన విష్ణువు యొక్క పరమపదాన్ని చేరాడు. విష్ణుభక్తి వల్లనే వృత్రుడు మూడు లోకాలను వ్యాపించాడు. ఆ విష్ణుభక్తి వల్లనే యుద్ధంలో మరణించి, పరమపదం చేరాడు. ఇలా వృత్రునికి సంబంధించిన జ్వర వృత్తాంతం అంతా చెప్పాను. ఇంకా ఏం చెప్పాలి ? ఈ జ్వరోత్పత్తిని ఏకాగ్ర చిత్తంతో ధైర్యంతో సదా చదివేవాడు రోగవిముక్తి పొంది, సుఖ సంతోషాలతో కోరిన కోరికలన్నీ పొందుతాడు.'

284. దక్షప్రోక్త శివసహస్ర నామస్తోత్రము.

జనమేజయుడు అడిగాడు. విప్రోత్తమా ! వైవస్వత మన్వంతరంలో ప్రచేతసుల పుత్రుడయిన దక్షుడు చేసిన అశ్వమేధయజ్ఞం ఎలా ధ్వంసమయిందో చెప్పండి. తనను యజ్ఞానికి పిలవలేదని, అది ఉమాదేవికి కోప కారణ మయిందని సర్వాత్మకుడయిన శంకరుడు కోపించాడు గదా ! మళ్లీ శంకరుని అనుగ్రహంతో యజ్ఞం ఎలా జరిగింది? ఇది తెలుసుకోవా లనుకొంటున్నాను. యధాతధంగా చెప్పండి. వైశంపాయనుడు చెపుతున్నాడు. పూర్వం హిమవత్పర్వతం వెనుకభాగాన గంగాద్వారంలో ఋషులూ, సిద్ధులూ సేవించే శుభప్రదేశంలో దక్షుడు యజ్ఞం చేశాడు ఆ ప్రదేశం అంతా లతలతో చెట్లతో ఆవరించబడి, గంధర్వులతో అప్సరసలతో నిండి ఉంది. ఋషి సముదాయాలు ధర్మాత్ము డయిన దక్షుని పరివేష్టించి కూర్చున్నారు భూమ్యాకాశాలలోను స్వర్గంలోను ఉన్న వారంతా ప్రజాపతికి నమస్కరించి కూర్చున్నారు. దేవతలు, దానవులు, గంధర్వులు, పిశాచులు, ఉరగులు, రాక్షసులు హాహా, హూహూ అనే గంధర్వులిద్దరు, తుంబురుడు, నారదుడు, విశ్వావసుడు, విశ్వసేనుడు ఇంకా ఇతర గంధర్వులు అప్సరసలు అక్కడ చేరారు. ఆదిత్యులు, వసువులు, రుద్రులు సాధ్యులు, మరుద్గణాలు ఇలా యజ్ఞభాగం కల వారంతా ఇంద్రునితో సహా వచ్చారు సూర్యకిరణాలను త్రాగేవారు సోమరసపానం చేసేవారు, హోమ ధూమం త్రాగే వారు, నేతిని త్రాగేవారు, ఋషులు పితృ దేవతలు బ్రహ్మతో కలిసి వచ్చారు ఇంకా జరాయుజ, అండజ స్వేదజ ఉద్భిజా లైన వివిధ ప్రాణులు, చాలామంది అక్కడకు వచ్చారు మంత్రాలతో ఆహ్వానించబడిన వారందరూ దేవతలూ తమ ధర్మపత్నులతో వచ్చి, ఆకాశంలో విమానాలపై అగ్నులవలె ప్రకాశిస్తున్నారు

వారందరినీ చూసి, దధీచి మహర్షి కోపంతో ఇలా అన్నాడు. రుద్రుని ఆరాధింపనిది యజ్ఞం కాదు ధర్మం కాదు వధను కాని బంధాన్ని కాని పొందుతారు. ఏమి కాల వైపరీత్యం ! ముంచుకొని వస్తున్న మహాఘోరాన్ని ఎవరూ ఎందుకు గమనించడం లేదు ? ఇంత అజ్ఞానమా !' ఇలా అని మహాయోగి అయిన దధీచి ధ్యాననేత్రంతో (క్రైలాసంలో) వరదు రాలయిన దేవిని, ఆమె సమీపంలో నారదుని చూసి సంతోషించాడు దధీచి తన మనసులో "వీరంతా శంకరుని పిలువ కూడదనే ఒకే ఆలోచనలో ఉన్నారు. అందుకే పిలవలేదు ' అనుకొన్నాడు **వెంటనే దధీచి అక్కడి నుండి లేచి ప్రక్కకు తొలగి ఇలా అన్నాడు "పూజింపదగని వారిని పూజించినా, పూజింపదగిన వారిని పూజింపకపోయినా మానవుడు ఎవ్వ డయినా నరహత్యా సమ మయిన పాపం పొందుతాడు.** ఇంతకు ముందు నేను ఎన్నడూ అసత్యం చెప్పలేదు. ఇక ముందు

చెప్పను. దేవతలు, మహర్షుల మధ్యలో సత్యం చెపుతున్నాను. సకల జగత్తుకు సృష్టికర్త, రక్షకుడు అయిన పశుపతి యజ్ఞంలో అందరి కంటె మొదటి భోక్తగా అయ్యేటట్లు చూడండి ' వెంటనే దక్షుడు ఇలా అన్నాడు. చేతిలో శూలం, శిరసు మీద జటాజూటం దాల్చిన వారు పదకొండు స్థానాల్లో ఉన్నారు. మాకు చాలా మంది రుద్రు లున్నారు కాని మహేశ్వరుని నేను ఎరుగను ' దధీచి అన్నాడు. 'ఇది మీ అందరి నిశ్చయం. అందుకే శంకరుని పిలవలేదు నేను శంకరుని మించి ఇతరుని దైవంగా భావించ నట్లే దక్షుని ఈ యజ్ఞం జరుగదు. వెంటనే దక్షుడు అన్నాడు. 'విధి మంత్రాలతో పవిత్రమైన భాగం అంతా అప్రతిముడూ యజ్ఞేశ్వరుడూ అయిన విష్ణువుకు ఈ సువర్ణపాత్రలో పెడుతున్నాను. అతడు ప్రభువు విభువు కూడ అతడే హవిస్సు అర్పింప దగిన వాడు/ఆహవనీయాగ్ని కూడా. కైలాసంలో దేవి ఇలా అంది. 'నా పతి అచింత్యుడూ ఆయిన శంకరుడు యజ్ఞంలో అర్ధభాగం కాని మూడవ భాగం కాని పొందటానికి నేను ఎటువంటి దానం చెయ్యాలి ? ఏ నియమం, తపస్సు ఆచరించాలి ?' క్షోభిస్తూ ఇట్లా అంటున్న భార్యను చూసి, శంకరుడు ఇలా అన్నాడు. నీవు నన్ను తెలుసుకో లేక పోతున్నావు. యజ్ఞేశ్వరుడనైన నాతో ఎలా మాట్లాడాలో నీకిపుడు తెలియటం లేదు.

విశాలాక్షీ ! నాకు తెలుసు ధ్యాన మెరుగని మూఢులు నన్ను తెలుసుకోలేరు. నీతోపాటు ఇంద్రాదులు, ముల్లోకాలు అన్ని విధాల మోహం పొందారు యజ్ఞంలో ప్రస్తోతలు నన్నే స్తుతిస్తారు సామగానం చేసేవారు రథంతరమనే సామతో నన్నే గానం చేస్తారు. బ్రహ్మవేత్త లయిన బ్రాహ్మణులు నన్నే పూజిస్తారు. అలాగే అధ్వర్యులు భాగం కల్పిస్తారు.' అపుడు దేవి ఇలా అంది. పామరుడయినా ప్రతీ పురుషుడూ స్త్రీల దగ్గర తన్ను తాను గర్వంతో పొగడు కొంటాడు. ఇది నిస్సందేహం.' వెంటనే భగవంతుడు ఇలా అన్నాడు. 'దేవీ ! నేను ఆత్మస్తుతి చేసుకోవడం లేదు. చూడు నన్ను. ఇపుడు యాగం కోసం ఎవరిని సృష్టిస్తానో ప్రాణాల కంటె ప్రియమైన దేవితో ఇలా అని, వెంటనే భగవంతుడు తన నోటి నుండి భయంకరమైన ఒక భూతాన్ని సృష్టించాడు. అది వారికి ఆనందం కలిగించింది ఆ పురుషునికి శంకరుడు దక్షుని యజ్ఞాన్ని నశింపజేయుమని ఆజ్ఞాపించాడు. శంకరుని ముఖం నుండి వెలువడిన ఆ సింహపరాక్రముడు దేవి దుఃఖాన్ని పోగొట్టడానికి దక్షయజ్ఞం ధ్వంసం చేశాడు అపుడు దేవి కోపంనుండి మహాభయంకరురా లయిన మహాకాళి ఉద్భవించి, తన పరాక్రమ ప్రకటన కోసం ఆ వీర పురుషుని అనుసరించింది. ఆమె మహాదేవుని అనుమతితో ఎదుట తలవంచి నమస్కరించింది. శౌర్యంలో తనతో సమానుడు బలమూ రూపమూ కల్గి క్రోధం రూపుదాల్చిన శంకరుడే అనంతబల

పౌరుషాలతో వీరభద్రు డనే పేరుతో దేవి దుఃఖాన్ని తొలగించే వాడయ్యాడు. ఆ వీరభద్రుడు తన రోమకూపాల నుండి రౌమ్యులనే గణనాయకులను సృష్టించాడు. వీర్య పరాక్రమాలతో వారు రుద్రునితో సమానులయి రౌద్రులని పిలవబడుతున్నారు. వారంతా పెద్ద పెద్ద శరీరాలతో భయంకరంగా వందలు వేలుగా, దక్షయజ్ఞ వినాశంకోసం ఆకాశం నింపేస్తూ, కిలాకిలా శబ్దాలతో వచ్చి పడ్డారు. ఆ శబ్దంతో దేవతలంతా భయపడ్డారు. పర్వతాలు బ్రద్దలయ్యాయి. భూమి కంపించింది. తుపానుగాలి వీస్తోంది. సముద్రం క్షోభించి పోయింది.

అగ్నులు జ్వలించటం లేదు. సూర్యుడు, గ్రహాలు నక్షత్రాలు, చంద్రుడు ప్రకాశించడం లేదు. ఋషులు, దేవతలు మానవులు తేజోహీనులయ్యారు. ఇలా చీకటి అయిపోతే రుద్రగణాలు దహన కాండ మొదలు పెట్టారు. కొంతమంది (సదస్యులను) కొట్టుతున్నారు. కొందరు యూపస్తంభాలు పీకేస్తున్నారు. కొందరు మర్దిస్తున్నారు, బ్రద్దలు కొడుతున్నారు. వాయు, మనోవేగాలతో కొందరు అటూ ఇటూ పరుగులు తీస్తున్నారు. యజ్ఞ పాత్రలను దివ్యాభరణాలనూ నుగ్గు నుగ్గు చేస్తున్నారు. పాత్రలు, ఆభరణాలు ఇష్టం వచ్చినట్లు విసిరి పారేస్తున్నారు. అవి ఆకాశంలో నక్షత్రాలవలె కనిపిస్తున్నాయి. అన్న, పాన, భక్ష్యాల రాసులు పర్వతాల వలె కనిపిస్తున్నాయి. అక్కడ పాలనదులు, నేయి-పాయసాల బురదలు, పెరుగు-మీగడల నీళ్లు ఖండ శర్కరల ఇసుకలు కనిపిస్తున్నాయి. ఈ బెల్లపు నదులలో షడ్రసాలు ప్రవహిస్తున్నాయి. అందులోనే మాంస భక్ష్యాలు ఉచ్చనీచాలయిన వివిధ పదార్థాలు ప్రవహిస్తున్నాయి. దివ్యమయిన పానకాలు, లేహ్యాలు, చోష్యాలు రుద్రగణాలు వివిధ ముఖాలతో తింటున్నారు. కొంత మంది విసిరి కొడుతున్నారు. కొందరు లాక్కుంటున్నారు. రుద్రుని కోపంతో ఉద్భవించిన మహాకాయులు కాలాగ్నితో సమానంగా దేవతల సైన్యాన్ని క్షోభింపజేస్తూ, అంతటా భయపెడుతున్నారు. వివిధరూపాలు దాల్చి దేవతా స్త్రీలను విసరివేస్తూ ఆడుకొంటున్నారు. దేవతలు రక్షించే ఆ యజ్ఞాన్ని రుద్రకర్ము లందరూ వేగంగా దహించివేశారు. సర్వప్రాణులకూ భయంకరంగా ధ్వనులు చేస్తూ వారు యజ్ఞ శిరస్సును భేదించి పెద్దగా బొబ్బలు పెట్టి సంతోషించారు. వెంటనే బ్రహ్మాది దేవతలూ, దక్షప్రజాపతి నమస్కారాలు చేస్తూ "మీరెవరో చెప్పండి" అని అడిగారు.

అపుడు వీరభద్రుడు ఇలా అన్నాడు. "నేను రుద్రుడిని కాను, దేవినీ కాను. యజ్ఞంలో తినటానికి వచ్చిన వాడినీ కాదు. దేవికి కోపం వచ్చిందని తెలిసి సర్వాత్మకుడయిన శంకరునికి కోపం వచ్చింది. యజ్ఞాన్నో బ్రాహ్మణులనో చూడటానికి కుతూహలంతో వచ్చిన వాడినీ కాదు. నీ యజ్ఞాన్ని ధ్వంసం చేయటానికి వచ్చానని తెలుసుకో ! రుద్రుని

కోపంతో పుట్టిన వీర భద్రుడను నేను ఈమె దేవి కోపంతో పుట్టిన భద్రకాళి. మహాదేవుడు పంపితే ఈ యజ్ఞానికి వచ్చాం. విప్రా ! దేవదేవుడయిన శంకరుని శరణు పొందు. ఇతరుల నుండి వరం పొందటం కంటె శంకరుని క్రోధం కూడా మంచిదే. వీరభద్రుని మాటలు విని, ధర్మాత్ము డయిన దక్షుడు మహేశ్వరునికి నమస్కరించి, స్తోత్రంతో ఆయనను సంతోష పరిచాడు. 'ఈశానుడు, శాశ్వతుడు, ధ్రువుడు, అవ్యయుడు, మహాత్ముడు, జగత్తు అంతటికి పతి అయిన మహాదేవుని శరణు కోరుతున్నాను.' బహునేత్రాలు కల్గి, శత్రువిజేత అయిన మహాదేవుడు అన్ని దిక్కులకు దృష్టి ప్రసరింపజేసి, వక్ర స్థానంతో ప్రయత్నించి ప్రాణాపానాలను నిరోధించాడు. వెంటనే అతడు అగ్నికుండం నుండి ఉద్భవించాడు. ప్రలయకాలాగ్ని వలె వేల సూర్యుల తేజస్సును దాల్చి శివుడు చిరునవ్వుతో "నీకేం చేయాలి - చెప్పు' అన్నాడు. ముందు దేవగురువు బృహస్పతి మఖాధ్యాయం వినిపించాడు. వెంటనే దక్షుడు అంజలి ఘటించి, భయంతో కళ్లలో నీళ్లు తిరుగుతూ ఉండగా, శంకరునితో ఇలా అన్నాడు.

'భగవన్ ! మీరు ప్రసన్నులయితే, నేను మీకు ఇష్టుడనయితే, నేను అనుగ్రహింపతగిన వాడనయితే, మీరు వరమివ్వా లనుకొంటే... దగ్ధమై, భక్షితమై, త్రాగి, తినబడి, నశించి, పొడిపొడియై పోయి, విసరివేయబడిన ఈ యజ్ఞ సంభారం అంతా చాలా కాలం ఎంతో కష్టపడి కూర్చినది. అది వ్యర్థం కాకూడదని మిమ్ము వరం అడుగుతున్నాను' అన్నాడు. వెంటనే ధర్మాధ్యక్షుడు విరూపాక్షుడు, ముక్కంటి భగుని నేత్రాలను హరించిన శంకరుడు "తథాస్తు" (అలాగే అగుగాక) అన్నాడు. శంకరుని నుండి వరం పొంది, దక్షుడు మోకాళ్ల మీద శంకరునికి నమస్కరించి, వెయ్యి ఎనిమిది నామాలతో వృషభధ్వజుని స్తుతించాడు ధర్మరాజు అడిగాడు దక్ష ప్రజాపతి ఏ ఏ నామాలతో శంకరుని స్తుతించాడో చెప్పండి పితామహా ! నాకు వినాలని చాలా కుతూహలంగా ఉంది' భీష్ముడు చెపుతున్నాడు. 'ధర్మజా అద్భుత కృత్యాలు చేస్తూ నిగూఢ వ్రతాచరణం చేసే మహాదేవుని రహస్యాలు ప్రకాశాలు అయిన నామాలు విను. దేవదేవేశా ! నమస్కారం. దేవతలకు శత్రువు లయిన వారి బలాన్ని సంహరించు వాడా ! దేవేంద్రుని బలాన్ని సహితం స్తంభింపజేయగలవాడా ! దేవతల చేతను దానవుల చేతను కూడా పూజింపబడువాడా ! అనేక నేత్రాలు కలవాడా ! విలక్షణమయిన నేత్రాలు (ఇంద్రియములు) కలవాడా ! మూడు కన్నులు కలవాడా ! కుబేరునికి ఇష్టమయిన వాడా! అన్ని వైపులా చేతులూ కాళ్లూ కలవాడా ! అన్ని వైపులా నేత్రాలు, శిరస్సులు, ముఖాలు కలవాడా... నమస్కారం. లోకమున అన్ని వైపుల కర్ణాలు కలవాడా ! అంతటా ఆవరించి ఉండే వాడా ! శంకుకర్ణ,

మహాకర్ణ కుంభకర్ణ అర్ణవాలయ, గజేంద్రకర్ణ గోకర్ణ, పాణికర్ణ అనే ఎడుగురు పార్షదుల స్వరూపమైన వాడా ! నీకు నమస్కారం వేల కొలదీ ఉదరాలు, వేల నాభులూ, వేల జిహ్వాలూ కల నీకు నమః. గాయత్రిని జపించేవారు నిన్నే గాయత్రిగా జపిస్తారు. సూర్యోపాసకులు నిన్ను సూర్యునిగా ఆరాధిస్తారు. జ్ఞానులు మిమ్ము బ్రహ్మస్వరూపంగా, ఇంద్రునిగా ఆకాశంగా ఆరాధిస్తారు. సముద్రమూ, ఆకాశమూ నీ అష్టమూర్తులలోనివే - (పంచభూతాలు, సూర్య చంద్ర యజమాన స్వరూపాలలో) నీ అష్టమూర్తులలో దేవతలందరూ గోశాలలో గోవులవలె ఉంటారు. నీ శరీరంలో చంద్రుని అగ్నిని వరుణుని, సూర్యుని, విష్ణువును బ్రహ్మను, బృహస్పతిని చూస్తున్నాను. భగవన్ ! నీవే కారణం, కార్యం, క్రియ సాధనం సత్తుకు అసత్తుకు, ఉత్పత్తి వినాశాలకూ నీవే కారణం నీవే భవుడవు. శర్వుడవు (సంహారకర్త), రుద్రుడవు (పాపాలను పారద్రోలేవాడవు), వరాలు ఇచ్చేవాడవు. పశువులకు (జీవులకు) నీవే పతివి. అంధకాసురు డనే అజ్ఞానాన్ని సంహరిస్తావు. నీకు నిత్యమూ నమస్కారం. మూడు జటలు మూడు శిరస్సులు కల నీకు నమస్కారం. త్రిశూలాన్ని చేతియందు ధరించిన త్ర్యంబకుడవు త్రినేత్రుడవు, త్రిపురాలను భంజించిన నీకు నమస్సులు చండుడవు, కుండుడవు, బ్రహ్మాండ స్వరూపుడవు బ్రహ్మాండ ధరుడవు. అందరినీ దండిస్తావు అందరి విన్నపాలు సమంగా వినే చెవులు కలవాడవు. దండం, ముండనం కలవాడవు. నీకు నమస్సులు. నీవు ఊర్ధ్వ దంష్ట్రలు కలిగినవాడవు. ఊర్ధ్వ కేశుడవు. పరిశుద్ధుడవు. సర్వవ్యాపకుడవు. రజోగుణంతో విలోహితుడవు తమోగుణంతో ధూమ్రుడవు నల్లని కంఠం కల నీకు నమస్కారం. నీతో సమాన రూపం ఎవరికీ లేదు. వివిధ రూపాలు ధరిస్తావు. కల్యాణ కారకుడవు. సూర్యుడవు. సూర్యులు మాలగా అయిన వాడవు సూర్యుడే ధ్వజంగా పతాకంగా కలవాడవు. నీకు నమస్సులు.

ప్రమధగణాలకు నాధుడవు. ఎద్దు మూపురం వంటి ఎత్తయిన భుజాలు కలవాడవు. పినాక ధనుస్సు ధరించినవాడవు. శత్రువులను అణచివేస్తావు. దండాన్ని ధరిస్తావు ఆకులు నార చీరలు వస్త్రంగా ధరిస్తావు. నీకు నమస్కారం నీ నుండి హిరణ్యం పుట్టింది. బంగారు కవచం ధరిస్తావు. బంగారు కిరీటం ధరిస్తావు. సువర్ణానికి అధిపతివి. నీకు నమస్కారం నీవు ప్రస్తుతింపబడే వాడవు స్తుతింపదగినవాడవు. స్తుతింప బడుతున్నవాడవు సర్వరూపుడవు. సర్వాన్ని (తినే) సంహరించేవాడవు. సర్వప్రాణుల అంతరాత్మ అయిన వాడవు నీకు నమస్కారం. హోమం చేసేవాడవు నీవే మంత్రమూ నీవే. తెల్లని ధ్వజాలు, జెండాలు నీవి. జగత్తు అంతా నీ నాభిలో ఉంది. అందుచే నాభుడవు. సంసార చక్రానికి నాభివంటి వాడవు నాభ్యుడవు అన్ని ఆవరణాలకు ఆవరణానివి,

నీకు నమస్కారం. సన్నని నాసిక, అవయవాలూ, కలిగిన రూపంతో ఉన్నవాడవు. సంతోషించేవాడవు. విశిష్టమైన హర్షం పొందుతూ కిలకిలా రావం చేసే నీకు నమస్కారం. ప్రాణుల శరీరాలలో అంతర్యామిగా శయనిస్తావు. ప్రళయంలో యోగనిద్రతో శయనించి సృష్టిసమయంలో మేల్కొంటావు. శాశ్వతంగా నిలిచిఉంటావు. కాల రూపంలో పరుగెత్తుతావు. ముండనం చేయించుకొన్న సన్యాసి రూపుడవు. జడలు ధరించిన తపస్వివి. నీకు నమస్కారం. నర్తించే స్వభావం కలవానికి, ముఖ వాద్యాలు ఊదేవానికి, నదిలో పూసే కమలాల పూజ మీద ఆసక్తి కలవానికి, గీత వాద్యాలలో నిపుణునికి, నీకు నమస్కారం. వయసులో జ్యేష్ఠునికి, గుణాలలో శ్రేష్ఠునికి, ఇంద్ర రూపుడై బలాసురుని సంహరించినవానికి, కాల నాథునికి, సర్వకళానిపుణునకు, సంహారరూపునకు, అవాంతర ప్రలయరూపునకు నీకు నమస్కారం. భయంకరమైన దుందుభి ధ్వని వంటి అట్టహాసం చేసేవానికి, భీషణ వ్రతం చేసేవానికి, భయంకరునికి, పది బాహువులు కల నీకు - నమస్సులు. కపాలం చేతి యందు కలవానికి, చితాభస్మం పై ప్రీతి కల వానికి, భయంలేని వానికి, అందరికీ భయం కలిగించే వానికి, శమదమాది భీమ వ్రతాలు దాల్చినవానికి నమస్సులు. వికృతమైన ముఖం కలవానికి, ఖడ్గం వంటి నాలుక కలవానికి, దంష్ట్రలు కలవానికి, ఆమపక్వమాంసాలపై ప్రీతి కలవానికి, తుంబీ వీణా ప్రియునకు నమస్కారము. వృష్టికర్తకు, ధర్మవృద్ధి చేయువానికి, నందిరూపునకు, ధర్మ స్వరూపునకు, అగ్ని రూపునకు, దండ స్వరూపునకు, ప్రాణులను పక్వం చేసే కాల స్వరూపునకు నమస్కారం. నీవు అందరి కంటె శ్రేష్ఠుడవు. వర స్వరూపుడవు. వర ప్రదాతవు. ఉత్తమమైన దండలు, గంధం వస్త్రాలు ధరిస్తావు. అడిగిన దాని కంటె ఎక్కువగా వరాలిచ్చే నీకు నమస్కారం.

రాగివి - విరాగివి కూడా నీవే. సర్వాన్ని భావిస్తావు. రుద్రాక్ష మాల ధరిస్తావు. కారణ రూపంతో అంతటా వ్యాపిస్తావు. కార్యరూపుడవై వేరు వేరుగా కనిపిస్తావు. జగత్తుకు నీడ, ఎండ ఇస్తావు. నీకు నమస్సులు. అఘోర రూపుడు, ఘోరరూపుడు, ఘోరఘోరతర రూపుడవు నీవు. శివుడవు, శాంతుడవు, శాంతతముడవు నీకు నమస్కారం. ఒకే పాదం, బహునేత్రాలు, ఒకే శీర్షం కల నీకు నమస్సులు. రుద్ర రూపుడవు. చిన్న కానుకలయినా అభిలషించేవాడవు. కోరికలను మించి పంచియిచ్చేవాడవు నీకు నమస్కారం. ప్రపంచాన్నంతా పొందేవానికి. అలంకరించేవానికి; తెల్లని శరీరం కలవానికి నమస్కారం. ఎల్లప్పుడూ శాంత రూపంతో ఉండే వానికి, శత్రుభయంకరంగా ఘంటానాదం చేసే వానికి, ఘంటానాద స్వరూపునకు, అనాహత ధ్వని రూపంలో ఉండేవానికి నమస్కారం. వేల మంది చేసే ఘంటానాదం కలవాడు, వరుసగా ఘంటానాదం చేయటం ప్రియమయినవాడు. ప్రాణ

ఘంటా ధ్వని కలవాడు, గంధరూపుడు, అవ్యక్త మధురమైన ధ్వని, కళ కలవాడు. అతనికి నమస్సులు. క్రోధం శాంతించిన వానికి, శాంత ప్రియునకు, నిత్యమూ శమప్రధానుడై ఉండువానికి, పర్వతాలు, వృక్షాలు నిత్యమూ ఆలయమై ఉండేవానికి నమస్కారం. వన యందు ప్రీతి కలవానికి, తరింపజేసే వానికి, తరించేవానికి, యజ్ఞోపకరణ రూపమైన వానికి, యజ్ఞరూపునికి, హవన రూపునకు, అగ్ని రూపునకు నమస్కారం. యజ్ఞ నిర్వాహకునకు అగ్ని రూపునకు, ఇంద్రియాలు వశమందున్న వానికి, సత్త్వమయునకు, రజోమయునకు, తీర స్వరూపునకు, నదీ రూపునకు, నదులకు పతియైన సముద్ర స్వరూపునకు నమస్కారం. అన్నదాతకు, అన్నపతికి, అన్నభోక్తకు, ఎన్నో శిరసులు కలవానికి, ఎన్నో పాదాలు కలవానికి నమస్సులు. అనేక శూలాలను చేతులతో ఎత్తి పట్టుకొనే వానికి, అనేక నయనాలు కలవానికి, ఉదయ సూర్యుని వర్ణం కలవానికి, బాల రూపధారికి నమస్కారం. అనుచరులైన బాలురను రక్షించే వానికి, బాలురతో క్రీడించే వానికి, వృద్ధునికి, భక్తిలోభికి, (దుష్ట కార్యాలకు) క్షోభించేవానికి, దుష్టులను క్షోభింపజేసేవానికి నమస్కారం. గంగాతరంగాలకు అంకితమైన కేశాలు కలవానికి, ముంజదర్భల వంటి కేశాలు కలవానికి నమస్కారం. షట్కర్మలచే సంతోషించేవానికి, త్రికర్మ తత్పరునకు నమస్కారం.

వర్ణాశ్రమాలకు యథావిధిగా కర్మవిభాగాన్ని నిర్వర్తించేవానికి, జపించే మంత్ర రూపునికి, ఘోష స్వరూపునకు, కోలాహల మయునికి నమస్కారం. శ్వేత, పింగళ వర్ణములు కల నేత్రాలు కలవానికి, నలుపు ఎరుపు చూపులు కలవానికి, ప్రాణాన్ని భగ్న మొనర్చేవానికి, దండరూపునకు, బ్రహ్మాండ భాండాన్ని బ్రద్దలు చేసేవానికి, కృశించిన వానికి నమస్సులు. ధర్మార్థ కామ మోక్షాలకు సంబంధించి ప్రశస్తమైన కథలు కలవానికి, సాంఖ్య స్వరూపునకు, సాంఖ్యముఖ్యునకు, సాంఖ్య, యోగాలను ప్రవర్తింపజేసే వానికి నమస్సులు. రథమెక్కి, రథవిరహితంగానూ సంచరించే వానికి; జల, అగ్ని, వాయు, ఆకాశాలందు కూడ సంచరించే రథం కలవానికి, కృష్ణాజినం ఉత్తరీయంగా ధరించేవానికి, పాము యజ్ఞోపవీతంగా కలవానికి నమస్కారం. ఈశానుడా ! వజ్రసముదాయ రూపుడా ! హరికేశా ! నమస్కారం. మూడు కనులు కలవానికి, పార్వతీపతికి, వ్యక్తావ్యక్త స్వరూపునకు నమస్సు. కామ స్వరూపుడవు, కోరిక లిచ్చేవాడవు. మన్మథుని సంహరించినవాడవు. తృప్తులను, అతృప్తులను పరిశీలించే వాడవు. సర్వస్వరూపుడవు, సర్వమూ ఇచ్చేవాడవు, సర్వులను సంహరించే వాడవు. సంధ్యాకాలమందలి ఎరుపుతో సమాన వర్ణం కలవాడా ! నమస్సులు. మహాబలా ! మహాబాహూ ! మహాసత్త్వా, మహాద్యుతీ ! మహామేఘసమూహంతో సమానమైన వాడా ! మహాకాలా ! నీకు నమస్కారం. స్థూల శరీర రూపుడా ! జీర్ణరూపుడా ! జటాధారీ !

నారబట్టలు, మృగచర్మం ధరించిన వాడా ! ప్రకాశించే సూర్యాగ్నుల వంటి జడలు కలవాడా ! వల్కలాజినాలు వస్త్రంగా కలవాడా ! వేయి సూర్యులతో సమానుడా ! తపస్సు నందే సదా నిలిచేవాడా ! నీకు నమస్సులు. జగత్తును మోహింపజేసే వాడా ! ఎన్నో సుడులు తలపై కలవాడా ! గంగాజలాలతో తడిసిన కేశపాశం కలవాడా! చంద్రుని ఆవర్తింపజేయువాడా ! యుగాలను త్రిప్పువాడా! మేఘాలను ప్రవర్తింపజేయువాడా ! నీకు నమస్కారం. నీవే అన్న స్వరూపానివి, అన్నాన్ని తినేవాడవు. అన్నాన్ని ఇచ్చేవాడవు, అన్నాన్ని రక్షించేవాడవు. అన్నాన్ని సృష్టించేవాడవు. వండేవాడవు. పక్వమైన దానిని భుజించేవాడవు. ప్రాణవాయు రూపుడవు. జఠరాగ్ని రూపుడవు. జరాయుజాలు, అండజాలు, స్వేదజాలు, ఉద్భిజాలు అనే నాలుగు విధాలయిన ప్రాణులూ నీవే. చరాచరాలను నీవే సృష్టిస్తావు. నీవే సంహరిస్తావు. బ్రహ్మజ్ఞానం కలవారు నిన్నే పరబ్రహ్మగా చెపుతారు. వేదవేత్తలు నిన్నే మనస్సుకు కారణభూతుడ వనీ, ఆకాశ మనీ, వాయు వనీ, తేజోనిధి వనీ, ఋక్కుల రూపుడ వనీ, సామరూపుడ వనీ, ఓంకార మనీ చెపుతారు.

మహాదేవా ! సామవేద గానం చేసే వేదవేత్తలు హా3యి, హా3యి, హు3వా, హా3యి, హా3వు, హా3యి అంటూ పలుమార్లు నిన్ను పాడుతూ ఉంటారు. 'నీవు యజుర్వేద ఋగ్వేద స్వరూపుడవు. ఆహుతి స్వరూపుడవు.' అని వేదోపనిషత్తుల సముదాయ స్తుతులతో కీర్తింపబడతావు. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యశూద్రులు, అంత్యజులు అందరూ నీ స్వరూపమే. మెరుపులు, ఉరుములతో ధ్వనించే మేఘసమూహాలు కూడా నీవే. సంవత్సరాలు, ఋతువులు, మాసాలు, పక్షాలు నీ స్వరూపాలే. అలాగే యుగాలు, నిముషాలు, కాష్ఠలు, నక్షత్రాలు, గ్రహాలు, కళలు అన్నీ నీవే. వృక్షాలలో శ్రేష్ఠమైన మర్రి, రావి చెట్లు నీవే. పర్వతాలలో శిఖరానివి, మృగాలలో వ్యాఘ్రానివి, పక్షులలో గరుడునివి, పాములలో అనంతుడివి. సముద్రాలలో పాలసముద్రానివి, యంత్రాలలో ధనుస్సువు, ప్రహరణాలలో వజ్రానివి, వ్రతాలలో సత్యానివి. ఇచ్ఛ, ద్వేషం, రాగం, మోహం, క్షమ, అక్షమ, వ్యవసాయం, ధృతి, లోభం, కామక్రోధాలు, జయాపజయాలు నీవే. గద, బాణం, విల్లు ఖట్వాంగం, ఝర్ఝరం అనే అస్త్రాన్ని ధరించేవాడవు నీవే. ఛేదనం, భేదనం, ప్రహరణం చేస్తావు. నాయకుడవు, మా శుభాన్ని గురించి మననం చేసేవాడవు, తండ్రివి నీవే. దశలక్షణాలుకల ధర్మం, అర్థం, కామం నీవే. గంగ, సముద్రాలు, నదులు, పల్వలాలు, సరస్సులు, లతలు, వల్లులు, తృణాలు, ఓషధులు, పశువులు, మృగాలు, పక్షులు, ద్రవ్య కర్మల ఆరంభం, పుష్ప ఫలాలు ఇచ్చేకాలమూ నీవే. దేవతల ఆది, అంతాలు నీవే. గాయత్రీ మంత్రం, ఓంకారం నీవే. హరిత, రోహిత, నీల, కృష్ణ, రక్త, అరుణ, కద్రు, కపిల, కపోత, మేచకాది

వర్ణాలు నీవే అయినను నీవు వర్ణరహితుడవు సువర్ణుడవు వర్ణాలను కల్పిస్తావు. మేఘసమానుడవు. చక్కని వర్ణాలు కల పేరు కలవాడవు సువర్ణప్రియుడవు ఇంద్రుడవు, యముడవు వరుణుడవు కుబేరుడవు అగ్నివి సూర్యుడవు రాహువువు చంద్రుడవు, సూర్య చంద్రగ్రహణ రూపుడవు అగ్ని యజమాని హోమ పదార్థం, హోమం చేయబడినదీ, హోమ ఫలం ఇచ్చే వాడివి నీవే వేదాలలోని త్రిసుపర్ణం యజుర్వేదంలోని శతరుద్రియ నామాలు నీవే

పవిత్రాలైన వానిలో మిక్కిలి పవిత్రుడవు నీవు శుభాలలో మిక్కిలి శుభస్వరూపుడవు. అచేతనాలకు చేతనత్వం కలిగిస్తావు. రాక పోకలు ఇస్తావు సంసార వృక్షం జీవుడు, శరీరం ప్రాణం సత్త్వరజస్తమస్సులు ఊర్ధ్వరేతస్కులు, ప్రాణ అపాన సమాన ఉదాన, వ్యానాలు ఉన్మేష నిమేషాలు తుమ్ము ఆవులింత, అన్నియు నీవే. లోపలఅగ్ని కల దృష్టికలవాడవు మహావక్త్రం మహాఉదరం కలవాడవు సూది వెంట్రుకలు, హరిత వర్ణపు మీసం గడ్డం కలవాడవు ఊర్ధ్వకేశుడవు చరాచర స్వరూపుడవు గీత వాద్యాల తత్త్వమెరిగినవాడవు గీత వాదనం మీద ప్రీతి కలవాడవు మత్స్యం, జలచరం చేపలను పట్టేవారు నీవే బంధనం లేనివాడవు కేళికళ కలవాడవు అకాలం, అతికాలం నీవే. దుష్కాలం కాలం కూడ నీవే. మృత్యువూ, ఛేదించే కత్తి, ఛేదింపబడేది నీవే. మిత్ర పక్షాన్ని శత్రుపక్షాన్ని నశింపజేసేదీ నీవే మేఘం వలె నల్లని వాడవు. పెద్దపెద్ద కోరలు కలవాడవు, ప్రళయకాల మేఘమూ నీవే వ్యక్త ప్రకాశమూ అవ్యక్త ప్రకాశమూ కలవాడవు, కర్మఫలం ఇచ్చేవాడవు ఘంటలు కలవాడవు జీవులతో క్రీడించే వాడవు, అన్నిటిలో కారణ రూపుడవై వ్యాపించి ఉంటావు. బ్రహ్మవు అగ్నివి, దండివి ముండుడవు త్రిదండ ధారివి నీవే. నాలుగు యుగాలు వేదాలు నీవే యజ్ఞం ప్రవర్తింపజేసేవాడవు నాలుగాశ్రమాలకు ప్రభువువు చాతుర్వర్ణ్యాలను సృష్టించినదీ నీవే నీవు సదా అక్షప్రియుడవు ధూర్తుడవు, గణాధ్యక్షుడవు గణాధిపుడవు ఎర్రని దండలు వస్త్రాలు ధరిస్తావు గిరిమీద శయనిస్తావు గిరి నుండి పుట్టిన వాటిని ఇష్టపడతావు నీవు శిల్పివి శిల్పులలో శ్రేష్ఠుడవు శిల్పాలన్నీ ప్రవర్తింపజేస్తావు భగుని నేత్రాలకు అంతకుడవు పూషుని దంతాలను పడగొట్టిన వాడవు. నీవే స్వాహాకారం స్వధాకారం, వషట్కారం నమస్కారం రహస్య వ్రత శీలివి. గూఢంగా తపస్సు చేస్తావు అందరినీ తరింపజేసేవాడవు తారకలతో నిండిన ఆకాశానివి నీవే నీవే విష్ణువు సృష్టికర్తవు సంధానం చేసేవాడవు సంహర్తవు, ధారణ రూపుడవు, ఆధార రహితుడవు బ్రహ్మవు తపస్సు, సత్యమూ బ్రహ్మచర్యమూ ఆర్జవమూ నీవే భూతాత్ముడవు సృష్టికర్తవు, సిద్ధభూతుడవు భూత వర్తమాన భవిష్యత్తులను సృష్టిస్తావు భూలోక, భువర్లోక

స్వర్లోకరూపుడవు. స్థిరుడవు, దాంతుడవు, మహేశ్వరుడవు. యజ్ఞ దీక్షితుడవు, అదీక్షితుడవు కూడ నీవే. క్షమ కలవాడవు, ఎవరూ నిన్ను నియమించలేరు, విషయలోలుపులను నశింపజేస్తావు. మాసాదులను త్రిప్పువాడవు, యుగాలను ఆవర్తింపజేస్తావు. ప్రళయానికి, సృష్టికి కారణ భూతుడవు.

కామ స్వరూపుడవు, బీజ భూతమైన రేతో బిందువు. సూక్ష్మ, స్థూల రూపుడవు. కర్ణికార మాలలంటే నీకు ఇష్టం. నీకు ముందు నందీశ్వరు డుంటాడు. నీవు భయంకరముఖుడవు, సుముఖుడవు, దుర్ముఖుడవు, ముఖరహితుడవు, చతుర్ముఖుడవు, బహుముఖుడవు, యుద్ధాలలో అగ్నిముఖుడవు, హిరణ్య గర్భుడవు (హిరణ్యానికి కారణమైనవాడు) పక్షివలె సంగరహితుడవు, ఆదిశేషుడవు, విరాట్పురుషుడవు. అధర్మం నాశనం చేస్తావు. పెద్ద పెద్ద పార్శ్వ భాగాలు కలవాడవు, తీవ్రమయిన జలధారలు కలవాడవు, గణాధిపుడవు, గోవువలె శబ్దించువాడవు, గోవులను రక్షించువాడవు నందివాహనుడవు, మూడులోకాలను రక్షించేవాడవు, గోవిందుడవు, ఇంద్రియాలను నడిపేవాడవు, ఇంద్రియాలకు అందని వాడవు, శ్రేష్ముడవు, స్థిరుడవు, స్థాణువువు, నిష్కంపుడవు, కంపుడవు. నిన్ను ఎవరూ వారింపలేరు. సహింపలేరు. అతిక్రమించలేరు, బెదిరింప లేరు, కదిలించలేరు. తెలుసుకోలేరు, జయించలేరు, జయస్వరూపుడవు నీవే. కుందేలు వలె త్వరగా పోవువాడవు, చంద్రరూపుడవు, యమ రూపుడవు, శీతం, ఉష్ణం, జర మొదలగు వానిని పారద్రోలుతావు, ఆధి వ్యాధి స్వరూపుడవు, వాటిని పోగొట్టేవాడవూ నీవే. నా యజ్ఞ మృగానికి వేటగాడవయినావు. వ్యాధులను రప్పిస్తావు, తప్పిస్తావు. నెమలి పించం కూడా ధరిస్తావు. పుండరీకాక్షుడవు, కమలవన మంటే నీకు ఇష్టం. దండం ధరిస్తావు. త్రినేత్రుడవు, తీవ్రమయిన దండన విధిస్తావు. బ్రహ్మాండం నశింపజేస్తావు. విషాన్ని, అగ్నిని త్రాగుతావు, దేవతా శ్రేష్ముడవు, సోమపానం చేసినవాడవు, మరుద్గణాలకు నాథుడవు. దేవదేవా ! నీవు జగన్నాథుడవు. అమృత పానం చేస్తావు. గణాధిపుడవు. విషాగ్నుల నుండి రక్షిస్తావు. మృత్యువు నుండి కాపాడుతావు. క్షీరపానం చేస్తావు. సోమ పానమూ చేస్తావు. ఆపన్నులను కాపాడే వారిలో నీవే మొదటి వాడవు. తుషితులు మొదలయిన దేవగణాలకు మొదటివాడయిన బ్రహ్మను రక్షించువాడవు. అగ్ని హోత్ర పురుషుడవు నీవే. నీవే స్త్రీ పురుషనపుంసకులు. బాలుడవు యువకుడవు, వృద్ధుడవు, పండ్లు ఊడిన వాడవు. నాగేంద్రా ! నీవే ఇంద్రుడవు, విశ్వసంహారకుడవు, జగత్కర్తవు నీవే. విశ్వనిర్మాతవూ నీవే. ప్రజాపతులలో శ్రేష్ముడవు. విశ్వం భరిస్తావు. విశ్వరూపం ధరిస్తావు - తేజస్వివి, అన్ని దిక్కులకు వ్యాపించిన ముఖాలు కలవాడవు. చంద్రుడు, సూర్యుడు నీ కళ్లు - బ్రహ్మ నీ మనస్సు. నీవే మహాసముద్రం,

సరస్వతి నీ వాక్కు వాయువు అగ్ని నీ బలం, నీవు కనులు తెరిస్తే పవలు, మూస్తే రాత్రి.

శివా నీ మాహాత్మ్యం తెలిసికొనవలె నంటే బ్రహ్మ, గోవిందుడు, పూర్వ ఋషులు కూడ సమర్థులు కారు. నీ సూక్ష్మ రూపాలు మాకు కనపడవు. అందుచేత నీవే తండ్రి కన్న కొడుకును రక్షించినట్లు మమ్ము సతతమూ రక్షించు నీకు నమస్కారం. నేను నీకు రక్షింపదగిన వాడను - రక్షించు - భక్తులపై అనుగ్రహం చూపే భగవానుడవు నీవు నేను నీ భక్తుడను. ఎన్నో వేల జీవులను కప్పివేసి ఎవరికీ కనపడకుండా ఒంటరిగా సముద్రంలో నిలిచే స్వామి నన్ను నిత్యమూ కాపాడు గాక ! నిద్రకు వశం కాకుండా, ప్రాణాయామంతో ఉండి, ఇంద్రియాలను అదుపు చేసికొన్న సాత్త్విక సంపన్నులయిన యోగులు సాక్షాత్కారించుకొనే జ్యోతిః స్వరూపు డయిన యోగాత్మునకు నమస్కారం. నిత్యమూ జటాధారి, దండధారి లంబోదర శరీరి, కమండలు నిషంగుడు అయిన బ్రహ్మాత్మునకు నమస్కారం కేశాలలో మేఘాలు, శరీర సంధులలో నదులు ఉదరంలో నాల్గు సముద్రాలు ఉన్న జల రూపుడయిన పరమాత్మకు నమస్కారం. భూతాలన్నిటిని భక్షించి యుగాంతకాలంలో సముద్ర జల మధ్యంలో శయనించే పరమాత్మకు నమస్కారం. రాత్రి సమయంలో రాహువులో ప్రవేశించి చంద్రుని అమృతం త్రాగేవాడు తానే రాహువై సూర్యుని మ్రింగే పరమాత్మ నన్ను రక్షించుగాక ! బ్రహ్మకు తరువాత పుట్టిన దేవతలు, పితృదేవతలు బాలకులై యజ్ఞభాగాలను స్వీకరిస్తారు వారికి నమస్సులు. స్వాహా స్వధాకారాలతో వారి భాగాలు స్వీకరించి వారు సంతోషింతురు గాక ! శరీర ధారులందరిలో జీవరూపంలో బొటన వ్రేలంతగా శరీరాలలో ఉండే వారు నన్ను రక్షింతురుగాక వారు నన్ను సంతృప్తుని చేయుదురు గాక ! దేహంలో ఉంటూ తాము ఏడవకుండా శరీరధారులను ఏడిపిస్తారు. తాము సంతోషించకుండా శరీర ధారులను సంతోషపెడతారు వారికి నిత్యమూ నా నమస్సులు.

నదులలో, సముద్రాలలో, పర్వతాలలో గుహలలో వృక్ష మూలాలలో గోశాలలలో అడవులలో, నాలుగు రోడ్ల కూడలులలో, వీధులలో, చత్వరాలలో (అగ్ని హోత్ర ప్రదేశాలలో), నదీ తీరాలలో హస్తి అశ్వరధ శాలలలో, జీర్ణోద్యానాలలో, జీర్ణాలయాల్లో, పంచభూతాలలో, దిక్కులలో మూలలలో చంద్ర సూర్యుల మధ్యలో, సూర్య చంద్ర కిరణాలలో, పాతాళంలో, ఇంకా ఇతర ప్రదేశాల్లో ఉన్న దేవత లందరికీ నమస్కారం నిత్యమూ నమస్కారం. సంఖ్య ప్రమాణమూ, రూపమూ, గుణాలూ తెలియని రుద్రులకు నిత్యమూ నమస్కారం. నీవు సర్వప్రాణులను సృష్టించావు. సర్వప్రాణులను రక్షిస్తావు. సంహరిస్తావు. అన్ని భూతాలలోను అంతరాత్మ రూపంలో ఉన్నావని నిన్ను వేరుగా ఆహ్వానింపలేదు యజ్ఞా లన్నిటిలోను

అనేక విధ దక్షిణలతో నీవే పూజింపబడుతున్నావు. అన్నిటికీ నీవే కర్తవు. అందుచేత నిన్ను విడిగా ఆహ్వానింప లేదు. ఇంకా మిక్కిలి సూక్ష్మమయిన నీ మాయతో మోహం చెంది, నిన్ను ఆహ్వానింప లేక పోయానేమో. దేవా ! నన్ను అనుగ్రహించు. నా హృదయాన నిలుపు కొన్న నన్ను ప్రసన్నతతో చూడు. నా హృదయం, బుద్ధి, మనస్సు నీ మీదనే ఉన్నాయి.'

ఇలా మహాదేవుని స్తుతించి, దక్షప్రజాపతి విరమించాడు. శంకరుడు ప్రీతి చెంది, దక్షునితో ఇలా అన్నాడు. దక్షా ! నీవు చేసిన ఈ స్తోత్రంతో చాలా సంతోషించాను. ఎన్నో మాటలెందుకు ? నీవెపుడూ ఇక నా దగ్గరే ఉంటావు. ప్రజాపతీ ! నా అనుగ్రహంతో వేయి అశ్వమేధాలూ, వంద వాజపేయాలూ చేసిన ఫలం పొందుతావు.' ఈ మాట లని లోకాధిపతి అయిన శివుడు దక్ష ప్రజాపతిని ఊరడిస్తూ, ప్రశంసింపదగిన వాక్యాలు ఇలా పలికాడు. 'దక్షా ! ఈ యజ్ఞం విఘ్న మయిందని దుఃఖించకు. పూర్వ కల్పంలో కూడా నీ యజ్ఞాన్ని నేనే భంగ పరిచాను. సువ్రతా ! నీకింకొక వరం కూడా ఇస్తున్నాను. దాన్ని నీవు గ్రహించు. ప్రసన్న వదనంతో, ఏకాగ్ర చిత్తంతో దాన్ని విను. పూర్వం షడంగ సహితమైన వేదాల నుంచి, సాంఖ్యాదియోగం నుండి యుక్తితో తీసి కొనివచ్చి, దేవదానవు లాచరింపలేని తపస్సు చేయబడింది. దక్షా ! నేను పూర్వం పాశుపతమనే శుభంకర వ్రతం ఒకటి ప్రకటించాను. ఇది అపూర్వం - ఇది అన్ని దశలలోను (సాధన దశలో, సిద్ధిదశలోను) శుభం కరం. అన్ని వర్ణాల వారికీ అనుకూలం. మోక్ష సాధకం. చాలా సంవత్సరాలు చెయ్యాలి. ఆత్మజ్ఞానంతో చెయ్యాలి. వానికి నియమాలు లేవు. ఇతరులు యమనియమాదులు ఆచరించి, అభ్యసించాలి. అన్ని ఆశ్రమాల కంటె ఉత్తమం. ఈ వ్రతం ఆచరిస్తే పుష్కలంగా మహాఫలం లభిస్తుంది. మహాభాగా ! అటువంటి ఫలం నీకు లభిస్తుంది. ఇక నీవు మనోవ్యథ చెందకు.'

శంకరుడు దక్షునితో ఇలా చెప్పి భార్యతో, పరిచారకులతో కలిసి అంతర్ధానమైనాడు. దక్ష ప్రజాపతి చెప్పిన ఈ స్తోత్రం పఠించిన వారూ, విన్నవారూ అశుభం ఎంత మాత్రమూ పొందరు. దీర్ఘాయువును పొందుతారు. దేవతలందరిలో శివుడు వరిష్ఠుడైనట్లు ఈ స్తవం అన్ని స్తవాలలోను శ్రేష్ఠం. వేద సమ్మితం. యశస్సు, రాజ్యం, సుఖం, ఐశ్వర్యం కోరేవారు, ధనకాంక్షులు, విద్యాకాంక్షులు భక్తితో ప్రయత్నించి వినాలి. వ్యాధి గ్రస్తులూ, దుఃఖితులూ, దీనులూ, చోర గ్రస్తులూ, భయపీడితులూ, రాజ కార్యాపరాధులూ, మహాభయం నుండి విముక్తి పొందుతారు. ఈ స్తవం పఠించిన వాడు ఈ దేహంతోనే ప్రమథ గణంతో సమాను డవుతాడు. నిర్మలుడై, తేజస్వి యశస్వి అవుతాడు. ఈ స్తవం పఠించే ఇంటిలో

రాక్షసులు కాని పిశాచాలు కాని, భూతాలు కాని చివరకు వినాయకులు కాని ఎన్నడూ విఘ్నం కలిగించరు శంకరుని మీద భక్తితో బ్రహ్మచారిణియై ఈ స్తవం వింటే పితృవంశంలో, భర్తృవంశంలో ఆమె దేవత వలె పూజింపబడుతుంది. శ్రద్ధా భక్తులతో ఈ స్తవమంతా పరించినా, విన్నా వాని పనులన్నీ వెంటనే సిద్ధిస్తాయి ఈ స్తవం పరించిన వానికి మనసులో తలచినదీ నోటితో చెప్పినదీ అంతా సిద్ధిస్తుంది ఇంద్రియ వశంతో శౌచ సంతోషాలతో మహాదేవునికి కుమారస్వామికి పార్వతీదేవికి నందీశ్వరునికి బలిసమర్పించి ఏకాగ్ర చిత్తంతో యధా క్రమంగా సహస్ర నామ పరనం చేస్తే అన్ని కోరికలూ భోగాలూ సిద్ధిస్తాయి మరణిస్తే స్వర్గం లభిస్తుంది. పశుపక్ష్యాదులలో పుట్టడు అని ప్రభువయిన వ్యాస భగవానుడు చెప్పాడు

285. అధ్యాత్మ జ్ఞానము - ఫలము.

యుధిష్ఠిరుడు అడిగినాడు పితామహా ! మానవుని కోసం చెప్పబడిన అధ్యాత్మతత్త్వం అంటే ఎమిటి ? ఎక్కడి నుండి వచ్చిందో చెప్పండి.' భీష్ముడు చెపుతున్నాడు. ధర్మజా ! నీవడిగే అధ్యాత్మతత్త్వం బుద్ధి ద్వారా అన్నిటినీ తెలిపే జ్ఞానం. దాన్ని వ్యాఖ్యానిస్తాను. వినుము. భూమి, వాయువు ఆకాశం, నీరు అగ్ని ఈ అయిదూ మహాభూతాలు - ఈ అయిదే చరాచర ప్రాణులన్నిటి పుట్టుకకు వినాశానికి మూలం ప్రాణుల శరీరాలు ఈ అయిదు మహాభూతాల సముదాయాలే ఇవి కార్యరూపంగా మారి పుట్టుతూ ఉంటాయి, లయమవుతూ ఉంటాయి పంచ తన్మాత్రలతో మహాభూతాలు పుడతాయి, నశిస్తాయి కెరటాలు సముద్రంలో పుట్టి సముద్రంలోనే లయమయినట్లు చరాచర ప్రాణులన్నీ పరమాత్మ నుండి పుడతాయి మళ్లీ పరమాత్మలోనే లయ మవుతాయి. తాబేలు తన అవయవాలను బయటికి ప్రసరింపజేస్తుంది మళ్లీ లోపలికి లాక్కొంటుంది అలాగే ప్రాణులు మహా భూతాల నుండి (స్థవీయసామ్) పుడుతూ ఉంటాయి. లీనమవుతూ (అల్పాలు) ఉంటాయి. ఆకాశం నుండి శబ్దం పీర్పడుతుంది స్థూల శరీరం పృధ్వీగుణం ప్రాణం వాయుగుణం రసం జలగుణం. రూపం తేజోగుణం ఇలా చరాచరాత్మక మయిన శరీరం అంతా పంచభూతమయం ప్రలయ కాలంలో పరమాత్మలో లీన మవుతుంది. సృష్టి కాలంలో ఆ పరమాత్మ నుండే బయట పడుతుంది. పంచ మహాభూతాలను సృష్టించిన పరమాత్మ (అహంకారం) వాటిని ప్రాణులలో విభాగ పూర్వకంగా నిలిపాడు వాటివల్ల కొన్ని కార్యాలు తెలుస్తాయి వాటిని వివరిస్తాను. శబ్దం శ్రోత్రేంద్రియం నవరంధ్రాలు - ఈ మూడూ ఆకాశ కార్యాలు రసం స్నేహం జిహ్వ - ఈ మూడు జల కార్యాలు.

రూపం, చక్షురింద్రియం, విపాకం - ఈ మూడూ అగ్ని యొక్క కార్యాలు. గంధం, ముక్కు, శరీరం - ఈ మూడూ భూమి యొక్క గుణాలు. ప్రాణం, స్పర్శ, చేష్ట - ఇవి వాయువు యొక్క గుణాలు. ఇలా పంచభూతాల గుణాలూ చెప్పాను. ఈశ్వరుడు ప్రాణుల శరీరాల్లో సత్త్వం, రజస్సు, తమస్సు, కాలం, కర్మం, బుద్ధి, మనస్సుతో కూడిన పంచేంద్రియాలూ కల్పించాడు. అరికాళ్ల నుండి శిరసు దాకా, శిరసు నుండి క్రింది దాకా శరీరమంతటా బుద్ధి నిండుగా వ్యాపించి ఉంటుంది. ప్రాణి శరీరంలో ఉండేవి అయిదు జ్ఞానేంద్రియాలు, ఆరవది మనస్సు, ఏడవది బుద్ధి, ఎనిమిదవ వాడు క్షేత్రజ్ఞుడు.

పంచజ్ఞానేంద్రియాలు, జీవుడు - వీటన్నిటికీ ఆ యా కార్యాలు విడివిడిగా ఉన్నాయి. అలాగే సాత్త్విక రాజస తామస భావాలు జీవాత్మ నాశ్రయించి ఉంటాయి. కన్ను చూడటానికి, మనస్సు సంశయించటానికి, బుద్ధి నిశ్చయించటానికి, క్షేత్రజ్ఞుడు (జీవాత్మ) సాక్షి మాత్రం. సత్త్వం, రజస్సు, తమస్సు, కాలం, కర్మ ఈ అయిదు గుణాలతో బుద్ధి మనసును, ఇంద్రియాలను నడిపిస్తుంది. బుద్ధి లేకపోతే గుణాలు ఉండవు. ఇంద్రియ కార్యాలు లేవు. చూసేది చక్షువు, వినేది శ్రోత్రం, వాసనచూసేది ముక్కు, రుచిచూసేది జిహ్వ, స్పృశించేది చర్మం. ఇలా బుద్ధి మాటిమాటికి మారుతూ ఉంటుంది. ఆ బుద్ధి దేన్నయినా కోరితే అది మనస్సు అవుతుంది. బుద్ధిచేత విడివిడిగా ఉండే ఈ అయిదు అధిష్ఠానాలను ఇంద్రియాలు అంటారు. ఇంద్రియాలు చెడితే బుద్ధి కూడా చెడుతుంది.

సాక్షి అయిన ఆత్మను ఆశ్రయించిన బుద్ధి మూడు భావాల్లో ఉంటుంది. సాత్త్విక భావం ఉద్రిక్త మయితే ఆనందం పొందుతుంది. రాజసభావం ఉద్రిక్త మయితే దుఃఖం పొందుతుంది. తమో గుణం ఉద్రిక్త మయితే బుద్ధి సుఖాన్నీ, దుఃఖాన్నీ తెలుసుకోలేదు. భావాత్మకమైన బుద్ధి ఇలా మూడు భావాల్లో తిరుగుతూ ఉంటుంది. నదీ పతి అయిన సముద్రుడు తరంగాలున్నా చెలియలి కట్టను దాటడు. అలాగే సాత్త్వికాది భావాలతో కూడిన బుద్ధి గుణత్రయాన్ని దాటదు. భావనామయమైన మనస్సులోనే తిరుగుతూ ఉంటుంది. రజో గుణ ప్రవృత్తి కలిగితే బుద్ధి రాజస భావాన్ని అనుసరిస్తుంది. సంతోషం, ప్రీతి, ఆనందం, సుఖం, ప్రశాంత చిత్తం కలిగినపుడు సాత్త్విక గుణ చిహ్నాలని తెలియాలి. సకారణంగా కాని నిష్కారణంగా కాని దాహం, శోకం, సంతాపం, అసంతృప్తి, అసహనం కలిగితే అవి రజోగుణ చిహ్నాలని తెలియాలి. అవిద్య, రాగమోహాలు, ప్రమాదం, స్తబ్ధత, భయం, దారిద్ర్యం, దైన్యం, ప్రమోహం, స్వప్నం వంటి అలసట - అనేవి కలిగితే అవి తామసగుణాలు అని తెలియాలి. అటువంటి సమయాల్లో కూడా శరీరంలో కాని, మనసులో

కాని ప్రసన్నత కలిగితే అది సాత్వికి భావం అని తెలియాలి. దుఃఖంతో కూడిన అప్రీతి కలిగితే అది రజోగుణ భావం అని తెలిసి స్తిమితపడి ఆలోచించాలి. శరీరంలో కాని, మనస్సులో కాని మోహం కలిగితే అది తమోగుణ భావమని తెలిసి చక్కగా ఆలోచించాలి.

ఇలా బుద్ధి యొక్క గతులన్నీ వివరించాను. వీటిని తెలుసుకొన్నవాడు జ్ఞాని. ఇంత కంటె జ్ఞానికి వేరు లక్షణం లేదు. సూక్ష్మాలయిన బుద్ధి ఆత్మల భేదం తెలుసుకో. బుద్ధి గుణాలను సృష్టిస్తుంది. ఆత్మ గుణాలను సృష్టించదు. కాని సాక్షి మాత్రంగా ఉంటుంది. బుద్ధి - ఆత్మ రెండూ సహజంగా వేర్వేరుగానే ఉంటాయి. కాని ఎపుడూ రెండూ కలిసే ఉంటాయి. నీటి కంటె చేప వేరే. అయినా కలిసే ఉంటాయి. (జడములు కాబట్టి) సత్వాది గుణాలు ఆత్మను తెలుసుకోలేవు. కాని ఆత్మ (చేతనం కాబట్టి) గుణాలను తెలుసుకొంటుంది. ఆత్మ గుణాలకు సాక్షి మాత్రమే. కాని తెలియని వారు గుణాలతో కలిసి ఉందనుకొంటారు. బుద్ధి సత్వాది గుణాలను సృజించినపుడు జీవాత్మ బుద్ధికి ఆశ్రయం కాదు. ఇతర గుణాలను బుద్ధియే సృష్టిస్తుంది. ఆ గుణాలను జీవాత్మ ఎపుడో తెలుసుకొంటుంది. బుద్ధి గుణాలను సృష్టిస్తుంది. క్షేత్రజ్ఞుడు చూస్తూ ఉంటాడు. ఆత్మకు, బుద్ధికి ఉన్న సంబంధం మాత్రం నిత్యం. జ్ఞానశక్తి లేకపోవడంతో తెలుసుకోలేని ఇంద్రియాలు వస్తువులను ప్రకాశింపజేయటానికి బుద్ధిని మధ్యలో ఉంచుతాయి. బుద్ధి దీపంలా సాయపడుతుంది. ఇది స్వభావ సిద్ధమైనది. ఇది తెలిసికొని మానవుడు దుఃఖించకుండా, సంతోషించకుండా, అసూయ పడకుండా సంచరించాలి. **సాలెపురుగు దారపుపోగులు తీసినట్లు బుద్ధి గుణాలను సృష్టిస్తుంది. ఇది స్వభావ సిద్ధమైనది. అందుచేత గుణాలు దారపు పోగులనీ, బుద్ధి సాలె పురుగు అనీ తెలుసుకోవాలి.**

గుణాలు నశిస్తే (నివృత్తి అయితే) మళ్లీ రావు. వాటికి మళ్లీ ప్రవృత్తి కలగదు. ఇది కొందరి మతం. మరి కొందరు మళ్లీ వస్తా యంటారు. బుద్ధి యొక్క చింతతో నిండిన దృఢమైన హృదయ గ్రంథిని విడిచి, సంశయాలు విడిచి, శోకం విడిచి సుఖంగా ఉండాలి. లోతు తెలియక నదిలో జారి పడిన వారు చాలా పరితపిస్తారు. అలాగే బుద్ధి యోగం తెలియని వారు మోహంతో నిండిన సంసార నదీ ప్రవాహంలో పడి పరితపిస్తారు. కాని ఈత నేర్చిన వారు లోతయిన నదిలో నుండి ఈదుకొని ఒడ్డు చేరుతారు. వారు పరితపించరు. అలాగే అధ్యాత్మతత్వం తెలిసినవారు ధీరులై, తేలికగా సంసార సాగరం తరిస్తారు. అపుడు వారికి **పరమజ్ఞానమే పడవ.** అజ్ఞానులకు చాలా భయం కలుగుతుంది. అటువంటి భయం జ్ఞానులకు కలుగదు. జ్ఞానులలో ఉత్తమగతి కొందరికి, మధ్యమగతి కొందరికి అని తేడా ఉండదు. అందరికీ సమాన గతియే కలుగుతుంది. అజ్ఞానదశలో

మానవుడు పూర్వం చేసిన కర్మలతో బాధపడతాడు. అంతేకాక ఇతరులు చేసిన అప్రియ కృత్యంలో దోషం దర్శిస్తాడు. రాగాది దోషాలతో దుష్ట కార్యాలు చేస్తాడు. కాని జ్ఞాని అయ్యాక తప్పు చెయ్యడు. ఎదుటి వారిలో దోషం చూడడు.'

286. సమంగ నారద సంవాదము.

ధర్మరాజు ప్రశ్నించాడు. 'పితామహా ! లోకమంతా దుఃఖశోకాల వల్లనూ, మృత్యువు వల్లనూ భయపడి పోతోంది. ఆ దుఃఖమూ, మృత్యువూ లేకుండా ఉండే ఉపాయం ఉపదేశించండి.' భీష్ముడు చెపుతున్నాడు. 'ఈ విషయంలో ప్రాచీన మయిన సమంగ నారద సంవాదం అనే ఇతిహాసం ఉదాహరిస్తారు. నారదుడు ఇలా అన్నాడు. 'సమంగా ! నీవు సంసార సాగరాన్ని బాహువులతో దాటుతున్నట్లు నేలపై పడి, హృదయంతో నమస్కరిస్తున్నావు. నిత్యతృప్తుడవై ప్రశాంత మనస్కుడవు, శోకంలేని వానివలె కనిపిస్తున్నావు. నీకు కొంచెమయినా ఉద్వేగం లేదు. నిత్య తృప్తుని వలె స్వస్థుడవై, బాలుని వలె ప్రవర్తిస్తున్నావు.' అపుడు సమంగుడు ఇలా అన్నాడు. 'దేవర్షీ ! నేను భూత, వర్తమాన, భవిష్యత్తుల స్వరూపమూ, తత్త్వమూ తెలిసినవాడను. అందుచేత నాకు విషాదం లేదు. లోకంలోని కర్మల ఆరంభం, ఫలం రెండూ ఎరుగుదును. కొన్ని కర్మల చిత్రఫలాలను కూడ ఎరుగుదును. అందుచేత నాకు విషాదం లేదు. ఈ లోకంలో గంభీర స్వభావులు, అప్రతిష్ములు, ప్రగతి శీలులు, అంధులు, మందమతులూ కూడా జీవిస్తున్నారు. మనమూ జీవిస్తున్నాం. రోగరహిత శరీరులైన దేవతలు, బలవంతులు, బలహీనులు అంతా తమ తమ ప్రారబ్ధానికి అనుగుణంగా జీవిస్తున్నారు. అలాగే మనమూ ప్రారబ్ధానుగుణంగానే జీవిస్తున్నాం. ఏ పనీ కొత్తగా ఆరంభించటం లేదు. అకర్మణ్యులని నిరాదరింపక మమ్ములనూ ఆదరించండి. **చూడు ! వేలు ఉన్నవారూ జీవిస్తున్నారు. వందలున్న వారూ జీవిస్తున్నారు. కేవలం శాకాదులతోనూ జీవిస్తున్నారు, మనమూ జీవిస్తున్నాం.** (అజ్ఞానం దూరమైనందున) మనం శోకించనపుడు ధర్మంతో కాని, కర్మతో కాని పనేముంది ? సుఖ దుఃఖాలన్నీ కాలాధీనాలు. క్షణభంగురాలు. అందుచేత అటువంటి సుఖ దుఃఖాలు జ్ఞానిని క్షోభింపజేయలేవు.

జ్ఞానులను మానవులు ప్రాజ్ఞ లని అంటారు. ఇంద్రియాల ప్రసన్నత ఆ ప్రజ్ఞకు మూలం. ఇంద్రియాలు మోహశోకాలను పొందితే వానికి ప్రజ్ఞ వీర్పడదు. మూడునికి గర్వం కలిగిందంటే అది మోహమే. మూర్ఖునికి ఇహంలో కాని, పరంలో కాని సుఖం కలుగదు. ఎవరికీ నిత్యమూ దుఃఖమే కలుగదు. అలాగే సుఖం కూడా ఎపుడూ లభించదు. ఈ ప్రపంచం పరిణామశీలమని ఎరిగిన నావంటి వాడు ఎన్నడూ సంతాపం పొందరాదు.

ఇష్టమైన భోగాలను, సుఖాలను కోరరాదు. దుఃఖం కలిగితే చింతించరాదు. అన్ని విధాల ఉపరతు డయిన మహాపురుషుడు ఇతరుల నుండి దేనినీ కోరడు. రాబోయే లాభాన్ని ప్రశంసించడు. చాలా సంపదను పొందినా ఆనందించడు. అలాగే సంపద పోయినా దుఃఖించడు. బంధువులు, ధనం, ఉత్తమకులం, శాస్త్రాధ్యయనం, మంత్రాలు, బలం – ఇవి ఏవీ రాబోయే దుఃఖాన్ని తప్పించలేవు. ఉత్తమశీలమే పరలోకంలో శాంతి నిస్తుంది. యోగయుక్తుడు కాని వానికి సమబుద్ధి కలుగదు. యోగం లేక పోతే సుఖమూ కలుగదు. ధైర్యం, దుఃఖత్యాగం ఈ రెండే సుఖం. ప్రియమైనది హర్షం కలిగిస్తుంది. హర్షం ఉద్రేకం పెంచుతుంది. ఉద్రేకం నరకం కోసమే. అందుచేత ఈ మూటినీ విడిచి పెడుతున్నాను. శోక భయ ఉత్సేకాలు మానవుని సుఖ దుఃఖాలలో పడవేస్తాయి. అందుచేత ఈ శరీరంలో చైతన్యం ఉండటం చేత సాక్షివలె నేను వీటిని చూస్తూ ఉంటాను. అర్థమూ, కామమూ విడిచి, శోక సంతాపాలు లేకుండా, తృష్ణా మోహాలకు దూరంగా ఈ భూమిపై సంచరిస్తూ ఉంటాను. అమృతం త్రాగిన వానికి మృత్యుభయం ఉండదు. అలాగే ఇహ పరాలు రెండిటా మృత్యువు నుండికాని, అధర్మ లోభాల నుండి కాని నాకు భయంలేదు. తరగని తపస్సు చేసి నేనీ జ్ఞానం పొందాను. అందుచేత నారదా ! నన్ను శోకం బాధించలేదు.'

287. శ్రేయో వాచికము.

ధర్మరాజు అడిగాడు. పితామహా ! శాస్త్రాల తత్త్వం తెలియని వానికి, సతతమూ సందేహాలు కలిగే మనసు కల వానికీ, శమదమాదులు లేని వానికీ శ్రేయస్కరమైనది చెప్పండి.' భీష్ముడు చెపుతున్నాడు. **'సతతమూ గురు పూజ (ఈశ్వరారాధనం), పెద్దలను సేవించడం, శాస్త్ర శ్రవణం - ఈ మూడూ సార్వకాలికమైన శ్రేయస్సు కలిగిస్తాయి.** ఈ విషయంలో నారదగాలవ సంవాదం అనే ప్రాచీనమైన ఇతిహాసాన్ని ఉదాహరిస్తారు. పూర్వం గాలవుడనే విప్రుడు ఇంద్రియనిగ్రహంతో శ్రేయస్కాముడై ఆశ్రమంలో ఉండేవాడు. ఒకసారి అక్కడకు దేవతేజస్సుతో మోహశోకాలు లేకుండా జ్ఞానతృప్తు డయిన నారదుడు వచ్చాడు. అపుడు యతాత్ము డయిన నారదుని గాలవుడు ఇలా ప్రశ్నించాడు. 'లోకంలో అందరూ సమ్మతించే గుణాలన్నీ మీలో తగ్గకుండా ఉండటం చూస్తున్నాను. లోకతత్త్వం తెలియకుండా చిరకాలంగా మూఢులుగా ఉన్న వారికి మీ వంటి జ్ఞానులే సంశయాలు తీర్చగలరు. అనుష్ఠించ వలసిన కార్యాలను గురించి విశేష శాస్త్రజ్ఞానం

మాకు లేదు - అందుచేత మేము ఆచరింపవలసిన దానిని మీరు చెప్పండి. ఆశ్రమాలన్నీ వేర్వేరుగా ఆచారాలను ప్రదర్శిస్తాయి. 'ఇదే మంచిది ఇదే మంచిది' అని అన్నీ చెపుతాయి. ఇలా అందరికీ అన్నీ మంచివే అనిపిస్తుంది. ఇలా ఉన్న మార్గాలు చూసి, మానవులు తాము చేస్తున్న పనులను బోధించే శాస్త్రాలను ప్రశంసిస్తారు. వాటితో తృప్తి పడతారు. అంతేకాని అసలు శ్రేయస్కర మేదో తెలుసుకోలేరు. ఒకే శాస్త్రం ఉంటే శ్రేయస్కరమయిన దిది అని స్పష్టంగా తెలుస్తుంది. చాలా శాస్త్రాలుండటం వలన శ్రేయస్సు నిగూఢంగా మారింది. అందుచేత శ్రేయస్సు గహనంగా నాకు కనిపిస్తోంది. నాకు శ్రేయస్కరమైన దానిని చెప్పండి. మిమ్ము ఆశ్రయించాను - శిష్యుడను.

నారదుడు అన్నాడు. 'గాలవా ! ఆశ్రమాలు నాలుగు. అవి వేర్వేరుగా వ్యవస్థిత మయ్యాయి. వాని యథార్థ జ్ఞానం పొందు. ఆ ఆశ్రమాల్లో చాలా గుణాలు వేర్వేరుగా ఉన్నాయి. ఆయాగుణాల స్వరూపం, ఉద్దేశం స్పష్టంగా చూసి తెలుసుకో. సామాన్యులు చక్కగా నిస్సంశయంగా ఆశ్రమాల పరమార్థం తెలుసుకోలేరు. తత్త్వజ్ఞులు మాత్రమే తెలుసుకోగలరు. **పూర్తిగా శ్రేయస్కరమైన దాని విషయంలో ఎవరికీ సంశయం ఉండదు. మిత్రులను అనుగ్రహించటం, శత్రువులను నిగ్రహించటం, ధర్మార్థకామాలను కూర్చుకొనటం శ్రేయ మని జ్ఞానులు అంటారు. పాప కృత్యాలనుండి దూరంగా ఉండటం, సతతమూ పుణ్యవర్తన కలిగి ఉండటం, సజ్జనులతో కలిసి ప్రవర్తించడం - ఇవి నిస్సంశయంగా శ్రేయస్కరాలే. అలాగే సర్వప్రాణుల పట్ల మృదుత్వమూ, వ్యవహారాల్లో త్రికరణ శుద్ధి, మధురంగా మాట్లాడటం - ఇవి నిస్సందేహంగా శ్రేయస్కరాలు.** దేవతలకు, పితృదేవతలకు, అతిథులకు వారి భాగాలను విభజించి ఇవ్వడం, సేవకులను విడువక భరించడం - ఇవి నిస్సందేహంగా శ్రేయస్కరాలు. **సత్యం పలకటం శ్రేయస్కరం. కాని దాన్ని తెలుసుకోవడం కష్టం. ప్రాణులకు మిక్కిలి హిత మయినదే సత్యమని నా అభిప్రాయం.** అహంకారం విడిచిపెట్టడం, పొరబడకుండా నిగ్రహించుకోవడం, సంతోషం, ఏకాంతంగా పని చేయడం - ఇవి ప్రధాన శ్రేయస్కరాలు. ధర్మ పూర్వకంగా, వేదాలను, వేదాంతాన్ని అధ్యయనం చెయ్యడం, జ్ఞాన సిద్ధాంతాలను తెలుసుకోవాలనే కోరిక - ఇవి నిశ్చయంగా శ్రేయస్కరాలు. **శ్రేయస్సును కోరుకొనేవాడు ఎన్నడూ శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం - వీటిని ఎక్కువగా సేవించరాదు. (వీటికి వీలయినంత దూరంగా ఉండాలి). శ్రేయస్కాములు రాత్రి సంచారం, పగటి నిద్ర, సోమరితనం, చాడీలు చెప్పటం, మత్తు పదార్థాలు సేవించడం,**

ఆహార విహారాలను అతిగా సేవించటం, పూర్తిగా విడిచి పెట్టడం - వీవిని పరిత్యజించాలి.

ఇరులను నిందించి, ఆత్మస్తుతి చేసుకోరాదు ఇతరుల కంటె తన శ్రేష్ఠతను గుణాలతో నిరూపించుకోవాలి. గుణహీనులే ఆత్మస్తుతి చేసుకొంటారు. తమ కా గుణాలు లేకపోతే ఎదుటివారి గుణాలలో దోషం చూపించి, ఆక్షేపిస్తారు. దానికి ఎవరయినా పెద్దలు సమాధానం చెపితే స్వాభిమానంతో గర్వితులయి వారికంటె కూడా తాము గుణాధికుల మని భావిస్తారు. ఇతరులను నిందించకుండా, ఆత్మస్తుతి చేసుకోకుండా ఉండే గుణవంతు డయిన పండితుడు మహాయశస్సు తప్పక పొందుతాడు. పవిత్రమూ, మనోహరమూ అయిన పూలసువాసన ఎవరూ చెప్పకుండానే అంతటా వ్యాపిస్తుంది. ఆలాగే నిర్మలు డయిన సూర్యుడు ఏమీ మాట్లాడకుండానే ఆకాశంలో ప్రకాశిస్తాడు. ప్రపంచంలో ఇలాగే ఇంకా ఎంతో మంది, మేధలేని వస్తువులు కూడా తమను గురించి చెప్పుకోకుండానే కీర్తితో ప్రకాశిస్తూ ఉంటాయి. కేవలం ఆత్మస్తుతి చేసుకొన్నంత మాత్రాన మూర్ఖుడు ప్రకాశించడు. విద్వాంసుడు గుహలో నివసించినా సర్వత్ర ప్రసిద్ధి వహిస్తాడు. **పెద్దగా అరిచి చెప్పినా చెడ్డమాట ఆకాశంలో శమించి పోతుంది. మెల్లగా చెప్పినా మంచిమాట లోకమంతటా వ్యాపించి ప్రకాశిస్తుంది.** దహించే అగ్ని తన నిజరూపాన్ని ప్రకాశింపజేస్తాడు. అలాగే గర్వితులయిన మూర్ఖులు పలికిన సారరహితమైన మాటలు వారి అంతఃకరణాన్ని బయట పెడతాయి. అందుకే శ్రేయస్కాములు బహు విధ ప్రజ్ఞలు సంపాదించాలని ప్రయత్నిస్తారు. అన్నిటికంటె ప్రజ్ఞా లాభమే ప్రాణులకు ఉత్తమ మని నాకు తోస్తుంది. **ఎవరికీ అడగకుండా ఏదీ చెప్పకూడదు. అన్యాయంగా అడిగిన వానికీ చెప్పరాదు. తెలిసినా పరే మేధావి జడునివలె మౌనంగా ఉండాలి. మానవు డెపుడూ నిత్య ధర్మపరు లయిన సాధువులతో, వదాన్యులతో, స్వధర్మ నిరతులతో నివసించాలని కోరుకోవాలి.** చాతుర్వర్ణ్య ధర్మాలు ఉల్లంఘింపబడే చోట, శ్రేయస్కాముడు ఎన్నడూ నివసించకూడదు. ఏ ప్రయత్నమూ చేయకుండా దొరికిన దానితో జీవించేవాడు అయినా పుణ్యాత్ములతో కలిసి ఉంటే పుణ్యం పొందుతాడు. పాపులతో కలిసి ఉంటే పాపం పొందుతాడు.

నీటికి అగ్ని సంసర్గంతో వేడిమి, చంద్ర సంసర్గంతో చల్లదనం కలుగుతోంది. అలాగే మానవునికి పుణ్యాత్ముల సంసర్గంతో పుణ్యమూ, పాపుల సంసర్గంతో పాపమూ అంటుతుంది. సాధారణంగా విషుసాశులు రుచి తెలియకుండా భుజిస్తారు. వారు రుచిచూసి

తింటే, వారు కూడా కర్మపాశంలో బంధింపబడినట్లే భావించాలి. అనాదరణతో, ప్రమాణం కావాలని అడిగినవానికి ధర్మశాస్త్ర విషయాన్ని ఏ బ్రాహ్మణుడయినా బోధిస్తూ ఉంటే ఆత్మజ్ఞానం కలవారు ఆ ప్రదేశాన్ని విడిచి పెట్టాలి. గురుశిష్య సంప్రదాయం చక్కగా, శాస్త్ర సమ్మతంగా, యథావిధిగా నడిచే ప్రదేశాన్ని ఎవరు విడిచి పెడతారు? విద్వాంసుల విషయంలో నిరాధారంగా దోషారోపణ చేసే చోట ఆత్మగౌరవం కోరే పండితుడు ఎవడు నివసిస్తాడు? లుబ్ధులు ధర్మమర్యాదలను అతిక్రమిస్తున్నపుడు ఆ ప్రదేశాన్ని కాలిన వస్త్రం లాగా విడిచి పెట్టకుండా ఎవరుంటారు ? మాత్సర్యం, శంక లేకుండా ధర్మాచరణం చేసే పుణ్యశీలులైన సాధువులతోనే నివసించాలి. ధనం కోసమే ధర్మం ఆచరించే వారున్న చోట ఎన్నడూ నివసింపరాదు. వారు పాపాత్ములు గనుక. బ్రతుకు కోసం పాపకృత్యాలు చేసే వారున్న ప్రదేశాన్ని పాములున్న ఇంటిని విడిచినట్లు విడిచి పరుగెత్తాలి. రోగాలతో మంచం మీద పడేస్థితి పూర్వం చేసుకొన్న పాపకర్మలవల్ల కలుగుతుంది. అటువంటి పాపకర్మలను శ్రేయస్కాముడు ఎన్నడూ ఆచరింపరాదు. రాజులు, రాజ పురుషులు, గృహస్థులు - కుటుంబంలోని వారు తినకముందే భుజిస్తుంటే ప్రజలు ఆ రాజ్యాన్ని విడిచిపెట్టాలి.

ధర్మనిత్యులై, సనాతనులై, యాజనం అధ్యాపనం చేసే శ్రోత్రియులు - ఎక్కడ ముందు భుజిస్తారో అక్కడ నివసించాలి. స్వాహాకారాలు, స్వధాకారాలు, వషట్కారాలు, సతతమూ ఎక్కడ ఉంటాయో అక్కడ మరో ఆలోచన లేకుండా నివసించాలి. బ్రతుకు తెరువు లేక బ్రాహ్మణులు అపవిత్రు లయి తిరిగే రాజ్యాన్ని విడిచిపెట్టాలి. పారేసిన మాంసం ప్రక్కనే పడినట్లు దూరంగా పోవాలి. నిరంతరమూ ప్రీతిగా యాచించకుండానే దానం చేసే చోట ఆత్మాభిమానం కల్గి, కృతకృత్యులయిన వారివలె స్వస్థచిత్తులై (శ్రేయస్కాములు) నివసించాలి. అవినీతి పరులను దండిస్తూ, ఆత్మాభిమానులను సత్కరిస్తూ ఉండే పుణ్యశీలం కల సజ్జను లుండేచోట సంచరించాలి, నివసించాలి. 1. జితేంద్రియులను కోపగించుకొనేవారిని దండించేచోట, 2. సజ్జనబాధ కలిగించేవారిని దండించేచోట 3. అవినీతి పరులను, లుబ్ధులను దండించేచోట - నివసించాలి. రాజు తన రాజ్యాన్ని ధర్మయుక్తంగా పరిపాలిస్తూ ధర్మనిత్యుడై ఉండేచోట, కామేశు డయినా కోరికలను విడిచి వర్తించేచోట మరో ఆలోచన లేకుండా నివసించవచ్చు. **రాజులు ఎటువంటి శీలం కలిగి ఉంటారో అతని దేశ ప్రజలుకూడ అదే శీలంతో ఉంటారు. శ్రేయస్సు నమకూరితే ప్రజలకు కూడ ఆ శ్రేయస్సును సమకూర్చుతారు.** నాయనా ! నీవు

అడిగినట్లుగా నీకు శ్రేయస్సును గురించి చెప్పాను. సంపూర్ణంగా శ్రేయస్సును చెప్పాలంటే నాకు శక్యం కాదు. ఇలా ప్రాణులమీద హిత సహితమైన మనస్సుతో ప్రవర్తించే వానికి తపస్సు చేకూర్చినట్లు శ్రేయస్సు స్పష్టంగా ఈ లోకంలోనే కలుగుతుంది.'

288. సగర అరిష్టనేమి సంవాదము.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'నావంటి రాజు ఏగుణాలతో భూమిపై నిత్యమూ ఎలా సంచరించాలి ? ఎలా ప్రవర్తిస్తే సంగం అనే పాశాల నుండి విముక్తు డవుతాడు ?' భీష్ముడు చెపుతున్నాడు. 'ఈ విషయంలో పూర్వం సగరునికి అరిష్టనేమి (కశ్యపుడు) ఉపదేశించిన ఇతిహాసం నీకు చెపుతాను. సగరుడు ప్రశ్నించాడు. 'విప్రా ! నరుడు ఏ శ్రేయస్సును ఆచరించి ఈ లోకంలో సుఖపడతాడు ? దుఃఖించకుండా, కలత చెందకుండా ఎలా ఉంటాడో తెలుసుకొన గోరుతున్నాను.' 'సగరుడు ఇలా అడిగితే సర్వశాస్త్రాలూ తెలిసిన అరిష్టనేమి అతనిలోని ఉత్తమ సంపదను తెలిసికొని ఇలా అన్నాడు. **ఈ లోకంలో మోక్ష సుఖమే సుఖం. కాని ధనధాన్యాదులలోను, పుత్ర పశ్వాది సంపదలలోను మునిగి మూఢుడు ఈ విషయం తెలుసుకోలేడు.** విషయాసక్తితో శాంతిలేని వానికి చికిత్స చేయలేము. స్నేహబంధాలతో కట్టుబడిన మూఢుడు మోక్షం పొందలేడు.

స్నేహ పాశాలను గురించి చెపుతాను విను. చెవులూ, తల (బుద్ధి) ఉన్నవాడే వీటిని విని తెలుసుకోగలడు. కాలాను గుణంగా పుత్రులను పొంది, యౌవనం వచ్చాక పెళ్లి చేసి, జీవితంలో సమర్థులయ్యారని తెలిసి స్నేహపాశ ముక్తుడవై యథాసుఖంగా జీవించు. భార్య పుత్రులను కని పెద్ద దయింది. పుత్రు లామెను లాలిస్తారు. ఆమెకు పుత్రవాత్సల్యం ఉంది. ఈ విషయం తెలిసికొని, మోక్షం దృష్టిలో పెట్టుకొని, తగిన సమయంలో ఆమెను విడిచి పెట్టు. ఇంద్రియాలతో విషయానుభవం పొంది, సంతానం ఉన్నా లేక పోయినా సరే విషయాసక్తి విడిచి, యథాసుఖంగా ముక్తిపొందు. భగవదిచ్ఛతో లభించిన లౌకిక పదార్థాల మీద సమ బుద్ధికలిగి మోక్షం పొందు. ఇపుడు నేను సంక్షిప్తంగా మోక్షం గురించి చెప్పాను. మళ్లీ విస్తరించి చెపుతా విను.

ముక్త పురుషులు నిర్భయంగా, సుఖంగా లోకంలో సంచరిస్తారు. విషయాసక్త చిత్తులు ఆహార సంపాదన ప్రయత్నంలో పురుగులవలె, చీమలవలె నశిస్తారు. ఆసక్తి లేని వారు సుఖపడతారు. ఆసక్తి కలవారు నశిస్తారు. ఇందులో సందేహం లేదు. నేను లేకపోతే వీరంతా ఏమవుతారో' అని మోక్ష బుద్ధికల నీవు నీవారి విషయంలో ఆలోచింపవలసిన

పని లేదు. ప్రతి ప్రాణీ తానే పుడుతుంది. తానే పెరుగుతుంది. సుఖ దుఃఖాలనూ, మృత్యువునూ కూడా తానే పొందుతుంది. **వారి పూర్వకర్మానుసారంగానే భోజనం, వస్త్రాలు, తలి దండ్రుల సంపాదన, అన్నీ కలుగుతాయి. తాను చేసుకొన్న కర్మను దాటి ఏమీ పొందలేరు.** ప్రతి ప్రాణి తానాచరించిన కర్మలతో సురక్షితుడై భూమి అంతటా తిరుగుతాడు. వారి ప్రారబ్ధానుసారంగా బ్రహ్మ ఏర్పాటు చేసిన ఆహారం లభిస్తుంది. తాను స్వయంగా మట్టిముద్ద - పరతంత్రుడు. దృఢ మనస్సులేని వాడు తన వారిని రక్షించటానికి, పోషించటానికి హేతు వేమిటి ? (దాని విషయమై చింత అనవసరం) నీవు నీవారిని రక్షించాలని ఎంత ప్రయత్నం చేసినా మృత్యువు నీవు చూస్తూ ఉండగానే చంపుతుంది. అప్పుడు నీ శక్తిని గురించి ఆలోచించాలి. ఒకవేళ తలిదండ్రులు బ్రతికి ఉన్నా వారిని పోషించడం, రక్షించడం పూర్తి కాకుండానే నీవు చనిపోతావు. మరణించాక నీవాళ్లు పరలోకంలో సుఖపడుతున్నారో, దుఃఖపడుతున్నారో నీకు తెలియదు. ఈ విషయం కాస్త ఆలోచించు. **నీవు మరణించినా, జీవించినా నీవాళ్లు తమ కర్మల ననుసరించియే ఫలితం అనుభవిస్తున్నారు కదా ! ఇది తెలిసిన నీవు కూడా నీకు హితం చేసుకోవాలి కదా !** ఇలా తెలిసికొని 'ఈ లోకంలో ఎవరి కెవరు ?' అని ఆలోచించి, మనసును మోక్షం మీద నిలుపుకో. మళ్లీ మళ్లీ ఇదే అభ్యసించు.

ఆకలి దప్పులు, క్రోధలోభ మోహాలు విడిచి సత్త్వగుణం కలిగిన వాడే ముక్తుడు. మోహ పరవశుడై, జూదం, పానం, స్త్రీలు, వేట, వీటి మీది ఆసక్తితో పొరబడని వాడే నిత్యముక్తుడు. రోజూ పగలూ, రాత్రీ 'ఎంత అనుభవిద్దాం, ఎంత తిందాం' అని ఆలోచించేవానిని దోషబుద్ధి అంటారు. **సదా యోగ యుక్తుడయిన వాడు, స్త్రీల మీది ఆసక్తిని వదలిన వాడు సదా ముక్తుడే.** అన్ని ప్రాణుల జనన మరణాలను కర్మలను తాత్త్వికంగా తెలిసిన వాడు లోకంలో ముక్తుడే. **వేల కొద్ది వాహనాల్లో పట్టుకు వచ్చిన అన్నరాశులలో తనకడుపు నింపటానికి ఒక ప్రస్థం చాలు ననుకొనే వాడు ముక్తి పొందుతాడు. తనకున్న భవనా లన్నిటిలోను ఒక మంచమే తన స్థానం అనుకొనే వాడు ముక్తు డవుతాడు.** ఈ లోకం అంతా మృత్యువు చేత కొట్టబడిన దనీ, రోగాలతో పీడింపబడే దనీ, బ్రతుకు తెరువులేక బాధపడే దనీ తెలిసిన వాడు ముక్తుడవుతాడు. అలా చూసే వాడు సంతుష్టుడు. చూడనివాడు బాధింపబడతాడు. సంసార చక్రంలో తిరుగుతూ ఉంటాడు. అల్పలాభంతో సంతోషించేవాడు ఈ లోకంలోనే ముక్తి పొందుతాడు. ఈ లోకమంతా అగ్ని, సోమ రూపంగా భోక్త

భోజ్యరూపంగా చూసేవాడు, సుఖ దుఃఖాది భావాలు అంటని వాడు ముక్తుడే. హంతూలికాతల్పం, కటికనేల రెంటినీ సమానంగా చూసేవాడు ముక్తి పొందుతాడు. వరిఅన్నం, ఇతరాన్నం సమంగా చూసేవాడు ముక్తిని పొందుతాడు. పట్టుబట్ట, దర్భవస్త్రం, నారబట్ట, గొంగడి, చర్మం – అన్నిటినీ సమానంగా చూసే వాడు ముక్తి పొందినట్లే. ఈ లోకం పంచభూతాల నుండి పుట్టింది అని తెలుసుకొని, సమదృష్టితో వర్తించేవాడు జీవన్ముక్తుడే. సుఖదుఃఖాలు, లాభాలాభాలు, జయాపజయాలు, రాగ ద్వేషాలు, భయోద్వేగాలు సమానంగా ఉండేవాడు అన్ని విధాల ముక్తుడే. ఈ శరీరం దోష బహుళ మనీ, రక్తం, మూత్రం, మలం వీటి సముదాయ మనీ తెలిసిన వాడు ముక్తి పొందుతాడు. ముసలితనంలో శరీరం ముడతలు పడుతుంది. వెంట్రుకలు నెరుస్తాయి. చిక్కిపోతాడు. పాలి పోతాడు. నడుము వంగి పోయి పొట్టిగా అయిపోతాడు. ఈ దోషాలను గమనించిన వాడు ముక్తి పొందుతాడు.

ముసలితనంలో పుంస్త్వం పోతుంది. కంటి చూపు పోతుంది. చెముడు వస్తుంది. బలహీనత ఏర్పడుతుంది. ఈ దోషాలను చూడగలవాడు ముక్తు డవుతాడు. చాలా మంది ఋషులు, దేవతలు, రాక్షసులు ఈ లోకం నుండి పరలోకానికి వెళ్లినట్లు చూసినవాడు ముక్తి పొందుతాడు. ఎన్నో వేల కొద్దీ మహిమాన్వితులయిన రాజులు ఈ భూమిని విడిచి, పరలోకానికి వెళ్లా రని తెలిసినవాడు ముక్తిని పొందుతాడు. ఈ లోకంలో సంపదలు దుర్లభాలనీ, కష్టాలు సులభాలనీ, కుటుంబంలో దుఃఖమే కలుగుతుందనీ చూసిన వాడు ముక్తు డవుతాడు. తన సంతానమే దుష్టులై, దుర్గుణాలతో సంబంధం కలిగియుండటం చూసిన వాడు మోక్షాన్ని పొందాలని తప్పక అనుకొంటాడు. దాన్ని ఆరాధిస్తాడు. శాస్త్రాధ్యయనంతో, లోకానుభవంతో, జ్ఞానం పొంది, లోకమంతా నిస్సార మని తెలిసినవాడు మోక్షం పొందుతాడు. నాయా మాటలు విని, నీవు కలతపడకుండా గృహస్థా శ్రమంలో కాని, సన్యాసాశ్రమంలో కాని నిలిచి ముక్తునివలె సంచరించు.' ఇలా సగర మహారాజు అరిష్టనేమి మాటలు విని మోక్ష మిచ్చే అద్వేషం, మైత్రి, కరుణ మొదలయిన గుణాలతో కూడి ప్రజలను పరిపాలించాడు.'

289. శుక్రుని వృత్తాంతము.

ధర్మరాజు ఇలా అడిగాడు. 'పితామహా ! నామనస్సులో చాలాకాలం నుంచి ఒకవిషయం వినాలి అనే కోరిక ఉన్నది. దానికి సమాధానం నీ నుండి వినవలె నని ఉన్నది. మహామేధావి, దేవర్షి, కవి అయిన ఉశనుడు (శుక్రుడు) ఎప్పుడూ అసురులకు

మేలు చేసేవాడు. దేవతలకు శత్రువు ఎందుకు అయినాడు ? సహజంగానే మహాతేజోవంతులైన దానవుల పరాక్రమాదులను ఎందుకు పెంపొందించాడు ? అలాగే దానవులు నిరంతరం దేవతలతో శత్రుత్వమే ఎందుకు పెట్టుకొన్నారు ? దేవతలతో సమాన తేజోవంతుడై, మునిశ్రేష్ముడైన, ఉశనునిపేరు శుక్రుడు ఎందుకు అయింది ? అలౌకిక శక్తి ఆయనకు ఎలా లభించింది ? ఇది అంతా నాకు వివరంగా తెలియజేయి. పితామహా ! ఉశనుడు సహజంగానే మహాతేజోవంతుడు గదా ! ఆయన ఆకాశ మధ్యంలో నుండి వెళ్ళలేకపోతున్నాడు? ఈ విషయాలన్నీ నేను పూర్తిగా వినగోరుతున్నాను.'

భీష్ముడు చెప్పాడు. 'రాజా ! నేను పూర్వం విన్న ఈ విషయాలన్నీ నీకు నా బుద్ధి కుశలత ననుసరించి యథాశక్తిగా యథార్థం చెపుతాను. శ్రద్ధగా వినుము. భృగు పుత్రుడు, మునిశ్రేష్ముడైన ఉశనుడు అందరికి గౌరవింపదగినవాడు, దృఢంగా ఉత్తమ నియమాలను పాటించేవాడు. ఒక ప్రత్యేక కారణంవల్ల బాగా కోపంవచ్చి ఆయన దేవతలకు శత్రువు అయినాడు.* ఆ సమయంలో ముల్లోకాలకు అధిపతి ఐన ఇంద్రుని యొక్క ధనాగారాధిపతిగా యక్షరాక్షసులకు అధిపతి, ప్రభావ సంపన్నుడు అయిన కుబేరుడు ఉన్నాడు. యోగసిద్ధుడు మహాముని అయిన ఉశనుడు యోగబలంతో కుబేరునిలో ప్రవేశించి, ఆయనను తన వశం చేసుకొని ఆతని ధనమంతా అపహరించాడు. ఇలా తన వద్ద ఉన్న ధనం పోవటంవల్ల స్తిమితం లేని కుబేరుడు దేవశ్రేష్ఠ డయిన శివుని వద్దకు వెళ్ళాడు. మహా తేజస్వి, దేవతాశ్రేష్ముడు, సౌమ్యుడు, విశ్వస్వరూపుడైన రుద్రునికి తన సమస్యను ఇలా నివేదించాడు.

'యోగాత్ముకుడైన ఉశనుడు యోగబలంతో నన్ను పరవశుడిని చేసి, ఆటంకపరచి,

---

* *వి॥ ఒకప్పుడు అసురులు దేవతలను బాధించి భృగుపత్ని ఆశ్రమంలో ప్రవేశించి దాక్కున్నారు. అసురులు "మాతా !" అని పిలిచి ఆమె శరణు పొందినారు. ఆమె వారిని తన పుత్రులుగా భావించి వారిభయం పోగొట్టింది. దేవతలు వారిని శిక్షించటానికి వెళ్ళి నప్పుడు భృగుపత్ని తపఃప్రభావం వల్ల ఆమె ఆశ్రమంలో ప్రవేశింపలేకపోయారు. ఈ కారణంగా దేవతలు అందరూ కలిసి విష్ణుదేవుని శరణు పొందారు. లోకపాలకుడైన శ్రీమహావిష్ణువు దేవతలను దైవీసంపదను రక్షించటానికి సుదర్శన చక్రాన్ని దాల్చి అసురులను ఆసురభావం పెంపొందటానికి దోహదంచేసే భృగుపత్ని శిరస్సును ఖండించాడు. అప్పుడు మరణించకుండా తప్పించుకొన్న అసురులు భృగుపుత్రుడైన ఉశనుని శరణు పొందారు. ఉశనుడు తల్లి మరణంతో ఖిన్నుడై ఉన్నందువల్ల అసురులకు అభయం ఇచ్చాడు. అప్పటి నుంచి ఆయన దేవతల అభ్యున్నతికి అసురులద్వారా ఆటంకాలు కలిగించేవాడు.*

నా ధనం అంతా అపహరించి, బయటకు వచ్చాడు.' రాజా ! ఇది విన్న తరువాత మహాయోగీశ్వరు డైన మహాదేవుడు ఎర్రబడిన కన్నులతో శూలం తీసుకొని నిలిచాడు. ఉత్తమమైన ఆ ఆయుధం తీసుకొని 'అతడు ఎక్కడ, ఎక్కడ' అంటూ బయలుదేరాడు. ఆ స్వామి చేయదలచినది తెలుసుకొని ఉశనుడు ఆయనకు దూరంగా వెళ్ళాడు. యోగీశ్వరుడు, మహాత్ముడు అయిన పరమేశ్వరునికి తనపైన కోపం వచ్చింది అని తెలిసి యోగసిద్ధుడైన ఉశనుడు స్వామి ఎదుట ఎప్పుడు ఉండవచ్చునో, ఎప్పుడు రావలెనో, ఎప్పుడు వెళ్ళవలెనో తెలిసినవాడు కావటంవలన దూరంగా వెళ్ళాడు. యోగసిద్ధమైన మనస్సుగల ఉశనుడు ఉగ్రతపస్సుతో మహాత్ముడైన పరమేశ్వరుని ధ్యానించి, ఆయన శూలాగ్రం మీద కనిపించాడు. తపస్సిద్ధుడైన శుక్రాచార్యుని ఆ రూపంలో గుర్తించి దేవాధిపుడైన శంకరుడు ఆయన శూలం మీద ఉండటం తెలుసుకొని, ధనుస్సుగల చేతితో ఆ శూలాన్ని వంచాడు. అమిత తేజోవంతమైన శూలం ఆయన చేతితో వంగి ధనుస్సు ఆకారంలో మారింది. ఉగ్రాయుధుడైన ఆ స్వామి తన హస్తంలో వంగిపోవటంచేత ఆ శూలాన్ని 'పినాకం' అని అన్నాడు. అది వంగటంతోనే ఉశనుడు స్వామిచేతిలోకి వచ్చాడు. వెంటనే శివుడు నోరుతెరచి ఆయనను చేతితో నోటిలో వేసికొన్నాడు. పరమేశ్వరుని కుక్షిలోనికి వెళ్ళిన ఉశనుడు అందులో కూడా అంతటా కలయ తిరగసాగాడు.

యుధిష్ఠిరుడు అడిగాడు - 'మహాతేజస్వి అయిన ఉశనుడు పరమేశ్వరుని ఉదరంలో ఎందుకు తిరిగాడు ? అక్కడ ఏమి చేశాడు ?' భీష్ముడన్నాడు - 'రాజేంద్రా ! పూర్వం మహావ్రతుడైన మహేశ్వరుడు నీళ్ళలో ఎండుదుంగవలె నిశ్చలంగా నిలచి, కోట్ల సంవత్సరాలు తపస్సు చేయసాగాడు. కష్టసాధ్యమైన తపస్సుచేసి, మహాసరస్సు నుండి బయటకు వచ్చినంతనే చతుర్ముఖబ్రహ్మ ఆయన దగ్గరకు వచ్చాడు. అవ్యయుడైన బ్రహ్మ ఆయన క్షేమాన్ని, తపోవృద్ధిని గూర్చి ప్రశ్నించాడు. 'నా తపస్సు పూర్తిగా నెరవేరింది' అని శంకరుడు అన్నాడు. ఊహకందని స్వరూపంతో, సత్యధర్మపరాయణుడైన మహాదేవుడు తన తపః ప్రభావంవల్ల ఉశనుని తపస్సుకూడా పెంపొందినట్లు తెలుసుకొన్నాడు. మహాయోగి అయిన ఉశనుడు తపోధనంతో శక్తిమంతుడై ముల్లోకాల్లో వెలుగొందాడు. తరువాత పరమేశ్వరుడు ధ్యానమగ్ను డైనాడు. అప్పుడు ఉశనుడు సంతాపంతో స్వామి కుక్షిలోనే నిలిచిపోయాడు. మహాయోగి అయిన ఉశనుడు అక్కడే ఉండి పరమేశ్వరుని స్తుతించాడు. ఆయన బయట పడటానికి ప్రయత్నం చేస్తున్నాడు. కాని పరమేశ్వరుడు ఆయన ప్రయత్నాన్ని వమ్ము చేస్తున్నాడు. ఆ మహాముని అక్కడే ఉండి 'పరమేశా ! నామీద దయచూపు' అని పలుమారులు ప్రార్థించాడు. అపుడు 'నీవు నా మూత్రద్వారం నుంచి మాత్రమే బయటకు

రావాలి' అని చెప్పి దేవేశ్వరుడు ఇతర ద్వారాలను బిగించాడు.

అన్ని మార్గాలు మూసుకుపోవటంతో అక్కడి నుండి కదలలేని ఉశనుడు ఆ మార్గం కనిపెట్టలేక శివతేజస్సును తట్టుకోలేక తహ తహలాడుతూ ఆ కుక్షిలోనే ఇటూ అటూ తిరగసాగాడు. తరువాత చివరకు ఆయన మూత్రద్వారం నుంచి బయటపడినాడు. ఆ ద్వారంలో నుంచి బయటకు రావటంవల్ల ఉశనుడు శుక్రుడు (వీర్యం) అయినాడు. అందువల్ల ఆయన ఆకాశం మధ్యనుంచి వెళ్ళలేడు. తేజస్సుతో వెలిగిపోతూ బయటపడిన శుక్రుని చూసి, స్వామి కోపంతో శూలాన్ని ఎత్తిపెట్టాడు. అప్పుడు పరమేశ్వరి క్రుద్ధుడైన భర్తను అడ్డుకొన్నది. అండువల్ల శుక్రుడు వారికి పుత్రు డైనాడు. అమ్మవారు ఇలా అన్నారు. 'దేవా ! ఇప్పుడు శుక్రుడు నా పుత్రుడు అయినాడు. కాబట్టి ఈతనిని నాశనం చేయరాదు. మీ కుక్షినుండి బయటకు వచ్చిన వ్యక్తి నశించటానికి వీలులేదు.' దేవిప్రార్థనకు సంతోషించి శివుడు నవ్వుతూ స్థలుమారులు 'ఇతడు తనకు ఇష్టమైనచోటికి వెళ్ళవచ్చు' అన్నాడు. తరువాత మేధావి అయిన మహాముని ఉశనుడు వరాన్ని ప్రసాదించిన మహాదేవునికి, పరమేశ్వరికి నమస్కరించి, తనకు ఇష్టమైనచోటికి వెళ్ళాడు. భరత వంశశ్రేష్ఠ ! నాయనా ! యుధిష్ఠిరా ! నీవు నన్ను అడిగినదానిని అనుసరించి శుక్రాచార్య వృత్తాంతం చెప్పాను.

290. పరాశరుడు జనకునికి శ్రేయస్సాధనను ఉపదేశించుట - పరాశరగీత.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'పితామహా ! నాకు మేలు కలిగించే విషయం ఇంకా ఏదైనా చెప్పవలసింది. నీ మాటలు అమృతపానంలాగా ఎంత విన్నా నాకు సంతృప్తి కలగటంలేదు. పురుషశ్రేష్ఠ ! మానవుడు ఏ మంచిపని చేస్తే ఇహలోక పరలోకాలలో శ్రేయస్సును పొందుతాడో వివరంగా చెప్పవలసింది.' భీష్ముడు ఇలా అన్నాడు. 'కీర్తిసంపన్నా ! ఈ విషయంలో కూడా వెనకటిలాగానే ఒక వృత్తాంతం చెపుతాను. ఒకప్పుడు జనకుడు పరాశరమహర్షిని ఇలా ప్రశ్నించాడు. మహాత్మా ! ఈ లోకంలో, పరలోకంలో ప్రాణులకు మేలు, శ్రేయస్సును కలిగించేదాన్ని నాకు చెప్పవలసింది. అప్పుడు సమస్త ధర్మరీతులు తెలిసిన తపస్వి అయిన ఆ మహాముని రాజు మీద అనుగ్రహం కలిగి ఇలా అన్నాడు.

విద్వాంసులు ఇలా చెపుతున్నారు. స్వధర్మాన్ని యధా విధిగా ఆచరిస్తే అది ఇహపరలోకాల్లో శ్రేయస్సును కలిగిస్తుంది. దాన్ని మించినది ఇంక ఏమీ లేదు. తనధర్మాన్ని తెలుసుకొని ఆశ్రయిస్తే మానవుడు స్వర్గలోకంలో గౌరవాదులు పొందుతాడు. వేదంలో 'సత్యం వద' 'ధర్మంచర' 'యజేత' జుహుయాత్. (సత్యాన్ని చెప్పు, స్వధర్మం ఆచరించు, యాగంచేయవలెను, హోమంచేయాలి) అనేవాక్యాలు

మానవకర్తవ్యాలుగా ఉన్నవి అదే ధర్మలక్షణం అన్ని ఆశ్రమాలవారు ఆ ధర్మంలోనే ఉండి ఈ లోకంలో తమ తమ కర్తవ్యాలను అనుష్ఠించాలి ఈలోకంలో జీవితయాత్ర నాలుగు విధాలుగా ఉన్నది (బ్రాహ్మణులు యజ్ఞాదులు చేయించి దక్షిణలు తీసుకోవటం క్షత్రియులు పరిపాలకులుగా పన్నులు తీసుకోవటం వైశ్యులు వ్యవసాయ వాణిజ్యాలు చేయటం శూద్రులు త్రివర్ణాలను సేవించటం) మానవులు ఈ నాలుగు విధాలైన వృత్తులను ఆశ్రయిస్తారు ఆ వృత్తి దైవేచ్ఛతో ప్రవర్తిల్లుతున్నది మానవుడు నానా విధాలుగా పుణ్య పాపకర్మలను చేసి పంచత్వాన్ని పొందుతాడు అంటే ఈ స్థూలశరీరాన్ని వదలుతాడు వానికి కలిగే గతి నానాప్రకారాలుగా ఉంటుంది ఇత్తడితో చేసినపాత్రలు మున్నగువానికి బంగారం లేక వెండితో కళాయి పెడితే అవి బంగారం వెండిపాత్రల వలె కనిపిస్తాయి అలాగే పూర్వకర్మలకు వశమైన ప్రాణి వెనుకటిజన్మలో సంపాదించిన కర్మతో లిప్తు డవుతాడు (పుణ్య కర్మలిప్తుడైతే సుఖపడతాడు పాపకర్మ లిప్తుడైతే దు.ఖితు డవుతాడు) గింజ లేకుండా మొలక పుట్టనట్లు పుణ్యకర్మ చేయకపోతే ఎవడైనా సుఖ పడేవాడు గాని సంపన్నుడు గాని కాలేడు కాబట్టి మానవుడు శరీరాన్ని వదలిన తరువాత పుణ్యకర్మల ఫలంతోనే సుఖాన్ని పొందుతాడు వత్సా ప్రారబ్ధం ప్రత్యక్షంగా కనపడదు అలాగే అది ఉన్నది అనటానికి సూచించే అనుమాన ప్రమాణం కూడా లేదు కాని దేవ గంధర్వ దానవాది జన్మలు సహజంగానే ప్రాప్తిస్తాయి అని నాస్తికులు అంటారు దీనికి సమాధానం దేహం విడిచి వెళ్ళేజీవి తాను పూర్వజన్మలో చేసిన కర్మలను ఎప్పుడూ గుర్తుఉంచుకోలేడు కాని పూర్వదేహంతో చేసిన కర్మఫలాన్ని ఆజీవియే మనస్సు మాట కన్నులు చేతలతో చేసిన నాలుగు విధాలైన కర్మలను స్మరిస్తాడు ఎలాగంటే అతడు నేను పూర్వజన్మలో చేసిన కర్మ ఫలితాన్నే ఇప్పుడు అనుభవిస్తున్నాను అని అంటాడు లోకయాత్రను గడపటానికి మనశ్శాంతికి వేదవాక్కులను ప్రమాణంగా భావించారు అని నాస్తికులు అంటారు అంటే వేదోక్తమైన కర్మవిధానం అసమర్థుల బ్రతుకు తెరువుకేగాని ఇంకోటిగాదు కాని ఆ మాటలు పెద్దలు చెప్పినవి కావు

మానవుడు మనస్సు కన్నులు మాటలు, చేతలతో నాలుగు రకాల పనులు చేస్తాడు అవి ఎలా చేస్తాడో అలాగే వాటి ఫలితాన్ని పొందుతాడు

నరుడు కర్మఫలరూపంగా ఒకప్పుడు కేవలం సుఖాన్ని గాని ఇంకొకప్పుడు కేవలం దుఃఖాన్ని గాని మరొకప్పుడు రెండిటిని గాని పొందుతాడు అది పుణ్యం గాని పాపం గాని ఫలంగా అనుభవంలోకి రాకుండా నశించదు సంసార సముద్రంలో మునిగిపోయే వ్యక్తికి అప్పుడప్పుడు పుణ్యకర్మ దు ఖాన్నుంచి విముక్తి పొందేదాకా కదలనిదానిలాగా

ఉంటుంది. దుఃఖానుభవం పూర్తి అయిన తరువాత జీవుడు తన పుణ్యకర్మ ఫలాన్ని అనుభవించటం మొదలుపెడతాడు. పుణ్యం కూడా పూర్తి అయిన తరువాత మళ్ళీ అతడు పాపఫలితాన్ని అనుభవిస్తాడు. నాయనా ! ఈ విషయం బాగా తెలుసుకో. ఇంద్రియనిగ్రహం, ఓర్పు, ధైర్యం, తేజస్సు, సంతోషం, నిజం చెప్పటం, సిగ్గు, అహింస, వ్యసనం లేకపోవటం, సామర్థ్యం అనే పది సుఖం కలిగించేవి. వివేకి బ్రతికినంతకాలం పాపపుణ్యాలలో ఆసక్తుడు కాక తన మనస్సును భగవద్ధ్యానంలో ఉంచటానికి ప్రయత్నం చేయాలి. జీవుడు ఇంకొకడు చేసిన పుణ్యపాపకర్మలను అనుభవించడు. తాను స్వయంగా ఎలాంటిపని చేస్తే అలాంటి ఫలాన్నే పొందుతాడు. వివేకవంతుడు సుఖదుఃఖాలను తనలోనే లీనంచేసుకుని ఇంకొక త్రోవలో అంటే మోక్షమార్గంలో పయనిస్తాడు. దారా పుత్రాదులలో ఆసక్తులైన వారు అందరూ దానికి భిన్నమైన లోకమార్గంలో వెళ్ళుతారు. అందువల్ల పుడుతుంటారు, గిడుతుంటారు. ఇతరుల పనులను నిందించే మనుష్యుడు తాను వాటిని చేయకూడదు. ఇతరుల పనులను నిందిస్తూ తాను స్వయంగా చేసేవాడు లోకం వెక్కిరింపులకు లోనవుతాడు. రాజా ! పిరికివాడైన క్షత్రియుడు, (తినదగినదేదో తినగూడనిది ఏదో ఆలోచించక) అన్నీ తినే బ్రాహ్మణుడు, ధనసంపాదన చేయకుండా సోమరిగా ఉండే వైశ్యుడు, పనిచేయటానికి బద్ధకించే శూద్రుడు, మంచి గుణాలు లేని పండితుడు, సదాచారాన్ని పాటించని ఉత్తమవంశీయుడైన పురుషుడు, చెడునడతగల స్త్రీ, సత్యభాషణం చేయని ధార్మికుడు, విషయాసక్తుడైన యోగి, తనకోసమే ఆహారం సంపాదించుకొనే మానవుడు, మూర్ఖుడైన వక్త, రాజు లేని రాజ్యం, ఇంద్రియాలను జయించకుండా ప్రజలమీద ప్రేమ చూపలేని రాజు - వీరు అందరూ శోచనీయులు, నింద్యులు అవుతారు.

291. కర్మఫలప్రాప్తి అనివార్యత, పుణ్యకర్మవలన లాభము.

పరాశరుడు అన్నాడు. ఇంద్రియా లనే గుర్రాలతో గూడిన మనోమయ (సూక్ష్మశరీరం) రథం ఎక్కి, జ్ఞాన వృత్తు లనే పగ్గాలను పూని ప్రయాణం సాగించేవాడు వివేకవంతుడు. ఇంద్రియాలను బాహ్య వృత్తి లేనివాటిని చేసి (అంతర్ముఖుడై) పరమాత్మను ఆశ్రయించిన మనస్సుతో ఆయనను ఉపాసించేవాని ఉపాసన శ్రేష్ఠమని చెపుతారు విద్వాంసుడు భక్తుడు అయిన బ్రాహ్మణుని వల్ల ఇలాంటి ఉపాసన లభిస్తుంది సమానయోగ్యతగల (మీవంటి) వారివల్ల అది లభించదు మానవశరీరానికి ఆయువు

దుర్లభమైనది. దాన్ని పొందిన వ్యక్తి ఆత్మను పతితం చేయగూడదు. మానవుడు పుణ్యకర్మను అనుష్ఠించి ఆత్మోన్నతికి ఎల్లప్పుడు పాటుపడాలి. చెడ్డపనులు చేసి వర్ణభ్రష్టుడైన వ్యక్తి ఎప్పుడూ గౌరవార్హుడు కాడు. దీనికి వ్యతిరేకంగా సత్త్వగుణంతో ఉత్తమస్థితిని పొందినవాడు రాజసకర్మలు చేస్తే అదరపాత్రుడు కాడు. పుణ్యకర్మలతోనే మనుష్యుడు ఉత్తమ జన్మను పొందుతాడు. పాపాత్ముడికి అది దుర్లభం. అది పొందలేని అతడు పాపఫలాన్ని ఇచ్చే చెడ్డపనులు ఎప్పుడూ చేయకూడదు. అజ్ఞానం వల్ల కలిగే పాపాన్ని తపస్సుతోనే పోగొట్టుకోవాలి తాను చేసే పాపపుపని పాపరూపమైన దుఃఖంగా ఫలిస్తుంది. కాబట్టి దుఃఖమయమైన ఫలితాన్ని ఇచ్చే పాపకార్యం ఎప్పుడూ చేయగూడదు. **గొప్ప ఫలితాన్ని ఇచ్చేదైనా పాపసంబంధం గల పనిని వివేకం గలవాడు ఎప్పుడూ చేయగూడదు. పవిత్రమైన వ్యక్తి చండాలునికి వలె దానికి దూరంగా ఉండవలెను.** 'పాపకర్మ చేయటంవల్ల ఏ పాపమూ కనపడటంలేదే' అనుకొని దుష్కార్యాలు చేయటానికి సిద్ధ మయితే పరమాత్మధ్యానాసక్తి బాగా కలుగదు. మూర్ఖుడికి ఈ లోకంలో ఉన్నప్పుడు ఆత్మజ్ఞానం కలగక పోతే పరలోకానికి పోయేటప్పుడు అతడు అంతులేని సంతాపం పొందవలసి వస్తుంది.

రాజా ! ఎ మరకలు పడని వస్త్రాన్ని ఉతికి బాగుచేయవచ్చు కాని దుమ్ముకొట్టుకొని బాగా మాసిపోయి, మరకలుపడిన వస్త్రాన్ని ఎంత బాగా ఉతికినా పూర్తిగా తెల్లబడదు. అలాగే పాపంకూడా అంతత్వరగా పోదు. **బాగా తెలిసి కావాలనే పాపం చేసేవాడు దానికి ప్రాయశ్చిత్తంగా పుణ్యకర్మచేస్తే పాపకర్మఫలితాన్ని, సత్కర్మఫలితాన్ని దేనికి దాన్నే పొందుతాడు.** 'తెలియకచేసే హింస యొక్క ఫలాన్ని అహింస పోగొట్టు తుంది' అని ఆత్మజ్ఞానంకల బ్రాహ్మణులు శాస్త్రవాక్యాలను చెపుతున్నారు కాని 'కావాలని స్వేచ్ఛగా చేసే హింసా మయమయిన పాపఫలాన్ని అహింసావ్రతం పోగొట్టలేదు.' అని వేద శాస్త్రజ్ఞులైన బ్రాహ్మణులు చెపుతున్నారు. **పుణ్యకర్మనైనా, పాపకర్మనైనా బహిరంగంగా చేసినా, రహస్యంగా చేసినా (తెలిసిచేసినా తెలియకచేసినా) అది దాని ఫలితాన్ని తప్పక ఇస్తుంది.**

జనకా ! మనస్సుతో బాగా ఆలోచించి బుద్ధితో నిశ్చయించి చేసే పెద్దపని అయినా, చిన్నపని అయినా అవి తగిన ఫలాన్ని తప్పక ఇస్తాయి అలాగే హింసలాంటి భయంకర కార్యాలు నిరంతరం అలాగే జరుగుతూపోతే వాని ఫలితం లభిస్తుంది. కాని కావాలనే చేసే పనికి ఎక్కువ ఫలం వస్తుంది. అంతకన్నా తక్కువ ఫలం ఇంకోదానికి వస్తుంది. ఇదే తేడా. **దేవతలు గాని, మునులు గాని చేసిన అనుచిత కార్యాలను**

ధర్మాత్ములు అనుకరించరాదు. అలాగే ఆ పనులను గూర్చి వినినా ఆ దేవతలను, మునులను నిందించరాదు. రాజా ! ఎవరైనా ఈ పని నేను చేయగలనా ? లేదా? అని బాగా ఆలోచించి నిర్ణయం చేసుకొని, మంచిపనులు చేస్తే వారికి మేలు కలుగుతుంది కొత్తగా చేసిన పచ్చికుండలో పోసిన నీరు క్రమంగా తరిగిపోతుంది. కాని బాగా కాల్చిన కుండలో పోసిన నీరు పూర్తిగా నిలుస్తుంది. అలాగే బాగా పరిపక్వమై, నిర్మల మయిన అంతఃకరణంలో తాను సంపాదించిన ఉత్తమకార్యం నిశ్చలంగా ఉంటుంది నీళ్ళు ఉన్నకుండలో ఇంకా కొంతనీరు పోస్తే ఉన్న నీళ్ళు, పోసే నీళ్ళు కలిసి ఎక్కువనీరు ఆ కుండలో ఉంటుంది. అలాగే ఈ లోకంలో వివేకంతో చేసే పుణ్యకార్యాలు కొత్తగా చేసే పుణ్యకార్యాలలో కలసి చాలా ఎక్కువ పుణ్యవంతాలు అవుతాయి. (వాటి వల్ల ఆవ్యక్తి గొప్ప పుణ్యాత్ముడు అవుతాడు). రాజు పెద్దపెద్ద శత్రు రాజులను జయించాలి. న్యాయంగా ప్రజలను పాలించాలి. అనేకవిధాలైన యజ్ఞాలతో అగ్నిదేవుని తృప్తి పరచాలి వైరాగ్యం కలిగితే మధ్యవయస్సులో గాని వృద్ధావస్థలో గాని అడవికి వెళ్ళి మునియై ఉండాలి రాజా ! ప్రతి వ్యక్తి ఇంద్రియాలను అదుపులో ఉంచుకొని, ధర్మాత్ముడై సమస్త ప్రాణులను తనవలె భావించాలి చదువులో కాని, తపస్సులో కాని వయస్సులో కాని తనకంటె గొప్పవారిని పెద్ద వారిని గురువులను కాని యధాశక్తిగా గౌరవించాలి నిజం చెప్పుతూ, మంచి నడవడితో ఉంటే సుఖం కలుగుతుంది.

292. పరాశరగీత - సత్కర్మాదులు.

పరాశరమహర్షి చెప్పారు. రాజా ! ఎవరు ఎవరికి ఉపకారం చేస్తారు ? ఎవరు ఎవరికి ఎమి ఇస్తారు ? ప్రాణి ఏ పని నైనా తనకోసమే తాను చేసుకొంటాడు. సొంత అన్న అయినా తనమర్యాదను, మమకారాన్ని వదిలేసి ప్రవర్తిస్తే జనులు వానికి దూర మవుతారు. అలాంటప్పుడు సామాన్యుల సంగతి ఇంక చెప్పేది ఏముంది ? **గొప్పవ్యక్తి ఇచ్చేదానం, గొప్పవాడు గ్రహించేది రెండూ సమానం అవుతాయి. అయినా ఈ ఇద్దరిలో బ్రాహ్మణుడు తీసుకోవటంకంటే దానం ఇవ్వటమే శ్రేష్ఠం.** న్యాయంగా సంపాదించిన దానిని న్యాయంగా ఎక్కువ చేసుకొంటే దాన్ని ప్రయత్న పూర్వకంగా ధర్మానుసారం రక్షించుకొనవలెను. ఇదే ధర్మశాస్త్ర సిద్ధాంతం. ధర్మమే తనకు కావలసింది అనుకొనేవాడు క్రూరమైన పనులతో ధనం సంపాదించకూడదు. తన శక్తిని అనుసరించి అన్నీ మంచిపనులే చేయవలెను. సంపద ఎలా పెంచుకోవలెనా అని ఆలోచించ గూడదు. ఆ యా ఋతువులను బట్టి ఆకలి దప్పులతో అలమటించే వ్యక్తికి చల్లని నీటిని గాని

వేడి నీటినిగాని యథాశక్తిగా ఇచ్చి, ఆహారం పవిత్ర భావంతో పెడితే ఆ వ్యక్తికి పుణ్యం లభిస్తుంది. మహాత్ముడైన రంతిదేవుడు అనే రాజు కాయలు, దుంపలు, పండ్లు, ఆకులతో మహామునులను అర్చించాడు. దీనివలన ఆయనకు జనులు కోరే గొప్పసిద్ధి కలిగింది. ఈ ఫల పత్రాలతోనే శైబ్యుడు అనేరాజు మారరుని (ముని?) (సూర్యదేవుని పారిపార్శ్వకులలో ఒకడు) సంతోషపెట్టి ఉత్తమలోకాలకు వెళ్ళాడు * **ప్రతిమనుష్యుడు దేవతలకు, అతిథులకు, సేవకులకు, పితరులకు, తనకుతాను ఋణపడి జన్మిస్తాడు. కాబట్టి ఆ ఋణాలను తనకు చేతనైనట్లు తీర్చుకోటానికి ప్రయత్నించాలి. వేదశాస్త్రాధ్యయనంతో ఋషిఋణాన్ని, యజ్ఞాదులతో దేవతలఋణాన్ని, శ్రాద్ధదానాదులతో పితృదేవతలఋణాన్ని, స్వాగత సత్కారాదులతో అతిథిఋణాన్ని తీర్చుకొనవలెను. ఇలాగే వేదవిషయాలను చదవటం, వినటం, మననంచేయటంతోను, యజ్ఞ శేషమైన ఆహారాన్ని స్వీకరించటంతోను, ప్రాణులను రక్షించటంతోను మానవుడు ఆత్మఋణాన్నుంచి ముక్తుడవుతాడు. పోషించవలసిన కుటుంబంలోని వారిని, సేవకులను మొదటి నుంచి పోషించాలి. దీనివల్ల వారి ఋణాన్నుంచికూడా విముక్తు డవుతాడు.** మహర్షులకు ధనధాన్యాదులు ఉండేవి కావు అయినా వారు తమ గట్టి ప్రయత్నాలతోనే యథావిధిగా యజ్ఞాదులను చేసి సిద్ధిని పొందారు. ధర్మజా ! ఋచీకుని పుత్రుడు యజ్ఞంలో భాగస్వాములైన దేవతలను వేదమంత్రాలతో స్తుతించి, విశ్వామిత్రునికి పుత్రుడు అయినాడు. ఉశనుడనే మహర్షి పరమేశ్వరుని అనుగ్రహంతో శుక్రత్వాన్ని పొందాడు పార్వతీదేవిని స్తోత్రంచేసి మహాకీర్తిమంతుడై ఆకాశంలో గ్రహరూపాన్నంది స్థిరుడై ఆనందిస్తున్నాడు.

అసితుడు, దేవలుడు నారదుడు, పర్వతుడు, కక్షీవంతుడు, పరశురాముడు, తాండ్యుడు, వసిష్ఠుడు, జమదగ్ని విశ్వామిత్రుడు, అత్రి భరద్వాజుడు, హరిశ్మశ్రుడు కుండధారుడు, శ్రుతశ్రవుడు అనే ఈ మహర్షులు అందరు వేద ఋక్కులతో విష్ణుదేవుని స్తుతిచేసి ధీమంతుడైన ఆ స్వామి దయతో తపస్సుచేసి సిద్ధపురుషులయినారు. గౌరవానికి తగని వారుగూడా ఆ శ్రీహరిని స్తుతించి మహాత్ము లయినారు. ఈలోకంలో నీచమైన పనిని చేసి ఎవరూ కూడా ఎవిధంగానూ అభివృద్ధిని పొందవలెనని కోరుకొనగూడదు. **స్వధర్మాన్ని యథావిధిగా అనుష్ఠిస్తూ నిజాయితీగా సంపాదించే ధనమే అసలైన**

---

* *వి॥సం॥ మారరుడు 86 శ్రుతర్షులలో ఒకడు. బ్రహ్మాండపురాణంలో ఈయనను గూర్చి 2/33 3లో ఉన్నది. శైబ్యుని గూర్చి మహాభారతంలో అనేక స్థలాలో ఉన్నది.*

ధనం. అధర్మంతో సంపాదించేది నింద్య మైవది. లోకంలో ధనకాంక్షతో శాశ్వతమైన ధర్మాన్ని ఎలాంటి స్థితిలో కూడా వదలరాదు. రాజా ! ప్రతిరోజు అగ్నిపూజ చేసేవాడే ధర్మాత్ముడు పుణ్యకార్యాలు చేసేవాడు. వేదాలు అన్నీ దక్షిణాగ్ని గార్హపత్యం, ఆహవనీయం అనే మూడు అగ్నులలోనే ఉన్నవి సదాచారాన్ని సత్కర్మను వదలకుండా అనుసరించేవాడు అగ్ని హోత్రాదులు ఆచరించకపోయినా ఆహితాగ్ని అవుతాడు సదాచారాన్ని బాగా యధావిధిగా ఆచరిస్తే అగ్నికార్యం చేయలేక పోయినా మేలే కాని సదాచారాన్ని వదలివేసి కేవలం అగ్ని కార్యం చేయటం వల్ల మేలు కలగదు నరశ్రేష్ఠా ! అగ్ని, ఆత్మ, జన్మనిచ్చే తల్లిదండ్రులు, గురువు - వీరిని తగిన రీతిగా పూజించాలి. అభిమానాన్ని వదలిపెట్టి వృద్ధులసేవ చేస్తూ విద్వాంసుడు, కామాలను అనుభవించటంలో ఆసక్తుడు కాకుండ అందరిని ప్రేమతో చూసేవాడు, కౌటిల్యం లేకుండా ధర్మతత్పరుడై, ఇతరులను హింసించకుండ ఉండేవాడు ఇహ లోకంలో శ్రేష్ఠుడు. సజ్జనులు ఆయనను గౌరవిస్తారు.'

293. సజ్జన సాంగత్య మహత్యము - మానవకర్తవ్యము.

పరాశర మహర్షి చెప్పారు రాజా ! మూడువర్ణాలకన్న తరువాత వర్ణం వానికి తనపై వర్ణాల వారిసేవయే ఉత్తమమైనది నాల్గవవర్ణం వాడు శాస్త్రం తనకు విధించిన సేవావృత్తిని ఆత్మీయంగా చేసికొనినచో ధర్మాత్ము డగును. శూద్రునికి వంశపరంగా వచ్చే నిశ్చితమైన వృత్తిలేకపోతే ఇంకొక వృత్తిని స్వీకరించగూడదు. పై వర్ణాల వారిసేవనే బ్రతుకు తెరువు చేసుకోవాలి. ధర్మాత్ములైనవారి సమీపంలో ఉండటమే ఎప్పుడైనా మేలు చేస్తుంది. కాని ఎలాంటి పరిస్థితిలో నైనా చెడ్డవారితో మెలగటం మంచిది కాదని నా అభిప్రాయం. సూర్యునికి దగ్గరగా ఉండటంవల్ల ఉదయ పర్వతం మీద ఉండే అన్ని వస్తువులు చక్కగా ప్రకాశించినట్లు మంచివారితో దగ్గరితనం వల్ల తక్కువవర్ణం వ్యక్తి అయినా మంచిగుణాలతో వెలుగొందుతాడు తెల్లటి వస్త్రానికి రంగువేస్తే అది ఆ రంగుతోనే విరాజిల్లుతుంది. ఇలాగే ఎలాంటి సాంగత్యం చేస్తే అలాంటి రూపమే కలుగుతుంది. కాబట్టి నీవు సుగుణాల మీదనే ఆసక్తి చూపించు గాని చెడుమీద కాదు. మానవజీవితం అనిత్యం, చంచలమైనది గదా ! విద్యావంతుడు సుఖంలో ఉన్నా దుఃఖంలో ఉన్నా మంచిపనినే చేస్తాడు. మంచినే ఎంచుకొనేవాడు శాస్త్రాలను సరిగా గమనించగలడు. ధర్మానికి దూరమైన పనివల్ల ఈ లోకంలో అశాశ్వతమైన గొప్ప సుఖం ఉండవచ్చు. మేధావి అయినవాడు దానిని స్వీకరించరాదు. అది ఇక్కడ శాశ్వత సౌఖ్యహేతువు కాదని పెద్దలు చెపుతారు. ధర్మంతో గూడినది

తక్కువ ఫలితాన్ని కలిగించే దయినా సందేహించకుండా దాన్ని స్వీకరించవచ్చు. ఆది అధికసుఖాన్ని కలిగిస్తుంది. ఇతరుల ఆవులను వేలకొలది అపహరించి దానం చేస్తూ ప్రజలను సరిగా చూడని రాజు పేరుకుమాత్రమే దాత అవుతాడు నిజానికి ఆతడు గజదొంగ. పరమాత్మ సృష్టిలో మొట్టమొదట చతుర్ముఖబ్రహ్మను సృష్టించాడు. బ్రహ్మ పర్జన్యుడనే పుత్రుని సృష్టించాడు. ఆయన అన్ని లోకాలను రక్షించటంలో తత్పరుడయ్యాడు ఆయనను పూజించి వైశ్యుడు వ్యవసాయం పశువుల పెంపకం పెంపొందించాలి. రాజు వానిని రక్షించాలి కుటిలులు, మోసంచేసేవారు కాకుండ హవ్య కవ్యాలకు ఉపయోగిస్తూ ఆ ఆహారం అనే ధనాన్ని బ్రాహ్మణులు యజ్ఞం (లోక హితం)లో చక్కగా ఉపయోగించాలి. శూద్రులు యజ్ఞ భూమిని, వర్ణత్రయంవారి గృహాలను శుభ్రంగా ఉంచాలి. ఇలా చేస్తే ధర్మం నశించదు

ధర్మం నశించకుండా రక్షింపబడితే ప్రజలంతా సురక్షితంగా ఉంటారు. రాజా ! ప్రజలు సుఖపడటంవలన స్వర్గంలో దేవతలు గూడా ప్రసన్నులు అవుతారు. **కాబట్టి రాజు ధర్మపూర్వకంగా ప్రజాపాలన చేస్తే దానివలన లోకపూజితుడు అవుతాడు. ఇలాగే విప్రుడు స్వధర్మంగా వేదాధ్యయనం చేస్తే, వైశ్యుడు ధర్మాత్ముడై ధనం సంపాదిస్తే, శూద్రుడు ఇంద్రియ జయంతో నిరంతరం పైవారి శుశ్రూష చేస్తే స్వధర్మాన్ని ఆచరించటం వలన లోకపూజితు లవుతారు. దీనికి విపరీతంగా ప్రవర్తిస్తే వారు అందరూ స్వధర్మంనుంచి పతితులు అవుతారు. ప్రాణాలకు బాధ కలిగించి అయినాసరే, న్యాయంగా సంపాదించిన పైసలైనా దానం చేస్తే అవి మహాఫలితాన్ని ఇస్తాయి. అంతకంటె ఎక్కువగా సంపాదించినది న్యాయమైతే దాన్ని వేలకొలదీ దానం చేస్తే కలిగే ఫలితాన్ని ఎంతని చెప్పగలం ?** బ్రాహ్మణులను పూజించి రాజు దానం ఇస్తే దానికి తగిన ఉత్తమ ఫలాన్ని పొందుతాడు. స్వయంగా బ్రాహ్మణుని వద్దకు వెళ్ళి ఆయనను సంతోష పెడుతూ ఇచ్చే దానం ప్రశంసించదగినది, ఉత్తమం అని చెపుతారు. యాచించిన తరువాత ఇచ్చేది మధ్యమం అని పండితులు అంటారు. **అపహాస్యం చేస్తూ గాని, అశ్రద్ధగా గాని ఇచ్చేదానం అధమమైనదిగా సత్యవచనులైన మునులు చెపుతారు. ప్రవాహంలో కొట్టుకొని పోయే వ్యక్తి ఏదో విధంగా ప్రాణాపాయాన్నుంచి ఆత్మరక్షణకు అనేక రీతులుగా ప్రయత్నించినట్లే నీవు గూడా సంసారసముద్రం నుంచి విముక్తి పొందటానికి నిరంతరం ప్రయత్నించు. ఇంద్రియ జయంతో బ్రాహ్మణుడు, రణ విజయంతో రాజు, న్యాయార్జిత ధనంతో వైశ్యుడు, సేవాకార్యంలో నేర్పుచూపుతూ శూద్రుడు ప్రకాశిస్తాడు.'**

294. వర్ణధర్మము, త్యాగ మహత్త్వము.

పరాశరమహర్షి చెప్పారు. 'రాజా ! బ్రాహ్మణుడు దానం తీసుకోవటంతో క్షత్రియుడు యుద్ధంలో జయించి సంపాదించటంతో, వైశ్యుడు న్యాయంగా వ్యవసాయాదులతో, శూద్రుడు సేవతో పొందిన ద్రవ్యం కొంచెమైనా మంచిదే. దాన్ని ధర్మకార్యాలకు ఉపయోగిస్తే మహాఫలం దక్కుతుంది. శూద్రునికి వర్ణత్రయ సేవ శ్రేష్ఠం అనిచెప్పారు బ్రతుకు తెరువు లేని బ్రాహ్మణుడు క్షత్రియ వైశ్యధర్మాలను పాటించి జీవిస్తే పతితుడు కాడు. శూద్రధర్మాన్ని స్వీకరిస్తే మాత్రం పతితుడు అవుతాడు. సేవా వృత్తితో జీవనం సాగకపోతే శూద్రుడు వ్యాపారం పశుపోషణం శిల్పం వంటి వాటిని స్వీకరించవచ్చు. నాటకాదులలో వేషాలువేయటం తోలుబొమ్మలాటలు చేపట్టడం, మద్యమాంసాలను అమ్మటం, ఇనుము మొదలైన లోహాలను అమ్మటం ఇలాంటివి పనికిరావు అని చెప్పారు. ఎవరి ఇంట్లోనైనా వంశపరంపరగా పై వ్యాపారాలు లేకపోతే వాటిని తాను ప్రారంభించరాదు ఒకవేళ తనవంశంలో వెనుకటి వారు చేసినా తాను వాటిని వదలివేయటం గొప్పధర్మం అని శాస్త్రం చెపుతున్నది లోకంలో ప్రసిద్ధుడైన వ్యక్తి గర్వంతో గాని లోభంతో గాని పాపపు పనులు చేస్తుంటే ఆ పనులు ఇతరులకు అనుసరింపదగినవి కావు అని పెద్దలు చెప్పారు. పర్వకాలంలో చాలామంది వ్యక్తులు ఇంద్రియ నిగ్రహపరులు, ధర్మాత్ములు న్యాయబద్ధమైన పనులు చేసేవారని పురాణాలవలన తెలుస్తున్నది. ఆ కాలంలో దోషములను చీదరించుకోవట మనే శిక్ష వేసేవారు. రాజా ఎప్పుడైనా ఈ లోకంలో మనుష్యులకు ధర్మాచరణమే మంచిదని చెప్పటం పరిపాటిగా ఉన్నది స్వధర్మాచరణంలో పండిపోయిన వారు ఈ భూమి మీద సద్గుణాలనే పాటించేవారు

వత్సా ! రాజా ! కాని ఆ ధర్మాన్ని అసురులు (కామము క్రోధము) ఓర్చుకోలేక పోయినారు వారు క్రమంగా పెంపొందుతూ జనులలో ప్రవేశించారు. ఆ ప్రజలలో ధర్మాన్ని నశింపజేసే పొగరు వ్యక్తం అయింది. వారిలో ఆ పొగరు కలిగేసరికి కోపం కూడా వీర్పడింది రాజా తరువాత క్రోధానికి లొంగిపోయిన ప్రజలలో తప్పుచేయటానికి సిగ్గుపడటం అనే సదాచారం లోపించింది. సంకోచం కూడా దూరం అయింది. తరువాత మోహం అవతరించింది. మోహం ఆక్రమించటం చేత వెనక ఉన్న మంచి - చెడుల దృష్టి లోపించింది. అందువలన వారు ఒకరినొకరు నాశనం చేసుకొని తమకు తామే గొప్పవారు కావాలనే ప్రయత్నమూ, సుఖపడాలనే కోరిక ఎక్కువ అయినవి. ఆ చెడిపోయిన వారి మీద ధిక్కారం అనే ఆ శిక్ష పనిచేయలేదు. మానవులు అందరు దేవతలను, బ్రాహ్మణులను అవమానించి తమ ఇష్టం వచ్చినట్లు ఇంద్రియసుఖాలను అనుభవించసాగారు.

అలాంటి పరిస్థితి ఏర్పడటంతో దేవతలు అందరు నానారూపధరుడు, గుణాధికుడు, ధీరుడు, దేవదేవుడు అయిన పరమేశ్వరుని శరణు పొందారు. అప్పుడు శంకరుడు దేవతల సమధికమైన తేజస్సుతో పెంపొంది శక్తిమంతమైన ఒకే బాణంతో మూడు పట్టణాలతో గూడి ఆకాశంలో విహరించే ఆ అసురులను అందరిని చంపి నేలమీద పడవేశాడు. ఆ అసురుల అధిపతి భయంకరాకారుడు భీకర పరాక్రమ వంతుడు. దేవతలను వణికించే ఆతనిని శంకరుడు సంహరించాడు. ఆతని సంహారం తరువాత మానవులు అందరు స్వస్థచిత్తులు అయినారు. వెనుకటివలెనె వారికి వేదశాస్త్రజ్ఞానం కలిగింది. ఆ తరువాత సప్తర్షులు స్వర్గలోకంలో దేవతల రాజ్యానికి ఇంద్రుని ప్రభువుగా అభిషిక్తుని చేశారు వారే మానవుల పరిపాలకులు అయినారు. సప్తర్షుల తరువాత విప్పృధువు అనేరాజు భూమండలానికి ప్రభువు అయినాడు. ఇతరక్షత్రియులు ప్రతిమండలానికి ఒకరు చొప్పున రాజులు అయినారు. ఆ కాలంలో ఉన్నత వంశాలలో జన్మించినవారు వారికంటె పూర్వులు వయస్సు గుణాలలో గొప్పవారు వీరిఅందరి మనుస్సులలో నుండి ఆసురభావాలు పూర్తిగా తొలగలేదు. అలా ఆసురభావాలు కూడా కలిగిన చాలామంది మహా పరాక్రమంగల రాజులు ఆసురభావాలకు తగిన విధంగానే ప్రవర్తించారు. మహామూర్ఖులైన వారు ఇప్పటికీ అలాగే ఉన్నారు. ఆ ఆసురభావాలనే స్థాపిస్తున్నారు. అన్ని విధాలా వాటినే సొంతం చేసుకొంటున్నారు.

అందువలన రాజా ! నేను శాస్త్రానుసారం బాగా ఆలోచించి చెపుతున్నాను. మానవుడు నిత్యమూ అభివృద్ధిని పొందటానికి యత్నించవలసినదే. అదే సమయంలో హింసాత్మకమైన పనులను వదలిపెట్టాలి. వివేకవంతుడు ధర్మకార్యం చేయటానికి న్యాయాన్ని వదలిపెట్టి, పాపంతో కలిసిన పద్ధతిలో ధనం సంపాదించరాదు. అది మేలు గాదు. నీవుకూడా ఇలాగే ఇంద్రియజయం సంపాదించిన క్షత్రియుడవై బంధుప్రేమ కలిగి ప్రజలను సేవకులను పుత్రులను స్వధర్మానుసారం పరిపాలించు ఇష్టమైనవి, ఇష్టం కానివి కలగటం, శత్రుత్వాన్ని మైత్రిని పొందటం వీటిని అన్నిటిని అనుభవిస్తూ ఉండే జీవునికి వేలకొలది జన్మలు కలుగుతూ ఉంటాయి గుణహీనుడు, దుర్బుద్ధి అయిన మనుష్యుడు కూడా తనకు ఉన్న గుణాభిమానంతో మహాసంతోషంగా ఉంటాడు. కాబట్టి నీవు మంచిగుణాలనే ప్రేమించు. దుర్గుణాలను దరిచేరనీయకు. మహారాజా ! మానవులలో ధర్మాధర్మాలు ఉన్నట్లుగా మనుష్యులకన్న ఇతరమైన ప్రాణులలో ఉండవు. ధర్మాత్ముడు విద్వాంసుడు అయినమనుష్యుడు ఆహారాదుల కోసం యత్నించవలసి

ఉన్నా అవసరం లేకపోయినా అందరినీ ఆత్మీయతతో తనవలెనే భావించి ఏ ప్రాణిని హింసించకుండ సమభావంతో ఉండాలి. మానవుని మనస్సు కోరికలు, కర్మవాసనలు లేనిది అయితే కపటాచార రహితం అవుతుంది. అప్పుడు అతనికి మేలు కలుగుతుంది.'

295. తపోమహత్త్వము - స్వధర్మాచరణము.

పరాశర మహర్షి ఇలా అన్నారు 'వత్సా ! గృహస్థుని కర్తవ్యం ఇంతవరకూ చెప్పాను. ఇక తపో విధిని చెపుతాను. విను. రాజా ! గృహస్థాశ్రమంలో ఉన్నవారికి సామాన్యంగా రాజసతామస గుణాల సంబంధం వలన పదార్థాల మీద, వ్యక్తులమీద మమకారం కలుగుతుంది. ఒక ఇంటివాడు అయిన తరువాత మానవుడు ఆవులు, పాలాలు సంపదలు భార్య, సంతానం, బంధువులు అయిన వారితో చుట్టరికం ఏర్పరుచుకొంటాడు. ఈ విధంగా ప్రవృత్తి మార్గాన్ని అనుసరించి సాంసారిక విషయాల్లో ఆసక్తుడై నిత్యమూ వాటిని చూస్తూ ఉండటంవలన అవి అన్నీ అనిత్యాలు అనే దృష్టి లేక పోవటంచేత రాగద్వేషాలు వృద్ధిపొందుతాయి. **రాగద్వేషాలకు లోనై మనుష్యుడు ధనాదుల మీద ఆసక్తుడై నప్పుడు మోహంవల్ల రతి ఏర్పడుతుంది.** కామ్య విషయాలలో మునిగితేలే ప్రతివ్యక్తి సంభోగాదులు కలవాడే కృతార్థుడు అని అనుకొని, కామక్రీడకంటే ఇంకొక లాభం లేదని ఆ రతివలన మరొకటి పట్టించుకొనడు. తరువాత లోభానికి లొంగిపోయి ఆసక్తివలన సేవకవర్గాన్ని పెంచుకొంటాడు. అప్పుడు కుటుంబంలోనివారిని పోషించుకొనటానికి డబ్బు సంపాదించాలని యత్నిస్తాడు. **ఇది చేయరాని పని అని బాగా తెలిసి కూడా మానవుడు డబ్బుకోసం వాటిని చేస్తాడు. సంతానం మీద మమకారంలో మునిగి పోతాడు. ఆ సంతతిలో నుంచి ఎవరైనా మరణిస్తే వారికోసం దుఃఖిస్తుంటాడు.** బాగా డబ్బు ఉండటం వల్ల లోకంలో గౌరవం పెరుగుతుంది దానికి లొంగినవ్యక్తి తనకు ఎలాంటి అవమానం జరగకుండ జాగ్రత్త పడతాడు. సర్వసంపదలను ఎప్పుడూ అనుభవించాలి అనే ఉద్దేశ్యంతో అన్ని పనులు చేస్తాడు. అందువల్ల చివరకు నశిస్తాడు. **కొంతమంది మంచి పనులు చేస్తారు. కాని వాటిని సుఖపడవలెననే కోరికతో చేయరు. ఆ సమత్వంగల జ్ఞానవాదులైన వారు శాశ్వత సౌఖ్యం పొందుతారు.** రాజా ! సంసారులకు తమ ప్రేమ పాత్రులైన భార్యాపుత్రాదులు మరణించినప్పుడు, సంపద తొలగినప్పుడు, రోగాలు, దిగులు, కష్టాలు కలిగినప్పుడు వైరాగ్యం కలుగుతుంది. వైరాగ్యం వల్ల మానవునికి - ఆత్మ అంటే ఎమిటో తెలుసుకోవాలి - అనే ఆలోచన కలుగుతుంది. అందువల్ల శాస్త్రాలలో ఏమి ఉన్నదో

తెలుసుకోవాలనుకొంటాడు. ఆ విషయాలు తెలియటం వల్ల తపస్సు దానికి మంచిసాధనం అని నిశ్చయించుకొంటాడు.

రాజేంద్రా ! భార్యాపుత్రాదుల వలన రావలసిన సుఖం లేకపోయే సరికి తపస్సు తప్పక చేద్దాం అని దృఢనిశ్చయం చేసుకొనే వ్యక్తి లోకంలో దుర్లభుడు. **నాయనా ! సత్కర్మానుష్ఠానం - తపస్సు అందరూ చేయవచ్చు. ఇంద్రియాలను మనస్సును అదుపులో ఉంచుకొన్నవాడు హీనుడైనా తపస్సు చేయవచ్చు. తపస్సు స్వర్గమార్గాన్ని సుగమం చేస్తుంది.** రాజా ! పూర్వం సర్వసమర్థుడైన ప్రజాపతి పరమాత్మ - తపోమగ్నుడై ఉండి - ధ్యానపరాయణుడై లోకాన్ని సృజించాడు. ఆదిత్యులు వసువులు రుద్రులు, అగ్ని, అశ్వినీ కుమారులు, వాయువు విశ్వేదేవులు, సాధ్యులు పితరులు, మరుద్గణం, యక్షులు, రాక్షసులు, గంధర్వులు, సిద్ధులు, స్వర్గం నివాసంగా గల దేవతలు, ఇతర దేవతలు - వీరు అందరు తపస్సు చేతనే సిద్ధిని పొందారు. పూర్వం బ్రహ్మదేవుడు సృష్టించిన మరీచి మొదలైన బ్రాహ్మణులు తపః ప్రభావం వల్లనే భూమిని, ఆకాశాన్ని పవిత్రం చేస్తూ సంచరిస్తున్నారు. మానవ లోకంలో రాజశ్రేష్ఠులు, ఉత్తమ గృహస్థులు ఉత్తమ వంశాలలో జన్మించటం అంతా తపస్సు ఫలితమే. పట్టుబట్టలు, ఉత్తమ వస్త్రాలు, మంగళకరమైన ఆభరణాలు, శ్రేష్ఠ వాహనాలు, ఆసనాలు, ఆహారపానీయాలు అన్నీ ఉత్తమ తపః ఫలాలే. తనమనస్సు తెలుసుకొని అనుకూలంగా ప్రవర్తించే వేలకొలది సుందరస్త్రీలు, మహాభవన నివాసం - ఇవి అన్నీతపః ఫలాలే. అమూల్యమైన శయనాలు నానావిధాలైన ఉత్తమాహారాలు కోరుకొన్న పదార్థాలు పుణ్యం చేసినవారికే లభిస్తాయి. తపస్సువల్ల లభించని వస్తువులు ముల్లోకాల్లో ఏవీ ఉండవు కామ్యకర్మలు, నిషిద్ధకర్మలు చేయనివారి తపస్సు ఫలితం ఇహలోక సుఖాలను వదలివేయటమే

మనుష్యుడు సుఖంలో ఉన్నా, కష్టంలో ఉన్నా మనోబుద్ధులతో శాస్త్రవిషయాలను చక్కగా తెలుసుకొని లోభాన్ని వదలివేయాలి. **నిరంతరం అభ్యాసంలో లేనివిద్య వలె పంతృప్తి లేకపోవటమే దుఃఖం. లోభం వల్లనే మనస్సు, ఇంద్రియాలు చంచలం అవుతాయి. అందువల్ల అతని వివేకం నశిస్తుంది.** యుక్తాయుక్తజ్ఞానం పోయినవాడు ఇది చేయవచ్చు, ఇది చేయరాదు అనే న్యాయాలోచనను కోల్పోతాడు కాబట్టి ఇహలోకసుఖాలను పోగొట్టుకొన్న మానవుడు తీవ్రమైన తపస్సు చేయాలి. తనకు ఇష్టమైనదే సుఖం అనీ, ఇష్టం కానిది దుఃఖం అనీ చెపుతారు. తపస్సు చేస్తే సుఖం కలుగుతుంది. చేయకపోతే దుఃఖం కలుగుతుంది కాబట్టి తపస్సు చేయటం వల్ల చేయకపోవటం వల్ల కలిగే ఫలం ఎలాంటిదో చూడు మానవులు పవిత్రమైన తపస్సుచేసి, ఎల్లప్పుడు మేలునే పొందుతారు.

కావాలనుకొన్న సుఖాలను పొందుతారు. ప్రసిద్ధి పొందుతారు. సకామ కర్మలు చేసేవాడు అనిష్టాలను, నానా విధాలైన అవమానాలను పొందుతాడు. కర్మఫలాన్ని వదలితే అన్ని విషయాల ఆత్మ అయిన పరమాత్మను పొందుతాడు. **ధర్మం, తపస్సు, దానా లందు సంశయం కలిగితే పాపపుపనులు చేసి నరకంలో పడతాడు.** సుఖంలో ఉన్నా, దుఃఖంలో ఉన్నా సదాచారం నుండి తొలగని వాడు మాత్రమే శాస్త్రం తెలిసినమానవుడు. రాజేంద్రా ! ధనుస్సు నుండి వదలిన బాణం భూమి మీద పడటానికి పట్టేటంత సమయమే శరీరం, నాలుక, కన్నులు, ముక్కు, చెవి అనే ఐదు ఇంద్రియాలవల్ల కలిగే సుఖానుభవం ఉంటుంది. (విషయసుఖం క్షణికం అని భావం). ఆ సుఖం తొలగిన తరువాత ఆతనికి మనస్సులో తీవ్రమైన బాధ కలుగుతుంది. ఇంత జరిగినా విషయాసక్తుడైన అజ్ఞాని మోక్షం వల్ల కలిగే సుఖాన్ని మెచ్చుకోలేడు. ఆ తరువాత వివేకవంతుడైన పురుషుని మనస్సులో మోక్షం పొందటానికి శమం, దమం మొదలైన గుణాలు కలుగుతాయి. నిరంతరం ధర్మకార్యాలను చేయటం వలన మానవునికి ధనం, భోగం ఎప్పుడూ తొలగవు. **కాబట్టి గృహస్థు తనప్రయత్నం లేకుండా వాటి అంతట అవే వచ్చే విషయసుఖాలను అనుభవించాలి. స్వధర్మాన్ని మాత్రం ప్రయత్న పూర్వకంగానే ఆచరించాలి అని నా అభిప్రాయం.** ఉత్తమ కులంలో జన్మించి, గౌరవం సంపాదించి, శాస్త్రవిషయాలు బాగా తెలిసి అసమర్థతవల్ల కర్మ ధర్మశూన్యులు, ఆత్మతత్త్వం తెలియని వారు చేసే లౌకికకార్యాలు వ్యర్థం అవుతాయి. కాబట్టి వారికి తపస్సును మించిన సత్కార్యం లేదు. **రాజా ! గృహస్థు ఎల్లప్పుడు తన కర్తవ్యాన్ని నిశ్చయించు కొని, స్వధర్మాన్ని ఆచరిస్తూ, నైపుణ్యంతో శ్రద్ధగా యజ్ఞాలను, శ్రాద్ధాలను యథావిధిగా నిర్వహించాలి. నదీనదాలు అన్నీ సముద్రంలో కలసి పోయినట్లు అన్ని ఆశ్రమాలు గృహస్థుని ఆశ్రయించి ఉంటాయి.'**

296. నానావిధ ధర్మ కర్తవ్యముల ఉపదేశము.

జనకుడు అడిగాడు. 'పరాశరమునీ ! బ్రాహ్మణులు మొదలైన వారిలో ఉండే విశేష వర్ణం ఎలా ఏర్పడింది ? నేను తెలుసుకొన గోరుతున్నాను. వివరించండి. ఎవరివలన సంతతి కలుగుతుందో అది వారిరూపమే అని వేదం చెపుతున్నది గదా ! అంటే సంతతిరూపంగా జన్మ నిచ్చే తండ్రి నూతన జన్మను పొందుతున్నాడు. అలాంటప్పుడు మొదట్లో చతుర్ముఖ బ్రహ్మనుండి, బ్రాహ్మణులనుండి అందరి పుట్టుక కలిగింది గదా ! మరి వారికి క్షత్రియాదులైన పేరులు ఎలా కలిగాయి ?' పరాశరమహర్షి ఇలా అన్నాడు.

'మహారాజా ! నీవన్నది సరి ఐనదే. ఎవరి వల్ల జన్మిస్తే వారిస్వరూపమే ఏర్పడుతుంది. తక్కువ తపస్సువలన జనులు తక్కువజాతి వారు అవుతారు. ఉత్తమక్షేత్రం, ఉత్తమ బీజంవల్ల జన్మ పవిత్రమైనది కలుగుతుంది. క్షేత్రబీజాల్లో ఏ ఒక్కటి తక్కువది అయినా వ్యక్తి తక్కువవాడుగా జన్మిస్తాడు. బ్రహ్మ మానవజాతిని సృష్టించేటప్పుడు ఆయన ముఖం, భుజాలు, ఊరువులు, పాదాలు అనే అంగాలనుంచి మానవులు జన్మించారు అని ధర్మవేత్తలకు తెలుసు. ముఖం నుంచి జన్మించినవారు బ్రాహ్మణులు. బాహువుల నుంచి జన్మించినవారు క్షత్రియులు. ఊరువుల నుంచి కలిగినవారు ధనికులు - వైశ్యులు. పాదాలనుంచి పుట్టినవారు శూద్రులు అని వ్యవహరింపబడ్డారు. ఈరీతిగా బ్రహ్మదేవుని నాలుగు అంగాల నుండి నాలుగు వర్ణాలే ఉత్పన్నం అయినాయి. వీరుకాక ఇతరులు ఈనాలుగు వర్ణాలలో ఒకదానిలో ఇంకొకటి కలియగా కలిగిన వారు. కాబట్టి సంకరజాతి వారు అని వ్యవహారం కలిగింది. **రాజా ! క్షత్రియులు, అతిరథులు, అంబష్ఠులు, ఉగ్రులు, వైదేహులు, శ్వపాకులు, పుల్కసులు, స్తేనులు, నిషాదులు, సూతులు, మాగధులు, అయోగులు, కరణులు, వ్రాత్యులు, చండాలురు అనే జాతులవారు బ్రాహ్మణాదులైన నాలుగువర్ణాల వారితో; ఎక్కువ జాతి వారికి తక్కువ జాతి వారితో, తక్కువ జాతివారికి ఎక్కువ జాతి వారితో (అనులోమవిలోమంగా) కలిగే శారీరక సంయోగంవల్ల జన్మిస్తున్నారు.**

జనకుడు అడిగాడు. 'మునీశ్వరా ! అందరికి బ్రహ్మయే జన్మ నిచ్చిన వాడు గదా ! అలాంటప్పుడు మానవులలో భిన్నభిన్న గోత్రాలు ఎలా ఏర్పడినవి ? ఈ లోకంలో అనేక గోత్రాల పేర్లు వింటున్నాం. పవిత్ర జాతుల్లో, తద్విపరీత జాతుల్లో జన్మించిన వారు అందరూ బ్రాహ్మణత్వాన్ని ఎలా పొందారు. పరాశరు డన్నాడు. 'రాజా ! తపస్సుతో పవిత్రమైన అంతఃకరణం గల పవిత్రమైన మహాత్ముల వల్ల కలిగే సంతతి, లేదా ఆ మహాత్ములు స్వయంగా సంకల్పించి ఎత్తిన జన్మ క్షేత్రం తక్కువది అయినా జన్మించినవారు గొప్పవారుగానే పరిగణింప బడ్డారు. మహర్షులు పలురకాల అనేక పుత్రులకు జన్మనిచ్చారు. తమ మహత్తరతపస్సుతోనే వారికి ఋషిత్వాన్ని ప్రసాదించారు. విదేహరాజా ! పూర్వం మా తాత వసిష్ఠుడు, కశ్యపగోత్రియుడైన ఋష్యశృంగుడు, వేదుడు, తాండ్యుడు, కృపుడు, కమఠాదులు, యవక్రీతుడు, ద్రోణుడు, ఆయువు, మతంగుడు, దత్తుడు, ద్రుపదుడు, మత్స్యుడు. - వీరంతా తపస్సును ఆశ్రయించి తమ తమ వ్యక్తిత్వంతో ప్రత్యేకతను పొందారు. ఇంద్రియనిగ్రహ, తపస్సులతోనే వారు వేదవేత్తలు, సమాజంలో ప్రత్యేకత సాధించుకొన్నవారు అయినారు. రాజా ! మొట్టమొదట అంగిరస, కశ్యప,

వసిష్ఠ, భృగువుల గోత్రాలే ఏర్పడినవి. కర్మానుసారం ఇతరగోత్రాలు తరువాత కలిగాయి. ఆ గోత్రాలు, వారిపేర్లు ఆ గోత్ర ప్రవర్తకులైన మహర్షుల తపస్సువలననే సజ్జన సమాజంలో బాగా ప్రసిద్ధాలై, పూజార్హతను పొందాయి.'

జనకుడు అడిగాడు. 'మహాత్మా ! సమస్త వర్ణాల వారి విశేషధర్మాలను చెప్పి ఆ తరువాత సామాన్యధర్మాలను చెప్పవలసింది. సమస్త విషయాలను వివరించటంలో మీరు నేర్పరులు. పరాశరుడు ఇలా అన్నాడు. 'రాజా ! దానం తీసుకోవటం, యజ్ఞాలు చేయించటం, విద్యాబోధ అనేవి బ్రాహ్మణునికి విశేషధర్మాలు. (ఇవి బ్రతుకుతెరువు సాధనాలు) ప్రజా రక్షణం క్షత్రియునికి శ్రేష్ఠధర్మం. వ్యవసాయం, పశుపోషణ, వర్తకం అనేవి వైశ్యకర్మలు. ద్విజసేవ శూద్రులకు కర్తవ్యధర్మం. నాయనా ! ఇవి విశేషధర్మాలు. సాధారణ ధర్మాలను వివరంగా చెపుతాను. విను. దయ, అహింస, పొరపడకపోవటం, దేవతలకు, పితృదేవతలకు ఇవ్వవలసింది ఇవ్వటం, దానాలు చేయటం, శ్రాద్ధకర్మాచరణం, అతిథిసత్కారం, నిజం చెప్పటం, కోపం లేకపోవటం, తన భార్యతోనే సంతృప్తి చెందటం, పవిత్రంగా ఉండటం, ఎవరిమీద ఆరోపణలు చేయకపోవటం, ఆత్మజ్ఞానం, సహనం అనేవి సాధారణ ధర్మాలు. మానవశ్రేష్ఠా ! బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు అనే మూడు వర్ణాలవారు ద్విజాతులు. పైన చెప్పిన ధర్మాలలో వారికే అధికారం ఉంది. రాజేంద్రా ! ఈ మూడు వర్ణాల వారు తమకు విహితమైన వానికంటె విరుద్ధమయిన - వేదవిరుద్ధమైన కర్మాచరణం కలవారైతే పతితులవుతారు. సత్పురుషులను ఆశ్రయించి, తమ తమ కర్మాచరణంలో ప్రవర్తిస్తే వీరికి ఉన్నతి కలుగుతుంది. (అలాగే విరుద్ధకర్మాచరణం వల్ల పతితు లవుతారు). **శూద్రుడు పతితుడు కాడు. ఉపనయ నాదులకు అర్హుడు కాడు, వైదికాలైన అగ్నిహోత్రాదులను అనుష్ఠించటానికి అధికారి కాడు. కాని పైన చెప్పిన సాధారణ ధర్మాల ఆచరణలో అధికారం ఉన్నది. నిషేధం లేదు. జనకరాజా ! వేద శాస్త్ర జ్ఞాన సంపన్నులైన బ్రాహ్మణులు శూద్రుని ప్రజాపతితుల్యు డని చెపుతారు. అతడు సేవతో సమస్తప్రజలను రక్షిస్తాడు. కాని నేను ఆతనిని జగత్తంతకూ రక్షకుడైన విష్ణువులాగా చూస్తాను. పాలనం విష్ణుకర్తవ్యం. ఆతడు తన కర్తవ్యంతో రక్షకుడైన శ్రీహరిని ఆరాధించి ఆయనను పొందుతాడు. తక్కువ జాతివారు (శూద్రులు) ఆత్మోద్ధరణం కావాలను కొంటే సదాచారాన్ని అనుసరిస్తూ ఆత్మోన్నతిని కలిగించే సమస్త కర్మాచరణం ముఖ్యం కాని వేదమంత్రాలను పలకగూడదు. దాన్ని చేస్తే దోషం అవుతుంది.** వారికన్న ఇతరజాతులవారు ఎలాంటి సదాచారాన్ని

పాటిస్తారో వారు వాటిని ఆచరించినందువల్ల కలిగే సుఖాన్ని పొంది, ఈలోకంలోను పరలోకంలోను ఆనందిస్తారు.'

జనకుడు అడిగాడు. 'మహామునీ ! మానవుని ఆతడు ఆచరించే కర్మల దోషిని చేస్తాయా ? లేక జాతియా ? అనే సందేహం నాకు కలుగుతున్నది. దీన్ని వివరించవలసింది.' పరాశరమహర్షి ఇలా అన్నారు. 'మహారాజా ! చేసేపని, జాతి అనేవి రెండూ దోషకారకాలు అవుతాయి. సందేహం లేదు. కాని వానిలోని విశేషాన్ని చెపుతాను విను. జాతితో కాని, పనులతో కాని శ్రేష్ఠుడు, పాపకర్మలను చేయని వాడు జాతి తక్కువవాడైనా అసలైన మానవుడు. **ఉత్తమ జాతివాడైనా నింద్యమైన పనినిచేస్తే అది ఆతనిని పాపాత్ముని చేస్తుంది. కాబట్టి ఏ విధంగాను చెడ్డపని చేయగూడదు.**'

జనకుడు అడిగాడు. 'ద్విజశ్రేష్ఠా ! అనుష్ఠాన సమయంలో ఎప్పుడూ ఏ ప్రాణిని బాధించని ధర్మానుకూలమైన కార్యాలు ఏవి ఈ లోకంలో ఉన్నాయి ?' పరాశరుడన్నాడు. 'మహారాజా ! హింసారహితాలు, మానవుని ఎల్లప్పుడు రక్షించేవీ, నీవు అడిగిన వాటిని ఇప్పుడు చెపుతాను, విను. అగ్ని హోత్రాదులను పరిత్యజించి, సంన్యాసదీక్షను గ్రహించి, ఉదాసీన భావంతో సమస్తాన్ని చూస్తూ, నిశ్చింతులై క్రమంగా మేలుకలిగించే కర్మమార్గాన్ని ఆశ్రయించి వినయ విధేయతలతో ఇంద్రియ నిగ్రహాదులను సొంతం చేసుకొంటూ, కఠోర నియమాలను పాటించేవారు సమస్త కర్మరహితమూ, శాశ్వతమూ అయిన స్థానాన్ని పొందుతారు. రాజా ! సర్వవర్ణాలవారు ఈ లోకంలో తమతమ ధర్మానుసారం స్వకర్మానుష్ఠానం చక్కగా చేస్తూ, ఎప్పుడూ నిజం చెపుతూ, పాపకర్మలను అన్నింటినీ వదలి స్వర్గాన్ని పొందుతారు. ఈ విషయాన్ని ఇంకొక రకంగా ఆలోచించరాదు.'

297. పరాశరగీతలు - చేయవలసిన నానాధర్మాలు.

పరాశరుడు అన్నాడు. 'రాజా ! లోకంలో గుణహీనులకు స్వార్థం తప్ప తల్లిదండ్రులు, మిత్రులు, గురువులు, స్త్రీలు - వీరి విషయాలు ఏవీ పట్టవు. కాని స్వామి భక్తులు, మేలు కలిగించే మాటలు పలికేవారు, మేలుకోరేవారు, ఇంద్రియనిగ్రహం కలవారు పితృదులను ఎప్పుడూ దూరం చేసుకొనరు. మానవులకు తండ్రి ముఖ్యదైవం. కొంతమందైతే తల్లికంటే తండ్రియే గొప్పవాడని చెపుతారు. జ్ఞానసంపాదనమే గొప్పదని అంటారు. శ్రోత్రాది ఇంద్రియాలను, శబ్దాదివిషయాలను లోబరుచుకొన్నవారు పరమపదాన్ని పొందుతారు. క్షత్రియపుత్రుడు యుద్ధరంగంలో గాయపడి, బాణాగ్నిలో దగ్ధమయి పోయేవాడు దేవతలకు లభించని లోకాలకు వెళ్ళుతాడు. అక్కడ ఆనందంగా స్వర్గసుఖాలు పొందుతాడు.

యుద్ధరంగంలో అలసిపోయిన వానిని, భయపడిన వానిని, ఆయుధాన్ని వదలినవానిని, ఏడ్చేవానిని, వెన్నుచూపి పారిపోయేవానిని, యుద్ధసామగ్రి ఏమీ లేనివానిని, యుద్ధప్రయత్నం విరమించిన వానిని, రోగిని, ప్రాణదానం చేయమని అడిగేవానిని, బాలుని, వృద్ధుని వధించరాదు. యుద్ధసామగ్రితో కూడిఉన్నవాడు, యుద్ధసన్నద్ధుడు, తనతో సమానుడు, అయిన క్షత్రియపుత్రుని జయించటానికి రాజు తప్పక ప్రయత్నించాలి. తనతో సమానుడు, తన కన్న గొప్పవాడు అయిన వీరునిచేతిలో చనిపోవటం శ్రేష్ఠమని పెద్దల నిర్ణయం. తనకన్న తక్కువవాడు, భయగ్రస్తుడు, దీనుడు అయినవాని చేతిలో కలిగే మరణం నింద్యం. పాపాత్ముడు, పాపకార్యాలు చేసేవాడు, హీనుడు - వీరి చేత కలిగేమరణం పాపకారకమే నని చెపుతారు. అది నరకంలో పడవేస్తుందని శాస్త్ర నిర్ణయం.

రాజా ! మృత్యువశుడైన వానిని ఎవడూ రక్షించలేడు. ఆయుశ్శేషం గలవానిని ఎవడూ చంపలేడు. తనకు ఆప్తులు అయినవారు హింసాత్మక కర్మలు తనకోసం చేస్తుంటే వారిపనులను అన్నింటినీ తాను అడ్డుకోవాలి. ఇతరుల ఆయువుతో తన ఆయువును పెంచుకోవాలి అనుకోకూడదు. అంటే ఇతరుల ప్రాణాలు తీసి తనప్రాణరక్షణ చేసుకోవాలని కోరుకోగూడదు. మరణించాలి అని కోరుకొనే గృహస్థులకు అందరికి గంగాది పుణ్యనదీ తీరాలలో పుణ్యకర్మలు చేస్తూ పొందే మృత్యువే సర్వోత్తమం అని పెద్దలు చెపుతారు. ఆయువు తీరితే మరణం కలుగుతుంది. ఇది నిష్కారణంగా నైనా జరగవచ్చు. లేక ఒకప్పుడు అనేక కారణాల వలననైనా జరగవచ్చు. లభించిన దేహాన్ని మొండితనంతో, బలవన్మరణంతో వదిలేస్తే ఆ జీవునికి యాతనాదేహం లభిస్తుంది. (ఇలాగా మోక్షసాధనమైన ఈ శరీరాన్ని పొందిగూడా ఆత్మహత్య చేసుకునే వ్యక్తికి ముక్తి లభించదు). ఇలాంటివారు ఒక ఇంటిని వదలి ఇంకొక ఇంటికి వెళ్ళే వ్యక్తివలె ఒక శరీరం వదలి, ఇంకొక శరీరంలో ప్రవేశిస్తారు. వారికి ఇలాంటిస్థితి కలగటానికి ఆత్మహత్యకన్న ఇంకొక కారణం లేదు. వారికి పంచభూతాత్మకమైన ఆ శరీరం కలగటమే సముచితం. ఈ శరీరం నరాల, నాడుల, ఎముకల ప్రోగు. అసహ్యమైన అపవిత్రమైన మలమూత్రాదులతో నిండి ఉంటుంది. పంచభూతాలు, శ్రోత్రాదులైన ఇంద్రియాలు, గుణాల - వాసనామయ విషయాల సముదాయం. అధ్యాత్మతత్వాన్ని భావించే జ్ఞానులు "ఇలాంటి దీనిపైన ఉండే చర్మం వీటిని అన్నిటిని కప్పివేసేది. ఇది సౌందర్యాది గుణరహితం. దీనికి మరణం అనివార్యం" అంటారు. జీవాత్మ వదలిన తరువాత ఈ దేహం కదలిక లేనిది, జడం అవుతుంది. దీనిలోని పంచభూతాలు తమతమ ప్రకృతులలో కలిసి పోతాయి. ఈ పార్థివ దేహం మట్టిలో కలిసిపోతుంది.

ఈ శరీరం ఎక్కడ మరణించినా జీవుడు ప్రారబ్ధ కర్మవశం చేత ప్రభావితుడై ఎక్కడైనా జన్మించవచ్చు. కర్మఫలంగా స్వభావసిద్ధమైన పునర్జన్మ కలుగుతుంది. అలా కలగకపోతే పెద్దమేఘం ఆకాశంలో గాలివశాన అన్నివైపులా తిరిగినట్లు జీవాత్మ ప్రారబ్ధకర్మానుసారం తిరుగుతుంది. వెంటనే జన్మించదు. ఆ జీవుడే మళ్ళీ ఏదో ఆధారంగా చేసుకొని, మళ్ళీ జన్మిస్తాడు. మనస్సుకన్న ఆత్మ గొప్పది. ఇంద్రియాలకంటే మనస్సు శ్రేష్ఠమైనది. చరాచర సృష్టిలోని ప్రాణులలో సంచరించేవి శ్రేష్ఠమైనవి. ఈ జంగమ జగత్తులో రెండుకాళ్ళుగల మానవులు శ్రేష్ఠులు అని చెపుతారు. **ఆ మనుష్యులలో ద్విజులు శ్రేష్ఠులు. వారిలో మేధావులు శ్రేష్ఠులు. వారిలో ఆత్మజ్ఞానులు శ్రేష్ఠులు. వారిలో అహంకార రహితులు అధికులు.** మానవుల జన్మను మరణం వెంటనంటి ఉంటుంది అని విద్వాంసుల నిర్ణయం. సమస్త ప్రజలు సత్యాది గుణాలతో ప్రేరితులై వినాశశీలమైన కర్మలను ఆచరిస్తున్నారు. సూర్యుడు ఉత్తరాయణంలో ఉన్నప్పుడు ఉత్తమ నక్షత్రంలో పవిత్రసమయంలో మరణించే వ్యక్తి పుణ్యాత్ముడు. ఈ వ్యక్తి ఎవరికి ఎలాంటి కష్టం కలిగించకుండ ప్రాయశ్చిత్తాలతో తనపాపాన్ని పోగొట్టుకొంటాడు. యథాశక్తిగా మంచి పనులు చేసి మరణిస్తాడు. విషం త్రాగినందువల్ల, ఉరివేయటంవలన, మంటల్లో పడటం వల్ల, దొంగల చేతుల్లో మరణించటంవలన, పశువులు పొడవటంవల్ల కలిగే మృత్యువు అధమం అని చెపుతారు. పుణ్యకార్యాలు చేసిన వారికి ఇలాంటి మరణం కలగదు. ఇంకా ఇటువంటి వాటివల్ల వారికి అధమరీతిగా మృత్యువు కలుగదు. **పుణ్యాత్ముల ప్రాణాలు బ్రహ్మ రంధ్రాన్ని ఛేదించుకొని పోతాయి. మధ్య తరగతికి చెందిన వారి ప్రాణాలు ముఖ, నేత్రాదుల నుండి బయటికి పోతాయి. పాపాత్ముల ప్రాణాలు మలమూత్ర ద్వారాలనుంచి వెళ్ళిపోతాయి.**

మానవుని అజ్ఞానంతో సమానమైన శత్రువు ఇంకొకటి లేదు. అది ఆవరించి ప్రేరేపించగా నరుడు చాల ఘోరమైన, నీచమైన, క్రూరమైన పనులు చేస్తాడు. రాజపుత్రా ! ఆ అజ్ఞానశత్రువును జయించడానికి వేదోక్తధర్మానుసారం పెద్దలను సేవించి, ప్రజ్ఞను (స్థిరబుద్ధిని) సంపాదించేవాడే సమర్థుడు అవుతాడు. ఆ శత్రువును జయించటం చాలా కష్టసాధ్యం. ఆ శత్రువు ప్రజ్ఞాశరాఘాతాన్ని పొంది మాత్రమే నశిస్తాడు. ద్విజుడు మొదట బ్రహ్మచర్యాశ్రమంలో ఉండి తపః ప్రధానుడై వేదాధ్యయనం చేయాలి. తరువాత గృహస్థాశ్రమంలో ప్రవేశించి యథాశక్తిగా పంచమహా యజ్ఞాలను అనుష్ఠించాలి. అనంతరం ఇల్లు-వాకిలి కుమారునికి అప్పగించి మంచి మార్గంలో ఉండి ధర్మాచరణం

కోసమే వానప్రస్థుడు కావాలి. **నాయనా ! ఇహలోక సుఖ సాధనాలకు లోబడి మానవుడు తనను తక్కువ వానినిగా భావించుకొనరాదు. చండాల జాతిలోనైనా మానవజన్మ లభిస్తే అది మానవేతరప్రాణులకన్న అన్ని రకాలా ఉత్తమమే కదా ! మానవజన్మమే సాటిలేనిది. ఇది ప్రాప్తించిన వ్యక్తి పుణ్యకర్మలు చేస్తే ఆత్మోద్ధరణ చేసుకోగలడు.** దేవా ! మేము మానవజన్మ నుండి పతనం కాకుండా ఎలా ఉండగలమో అని ఆలోచించి, వేద ప్రామాణ్యంతో మానవులు ధర్మాన్ని అనుష్ఠించుతారు. **నరుడు చాలా దుర్లభమయిన మానవశరీరాన్ని సంపాదించుకొని కూడా ధర్మాన్ని నిర్లక్ష్యం చేసి, మనస్సుతో ఇహలోకసుఖాలలో ఆసక్తుడై, మహత్తర ప్రయోజనానికి దూరం అవుతున్నాడు.** వత్సా ! సమస్త ప్రాణులను తైలంతో దీపాన్నివలె (స్నేహం) ప్రేమతో పెంపొందించాలని కోరేవాడు, వాటిని ఆత్మీయతతో చూచేవాడు, విషయ సుఖాలవైపు చూపు పెట్టని వాడు పరలోకంలో గౌరవాదరాలు సంపాదిస్తాడు.

ఇతరులకు ధైర్యం చెప్పటం, వారిబాగోగులు తెలుసుకోవటం, తగిన ఆహారం పెట్టటం, ప్రేమగా పలకరించటం, ఆదరించటం చేసేవాడు, సుఖదుఃఖాలలో సమంగా ఉండేవాడు ఇహలోక పరలోకాలలో కీర్తిమంతుడు అవుతాడు. సరస్వతీనది, నైమిషారణ్యం, పుష్కరతీర్థం ఇంకా భూమి మీద ఉండే పుణ్య తీర్థక్షేత్రాలకు వెళ్ళి దానాలు ఇవ్వటం, భోగాలను వదలటం, శాంతభావంతో ఉండటం, తపస్సు తీర్థస్నానాలతో మనశ్శరీరాలను పవిత్రం చేసుకోవటం మానవ కర్తవ్యం. ఇంట్లో ప్రాణం పోయేవ్యక్తిని త్వరగా గృహంలోనుంచి బయటకు తేవటం ఉత్తమం. మరణించిన తరువాత ఆ శరీరాన్ని పాడెమీద ఉంచి శ్మశానానికి తీసుకుపోవాలి. పవిత్రంగా శాస్త్రానుసారం దహన సంస్కారం తప్పక చేయాలి. మానవుడు యథాశక్తిగా శాంతిక పౌష్టిక కర్మలను, యజ్ఞాదులు చేయటం, చేయించటం, దానం చేయటం పుణ్యకర్మానుష్ఠానం, శ్రాద్ధాదులైన ఉత్తమ కర్మలు చేయటం - ఇవి తనమేలు కోరుకొని చేయవలసినవి.' రాజేంద్రా ! ధర్మశాస్త్రాలు, ఆరు అంగాలతో గూడిన వేదాలు పుణ్య కర్మలు చేసే మానవులకు మేలు చేసేవిషయాలనే చెపుతున్నవి. భీష్ముడన్నాడు. 'యుధిష్ఠిరా ! పూర్వకాలంలో మహాత్ముడైన పరాశర మహర్షి జనక మహారాజు మేలుకోరి, ఈ ఉపదేశం చేశాడు.'

298. జనకుని వివిధ ప్రశ్నలకు పరాశరుని సమాధానము.

భీష్ముడు చెపుతున్నాడు. 'యుధిష్ఠిరా ! అనంతరం మిథిలాధిపుడైన జనకుడు ధర్మవిషయంలో ఉత్తమ నిశ్చయాలు కల పరాశరుని ఇలా ప్రశ్నించాడు. జనకుడు

అడిగాడు. "మహాత్మా ! శ్రేయస్సును సాధించేది ఏది ? ఏది ఉత్తమగతి ? ఎలాంటి కర్మ నశించదు ? జీవుడు ఎక్కడికి వెళ్ళిన తరువాత మళ్ళీ ఈ లోకంలోకి రాకుండా ఉంటాడు ? ఈ నా ప్రశ్నలకు తగిన సమాధానం చెప్పండి." పరాశరుడు ఇలా చెప్పాడు. **'ఆసక్తి లేకపోవటమే శ్రేయస్సుకు మూలకారణం. జ్ఞానమే అన్నిటికన్న ఉత్తమగతి. తాను చేసిన తపస్సు, యోగ్యునికి ఇచ్చిన దానమూ ఎప్పుడూ నశించవు.** అధర్మమయమైన బంధాన్ని తెంచుకుని ధర్మంలో ఆసక్తుడు అవుతూ సమస్తప్రాణులకు అభయాన్ని ఇచ్చేవాడు వెంటనే సిద్ధిని పొందుతాడు. **గోవులను, వండల వేల అశ్వాలను దానం చేసేవాని కన్నా సర్వప్రాణులకు అభయం ఇచ్చేవాడు గొప్పవాడు.** వివేకవంతుడైన వ్యక్తి లౌకికవిషయాలలో ఉన్నా అంటని వానివలె ఉండటం వలన వాటిలో లేనివాడే అవుతాడు. అలాగే కలుషచిత్తుడు లోకవిషయసుఖాలకు దూరంగా ఉన్నా ఎల్లప్పుడు వానిలో ఉన్నవాడే అవుతాడు. **తామరాకును నీరు అంటనిరీతిగా జ్ఞాని అయిన వ్యక్తిని అధర్మం అంటదు. లక్క కర్రకు అంటుకొన్నట్లు అజ్ఞాని అయిన వానిని పాపం ఎక్కువగా అంటుతుంది. అధర్మం తనఫలితాన్ని ఇవ్వటానికి అవకాశం కోసం ఎదురుచూస్తూ కర్తను వెంటనంటకుండా విడవదు. సమయం వచ్చినప్పుడు కర్త ఆపాపఫలాన్ని తప్పక పొందుతాడు.** పవిత్రమైన అంతఃకరణంగల ఆత్మజ్ఞాని అయినవాడు కర్మవల్ల కలిగే సత్ఫలిత దుష్ఫలితాలతో ఎప్పుడూ చలించడు. జ్ఞానేంద్రియ కర్మేంద్రియాల పొరపాటు వలన కలిగే పాపాలను గూర్చి ఆలోచించక శుభాశుభాలలో ఆసక్తుడు అయ్యేవాడు మహాభయాన్ని పొందుతాడు. కాని రాగరహితుడై, కోపాన్ని జయించి, నిత్యం సదాచారాన్ని అవలంబించేవాడు విషయాలలో ఉన్నా పాపకర్మతో సంబంధం లేనివాడే అవుతాడు. నదిమీద కట్టిన పటిష్ఠమైన కట్ట తెగిపోకుండా ఉండటమే కాక అక్కడ నీరు ఎక్కువ నిలచినరీతిగా సనాతన సంప్రదాయం మీద ధర్మసేతువు చెడిపోదు. ఆసక్తిలేకుండా చేసే తపస్సు క్రమక్రమంగా పెరుగుతుంటుంది.

రాజశ్రేష్ఠ ! స్వచ్ఛమైన సూర్యకాంతమణి సూర్యతేజస్సును గ్రహించినట్లు యోగసాధకుడు సమాధిస్థితిలో బ్రహ్మస్వరూపాన్ని గ్రహిస్తాడు. నువ్వుల నూనె నానావిధాలైన సువాసన గల పూవులతో వాసితమై చాల చక్కని సువాసనను స్వీకరించినట్లు, ఈ భూమండలం మీద పవిత్ర చిత్తం గల వ్యక్తిస్వభావం సత్పురుషసాంగత్యంవలన సత్త్వగుణసంపన్నం అవుతుంది. మానవుడు సర్వోత్తమ మోక్షపదాన్ని పొందవలె ననుకొన్నప్పుడు ఆతనిబుద్ధి విషయసుఖాలకు దూరం అవుతుంది. అప్పుడే ఆతడు భార్య, సంపద,

పదవి, వాహనాలు, నానావిధక్రియలు కూడా వదలివేస్తాడు. కాని రాజా ! విషయ సుఖాదులలో ఆసక్తుడైన వాడు తనకు మేలు కలిగించేది ఏదో తెలిసికొనలేడు. చేప గాలానికి తగిలించిన ఎరకోసం ఆశపడినట్లు నానావిధ వాసనా వాసితమైన చిత్తంతో వ్యక్తి విషయసుఖాల యందు ఆసక్తు డవుతాడు. శరీరంలో ఉండే అంగాలు, ఉపాంగాలు పరస్పరం ఆధారపడినట్లు ఈ మానవలోకంలో భార్య, పుత్రులు, పశువులు ఒకరిమీద ఒకరు ఆధారపడి ఉంటారు. ఈసంసారం అరటిబోదెలాగా లోపల సారరహితం. ఓడ నీటిలో మునిగిపోయినట్లు ఈ దృశ్యజగత్తు అంతా అనంతకాల ప్రవాహంలో మునిగి పోతుంది. **మానవునికి స్వధర్మాచరణానికి ప్రత్యేకించి ఒకసమయం లేదు. మృత్యువు దేనికోసమూ ఎదురుచూడదు. ఎల్లప్పుడు మానవుడు మృత్యుముఖంలో ఉంటాడు. కాబట్టి నిరంతరం ధర్మానుష్ఠానమే హితకరం.** గుడ్డివాడు ప్రతిరోజు అలవాటు వలన తన ఇంటిలోనికి రాకపోకలు సాగించినట్లే వివేకవంతుడైన మానవుడు యోగయుక్తమైన చిత్తంతో పరమగతిని పొందుతాడు. పుట్టుకలోనే మరణం ఉంది. మరణంలోనే పుట్టుక ఉన్నది. మోక్ష ధర్మం తెలియని అజ్ఞాని సంసారబద్ధుడై జనన మరణ చక్రంలో తిరుగుతుంటాడు. జ్ఞానమార్గంలో వెళ్ళేవారు ఇహపరలోకాలలో సుఖంగా ఉంటారు. విస్తారమైన కర్మకాండ క్లేశాలతో గూడినది. వాటి సంక్షేపరూపమైన జ్ఞానకాండ సుఖకరం. కర్మవిస్తారం అంతా పరార్థమే. అంటే అది మనస్సు ఇంద్రియాల సుఖంకోసమే. కాని త్యాగం తనకు హితకరం అని చెపుతారు. నీటిలోనుంచి పైకి వచ్చేటప్పుడు తామరకాడకు అంటుకొన్న బురద నీళ్ళతో వదలిపోయినట్లు త్యాగి యొక్క ఆత్మ మనస్సు ద్వారా సంసారబంధంనుండి విముక్తి పొందుతుంది. మనస్సు ఆత్మను యోగం వైపు తీసుకుపోతుంది. యోగి ఈ మనస్సును యోగయుక్తం (ఆత్మలో లీనం) చేస్తాడు. ఆతడు యోగసిద్ధుడు అయినతరువాత పరమాత్మ సాక్షాత్కారాన్ని పొందుతాడు.

పరంకోసం - అంటే ఈ బాహ్యేంద్రియాల తృప్తికోసం విషయ సుఖభోగంలో ప్రవర్తించి ఇదే తనముఖ్య కర్తవ్యం అనుకొనేవాడు అసలైన తన కర్తవ్యం నుంచి దూరం అవుతాడు. ఈ లోకంలో వివేకవంతుని ఆత్మ కాని, మూర్ఖుని ఆత్మగాని తాను చేసిన కర్మానుసారం నరకాన్ని పశుపక్ష్యాది జన్మలను కాని; స్వర్గాన్ని, ఉత్తమగతిని కాని పొందుతుంది. బాగా కాలిన మట్టికుండలో నీళ్ళు మొదలైన ద్రవపదార్థాలు ఇంకిపోకుండా ఉన్నట్లు తపస్సుతో తప్తమైన సూక్ష్మశరీరం బ్రహ్మలోకం దాకా ఉండే విషయానుభవాన్ని పొందుతుంది. శబ్దస్పర్శాదులైన విషయాలను అనుభవించే వ్యక్తి నిశ్చయంగా బ్రహ్మానందానుభవానికి

దూరం అవుతాడు. విషయసుఖాలను వదిలేవాడు తప్పకుండా బ్రహ్మానందానుభవాన్ని పొందుతాడు. పుట్టుగ్రుడ్డివాడు త్రోవ చూడలేనట్లు శిశ్నోదరపరాయణుడు (శారీరకసుఖం – పొట్టనింపుకోవటం మాత్రమే ప్రధానమైన వాడు) అజ్ఞానం కప్పిన జీవుడు మాయారూపమైన మంచుగప్పిన మోక్షమార్గం తెలుసుకోలేడు. వైశ్యుడు సముద్రం మీద వ్యాపారం కోసం వెళ్ళి, పెట్టుబడి డబ్బుతో ధనం సంపాదించుకొని వచ్చినట్లు సంసారసాగరంలో వ్యాపారం చేసే జీవుడు స్వీయకర్మకు తగిన గతిని పొందుతాడు. పాము గాలిని మ్రింగినట్లు రేయింబవళ్ళు సంసారంలో ముసలితనం రూపంలో మృత్యువు సంచరిస్తూ, ప్రాణులను మ్రింగేస్తుంది. జీవుడు లోకంలో పుట్టి తాను పూర్వజన్మలో చేసిన కర్మఫలాన్నే అనుభవిస్తాడు. పూర్వజన్మలో ఏమీ చేయకుండా ఈ లోకంలో ఎవ్వరూ ఇష్టానిష్టఫలాలను పొందలేరు. మానవుడు పడుకున్నా, కూర్చున్నా, వెళ్ళుతున్నా, విషయ సుఖాలలో మునిగితేలుతున్నా అతడు చేసిన మంచి చెడు పనుల ఫలితాలు ఎల్లప్పుడూ అతనికి లభిస్తూనే ఉంటాయి. సముద్రానికి ఆవలిఒడ్డును చేరినవాడు మళ్ళీదానిలో ఈదవలెనని అనుకొనని విధంగా సంసారసముద్రాన్ని దాటినవాడు మళ్ళీ దానిలో పడి, వెనుకకు తిరిగిరావటం దుర్లభంగా కన్పిస్తుంది. బాగా లోతైన నీటిలో ఉన్ననౌకను సరంగు తాడుతో లాగిన తరువాత అతని మనోభావానికి అనుగుణంగా అది నడచినట్లు ఈ జీవుడు ఈ శరీరం అనే నౌకను తన ఇష్టానుసారం నడపవలె ననుకొంటాడు. అనేకమైన నదులు అన్ని వైపులనుంచి వచ్చి సముద్రంలో కలిసినట్లు యోగశాస్త్రానుసారం వశమైన మనస్సు ఎల్లవేళలా మూలప్రకృతిలో లీనం అవుతుంది. అనేక విధాలైన మమకారం అనే తాళ్ళతో బద్ధమనస్కులై ప్రకృతిలో ఉన్నజీవులు నీళ్ళలో కరిగిపోయిన ఇసుక మేడలవలె మహాదుఃఖంతో నష్టప్రాయులు అవుతారు. శరీరం అనే ఇంటిని లోపల, బయట తీర్థంలాగా పవిత్రం చేసుకొని బుద్ధిపూర్వకంగా మంచి త్రోవలో నడిచే దేహధారి ఐన జీవుడు ఇహలోకంలోను, పరలోకంలోను కూడా సుఖపడతాడు. విస్తారమైన కర్మకాండ కష్టదాయకం అవుతుంది. అది తక్కువ అయితే సుఖం కలుగుతుంది. విస్తారమైన కర్మకాండ అంతా పరార్థం అంటే మనస్సు, ఇంద్రియాల తృప్తికోసమే అవుతుంది. కాని త్యాగం ఆత్మహితం అవుతుంది.

ఏదో ఒక కోరికతోనే జనులు మిత్రులు అవుతారు. జ్ఞాతులు కూడా ఏదో ఒక ప్రయోజనం ఆశించి మాత్రమే బంధుత్వం పెట్టుకుంటారు. భార్య, పుత్రుడు, సేవకుడు – వీరు అందరూ స్వార్థాన్ని అనుసరించే ఉంటారు. తల్లిగాని తండ్రిగాని పరలోక సుఖసంపాదనలో ఎవరికీ సహాయకులు కాలేరు. పరలోకానికి వెళ్ళేటప్పుడు

త్రోవలో తాను పూర్వం చేసిన దానాదిత్యాగాలే దారిబత్తెం అవుతాయి. తల్లి, కొడుకు, తండ్రి, సోదరుడు, భార్య, మిత్రులు - అనే వీరు అందరూ బంగారునాణెములు ఉంచిన గదికి వేసిన తాళంమాద సీలు లాంటి వారుగానే కనిపిస్తారు. పూర్వజన్మలో చేసిన మంచి-చెడు పనులే జీవుని అనుసరిస్తాయి. ఈ రకంగా కలిగిన పరిస్థితిని తన కర్మఫలంగా తెలుసుకొని మనస్సును అంతర్ముఖం చేసుకొన్న వాడు ఇకముందు దుఃఖం కలుగకుండా ఉండే రీతిగా తనబుద్ధికి ప్రేరణ కలిగించుకొంటాడు. దృఢమైన నిశ్చయాన్ని, సంపూర్ణ ప్రయత్నాన్ని ఆధారం చేసుకొని దానికి తగిన ఇతర సహాయాలను సంపాదించేవాని పనులు ఎప్పుడూ వ్యర్థం కావు. ఊగిసలాటలేని మనస్సుతో గూడి శూరుడు, ధీరుడు అయిన విద్వాంసుని సూర్యుని కిరణాలు వదలనిరీతిగా సంపద ఎప్పుడూ వీడదు. ఉదారము, ప్రశస్తమూ అయిన మనస్సుతో, ఆస్తికభావంతో, దృఢనిశ్చయంతో, అవసరమైన ఉపాయాలతో గర్వం లేకుండా మంచి మనస్సుతో ఆరంభించేవాని మంచిపని ఎప్పుడూ వ్యర్థం కాదు. జీవులందరు పూర్వజన్మలో తాము చేసిన మంచిచెడు పనుల నియతఫలాలను గర్భంలో ప్రవేశించినప్పటి నుండి పొంది అనుభవిస్తుంటారు. రంపంతో కోసిన కర్ర పొట్టును (రంపం పొట్టును) గాలి ఎగురగొట్టిన రీతిగా అపరిహార్యమైన మృత్యువు వినాశకరమైన కాలసహాయంతో మానవప్రాణులను హరిస్తుంది. మానవులు అందరు తాము చేసిన మంచిచెడు కర్మల ననుసరించి సుందరరూపాన్ని గాని, వికారరూపాన్ని గాని పొందుతారు. తమకు కలిగే సత్సంతానం, దుస్సంతానం, వాటి విస్తారాన్ని, ఉత్తమమైన లేక అధమమైన కులంలో పుట్టుకను, ధనధాన్యాదులను పూర్వకర్మానుసారమే పొందుతారు.' భీష్ముడు ఇలా అన్నాడు. 'రాజా ! జ్ఞాని, మహాత్ముడైన పరాశరమహర్షి చేసిన ఉపదేశం విని, ధర్మజ్ఞశ్రేష్ఠుడైన జనక మహారాజు పరమానందం పొందాడు.'

299. హంసగీత - హంసరూపిబ్రహ్మ సాధ్యులకు చేసిన ఉపదేశము.

ధర్మరాజు అడిగాడు. 'తాతా ! లోకంలో విద్వాంసులైన మానవులు సత్యం, ఇంద్రియ నిగ్రహం, ఓర్పు, ప్రజ్ఞ (వివేకం) అనే వాటిని ప్రశంసిస్తారు. వీని విషయంలో నీ అభిప్రాయం ఏమిటి ?' భీష్ముడు చెప్పాడు. 'యుధిష్ఠిరా ! ఈ విషయంలో సాధ్యులకు హంసతో జరిగిన సంవాదరూపమైన ఒక ఇతిహాసం ఉన్నది. దాన్ని నీకు చెపుతాను. ఒకప్పుడు జననాదిరహితుడయిన ప్రజాపతి బంగారపు హంస రూపాన్ని ధరించి, ముల్లోకాలలో సంచరిస్తూ సాధ్యగణాల వద్దకు వెళ్ళాడు.

సాధ్యులు అడిగారు. హంసదేవా ! మేము సాధ్యులు అనే దేవజాతి వారం. మోక్షవిషయమై మిమ్ము ప్రశ్నింపదలచాం. మోక్షతత్త్వం బాగా తెలిసినవారు గదా మీరు. పక్షిరాజా ! మీరు పండితు లని, దృఢమనస్కులైన వక్త అని విన్నాం. మీ ఉత్తమవక్తృత్వం లోక ప్రసిద్ధం. ఖగేంద్రా ! మీ ఉద్దేశ్యంలో సర్వశ్రేష్ఠ వస్తువు ఏది ? మీ మనస్సు దేనియందు ఆసక్తం అయిఉంటుంది ? పక్షిశ్రేష్ఠా ! అన్ని కర్తవ్యాల్లో ఏ కార్యం సర్వశ్రేష్ఠం అని మీరు భావిస్తున్నారు ? ఏది ఆచరిస్తే జీవుడు సర్వబంధాలనుంచి త్వరగా విముక్తుడు అవుతాడు ? దాన్ని మాకు ఉపదేశించండి.' హంస ఇలా చెప్పింది. 'సాధ్యులారా ! తపస్సు, ఇంద్రియ నిగ్రహం, సత్యం చెప్పటం, మనస్సును అదుపులో ఉంచుకోవటం మొదలైన పనులే సర్వోత్తమాలు అని నేను విన్నాను. హృదయ గ్రంథులను అన్నింటిని విడదీసి కొని ఇష్టాలను వశంచేసుకొని - అంటే వాటి వల్ల సంతోష విషాదాలను పొందకుండా ఉండాలి. ఎవరిమనస్సునూ గాయపరచకూడదు. పరుషంగా పలుకరాదు. నీచునినుండి అధ్యాత్మవిద్యోపదేశం పొందరాదు. ఇతరులకు ఉద్వేగం కలిగించేవి, నరక పతనహేతువులు ఐన మాటలను పలుకరాదు. **నోటినుంచి వచ్చే మాటలు అనే బాణాలవలన గాయపడిన మనస్సుతో ఇతరులు శోకంలో రేయింబవళ్ళు మునిగిపోతారు. కాబట్టి విద్వాంసుడైన వ్యక్తి ఇతరులకు మర్మఘాతకాలైన వాగ్బాణాలను ప్రయోగించరాదు. ఇతరవ్యక్తి చాలా పరుషమైన వాగ్బాణాలతో మనస్సును గాయపరచినా విద్వాంసుడైన వాడు శాంతంగానే ఉండాలి. ఎవరైనా తన మీద మండిపడినా, తాను ప్రసన్నంగా ఉండేవాడు తనను బాధించిన వాని పుణ్యాన్ని గ్రహిస్తాడు. ప్రజ్వలించే కోపం మనిషిని లోకంలో నిందాపాత్రుని చేస్తుంది. ఆవేశంలో పడవేసి, అప్రియంగా కనిపిస్తుంది. అటువంటి కోపాన్ని అణచుకొనేవాడు, మనస్సులో ఎలాంటి మార్పునుగాని దోషాన్ని గాని రానీయనివాడు, ప్రసన్నంగా ఉండేవాడు, ఇతరుల తప్పులు వెదకని వ్యక్తి తనయందు శత్రుత్వంగలవారి పుణ్యాన్ని గ్రహిస్తాడు.**

గొప్పవారు ఓర్పును, సత్యాన్ని, ఋజుప్రవర్తనను, దయను ఉత్తమమైనవిగా చెపుతారు. కాబట్టి నన్ను ఎవరైనా నిందిస్తే బదులు పలకను. ఎవరైనా హింసించినా క్షమిస్తాను. వేదాధ్యయనానికి సారం సత్యం. సత్యం యొక్క సారం ఇంద్రియ నిగ్రహం. ఇంద్రియ నిగ్రహానికి ఫలం మోక్షం. సర్వశాస్త్రాలు ఉపదేశించేది దీన్నే. మాట, మనస్సు, క్రోధం, కోరిక, ఆకలి, వీర్యస్ఖలనం - వీటి అన్నింటి వేగతీవ్రతను తట్టుకునే వానినే నేను బ్రహ్మజ్ఞాని, ముని అని భావిస్తాను. ఎల్లప్పుడు కోపంతో

కుతకుతలాడే వానికంటె కోపం తెచ్చుకొననివాడు శ్రేష్ఠుడు. ఓర్పు లేనివానికంటే ఓర్పుగలవాడు ఉత్తముడు. ఇతర ప్రాణులకన్న మనుష్యుడు గొప్పవాడు. అజ్ఞాని కంటె జ్ఞాని విశిష్టుడు. ఇతరులు తీవ్రంగా నిందించినా దానికి బదులుగా నిందించని మనుష్యుడు అణచుకొనే కోపమే నిందకుని భస్మం చేస్తుంది. నిందించే వాని పుణ్యాన్ని తిట్లుతినేవాడు పొందుతాడు. తనను పరుషంగా మాటాడినా ఆతనిని నిందించనివాడు, ఆప్యాయంగా మాటాడనివాడు, ఒకరివల్ల తనకు దెబ్బలు తగిలినా ధైర్యంతో ప్రతీకారంతో కొట్టనివాడు, ఆతనికి కీడు కలగా లనుకొననివాడు - ఇటువంటి వ్యక్తిని దర్శించాలని దేవతలు కూడా తహతహలాడుతారు. పాపాత్ముడు తనకన్న చిన్నవాడైనా, పెద్దవాడైనా అతని ద్వారా అవమానం పొందినా, దెబ్బలుతిన్నా, తిట్లు తిన్నా వానిని క్షమించాలి. ఇలా చేసే వాడు గొప్పసిద్ధిని పొందుతాడు. అన్ని విధాలా నేను పరిపూర్ణుడను అయినా (నేను తెలుసుకో వలసింది. సంపాదించాల్సింది లేకున్నా) నిరంతరం సత్సాంగత్యం చేస్తుంటాను. తృష్ణాప్రభావం నామీద లేదు. కోపం నన్ను సమీపించదు. ఏదో సంపాదించుదామనే ఆశతో ధర్మాన్ని అతిక్రమించను. విషయ సుఖాలకోసం అటు ఇటు పరుగెత్తను.

ఎవడైనా నన్ను శపించినా నేను శపించను. ఇంద్రియ నిగ్రహమే మోక్షద్వార మని నేను ఎరుగుదును. ఇప్పుడు మీకు ఒక రహస్యం చెపుతాను. వినండి. మానవ జన్మను మించిన జన్మలేదు. మేఘాలు తొలగిపోయిన తరువాత చంద్రుడు ప్రకాశించినట్లు పాపవిముక్తుడై నిర్మల మనస్సు గల ధీరపురుషుడు ధైర్యంతో కాలాన్ని ప్రతీక్షిస్తూ, సిద్ధిని పొందుతాడు. మనుస్సును అదుపులో పెట్టుకున్నవాడు పైకెత్తబడిన స్తంభంవలె ఉన్నత వంశంలో జన్మించి, అందరికి గౌరవపాత్రు డవుతాడు. అందరిచేత మంచివాడు అని ప్రశంస పొందే ఇంద్రియ నిగ్రహం గలవ్యక్తి దేవత్వాన్ని పొందుతాడు. ఈర్ష్యగల వ్యక్తి అవతలివాని లోపాలనే చెప్పటానికి సిద్ధపడతాడు. కాని అదేరీతిగా అవతలవాని మంచిగుణాలను మెచ్చుకొనటానికి సిద్ధంకాడు. మాటను, మనస్సును కాపాడుకొంటూ ఎల్లప్పుడు అన్నివిధాల పరమాత్మలో లగ్నమై ఉండేవాడు వేదాధ్యయనం, తపస్సు, త్యాగం అనే వాటి అన్నింటి ఫలితాన్ని పొందుతాడు. ఎదుటివానిని బాగా అర్థంచేసుకొనే వ్యక్తి పరుషంగా మాటాడేవాడు, అవమానం చేసేవాడు అయిన అజ్ఞానికి వాడితప్పులను చెప్పి ఒప్పించేయత్నం చేయగూడదు. వాని ఎదుట ఇతరుల ప్రశంస చేయరాదు. వానిని ఆక్షేపించి,

తాను హింసకు లోను కారాదు. విద్వాంసుడు అవమానాన్ని అమృతం లాగా స్వీకరించి, తృప్తిపడాలి. అవమానం పొందినవాడు హాయిగా నిద్రిస్తాడు. అవమానించేవాడు నశిస్తాడు. కోపంగల వాడు చేసే యజ్ఞం, దానం, తపస్సు, హోమం అనే వాని ఫలితాలను యముడు అపహరిస్తాడు. కాబట్టి ఆతడు చేసే శ్రమ అంతా వ్యర్థం అవుతుంది. దేవేశ్వరులారా ! మూత్రేంద్రియం, పొట్ట, రెండుచేతులు, మాట అనే ఈనాలుగు ద్వారాలు సురక్షితంగా ఉన్నవాడు నిజమైన ధర్మజ్ఞుడు. సత్యం, ఇంద్రియ నిగ్రహం, బుజుప్రవర్తన, దయ, ధైర్యం, క్షమలను ఎక్కువగా సేవించేవాడు; స్వాధ్యాయంలో ఎప్పుడూ ఉండేవాడు; ఇతరుల వస్తువులను తీసుకోనివాడు; ఏకాంతంలో ఉండేవాడు ఊర్ధ్వగతిని పొందుతాడు.

ఆవు దూడ తల్లి పొదుగులోని నాలుగుస్తనాలను త్రాగినట్లు మానవుడు పైనచెప్పిన అన్ని సద్గుణాలను సేవించాలి. సత్యాన్ని మించిన పరమ పవిత్ర వస్తువును ఇంతవరకు ఎక్కడా చూడలేదు. నేను లోకాలలో నాలుగు వైపులా సంచరిస్తూ మనుష్యులకు, దేవతలకు సముద్రం దాటటానికి నౌక సాధనమైనట్లు స్వర్గానికి చేరటానికి సత్యమే సాధన మని చెపుతుంటాను. మానవుడు ఎవరితో కలిసి ఉంటాడో, ఎటువంటి వారిని సేవిస్తాడో, ఎలా కావాలి అని అనుకొంటాడో అలాంటివాడే అవుతాడు. మంచివస్త్రాన్ని ఎలాంటి రంగులో ముంచితే ఆ రంగుగలదే అయినట్లు ఎవరైనా మంచివారిని, చెడ్డవారిని, తపస్వినీ, దొంగను సేవిస్తే అలాంటి వారే అవుతారు. అంటే వారిమీద అలాంటి వారి ప్రభావమే పడుతుంది. దేవతలు ఎల్లప్పుడు సత్పురుషుల సాంగత్యం చేస్తారు. అందువల్ల మానవులు క్షణభంగురాలై - అశాశ్వతాలైన భోగాలవైపు చూడాలని కూడా అనుకోరు. విభిన్న విషయాల అశాశ్వత స్వభావాన్ని సరిగా అర్థంచేసుకున్నవారితో చంద్రుడు గాని, వాయువు గాని సమానం కాలేరు. హృదయాంతరాళంలో ఉండే అంతర్యామి అయిన ఆత్మ దోషరహితం అయినప్పుడు దాన్ని సాక్షాత్కరింప చేసుకొనేవాడు సన్మార్గగామి అని అంటారు. అలాంటి వారి విషయంలో దేవతలు ఆనందంగా ఉంటారు. కేవలం తన పొట్ట పోసుకోవటం, మూత్రేంద్రియసుఖంలోనే మునిగితేలటం, దొంగతనం చేయటం, పరుషంగా మాట్లాడటం – ఈ లక్షణాలు గలవారు తమ దోషాలను ప్రాయశ్చిత్తాలతో పోగొట్టుకొన్నా సరే దేవతలు వారిని గుర్తించి దూరంగా వదలి వేస్తారు. సత్త్వగుణం లేనివారు, అన్నీ తినే పాపాత్ములు దేవతలను సంతోష పెట్టలేరు. నియమ పూర్వకంగా నిజం చెప్పేవాడు, కృతజ్ఞుడు, ధర్మపరాయణుడు

అయిన వానితోనే దేవతలు సత్సంబంధం కలిగి ఉంటారు. వ్యర్థంగా మాట్లాడటానికంటె మౌనంగా ఉండటమే మంచిది అని అంటారు. సత్యం చెప్పటం రెండో మంచిపని. ఇతరులకు సంతృప్తికరంగా మాట్లాడటం మూడో విశేషం. ధర్మసమ్మతంగా పలకటం నాలుగవ విశేషం. (వీటిలో ఒకదాని కంటే ఇంకొకటి ఉత్తరోత్తరం శ్రేష్ఠం).'

సాధ్యులు అడిగారు. 'హంసా ! ఈ జగత్తును ఏమి ఆవరించి ఉన్నది ? దేనివల్ల దానిస్వరూపం ప్రకాశించటం లేదు ? మానవులు ఏకారణంగా మిత్రులను వదలివేస్తారు ? ఏ దోషం వల్ల స్వర్గం చేరటం కష్టమవుతుంది ?' హంస చెప్పింది. 'దేవతలారా ! ఈలోకాన్ని అజ్ఞానం ఆవరించి ఉన్నది. మాత్సర్యం వల్ల దీనిస్వరూపం వ్యక్తంకాదు. లోభంవల్ల మానవుడు మిత్రులను వదలుతాడు. లోక విషయాసక్తివల్ల స్వర్గం చేరలేడు.' సాధ్యులడిగారు. 'హంసా ! బ్రాహ్మణులలో ఎవరు కేవలం సుఖాన్ని పొందుతారు ? అనేకులతో కలిసి ఉన్నా మౌనంగా ఉండేవాడు ఎవడు ? దుర్బలుడైనా బలవంతుడుగా ఉండేవా డెవడు ? ఇతరులతో కలహించనివాడు వారిలో ఎవరు ?' హంస అన్నది. 'బ్రాహ్మణులలో జ్ఞాని ఒక్కడే పరమసుఖాన్ని అనుభవిస్తాడు. జ్ఞానిమాత్రమే అందరితో కలిసి ఉన్నా మౌనంగా ఉంటాడు. జ్ఞాని మాత్రమే దుర్బలుడైనా బలిష్ఠుడుగా ఉంటాడు. జ్ఞాని మాత్రమే ఎవరితోనూ కలహించడు.' సాధ్యులు అడిగారు. 'బ్రాహ్మణులలో దేవత్వం ఏమిటి ? సాధుత్వం ఏమని అంటారు ? వారిలో చెడ్డతనం ఏమిటి ? వారిలో మనుష్యత్వం ఏమిటి ?' హంస చెప్పింది. 'వేదశాస్త్రాల అధ్యయనం వారిలో దేవత్వం. ఉత్తమ వ్రతానుష్ఠానమే వారిసాధుత్వం అంటారు. ఇతరులను నిందించటం వారిలో ఉండే చెడ్డతనం. మరణించటమే వారిలోని మనుష్యత్వం.'

భీష్ముడు చెప్పాడు. 'యుధిష్ఠిరా ! నిత్యుడు, అవినాశి, వరమదైవం అయిన బ్రహ్మ ఇలా చెప్పి సాధ్యదేవతలతో కలిసి బ్రహ్మలోకానికి వెళ్ళాడు. సర్వశ్రేష్ఠుడు, వినాశరహితుడు, దేవదేవుడు అయిన బ్రహ్మ ఆవిష్కరించిన పుణ్యవంతమైన ఈ తత్త్వజ్ఞానం కీర్తిని, ఆయువును పెంపొందిస్తుంది. స్వర్గలోకప్రాప్తికి ఇది నిశ్చితమైన సాధనం.

యుధిష్ఠిరా ! ఈ రీతిగా సాధ్యులతో హంసకు కలిగిన శ్రేష్ఠసంవాదం నీకు చెప్పాను. ఈ శరీరం కర్మకారణం అవుతుంది. సద్భావాన్నే సత్యం అంటారు.'

300. యోగస్వరూప సాధనఫల ప్రభావములు.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'తాతా ? సాంఖ్య - యోగాలలో ఉన్న తేడా ఏమిటి ? చెప్పవలసింది.' భీష్ముడు పలికాడు. 'యుధిష్ఠిరా ! సాంఖ్య శాస్త్ర విద్వాంసులు సాంఖ్య శాస్త్రాన్ని, యోగశాస్త్ర విద్వాంసులు యోగశాస్త్రాన్ని ప్రశంసిస్తారు. ఇరుపక్షాలవారు తమశాస్త్రం గొప్పతనాన్ని ప్రతిష్ఠించటానికి చాలబలిష్ఠమైన యుక్తులను చెపుతారు. శత్రునాశనా ! యోగశాస్త్ర పండితులు 'ఈశ్వరుని అస్తిత్వాన్ని అంగీకరించక పోతే ఎవడికైనా ముక్తి ఎలా కలుగుతుంది '? అని తరువాత శ్రేష్ఠత్వాన్ని స్థాపించటం కోసం ఈ యుక్తిని చెపుతారు. (మోక్షదాత అయిన ఈశ్వరుని అస్తిత్వాన్ని తప్పక ఒప్పుకోవలసిందే అని వారిసిద్ధాంతం). సాంఖ్యమతాన్ని అంగీకరించే మహాజ్ఞానులైన ద్విజులు మోక్షప్రాప్తికి యుక్తులను ఇలా చెపుతారు. సమస్తగతుల రీతులను బాగా తెలుసుకొని విరక్తుడైనవాడే దేహం వదలిన తరువాత ముక్తుడు అవుతాడు. ఈ విషయం అందరికి స్పష్టంగా తెలుస్తుంది. మోక్షప్రాప్తికి వేరే ఉపాయం లేదు. ఈ రీతిగా వారు సాంఖ్యాన్నే మోక్షదర్శనంగా చెపుతారు. తమతమ పక్షస్థాపనలో యుక్తియుక్తమైన హేతువులను గ్రహించవచ్చు. సిద్ధాంతానికి అనుకూలమైన మేలును కలిగించే మాటలు ఆమోదయోగ్యాలు. శిష్టులు ప్రశంసించే నీవంటివారు ఉత్తముల సిద్ధాంతాన్ని స్వీకరించటం సముచితం. యోగశాస్త్రజ్ఞులు ప్రత్యక్షప్రమాణాన్నే ప్రధానంగా అంగీకరించేవారు. సాంఖ్యశాస్త్రజ్ఞులు శాస్త్ర ప్రమాణాన్నే నమ్ముతారు. నాయనా ! నాకు ఈ రెండు సిద్ధాంతాలు తత్త్వజ్ఞానంలో అంగీకరింపదగ్గవే. ఈ రెండు సిద్ధాంతాలు శిష్టసమ్మతాలే. ఈ రెండిటిని బాగా తెలుసుకొని శాస్త్రానుసారం ఆచరిస్తే ఉత్తమగతి కలుగుతుంది. అంతఃశౌచం, బాహ్యశౌచం, తపస్సు, భూతదయ, వ్రతానుష్ఠానం మొదలైన నియమాలను రెండుమతాలు సమానంగా స్వీకరించినవి. కాని ఆ రెండింటి దర్శనంలో సమానత్వం లేదు.'

యుధిష్ఠిరుడు అడిగాడు. 'తాతా ! ఈ రెండు మతాలలో ఉత్తమవ్రతాలు, బాహ్యాంతశౌచాలు, దయజూపటం సమానం అయితే, పరిణామంకూడా ఒకటే అయితే సిద్ధాంతసామ్యం ఎందుకు లేదో చెప్పవలసింది. భీష్ముడు చెప్పాడు. 'నాయనా ! యోగులు కేవలం యోగబలంతోనే రాగం, మోహం, స్నేహం, కామం, క్రోధం అనే అయిదు దోషాలను మూలచ్ఛేదం చేసి, పరమపదాన్ని పొందుతారు. పెద్ద సారచేపల వంటివి వలను ముక్కలుచేసి నీళ్ళలో, మునిగిపోయినట్లు యోగులు తమ పాపాలను పోగొట్టుకొని, పరమపదం పొందుతారు. రాజా ! బలిష్ఠ మృగాలు వలను త్రెంచుకొని సర్వబంధ విముక్తాలై

స్వేచ్ఛగా తమ త్రోవన వెళ్ళినట్లు యోగులు యోగబలంతో లోభంవల్ల కలిగే సమస్తబంధాలను వదలించుకొని, పవిత్రమై నిర్మలమైన ముక్తిమార్గంలో వెళ్తారు. దుర్బలాలైన ఇతరమృగాలు వాగులలోపడి నిస్సందేహంగా నశించినట్లు యోగబలం లేని మానవులుకూడా నష్టపోతారు. బలహీనాలైన చేపలు వలలోపడి మరణించినట్లు యోగబలంలేనివారు కూడా నశిస్తారు. బలహీనాలైన పక్షులు చిన్నవలలో పడి బంధం పొంది ప్రాణాలను పోగొట్టుకొంటాయి. బలిష్ఠాలైనవి వలను త్రెంచివేసి బంధవిముక్తి పొందుతాయి. అలాగే కర్మలవల్ల కలిగే-బంధనాలు కల దుర్బలయోగులు నశిస్తారు. యోగబల సంపన్నులు వాటినుంచి ముక్తులు అవుతారు. రాజా ! చిన్న నిప్పుకణిక మీద పెద్దపెద్దకట్టె పడవేస్తే అది మండకపోగా చల్లారిపోతుంది. అలాగే దుర్బలుడైన యోగి యోగభారంతో అణగిపోతాడు. అదే అగ్ని గాలి తోడైతే బలిష్ఠమై, సమస్తభూమండలాన్ని వెంటనే భస్మం చేస్తుంది. అలాగే యోగికూడ యోగబలంతో ప్రకాశించే తేజశ్శాలి, శక్తిశాలి అయితే ప్రళయకాలంలో ప్రచండ సూర్యుడు సమస్తజగత్తును దగ్ధంచేసినట్లు తనలోని రాగద్వేషాలను నాశనం చేసుకొంటాడు. రాజా ! బలంలేనివాడు వేగవంతమైన జలప్రవాహాన్ని తట్టుకొనలేక కొట్టుకొనిపోయినట్లు యోగబలం లేని యోగికూడా ఇంద్రియసుఖాలవైపు ఆకర్షితు డవుతాడు.

బలిష్ఠమైన ఏనుగు మహాజలప్రవాహాన్ని కూడా స్తంభింపజేసినట్లు మహత్తరమైన యోగబలాన్ని పొందిన యోగికూడా అసంఖ్యాకమైన విషయసుఖాలను ఎదుర్కొనగలడు. వాటి వేగాన్ని తట్టుకొని నిలువగలుగుతాడు. యోగ సంపన్నులైన వ్యక్తులు స్వతంత్రంగా ప్రజాపతిలో, ఋషులలో, దేవతలలో, పంచభూతాలలో ప్రవేశించగలరు. ఇలా చేయగల సామర్థ్యం వారికి కలుగుతుంది. నరేంద్రా ! మహాతేజస్వి అయిన యోగిపైన కోపపూర్ణుడైన యమధర్మరాజు, అంతకుడు, మహాపరాక్రమవంత మైన మృత్యువు కూడా తమ ప్రభావాన్ని చూపించలేరు. భరతవంశశ్రేష్ఠా ! యోగబలాన్ని సంపాదించి, యోగి వేలకొలది రూపాలు ధరించగలడు. వాటి అన్నింటితో ఈ భూమండలం మీద సంచరించగలడు. నాయనా ! ఆయన ఆ శరీరాలతో ఇంద్రియ సుఖాలను అనుభవించగలడు. మహోగ్రమైన తపస్సును చేయగలడు. సూర్యుడు విశ్వవ్యాప్తం చేసిన తేజస్సునువలె యోగి తన రూపాలను అన్నింటిని తనలో లీనం చేసుకోగలడు. యోగబలిష్ఠుడైన యోగి సర్వబంధ విమోచనం పొందగలడు. అందుకు కావలసిన సామర్థ్యం ఆయనకు గలుగుతుంది. ఇందులో సందేహం లేదు. ప్రజాపాలకా ! ఉదాహరణకు యోగంతో కలిగే కొన్ని సూక్ష్మశక్తులను గూర్చి మళ్ళీ నీకు వివరిస్తాను.

భరతశ్రేష్ఠా ! ఆత్మసమాధికోసం ధరించే విషయాలు కూడా చిన్న దృష్టాంతాలతో చెపుతాను విను. ఎల్లప్పుడు జాగరూకుడుగా ఉండే విలుకాడు చిత్తం ఏకాగ్రం చేసి బాణం విడిస్తే, లక్ష్యాన్ని తప్పకుండా భేదిస్తుంది. అదే రీతిగా మనస్సును పరమాత్మ ధ్యానంలో లగ్నంచేసిన యోగి నిస్సందేహంగా మోక్షం పొందుతాడు. రాజేంద్రా ! నూనెతో నిండుగా ఉన్న పాత్రను శిరస్సుపైన పెట్టుకొన్న వ్యక్తి మనస్సును స్థిరంగా ఏకాగ్రంగా ఉంచి, మెట్లమీద ఎక్కినప్పుడు నూనె ఒక్కచుక్కగూడా తొణికి క్రిందపడకుండా పైకి వెళ్ళినట్లు యోగి యోగయుక్తుడై ఆత్మను పరమాత్మలో లగ్నంచేస్తే అప్పుడు ఆయన మనస్సు నిర్మలమూ, నిశ్చలమూ అయి సూర్యునివలె తేజోవంతం అవుతుంది. కుంతీకుమారా ! జాగరూకుడైన నావికుడు సముద్రంలో ఉన్న పడవను ఒడ్డుకు చేర్చినట్లు యోగశాస్త్రాల సారం తత్త్వం తెలిసిన వ్యక్తి సమాధి ద్వారా మనస్సును పరమాత్మలో లగ్నంచేసి, దేహం వీడినతరువాత దుర్గమస్థానాన్ని – పరమపదాన్ని చేరుతాడు. మిక్కిలి మెలకువగల సారథి మంచిగుర్రాలను రథానికి పూన్చి, ధనుర్ధారి అయిన వానిని తగిన చోటికి తీసుకొనిపోయినట్లు ధారణలో ఏకాగ్రమనస్కుడైన యోగి లక్ష్యం వైపు వెళ్ళే బాణంలాగా త్వరగా పరమపదాన్ని పొందుతాడు. సమాధితో ఆత్మను పరమాత్మలో స్థిరంగా ఉంచి, నిశ్చలుడైన యోగి తన పాపాన్ని పోగొట్టుకొంటాడు. పవిత్రపురుషునికి ప్రాప్తించే అవినాశి అయిన పరమ పదాన్ని పొందుతాడు. మహాపరాక్రమవంతుడవైన రాజా ! గొప్పవ్రతంతో ఏకాగ్రచిత్తుడైన యోగి నాభి, కంఠం, శిరస్సు, హృదయం, వక్షఃస్థలం, పక్కభాగాలు, కన్నులు, చెవులు, ముక్కు మొదలైన స్థానాలలో ధారణతో సూక్ష్మమైన ఆత్మను పరమాత్మలో చక్కగా నిలుపుకొని, కావాలి అనుకొంటే మహాపర్వతాలలాగా ఉండే పాపపుణ్యకర్మలను తొందరగా భస్మంచేసుకొని ఉత్తమయోగాన్ని ఆశ్రయించి ముక్తుడు అవుతాడు.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'భరత వంశీయా ! యోగి ఎలాంటి ఆహారాన్ని స్వీకరిస్తాడు ? వేటిని వేటిని జయించి యోగశక్తిని పొందుతాడో చెప్పవలసింది.' భీష్ముడు చెప్పాడు. 'ధర్మజా ! ధాన్యపుకణాలను, తెలికపిండిని తింటాడు. నేతిని, నూనెను వదలివేస్తాడు. అలాంటి యోగికి యోగబలం కలుగుతుంది. శత్రునాశకా ! **జీవితంలో చాలాకాలం రోజుకు ఒకేమారు నివ్వరిధాన్యపు రుచిలేని జావను త్రాగే యోగి నిర్మలచిత్తుడై యోగబలాన్ని పొందుతాడు. నీళ్ళు కలిసినపాలను రోజుకు ఒకమారు మాత్రమే మొదట త్రాగుతూ, తరువాత పదిహేను రోజులకు ఒక మారు త్రాగుతూ, తరువాత నెలకు ఒకమారు, ఋతువులో (రెండు నెలలకు) ఒక మారు, అటుతరువాత**

ఒక్క సంవత్సరానికి త్రాగే వ్యక్తి యోగశక్తిని పొందుతాడు. మానవేంద్రా ! బ్రతికి ఉన్నంతవరకు జీవితంలో మాంసం తినకుండా నియమపూర్వకంగా ఉత్తమవ్రతాన్ని అనుష్ఠిస్తూ, తన అంతఃకరణాన్ని శుద్ధం చేసుకునే యోగికూడా యోగశక్తిని పొందుతాడు. రాజా ! కామ క్రోధాలను, శీతోష్ణాలను, వర్షాన్ని, భయాన్ని, శోకాన్ని, శ్వాసను, మానవులకు ఇష్టమైన విషయ సుఖాలను, దుర్జయమైన అసంతృప్తిని, ఘోరమైన ఆశను, స్పర్శను, నిద్రను, జయింపవీలుగాని సోమరితనాన్ని జయించి, రాగాదులు లేని, మహోత్తమబుద్ధిగల మహాత్ములైన యోగులు స్వాధ్యాయాన్ని, ధ్యానాన్ని సంపాదించి బుద్ధితో సూక్ష్మమైన ఆత్మను సాక్షాత్కరింపజేసుకొంటారు. విద్వాంసు లైన బ్రాహ్మణులు ఈ యోగమార్గం దుర్గమం అని అభిప్రాయ పడ్డారు. ఎవరో ఒక్కరు మాత్రం ఈ మార్గంలో క్షేమంగా ప్రయాణించగలరు. ఘోరమైనది, పాములు, తేళ్ళు మొదలైన అనేక విషజంతువులు గలది, కన్నాలు గలది, నీళ్ళు లేనిది, అడుగు పెట్ట వీలులేనిది, ముళ్ళ పొదలుగలది, ఆహారం దొరకనిది, దావాగ్నితో చెట్లు అన్నీ దగ్ధమైనది, దొంగలతో గూడినది, మహాభయంకరమైన అడవిలో ఉన్న త్రోవలో ఎవరో ఒక యువకుడు మాత్రమే క్షేమంగా వెళ్ళినట్లు యోగమార్గాన్ని ఆశ్రయించే ఎవరో ఒక బ్రాహ్మణుడు మాత్రమే యోగంతో చక్కగా ప్రయాణించ గలడు. అది అనేక కష్టాలతో నిండి ఉంటుంది. మహీపతీ ! చాలా పదునైన కత్తి అంచుమీద కదలకుండా ఉండవచ్చు. చిత్తశుద్ధి లేని వ్యక్తి యోగధారణలో స్థిరంగా ఉండటం మాత్రం చాలా చాలా కష్టం. సముద్రంలో చుక్కాని లేనినావ మనిషిని తీరం చేర్చలేనట్లే యోగధారణలు సిద్ధించకపోతే ఉత్తమగతిని కలిగించలేవు. శాస్త్రానుసారం యోగధారణతో స్థిరంగా ఉండగలిగేవాడు జననమరణ సుఖదుఃఖబంధాలనుంచి ముక్తి పొందుతాడు.

యోగవిషయాలు గల నానాశాస్త్రాల సిద్ధాంతాలను నీకు చెప్పాను. యోగసాధనకు సంబంధించిన విషయాలన్నీ ద్విజాతులకే నిశ్చితా లయి ఉన్నాయి. అనగా వాటిలో వారికే అధికారం ఉంది. మహాత్మా ! కావాలనుకొంటే యోగసిద్ధుడు వెంటనే ముక్తుడై పరబ్రహ్మస్వరూపాన్ని పొందగలడు. అది కాకపోతే ఆయన తన యోగబలంతో బ్రహ్మ, వరదుడైన విష్ణువు, శంకరుడు, ధర్మం, కుమారస్వామి, బ్రహ్మసంతతి అయిన సనకాదులు, కష్టదాయకమైన తమోగుణం, మహత్తర రజోగుణం, నిర్మలమైన సత్త్వగుణం, మూల ప్రకృతి, వరుణపత్ని సిద్ధిదేవి, సంపూర్ణతేజస్సు, మహత్తర ధైర్యం, నక్షత్రాలతో ఆకాశంలో వెలిగే చంద్రుడు, విశ్వేదేవులు, నాగులు, పితరులు, సర్వపర్వతాలు, భయంకరసముద్రం,

నదీసమూహం, అడవులు, మేఘాలు, నాగులు, వృక్షాలు, యక్షులు, దిక్కులు, గంధర్వులు, సమస్తస్త్రీపురుషులలో ప్రతి ఒక్కరి దగ్గరకు వెళ్ళి వారిలో ప్రవేశించగలడు. నరేంద్రా ! మహత్తరబలంతో, బుద్ధితో సమేతమైన పరమాత్మతో అనుబంధం కలిగించే ఈ పవిత్ర విషయాన్ని సందర్భానుసారం నీకు వినిపించాను. యోగసిద్ధు డైన మహాత్ముడు సర్వమనుష్యులను అతిక్రమించి నారాయణస్వరూపుడు అవుతాడు. సంకల్ప మాత్రంతో సృష్టి చేయగలడు.'

301. సాంఖ్యయోగానుసారము - సాధన ఫలములు.

యుధిష్ఠిరు డన్నాడు. 'నృపతీ ! నామేలు కోరి నీవు శిష్యుడ నైన నాకు శిష్టసమ్మతమైన యోగమార్గాన్ని తగినరీతిగా వర్ణించావు. ఇప్పుడు సాంఖ్యశాస్త్ర విషయం అంతా అడుగుతున్న నాకు ఉపదేశించు. ముల్లోకాలలో గల జ్ఞానం అంతా నీకు బాగా తెలుసును గదా !' భీష్ముడు చెపుతున్నాడు. 'వత్సా ! ఆత్మతత్త్వాన్ని చక్కగా తెలిసిన సాంఖ్యశాస్త్ర విద్వాంసులు చెప్పిన సూక్ష్మజ్ఞానాన్ని కపిలాదులైన సమస్తమహాత్ములు ప్రకాశింపజేశారు. నరశ్రేష్ఠ ! ఈ సాంఖ్యశాస్త్ర సిద్ధాంతంలో ఎలాంటి పొరపాట్లు, దోషాలు లేకపోవటమేకాక అనేక సద్గుణాలు ఉన్నాయి. వక్తలలో శ్రేష్ఠుడవైన రాజా ! జ్ఞానంతో మనుష్యులు, పిశాచాలు, రాక్షసులు, యక్షులు, సర్పాలు, గంధర్వులు, పితృదేవతలు, తిర్యగ్జంతువులు, గరుడులు, మరుత్తులు, రాజర్షులు, బ్రహ్మర్షులు, అసురులు, విశ్వేదేవులు, దేవర్షులు, యోగులు, ప్రజాపతులు, బ్రహ్మకు గూడా జయింప వీలుగాని ఇంద్రియసుఖాదులైన విషయాలను దోషసహితాలుగా తెలుసుకొని, లోకంలో ఉండే మనుష్యుల పరమాయుఃకాలాన్ని, సుఖం యొక్క పరమతత్త్వాన్ని చక్కగా తెలుసుకొన్నవారు, విషయసుఖాసక్తులైన వారికి ఆ యా సమయాల్లో కలిగే దుఃఖాలను, తిర్యగ్జాతిలో జన్మించేవారు, నరకంలో పడేవారు అయిన జీవుల దుఃఖాలను, స్వర్గం వేదంలోని ఫలశ్రుతుల సంపూర్ణ గుణదోషాలను తెలుసుకొనేవారు, జ్ఞానయోగం, సాంఖ్యజ్ఞానం, యోగమార్గంలో ఉండే గుణదోషాలను గూడా తెలుసుకొన్నవారు, సత్త్వగుణానికి గల పది, రజోగుణానికున్న తొమ్మిది, తమోగుణానికి గల ఎనిమిది, బుద్ధికి ఉన్న పది, మనస్సుకు గల ఆరు, ఆకాశానికి ఉన్న ఐదు గుణాలను తెలుసుకొన్న వారు, బుద్ధికి ఉన్న మరినాలుగు, తమోగుణానికి గల మరిమూడు, రజోగుణానికున్న మరిరెండు, సత్త్వగుణానికి ఉన్న ఒకేఒక గుణాలను తెలుసుకొన్నవారు, ఆత్మప్రాప్తికరమార్గాన్ని, ప్రాకృత ప్రళయం, ఆత్మ

విచారాన్ని చక్కగా తెలిసినవారు. జ్ఞాన సంపన్నులు, మోక్షానికి ఉపయోగపడే సాధనాలను అనుష్ఠానం చేయటంచేత శుద్ధచిత్తులైన, పవిత్రులైన సాంఖ్య యోగులు పరమాకాశాన్ని పొందే సూక్ష్మభూతాలతో సమానమైన క్షేమంకరమైన మోక్షాన్ని పొందుతారు.*

కన్నులు రూపగుణంలో, ముక్కు గంధగుణంలో, శ్రవణేంద్రియం శబ్దంలో, రసనేంద్రియం రసగుణంలో ఆసక్తమై ఉంటాయి. చర్మం స్పర్శగుణంలో ఆసక్తమై ఉంటుంది. వాయువుకు ఆశ్రయం ఆకాశం. మోహానికి ఆశ్రయం తమోగుణం. లోభానికి ఇంద్రియ గుణాలు ఆశ్రయం. గమనానికి ఆధారం విష్ణువు, బలానికి ఇంద్రుడు, ఉదరానికి అగ్ని, భూమికి జలం ఆధారాలు. జలానికి తేజస్సు, తేజస్సుకు వాయువు, వాయువుకు ఆకాశం, ఆకాశానికి మహత్తత్త్వం, మహత్తత్త్వ కార్యమైన అహంకారానికి సమష్టిబుద్ధి అధిష్ఠానం. బుద్ధికి తమస్సు, తమస్సుకు రజస్సు, రజస్సుకు సత్త్వగుణం ఆశ్రయాలు. సత్త్వగుణం జీవాత్మను, జీవాత్మ నారాయణుని ఆశ్రయించి ఉంటాయి. నారాయణునికి ఆశ్రయం మోక్షం – పరబ్రహ్మ. మోక్షానికి మాత్రం ఏ ఆశ్రయం లేదు. ఈ విషయాలను బాగా తెలుసుకుని సత్త్వగుణాన్ని; మనస్సుతో కూడా పదకొండు ఇంద్రియాలను, పంచప్రాణాలను, ఈ పదహారు గుణాలతో గూడిన సూక్ష్మశరీరాన్ని;

---

* *(గీతాప్రెస్ హిందీ వివరణ)*

1. జ్ఞానశక్తి, వైరాగ్యం, స్వామిభావం - ఆత్మరక్షణ, తపస్సు, సత్యం, క్షమ, ధైర్యం, స్వచ్ఛత, ఆత్మజ్ఞానం, అధిష్ఠానమై ఉండటం. ఈ పది సాత్త్విక గుణాలు.

2. సంతోషం లేకపోవటం, పశ్చాత్తాపం. శోకం, లోభం, ఓర్పులేక పోవటం, అణచివేసే లక్షణం, కామం, క్రోధం, ఈర్ష్య. ఈ లొమ్మిది రజోగుణ లక్షణాలు.

3. అవివేకం, మోహం పొరపడటం, కల గనటం, నిద్ర, అభిమానం, విషాదం, సంతోషం లేకపోవటం – ఈ ఎనిమిది తమోగుణ లక్షణాలు.

4. మహత్తు అహంకారం శబ్ద తన్మాత్రలు, స్పర్శతన్మాత్రలు, రూపతన్మాత్రలు, రసతన్మాత్రలు, గంధతన్మాత్రలు – ఈ ఏడు బుద్ధి గుణాలు.

5. చెవులు, చర్మం, కన్నులు, నాలుక, ముక్కు అనే పంచేంద్రియాలతో గూడిన మనస్సు అనే ఆరు మనోగుణాలు.

6. ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, పృథ్వి. అనే ఈ ఐదు ఆకాశగుణాలు.

7. సంశయం, నిశ్చయం, గర్వం, స్మరణం అనే ఈ నాలుగు బుద్ధి గుణాలు.

8. అప్రతిపత్తి, విప్రతిపత్తి, విపరీత ప్రతిపత్తి – ఈ మూడు శరీరగుణాలు.

9. ప్రవృత్తి, దుఃఖం ఈ రెండు రజోగుణాలు.

10. ప్రకాశం సత్త్వానికి గల ఒక ప్రధానగుణం.

శరీరాన్ని ఆశ్రయించి ఉండే స్వభావ చేతనలను తెలుసుకోవాలి. సుఖాది విషయాసక్తిగల మానవుని కర్మ శరీరంలోని ఆత్మకన్నా ఇతరమైన ఇంకొక తత్త్వం. ఇది కూడా బాగా తెలుసుకోవాలి. ఇంద్రియాలు, ఇంద్రియాలతో అనుభవించే విషయ సుఖాలు, ఇవి అన్నీ శరీరంలోపల ఉన్నవి. మోక్షం చాలా దుర్లభ మైనది. వీటిని అన్నిటిని వేదాలు చెప్పిన రీతిలో చక్కగా తెలుసుకోవాలి. ప్రాణం, అపానం, సమానం, వ్యానం, ఉదానం అనే అయిదు ప్రాణవాయువులు అపానమార్గాన పోయే వాయువు ఆరోది. పైకి వెళ్ళే ప్రవహం అనే వాయువు ఏడవది. ఈ ఏడు వాయువులలో ఒక్కొక్కటి మళ్ళీ సప్తసప్తభేదాలు అవుతాయి. ఇవి మొత్తం 49 వాయువులు. అనేక ప్రజాపతులను, ఋషులను, అనేక ముక్తి మార్గాలను బాగా తెలుసుకోవాలి. కశ్యపాది సప్తర్షులను, రాజర్షులను, దేవర్షులను, మహాత్ములను, సూర్యునితో సమానమైన తేజస్సుగల బ్రహ్మ ఋషులను గూర్చి తెలుసుకోవాలి. రాజేంద్రా ! మహత్తర కాల ప్రేరణవల్ల మానవులు ఐశ్వర్యహీనులు అవుతారు. మహాభూతి సమూహాలు కాలానుసారం నాశనమవుతాయి. ఇవి అన్నీ చూసి తెలుసుకోవాలి. పాపాత్ములైన మానవులకు గలిగే నీచగతులను, యమలోకానికి వెళ్ళి వైతరిణీనదిలో పడిపోయిన ప్రాణులకు గలిగే దుఃఖాన్ని తెలుసుకోవాలి. ప్రాణులు చిత్రాతిచిత్రమైన జాతులలో అపవిత్ర జన్మలను పొందుతాయి. రక్తమూత్రాదులకు పాత్రమైన అపవిత్ర గర్భాశయంలో నివసించాలి. అది మలమూత్రాలతో నిండి ఉంటుంది. అక్కడ తీవ్రమైన దుర్వాసన ఉంటుంది. ఆ దేహం రజో వీర్యాల సముదాయం మాత్రమే. మజ్జాస్నాయువులు అందులో ఉంటాయి. అనేకమైన చిన్న, పెద్దనరాలు, నాడులు వ్యాపించి ఉంటాయి. దానికి తొమ్మిది ద్వారాలు ఉంటాయి. అపవిత్రమైన ఆ పురంలో, దేహంలో జీవుడు ఉండాలి. రాజా ! ఈ విషయాలు అన్నీ తెలుసుకొని తనకు మిక్కిలి హితకరమైన ఆత్మను, అది ప్రాప్తించటానికి శాస్త్రాలు చెప్పిన అనేక విధాలైన యోగసాధనలను తెలుసుకోవాలి. తత్త్వజ్ఞానం గల మహాపురుషులు నిందించే మోక్ష విరోధులైన తామస, రాజస, సాత్త్విక ప్రాణుల ప్రవర్తనాదులను కూడా తెలుసుకోవాలి. భయంకరమైన ఉల్కాపాతాదులైన ఉపద్రవాలను చంద్రగ్రహణం, సూర్యగ్రహణం, నక్షత్రపతనం, నక్షత్రగమనంలో కలిగే తేడాలు, భార్యాభర్తలకు దుఃఖకరమైన ఎడబాటు, ఇంకా ఈ లోకంలో కలిగే అనేక సంఘటనలు విశదంగా తెలుసుకొని, తనకు మేలు కలిగే విధంగా ప్రవర్తించాలి.

లోకంలో చిన్నప్రాణిని పెద్దప్రాణి తినటం అనే బాధాకర దృశ్యాన్ని గమనించాలి. బాల్యంలో కలిగే అజ్ఞానాన్ని, ముసలితనంలో కలిగే శరీరవినాశనాన్ని తెలుసుకోవాలి.

రాగమోహాలవల్ల కలిగే అనేకదోషాలను గుర్తించాలి. చాలా కొద్దిమంది మాత్రమే సత్త్వగుణం కలిగిఉంటారు. వేలకొలది మానవులలో ఎవరో ఒకరిద్దరు మాత్రమే మోక్షం కలగాలనే ఆలోచనను ఆశ్రయిస్తారు. **వేదవాక్కులను వినటంవల్ల ముక్తి ఎంత దుర్లభమో తెలుసుకోవాలి. కావలసిన వస్తువు లభించకపోతే ఆస్థితిని కూడా ఇష్టప్రకారంగానే స్వీకరించాలి. కోరుకున్నది లభిస్తే ఉబ్బితబ్బిబ్బు కాకుండా స్తిమితంగా ఉండాలి.** శబ్దస్పర్శాదులయిన విషయాలు దుఃఖరూపాలే అని తెలుసుకోవాలి. ప్రాణాలుపోయి శవాలయి అపవిత్రమై, బీభత్సమైన దేహాలను గమనించాలి. ప్రాణులకు ఇళ్ళలో నివసించటంకూడా బాధాకరమే అని తెలుసుకోవాలి. బ్రహ్మహత్య చేసినవాడు, పతితుడు అయిన మనుష్యుని దారుణమైన దుర్గతిని అర్థం చేసుకోవాలి. మద్యపానంలో ఆసక్తులైన దుష్టబ్రాహ్మణుల, గురుపత్నీ గమనం చేసిన దుర్మార్గుల దుర్గతిని గూర్చి ఆలోచించాలి. యుధిష్ఠిరా ! తల్లులు, దేవతలు, సర్వ లోకాల విషయంలో మంచిప్రవర్తన చూపనివారి దుర్గతిని చూచి తెలిసికొని, ఆ జ్ఞానంతో పాపాత్ములకు కలిగే అధోగతిని తెలుసుకోవాలి. పశుపక్ష్యాదులైన ప్రాణులకు కలిగే విభిన్నమైన గతులను గూడా తెలుసుకొనవాలి. **వేదాలలో ఉండే నానావిధాల విచిత్ర విషయాలను, బుతువుల మార్పులను, ప్రతిక్షణం గడచిపోయే రోజులు, పక్షాలు, మాసాలు, సంవత్సరాలు - వీటన్నింటి మీద దృష్టిపెట్టాలి. చంద్రునికి కలిగే వృద్ధిక్షయాలను, సముద్రాలకు కలిగే ఆటుపోట్లును, ధనవంతుల ధనక్షయాన్ని, అభివృద్ధిని మనం ప్రత్యక్షంగా చూస్తాం. వీటిని అన్నింటిని పరిశీలించి మన కర్తవ్యం నిర్ణయించుకోవాలి.** యుగాలు, పర్వతాలు, చెరువులు, నదులు. వీని కలయికలు క్షయాదులను గుర్తించాలి. వర్ణాల క్షయాన్ని, క్షయానికి కలిగే అంతాన్ని మాటి మాటికి గమనించాలి. పుట్టుక, చావు, ముసలితనం - వీటివల్ల కలిగే బాధలను గూడా గుర్తించాలి. దేహంలో కలిగే దోషాలను తెలుసుకొని వాటివల్ల సంభవించే దుఃఖాల యధార్థాన్ని అర్థంచేసుకోవాలి. శరీరంలో కలిగే అనేకమైన బాధలను గూడా బాగా దృష్టిలో పెట్టుకోవాలి. **మన శరీరంలో ఉండే మనదోషాలను అన్నింటిని గమనించాలి. మన శరీరం నుంచి నిరంతరం వెలువడే దుర్గంధాన్ని పరిశీలించాలి. (అందువల్ల) వైరాగ్యంతో పరమాత్మధ్యానం చేస్తూ సంసారబంధ విముక్తికోసం యత్నించాలి.**

యుధిష్ఠిరుడు అడిగాడు. 'మనశరీరంలోనే మనకు గోచరించే దోషాలు ఏమి ఉంటాయో వాటిని అన్నిటినీ వివరించి నా సందేహాలు పోయేటట్లు సమాధానం చెప్పవలసింది.'

భీష్ముడు చెప్పాడు. 'శత్రునాశకా ! కపిలుని సాంఖ్యమతానుసారులైన జ్ఞానులు దేహంలో ఐదురకాలు దోషాలను చెప్పారు. వాటిని చెపుతాను విను. కామం, కోపం, భయం, నిద్ర, శ్వాసించటం అనే అయిదు దోషాలు సర్వప్రాణుల శరీరాలలో కన్పిస్తుంటాయి. **ఉత్తములు ఓర్పుతో కోపాన్ని, సంకల్పాలను వదలటంతో కామాన్ని, సత్త్వగుణాన్ని సేవించటంతో నిద్రను, పారపాట్లను చేయకుండటంతో భయాన్ని, అల్పాహారాన్ని స్వీకరించటంతో శ్వాసదోషాన్ని పోగొట్టుకొంటారు.** రాజా ! మహామేధావులయిన సాంఖ్యశాస్త్ర విద్వాంసులు అనేక గుణాలతో గుణాలను, అనేక దోషాలతో దోషాలను, విచిత్రమైన అనేక హేతువులతో విచిత్రహేతువులను యథాతథంగా తెలుసుకొని సర్వవ్యాపి అయిన జ్ఞాన ప్రభావంతో ప్రపంచం నీటి మీది బుడగలాగా అశాశ్వత మనీ, విష్ణుదేవుని అనంతమైన మాయలమాటున ఉన్న దనీ, రెల్లుదుబ్బులాగా నిస్సార మనీ, గోడలమీద వేసిన బొమ్మల వంటి దనీ, చీకటితో నిండిపోయిన గుంటవలె భయంకర మనీ, వర్షపునీటి బుడగలవలె క్షణభంగుర మనీ, సుఖహీన మనీ, పరాధీన మనీ, నాశనంతో సమాన మనీ, బురదలో కూరుకు పోయిన ఏనుగువలె రజోగుణ తమోగుణాలలో మగ్నమైన దనీ భావిస్తారు. అందువల్ల వారు సంతానాదులపైన ఉండే మమకారాన్ని దూరం చేసుకొని తపస్సు అనే దండంతో గూడిన వివేకం అనే ఆయుధంతో రాజస తామసగుణాల అపవిత్ర వాసనను, చక్కని సాత్త్వికగంధాన్ని, స్పర్శేంద్రియంతో దేహాన్ని ఆశ్రయించిన భోగాసక్తిని త్వరగా ఖండిస్తారు. శత్రునాశకా ! తరువాత ఆ సిద్ధయతులు జ్ఞానరూపమైన నావతో సంసార మనే మహాసముద్రాన్ని దాటుతారు. ఆ భవ సాగరంలో దుఃఖమే జలం, చింతాశోకాలు పెద్ద కుండాలు. నానావిధరోగాలు, మృత్యువు అందులోని మొసళ్ళు. మహా భయమే మహాసర్పాలు. తమోగుణం తాబేళ్ళు. రజోగుణం చేపలు. స్నేహం, మమకారాదులు బురద. ముసలితనం దానిని దాటనీయదు. జ్ఞానం దానిలోని ద్వీపం. నానావిధాలయిన కర్మలవల్ల ఇది అగాధం అయింది. సత్యమే దానికి తీరం. నియమవ్రతాదులు దానిలో నిలుకడ. హింసయే దాని మహావేగం. నానావిధాలయిన రసాలకు అది ఆకరం. అనేక విధాలయిన హర్షమే దానిలోని రత్నాలు. దుఃఖం, సంతాపం అనేవి అక్కడి గాలులు. దుఃఖాలు, ఆశలు అనే సుడిగుండాలు దానిలో ఉన్నవి. తీవ్రరోగాలు దానిలో ఉండే నీటి ఏనుగులు. ఎముకల సమూహాలు దానిలోని ఘట్టాలు. కఫం నురుగు. దానాలు ముత్యాలరాశులు. రక్తం దాని కుండాలలో ఉండే పగడాలు. నవ్వులు, పెద్దకేకలు ఆ సముద్రఘోష. అనేక విధాలయిన అజ్ఞానం దాన్ని దుస్తరం చేస్తాయి. ఏడుపువల్ల

వచ్చే కన్నీరు దానిలోని మలినమైన ఉప్పునీరు. ఏ ఆసక్తి లేకపోవటం దాని రెండవ ఒడ్డు. దారాపుత్రులు జలజంతువులు. మిత్రులు, బంధువులు దానిలోని పట్టణం. అహింసా సత్యాలు ఎల్లలు. ప్రాణత్యాగం పెద్దతరంగాలు. వేదాంతజ్ఞానం ద్వీపం. సమస్త ప్రాణులపైన గల దయ దీనిలోని నీరు. మోక్షం ఇందులో దుర్లభవిషయం. నానావిధ సంతాపాలు దానిలోని బడబానలం. దాన్ని దాటి వారు ఆకాశరూపమైన పరమాత్మలో ప్రవేశిస్తారు.

రాజా ! పుణ్యాత్ములైన సాంఖ్యయోగ సిద్ధపురుషులను తనకిరణాలతో వారిలో ప్రవేశించిన సూర్యుడు అర్చిరాది మార్గంలో బ్రహ్మలోకానికి చేర్చటానికి పద్మపుకాడ సరస్సులోని నీటిని గ్రహించినట్లు తీసుకొని పోతాడు. రాగాదిరహితులు, యతులు, తపోధనులు అయిన ఆ సిద్ధ మహాపురుషులను అక్కడ ప్రవహం అనే పేరుగల వాయువులోని అభిమానిదేవత సూర్యాభిమాని దేవత యొక్క అధికారంలోకి తీసుకొనిపోతుంది. కుంతీపుత్రా ! సూక్ష్మమైనది, చల్లనిది, సువాసనగలది, సుఖస్పర్శగలది, సప్తవాయువులలో శ్రేష్ఠమై పవిత్రలోకాలకు వెళ్ళే వాయువు పుణ్యాత్ములైన ఆ సాంఖ్యయోగులను ఆకాశంలో సర్వోన్నత స్థితికి తీసుకొనివెళుతుంది. జనాధిపా ! ఆకాశాభిమాని దేవత ఆ యోగులను రజోగుణపరమగతికి చేరుస్తుంది. అంటే తేజోమయ మయిన విద్యుదభిమాన దేవతలవద్దకు తీసుకొనిపోతుంది ఆ రజోగుణం. విద్యుదభిమాని దేవతలు సత్యపరమాత్మ గతిదాకా అంటే శ్రీమన్నారాయణుని పార్షదులు ఉండే చోటికి చేరుస్తారు. అక్కడినుంచి సత్త్వగుణంగల ఆ పార్షదులు శ్రీమన్నారాయణుని వద్దకు తీసికొని వెళ్తారు. శ్రీమన్నారాయణుడు వారిని పరమాత్మలో ప్రవేశింపజేస్తాడు. పరమాత్మను పొంది తద్రూపులయిన నిర్మలయోగులు అమృతభావాన్ని పొందుతారు. వారు మళ్ళీ తిరిగి జననమరణరూప సంసారంలోకి రారు. రాజా ! సుఖదుఃఖాది ద్వంద్వాతీతులు, మహాత్ములు, సత్యం, ఋజుప్రవర్తన గలవారు, సర్వప్రాణులయందు దయగల ఆసిద్ధులకు అదియే పరమగతి అవుతుంది.

యుధిష్ఠిరుడు అడిగాడు. పితామహా ! సుస్థిర నియమవంతు లయిన ఆ సాంఖ్యయోగులు నారాయణుని, ఉత్తమపదవిని పొందిన తరువాత తాము పుట్టినది మొదలు మరణించేదాకా జరిగిన విషయాలను గుర్తుతెచ్చుకుంటారా ? లేదా ? ఈ విషయంలో నీవు ఉన్నది ఉన్నట్లు చెప్పవలసినది. ఈ ప్రశ్న నిన్ను తప్ప ఇంకొకరిని అడగలేను. సిద్ధావస్థను పొందిన తరువాతకూడా గతజన్మ వృత్తాంతాలనే గుర్తుంచుకొనేటట్లయితే మోక్షం పొందిన తరువాత కూడా ఇది పోకపోతే ఇంతకంటే బాధాకరం ఇంకేముంటుంది ? దానికంటే స్వధర్మ రూపమయిన కర్మాచరణమే శ్రేష్ఠంగదా !'

భీష్ముడు చెప్పాడు. 'వత్సా ! నీవు తగినరీతిగానే చాలా జటిలం అయిన ప్రశ్న అడిగావు. ఈ ప్రశ్నవిషయంలో ఆలోచించేటప్పుడు మహా మహా విద్వాంసులు కూడా సంకటస్థితిలో పడిపోతారు. ఈ విషయంలో పరమతత్త్వాన్ని చక్కగా చెపుతాను విను. కపిలమహర్షి ప్రతిపాదించిన సాంఖ్యమతాన్ని అనుసరించే మహాత్ముల ఉత్తమ సిద్ధాంతం ఇది. రాజా ! శరీరధారులకు తమ శరీరంలో ఉండే ఇంద్రియాలే విశిష్ట విషయాలను చూస్తాయి, అనుభవిస్తాయి. అవి ఆత్మకు భిన్నమైన జ్ఞానాన్ని కలిగించటంలో కారణం అవుతాయి. సూక్ష్మమైన ఆత్మ ఇంద్రియాల ద్వారానే బాహ్యవిషయాలను చూడటం గాని, వ్యక్తం చేయటం గాని చేస్తుంది. (ముక్తావస్థలో మనస్సుకు ఇంద్రియాలతో సంబంధం లేకపోవటం వలననే దానిలో ఇంద్రియజాతమైన విశేషజ్ఞానం ఉండదు.) మహాసముద్రంలో ఏర్పడే నీటిబుడగలు, నురుగు నశించినట్లు జీవాత్మ వదలిపెట్టిన తరువాత మానవదేహం, కర్రలాగా, గోడలాగా జడాలయిన ఇంద్రియాలు ప్రకృతిలో లీనం అయిపోతాయి. ఇందులో సందేహంలేదు. రాజా ! శరీరధారి అయిన ప్రాణి ఇంద్రియాలతో కూడియే నిద్రించినప్పుడు ఆ ప్రాణిసూక్ష్మశరీరం ఆకాశంలో వాయువు లాగా అంతటా సంచరించసాగుతుంది. అంటే కలలు కంటుంది. అది మేలుకుని ఉన్నప్పుడు లాగానే కలలో కూడా దృశ్యవస్తువులను చూస్తుంది. స్పృశించదగినవానిని స్పృశిస్తుంది. అంటే మేలుకుని ఉన్నప్పుడువలెనే అన్ని విషయాలను అనుభవిస్తుంది. గాఢనిద్రావస్థలో విషయాలు తెలుసుకోవటంలో పూర్తిగా అసమర్థమయిన ఇంద్రియాలు విషహీనసర్పాలు దాక్కొన్నట్లు తమతమ స్థానాలలో లీనం అవుతాయి. జీవాత్మ స్వప్నావస్థలో తమతమ స్థానాలలో ఉండే అన్ని ఇంద్రియాల సమస్త గతులను ఆక్రమించి, సూక్ష్మవిషయాలలో సంచరిస్తుంది. ఇందులో సందేహంలేదు. ధర్మాత్మా ! యుధిష్ఠిరా ! పరమాత్మ సాత్త్విక రాజస తామస గుణాలను, బుద్ధి, మనస్సు, పంచభూతాల అన్ని గుణాలను, ఇంకా ఇతరవస్తువులను తనగుణాలతో వ్యాపించి సమస్త క్షేత్రజ్ఞుల (జీవాత్మల)లో ఉన్నాడు. శిష్యులు తమగురువు వెంట వెళ్ళినట్లు మనస్సు, ఇంద్రియాలు, శుభాశుభకర్మలు జీవాత్మ వెంట వెళ్ళుతూఉంటాయి. జీవాత్మ ఇంద్రియాలను, ప్రకృతిని తీసుకుని వెళ్ళేటప్పుడు అవినాశి అయిన పరమాత్మ నారాయణుని పొందుతాడు. ఆయన ద్వంద్వాతీతుడు, మాయారహితుడు. భారతా ! పుణ్యపాపాలు లేని సాంఖ్యయోగి ముక్తుడై నిర్గుణుడు, నిర్వికారుడు అయిన నారాయణ రూప పరమాత్మలో లీనుడు అయిన తరువాత జననమరణరూప సంసారంలోకి తిరిగిరాడు. ఈ విధంగా జీవన్ముక్తుని ఆత్మ పరమాత్మలో

లీనంఅవుతుంది. కాని ప్రారబ్ధవశాన శరీరం ఉన్నంత కాలం ఆ మనస్సు, ఇంద్రియాలు మిగిలి ఉంటాయి. గురువుగారి ఆజ్ఞను పాలించే శిష్యులవలె కాలానుసారం ఈ లోకానికి రాకపోకలు సాగిస్తూఉంటాయి. ఈ రీతిగా వెనకచెప్పిన జ్ఞాని అయిన మోక్షాధికారీ, ఆత్మోన్నతిని కోరేవ్యక్తీ స్వల్పకాలంలోనే పరమశాంతిని పొందగలడు.

కుంతీపుత్రా ! మహాజ్ఞానులైన సాంఖ్యయోగులు పైన చెప్పిన ఈ పరమగతిని పొందుతారు. దీనితో సమానమైన జ్ఞానం ఇంకొకటి లేదు. ఈ సాంఖ్యజ్ఞానం అన్నింటికంటే గొప్పజ్ఞానం. ఈవిషయంలో నీకు ఎలాంటి సందేహం ఉండనవసరంలేదు. దీనిలో అక్షరమై, శాశ్వతమైన, పూర్ణం, సనాతనం అయిన పరబ్రహ్మ ప్రతిపాదనమే ఉన్నది. ఆ పరబ్రహ్మ ఆది, మధ్య, అంతాలు లేనిది, ద్వంద్వాతీతం, జగత్తు ఉత్పత్తికి కారణం, శాశ్వతం, కూటస్థం, నిత్యం అని విద్వాంసులు చెపుతారు. ప్రపంచసృష్టి, ప్రళయం, సమస్తమైన మార్పులు దానివల్లనే కలుగుతూంటాయి. మహర్షులు శాస్త్రాలలో దానినే ప్రశంసిస్తారు. **సమస్త బ్రాహ్మణులు, దేవతలు, పరమశాంతిని అనుభవించేవారు అవంతం, అచ్యుతం, బ్రాహ్మణహిత కాంక్షి, పరదేవత ఐన పరమాత్మస్తుతిని చేస్తారు. ఆ పరమాత్మ గుణాలను ధ్యానిస్తూ మహిమను గానం చేస్తారు. యోగసిద్ధులైన యోగులు, అపారజ్ఞానులైన సాంఖ్యవేత్తలు కూడా ఆ పరమాత్మగుణాలను గానం చేస్తారు.** ఈ సాంఖ్య శాస్త్రమే నిరాకారమైన ఆ పరమాత్మ ఆకార మని ప్రసిద్ధి ఉన్నది. సర్వవిధాలయిన జ్ఞానాలు సాంఖ్యం గొప్పతనాన్నే చెపుతున్నవి. ఈ భూమిమీద స్థావరాలు జంగమాలు అని రెండు రకాల ప్రాణులు ఉన్నవి. ఆ రెండింటిలో జంగమప్రాణులు శ్రేష్ఠమైనవి. నరేశ్వరా ! మహాజ్ఞానులలో, వేదాలలో, సాంఖ్య దర్శనాల లో, యోగశాస్త్రంలో, పురాణాలలో నానావిధమై కనిపించే ఉత్తమ జ్ఞానం సమస్తమూ సాంఖ్యం నుంచే వచ్చింది. మహాత్మా ! మహత్తరమైన ఇతిహాసాలలో, సత్పురుషులు సేవించిన అర్థశాస్త్రంలో, ఈలోకంలో ఉన్న మహత్తరజ్ఞానం అంతా సాంఖ్యశాస్త్రం నుంచే వచ్చింది. ప్రత్యక్షంగా తెలిసే మనస్సు ఇంద్రియాలను నియమించటం, ఉత్తమమైన బలం, సూక్ష్మమైన జ్ఞానం, పరిణామంలో సుఖాన్ని కలిగించే తపస్సు – వీటిని అన్నింటిని ఉన్నవి ఉన్నట్టు సాంఖ్యశాస్త్రం చెప్పింది. పృథాపుత్రా ! సాధనలో కొన్నిలోపాలు, దోషాలు ఉండటంవల్ల సాంఖ్యజ్ఞానం బాగా కలుగని సాంఖ్యయోగసాధకులు దేవలోకానికే తప్పక వెళ్ళుతారు. అక్కడ నిరంతరం సుఖంగా ఉంటూ దేవతాధిపత్యాన్ని పొంది కృతార్థులు అవుతారు. పుణ్యం అయిపోయిన తరువాత ఈ లోకానికి వచ్చి మళ్ళీ సాధనకోసం యత్నశీలులైన బ్రాహ్మణవంశంలో

జన్మిస్తారు. పార్థా ! సాంఖ్యజ్ఞానం కలిగినవారు శరీరం వదలిన తరువాత దేవతలు స్వర్గంలో ప్రవేశించినట్లు పరమాత్మలో ప్రవేశిస్తారు. ఇందువల్ల శిష్టులు అనుసరించిన పరమపూజనీయమైన సాంఖ్యశాస్త్రంలో బ్రాహ్మణులు అందరూ అధికంగా ఆసక్తికలవారు అవుతారు. సాంఖ్యజ్ఞానాను రక్తులైన బ్రాహ్మణప్రధానులు మరణించిన తరువాత పశుపక్ష్యాది జాతులలో జన్మించటం అనేది ఎప్పుడూ చూడలేదు. వారు నరకాదులైన అధోగతులను కూడా పొందరు. వారు పాపకర్మలు చేసేవారి మధ్యకూడా ఉండవలసిన అవసరంలేదు. సాంఖ్యజ్ఞానం చాలా విశాలమైనది, అత్యంత పురాతనమైనది. ఇది మహాసముద్రంవలె అగాధమూ, నిర్మలమూ, ఉదారభావ పూర్ణమూ, మిక్కిలి మనోహరము. పరమాత్మ అయిన శ్రీమన్నారాయణుడు సంపూర్ణమై, ఇంతని చెప్పటానికి వీలులేని సాంఖ్యజ్ఞానాన్ని పూర్తిగా ధరిస్తాడు. నరనాథా ! ఈ సాంఖ్య తత్త్వాన్ని నీకు నేను చెప్పాను. అతిప్రాచీనమైన ప్రపంచరూపంలో శ్రీమన్నారాయణుడే అంతటా వెలుగొందుతున్నాడు. ఆయనే సృష్టిసమయంలో జగత్తును సృష్టిస్తున్నాడు. సంహారకాలంలో తనలోకి ఉపసంహరిస్తున్నాడు. ఈ రీతిగా తనశరీరంలోనే ఉంచుకొని ఆ జగదంతరాత్మ అయిన నారాయణుడు ఏకార్ణవజలంలో శయనిస్తుంటాడు.'

302. వసిష్ఠ కరాళజనక సంవాదము - క్షరాక్షరతత్త్వ నిరూపణము.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'తాతా ! జీవుడు దేనిని తెలుసుకున్న తర్వాత, ఈలోకంలోనికి మరలా రాకుండే అక్షరతత్త్వం ఏమిటి ? దేనిని పొందినతరువాత తిరిగి మళ్ళీ ఈలోకంలోకి వచ్చే క్షరతత్త్వం ఏమిటి ? క్షరం, అక్షరం అనే రెండింటి స్వరూపాన్ని తెలుసుకొనటానికే ఈ ప్రశ్న అడిగాను. నాలుగువేదాలను పూర్తిగా అధ్యయనంచేసిన బ్రాహ్మణులు, మహాత్ములైన మహర్షులు, మహితాత్ములైన యతులు నిన్ను జ్ఞాననిధి అని చెపుతుంటారు. సూర్యుడు దక్షిణాయనంలో ఇంక కొద్దిరోజులు మాత్రమే ఉంటాడు. ఆయన ఉత్తరాయణంలో ప్రవేశించినంతనే నీవు పరలోకానికి వెళ్లిపోతావు. నీవు వెళ్లిపోయిన తరువాత మేము మేలు కలిగించే మంచి విషయాలు ఇంక ఎవరివల్ల వినగలం ? నీవు కురువంశాన్ని ప్రకాశింపజేసే పెద్ద దీపానివి. జ్ఞానదీపంతో వెలుగుతున్నావు. అందువల్ల ఈ విషయాలు అన్నీ నీవలన వినవలెనని నాకోరిక. ఇలాంటి అమృత వచనాలు ఎంత విన్నా నాకు తృప్తి కలగటం లేదు.

భీష్ముడు చెప్పాడు. 'ఈ విషయంలో కరాళుడనే పేరుగల జనక వంశీయునికి,

వసిష్ఠమహర్షికి మధ్య జరిగిన సంభాషణను నీకు చెపుతాను. ఒకానొకప్పుడు మహర్షుల సమూహంలో సూర్యుని లాగా వెలుగుతున్న మునిశ్రేష్ఠుడైన వసిష్ఠుని కరాళజనకుడు అనే రాజు సమీపించి, శ్రేయస్కరమైన జ్ఞానవిషయాన్ని గూర్చి ఇలా ప్రశ్నించాడు. మిత్రా వరుణుల పుత్రుడై, అధ్యాత్మజ్ఞానాన్ని అనుభవంతో పొందిన వసిష్ఠమహర్షి ప్రశాంతంగా కూర్చుని ఉన్న సమయంలో వినయంతో నమస్కరించి, కరాళజనకు డనే రాజు కుతర్కం చేయకుండా మధురమైన మాటలతో ఇలా అడిగాడు. 'మహాత్మా ! విద్వాంసులు మళ్లీ ఈ సంసారంలో జనించకుండా ఉండే సనాతనమైన విషయాన్ని వినగోరుతున్నాను. ఈ జగత్తు క్షరం (లయం) అయ్యేది. క్షరమని వ్యవహృతమయ్యే దీనిని గురించి; ఎలాంటి మార్పులేక, మంగళకరమై, శివస్వరూపమై, అక్షరం అని వ్యవహృతమయ్యే అధిష్ఠానజ్ఞానాన్ని గురించి వినగోరుతున్నాను.' వసిష్ఠమహర్షి ఇలా అన్నాడు. 'రాజా ! ఈ జగత్తు క్షయం (పరివర్తనం) చెందే విషయాన్ని, ఏకాలంలో నశించని అక్షరమైన తత్త్వాన్ని చెపుతాను విను. దేవతల పండ్రెండు వేల సంవత్సరాలు ఒక చతుర్యుగం అవుతుంది. దీన్ని కల్పం అంటే మహాయుగం అని తెలుసుకో. ఇలాంటి వెయ్యి మహాయుగాలు బ్రహ్మదేవునికి ఒక దినం అని చెపుతారు. రాజా ! ఆ బ్రహ్మకు రాత్రి సమయంకూడా ఇంత దీర్ఘంగానే ఉంటుంది. దాని తరువాత ఆయన మళ్ళీ మేలుకొంటాడు. అనంతకర్మ అయిన బ్రహ్మ సృష్టికంతటి కంటె ముందు పుట్టినవాడు, మహత్తర దివ్యరూపుడు. ఈవిశ్వం అంతా ఆయనస్వరూపమే. అణిమ, మహిమ, ప్రాప్తి మొదలైన అష్టసిద్ధులను స్వాధీనం చేసుకొన్నవాడు. మంగళస్వరూపుడు, నిరాకారుడైన పరమేశ్వరుడే సాకారుడైన బ్రహ్మను సృష్టించాడు. ఆ పరమాత్మ జ్యోతి స్వరూపుడు, స్వయంగానే వ్యక్తమైనవాడు, వినాశరహితుడు. ఆయన చేతులు, కాళ్ళు, కన్నులు, శిరస్సులు అన్ని వైపులా ఉన్నవి. చెవులు కూడా అన్నివైపుల ఉన్నవి. ఆయన ప్రపంచంలోని సమస్తాన్ని వ్యాపించి ఉన్నాడు. పరమేశ్వరుని నుంచి మొదట జనించినవాడే హిరణ్యగర్భుడు. ఆయననే బుద్ధి అని చెప్పారు. యోగశాస్త్రం ఈయననే మహత్త అని చెప్పింది. ఈయననే విరించి, అజుడు అని కూడా అంటారు.

అనేకమైన పేర్లు, రూపాలు గల ఈహిరణ్యగర్భ బ్రహ్మనే సాంఖ్యశాస్త్రంకూడా వర్ణించింది. విచిత్రరూపధరుడైన ఈయనను విశ్వాత్మ అనీ, ఏకాక్షర మనీ చెప్పారు. నానారూపాలుగల ఈ ముల్లోకాలను ఈయనే సృష్టించాడు. ఈయన ఈ సమస్తాన్ని వ్యాపించి ఉన్నాడు. ఇలా అనేకరూపాలు ధరించటం వలన ఆయనను విశ్వరూపునిగా భావించారు. మహాతేజస్వి అయిన హిరణ్యగర్భుడు వికారాన్ని (మార్పును) పొంది, స్వయంగానే

అహంకారాన్ని, దాని అభిమానదేవత, ప్రజాపతి అయిన విరాట్ పురుషుని సృష్టిస్తాడు. వీనిలో నిరాకారం నుంచి సాకారరూపంగా వ్యక్తమయ్యే మూలప్రకృతిని విద్యాసర్గం అని అంటారు. మహత్తత్వం, అహంకారం అనేవాటిని అవిద్యా సర్గం అని అంటారు. అవిధి (జ్ఞానం), విధి (కర్మ) అనేవాటి ఉత్పత్తిగూడా ఆ పరమాత్మనుంచే ఏర్పడింది. వేదశాస్త్రాల అర్థాన్ని విచారించే విద్వాంసులు వాటిని విద్య, అవిద్య అని చెప్పారు. అహంకారం నుంచి కలిగే మూడవసృష్టి సూక్ష్మ భూతసృష్టి. సాత్వికం, రాజసం, తామసం అనేభేదం గల మూడురకాల అహంకారాల నుంచి కలిగే నాలుగో సృష్టి వైకృతసర్గం అని తెలుసుకో. ఆకాశం, వాయువు, తేజస్సు, నీరు, భూమి అనే పంచమహాభూతాలు; శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం అనే అయిదు విషయాలు వైకృతి సర్గంలోనివి. ఈ పదింటి ఉత్పత్తి ఒకే మారు జరుగుతుంది అనటంలో సందేహంలేదు. ఇక ఐదవ సర్గంగురించి చెపుతాను విను. ఇది ప్రాణులకు చాలా ప్రయోజనకరం కావటంవల్ల సార్థకం. ఈ భౌతిక సర్గంలోనివి కన్నులు, చెవులు, ముక్కు, చర్మం, నాలుక అనే అయిదు జ్ఞానేంద్రియాలు. వాక్కు, చేతులు, కాళ్ళు, గుదం (మలవిసర్జకం), ఉపస్థ (మూత్ర విసర్జనం) అనే అయిదు కర్మేంద్రియాలు. మనస్సుతోకూడా ఈ పదింటి ఉత్పత్తి ఒకేమారు జరుగుతుంది. ఈ ఇరవై నాలుగు తత్త్వాలు అన్ని ప్రాణుల శరీరాలలో ఉంటాయి. తత్త్వం తెలిసిన బ్రాహ్మణులు వీటి యథార్థస్వరూపాన్ని చక్కగా తెలుసుకొని ఏ సమయంలోనూ శోకింపరు.

మానవశ్రేష్ఠా ! దీన్నే దేహం అంటారు. మూడులోకాల్లో ఉండే శరీరధారులందరిలో ఈ తత్త్వాలసముదాయం కన్పిస్తుంటుంది అని తెలుసుకోవాలి. దేవతలు, మానవులు, దానవులు, యక్షులు, భూతాలు, గంధర్వులు, కిన్నరులు, మహాసర్పాలు, చారణులు, పిశాచాలు, దేవబుషులు, నిశాచరులు ఈగలు మొదలైన కుట్టేప్రాణులు, పురుగులు, దోమలు, దుర్గంధయుక్తమైన పురుగులు, ఎలుకలు, కుక్కలు, చండాలురు, హరిణాలు, శ్వపాకులు (కుక్క మాంసం తినేవారు), పుల్కసులు (మ్లేచ్ఛులు), ఏనుగులు, గుర్రాలు, గాడిదలు, సింహాలు, చెట్లు, గోవులు మొదలైన ఆకారంకల పదార్థాలు అన్నింటిలో ఈ తత్త్వాలు కనిపిస్తాయి. ఈ శరీరధారులు భూమి, నీరు, ఆకాశం అనే మూడింటిలోనే ఉంటారు. ఇంకెక్కడా ఉండరు. ఇది విద్వాంసుల నిర్ణయం. ఇలా నేను విన్నాను. నాయనా ! ఈ పంచభూతాత్మకమైన జగత్తు అంతా వ్యక్తం అనే పేరుతో ఉంటుంది. ఇది ప్రతిరోజూ క్షరం -నాశం అవుతుంటుంది. ఇలా క్షీణిస్తుంటుంది కాబట్టి దీనిని క్షరం అని వ్యవహరిస్తారు. దీనికి భిన్నమైన తత్త్వాన్ని అక్షరం అంటారు. ఇలా ఆ అక్షర తత్త్వాన్నుంచి ఉత్పన్నమైనది,

వ్యక్తం అనే పేరు గల మోహాత్మకమైన జగత్తు క్షీణిస్తుండటంచేత క్షరం అనే పేరు కలిగిఉంటుంది. ఈ క్షరతత్త్వాలలో అన్నిటికంటే ముందు మహత్తత్త్వమే పుట్టింది అనే విషయం ఎప్పుడూ దృష్టిలో పెట్టుకోవాలి. ఇది క్షర వృత్తాంతం. మహారాజా ! నీవు అడిగిన దానికి సమాధానంగా నేను నీకు క్షర - అక్షరాల స్వరూపాదులను చెప్పాను.

ఈ ఇరవైనాలుగు తత్త్వాలకు అతీతంగా ఉన్న విష్ణుదేవు (సర్వాన్ని వ్యాపించి ఉన్న పరమాత్మ)నే ఇరువది ఐదవ తత్త్వం అన్నారు. అన్ని తత్త్వాలకు ఆశ్రయం కావటంవల్లనే విద్వాంసులు ఆయనను తత్త్వం అన్నారు. మరణశీలమైన (నశ్వరమైన) పదార్థాలను సృష్టించే మహత్తత్త్వం మొదలైన వ్యక్తపదార్థాలు ఏదో ఒక ఆకారాన్ని గాని స్వరూపాన్ని గాని ఆశ్రయించి మాత్రమే ఉంటాయి. ఇరవైనాలుగు తత్త్వాలు అవ్యక్త ప్రకృతి కాగా ఇరవై ఐదవ తత్త్వం నిరాకారమైన పరమాత్మ. అద్వితీయం, చేతనం, నిత్యం, సర్వస్వరూపం, నిరాకారం, సమస్తానికి ఆత్మ, పరమపురుషుడు అయిన పరమాత్మయే సమస్తమైన శరీరధారుల హృదయంలో ఉన్నాడు. సృష్టిప్రలయాలు ప్రకృతి ధర్మాలు. పురుషునికి వానితో ఎలాంటి సంబంధం ఉండదు. అయినా ఆ ప్రకృతి సర్గం వలన పురుషుడు కూడా సృష్టి ప్రళయా లనే ధర్మాలకు కట్టుబడినవాడులాగా అనిపిస్తాడు. ఇంద్రియాలకు విషయం కాకపోయినా ఇంద్రియ గోచరునివలె అవుతాడు. నిర్గుణు డైనా గుణాలు కలవాని లాగా స్మరిస్తాడు. ఈ విధంగా సృష్టి ప్రళయ తత్త్వాలను ఎఱిగిన మహత్తర ఆత్మ ఎలాంటి వికారం లేనివాడైనా వికార యుక్తునివలె అవుతాడు. ప్రాకృత బుద్ధి కాకపోయినా శరీరం, ఆత్మ అనే అభిమానం కలిగి ఉంటాడు. ప్రకృతి సంసర్గం వలననే ఆయన సత్త్వరజస్తమో గుణాలతో కూడినవాడు అవుతాడు. అజ్ఞానులైన మానవుల సాంగత్యంవలన, వారివలెనే తనను శరీరంలో ఉన్నవానినిగా భావించటం వలన ఆయన ఆ యా సాత్త్విక రాజస తామస జాతులలో జన్మిస్తాడు. ప్రకృతితో కూడా ఉండటంవలన, స్వస్వరూప జ్ఞానం లోపించటం వలన పురుషుడు నేను శరీర భిన్నుడను గాను, నేను ఇది, నేను అది, ఫలానా వారి పుత్రుడను, ఫలానాజాతివాడిని అని చెవుతూ సాత్త్వికాదులైన ఆయన గుణాలనే అనుసరిస్తుంటాడు. ఆయన తమోగుణంతో మోహం మొదలైన అనేక విధాలయిన తామస భావాలను, రజోగుణంతో ప్రవృత్తి - ప్రవర్తించటం మొదలైన భావాలను, సత్త్వగుణాన్ని ఆశ్రయించి ప్రకాశం మొదలైన సాత్త్వికభావాలను పొందుతాడు. సత్త్వగుణంవల్ల తెలుపు, రజోగుణం వల్ల ఎరుపు, తమోగుణం వల్ల నలుపు అనే మూడు రంగులు వ్యక్తం అవుతాయి. ప్రకృతి నుంచి వ్యక్తమయ్యేవి అన్నీ

ఈ మూడు వర్గాలలో ఇముడుతాయి. తమోగుణం గల ప్రాణులు నరకానికి పోతాయి. రాజస స్వభావం గల జీవులు మనుష్యలోకాన్ని చేరుతారు. సత్త్వగుణం కల వ్యక్తులు సుఖంకోసం దేవలోకానికి వెళ్తారు. సమధికమైన, కేవలం పాపకర్మల ఫలస్వరూపమైన జీవులు పశువులు, పక్షులు మొదలైన తిర్యగ్జాతులను చేరుతారు. పుణ్యపాపాలు రెండింటి కలయిక వలన మానవలోకం లభిస్తుంది. పుణ్యం మాత్రమే ఉన్న ప్రాణులు దేవజాతిని పొందుతారు. ఈ రీతిగా జ్ఞానులు ప్రకృతి వల్ల జనించిన పదార్థాలను క్షరాలు అంటారు. పైన చెప్పిన ఇరవైనాలుగు తత్త్వాలకంటే భిన్నమైన ఇరువది ఐదవ తత్త్వాన్ని పరమాత్మ అన్నారు. ఆ తత్త్వమే అక్షరం. జ్ఞానం వలననే ఆ తత్త్వప్రాప్తి కలుగుతుంది.'

303. జీవలక్షణవివరణము.

వసిష్ఠుడు చెపుతున్నాడు. 'రాజా ! ఈ విధంగా జీవుడు జ్ఞానహీనుడు కావటం వల్ల అజ్ఞానాన్నే అనుసరిస్తాడు. ఇందువల్ల అతడు ఒక శరీరం నుంచి వేలశరీరాల్లో తిరగవలసి వస్తుంది. త్రిగుణాల సంబంధం ఉండడంవల్ల, ఆ గుణాల సామర్థ్యం వల్లనే ఒకప్పుడు వేలకొలది తిర్యగ్జాతులలో, ఇంకొక మారు దేవతలలో జన్మిస్తాడు. ఒకప్పుడు మానవ జన్మనుండి స్వర్గానికి వెళ్తాడు. ఇంకొకప్పుడు స్వర్గం నుంచి మానవలోకానికి తిరిగివస్తాడు. మనుష్యలోకం నుంచి అప్పుడప్పుడు అనంతమైన నరకాలలోకి వెళ్తాడు. పట్టుపురుగు తానే తయారుచేసిన దారాలతో అన్ని వైపుల తనను బంధించుకొన్నట్లు, నిర్గుణమైన ఈ ఆత్మకూడా తననుంచే వ్యక్తం అయిన ప్రాకృతాలైన గుణాలతో బంధింపబడుతుంది. ఆత్మ సహజంగా సుఖదుఃఖాదులైన ద్వంద్వాలు లేనిదైనా భిన్నభిన్నమైన జన్మలెత్తి సుఖదుఃఖాలను అనుభవిస్తుంటుంది. దానికి ఒకప్పుడు తలనొప్పి కలుగుతుంది. ఇంకొకప్పుడు కంటిబాధ, మరొకప్పుడు పంటినొప్పి, వేరొకప్పుడు మెడనొప్పి కలుగుతూ ఉంటాయి. ఇలాగే జలోదరవ్యాధి, దప్పికరోగం, జ్వరం, గొంతునొప్పి, కలరా, తెల్లబొల్లి, మంటలో కాలటం, తెల్లమచ్చలు, దగ్గు, మూర్ఛ మొదలైన రోగాలు వస్తాయి. ఇంకా అనేకవిధాలైన ప్రాకృతాలైన రోగాలు, ద్వంద్వాలు, చిత్ర విచిత్రాలైన రోగాలు శరీరధారులకు కలుగుతుంటాయి. ఆత్మ ఇవి అన్నీ తనపైన పడిన వని భావిస్తాడు. జీవుడు ఒకప్పుడు తాను వేలకొలది తిర్యగ్జంతువులుగా, ఇంకొకప్పుడు దేవత్వాభిమానాన్ని పొందినవానినిగా భావిస్తాడు. ఈ అభిమానం వలననే ఆయనశరీరాలతో చేసే కర్మల ఫలితాన్ని కూడా అనుభవిస్తాడు.

ఏదో ఫలితాన్ని సాధించాలి అనే ఆశతో బద్ధుడైన మానవుడు ఒకప్పుడు కొత్తవి, ఇస్త్రీచేసిన తెల్లని వస్త్రాలు ధరిస్తాడు. ఇంకొకప్పుడు పాతవి, చినిగినవి, మాసినవి ధరిస్తాడు. ఇంకొక తడవ నేలమీద పడుకొంటాడు. మరొకప్పుడు కప్పలాగా చేతులు, కాళ్ళు ముడుచుకొని పడుకొంటాడు. వేరొకప్పుడు వీరాసనంలో కూర్చుంటాడు. ఇంకొకసారి ఆరుబయట ఉంటాడు. ఒకసారి నారబట్టలను, ముదుక గుడ్డలను వేసుకొంటాడు. ఇంకొకసారి ఇటుకలమీద, రాళ్ళమీద కూచుంటాడు, పడుకొంటాడు. మరొకసారి ముళ్ళపక్కమీద, వేరొకసారి బూడిద మీద శయనిస్తాడు. ఒకతడవ భూమి మీద పడుకొంటాడు. ఇంకొక తడవ చెట్టు కింద ఉంటాడు. యుద్ధభూమిలో ఒకమారు, నీళ్ళల్లో ఒకమారు, బురదలో ఒక మారు, చెక్కపలకలమీద వేరొకమారు, ఇంకా నానావిధాలైన పడకలమీద నిద్రిస్తాడు. ముంజగడ్డి మొలత్రాడు కట్టుకొని గోచీ పెట్టుకొంటాడు. ఒక సారి నగ్నంగా తిరుగుతాడు. ఒక తడవ పట్టుబట్టలను, ఇంకొకతడవ జింకచర్మాన్ని కట్టుకొంటాడు. ఒకప్పుడు నారబట్టలను, ఇంకొకప్పుడు ఉన్నిబట్టలను, మరొకప్పుడు పులితోలును, సింహచర్మాన్ని, పట్టువస్త్రాన్ని ధరిస్తాడు. భూర్జపత్ర వస్త్రాలను, ఒకప్పుడు సాధారణ వస్త్రాలను, ఇంకొకసారి ముళ్ళబట్టలను ధరిస్తాడు. పట్టు బట్టలను, మరి ఒకసారి మొద్దు బట్టలను ధరిస్తాడు. అజ్ఞాని అయిన ఆ జీవుడు ఇవేకాక ఇంకా ఇతరమైన నానావిధ వస్త్రాలను ధరిస్తాడు. చిత్రాతిచిత్రమైన ఆహారాలను రుచిచూస్తాడు. అనేకవిధాలయిన రత్నహారాలను ధరిస్తాడు.

అప్పుడప్పుడు ఒకరాత్రి ఎడం ఇచ్చి భోజనం చేస్తాడు. ఒకసారి ఒకపూట మాత్రమే ఆహారం తీసుకొంటాడు. ఇంకొకసారి రోజులో నాలుగోజాములో గాని, ఆరవజాములో గాని, ఎనిమిదవ జాములో గాని భోజనం చేస్తాడు. ఒకమారు ఆరురోజులకు ఒకసారి, ఇంకొకమారు ఏడురాత్రులకు ఒకసారి, ఎనిమిది రాత్రులకు ఒకసారి మరొక తడవ, పదిరాత్రులకు, వేరొక తడవ, పన్నెండురాత్రులకు భోజనం చేస్తాడు. ఒకప్పుడు ఒకనెల ఉపవాసం ఉంటాడు. ఇంకొకప్పుడు పండ్లు మాత్రమే తింటాడు. మరొకప్పుడు కందమూలాలతో గడుపుతాడు. వేరొకప్పుడు నీరు, గాలి మాత్రమే స్వీకరిస్తాడు, ఒకసారి తెలికపిండిని, ఇంకొకసారి పెరుగును, మరొకసారి గోమయాన్ని తిని ఉంటాడు. అతడు ఒకతడవ గోమూత్రం మాత్రమే స్వీకరిస్తాడు. ఇంకొక తడవ కూరలను, పూలను లేక నాచును (శైవాలం) భుజిస్తాడు. ఇంకొకప్పుడు ఆచమనం మాత్రం చేస్తాడు.

ఒకసారి ఎండుటాకులను, చెట్లనుండి క్రిందపడిన పండ్లను తిని ఉంటాడు.

ఈవిధంగా లక్ష్యసిద్ధిని సాధించాలి అనే కోరికలో అతడు అనేక విధాలయిన కఠిననియమాలను అనుసరిస్తాడు. ఒకతడవ యథావిధిగా చాంద్రాయణవ్రతాన్ని చేస్తాడు. అనేకమైన ధర్మసూచక చిహ్నాలను ధరిస్తాడు. ఒకప్పుడు బ్రహ్మచర్యాది చతురాశ్రమాల పద్ధతిలో ప్రవర్తిస్తాడు. ఇంకొక సారి వీటికి అన్నింటికి భిన్నంగా ప్రవర్తిస్తాడు. ఒకప్పుడు పాశుపత పాంచరాత్రాదులైన ఉపాశ్రమాలను, ఇంకొకప్పుడు నానావిధాలైన పాషండరీతులను ఆశ్రయిస్తాడు. ఒకప్పుడు ఏకాంతంలో పెద్ద రాళ్ళనీడలో కూచుంటాడు. ఇంకొకప్పుడు సెలయేళ్ళప్రక్కన ఉంటాడు. ఒకసారి ఏకాంతనదీ తీరాలలో, ఇంకొకసారి నిర్జన వనాలలో, మరొకసారి పవిత్ర దేవాలయాలలో, వేరొకసారి సరస్సుల తీరంలోని ఏకాంత ప్రదేశాలలో ఉంటాడు. ఒకసారి ఏకాంత పర్వత గుహలలో – అవీ ఇండ్లవలె ఉండే వాటిలో ఉంటాడు. ఆ ప్రదేశాలలో అనేక రహస్య జపాలు, వ్రతాలు, నియమాలు, తపస్సులు, యజ్ఞాలు, నానావిధకర్మలు ఆచరిస్తాడు. ఒకప్పుడు వర్తకం చేస్తాడు. ఇంకొకప్పుడు బ్రాహ్మణ క్షత్రియ కర్మలను చేస్తాడు. ఇంకొకప్పుడు వైశ్యశూద్ర కర్మలను ఆశ్రయిస్తాడు. ఇంకొకసారి అనాథులకు, అంధులకు, దీనులకు దానం చేస్తాడు. అజ్ఞానం వల్ల అతడు తనలో ఉన్న సత్త్వం, రజస్సు, తమస్సు అనే త్రిగుణాలను, ధర్మార్థకామాలను అభిమానిస్తాడు.

ఈ ప్రకారంగా తన ప్రకృతిద్వారా తనస్వరూపాన్నే అనేక విభాగాలు చేసుకొంటాడు. అతడు ఒకసారి స్వాహాకారాల్లో, ఇంకొకసారి స్వధాకారాల్లో, వేరొకసారి వషట్కారాల్లో, మరొకసారి నమస్కారాల్లో ఆసక్తు డవుతాడు. ఒకప్పుడు యజ్ఞం చేయిస్తాడు. ఇంకొకప్పుడు వేదాధ్యయనం చేస్తాడు. ఇంకొకసారి అధ్యాపనం చేస్తాడు. ఒకసారి దానం చేస్తాడు. ఇంకొకసారి దానం తీసుకొంటాడు. ఒకసారి జన్మిస్తాడు, ఇంకొకసారి మరణిస్తాడు. ఒకప్పుడు పోట్లాడుతాడు, ఇంకొకప్పుడు యుద్ధంలో పాల్గొంటాడు. ఇవి అన్నీ శుభాశుభాలయిన కర్మమార్గాలని విద్వాంసులు చెపుతారు. ప్రకృతిదేవియే లోక సృష్టిప్రళయాలను నిర్వహిస్తుంది. ప్రతిరోజూ సూర్యుడు ప్రాతఃకాలంలో తనకిరణాలను అన్నివైపులా వ్యాపింపజేసి సాయంకాలం ఉపసంహరించినట్లు ఆదిపురుషుడైన బ్రహ్మ తన పగటిపూట – అంటే కల్పారంభంలో గుణత్రయాన్ని విస్తరింపజేస్తాడు. కల్పాంతంలో సమస్తం ఉపసంహరిస్తాడు. ఈ ప్రకారంగా ప్రకృతితో గూడి ఉన్న పురుషుడు తత్త్వజ్ఞానం కలగటానికి పూర్వం మనస్సుకు ఇష్టమైన నానావిధాలైన పనులను క్రీడార్థం మాటిమాటికి చేస్తూ అది తన కర్తవ్యంగా భావిస్తాడు. సృష్టి ప్రళయాలు తనధర్మమైన త్రిగుణాత్మక ప్రకృతిని వికృతిని (మార్పులు గల దానిని) చేసి, త్రిగుణాధిపతి అయిన ఆత్మ కర్మమార్గంలో ఆసక్తుడు, ప్రవృత్తుడు అవుతూ ఆ

ప్రకృతి వల్ల ఏర్పడే త్రిగుణాత్మకమైన కార్యాన్ని ప్రతిదాన్ని తనదిగా భావిస్తాడు. రాజా ! ప్రకృతి ఈజగత్తును అంతా గ్రుడ్డిదానిని చేసింది. దానితో సంబంధం వలననే అన్ని పదార్థాలు అనేక రీతులుగా రజోగుణ తమోగుణాలతో వ్యాపిస్తున్నాయి.

ఈ విధంగా ప్రకృతి ప్రేరేపించటం వలన సహజంగా సుఖదుఃఖాదులైన ద్వంద్వాలు ఎల్లప్పుడు మాటిమాటికి ఆవృత్తి చెందుతూ ఉంటాయి. కాని జీవాత్మ అజ్ఞానంవలన "ఈ ద్వంద్వాలు అన్నీ నామీదనే దాడిచేస్తున్నాయి. నేను వీటినుంచి బయటపడటానికి తగిన ప్రయత్నం చెయ్యాలి" అని అనుకొని దుఃఖవశుడు అవుతాడు. రాజా ! ప్రకృతితో గూడిన పురుషుడు అజ్ఞానంవల్ల "నేను దేవలోకానికి వెళ్ళి నా సమస్త పుణ్యఫలాలను అనుభవిస్తాను. పూర్వజన్మలో చేసిన మంచి చెడు పనుల ఫలితం ఇప్పుడు వస్తున్నదానిని ఇక్కడనే అనుభవిస్తాను" అనుకొంటాడు. 'ఇప్పుడు నేను సుఖానికి సాధనమైన పుణ్యకర్మలనే చేయాలి. వాటిని ఒక్కసారి అనుష్ఠించేటట్లయితే నాకు యావజ్జీవం సుఖం కలుగుతుంది. ఇకముందు రాబోయే జన్మలలో కూడా సుఖమే కలుగుతుంటుంది. ఈ జన్మలో నేను దుష్కర్మలు చేస్తే ఇక్కడకూడా అనంతమైన దుఃఖాలు పొందవలసి ఉంటుంది. ఈ మానవజన్మ మహత్తర దుఃఖపూర్ణం. ఇంతేకాక పాపఫలంగా నరకంలో మునిగిపోవలసి వస్తుంది. నరకాన్నుంచికూడా చాలా కాలం తరువాత విముక్తి పొంది, నేను మళ్ళీ మర్త్యలోకంలో జన్మిస్తాను. మానవజన్మనుంచి పుణ్యఫలంగా దేవజన్మ పొందుతాను. అక్కడ పుణ్యానుభవం పూర్తి అయిన తరువాత మళ్ళీ మానవజన్మ పొందుతాను. (అని అనుకొంటాడు). ఈ రీతిగా జీవుడు మాటిమాటికి మానవజన్మనుంచి నరకంలోకి, నరకం నుంచి మానవ జన్మలోకి రాకపోకలు చేస్తుంటాడు. ఆత్మాతిరిక్తాలు, ఆత్మగుణాలైన చైతన్యాదులతో గూడిన ఇంద్రియాల సముదాయం అయిన శరీరమే నేను అనుకొంటూ దేవలోకం, మానవలోకం, తిర్యగ్జన్మలను పొందుతుంటాడు. భార్యాపుత్రాదుల మీద కలిగే మమకారానికి బద్ధుడై, వారి సంసర్గంలో ఉంటూ వేల వేలకోట్ల సృష్టుల వరకు అశాశ్వతమైన శరీరాలలోనే ఎల్లప్పుడు తిరుగుతూ ఉంటాడు. ఈ రీతిగా పుణ్యపాప ఫలితాలను ఇచ్చే కర్మలు చేసేవాడే మూడులోకాలలో శరీరాలను ధరించి, పైన చెప్పిన ఫలాలను పొందుతాడు.

వాస్తవానికి ప్రకృతియే పుణ్యపాప ఫలాలను ఇచ్చే కర్మలను చేస్తుంది. ముల్లోకాల్లో స్వేచ్ఛగా సంచరించే ఆ ప్రకృతియే ఆ కర్మఫలాలను అనుభవిస్తుంది. (కాని పురుషుడు అజ్ఞానంవల్ల కర్త-భోక్త (చేసేవాడు - అనుభవించేవాడు) తానే అనుకొంటాడు). తిర్యగ్జన్మ, మానవజన్మ, దేవలోకంలో దేవతా జన్మ అనే మూడు జన్మలు కర్మఫలాన్ని అనుభవించటానికి

మూడుస్థానాలు. ఇవి అన్నీ ప్రాకృతాలు అని తెలుసుకో. మహామునులు ప్రకృతిని లింగరహితంగా చెపుతారు. కాని మనం విశేష హేతువులతోనే అనుమాన ప్రమాణంతో తెలుసుకొంటాము. అలాగే అనుమాన ప్రమాణంతోనే పురుష స్వరూపాన్ని - పురుషుని ఉనికిని తెలుసుకొంటాము. పురుషుడు స్వతహాగా ఛిద్ర (రంధ్ర) రహితుడైనా, ప్రకృతి నిర్మించిన చిహ్నాలు స్వరూపంలో ఉన్న విభిన్నమైన శరీరాలను ఆలంబనం చేసుకొని, ఛిద్రాలలో ఉండే ఇంద్రియాలకు అధిష్ఠానమై, ఆ కర్మ లన్నింటినీ తన వాటినిగా భావిస్తాడు. ఈ లోకంలో శ్రోత్రాదులైన ఐదు జ్ఞానేంద్రియాలు, రాగాదులైన ఐదు కర్మేంద్రియాలు తమతమ గుణాలతో కలిసి గుణమయమైన శరీరంలో ఉంటాయి. వస్తుతః జీవుడు ఇంద్రియ రహితుడైనా నేనే 'అన్నిపనులు చేస్తున్నాను. నాలోనే ఇంద్రియాలు అన్నీ ఉన్నవి,' అని ఛిద్రశూన్యుడైనా తనను ఛిద్రయుక్తునిగా భావిస్తుంటాడు. ఆ జీవుడు లింగ (సూక్ష్మ) శరీరరహితుడైనా తాను వానితో కూడిఉన్నా నని అనుకొంటాడు. కాలధర్మం (మృత్యువు) లేనివాడైనా తనను కాలధర్మం (మరణశీలం) కలవానినిగా భావిస్తాడు. సత్త్వభిన్నుడైనా తనను సత్త్వరూపునిగా తలుస్తాడు. మహాభూతాది తత్త్వరహితుడైనా తనను తత్త్వరూపునిగా తలుస్తాడు. మృత్యురహితుడైనా మృత్యువు కలవానినిగాను, అచరు (చలనాదులులేనివా)డైనా చలనం గలవానిగాను, క్షేత్ర (శరీర) భిన్నుడైనా క్షేత్రంగాను, సృష్టితో ఎలాంటి సంబంధం లేకున్నా తానే సృష్టికర్త నని అనుకొంటాడు. ఆ జీవుడు ఎప్పుడూ తపస్సుచేయడు. అయినా తనను తపస్విగాను, గమన రహితుడైనా గమనం గలవానినిగాను, సంసార రహితుడైనా సంసారవంతునిగాను, భయరహితుడైనా భీతునిగాను, భావిస్తుంటాడు. బుద్ధికి అతీతుడు అయినా బుద్ధియుక్తు డనని అభిమానవంతుడుగా ఉంటాడు.'

304. ప్రకృతి సంసర్గమువలన జీవుని పతనము.

వసిష్ఠమహర్షి చెపుతున్నాడు. "రాజా ! ఈ రకంగా అజ్ఞానం వలన, అజ్ఞానుల సాహచర్యంవలన జీవుడు నిరంతరం పతనం పొందుతుంటాడు. అంతేకాక వేలకోట్ల సార్లు జన్మలు పొందుతాడు. అతడు పశువులు, పక్షులు, మనుష్యులు, దేవతలు మొదలైన జన్మలతో ఒక స్థానంనుంచి వేల స్థానాలలో పలుమారులు మరణిస్తుంటాడు, పుడుతుంటాడు. చంద్రునికి వేలసార్లు క్షయం, వృద్ధి కలిగినట్లు అజ్ఞాని అయిన జీవునికి కూడా, అజ్ఞానం వల్లనే వేలసార్లు మరణించటం, జన్మించటం కలుగుతాయి. చంద్రునికి పదిహేను కళలవలెనే, జీవులకు గూడా పదిహేను కళలే ఉత్పత్తిస్థానాలు. అజ్ఞాని అయిన జీవుడు అవే తనకు

ఆశ్రయం అని అనుకొంటాడు. కాని ఆతనికి గల పదహారవ కళ నిత్యం అని తెలుసుకో. అది చంద్రుని అమా అనే కళతో సమానం అవుతుంది. అజ్ఞాని అయిన జీవుడు, మాటిమాటికి ఆ కళలనే ఆశ్రయించి జన్మిస్తాడు. ఆ కళలే జీవుడు ఆశ్రయించదగినవి. కాబట్టి జీవునికి, వాటివల్లనే మళ్ళీ మళ్ళీ పుట్టుక కలుగుతుంది. అమా అని పేరుగల సూక్ష్మమైన పదహారవ కళ సోమరూపం - అంటే జీవుని ప్రకృతి అని నీవు నిశ్చయంగా గుర్తించు. దేవతలు - అంటే మనోబుద్ధి చిత్తాహంకారాలు అనే అంతఃకరణచతుష్టయమూ, జ్ఞానేంద్రియ కర్మేంద్రియాలు పదీ జీవునికి పదిహేను కళలు. అవి పదహారవ కళను ఉపయోగించలేవు. అదే - అంటే వాటికి అన్నింటికి కారణమైన ప్రకృతియే వాటిని ఉపయోగించుకొంటుంది.

రాజేంద్రా ! జీవుడు అజ్ఞానంవల్ల ఆ పదహారో కళారూపమైన ప్రకృతితో సంయోగాన్ని క్షయింపజేయలేడు. అందువలనే మాటిమాటికి పుడుతుంటాడు. ఆ కళయే జీవుని ప్రకృతి - అంటే ఆ కళయే ఉత్పత్తికి కారణం అవుతుంది. ఆ సంయోగం క్షయమైతేనే జీవునికి మోక్షం కలుగుతుంది. మూలప్రకృతి, పది ఇంద్రియాలు, ప్రాణం ఒకటి, అంతఃకరణ చతుష్టయం అనే పదహారింటితో గూడిన ఈ సూక్ష్మశరీరం నాది అనుకొనటం వల్లనే అజ్ఞాని అయిన జీవుడు వాటిలోనే గిరగిరా తిరుగుతుంటాడు. ఇరువది అయిదవది అయిన మహత్తరమైన ఆత్మ నిర్మలం, శుద్ధం. దానిని తెలుసుకోలేక పోవటంవలన, అపవిత్ర వస్తువులను ఉపయోగించటం వలన నిర్మలమూ, ఎలాంటి సంగమూ లేని ఆత్మగూడ శుద్ధాశుద్ధ వస్తువులతో సమానం అవుతుంది. రాజా ! అవివేకుల సహవాసం వలన వివేక వంతుడు గూడా అవివేకి అయిపోతాడు. రాజశ్రేష్ఠా ! ఇలాగే మూర్ఖుడుగూడా వివేకవంతుని సాంగత్యం వలన వివేకశీలి అవుతాడు అని తెలుసుకో. త్రిగుణాత్మకమైన ప్రకృతితో సంబంధంవలన, ఆత్మకూడా త్రిగుణమయం అవుతుంది."

305. ప్రకృతి పురుష స్వరూప సంబంధ వివరణము.

జనకమహారాజు చెపుతున్నాడు. "మహాత్మా ! క్షర - అక్షర సంబంధం - ప్రకృతి పురుషుల సంబంధం స్త్రీ పురుషుల దాంపత్యం వంటిదే అని చెప్పవచ్చును గదా ! ఈ మానవలోకంలో పురుషుడు లేక స్త్రీ గర్భధారణం చేయలేదు. అలాగే స్త్రీ లేకుండా ఏ పురుషుడు కూడా శరీరాన్ని ఉత్పన్నం చేయలేడు. ఇద్దరి సంబంధంవలన, పరస్పరం గుణాలను ఆశ్రయించిమాత్రమే, ఏదైనా శరీరం నిర్మాణం అవుతుంది. దాదాపు

అన్నిజాతులలోను ఇదే స్థితి ఉంటుంది. **ఋతుమతి అయిన సమయంలో స్త్రీకి పురుషునితో రతిసంబంధం కలగటంవలన ఇద్దరిగుణాలు కలియగా శరీరం ఏర్పడుతుంది. తండ్రి, తల్లి శరీరాలలో ఉన్న గుణాలను దృష్టాంతంతో చెపుతాను. సంతతికి ఎముకలు, వాని సారం - మూలుగు, సన్నని నరాలు తండ్రినుండి ఏర్పడుతాయి. చర్మం మాంసం, రక్తం తల్లివలన ఏర్పడుతాయి - అని నేను విన్నాను. ఇదే వేదశాస్త్రాలలో ఉన్నది.** వేదాలు ప్రమాణంగా చెప్పినదీ, శాస్త్రాలలో చదివినదీ, లోకంలో విన్నదీ ఒకటే. వేదశాస్త్రాలు సనాతనమైన ప్రమాణాలు గదా ! ఈ విధంగానే ప్రకృతి పురుషులు పరస్పరం గుణాలను ఆచ్ఛాదించి, ఒకరిగుణాలను ఇంకొకరు ఆశ్రయించే సృష్టి చేస్తారు. ఈ రీతిగా ఇవి ఒకదానితో ఇంకొకటి బంధింపబడినట్లు కన్పిస్తాయి. కాబట్టి మానవునికి మోక్షం అసంభవం అని అనిపిస్తుంది.* లేక పురుషునికి మోక్షాన్ని కలిగించటం తెలిపే దృష్టాంతం ఏదైనా ఉంటే వివరించ గోరుతాను. సమస్తవిషయాలు మీకు ప్రత్యక్షం కాబట్టి ఈ విషయం స్పష్టంగా చెప్పవలసింది. నాకు మోక్షం అంటే అభిలాష ఉంది. ఆ పరమపదాన్ని పొందాలని అనుకొంటున్నాను. నిర్వికారం, నిరాకారం, ముసలితనం లేనిది, మరణంలేనిది, నిత్యమూ, ఇంద్రియా తీతమూ అయిన దానిని పొందిన వ్యక్తిని శాసించేవాడు ఎవడూ ఉండడు."

వసిష్ఠుడు చెప్పాడు. "రాజా ! వేదాల, శాస్త్రాల దృష్టాంతంతో నీవు చెప్పింది సరి అయినదే. నీకు తెలిసినది సరి అయినదే. నరాధిపా ! వేదశాస్త్రాలు రెండింటిలో ఉన్న విషయాలను నీవు బాగా ధారణ చేశావు. అది అంతా నీకు బాగా గుర్తున్నది. కాని ఆ గ్రంథాల యథార్థతత్త్వ జ్ఞానం నీకు సరిగా లేదు. **వేదశాస్త్ర గ్రంథాల ధారణమాత్రమే లక్ష్యంగా గలవాడు, వాటి యథార్థమైన తత్త్వాన్ని తెలుసుకొనలేకపోతే ఆ ధారణ వ్యర్థం అవుతుంది.** గ్రంథార్థాన్ని సమగ్రంగా తెలుసుకోకుండా, కేవలం వల్లించటం ఆ గ్రంథభారాన్ని మోయటమే అవుతుంది. గ్రంథార్థం బాగా తెలుసుకొన్నవారి గ్రంథాధ్యయనం వ్యర్థం కాదు. అలా బాగా తెలుసుకొన్న వానిని అడిగితే, తనకు చక్కగా అర్థమయినది అంతా ఇతరులకు అర్థమయ్యేటట్లు చెప్పగలడు. మందబుద్ధి కావటంవలన, అతడు

---

* *వి॥ పురుషుడు ప్రకృతిలోని జడత్వాన్ని ఆచ్ఛాదించి దాని దుఃఖాన్ని ఆశ్రయంగా తీసుకొంటాడు. అలాగే ప్రకృతి పురుషుని ఆనందగుణాన్ని ఆచ్ఛాదించి, ఆతని చైతన్యగుణాన్ని ఆశ్రయిస్తుంది. అంటే - ప్రకృతిలో సంయోగంవలన, పురుషుడు ఆనందరహితుడు అయి దుఃఖం గలవాడు అవుతాడు. ప్రకృతి పురుషుని సంయోగంవలన తన జడత్వాన్ని విస్మరించి, చేతనంగలదాని లాగా పనులు చేయసాగుతుంది.*

పండిత సభలో శాస్త్రగ్రంథార్థాన్ని విడమర్చి చక్కగా చెప్పలేడు. అలాంటప్పుడు అతడు ఆ గ్రంథ తాత్పర్యాన్ని ఎలా చెప్పగలడు ? శాస్త్రజ్ఞాన శూన్యుడైనవాడు ఆ గ్రంథోద్దేశ్యాన్ని సరిగా నిర్ణయం చేయలేడు. అతడు ఎంత తెలివికలవాడైనా, అభిమానవంతుడైనా లోకుల వెక్కిరింపులకు గురి అవుతాడు. కాబట్టి రాజేంద్రా ! సాంఖ్య శాస్త్రజ్ఞులైన మహాత్ముల సిద్ధాంతం ప్రకారం మోక్షస్వరూపం ఎలా కన్పిస్తుందో అది యథార్థరూపంగా నీకు చెపుతాను. **యోగశాస్త్రజ్ఞులు సాక్షాత్కరించుకొన్న తత్త్వాన్నే సాంఖ్యశాస్త్రజ్ఞులు గూడా అనుసరించారు. సాంఖ్యయోగశాస్త్రాలు ఫలితం దృష్టిలో ఒకటే అని తెలుసుకున్నవాడే మేధావి.*** చర్మం, మాంసం, మేదస్సు, పిత్తం మజ్జ, స్నాయువు, ఇంద్రియాలు - ఇవి అన్నీ తల్లిదండ్రులనుంచి ప్రాణికి వస్తాయని నీవు ఇంతకుముందు చెప్పావు. ఒకబీజం నుంచి వేరొక బీజం ఉత్పన్నం అయినట్లుగానే ద్రవ్యంవల్ల ద్రవ్యమూ, ఇంద్రియాలవల్ల ఇంద్రియాలు, దేహాలవల్ల దేహాలు ఏర్పడతాయి. కాని పరమాత్మ ఇంద్రియాలు, బీజం, దేహం లేనివాడు, నిర్గుణుడు. కాబట్టి ఆయనలో గుణాలు ఎలా ఉంటాయి?

ఆకాశాది గుణాలు సత్త్వాదిగుణాలవల్ల ఉత్పత్తినంది, వానిలోనే లీనం అయినట్లు, సత్త్వరజస్తమస్సులు అనే మూడుగుణాలు కూడా ప్రకృతి వల్లనే కలుగుతాయి. చర్మం, మాంసం, రక్తం, మేదస్సు, పిత్తం, మజ్జ, ఎముకలు, స్నాయువు అనే ఎనిమిది వీర్యం వల్ల ఏర్పడతాయి. కాబట్టి ఇవి ప్రాకృతాలు అని తెలుసుకో. పురుష ప్రకృతులు రెండుతత్త్వాలు. వీటిస్వరూపాన్ని వ్యక్తం చేసే సాత్త్విక రాజస తామసికములు అనే మూడు చిహ్నాలు అన్నీ ప్రాకృతాలు అని భావించారు. కాని లింగి అని చెప్పబడే ఆత్మ పురుషుడు కాడు, ప్రకృతి కాదు. ప్రకృతి పురుషుల కంటె విలక్షణుడు. ఎల్లప్పుడు నిరాకారంగా ఉండే ఋతువులను పూలు, పండ్లుచూసి గుర్తించినట్లు, నిరాకారుడైన పురుషుని సంయోగం పొంది, తనవల్ల ఉత్పన్నం అయ్యే మహత్తత్త్వాది చిహ్నాలతో ప్రకృతిని గుర్తించవచ్చు. ఈ రీతిగా చిహ్నాలకంటే - అంగాల కంటే భిన్నమైన శుద్ధచేతనరూపమైన ఆత్మనుకూడా అనుమాన ప్రమాణంతో తెలుసుకోవచ్చు. దృశ్యాన్ని ప్రకాశంతో తెలుపటానికి కారణం అయిన సూర్యుడు దృశ్యానికంటే భిన్నుడు అయినట్లు, జ్ఞాన స్వరూపమైన ఆత్మకూడా తెలియదగిన వస్తువును ప్రకాశితం చేయటం వల్ల, వాటికంటే భిన్నమైన సత్త (ఉనికి) కలిగి ఉంటుంది. అన్ని లింగాలలో నియతరూపంలో వ్యాప్తమయి ఉండే ఇరువది అయిదవ

---

* *వి॥ ఫలంలో, సాధనాలలో యోగసాంఖ్య శాస్త్రాలలో ఐక్యం ఉంది వ్యవహార ప్రతిపాదనంలో వాటికి విరోధం ఉన్నా అది అంతగా గణింపదగినది కాదు అనిభావం.* (నీల)

తత్త్వం అవుతుంది. ఆత్మ జననమరణాలు లేనిది, అనంతం, సర్వద్రష్ట, నిర్వికారం, అది సత్త్వాదిగుణాలతో కేవలం అభిమానం కలిగిఉండటం వలననే గుణస్వరూపం అని చెపుతారు. గుణవంతునిలోనే గుణాలు ఉంటాయి. నిర్గుణమైన ఆత్మలో గుణాలు ఎలా ఉంటాయి ? జీవాత్మ ఈ గుణాలను ప్రకృతికార్యాలనుగా తెలుసుకొని, వాటిపైన తనకు ఉన్న అభిమానాన్ని త్యజించినప్పుడు, దేహాదులను తాను అనుకోవటం మాని, తన స్వచ్ఛమైన పరమాత్మ స్వరూపాన్ని సాక్షాత్కరింపజేసుకొంటాడు. సాంఖ్య యోగ శాస్త్రాలలో పారంగతులైన విద్వాంసులు పరతత్త్వాన్ని బుద్ధికి అతీతమైన దానినిగా చెపుతున్నారు. అది పరమ జ్ఞానసంపన్నం. అహంకారం మొదలైన జడతత్త్వాలను పరిత్యజించినా మిగిలిఉంటూ చిన్మయ, తత్త్వరూపంలో కనిపిస్తుంది. ఇది అజ్ఞాతమూ, అవ్యక్తమూ, సగుణమైన ఈశ్వరుడు, నిర్గుణమైన ఈశ్వరుడూ, నిత్యుడూ, అధిష్ఠాత అని చెప్పబడుతూ ప్రకృతి, దానిగుణాలు – అది ఇరవైనాలుగు తత్త్వాలకంటే అతీతతమైన ఇరవై అయిదవ తత్త్వం. ఈవిధంగా సాంఖ్య యోగ శాస్త్రాలలో నిపుణులు, పరతత్త్వాన్ని అన్వేషించే విద్వాంసులు భావిస్తారు.

బాల్య యౌవన వార్ధకాలకు లేక జనన మరణాలకు భయపడే వివేకవంతులు, చేతన స్వరూపమైన అవ్యక్త పరమాత్మతత్త్వాన్ని చాలా చక్కగా తెలుసుకొన్నప్పుడు వారికి పరమాత్మ స్వరూప ప్రాప్తి కలుగుతుంది. రాజా ! జ్ఞానులైనవారి ఈ జ్ఞానం యుక్తియుక్తం కావటం వలన ఉత్తమమై, అజ్ఞానుల ఉద్దేశ్యాని కంటే వేరైనది. దీనికి భిన్నమైన అజ్ఞానుల ప్రమాణరహితమైన జ్ఞానం యుక్తి యుక్తం కాదు. కాబట్టి సరియైనది కాదు. ఇది వెనక చెప్పిన సమ్యక్‌జ్ఞానం కంటే భిన్నం అయినది. క్షరం, అక్షరం తత్త్వాలను ప్రతిపాదించే ఈ దర్శనం నీకు చెప్పాను. ఎల్లప్పుడూ ఏకరూపంలో ఉండే పరమాత్మ తత్త్వాన్ని అక్షరం అని అంటారు. నానారూపంగా కనిపించే ప్రాకృతమైన ప్రపంచాన్ని క్షరం అని చెపుతారు. ఇదే క్షరానికి, అక్షరానికి ఉండే తేడా. ఈ పురుషుడు ఇరవై అయిదవ తత్త్వమైన పరమాత్మలో ఉన్నప్పుడు ఆతనిస్థితిని ఉత్తమమని చెప్పారు. అతడు సరిగా ప్రవర్తిస్తాడు అని అభిప్రాయపడతారు. ఏకత్వబోధయే జ్ఞానం, నానాత్వబోధయే అజ్ఞానం. తత్త్వం, క్షరం, నిస్తత్త్వం (అక్షరము) ఇవి భిన్నభిన్న లక్షణాలుగా తెలుసుకోవాలి. కొంతమంది విద్వాంసులు ఇరవై అయిదు తత్త్వాలనూ తత్త్వా లనే వ్యవహరిస్తారు. కాని మరి కొంతమంది విద్వాంసులు ఇరవైనాలుగు జడతత్త్వాలను తత్త్వాలనీ, చేతనమైన పరమాత్మను నిస్తత్త్వం (తత్త్వభిన్నం) అనీ చెప్పారు. ఆ చైతన్యమే పరమాత్మ లక్షణం. మహత్తత్త్వాదులైన వికారాలు (మార్పుకలవి) క్షరతత్త్వాలు. పరమాత్మ ఆ క్షరతత్త్వాలకంటే భిన్నుడైన సనాతనుడు."

306. యోగ సాంఖ్య స్వరూప కథనము.

జనకుడు అడిగాడు. "మునిశ్రేష్ఠా ! క్షరం అనేక రూపమనీ, అక్షరం ఏకరూపమనీ చెప్పారు మీరు. కాని ఈ రెండింటి పైన చేసిన నిర్ణయాన్ని నేను ఇంకా సందేహ దృష్టితోనే చూస్తున్నాను. అజ్ఞానులు అనేక రూపంగాను, జ్ఞానులు ఏకరూపం గాను తెలుసుకొన్న పరమాత్మ తత్త్వాన్ని మందబుద్ధివలన బాగా తెలుసుకోలేక పోతున్నాను. ఇందు సందేహంలేదు. క్షరాక్షరాలను అర్థంచేసుకోవటానికి మీరు అనేక విధాల విషయాలను చెప్పినా, నా బుద్ధికి నిలకడ లేకపోవటంవల్ల మీరు చెప్పిన యుక్తులను అన్నింటినీ మరచిపోయినాను. కాబట్టి ఈ నానాత్వం, ఏకత్వం అనే వాటి దర్శనాన్ని మళ్ళీ వినాలి అనుకొంటున్నాను. జ్ఞానం, అజ్ఞానం, జ్ఞేయం అంటే ఏమిటో వివరంగా చెప్పండి. మహాత్మా ! విద్య, అవిద్య, క్షరం, అక్షరం, సాంఖ్యం, యోగం అనేవాటి గూర్చి విడివిడిగా పూర్తిగా తెలుసుకోవాలి అనుకొంటున్నాను.' వసిష్ఠ మహర్షి అన్నారు. 'మహారాజా ! నీవు అడిగే ప్రశ్నలకు అన్నింటికి సంపూర్ణంగా సమాధానం చెపుతాను. ఇప్పుడు యోగ విషయాలను ప్రత్యేకించి చెపుతాను, విను. **యోగి ప్రధానంగా చేయవలసింది ధ్యానం. అదియే ఆతనికి గొప్పబలం. యోగ శాస్త్ర విద్వాంసులు ఆ ధ్యానం రెండు రకాలు అని చెప్పారు. వాటిల్లో మనస్సును ఏకాగ్రం చేయటం ఒకటి. రెండోది ప్రాణాయామం. ప్రాణాయామంలో కూడా రెండు భేదాలు ఉన్నవి. ఒకటి సగుణం, రెండోది నిర్గుణం. సగుణ ప్రాణాయామంలో సగుణంతోను, నిర్గుణప్రాణాయామంలో నిర్గుణంతోను మనస్సు ఉంటుంది.** మల మూత్ర విసర్జనం, భోజనం చేయటం అనేమూడు సమయాలలో యోగాభ్యాసం చేయరాదు. తక్కిన సమయంలో తత్పరత్వంతో యోగాభ్యాసం చేయాలి. బుద్ధిమంతుడైన యోగి పవిత్రుడై, మనస్సుతో శ్రోత్రాదులైన ఇంద్రియాదులను, శబ్దాదివిషయాల నుంచి తొలగించి ఇరవైరెండు రకాల ప్రేరణలతో 1. జరా రహితమైన జీవాత్మను - (విద్వాంసులు ఆత్మస్వరూపం అని చెప్పిన దానిని) ఇరవైనాలుగు తత్త్వాల సముదాయ రూపమైన ప్రకృతి కంటే ఇతరమైన పరమాత్మ వైపు ప్రేరేపించాలి.*

---

* *vii కుండలో నీరు నింపినట్లు, కాలి బొటనవ్రేలి దగ్గరనుంచి మూర్ధం దాకా మొత్తం శరీరంలో ముక్కుపుటాల ద్వారా గాలిని పీల్చి నింపాలి. తరువాత బ్రహ్మరంధ్రం నుంచి (మూర్ధ) వాయువును తొలగించి, లలాటంలో ఉంచాలి. ప్రాణవాయువును ప్రత్యాహారం చేయటంలో ఇది మొదటిస్థానం. ఈ రీతిగా ఉత్తరోత్తరం తొలగిస్తూ, నిలుపుతూ క్రమంగా భ్రూమధ్యం, నేత్రాలు,*

ఈ విధంగా ప్రాణాయామం చేసేవారు పరమాత్మను తెలుసుకోవటానికి అధికారులు అవుతారు అని గురువుల దగ్గర మేము విన్నాం. మనస్సు ఎల్లప్పుడూ ధ్యానంలో నిమగ్నుడైన యోగికే ఈ వ్రతం తగినది. బహిర్ముఖమైన చిత్తం కలవానికి ఇది తగదు అని నిశ్చయంగా తెలుసుకోవాలి. యోగి అన్ని విధాలయిన సంగాలను వదలి, మితాహారి, ఇంద్రియ విజేత అయి, రాత్రి మొదటిభాగంలోను, చివరిభాగంలోను మనస్సును ఆత్మతో ఏకంచేయాలి. మిథిలాధిపా ! యోగి మనస్సుతో సమస్తమైన ఇంద్రియాలను, బుద్ధితో మనస్సును స్థిరంచేసి, రాయిలాగా నిలకడగా, ఎండిన కట్టెలాగా కదలకుండా, పర్వతంలాగా స్థిరంగా ఉంటే శాస్త్రవిధానం తెలిసిన విద్వాంసులు అనుభవంతోనే ఆయనను యోగయుక్తుడు అని అంటారు. **అతడు ఏమీ వినకుండా, వాసన చూడకుండా, రుచి తెలియకుండా, చూడకుండా, స్పర్శానుభవం లేకుండా, మనస్సులో ఎలాంటి సంకల్పం లేకుండా కట్టెలాగా స్థిరుడై ఏవస్తువుమీద అభిమానం గాని, దానిని గూర్చి ఎలాంటి ఆలోచనగాని లేనివాడుగా ఉన్నప్పుడే, విద్వాంసులు ఆయనను స్వస్వరూపాన్ని పొందిన యోగి అని చెపుతారు.** ఆ సమయంలో ఆయన గాలి లేనిచోట నిశ్చలంగా జ్వలించే దీపంలాగా వెలుగొందుతాడు. లింగశరీరంతో ఆయనకు ఎలాంటి సంబంధమూ ఉండదు. పైన, క్రింద, మధ్యలో ఎక్కడాకూడా గమనం ఉండదు. ఏ సాక్షాత్కారాన్ని పొంది మానవుడు ఏమీ చెప్పలేకుండా ఉంటాడో, యోగకాలంలో యోగి ఆ పరమాత్మనే చూస్తాడు. వత్సా! నావంటి వారికి తమతమ హృదయాలలో ఉన్న అందరి అంతరాత్మజ్ఞానాన్ని పొందటం సముచితం. పొగలేని నిప్పు, కిరణావళితో అలంకృతుడైన సూర్యుడు, ఆకాశంలో మెఱుపు కనిపించినట్లుగానే ధ్యాననిష్ముడైన యోగికి తన హృదయంలో పరమాత్మదర్శనం అవుతుంది. **ధైర్యవంతులు, విద్వాంసులు, పరబ్రహ్మబోధక శాస్త్రాలలో శ్రద్ధాసక్తులు కలవారు, మహాత్ములు అయిన బ్రాహ్మణులు మాత్రమే జన్మాది రహితమూ, అమృతస్వరూపమూ అయిన పరమాత్మ దర్శనం చేయగలరు.** ఆ బ్రహ్మము, అణువుకన్న అణుస్వరూపం, మహత్తుకన్న మహత్తరమైనది.

నాసికామూలం, జిహ్వామూలం, కంఠం, హృదయమధ్యం, నాభిమధ్యం, ఉపస్థమూల భాగం, ఉదరం, గుదం, గజ్జలు, తొడల మధ్య, జానువు, చితిమూలం, జంఘామూలం, గుల్ఫము, పాదంబొటనవ్రేలు. ఈస్థానాల్లోకి గాలిని తీసుకుని ఆపాలి. ఈ పద్దెనిమిది స్థానాలలో చేసే ప్రత్యాహారవిధానాన్ని ప్రేరణ అని తెలుసుకోవాలి. ఇవికాక ధ్యానం, ధారణ, సమాధి, "సత్త్వపురుషాన్యథాఖ్యాతి" (బుద్ధి, పురుషుల భిన్నత్వజ్ఞానం) అనే నాలుగు ప్రేరణలు ఇంకొకరకం, ఇవి అన్నీ కలిసి ఇరవై రెండు రకాల ప్రేరణలు అని చెప్పారు.

సర్వప్రాణులలో ఆ బ్రహ్మము అంతర్యామి రూపంగా, స్థిరంగా ఉన్నా ఎవరికీ కనపడదు. బుద్ధి అనే ధనం గలవారే, మనోమయదీపంతో లోకసృష్టికర్త అయిన పరమాత్మసాక్షాత్కారాన్ని పొందగలరు. ఆపరమాత్మ మహాంధకారానికి పరంగా ఉండేవాడు, తమోగుణ రహితుడు. ఇందువల్ల వేదపారంగతులు, సర్వజ్ఞులైన వారు ఆ పరమాత్మను తమోనుదుడు (అజ్ఞానాన్ని పోగొట్టే వాడు) అని చెప్పారు. ఆయన నిర్మలుడు, అజ్ఞాన రహితుడు, అంగరహితుడు, అలింగి (ఉపాధిలేనివారు) అనే పేరుతో ప్రసిద్ధుడు. ఇదియే యోగులయోగం. దీనికంటే యోగలక్షణం ఇంక ఏమి ఉంటుంది ? ఈరీతిగా సాధన చేసే యోగులు సర్వద్రష్ట, అజరామరమర మైన పరమాత్మను దర్శించ గలరు.

ఇంతవరకు నీకు యోగదర్శనాన్ని గురించి చెప్పాను. ఇంక విచారప్రధానమైన సాంఖ్యదర్శనాన్ని వివరిస్తాను. రాజసత్తమా ! ప్రకృతివాదులైన విద్వాంసులు మూలప్రకృతిని అవ్యక్తం అని చెపుతారు. దానినుంచి వ్యక్తమైన రెండవ తత్త్వాన్ని మహత్తత్త్వం అన్నారు. మహత్తత్త్వం నుంచి అహంకారం అనే మూడవతత్త్వం ఏర్పడింది. అహంకారం నుంచి ఐదు సూక్ష్మభూతాలు - అంటే పంచతన్మాత్రలు ఉత్పన్నం అయినాయి. అని ఆ సాంఖ్యదర్శనం చేసిన విద్వాంసులు చెపుతారు. ఈ ఎనిమిది ప్రకృతులు, వీనినుంచి ఉత్పన్నం అయ్యే పదహారు తత్త్వాలను వికారాలు అంటారు. ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, మనస్సు, ఐదు స్థూలభూతాలు అనే ఈ పదహారు వికారాలు. వీటిలోని ఆకాశాది పంచతత్త్వాలు, పంచ జ్ఞానేంద్రియాలు - వీటిని విశేషాలు అంటారు. సాంఖ్య విధివిధానాన్ని తెలిసినవారు, సాంఖ్యదర్శనంలో ఎల్లప్పుడు అనురక్తులు, మేధావులు అయినవారు ఇవి మాత్రమే సాంఖ్య సమ్మతమైన తత్త్వసంఖ్యగా చెపుతారు. అవ్యక్తం మహత్తత్త్వం, అహంకారం, పంచతన్మాత్రలు అనే ఎనిమిది ప్రకృతులతో గూడిన పైన చెప్పిన పదహారు వికారాలు కలిపి ఇరవైనాలుగు తత్త్వాలను సాంఖ్యశాస్త్రవిద్వాంసులు స్వీకరించారు. ఏతత్త్వం దేనిలో నుంచి జనిస్తే, అది దానిలోనే లీనం అవుతుంది. అనులోమక్రమంతో ఆ తత్త్వాల ఉత్పత్తి జరుగుతుంది. (ప్రకృతి నుంచి మహత్తత్త్వం, దానినుంచి అహంకారం, దాని నుంచి సూక్ష్మభూతాదుల సృష్టి జరుగుతుంది). కాని ఉపసంహారం విలోమ క్రమంలో జరుగుతుంది. (అంటే పృథ్వి జలంలో, జలం తేజస్సులో, తేజస్సు వాయువులో లయం అవుతాయి. ఈ విధంగా అన్నితత్త్వాలు తమ తమ జనన కారణమైన వాటిలో లీనం అవుతవి.) వీటిని అన్నింటినీ అంతరాత్మయే సృష్టిస్తుంది. సముద్రంలో పైకి లేచిన తరంగాలు దానిలోనే కలిసిపోయినట్లు, అన్నిగుణాలు తమకు కారణమైన గుణాల (తత్త్వాల)లోనే లీనమవుతాయి.

ప్రకృతిలోని సృష్టి ప్రళయాలు ఇంతే. ప్రళయకాలంలో ఇది ఏకం అవుతుంది. సృష్టిలో మాత్రం అనేక భేదాలు ఉంటాయి. జ్ఞాన కోవిదులైనవారు, ఇదేరీతిగా ప్రకృతిలోఉండే ఏకత్వ నానాత్వాలు తెలుసుకోవాలి. అవ్యక్తమైన ప్రకృతియే, సృష్టిసమయంలో అధిష్ఠాత అయిన పురుషుని నానాత్వంవైపు తీసుకుపోతుంది. ఇదే పురుషుని ఏకత్వానికి నిదర్శనం. అర్థతత్త్వం బాగా తెలిసినవాడు, ప్రళయకాలంలో ప్రకృతిలో ఏకత్వమూ, సృష్టికాలంలో అనేకత్వమూ ఉంటుందని అర్థంచేసుకోవాలి. ఇదేరీతిగా పురుషుడుకూడా ప్రళయ సమయంలో ఒంటరిగానే ఉంటాడు. కాని సృష్టిసమయంలో ప్రకృతికి ప్రేరకుడు కావటంచేత, ఆయనయందు నానాత్వం ఆరోపితం అవుతుంది. పరమాత్మయే ప్రసవాత్మిక – సృష్టిలక్షణం కల ప్రకృతిని నానా రూపాలలో పరిణతం చేస్తాడు. ప్రకృతినీ, అందులో కలిగే వికారాలను క్షేత్రాలు అంటారు. ఇరవైనాలుగు తత్త్వాల కంటే భిన్నమైన ఇరవైఅయిదవ తత్త్వమే మహత్తరమైన ఆత్మ. అది క్షేత్రంలో అధిష్ఠాతగా ఉంటుంది. (అధిష్ఠాత = అధ్యక్షుడు, నియామకుడు.) ఇందువలన యతిశ్రేష్ఠులు ఆ ఇరవైఅయిదవ తత్త్వాన్ని అధిష్ఠాత అని చెపుతారు. క్షేత్రాలకు అధిష్ఠానం అవడంచేత ఆయన అధిష్ఠాత అని మేము విన్నాం. ఆయన అవ్యక్తం అనేపేరు గల క్షేత్రాన్ని (ప్రకృతిని) ఎరిగినవాడు కాబట్టి క్షేత్రజ్ఞుడు అంటారు. ప్రాకృతశరీరాలయిన పురాలలో అంతర్యామిరూపంగా శయనిస్తాడు కాబట్టి ఆయనను పురుషుడు అంటారు. నిజానికి క్షేత్రం వేరు, క్షేత్రజ్ఞుడు వేరు. క్షేత్రాన్ని అవ్యక్తం అంటారు. క్షేత్రజ్ఞుడు దాన్ని ఎరిగిన ఇరువది అయిదవ తత్త్వమైన ఆత్మ.

జ్ఞానం వేరేవస్తువు. జ్ఞాత దానికంటే భిన్నుడు. జ్ఞానాన్ని అవ్యక్తం అన్నారు. (ఇక్కడ జ్ఞాన శబ్దంవల్ల బుద్ధివృత్తిని తెలుసుకోవాలి). జ్ఞేయం ఇరవైఅయిదవ తత్త్వం అయిన ఆత్మ. అవ్యక్తాన్ని క్షేత్రం అన్నారు. దానికే సత్త్వం (బుద్ధి), శాసకం అనే పేర్లు పెట్టారు. కాని ఇరవైఅయిదవ తత్త్వం అయిన పరమాత్మ జడతత్త్వం. ఈశ్వరునకుసైన ఎవరూ ఉండరు. ఇదే సాంఖ్యదర్శనం. సాంఖ్యశాస్త్ర విద్వాంసులు తత్త్వాలను లెక్కిస్తూ ప్రకృతినే జగత్తుకు కారణంగా చెపుతారు. ఇందువల్ల ఈ దర్శనాన్ని సాంఖ్యదర్శనం అని పిలుస్తారు. సాంఖ్య శాస్త్రవేత్తలు పురుష ప్రకృతులతో కలిపి లెక్కించి, పరమ పురుషుని, జడతత్త్వానికంటే భిన్నమైన ఇరవైఅయిదవ తత్త్వంగా నిశ్చయించారు. ఇరవై అయిదవ తత్త్వం ప్రకృతిరూపం గాదు. అన్నివిధాలా దాని కన్నా భిన్నమైన జ్ఞాన స్వరూపంగా చెపుతారు. ఆయన తనంత తాను ప్రకృతికంటే భిన్నమై నిత్యం, చిన్మయం అయిన వానినిగా తెలుసుకొన్నప్పుడు కేవలుడు అవుతాడు. అంటే తన శుద్ధమైన పరబ్రహ్మరూపంలో

ఉంటాడు. ఈరకంగా నేను నీకు ఈసమ్యగ్దర్శనాన్ని ఉన్నది ఉన్నట్లుగానే చెప్పాను. దీన్ని ఈరీతిగా తెలుసుకొన్నవారు శాంత స్వరూపమైన బ్రహ్మను పొందుతారు. ప్రకృతి పురుషుల ప్రత్యక్షదర్శనం (అపరోక్షానుభవం) మాత్రమే సమ్యగ్దర్శనం. గుణమయ తత్త్వా లయిన వీటి కంటె భిన్నమైన పరమపురుష పరమాత్మ నిర్గుణుడు. ఈ దర్శనాన్ని అనుసరించి జ్ఞానాన్ని పొందేవారికి ఈ సంసారంలోకి పునరావృత్తి (మళ్ళీ జననంతో రావటం) ఉండదు. వారు వినాశరహితమైన బ్రహ్మభావాన్ని పొందుతారు. కాబట్టి పరాపరస్వరూపం, నిర్వికారం అయిన పరబ్రహ్మ రూపంతోనే వారి స్థితి ఉంటుంది. శత్రువులను అణిచేవాడా ! రాజా! నానాత్వాన్ని దర్శించే బుద్ధి కలవానికి సమ్యక్ జ్ఞానం కలుగదు. ఇటువంటి వారికి మాటిమాటికి శరీరధారణం తప్పనిసరి అవుతుంది. కేవలం ఈ ప్రపంచాన్ని మాత్రమే తెలుసుకొన్నవారు పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకోలేకపోవటం చేత, తప్పకుండా శరీరధారులు అవుతారు. శరీరమూ, కామక్రోధాదిదోషాలకు వశవర్తులు అవుతారు. 'సర్వ'నామం అవ్యక్త ప్రకృతిని, దానికంటే భిన్నమైన పంచవింశతత్త్వమైన పరమాత్మను అసర్వం అని చెప్పారు. ఆయనను ఈ విధంగా తెలుసుకొన్నవారికి జనన మరణరూపమైన భయం ఉండదు."

307. విద్యావిద్య, అక్షరక్షర ప్రకృతిపురుషుల స్వరూపము.

"రాజశ్రేష్ఠ ! ఇంతవరకు నీకు సాంఖ్యదర్శనాన్ని వివరించి చెప్పాను. ఇప్పుడు నేను నీకు విద్యావిద్యల స్వరూపాన్ని క్రమంగా చెపుతాను. విను. సృష్టి, ప్రళయం అనే ధర్మాలు కార్యాలుగా గల అవ్యక్తాన్నే అవిద్య అన్నారు. అలాగే సృష్టి ప్రళయాలు లేనిది, ఇరువది నాలుగుతత్త్వాలకు అతీతమైనది, పరమపురుషుడైన పరమాత్మను విద్య అని మహర్షులు చెప్పారు. నాయనా ! మహర్షులు సాంఖ్య దర్శనాన్ని గురించి చెప్పినట్లుగానే, అవ్యక్తంలో ఉండే పరస్పరభేదాలను, వాటిలో విద్యను(శ్రేష్ఠమైన దాన్ని) క్రమంగా చెప్పారు. దాన్ని విను.

సమస్త కర్మేంద్రియాల విద్య జ్ఞానేంద్రియాలు అనే నిర్ణయాన్ని మేము విన్నాం. అంటే కర్మేంద్రియాల కంటే జ్ఞానేంద్రియాలు శ్రేష్ఠమైనవి. జ్ఞానేంద్రియాలకు విద్య పంచ మహాభూతాలు. స్థూలమైన పంచభూతాలకు విద్య మనస్సు అనీ, మనస్సుకు విద్య సూక్ష్మ పంచభూతాలు అనీ విద్వాంసులు చెపుతారు. నరేంద్రా ! ఆ సూక్ష్మ పంచభూతాలకు విద్య అహంకారం అనటంలో సందేహం లేదు. అహంకారానికి విద్య బుద్ధి. రాజశ్రేష్ఠా ! అవ్యక్తం అనే పేరుగల పరమేశ్వరి అయిన ప్రకృతి అన్ని తత్త్వాలకు విద్య. ఆ విద్య

చక్కగా తెలియదిగినది. దీనిని జ్ఞానానికి పరమవిధి అని చెపుతారు. పంచవింశక రూపమైన పరమాత్మగా నిర్ణీతమైన ఆ అవ్యక్త ప్రకృతిని పరమవిద్యగా చెప్పారు. అదే సంపూర్ణ జ్ఞానస్వరూపమైన జ్ఞేయం అవుతుంది. జ్ఞానాన్ని అవ్యక్తం అన్నారు. పరమపురుషుడు జ్ఞేయమనీ చెప్పారు. అలాగే జ్ఞానం అవ్యక్తం. దాని జ్ఞాత పరమాత్మ. ఇంతదాకా యథార్థంగా విద్యాసహితమైన అవిద్యను విశేషంగా వర్ణించి చెప్పాను. ఇప్పుడు క్షరం, అక్షరం అయిన తత్త్వంగా చెప్పబడిన విషయాన్ని చెపుతాను. విను. సాంఖ్య సిద్ధాంతానుసారం ప్రకృతి పురుషులు అనే రెంటిని అక్షరాలు అని చెప్పారు. అలాగే ఈ రెండూ కూడా క్షరాలు అవుతాయి. ఈ విషయంలో నాకు తెలిసినంతవరకు యథార్థ కారణాన్ని చెపుతాను. ఈ రెండు మొదలు, తుది లేనివి కాబట్టి పరస్పరం కలిసి సర్వసమర్థాలు అని అంటారు. సాంఖ్యజ్ఞానాన్ని గురించి ఆలోచించినవారు, ఈ రెండింటిని తత్త్వాలు అనేపేరుతో వ్యవహరించారు. సృష్టి, ప్రళయం అనే ధర్మాలు రెండూ ఉండటం వలన ప్రకృతిని అక్షరం అన్నారు. ఆ ప్రకృతియే మహత్తత్త్వాదులను సృష్టించటానికి మాటిమాటికి వికారాన్ని పొందటం వల్ల దానిని క్షరం అని కూడా చెపుతారు.

మహత్తత్త్వం మొదలైన గుణాల ఉత్పత్తి ప్రకృతిపురుషుల పరస్పర సంయోగంవల్ల ఏర్పడుతుంది. ఒకదానికి ఒకటి అధిష్ఠానం (ఆధారం) అవుతాయి. కాబట్టి పురుషుని కూడా క్షేత్రం అంటారు. యోగి తన యోగసాధన ప్రభావంతో, ప్రకృతి గుణసమూహాన్ని అవ్యక్తమూలప్రకృతిలో లీనం చేసినప్పుడు ఆ గుణాలు విలయం కావటంతో పాటు ఇరవైఅయిదవ తత్త్వమైన పురుషుడు కూడా పరమాత్మలో కలిసిపోతాడు. ఈ దృష్టితో ఆయనను కూడా క్షరం అని అనవచ్చు. వత్సా ! కార్యరూపాలయిన గుణాలు కారణభూత గుణాలలో లీనం అయినప్పుడు, సమస్తమూ ఒకే ఒక ప్రకృతి స్వరూపం అవుతుంది. క్షేత్రజ్ఞుడు కూడా పరమాత్మలో లీనం అయినప్పుడు, దానికి కూడా ప్రత్యేకమైన ఉనికి కలుగదు. విదేహాధిపా ! అప్పుడు త్రిగుణమయమైన ప్రకృతి క్షరత్వాన్ని (నాశనాన్ని) పొందుతుంది. పురుషుడు కూడా గుణాలలో ప్రవృత్తుడు కాకపోవటంచేత నిర్గుణుడు (గుణాతీతుడు) అవుతాడు. ఇలాగే క్షేత్రజ్ఞునికి జ్ఞానం లేనప్పుడు - అంటే పురుషునికి ప్రకృతి జ్ఞానం లేనప్పుడు, ఆయన సహజంగానే నిర్గుణుడు అవుతాడు అని విన్నాము. ఈయన క్షరుడు అయినప్పుడు - అంటే పరమాత్మలో లీనమయినప్పుడు ఆయన ప్రకృతి సగుణం అనీ, తాను నిర్గుణుడ ననీ యథార్థాన్నీ తెలుసుకోలేడు. ఈ రీతిగా జ్ఞాని అయినవ్యక్తి 'నేను వేరు, ఈ ప్రకృతి నాకంటే భిన్నం అయినది.' అని తెలుసుకొన్నప్పుడు,

ఆయన ప్రకృతి రహితుడు కావటం వల్ల తన శుద్ధ స్వరూపంలో ఉంటాడు. రాజేంద్రా ! ప్రకృతితో సంయోగసమయంలో, దానితో అభిన్నుడు అయినట్లుగా ప్రతీతుడు కావటంచేత, ఈ పురుషుడు ఆ రూపాన్ని పొందాడా ? అన్నట్లుగా కనపడతాడు. కాని ఆ స్థితిలో కూడా ఆయన ప్రకృతిలో మిశ్రం కాడు. ఆయనకు ప్రత్యేకత ఉంటుంది. ఈ రీతిగా పురుషుడు ప్రకృతితో కలిసిపోయినట్లు, ప్రత్యేకంగాను కనిపిస్తాడు. ఆయన ప్రకృతిగుణాల సముదాయాన్ని అసహ్యించుకొని, దాన్నుంచి విరతుడు అయినప్పుడు, పరమదర్శనీయమైన పరమాత్మ దర్శనాన్ని పొందుతాడు. అలా చూసి కూడా దాన్ని వదలడు. అంటే దాన్నుంచి విడిగా ఉండడు. (వివేకం కలిగిన తరువాత జీవాత్మ ఈ క్రింది విధంగా ఆలోచిస్తాడు.) 'ఆహా నేను ఎంత పొరపాటు చేశాను ! చేప తన తెలివితక్కువతనం వల్ల తనంతటతానే వెళ్ళి వలలో చిక్కుకొన్నట్లు నేను కూడా ఈనాటి దాకా ఇక్కడ ఈ ప్రాకృతశరీరాన్నే అనుకరిస్తున్నానే. చేప తన జీవనానికి మూలం నీరే అని అనుకొని, ఒక చెరువులోనుంచి ఇంకొక చెరువులోకి పోయినట్లు, నేను కూడా అజ్ఞానం వలన ఒక శరీరాన్నుంచి ఇంకొక శరీరంలోకి పోతున్నాను గదా !

చేప తెలివితక్కువతనం వల్ల తనను నీటి కంటే భిన్నమయిన దానినిగా తెలుసుకోలేనట్లు నేనూ నా అజ్ఞానం వల్ల ఈ ప్రాకృత శరీరానికంటే నేను వేరు అని అనుకోవటం లేదు గదా ! ఛీ ! ఏమి తెలివితక్కువవాడివయ్యాను ! సంసారసముద్రంలో మునిగిఉన్న ఈ శరీరాన్ని ఆశ్రయించి, అజ్ఞానం వల్ల ఒక శరీరం నుండి ఇంకొక శరీరానికి పోతున్నాను గదా ! నిజానికి ఈ జగత్తులో పరమాత్మయే నాకు బంధువు. ఈయనతో నాకు మైత్రి కలుగుతుంది. పూర్వం నేను ఎలా ఉంటే ఏం ? ఇప్పుడు నేను ఈయనతో సమానత్వాన్ని ఐక్యాన్ని పొందాను. ఆయనవలెనే నేనూ ఉన్నాను. ఈయనలో నా సమానత్వం కనిపిస్తున్నది. తప్పక నేను ఈయన వంటి వాడనే. ఈ పరమాత్మ చాలా నిర్మలుడు. నేను ఇలాగే ఉన్నాను. ఎల్లప్పుడూ నేను ఎలాంటి ఆసక్తి లేనివాడనైనా, అజ్ఞానం వల్ల మోహానికి వశవర్తినై, ఇప్పటి దాకా ఆసక్తిమయమైన ఈ జడ ప్రకృతితో రమిస్తున్నాను. దీనికి వశమైన నేను, ఎంతసమయం గడచిపోయిందో తెలుసుకోలేకపోయినాను. ఇది పై తరగతి, మధ్యతరగతి, క్రింది తరగతి వారిలో అందరిలోను ఉంటుంది. ఆహా ! ఇటువంటి వానితో కలిసి నేను ఎలా ఉంటాను ? నాతో కలిసి నాతో సమానంగా ఉంటున్న ఈ ప్రకృతితో నేను మూర్ఖత వలన ఎలా సహవాసం చేయగలను ?

ఇప్పుడు ఇక నేను స్థిరం అవుతున్నాను. సహజంగా నిర్వికారుడను అయిన నన్ను వికారమయమైన ఈ ప్రకృతి మోసం చేసింది. ఇప్పటి దాకా దీనిమాయలో పడ్డాను. కాబట్టి ఇప్పుడు దీనితో కలిసి ఉండను. **ఈ అపరాధం దీనిది కాదు. తప్పంతా నాదే ! ఎందుకంటే నేను పరమాత్మకు విముఖుడిని అయి దీనిలో ఆసక్తుడి నయినాను.**

సహజంగా నేను ఆకారరహితుడిని. అయినా ప్రకృతియొక్క అనేక రూపాలయిన ఆకారాలలో ఉండి దేహరహితుడిని అయినా, మమకారం చేతిలో ఓడిపోయి దేహధారిని అయినాను. **పూర్వం ఎప్పుడో దీని మీద మమకారాన్ని పెంచుకొన్నాను. దానివలననే అనేకవిధాల జన్మలలో పుట్టాను. అసలు నేను మమకారం లేనివాడినే అయినా, ఈ ప్రకృతి వల్ల కలిగిన మమకారం భిన్నభిన్నజాతులలో పడవేసి ఈ దుర్దశను కలిగించింది. దీనితో కలిసి నానావిధాలయిన జాతులలో తిరగటం చేత నా వివేకాన్ని కోల్పోయినాను. ఇప్పుడు అహంకారమయమైన ఈ ప్రకృతి వలన నాకు ఎలాంటి పని లేదు.** ఇప్పటికీ ఇది అనేక రూపాలు ధరించి నాతో కలిసి ఉండవలెనని ప్రయత్నిస్తున్నది. కాని నేను ఇప్పుడు జాగ్రత్తపడుతున్నాను. మమకారం, అహంకారం అనేవాటికి దూరం అయినాను. ఇప్పుడు దీనిని, దీని అహంకారకృతమైన మమకారాన్ని వదలివేసి, నేను ఏదోషమూలేని పరమాత్మను శరణు పొందుతాను. ఆ పరమాత్మలో సామ్యాన్ని పొందుతాను గాని ఈ జడ ప్రకృతితో సమానత్వాన్ని పొందను. పరమాత్మ సంబంధం వల్లనే నాకు మేలు జరుగుతుంది – కాని ఈ ప్రకృతితో గాదు.' ఈ రీతిలో ఉత్తమమైన వివేకంతో తన శుద్ధ స్వరూపజ్ఞానం పొంది, ఇరవైనాలుగు తత్త్వాలకు అతీతమైన ఇరవైఅయిదవ తత్త్వమైన ఆత్మ క్షరభావాన్ని – వినాశలక్షణాన్ని విడనాడి, నిర్దోషమైన అక్షరత్వాన్ని పొందుతుంది.

మిథిలాధిపా ! అవ్యక్తమైన ప్రకృతి, వ్యక్తమైన మహత్తత్త్వాదులు, సగుణం, (జడమైన సమస్తం), నిర్గుణం (ఆత్మ) – వీటికి అన్నిటికి ఆది ఐన నిర్గుణ పరమాత్మ సాక్షాత్కారాన్ని పొంది, మానవుడు తానుకూడా అలాగే అవుతాడు. వేదం వివరించిన దానికి అనుగుణంగానే ఈ క్షరాక్షర వివేకాన్ని కలిగించే జ్ఞానాన్ని నీకు చెప్పాను. ఇప్పుడు మళ్ళీ వేదానుసారంగా, నిఃసందేహంగా సూక్ష్మమూ, అత్యంతనిర్మలమూ అయిన విశిష్టజ్ఞాన విషయాన్ని చెపుతాను; వినుసాంఖ్యదర్శనాన్ని, యోగదర్శనాన్ని అవి ప్రత్యేకమయిన భిన్నభిన్నశాస్త్రాలు అని చెప్పాను. కాని యథార్థానికి సాంఖ్యయోగ దర్శనాలు

రెండు ఒకటే. రెండింటికి ఫలితం ఒక్కటే. భూపాలా ! శిష్యుల హితం కోసం వారికి జ్ఞానాన్ని కలిగించే సాంఖ్యదర్శనాన్ని నీకు సుస్పష్టంగా చెప్పాను. ఈ సాంఖ్యశాస్త్రం చాలా గొప్పది అని విద్వాంసులు చెపుతారు. ఈ శాస్త్రంలో, యోగశాస్త్రంలో, వేదంలో ఎక్కువ ప్రామాణికత ఉన్నదని మానవుడు వీని అధ్యయనానికి ప్రయత్నించాలి. సాంఖ్యశాస్త్రాచార్యులు ఇరవైఅయిదు తత్త్వాలను తప్పించి, ఇతర తత్త్వాన్ని గురించి చెప్పరు. ఈ సాంఖ్యదర్శన పరమతత్త్వాన్ని నీకు ఉన్నది ఉన్నట్లు చెప్పాను. నిత్యజ్ఞాన సంపన్నమైన పరమాత్మయే 'బుద్ధ' సంజ్ఞ గలది. పరమాత్మతత్త్వం తెలియకపోవటం వల్ల తెలుసుకోవాలి అనే కోరిక గల జీవాత్మ 'బుధ్యమాన' సంజ్ఞగలది. ఈ రీతిగా యోగసిద్ధాంతానుసారం బుద్ధం, (నిత్యజ్ఞానయుక్తమైన పరమాత్మ) బుధ్యమానుడు (తెలుసుకునే కోరిక గల జీవుడు) అనే ఈ ఇద్దరూ చేతనులు అవుతారు."

308. వసిష్ఠ కరాళజనక సంవాద సమాప్తి.

రాజా ! "ఇపుడు బుద్ధం (పరమాత్మ), అబుద్ధం (జీవాత్మ), గుణమయమైన ఈ సృష్టి (ప్రాకృత ప్రపంచము) వివరణను విను. జీవాత్మ తనంతతాను అనేక రూపాలను ధరించి వాటిని నిజమైన వని దర్శిస్తాడు. వాస్తవంగా జ్ఞానసంపన్నుడైనా, ఈ రీతిగా ప్రకృతి సంయోగం వల్ల వికారాన్ని పొందిన జీవాత్మ పరబ్రహ్మను తెలుసుకోలేడు. గుణాలను ధరించటం వలన కర్తృత్వాభిమానాన్ని, సృష్టిని, సంహారాన్ని చేస్తాడు. ప్రజాపాలకా ! జీవాత్మ ఈ లోకంలో ఎల్లప్పుడు క్రీడకొరకే వికారం (పరిణామం) పొందుతుంటాడు. అతనికి అవ్యక్తం (ప్రకృతి) తెలుసు. కాబట్టి అతనిని మహర్షులు 'బుధ్యమానుడు' అని వ్యవహరిస్తారు. వత్సా ! పరమాత్మ సగుణమా, నిర్గుణమా అనే విషయాన్ని ప్రకృతి (జడం కాబట్టి) ఎప్పటికీ తెలుసుకోలేదు. కాబట్టి సాంఖ్యులు దీనిని అప్రతిబుద్ధం (జ్ఞానశూన్యం) అని చెపుతారు. ప్రకృతి కూడా తెలుసుకొంటుంది అని అనుకొంటే, ఇది కేవలం ఇరవైఅయిదవ తత్త్వమయిన పురుషునే, ఆయనతో కూడటం వల్లనే తెలుసుకోగలుగుతుంది. ప్రకృతి సంయోగం వలననే జీవుడు సంగాత్మకుడు (సాంగత్యం గలవాడు - సంగి) అవుతాడు అని వేదం చెపుతున్నది. ఈ సంగదోషం వలననే అవ్యక్తం, అవికారి అయిన జీవుని లోకులు 'మూఢుడు' అని చెప్పారు. ఇరవైఅయిదవ తత్త్వరూపమయిన మహాత్మ అవ్యక్తమయిన ఆత్మను తెలుసుకొంటుంది. కాబట్టి దాన్ని 'బుధ్యమానం' అంటారు. అది కూడా ఇరవైఆరవ తత్త్వరూపం నిర్మలం, నిత్యం, శుద్ధబుద్ధం, అప్రమేయం, సనాతనం అయిన పరమాత్మను

ఎరుగదు. కాని ఆ సనాతనమైన 'పరమాత్మ' ఇరవైఅయిదవ తత్త్వమైన జీవుని, ఇరవైనాలుగవ తత్త్వమైన ప్రకృతిని చక్కగా తెలుసుకొంటుంది. మహాతేజస్వివయిన వత్సా ! అవ్యక్తమూ, అద్వితీయమూ అయిన ఆ బ్రహ్మ ఇక్కడ కనపడీ కనపడకుండా కూడా, అన్ని వస్తువులలోను స్వభావసిద్ధంగానే వ్యాపించి ఉంటుంది. అందువల్ల దానికి అంతా తెలుసు. ఇరవైనాలుగవ తత్త్వమైన అవ్యక్త ప్రకృతి అద్వితీయ బ్రహ్మమును గాని ఇరవైఅయిదవ తత్త్వమైన బుద్ధిని గాని తెలుసుకొనలేదు. జీవాత్మ అవ్యక్త బ్రహ్మముపైన దృష్టినిలిపి, తనను ప్రకృతి కంటే భిన్ననిగా భావించినపుడు ప్రకృతికి అధిపతి అవుతాడు. రాజేంద్రా ! జీవాత్మ నిర్మలమూ, సర్వశ్రేష్ఠమూ అయిన బుద్ధి పొందినపుడు, ఇరవైఆరవ తత్త్వమైన పరబ్రహ్మ సాక్షాత్కారాన్ని పొంది తద్రూపుడు అవుతాడు. ఆ స్థితిలో అతడు నిత్యశుద్ధబుద్ధమైన బ్రహ్మలోనే నిలుస్తాడు. అందువల్ల అతడు సృష్టి ప్రళయధర్మాలు గల అవ్యక్త ప్రకృతికి అతీతంగా ఉంటాడు.

అతడు గుణాతీతుడై, త్రిగుణరూపమైన ప్రకృతిని జడంగా తెలుసుకొంటాడు. ఈ రీతిగా ప్రకృతిని తనకంటె అన్నిరకాల భిన్నం అని చూడటం వలన కైవల్యాన్ని పొందుతాడు. అద్వితీయబ్రహ్మతో ఏకమై సర్వబంధవిముక్తుడై తన పరమార్థ స్వరూపమైన పరమాత్మను పొందుతాడు. అతడు సర్వతత్త్వాతీతుడై జరామరణాలకు దూరమవుతాడు. రాజా ! తత్త్వాలను ఆశ్రయించటం వలననే జీవాత్మ తత్త్వసమానుడుగా అనిపిస్తాడు. నిజానికి అతడు తత్త్వాలను దర్శించేవాడు మాత్రమే కనుక తత్త్వాలు కాడు. తత్వాలకంటే అన్నిరకాల భిన్నుడు. ఈ రీతిలో విద్వాంసులు (ఇరవైనాలుగు తత్త్వాలు గల ప్రకృతితో పాటు) జీవాత్మను గూడా ఒక తత్త్వంగా భావించి మొత్తం 25 తత్త్వాలు అని చెపుతారు. నాయనా ! నిజానికి జీవాత్మ తత్త్వాతీతుడు కాబట్టి తద్రూపుడు కాడు. కాని జ్ఞానవంతుడు కావటం చేత బ్రహ్మజ్ఞానం కలిగిన తరువాత, త్వరగా ప్రాకృతతత్త్వాలను వదలినంతనే, అతనిలో నిత్యశుద్ధబుద్ధబ్రహ్మ లక్షణాలు వ్యక్తం అవుతాయి. 'నేను పంచవింశతి తత్త్వాల కంటే భిన్నమైన షడ్వింశమైన పరమాత్మను, నిత్యజ్ఞానసంపన్నుడను, జరామరణరహితుడను' అని చింతన చేస్తూ చేస్తూ, జీవాత్మ కేవలం వివేకబలంతోనే బ్రహ్మభావాన్ని పొందుతాడు అనటంలో సందేహం లేదు.

జీవుడు ఇరవైఆరవ తత్త్వం అయిన జ్ఞానస్వరూప పరమాత్మ ప్రకాశంవలననే జడవర్గాన్ని తెలుసుకొంటాడు. అది తెలిసి కూడా, పరమాత్మను తెలుసుకోకపోవటం వలన అజ్ఞానిగానే ఉంటాడు. ఈ అజ్ఞానమే జీవునికి నానావిధమైన బంధాలకు కారణం

అవుతుంది. ఈ విషయాన్ని సాంఖ్యశాస్త్రం, వేదం రెండూ నిరూపించాయి. జీవాత్మ బుద్ధితో జడతత్త్వాలను తనవి అనుకోకపోయినప్పుడు అంటే సంబంధాన్ని కలిగించుకొనకపోతే నిత్యమైన, చేతనమైన పరమాత్మలో ఐక్యం అవుతాడు. మిథిలాధిపా ! జీవాత్మ జడవర్గాన్ని నాది అనుకొన్నంత వరకు ఆ జడవర్గంతోనే సమానం అవుతాడు. స్వస్వరూపంతో నిస్సంగుడు అయినా ప్రకృతి సంపర్కం వల్ల సాంగత్యధర్మం గలవాడే అవుతాడు. **ఇరవైఆరవ తత్త్వం అయిన పరమాత్మ జన్మరహితుడు, సర్వవ్యాపి, నిస్సంగుడు, దోషరహితుడు. ఆయనను శరణు పొంది, జీవాత్మ ఆయన స్వరూపాన్ని సాక్షాత్కరించుకొన్నప్పుడు పరమాత్మ జ్ఞాన ప్రభావంతో తానూ సర్వవ్యాపి అవుతాడు. ఇరవైనాలుగు తత్త్వాలతో ప్రకృతిని నిస్సారం అని వదలివేస్తాడు.** రాజా ! ఈవిధంగా నీకు అప్రతిబుద్ధుడు (క్షరుడు), బుధ్యమానుడు (అక్షరజీవాత్మ), బుద్ధుడు (జ్ఞానస్వరూప పరమాత్మ) అనే మూడింటిని గూర్చి వేద దృష్టాంతంతో ఉన్నది ఉన్నట్లు చెప్పాను. శాస్త్రీయదృష్టితో జీవాత్మ నానాత్వాన్ని, ఏకత్వాన్ని ఈ రీతిగానే తెలుసుకోవాలి.

మేడిపండు, దానిలో ఉండే క్రిములు కలిసే ఉన్నా, పరస్పరం భిన్నం అయిన రీతిగానే ప్రకృతి పురుషులలో భిన్నత్వం ఉంది. చేప, నీరు భిన్నమయినట్లు ప్రకృతి పురుషులలోను భేదం ఉన్నది. ఈ రీతిగా ప్రకృతి పురుషుల ఏకత్వం, అనేకత్వం తెలుసుకోవాలి. అవ్యక్త ప్రకృతికి ఉన్న నిత్యమైన భేదాన్ని యథార్థంగా తెలుసుకొన్నప్పుడు పురుషుడు ఆ ప్రకృతి బంధంలోనుంచి ముక్తుడు కావటానికే మోక్షం అనిపేరు. ఈ శరీరంలో ఉన్న ఇరవైఅయిదవ తత్త్వమయిన అంతర్యామి పురుషుని, 'అవ్యక్తం యొక్క కార్యమైన మహత్తత్త్వాది బంధనాల నుంచి ముక్తుని చేయటం అవసరం' అని విద్వాంసులు చెపుతారు. ఆ యీ జీవాత్మ వెనుక చెప్పిన రీతిగానే విముక్తుడు అవుతాడు గాని ఇంకొక విధంగా కాదు అని విద్వాంసుల నిశ్చయం. ఇతడు ఇంకొకరితో కలిస్తే వారితో సమాన మవుతాడు. **జీవాత్మ శుద్ధపురుషసాంగత్యంతో విశుద్ధధర్ముడు, జ్ఞాని, లేక బుద్ధిమంతుని సాంగత్యం వలన బుద్ధిమంతుడు, ముక్తుని సాంగత్యం వలన ముక్తలక్షణం గలవాడు అవుతాడు.** ప్రకృతిసాంగత్యం దూరమైన వానితో కలయటంవల్ల విముక్తుడు అవుతాడు. మోక్షధర్మసమేతునితో కలిస్తే జీవునికి మోక్షం కలుగుతుంది. **పవిత్రమైన ఆచారవిచారవంతునితో కలిస్తే పవిత్రమైన పనులు, ఆలోచనలు కలవాడు అవుతాడు. నిర్మలమైన అంతఃకరణం కలవానితో సాంగత్యం వలన నిర్మలాత్ముడు, మహత్తర తేజస్వి అవుతాడు. అద్వితీయ పరమాత్మతో సంబంధం ఏర్పరచుకొంటే**

అతడు ఆ రూపం గలవాడే అవుతాడు. అంటే అద్వితీయమైన పరమాత్మ అవుతాడు. స్వతంత్రుడైన పరమాత్మతో సంబంధం ఏర్పరచుకోవటం వలన, అతడు నిజంగానే స్వతంత్రుడై, నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందుతాడు. మహారాజా ! నేను ఈర్ష్యాద్వేషాలు లేకుండా నీకు కలిగే ప్రయోజనాన్ని తెలుసుకొని వాత్సల్యంతో శుద్ధం, సనాతనం, సమస్తానికి ఆది, సత్యస్వరూపం అయిన పరబ్రహ్మ యొక్క యథార్థస్వరూపాన్ని వివరించి చెప్పాను.

రాజా ! వేదం మీద విశ్వాసం లేనివానికి ఈ ఉత్తమ జ్ఞానాన్ని ఉపదేశించవద్దు. ఎక్కువ జిజ్ఞాస కలవానికి, తెలుసుకోవలెననే కోరికతో శరణాగతుడు అయిన వానికే ఇది వినే అధికారం ఉంటుంది. అబద్ధాలు చెప్పేవానికి, మోసగానికి, తనను పండితునిగా భావించేవానికి, ఇతరులకు బాధకలిగించే వానికి కూడా దీన్ని ఉపదేశించరాదు. ఇంక ఎలాంటి వానికి తప్పక ఉపదేశించవలెనో చెపుతాను. విను. **శ్రద్ధగలవానికి, గుణవంతునికి, ఎప్పుడూ పరనింద చేయనివానికి, నిర్మలమోగి, విద్వాంసుడు, శాస్త్రోక్తంగా పనులు చేసేవానికి, ఓర్పుగలవానికి, అందరిమేలు కోరేవానికి, ఏకాంతంలో ఉండేవానికి, శాస్త్ర సంప్రదాయం మీద ఆదరం కలవానికి, వివాదాలు లేనివానికి, బహువిషయాలు తెలిసినవానికి, వివేకం గలవానికి, ఎవరికి అపకారం చేయనివానికి, ఇంద్రియ నిగ్రహం, మనో నిగ్రహం గలవానికి సమర్థుడైన వ్యక్తికే ఈ జ్ఞానాన్ని ఉపదేశించాలి.** ఈ గుణాలు ఏమాత్రం లేనివానికి దీన్ని ఉపదేశించరాదు. ఈ జ్ఞానం పవిత్రమైన పరబ్రహ్మరూపం అని చెపుతారు. పైన చెప్పినరీతిగా గుణహీనునికి ఉపదేశించిన ఈ జ్ఞానం అతనికి మేలు చేయదు. అపాత్రునికి ఉపదేశిస్తే అది ఉపదేశించిన వానికి కూడా మేలు చేయదు. వ్రతనియమాదులను యథావిధిగా ఆచరించనివానికి, సర్వరత్న పరిపూర్ణమైన ఈ భూమండల రాజ్యాన్ని సమస్తమూ ఉపదేశ ప్రతిఫలంగా ఇచ్చినా సరే ఈ జ్ఞానాన్ని ఉపదేశించ గూడదు. జితేంద్రియునికే పరమోత్తమమయిన ఈ జ్ఞానాన్ని నీవు ఉపదేశించవచ్చును. కరాళా ! నీవు నేడు పరబ్రహ్మజ్ఞానాన్ని విన్నావు. కాబట్టి నీకు ఏ మాత్రం భయంలేదు. ఆ పరబ్రహ్మము పరమపవిత్రం, శోకరహితం, ఆదిమధ్యాంతాలు లేనిది. జన్మమరణాల నుండి రక్షించేది. నిరామయం, నిర్భయం, మంగళమయం. దానిని నీకు ఉన్నది ఉన్నట్లు యథావిధిగా చెప్పాను. అదే సమస్తజ్ఞానాల తాత్పర్యార్థం అని తెలుసుకుని ఆ జ్ఞానాన్ని పొంది మోహాన్ని పరిత్యజించు. నరేంద్రా ! నేను ఉపదేశించగా నీవు పొందిన సనాతన బ్రహ్మజ్ఞానాన్ని

హిరణ్యగర్భుడని పేరుగల సుప్రసిద్ధ సనాతన బ్రహ్మదేవుని ప్రసన్నుని చేసికొని, ఆయన నుండి మహాప్రయత్నంతో పొందాను. రాజా ! నీవు అడిగిన దానికి నీకు చేసిన ఈ జ్ఞానోపదేశాన్ని, నేను కూడా బ్రహ్మదేవుని నుండి పొందాను. ఇది మోక్షజ్ఞానులకు పరమాశ్రయం."

భీష్ముడు పలికాడు. "మహారాజా ! వసిష్ఠ మహర్షి చెప్పిన రీతిగా ఈ పరబ్రహ్మ స్వరూపాన్ని నీకు ఉపదేశించాను. దీనిని పొందిన జీవాత్మ మళ్ళీ ఈ సంసారంలో ప్రవేశించడు. గురువు నుండి ఈ ఉత్తమజ్ఞానాన్ని పొందికూడా, చక్కగా తెలుసుకోలేనివాడు పునరావృత్తిని (మాటిమాటిమాటికి జనన మరణాలను) పొందుతాడు. దీన్ని సరిగా తెలుసుకొన్నవాడు జరామరణరహిత పరమాత్మను పొందుతాడు. వత్సా ! పరమ మంగళకరమైన ఈ జ్ఞానాన్ని, నేను దేవర్షి నారదుని నుండి పొందాను. దీన్ని యథార్థంగా నీకు చెప్పాను. వసిష్ఠ మహర్షి బ్రహ్మదేవుని నుండి ఈ జ్ఞానాన్ని పొందాడు. ఆయన నుండి నారదుడు పొందాడు. ఆయన నాకు ఈ సనాతనబ్రహ్మతత్త్వాన్ని ఉపదేశించాడు. ఈ జ్ఞానమే పరమపదం. దీన్ని విని, నీవు విచారాన్ని వదలిపెట్టు. రాజా ! క్షరాన్ని, అక్షరతత్త్వాన్ని తెలిసికొనినవానికి ఎలాంటి భయమూ ఉండదు. ఇది తెలియనివానికి భయం ఉంటుంది. మూర్ఖుడు ఈ తత్త్వాన్ని తెలుసుకోలేకపోవటం చేత, మాటి మాటికి ఈ సంసారంలో ప్రవేశించి, వేలవేల జన్మలలో జనన మరణరూపమైన కష్టాలను పడతాడు. అతడు దేవ మానుష పశుపక్ష్యాది జాతులలో తిరుగుతుంటాడు. ఎప్పుడైనా కాలం కలిసి వస్తే, శుద్ధుడైతే, అగాధమైన అజ్ఞాన సముద్రాన్ని దాటి పరమశుభాన్ని పొందుతాడు. అజ్ఞానసాగరం అవ్యక్తమూ, అగాధమూ, భయంకరమూ అని చెపుతారు. దీనిలో అసంఖ్యమైన ప్రాణులు మునుకలు వేస్తుంటారు. రాజా ! నీవు నా ఉపదేశం విని ఈ అవ్యక్తమూ, అగాధమూ, ప్రవాహరూపము, నిత్యమూ అయిన భవసాగరాన్ని దాటావు. ఇందువల్ల నీవు ఇప్పుడు రజోగుణ, తమోగుణ రహితుడివి అయినావు."

309. వసుమనునికి - ఒక మహర్షికి మధ్య జరిగిన సంవాదము.

భీష్ముడు చెపుతున్నాడు. "రాజా ! ఒకనాటి వృత్తాంతం. జనకవంశీయుడైన రాజకుమారుడు వేటకు వెళ్ళి, ఒక నిర్జనవనంలో సంచరిస్తూ, అక్కడ కూర్చుని ఉన్న విప్రశ్రేష్ఠుడైన భృగువంశంలోని ఒక మహర్షిని దర్శించాడు. వసుమనుడు తనకు సమీపంలో ఉన్న మహర్షికి నమస్కరించి, ఆయన సమీపంలో కూర్చున్నాడు. ఆ ముని ఆజ్ఞానుసారం వసుమనుడు ఇలా ప్రశ్నించాడు. "మహాత్మా ! అశాశ్వతమైన ఈ శరీరంలో కామాధీనుడై

ఉండే పురుషునికి ఈలోకంలో, పరలోకంలో ఏ ఉపాయం వల్ల మేలు కలుగుతుంది ?" వసుమనుడు తగిన గౌరవంతో అడిగిన ప్రశ్నకు మహాతేజస్వి, మహాతపస్వి అయిన ఆ ముని శ్రేయస్కరవిషయాన్ని ఇలా చెప్పాడు.

"రాజకుమారా ! ఇహ పరలోకాలలో నీమనస్సుకు అను కూలమైనవి కావాలి అనుకొంటే" నీ ఇంద్రియాలను అదుపులో ఉంచుకొని, సమస్తప్రాణులకు ప్రతికూలమైన పనులనుండి విముఖుడవు కావాలి. **సత్పురుషులకు హితకరమూ, ఆశ్రయించదగినదీ ధర్మమే. వత్సా ! చరాచరప్రాణులతో గూడిన మూడులోకాలు ధర్మం నుండియే ఏర్పడ్డాయి.** భోగరసాస్వాదం చేయాలనుకునే దుర్బుద్ధిగల మానవా! కోరికలను ఎందుకు వదలలేకపోతున్నావు ? ఇప్పటికీ, నీకు చెట్టుచిటారుకొమ్మన ఉన్న తేనె తుట్టె మాత్రమే కనపడుతున్నదికాని, క్రిందున్న ప్రాణాంతకమైన గోతిని చూడటంలేదు. (ఇంకా నీవు భోగాసక్తుడివే కాని వాటివల్ల కలిగే పతనాన్ని గుర్తించలేకపోతున్నావు). జ్ఞానఫలం కోరేవానికి తగిన జ్ఞానావగాహన అవసరం అయినట్లే, ధర్మఫలం కోరుకొనేవాడు ధర్మావగాహన కలిగిఉండాలి. దుష్టవ్యక్తి ధర్మం కావాలి అనుకొంటే విశుద్ధమైన కర్మాచరణం ముఖ్యం. సజ్జనుడు ధర్మానుష్ఠానం చేయాలనుకొంటే, ఆయనకు చాలా కఠినమైన పనికూడా సుకరం అవుతుంది. అరణ్యంలో ఉండికూడా గ్రామ్యసుఖాలు అనుభవించేవాడు అధముడే అవుతాడు. గ్రామంలో ఉండికూడా అరణ్యంలో ఉండే ముని వలె ప్రవర్తిస్తే ఆ వ్యక్తిని మునిగానే గుర్తించాలి.

మొదట నివృత్తి మార్గంలో, ప్రవృత్తి మార్గంలో ఉండే మంచి - చెడులను చక్కగా నిశ్చయం చేసుకో. తరువాత ఏకాగ్రమైన మనస్సు, మాట, శరీరాలతో జరిగే ధర్మం మీద శ్రద్ధ ఉంచు. ప్రతిదినమూ నియమాలను, పవిత్రతను కాపాడుకొంటూ ఉత్తమ దేశకాలాలలో సత్పురుషులను ప్రార్థించి, గౌరవ పూర్వకంగా వారికి సమధికంగా దానం చెయ్యాలి. వారిలో దోషాలు వెదకకూడదు. మంచి పనులతో సంపాదించిన ధనాన్ని సత్పురుషులకు దానం చేయాలి. కోపాన్ని వదలివేయాలి. దానం చేసిన తరువాత, ఆ వస్తువును వృథా చేశానే ! అని పశ్చాత్తాపం చెందరాదు. దాన్ని ఇతరులకు చెప్పుకోరాదు. దయగలవాడు, పవిత్రుడు, జితేంద్రియుడు, నిజం చెప్పేవాడు, బుజుప్రవర్తనకలవాడు, జన్మకర్మలు రెండింటిలో పవిత్రుడు అయిన బ్రాహ్మణుడే దానం పొందటానికి ఉత్తమ పాత్రం అవుతాడు. తనతో సమానమైన ఉత్తమకులంలో జన్మించినది ఉత్తమ యోని (మాత) అని చెప్పారు. ఇట్టి తల్లికి జన్మించిన వ్యక్తి జన్మతో పవిత్రుడు. బుగ్వేదం,

యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం అనే వేదాలలో విద్వాంసుడై, ప్రతినిత్యం (యజనం, యాజనం, అధ్యయనం, అధ్యాపనం, దానం, ప్రతిగ్రహం అను) షట్కర్మానుష్ఠాన పరుడగు బ్రాహ్మణుడు కర్మశుద్ధుడు, ఉత్తమ పాత్రమని చెప్పారు. దేశం, కాలం, పాత్రం, కర్మ విశేషాలను పరిశీలిస్తే ఒకే కర్మ భిన్న, భిన్న మనుష్యులకు ధర్మమూ, అధర్మమూ అవుతుంది.

శరీరానికి కొద్దిగా దుమ్ముకొట్టు కుంటే మానవుడు దాన్ని తేలికగా పోగొట్టుకొంటాడు. అదిబాగా ఎక్కువైతే, చాలా కష్టపడి ఒళ్ళు తోముకొని పోగొట్టుకొంటాడు. అలాగే కొద్దిపాపాన్ని కొద్ది ప్రయత్నంతోను, అధికపాపాన్ని అధిక ప్రయత్నంతోను, ప్రాయశ్చిత్తంతోను పోగొట్టుకోవాలి. విరేచనం కాగా పొట్ట బాగా ఖాళీ అయిన తరువాత నేతిని త్రాగితే, అది ఔషధంలాగా మంచి దవుతుంది. అలాగే అన్ని పాపాలు తొలగిన వానికి, ధర్మం స్వర్గంలో సుఖప్రదం అవుతుంది. అన్నిప్రాణులకు మనస్సులో మంచి చెడు ఆలోచనలు కలుగుతుంటాయి. కాబట్టి మానవుడు ఎల్లప్పుడు చెడు ఆలోచనలు వదలి, మంచి ఆలోచనలను పెంపొందించుకోవాలి. నీ వర్ణాశ్రమానుసారం అందరు, అన్నిచోట్ల ఆచరించే అన్నివిధాల కర్మలను ఆదరించు. నీవు కూడా స్వధర్మానుసారం నీకు ఆసక్తిఉన్న కర్మను నీ ఇష్టానుసారం ఆచరించు. నిలుకడలేని మనస్సుగల రాజా ! ధీరత్వాన్ని ఆశ్రయించు. దుర్బుద్ధి ! సద్బుద్ధివి కావలసింది. ఇక శాంతచిత్తుడవు కావలసింది. ఇప్పటి దాకా మూర్ఖునిలాగా ప్రవర్తించావు. ఇపుడు విద్వాంసునివలె ప్రవర్తించు. సత్పురుషుల సాంగత్యం చేసేవానికి, వారి తేజస్సుతో లేక ప్రభావంతో, ఇహపరలోకాలలో కూడా మేలు కలిగించే మంచి ఉపాయం లభిస్తుంది. మనస్సు నిలకడయే మేలు కలగటానికి మూలం. రాజర్షిఅయిన మహాభిషుడు స్థిమిత మనస్కుడు కాకపోవటంవలననే స్వర్గాన్నుంచి నేలమీద పడ్డాడు. అలాగే యయాతి అన్ని పుణ్యాలు నశించినా, ధృతిబలంతో ఉత్తమలోకానికి చేరాడు. రాజా ! తపస్వులను, ధర్మాత్ములను, పండితులను సేవించటంవలన నీకు స్వచ్ఛమైన విశాలబుద్ధి ప్రాప్తిస్తుంది. దాని వల్ల నీకు మంచిశ్రేయస్సు కలుగుతుంది." భీష్ముడు చెప్పాడు. "యుధిష్ఠిరా ! రాజకుమారుడైన వసుమనుడు మంచి స్వభావంకలవాడు కావటంవలన, ఆ మహర్షి ఉపదేశాన్ని చక్కగా విని, తనమనస్సును కోరికలనుంచి దూరం చేశాడు. బుద్ధిని ధర్మంలో లగ్నం చేశాడు."

310. యాజ్ఞవల్క్య జనక సంవాదము - సాంఖ్యమతానుసారము ఇరువది నాలుగు తత్త్వముల, నవసృష్టుల నిరూపణము.

ధర్మరాజు అడిగాడు. "తాతా ! ధర్మాధర్మబంధవిముక్తం, సర్వసంశయ రహితం, జననమరణాలు లేనిది, పుణ్యపాపాలు లేనిది, మేలు చేసేది, నిత్యమైనది, భయరహితం, నాశంలేనిది, అవ్యయం, (మార్పులేనిది) పవిత్రం, ఎటువంటి క్లేశమూ లేనిది అయిన తత్త్వాన్ని నాకు ఉపదేశించు." భీష్ముడు చెపుతున్నాడు. "భరతనందనా ! ఈ విషయమై జనక యాజ్ఞవల్క్యుల మధ్య జరిగిన సంవాదరూపమైన ఇతిహాసాన్ని చెపుతాను. ఒకప్పుడు దేవరాతుని పుత్రుడు, మహాయశస్సంపన్నుడు అయిన జనకుడు, ప్రశ్నలోని రహస్యాలు తెలిసిన యాజ్ఞవల్క్య మహామునిని ఇలా ప్రశ్నించాడు. జనకుడు అన్నాడు. "బ్రహ్మర్షీ ! ఇంద్రియాలు ఎన్ని ? ప్రకృతికి ఎన్ని భేదాలను అంగీకరించారు ? అవ్యక్తం అంటే ఏమిటి ? దానికి అతీతమైన పరమాత్మ స్వరూపం ఏమిటి ? సృష్టిప్రళయాలు అంటే ఏమిటి ? కాలగణనం ఎలా చేస్తారు ? విప్రశ్రేష్ఠా ! నీకృపను కోరే నాకు అన్నీ దయతో చెప్పవలసింది. ఈ విషయాలు అన్నీ సరిగా తెలియక అడుగుతున్నాను. నీవు జ్ఞాననిధివి. కాబట్టి ఈ విషయాలు అన్నీ వినవలెనని కోరికగా ఉంది. దీనివలన నా సందేహాలు అన్నీ తీరుతాయి."

యాజ్ఞవల్క్య మహర్షి చెపుతున్నాడు. 'భూమిపాలా ! ఇక విను. నీవు అడిగేది యోగశాస్త్రానికి సంబంధించినది, విశేషంగా సాంఖ్యశాస్త్రానికి సంబంధించిన పరమరహస్య మయమైనది. ఆ జ్ఞానాన్ని చెపుతాను. నీకు అన్ని విషయాలు తెలియును. అయినా నన్ను అడుగుతున్నావు. కాబట్టి తప్పక చెప్పాలి. ఎవరయినా ఏదైనా అడిగితే, అది తనకు తెలిసి ఉంటే చెప్పాలి. ఇది సనాతనమైన ధర్మం. ప్రకృతులు ఎనిమిది అని చెప్పారు. వాటి వికారాలు (మార్పులు) పదహారు. అవ్యక్తం (మూలప్రకృతి) మహత్తత్త్వం, అహంకారం, ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథివి అని ఎనిమిది ప్రకృతుల పేర్లను అధ్యాత్మశాస్త్ర చింతకులు చెప్పారు. ఇవి ఎనిమిది ప్రకృతులు. ఇక వాటి వికారాలను కూడా విను. శ్రోత్రం, త్వక్కు, నేత్రాలు, జిహ్వ, అయిదవది నాసిక. శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం, వాక్కు, హస్తాలు, పాదాలు, మూత్రద్వారం, మలద్వారం. రాజేంద్రా ! ఐదు కర్మేంద్రియాలు, శబ్దాదులు ఐదింటికి విశేషాలు అనిపేర్లు, ఈ ఐదు జ్ఞానేంద్రియాలను సవిశేషాలు అన్నారు. మిథిలేంద్రా ! ఈ విశేషాలు, సవిశేషాలు అనే తత్త్వాలు పంచమహాభూతాలలోనే ఉన్నాయి. ఇవి మొత్తం కలిసి పదిహేను. పదహారవది మనస్సు.

అధ్యాత్మగతిని చింతించే తత్త్వజ్ఞాన విశారదులైన నీవు, ఇతర విద్వాంసులు వాటిని పదహారు వికారాలు అని చెప్పారు.

భూపాలా ! అవ్యక్తప్రకృతినుంచి మహత్తత్త్వం (సమష్టిబుద్ధి) ఉత్పన్నం అవుతుంది. దీనిని విద్వాంసులు మొదటిది, ప్రాకృతసృష్టి అని చెపుతారు. నరేంద్రా ! మహత్తునుంచి అహంకారం వ్యక్తం అవుతుంది. దీన్ని రెండవ సృష్టి అన్నారు. దీనినే బుద్ధ్యాత్మకసృష్టి అన్నారు. అహంకారం నుండి మనస్సు పుట్టింది. ఇది పంచభూతాలు, శబ్దాది గుణస్వరూపం. దీనిని మూడవది అని, ఆహంకారిక సృష్టి అని చెపుతారు. రాజా ! మనస్సునుంచి ఐదు సూక్ష్మ మహాభూతాలు పుట్టాయి. ఇది నాల్గవ సర్గం. నా ఉద్దేశ్యప్రకారం ఇది మానసమైన సృష్టి అని అనుకో. శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం అనే ఈ ఐదు పంచమహాభూతాల నుంచి ఉత్పన్నం అయినవి. దీనిని ఐదవ సృష్టి అనీ, భౌతిక సృష్టి అని పండితులు అన్నారు. శ్రోత్రం, చర్మం, నేత్రాలు, జిహ్వ, ఘ్రాణం అనే ఐదింటిని ఆరవసర్గం అని చెప్పారు. ఇది బహుచింతాత్మకం అని అంటారు. నరేంద్రా ! శ్రోత్రాదీంద్రియాల తరువాత కర్మేంద్రియాల ఉత్పత్తి జరుగుతుంది. దీనిని ఏడవసర్గం అన్నారు. దీనిని ఐంద్రియ సృష్టి అని కూడా అన్నారు. తరువాత పైకి ప్రవహించే ప్రాణం, అడ్డంగా ప్రవహించే సమానం, వ్యానం, ఉదానం ఇవి అన్నీ వ్యక్తం అయ్యాయి. ఇది ఎనిమిదవ సర్గం. దీనిని ఆర్జవక సర్గం అన్నారు. రాజా ! తరువాత వంకరగాపోయే వ్యానం, ఉదానం, అపానం అనే వాయువులు కూడా క్రింది భాగంలో వ్యక్తమైనవి. దీనిని నవమ సర్గం అంటారు. దీన్ని కూడా విద్వాంసులు ఆర్జవకసృష్టి అనే పేరుతోనే వ్యవహరించారు. నరాధిపా ! ఈ తొమ్మిది సృష్టులు, ఇరవైనాలుగు తత్త్వాలు వేదాలు నిర్దేశించిన ప్రకారంగానే ఇక్కడ చెప్పాను. మహారాజా ! దీని తరువాత మహాత్ములు చెప్పిన సృష్టికాల సంఖ్యనుకూడ నేను చెపుతాను, విను."

311. సృష్టి వర్ణనాదులు.

యాజ్ఞవల్క్యుడు చెపుతున్నాడు. "మానవోత్తమా ! ఇక అవ్యక్త కాల సంఖ్యను విను. పదివేల కల్పాలు (మహాయుగాలు) ఈ అవ్యక్తానికి ఒక పగలు అని చెప్తారు. దానికి రాత్రి సమయంకూడా ఇంతే. జ్ఞాన స్వరూపుడగు ఆ పరమాత్మ మొదట సమస్త ప్రాణులు జీవించటానికి ఓషధులను (అన్ని విధాలయిన ఆహారాన్ని) సృష్టిస్తాడు. ఓషధులను సృష్టించిన తరువాత బ్రహ్మదేవుని సృష్టించాడు. ఆయన సువర్ణమయమైన అండంలో వ్యక్తమయినాడు. ఆయనయే సమస్త ప్రాణుల ఆవిర్భావ స్థానం అని మేము విన్నాం.

మహాముని అయిన ఆ ప్రజాపతి ఆ సువర్ణమయాండంలో ఒక సంవత్సరం ఉండి తరువాత బయటికి వచ్చాడు. తరువాత ఆయన సమస్తభూమిని, ఆకాశాన్ని, ఊర్ధ్వలోకాన్ని (స్వర్గాన్ని) సృష్టించాలని నిశ్చయించుకొన్నాడు. రాజా ! శక్తిశాలి అయిన బ్రహ్మ రెండుభాగాలైన ఆ అండం ముక్కల (స్వర్గ-భూమండలాల) మధ్యలో ఆకాశాన్ని సృష్టించాడని వేదాలలోనే చెప్పినట్లు ఉన్నది. వేద వేదాంగ పారంగతులైన విద్వాంసులు బ్రహ్మదేవునికాల సంఖ్యను నిర్ణయిస్తూ ఇలా చెప్పారు. పదివేల కల్పాలలో నాల్గవవంతు తగ్గిస్తే మిగిలిన కాలం ఒక దినం. అంటే 7 ½ వేల కల్పాలు బ్రహ్మకు ఒక దినం అవుతుంది. అధ్యాత్మచింతనులైన విద్వాంసుల ఉద్దేశ్యానుసారం, బ్రహ్మ దేవుని రాత్రి సమయం కూడా ఇంతకాలమే. మహాముని అయిన బ్రహ్మ అహంకారం అనే దివ్యభూతం సృష్టిస్తాడు. రాజసత్తమా ! మహర్షి అయిన బ్రహ్మ పూర్వకాలంలో భౌతికదేహ సృష్టికి ముందు (బుద్ధి, అహంకారం, మనస్సు, చిత్తం అనే) నలుగురు పుత్రులను సృష్టించాడు. ఆ నలుగురు పుత్రులు పితరులకే పితరులు. అంటే పంచభూతాలకు జనక స్థానాలు. మానవేంద్రా ! దేవతలు (శ్రోత్రాదులయిన ఇంద్రియాలు) పితరులకు (పంచభూతాలకు) పుత్రులు. అంటే ఇంద్రియాలు అన్నీ పంచమహాభూతాల నుండియే ఉద్భవించిన వని, సమస్త చరాచర జగత్తుకు ఆశ్రయాలు అయి ఉన్నవని విన్నాం. పరమేష్ఠి అనే ఉత్తమస్థానంలో ఉన్న అహంకారం ఆకాశం, వాయువు, తేజస్సు, జలం, పృధివి అనే అయిదు రకాలయిన భూతాలను సృష్టిస్తుంది. మూడవదైన తృతీయ సర్గాన్ని సృష్టించే అహంకారానికి రాత్రికాలం అయిదువేల కల్పాలు అవుతుంది. దాని పగలు కూడా అంతే సమయం అని చెపుతారు. ఆకాశాదులయిన పంచభూతాలలో క్రమంగా శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం అనే విశేషగుణాలు ఉన్నాయి.

పార్థివా ! ప్రవాహరూపంగా నిరంతరం ఉండే మనోహరమైన శబ్దాది విషయాలు ప్రవేశించిన అన్నిప్రాణులు ప్రతిరోజు ఒకటి ఇంకొక దాన్ని కోరుతూంటాయి. మరొకప్పుడు పరస్పరం ఈర్ష్య చెందుతూ ఉంటాయి. మరొకసారి ఒకదాన్ని ఇంకొకటి దెబ్బతీస్తూంటాయి. ఇలా విషయాసక్తాలయిన ప్రాణులు తిర్యగ్జాతులలో ప్రవేశించి, సృష్టిలో సంచరిస్తూంటాయి. ఈ శబ్దాదులయిన విషయాలకు మూడువేల కల్పాలు ఒకరోజు అని చెప్పారు. వీటిరాత్రి కూడా ఇంత దీర్ఘకాలమే ఉంటుంది. మనస్సుకును పగలు రాత్రులసమయం ఇంతకాలమే అవుతుంది. రాజేంద్రా ! మనస్సు ఇంద్రియాల ద్వారా ప్రవర్తించి అన్ని విషయాల మీదికి వెళ్ళుతుంది. ఇంద్రియాలు ఆ విషయాలను గమనించలేవు. మనస్సే వాటిని నిరంతరం గమనిస్తుంటుంది. నయనేంద్రియం మనస్సంయోగంతోనే రూపం దర్శించగలదుగాని

స్వశక్తితోకాదు. మనస్సు వ్యాకులంగా ఉన్నప్పుడు కన్నులు చూస్తూ ఉన్నా ఏ వస్తువునూ గుర్తించలేవు. సమస్తమైన ఇంద్రియాలు విషయాలను గ్రహిస్తాయి అని లోకం అనటం భ్రాంతి మూలకమే. రాజా ! ఇంద్రియాలు దేన్నీ చూడలేవు. కేవలం మనస్సే చూడ గలుగుతుంది. మనస్సు విషయాల నుంచి వెనుదిరిగితే ఇంద్రియాలు కూడా విషయాలనుంచి వెనుదిరుగుతాయి. ఇంద్రియాలు విశ్రాంతి పొందినా, మనస్సులో విశ్రాంతి ఉండదు. ఇలా ఆలోచించే ఇంద్రియాలు అన్నింటిలో మనస్సే ప్రధానం అయినది అని నిశ్చయం చేయాలి. ఇంద్రియాలన్నింటికీ ప్రభువు మనస్సే అని చెపుతారు. మహాయశా ! లోకంలో ఉండేసమస్త ప్రాణులు ఈ మనస్సు ఆశ్రయాన్నే గ్రహిస్తాయి."

312. ప్రళయ వర్ణనము.

యాజ్ఞవల్క్యుడు చెపుతున్నాడు. "రాజా ! ఇంతవరకు క్రమంగా తత్త్వాల సంఖ్యను, కాలసంఖ్యను చెప్పాను. ఇక సృష్టి ఉపసంహారాన్ని చెపుతాను, విను. మొదలు, తుదిలేనివాడు, అక్షరస్వరూపుడు అయిన బ్రహ్మ ప్రతిసారి మాటి మాటికి ప్రాణుల సృష్టిని, సంహారాన్ని చేసే విధానాన్ని జాగ్రత్తగా విను. భగవంతుడైన చతుర్ముఖబ్రహ్మ 'మేలుకొని ఉండే పగటికాలం పూర్తి అయింది. రాత్రి నిద్రించే సమయం అయింది' అని తెలుసుకొని అహంకారాభిమాని అయిన రుద్రుని సంహారానికి ప్రేరేపిస్తాడు. ఆ ప్రేరణ పొందిన రుద్రుడు ప్రచండమైన సూర్యరూపాన్ని ధరించి, తనపన్నెండు రూపాలను వ్యక్తంచేస్తూ అగ్నివలె జ్వలిస్తుంటాడు. రాజా ! ఆయన తన జ్వాలలతో జరాయుజములు, అండజాలు, స్వేదజాలు, ఉద్భిజాలు అనే నాలుగు విధాలయిన ప్రాణులతో నిండిఉన్న సమస్తజగత్తును త్వరగానే భస్మం చేస్తాడు. ఒక్క రెప్పపాటు కాలంలోనే ఈ సమస్తచరాచర జగత్తు నాశం అయిపోతుంది. అన్ని వైపులనుంచి ఈ భూమి తాబేటి చిప్పవలె కన్పిస్తుంది. జగత్తును అంతా దగ్ధం చేసిన తరువాత, మహాబలిష్ఠుడైన రుద్రుడు మిగిలిఉన్న భూమిని అంతనూ మహాజలప్రవాహంలో ముంచివేస్తాడు.

తరువాత కాలాగ్నిజ్వాలలో పడి ఆ జలం అంతా ఇంకి పోతుంది. అప్పుడు ఆ అగ్ని భయకరరూపాన్ని ధరించి, అన్ని వైపులా మహాతీవ్రంగా జ్వలించసాగుతుంది. అన్ని భూతాలకు బాగా వేడిమిని కలిగించి, ప్రబలవేగంతో మండుతున్న జ్వాలలతో గూడిన ఆ అగ్నిని, బలిష్ఠుడైన వాయుదేవుడు తన ఎనిమిది రూపాలను ఆవిష్కరించి, క్రిందిగి క్రింద, పైన, మధ్య భాగాలలో అన్ని వైపులా వీచసాగుతాడు. సాటిలేని బలంగల,

భయంకరమైన వాయువును ఆకాశం మ్రింగివేస్తుంది. పెద్దగా ధ్వనిస్తున్న ఆకాశాన్ని అధికశక్తిగల మనస్సు మ్రింగుతుంది. క్రమంగా భూతాత్మ ప్రజాపతి రూపమైన అహంకారం మనస్సును తనలో లీనం చేసుకొంటుంది. తరువాత సర్వేశ్వరుడు అసమాన మయిన బుద్ధి తత్త్వాన్ని తనలో లీనం చేసుకొంటాడు. అతడు అన్నివైపుల చేతులు కాళ్ళు అంతటానేత్రాలు, శిరస్సులు, ముఖాలు, కన్నులు గలవాడు. జగత్తులు సమస్తాన్ని వ్యక్తంచేస్తాడు. అతడు సర్వప్రాణుల హృదయాలలో బొటనవ్రేలి కణుపు అంత ఆకారాన్ని ధరించి వెలిగేవాడు. అణిమ, లఘిమ, ప్రాప్తి మొదలైన ఐశ్వర్యాలు స్వాధీన మైనవాడు. సర్వనియంత, జ్యోతీరూపుడూ, అవినాశి, మంగళమయుడు, ప్రజాపతి, అనంతుడు, మహాత్ముడు. అనంతరం హ్రాసవృద్ధులులేనిదై, వినాశరహితమై, నిర్వికారమై, సర్వరూపమైన ఆ పరబ్రహ్మమే మిగులుతుంది. అదే, భూతభవిష్య ద్వర్తమానాలు అనే త్రైకాలిక సృష్టిని చేసే పవిత్ర బ్రహ్మనుగూడ సృష్టిస్తుంది. రాజేంద్రా ! ఈరీతిగా సృష్టి ఉపసంహారాన్ని - ప్రళయాన్ని యథార్థంగా వివరించాను. ఇంక అధ్యాత్మం, అధిభూతం, అధిదైవం అనే మూడింటిని గూర్చి వినుము."

313. ఆధ్యాత్మికాధిభౌతికాధిదైవికములు, సత్త్వరజస్తమో గుణములు.

యాజ్ఞవల్క్యుడు చెపుతున్నాడు. "రాజా ! రెండుకాళ్ళు అధ్యాత్మం, వెళ్ళవలసిన చోటు అధిభూతం, విష్ణువు అధిదైవతం అని తత్త్వాన్ని దర్శించిన బ్రాహ్మణులు చెపుతారు. గుదం (మల విసర్జనావయవం) అధ్యాత్మం, మలవిసర్జనం అధిభూతం, మిత్రుడు అధిదైవతం అని తత్త్వార్థం తెలిసిన వారు చెప్పారు. యోగమతాన్ని చెప్పేవారు మూత్రావయవం అధ్యాత్మ మని, స్త్రీపురుషసంయోగం వల్ల కలిగే ఆనందం అధిభూత మని, ప్రజాపతి అధిదైవత మని అంటారు. సాంఖ్యదర్శనులైన విద్వాంసులు చెప్పినట్లు రెండుచేతులు అధ్యాత్మం, కర్తవ్యం (చేయవలసిన పని) అధిభూతం, ఇంద్రుడు అధిదైవతం. వాక్కు అధ్యాత్మం, చెప్పవలసినది అధిభూతం, అగ్ని అధిదైవతం అని వేదార్థం తెలిసినవారు చెప్పారు. నేత్రాలు అధ్యాత్మం, రూపం అధిభూతం, సూర్యుడు అధిదైవం అని వేదజ్ఞులు చెప్పారు. శ్రోత్రం - శ్రవణేంద్రియం అధ్యాత్మం, శబ్దం అధిభూతం, దిక్కులు అధిదైవతాలు అని వేదవిదుల వచనం. నాలుక అధ్యాత్మం, రసం అధిభూతం, జలం అధిదైవతం అని వేదవేత్తలు అంటారు. ఘ్రాణం - వాసన తెలుసుకునే ఇంద్రియం అధ్యాత్మం, గంధం - వాసన అధిభూతం, పృథివి అధిదైవతం అని వేదజ్ఞులు అంటారు. చర్మం - స్పర్శేంద్రియం అధ్యాత్మం, స్పర్శ అధిభూతం, వాయువు అధిదైవతం అని తత్త్వవేత్తల మాట. మనస్సు

అధ్యాత్మం, మంతవ్యం - తెలుసుకొనవలసినది అధిభూతం, చంద్రుడు అధిదైవతం అని శాస్త్రజ్ఞులు చెపుతారు. అహంకారం అధ్యాత్మం, అభిమానం అధిభూతం, రుద్రుడు అధిదైవతం అని తత్త్వదర్శనులు చెపుతారు. బుద్ధి అధ్యాత్మం, తెలుసుకోవలసినది అధిభూతం, క్షేత్రజ్ఞుడు (ఆత్మ) అధిదైవతం అని యథార్థవిదులు చెపుతారు. తత్త్వవేత్తవైన రాజా ! ఆదిలో, మధ్యలో, అంతంలో యథార్థంగా వ్యక్తమయ్యే జీవుని వ్యక్తిగత విభూతిని వివరించాను.

మహారాజా ! ప్రకృతి స్వతంత్రంగా క్రీడించటానికి, తన ఇష్టానుసారం వందలు వేల గుణాలను సృష్టిస్తుంది. మానవులు ఒకదీపం నుంచి వేలదీపాలను వెలిగించినట్లుగా, ప్రకృతి పురుషసంబంధంతో అనేక గుణాలను ఉత్పన్నం చేస్తుంది. ధైర్యం, ఆనందం, గొప్పతనం, ప్రీతి, జ్ఞానప్రకాశం, సుఖం, శుద్ధి, ఆరోగ్యం, సంతోషం, శ్రద్ధ, దైన్యరాహిత్యం, కోపం లేకపోవటం, క్షమ, ధృతి, అహింస, సమత్వం, సత్యం, అప్పులేకపోవటం, మృదుత్వం, మార్దవం, లజ్జ, చంచలత్వం లేకపోవటం, శౌచం, సారళ్యం, సదాచారం, లౌల్యం లేకపోవటం, తొట్రుపాటు లేకపోవటం, ఇష్టమైనవి దూరం కావటం, అనిష్టాలు కలగటంలో సంతోషమూ విచారమూ పొందకపోవటం, దానంలో ధైర్యంగా ఉండటం, ఏవస్తువు మీద ఆసక్తిలేకపోవటం, పరోపకారం, అన్ని ప్రాణులమీద దయ - ఈ గుణాలు అన్నీ సాత్త్విక గుణాలు. రూపం, ఐశ్వర్యం, పోట్లాట, త్యాగరాహిత్యం దయలేకపోవటం, సుఖదుఃఖాల అనుభవం, పరనిందలలో ఆసక్తి, వాదం వివాదం చేయటం, అహంకారం, గౌరవించవలసినవారిని గౌరవించకపోవటం, దిగులు పడటం, శుత్రుత్వం పెట్టుకోవటం, తహ తహ లాడటం, ఇతరుల ధనం అపహరించటం, సిగ్గులేకపోవటం, కపటం, భేదభావం, కఠినత్వం, కామం, క్రోధం, మదం, దర్పం, ద్వేషం, ఎక్కువగా మాటలాడటం - ఇవి అన్నీ రజో గుణ సమూహం. ఇక తామసగుణ సముదాయం వివరిస్తాను విను. మోహం, అజ్ఞానం, తామిస్రం, అంధతామిస్రం అనేవి తమోగుణ లక్షణాలు. వీటిల్లో తామిస్రం అంటే కోపం, అంధతామిస్రం అంటే మరణం అని అర్థం. ఆహారంలో ఏదీ రుచించకపోటం, ఆహారంలో అసంతృప్తి, ఎంత ఆహారం లభించినా తృప్తిచెందకపోవటం, త్రాగేవాటితో తృప్తి చెందక పోవటం. దుర్వాసనగల వస్త్రాల ధారణ, అనుచితమైన విహారం, మురికి పట్టిన ప్రక్క, కుర్చీలను ఉపయోగించటం, పగటినిద్ర, అధికమైన వాదవివాదాలలో పాల్గొనటం, కష్టాలలో చిక్కుకోవటం, ఏమాత్రం పరిజ్ఞానం లేకపోయినా నాట్యం, గానం, వివిధవాద్య ధ్వనుల మీద ఆసక్తి, నానావిధాలయిన సిద్ధాంతాల మీద, ధర్మాలమీద ద్వేషం అనేవి తమోగుణలక్షణాలు."

314. సాత్వికి రాజస తామస ప్రకృతులకు కల్లుగతులు.

యాజ్ఞవల్క్యుడు చెపుతున్నాడు. "నరశ్రేష్ఠా ! సత్వం, రజస్సు, తమస్సు అనేవి ప్రకృతి గుణాలు. ఇవి జగత్తులో అంతటా ఉంటాయి. ఎప్పుడూ వాటి నుంచి విడిగా ఏదీ ఉండదు. అవ్యక్తరూపుడయిన పరమాత్మ ప్రభావం వలన సర్వసామర్థ్యాలు గల ప్రకృతి తన శక్తితో జీవుని కోట్లు, వేలు, లక్షల రూపాలను ఏర్పరుస్తుంది. అధ్యాత్మ శాస్త్రజ్ఞులు సాత్వికి వ్యక్తికి ఉత్తమ స్థానం, రాజస వ్యక్తికి మధ్యమ స్థానం, తామసునికి అధమస్థానం కలుగుతాయని చెప్పారు. పుణ్యం మాత్రమే చేస్తే మానవునికి ఊర్ధ్వ గతి, పుణ్యపాపాలు రెండూ చేస్తే మధ్యమగతి, పాపమే మాత్రం చేస్తే అధోగతి కలుగుతుంది. సత్వరజస్తమస్సులనే త్రిగుణాల ద్వంద్వ సన్నిపాతాలను యథార్థరూపంగానే చెపుతాను, విను. (రెండుగుణాల కలయికను ద్వంద్వం అని, మూడు గుణాలకలయికను సంనిపాతం అని అంటారు). సత్వగుణంతో రజోగుణం, రజోగుణంతో తమోగుణం, తమోగుణంతో సత్వగుణం, సత్వగుణంతో అవ్యక్తానికి (జీవాత్మకు) కలయిక కన్పిస్తున్నది. (ఇది రెండుతత్వాలు సమ్మేళనం ద్వంద్వం). జీవాత్మ సత్వగుణంతో కలిస్తే దేవలోక ప్రాప్తి ఉంటుంది. రజోగుణ సత్వగుణాలు కలిస్తే మానవలోకానికి జీవుడు వెళ్తాడు. రజోగుణ తమోగుణాలతో కలిస్తే పశుపక్ష్యాదుల జన్మ కలుగుతుంది. రాజస తామస సత్వగుణాలు మూడూ కలిస్తే జీవుడు మానవజన్మ పొందుతాడు. పుణ్యపాపాలు లేని మహాత్ములకు సనాతనం, వికారరహితం, అక్షయం, అమృతం అయిన పదం కలుగుతుంది. ఎలాంటి కష్టాలులేనిది, పతనంలేనిది, ఇంద్రియాతీతం, బంధకారణాలు ఏవీ లేని జన్మమృత్యువులను, అజ్ఞానాన్ని నశింపజేసే శ్రేష్ఠస్థానం (పరమపదం) జ్ఞానులకే లభిస్తుంది. రాజా ! నీవు అడిగిన అవ్యక్త ప్రకృతిలో ఉన్న పరతత్వం విషయ ప్రశ్నకు ఈ చెప్పబోయేది సమాధానం. ఈ పరతత్వం ప్రాకృతమైన శరీరంలో ఉండటం చేతనే ప్రకృతిస్థం అంటారు. రాజా ! ప్రకృతిని అచేతన అన్నారు. ఈ పరతత్వం అధిష్ఠించటం చేతనే అది సృష్టిసంహారాలను చేస్తుంది." జనకుడు అడిగాడు. "మహాత్మా ! ప్రకృతి పురుషులు ఇద్దరు ఆద్యంతాలు లేనివారు, ఆకార హీనులు, అచలులు, ఆకారరహితులు ఇరువురు తమతమ గుణాలలో స్థిరంగా ఉండేవారు, నిర్గుణులు. మునిశ్రేష్ఠా ! వారు బుద్ధికి అందనివారు. మరి ఆ యిరువురిలో ఒకటైన ప్రకృతిని మీరు అచేతనం అన్నారు? రెండవవారిని చేతనుడు, క్షేత్రజ్ఞుడు అని ఎందుకు చెప్పారు ? బ్రాహ్మణోత్తమా ! మీరు సంపూర్ణంగా మోక్షధర్మాన్ని ఉపాసిస్తున్నారుగదా ! కాబట్టి మోక్షధర్మాన్ని యథావిధిగా మీనుండి వినగోరుతున్నాను. పురుషుని అస్తిత్వాన్ని, కేవలత్వాన్ని, ప్రకృతికంటె భిన్నమైన అస్తిత్వాన్ని స్పష్టంగా చెప్పండి. దేహాన్ని ఆశ్రయించి ఉండే దేవతల

తత్వాన్ని నాకు తెలియజెప్పవలసింది. మరణించే జీవుని ప్రాణోత్క్రమణ సమయంలో కాలానుసారం ఏ స్థానం లభిస్తుంది ? ఈ విషయాలను చెప్పండి. మహాత్మా ! వీటితో పాటు ప్రత్యేకంగా సాంఖ్య యోగాలు రెండింటిని, మృత్యువును సూచించే లక్షణాలను ఉన్నది ఉన్నట్లు చెప్పవలసినది. ఈ విషయాలు అన్నీ మీకు అరచేతిలో ఉసిరి కాయవలె సులభం అయినవి."

315. ప్రకృతి పురుషుల వివేకము.

యాజ్ఞవల్క్యుడు చెపుతున్నాడు. "రాజేంద్రా ! నిర్గుణాన్ని సగుణంగా చేయలేము. సగుణాన్ని నిర్గుణంగా చేయవీలుగాదు. ఈ విషయమై యథార్థతత్వాన్ని చెపుతాను, విను. గుణాలతో సంపర్కంగల వాడు గుణవంతుడు అని, గుణాలతో సంసర్గం లేనివాడు నిర్గుణుడు అనీ తత్వదర్శనం చేసిన మహాత్ములైన మునులు చెప్పారు. అవ్యక్తమైన ప్రకృతి స్వభావ సిద్ధంగానే గుణవతి. ఆమె గుణాలను ఏ సమయంలోనూ వదలి ఉండదు. వాటినే ఉపయోగంలోకి తెస్తుంది. సహజంగానే జ్ఞాన రహితం. ప్రకృతి ఏ వస్తువును ఎరుగదు. ఇందుకు విపరీతంగా పురుషుడు సహజంగానే జ్ఞాని. నాకంటే మరే ఇతర పదార్థం గొప్పది లేదని ఆయనకు తెలుసు. ఇందువల్ల ప్రకృతిని అచేతనం అన్నారు. క్షరం - వినాశశీలం కావటంవలన అది జడం కాక ఇంకేమీ కాలేదు. నిత్యుడు, అక్షరుడు (నాశరహితుడు) కావటంచేత పురుషుడు చేతనుడు. కాని ఆ పురుషుడు అజ్ఞానం వల్ల మాటి మాటికి గుణాలతో సంబంధం కలిగి, అసంగం అయిన స్వస్వరూపాన్ని తెలుసుకోనంతవరకు ఆయనకు ముక్తి కలుగదు. ఆయన తనను సృష్టికర్తను అనుకోవటం వలన ఆయనను సర్గధర్ముడు అంటారు. యోగకర్తను అనుకోవటం చేత యోగధర్ముడు అంటారు. అనేక ప్రకృతులను తనలోకి స్వీకరించటంవలన ఆయనను ప్రకృతి ధర్ముడు అనికూడా అంటారు. స్థావర (కదలకుండా ఉండే) బీజాలకు కర్త కావటం వలన ఆయనను బీజధర్ముడు అంటారు. దాంతోపాటు గుణాల ఉత్పత్తికి, నాశానికి కర్తకావటంవలన గుణధర్ముడు అంటారు. సాక్షి, అద్వితీయుడు కావటం వలన, సుఖ దుఃఖానుభవం అభిమానంవలన కలుగుతుంది కనుకా, వాస్తవానికి నిత్యుడు అవ్యక్తుడు అవటంవలనా, ప్రకృతి సంబంధంవలన మాత్రమే అనిత్యుడుగా, వ్యక్తరూపుడుగా కనిపించటంవలనా అధ్యాత్మ శాస్త్రం బాగాతెలిసిన యతీశ్వరులు ఆయనను ప్రకృతి సంగరహితునిగా భావిస్తారు.

సర్వప్రాణులయందు దయగలవారు, జ్ఞానులు అయిన సాంఖ్య విద్వాంసులు ప్రకృతిని ఏక స్వరూప అనీ, పురుషుని అనేకరూపు డనీ భావిస్తారు. పురుషుడు ప్రకృతికంటె

భిన్నుడు, నిత్యుడు. అలాగే అవ్యక్తం (ప్రకృతి) పురుషునికంటె భిన్నమూ, అనిత్యమూ అవుతుంది. కాడకంటె ముంజెగడ్డి వేరైనట్లే ఇదీ అవుతుంది. మేడిపండూ, దానిలో ఉన్న చిన్న చిన్న పురుగులూ కలిసి ఉన్నా; అవి రెండూ వేరే అని తెలియాలి. మేడిపండులో పురుగులు ఉన్నా అవి ఏకం కావు. వేరువేరుగానే ఉంటాయి. అలాగే నీరూ చేపలూ కూడా - జలస్పర్శతో చేపలు నీటితో కలిసిపోవు, ఏకం కావు - వేర్వేరే ! అగ్ని వేరు. మట్టికుండ వేరేవస్తువు. ఈ రెండింటికి భేదం నిత్యంగా ఉన్నదని తెలుసుకో. మట్టిపాత్ర స్పర్శవలన అగ్నికి దోషం కలుగదు. కమలం వేరు, నీరు వేరు. నీటిస్పర్శ కమలానికి అంటుకొనదు. అలాగే పురుషుడు కూడ ప్రకృతికంటె భిన్నుడు, అసంగుడు అవుతాడు. సాధారణమనుష్యులు వీటి సహవాసం, నివాసం సరిగా తెలుసుకొనలేరు. ప్రకృతి పురుషులు భిన్నులు అని తెలియని వారి (ఆలోచన) దృష్టి సరి ఐనది కాదు. వారు మాటిమాటికి ఘోరనరకంలో తప్పక పడుతుంటారు. ఈ విధమైన ఆలోచనాముఖ్యమైన ఉత్తమ సాంఖ్యదర్శనాన్ని నీకు చెప్పాను. సాంఖ్య శాస్త్ర విద్వాంసులు ఇలా తెలుసుకొని మోక్షాన్ని పొందారు. తత్త్వవిచారణలో నేర్పరులైన ఇతర విద్వాంసుల మతమూ ఇదే. దీని తరువాత యోగశాస్త్రాన్ని గురించి చెపుతాను."

316. యోగశాస్త్ర మహత్త్వము.

యాజ్ఞవల్క్య మహర్షి చెప్పాడు. "రాజశ్రేష్ఠా ! సాంఖ్యశాస్త్ర జ్ఞానాన్ని ఇంతవరకు నీకు చెప్పాను. ఇంక నేను చూచినది, విన్నది, తెలిసికొన్నది అయిన యోగ శాస్త్రజ్ఞానతత్త్వాన్ని చెపుతాను, విను. సాంఖ్యంతో సమానమైన జ్ఞానం లేదు. యోగంతో సమానమైన బలం లేదు. ఆ రెండింటి లక్ష్యం ఒకటే. ఆ రెండూ మృత్యునివారకాలు అని చెపుతారు. రాజా ! అజ్ఞాన పరాయణులైన వారు మాత్రమే ఈ రెండు శాస్త్రాలను భిన్నాలని అభిప్రాయపడతారు. మేము మాత్రం పరిశీలనతో సంపూర్ణంగా నిశ్చయించుకొని, రెండూ ఒకటే అని భావిస్తున్నాం. యోగులు సాక్షాత్కరింపజేసుకొనే తత్వాన్నే సాంఖ్యులు కూడా దర్శిస్తారు. కాబట్టి సాంఖ్య యోగశాస్త్రాల అభిప్రాయం ఒకటే అని తెలుసుకొన్నవాడే అసలైన తత్త్వవేత్త. శత్రుంజయా ! యోగసాధనలో రుద్రుడు - ప్రాణాలు ప్రధానమైనవి. ఇవి అన్నీ ప్రధానమైనవే అని తెలుసుకో. ప్రాణాలను స్వవశం చేసుకున్న యోగి ఈ శరీరంతోనే పదిదిక్కులలోను స్వేచ్ఛగా సంచరించగలడు. పవిత్రుడా ! మరణం కలగనంతవరకు, యోగి యోగబలంతో స్థూలశరీరాన్ని ఇక్కడనే వదలి, అష్టైశ్వర్యాలు గల సూక్ష్మశరీరంతో, లోకలోకాంతరాలలో సుఖంగా సంచరించగలడు. నృపసత్తమా !

వేదంలో స్థూలం, సూక్ష్మం అని ద్వివిధ యోగవర్ణన ఉంది. వాటిల్లో అణిమాదులైన అష్టసిద్ధులు కలిగించేది స్థూలయోగం. యమం, నియమం, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి అనే ఎనిమిది అంగాలతో గూడినది సూక్ష్మయోగం. ఈ రెండూ తప్ప ఇంకొకటి లేదు. సబీజం, నిర్బీజం - సగుణం, నిర్గుణం అని యోగానికి రెండు సాధన రీతులు ఉన్నవి. ఇది శాస్త్ర సిద్ధాంతం. భూపాలా ! మనస్సును ఒక ప్రత్యేకమైన చోట నిలపటాన్ని 'ధారణ' అంటారు. మనోధారణతో చేసే ప్రాణాయామం సగుణం. ఒక ప్రత్యేక ప్రదేశాన్ని ఆశ్రయించకుండా, మనస్సును నిర్బీజమైన సమాధిలో ఏకాగ్రం చేయటం నిర్గుణప్రాణాయామం అని అంటారు. సగుణప్రాణాయామం మనస్సును నిర్గుణాన్ని - అంటే వృత్తి శూన్యాన్ని చేసి, స్థిరం చేయటంలో సహకరిస్తుంది. వాయుపూరణాదిసమయంలో ఒక నిర్దిష్టదేవతాదులను ధ్యానంతో సాక్షాత్కరింప చేసుకొనకుండా ప్రాణవాయువును రేచనం చేసే ఆ సాధకుని శరీరంలో వాయుప్రకోపం అధికం అవుతుంది. కాట్టి ధ్యానరహిత ప్రాణాయామం చేయగూడదు. రాత్రి మొదటి జాములో వాయుధారణ చేయటానికి పన్నెండు చోదనలను, మధ్యకాలంలో నిద్రించిన తరువాత, చివరిజాములో - తెల్లవారుజామున పన్నెండు చోదనలను అభ్యాసం చేయాలి. ఈ రీతిగా ప్రాణాయామాలతో మనస్సును వశం చేసుకొని శాంతుడు, జితేంద్రియుడు అయి ఏకాంతవాసం చేసే ఆత్మారాము డైన జ్ఞాని, మనస్సును పరమాత్మలో లగ్నం చేయాలి. సందేహం లేదు.

మిథిలాధీశా ! శబ్దస్పర్శ రూపరస గంధాలు అనే అయిదు ఇంద్రియాల దోషాలను దూరం చేసుకోవాలి. తరువాత లయ విక్షేపాలను శాంతింపజేసుకొని పంచేంద్రియాలను మనస్సులో ప్రవేశపెట్టుకోవాలి. తరువాత మనస్సును అహంకారంలో, అహంకారాన్ని బుద్ధిలో, బుద్ధిని ప్రకృతిలో నిలపాలి. ఈరీతిగా అన్నింటిని లయింపజేసి యోగులు రజోగుణరహితం, నిర్మలం, నిత్యం, అనంతం, శుద్ధం, ఛిద్రరహితం, కూటస్థం, అంతర్యామి, అభేద్యం, అజరం, అమరం, అవికారి, సర్వశాసకం, సనాతనం అయిన పరమాత్మను మాత్రమే ధ్యానిస్తారు. మహారాజా ! సమాధిస్థితిలో ఉన్న యోగిలక్షణాలను విను. బాగా సంతృప్తుడైన వ్యక్తి సుఖంగా నిద్రించినట్లు, యోగయుక్తుని మనస్సు ఎల్లప్పుడు ప్రసన్నమై ఉంటుంది. ఆ సమాధిస్థితినుంచి విరమించటానికి ఇష్టపడడు. ఇదే ఆయన మనఃప్రసన్నతకు గుర్తు అవుతుంది. నూనెతో నిండియున్న ప్రమిదలోని దీపం, గాలిలేనిచోట నిశ్చలంగా, జ్వాలతో ఊర్ధ్వశిఖంగా వెలిగేటట్లు, సమాధినిష్ణుడైన యోగి కూడా సుస్థిరంగా ఉంటాడని విద్వాంసులు చెపుతారు. మేఘం వర్షించిన జలబిందువుల దెబ్బకు పర్వతం

చలించనట్లు, అనేకమైన విక్షేపాలు కలిగినా యోగి చలించడు. ఇదే యోగయుక్తు డైన వాని లక్షణం. **శంఖాలు, నగారాలను పెద్దగా మ్రోగిస్తున్నా, రకరకాల మధురగీతాలు వినపడుతున్నా, యోగికి జ్ఞానభంగం కలుగదు. ఇదే ఆయన దృఢమైన సమాధిస్థితికి లక్షణం.** మనస్సును అదుపులో పెట్టుకొని, జాగ్రత్తగా ఉండి, మనుష్యుడు చేతులలో నూనెనిండిన పాత్ర పట్టుకొని మెట్లపైకి ఎక్కుతున్నప్పుడు, రెండువైపులా చాలా మంది మనుష్యులు కత్తులు పైకెత్తి 'నూనె బొట్టు క్రింద పడితే చంపుతాం' అని భయపెడుతున్నప్పుడు, ప్రాణభీతితో ఒక్క తైలబిందువు కూడా క్రిందపడకుండా ఎక్కినట్లు, యోగంలో ఉన్నతస్థితిని పొందిన ఏకాగ్ర చిత్తుడైన యోగి ఇంద్రియాలు స్థిరంగా ఉండటంచేత, మనస్సు నిశ్చలంగా ఉండటం చేత సమాధిస్థితి నుంచి చలించడు. యోగ సిద్ధుడైన మునికి ఇలాంటి లక్షణాలు ఉంటాయని తెలుసుకోవాలి. **సమాధిస్థితిలో చక్కగా ఉన్న వ్యక్తి మహత్తరమైన అంధకారంలో ప్రకాశిస్తున్న ప్రజ్వలించే అగ్నివలె, హృదయంలో ఉండే వినాశరహితమైన (జ్ఞాన స్వరూపమైన) పరమాత్మను సాక్షాత్కరింపజేసుకొంటాడు.** రాజా ! ఈ సాధనలో మానవుడు దీర్ఘకాలం తరువాత, ఈ అచేతనమైన దేహాన్ని వదలి కేవలం (ప్రకృతి సంబంధంలేని) పరమాత్మను పొందుతాడు అని సనాతనమైన వేదవాక్కు చెపుతున్నది. ఇదే యోగుల యోగలక్షణం. ఇది కాక యోగానికి ఇంక ఏ లక్షణం ఉంటుంది ? ఈ యోగవిషయాన్ని బాగా తెలుసుకొని, విద్వాంసులు తాము కృతార్థులం అయినా మని భావిస్తారు."

317. మృత్యుసూచక లక్షణములు.

యాజ్ఞవల్క్యుడు చెప్పాడు. 'రాజా ! ఒక వ్యక్తికి శరీరం నుంచి ప్రాణాలు ఏయే అంగాలలో నుంచి బయటకు పోతే జీవుడు ఏయే లోకాలకు పోతాడో చెపుతాను, జాగ్రత్తగా విను. పాదాల నుంచి ప్రాణాలు పోయే వ్యక్తి విష్ణుదేవుని పరమధామానికి చేరుతాడు. పిక్కలనుండి ప్రాణాలుపోతే వసువులలోకానికి వెళ్తాడని విన్నాం. మోకాళ్ళనుండి ప్రాణోత్క్రమణం జరిగితే మహాత్ములైన సాధ్యులు అనే దేవతల లోకానికి వెళ్తాడు. మలద్వారం నుంచి పోతే మిత్రదేవతాస్థానానికి వెళ్ళుతాడు. నడుము నుంచిపోతే పృథ్వీలోకానికి, తొడల నుంచిపోతే ప్రజాపతిలోకానికి పోతాడు. శరీరంలోని కుడి ఎడమభాగాలనుంచిపోతే మరుత్తుల లోకానికి, బొడ్డు నుండి పోతే ఇంద్ర పదానికి, రెండు భుజాలనుండిపోతే కూడా ఇంద్రస్థానానికి, వక్షఃస్థలం నుంచిపోతే రుద్రలోకానికి పోతాడు. మెడలో నుంచిపోతే,

ఉత్తమమైన నరముని శ్రేష్ఠస్థానాన్ని పొందుతాడు. ముఖంనుంచి ఉత్క్రాంతి జరిగితే విశ్వేదేవతలను, చెవులనుంచి పోతే, దిక్కులకు అధిష్ఠాతలైన దేవతల లోకానికి వెళ్తాడు. ముక్కు నుంచిపోతే వాయుదేవుని, కన్నుల నుంచిపోతే అగ్నిదేవుని, కనుబొమల నుంచి పోతే అశ్వినీ దేవతలను, నుదుటి నుంచి అయితే పితృదేవతల లోకానికి ప్రాణి చేరుతాడు. శిరస్సునుండి ప్రాణోత్క్రమణం జరిగితే, ఆ వ్యక్తి దేవతలలో మొదట జనించిన బ్రహ్మ యొక్క లోకానికి వెళ్ళుతాడు. మిధిలాధిపా ! ప్రాణోత్క్రమణ స్థానాలని వీటిని చెప్పారు. ప్రాణులు శరీరాన్ని వదలినంతనే ఒక సంవత్సరం లోపున జీవునికి కలుగబోయే స్థానాలను అనిష్టసూచకాలై, మృత్యుసంకేతాలైన వాటిని జ్ఞానులు చెప్పివవి చెపుతాను.

పూర్వం బాగా ఉన్నకాలంలో చూచిన అరుంధతీ నక్షత్రాన్ని, ధ్రువునినక్షత్రాన్ని చూడలేనివారు; పూర్ణచంద్రబింబం, దీపజ్వాలల ఎడమభాగం ఖండిత మయినట్లు కన్పించేవారు ఒకసంవత్సరం మాత్రమే జీవిస్తారు. ఎదుటి వారి కనుపాపలలో తన ప్రతిబింబం చూడలేని వారి ఆయువు ఒక సంవత్సరం మాత్రమే మిగిలి ఉంటుంది. మానవునిలో ఉండే అధిక తేజస్సు తగ్గిపోయినా, చక్కగా ఉన్న తెలివితేటలు తగ్గిపోయినా, స్వభావంలో బాగా తేడాలు కలిగినా ఇవి అన్నీ ఆ వ్యక్తికి ఆరునెలలలోపలనే మృత్యువు కలుగుతుంది అని సూచవలు. నల్లటి శరీరచ్ఛాయ గలవాడైనా పాలిపోతే, దేవతలను నిందిస్తూ ఉంటే, బ్రాహ్మణులకు విరోధి అయితే ఆ వ్యక్తికి ఆరునెలలో మృత్యువు కలుగుతుంది. సూర్యచంద్ర బింబాలలో పాలెగూడులోని రంధ్రంలాంటి రంధ్రం ఉన్నట్లు కనిపించే వ్యక్తి వీడురోజులలో మరణిస్తాడు. దేవాలయంలో కూర్చుని, అక్కడ నుంచి వచ్చే సుగంధం శవం నుంచి వచ్చే దుర్వాసనలాగా అనిపించిన వ్యక్తి ఒక వారంలోనే మృత్యువు పాలు అవుతాడు. ముక్కులు, చెవులు వికారంగా అయినా; కన్నుల, దంతాల రంగు మారిపోయినా; స్మృతి ఎక్కువగా తప్పిపోతున్నా, శరీరం చల్లబడి పోతున్నా, అకస్మాత్తుగా ఎడమ కంటి నుండి నీరు కారుతున్నా, తలలో నుంచి ఆవిరి వస్తున్నా - ఇవి అన్నీ వెంటనే కలుగబోయే మృత్యుసూచకాలు.

మృత్యుసూచకాలయిన ఈ లక్షణాలను తెలుసుకొని, మనస్సును అదుపులో ఉంచుకొనే సాధకుడు రేయింబవళ్ళు పరమాత్మను ధ్యానిస్తుండాలి. మృత్యువు కలుగబోయే సమయం కోసం వేచి ఉండాలి. యోగికి అప్పుడు మరణించటం ఇష్టం లేకపోతే, ఇంకా ఈ లోకంలో ఉండదలుచుకొంటే ఈ పని చేయాలి. వెనక చెప్పినవిధంగా

పంచభూత విషయాలను ధారణచేసి, పృథివి మొదలైన తత్త్వాలను జయించి, గంధరసాదులను అన్నిటిని తనవశం చేసుకోవాలి.* మానవోత్తమా ! సాంఖ్య యోగ శాస్త్రానుసారం ధారణా పూర్వకంగా ఆత్మతత్త్వజ్ఞానాన్ని పొంది, ధ్యానయోగంతో అంతరాత్మను పరమాత్మలో లగ్నంచేసి, యోగి మృత్యువును జయిస్తాడు. ఇలా చేసిన వ్యక్తి సనాతనపదాన్ని పొందుతాడు. ఆ ఉత్తమస్థానం అపవిత్ర చిత్తులకు దుర్లభం. అంతేకాక అది అక్షయం, జన్మరహితం, అచలం, వికారరహితం, పరిపూర్ణం, మంగళకరం అయినది."

318. యాజ్ఞవల్క్య వృత్తాంతము - జీవాత్మ పరమాత్మల ఏకత్వము.

యాజ్ఞవల్క్య మహర్షి చెప్పాడు. "నరేంద్రా ! అవ్యక్తంలో ఉన్న పరబ్రహ్మ విషయం అడిగావుగదా ! అది అత్యంత రహస్య మయినది. ఆ విషయాన్ని శ్రద్ధగా విను. పూర్వం నేను శాస్త్రానుసారం వ్రతాన్ని పాటిస్తూ, నతమస్తకుడనై, సూర్యభగవానుని నుండి శుక్లయజుర్వేద మంత్రమండలిని ఉపదేశం పొందిన వృత్తాంతం చెపుతాను. రాజా ! నేను మహత్తరమైన తపస్సుతో భాస్కరుని ఆరాధించాను. ప్రసన్నుడైన ఆయన ఇలా అన్నాడు. "బ్రహ్మర్షీ ! నీకు కావలసిన వరం అడుగు. అది దుర్లభమైనా సంతోషంగా ఇస్తాను. నా అనుగ్రహం దుర్లభం గదా !" అప్పుడు నేను శిరస్సు వంచి నమస్కరించి 'దేవా ! ఇంతకు ముందు ఎవ్వరూ ఉపయోగించని అభ్యసించని యజుర్వేద మంత్ర జ్ఞానాన్ని నాకు ప్రసాదించు.' అన్నాను. తరువాత సూర్యభగవానుడు 'బ్రాహ్మణోత్తమా ! నీకు యజుర్వేదం అనుగ్రహిస్తాను. సరస్వతీ దేవి వాఙ్మయరూపంగా నీశరీరంలో ప్రవేశిస్తుంది.

---

* *విII ధారణతో పంచభూత విజయం, లేక అధికారం పొందటానికి యోగి జనన జరామృత్యువులు మున్నగువానిని జయించును అనుటలో ఈ క్రింది పాతంజల యోగదర్శన సూత్రం ప్రమాణం.*

పృథివ్యప్తేజోఽనిలఖే సముత్థితే
పంచాత్మకే యోగగుణే ప్రవృత్తే,
న తస్య రోగో న జరా న మృత్యుః
ప్రాప్తస్య యోగాగ్నిమయం శరీరమ్.

ధ్యాన యోగసాధన చేయగా చేయగా, పృథివి, జలం, తేజస్సు, వాయువు, ఆకాశం అనే పంచభూతాలు ఉత్థానంచెందినప్పుడు. అంటే సాధకునికి పంచభూతాల మీద అధికారం కలిగినప్పుడు, ఆ పంచమహాభూత సంబంధమయిన, యోగ సంబంధమైన పంచసిద్ధులు వ్యక్తం అయినప్పుడు, యోగాగ్నిమయమైన శరీరానికి రోగాలు రావు, ముసలితనం కలుగదు. మృత్యువు కూడా కలుగదు. అంటే ఆయనకు ఇష్టం కలుగకుండా ఆయన శరీరం నాశనం కాదు అని దీని అభిప్రాయం.

(యోగదర్శనం. 3-46, 47)

నోరు తెరు" అన్నాడు. అప్పుడు నేను నోరు తెరిచాను. వెంటనే సరస్వతీ దేవి ప్రవేశించింది. ఆ వాఙ్మయ మూర్తి ప్రవేశించినంతనే, తీవ్రమైన శరీరంతాపం తట్టుకోలేక నీటిలో మునిగాను. సూర్యదేవుని మహత్త్వం తెలియక పోవటంచేత అప్పుడు అపరిమితంగా బాధ కలిగింది. తాపంతో తహతహలాడుతున్న నన్ను చూచి సూర్యభగవానుడు 'వత్సా ! ఒక్కముహూర్త కాలం ఈ తాపాన్ని తట్టుకో. తరువాత చల్లబడతావు,' అన్నాడు. చల్లబడిన నన్నుచూచి, భాస్కరుడు 'బ్రాహ్మణోత్తమా ! ఖిల భాగంతో, ఉపనిషత్తులతో గూడ వేదం అంతా నీలో ప్రతిష్ఠితం అవుతుంది. ద్విజశ్రేష్ఠ ! శతపథ బ్రాహ్మణాన్ని కూడా సంపూర్ణంగా సంపాదిస్తావు. అనంతరం మోక్షం మీద నీమనస్సు లగ్నం అవుతుంది. యోగులు, సాంఖ్య వేత్తలు పొందవలెననుకొనే, ఇష్టమయిన పదవిని పొందుతావు !' అని చెప్పి రవి అంతర్ధానం చెందాడు.

ప్రభాకరుడు చెప్పినది అంతా శ్రద్ధగా విన్నాను. ఆయన మాయం అయిన తరువాత సంతోషంగా నా నివాసానికి వచ్చి, సరస్వతీ దేవిని ధ్యానించాను. అప్పుడు స్వరవ్యంజనాలతో (అచ్చులు హల్లులతో) అలంకృత అయిన సరస్వతీదేవి ఓంకారం ముందు ఉంచుకొని, నా ఎదుట ప్రత్యక్షమయింది. అప్పుడు సరస్వతీదేవికి, సూర్యదేవునికి అర్ఘ్యప్రదానం చేసి, వారినే ధ్యానిస్తూ కూర్చున్నాను. తరువాత సంతోషంతో రహస్య, సంగ్రహ, పరిశిష్టభాగాలతో గూడిన సమస్త శతపథాన్ని సమకూర్చాను.

అనంతరం, ఉత్తములైన వందమంది నా శిష్యులచే శతపథాధ్యయనం చేయించాను. పిమ్మట (అంతకుముందు నన్ను తిరస్కరించిన) సశిష్యుడైన మా మేనమామకు ఇష్టంకానిది చేయాలనే ఉద్దేశంతో, అపరసూర్యునిలాగా వెలిగిపోతున్న సూర్యుని లాంటి నేను, నీతండ్రి జనకమహారాజు చేత యజ్ఞం చేయించాను. అప్పుడు తన వేదదక్షిణ కోసం మేనమామ పట్టుబట్టటం చేత, దేవలమహర్షి ఎదుటనే యాగదక్షిణలో సగం ఆయనకిచ్చి, తక్కిన సగం నేను తీసుకొన్నాను. అటుతరువాత సుమంతుడు, పైలుడు, జైమిని, నీతండ్రి, ఇతర మహర్షులు నన్ను చాలాబాగా ఆదరించారు. ఈ రీతిగా నేను సూర్యుని నుండి శుక్లయజుర్వేదానికి సంబంధించిన పదునైదుశాఖలను పొందాను. ఇలాగే రోమహర్షణ సూతుని నుండి పురాణాలను అధ్యయనం చేశాను. రాజా ! ఆ తరువాత బీజరూపమైన ప్రణవాన్ని, సరస్వతీదేవిని ముందుంచుకొని, సూర్యదేవుని ప్రభావంవలన శతపథరచనను ప్రారంభించాను. ఈ అపూర్వ గ్రంథాన్ని సంపూర్ణం చేశాను. నాకుమిక్కిలి ఇష్టమైన మోక్షమార్గాన్ని కూడా చక్కగా సంపాదించాను. అనంతరం శిష్యులచే ఆ సమస్తగ్రంథాన్ని రహస్య సంగ్రహాలతో కూడా అధ్యయనం చేయించాను. వారిని తమనివాసాలకు వెళ్ళటానికి

అనుమతించాను. పవిత్ర శీలురయిన వారు అందరూ, అత్యంత సంతోషంతో తమ నివాసాలకు వెళ్ళారు. సూర్యదేవుని వలన ఉపదేశంతో శుక్లయజుర్వేద విద్యలోని ఈ పదిహేను శాఖల జ్ఞానాన్ని పొంది, ఇష్టానుసారం వేద్యతత్త్వాన్ని చింతించాను.

రాజా ! ఒకప్పుడు వేదాంతపండితుడు విశ్వావసువు అనే గంధర్వుడు నావద్దకువచ్చి "ఈ లోకంలో బ్రాహ్మణజాతికి హితకరమైనది ఏది ? సత్యం, సర్వోత్తమంగా తెలియదగినది ఏమి ?" అని నన్ను ప్రశ్నించాడు. తరువాత ఆయన వేదానికి సంబంధించి ఇరవైనాలుగు ప్రశ్నలు అడిగాడు. ఆన్వీక్షకి (వేదాంత) విద్యా విషయమై ఇరవైఅయిదవ ప్రశ్నవేశాడు. 1. విశ్వం అంటే ఏమిటి ? 2. అవిశ్వం అంటే ఏమిటి ? 3. అశ్వా అంటే ఏమిటి ? 4. అశ్వ అంటే ఏమిటి ? 5. మిత్రుడంటే ఎవరు ? 6. వరుణుడంటే ఎవరు ? అని ఆ ప్రశ్నలు ఆరు. 7. జ్ఞానం అంటే ఏమిటి ? 8. జ్ఞేయం అంటే ఏమిటి ? 9. జ్ఞాత అంటే ఎవరు ? 10. అజ్ఞుడు అంటే ఏమిటి ? 11. క అంటే ఎవరు ? 12. తపస్వి ఎవరు ? 13. అతపస్వి ఎవరు ? 14. సూర్యుడు ఎవరు ? 15. అతిసూర్యుడు ఎవరు ? 16. విద్య అంటే ఏమిటి ? 17. అవిద్య అంటే ఏమిటి ? 18. వేద్యం అంటే ఏమిటి ? 19. అవేద్యం ఏమిటి ? 20. చలం ఏమిటి ? 21. అచలం ఏమిటి ? 22. అపూర్వం అంటే ఏమిటి ? 23. అక్షయం ఏది ? 24. వినాశశీలం ఏది ? మహారాజా ! ఇలా గంధర్వుడైన విశ్వావసువు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెపుతూ ఇలా అన్నాను. 'రాజా ! నీవు చాలా మంచి ప్రశ్నలు అడిగావు. కొద్దిసేపు ఉండు, అర్థం తెలిసినవాడవు. వీటిని ఆలోచించి తగిన సమాధానం చెపుతాను.' గంధర్వుడు సరే అని ఊరుకొన్నాడు. ఆ తరువాత సరస్వతీ దేవిని మళ్ళీ మనస్సులో ధ్యానించాను. అప్పుడు పెరుగులో నుంచి నెయ్యి వచ్చినట్లు ఆ ప్రశ్నలకు సమాధానం వచ్చింది. అనంతరం ఉపనిషత్తును, మిగిలిన భాగాన్ని, పరమోత్తమమైన ఆన్వీక్షకీ విద్యమీద దృష్టిపెట్టి మనస్సుతో వాటిని అన్నింటిని మథించాను. రాజోత్తమా ! ఈ ఆన్వీక్షకీవిద్య త్రయి, తర్క, దండనీతి అనే మూడు విద్యల తరువాతిది - మోక్షంలో తోడ్పడుతుంది. ఇరవై అయిదో తత్త్వమైన పురుషునిచే అధిష్ఠించబడిన ఈ విద్యను నీకు నేను చెప్పాను.

తదనంతరం 'గంధర్వరాజా ! ఇప్పుడు నీవు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు విను' అన్నాను. "గంధర్వాధిపా ! విశ్వావిశ్వాదులను గురించి నీవడిగిన ప్రశ్నలలో విశ్వా అంటే అవ్యక్తప్రకృతికి పేరు. అది సంసారబంధంలో పడవేసేది కనుక భూతభవిష్యద్వర్తమానాలు అనే మూడుకాలాలలోను భయంకరం అని తెలుసుకోవాలి. విశ్వా అనే అవ్యక్త ప్రకృతి త్రిగుణాత్మకమైన జగత్తును ఉత్పన్నంచేసేది కాబట్టి త్రిగుణమయం. దానికంటె

భిన్నమైనది నిష్కలం (కళలులేనిది) అయిన ఆత్మను అవిశ్వ అంటారు. ఇలాగే అశ్వం, అశ్వా అనే జంటను కూడా చూడాలి (అశ్వా అంటే అవ్యక్తప్రకృతి, అశ్వః అంటే పురుషుడు). అవ్యక్త ప్రకృతిని సగుణం అనీ, పురుషుని నిర్గుణుడు అనీ అన్నారు. ఇలాగే వరుణుడు అంటే ప్రకృతి, మిత్రుడు అంటే పురుషుడు అని అర్థం. (భౌతికమైన) జ్ఞానం అంటే ప్రకృతి అని, నిష్కలమైన ఆత్మను జ్ఞేయం అనీ అన్నారు. ఇలాగే అజ్ఞం అంటే ప్రకృతి. దాని కంటె భిన్నమైన నిష్కలుడైన పురుషుని జ్ఞాత అన్నారు. క, తప, అతప అనే ప్రశ్నలకు సమాధానాలు చెపుతాను. పురుషుని క అంటారు. ప్రకృతినే తపస్సు అంటారు. నిష్కలుడైన పురుషునికి అతప అని పేరు పెట్టారు.

అవ్యక్త ప్రకృతిని సూర్య అని, నిష్కల పురుషుని అతిసూర్యుడు అని చెప్పారు. అవిద్యను ప్రకృతి అని తెలుసుకోవాలి. విద్యను పురుషుడని అంటారు.

అవేద్యం అంటే అవ్యక్త ప్రకృతివేరు. వేద్యుడు అంటే పురుషుడు అని చెపుతారు. చలం అంటే ఏమిటి ? అచలం అంటే ఏమిటి అనే ప్రశ్నకు సమాధానం విను. సృష్టిప్రళయాలకు కారణమైన ప్రకృతిని చలం అని చెప్పారు. సృష్టి ప్రళయాలకు కర్త అయిన పురుషుడే నిశ్చల పురుషుడు అని అంటారు. అలాగే అవ్యక్త ప్రకృతి వేద్యం (తెలుసుకొనబడేది). పురుషుడు అవేద్యుడు (తెలుసుకోటానికి వీలుకానివాడు). ప్రకృతి పురుషులు ఇరువురు అజ్ఞులు. ఇద్దరు నిశ్చలులు, అక్షయులు, జన్మరహితులు, నిత్యులు అని అధ్యాత్మతత్త్వంలో నిశ్చయాత్మక జ్ఞానం గల విద్వాంసులు చెపుతారు. జనించేది అయినా క్షయం లేనివాడు కావటం వలన ఇక్కడ పురుషుని అజన్మ, అవినాశి, అక్షయుడు అన్నారు. ఆయనకు ఎప్పటికీ క్షయం కలగదు అని జ్ఞానులు చెప్పారు. గుణాలకు క్షయం ఉండటంవలన ప్రకృతిని క్షయశీలం అన్నారు. దానికి ప్రేరకుడు కావటంచేత పురుషుని అక్షయుడని చెప్పారు. గంధర్వరాజా ! నాల్గవదైన ఆన్వీక్షికీవిద్య మోక్షదాయకమైనది. దాన్ని గూర్చి చెప్పాను. విశ్వావసూ ! ఆన్వీక్షకీ విద్యతోగూడిన వేదవిద్యాస్వరూపమైన ధనాన్ని సంపాదించి, ప్రయత్నపూర్వకంగా నిత్యకర్మలో నిమగ్నుడై ఉండాలి. సర్వవేదాలు ఏకాంతంలో ఉండి స్వాధ్యాయం, మననం చేయవలసినవి అని నిశ్చయించారు. **గంధర్వశ్రేష్ఠా ! సమస్త ప్రాణులకు ఉనికి అయినవాడు, వాటి ఉత్పత్తికి హేతు వయినవాడు, తనలో లీనం చేసుకొనేవాడు, అయిన ఆ పరమాత్మను తెలుసుకో లేనివారు పరమార్థానికి దూరమై జనన మరణాలలో పడిఉంటారు.** అంగాలతోను, ఉపాంగాలతోను కూడిన వేదాన్ని అధ్యయనం చేసికూడా, వేదాలద్వారా తెలియదగిన పరమేశ్వరుని ఎరుగని మూఢులు, కేవలం వేదభారాన్ని మోసేవారు మాత్రమే అవుతారు. గంధర్వశ్రేష్ఠా ! నెయ్యి కావాలి

అని గాడిదపాలను చిలికితే, దాంట్లో వ్యర్థపదార్థమే కనిపిస్తుంది తప్ప మీగడ గాని, పెరుగు కాని కన్పింపదు. ఇలాగే వేదవిద్యగలవాడు వేద్యం, అవేద్యం అనే రెండింటి తత్త్వం తెలియని మూఢబుద్ధి కేవలం జ్ఞానభారాన్ని మోసేవాడు మాత్రమే అని అన్నారు. మానవుడు ఎల్లప్పుడు తత్పరుడై అంతరాత్మతో ఈ ప్రకృతి పురుషుల జ్ఞానాన్ని సంపాదించాలి. దానివల్ల ఆ వ్యక్తికి మాటిమాటికి జనన మరణాలనే చక్ర భ్రమణంలో పడవలసిన అవసరం రాదు. లోకంలో జనన మరణపరంపర నిరంతరం కలుగుతూ ఉండేదే అని ఆలోచించి, వైదిక కర్మకాండలో చెప్పిన సమస్తకర్మలు, వానివల్ల కలిగే ఫలాలు వినాశశీలాలు అని తెలుసుకొని, వాటిని వదలి మానవుడు ఈ లోకంలోనే క్షయంలేని ధర్మాన్ని ఆశ్రయించాలి. కశ్యపపుత్రా ! సాధకుడు ప్రతిదినమూ పరమాత్మ స్వరూపాన్ని ధ్యానిస్తూ ఉన్నప్పుడు, ప్రకృతి సంసర్గంలేనివాడై ఇరవై ఆరవ తత్త్వమైన పరమాత్మను తెలుసుకోగలడు. అజ్ఞాని అయిన మానవుడు ఆ ఆత్మవిషయంలో నిజాన్ని తెలుసుకోలేక సనాతనం, అవ్యక్తం అయిన పరమాత్మ వేరు, పంచవింశతితత్త్వ రూపుడైన జీవాత్మ వేరు అనుకొంటాడు. సాధుపురుషులు ఆ రెండూ ఒకటే అని భావిస్తారు. జనన మరణభయరహితులై, పరమ పదాన్ని పొందగోరే సాంఖ్యవేత్తలైన యోగులు, జీవాత్మ పరమాత్మలు వేరు అనటాన్ని అంగీకరించరు. జీవేశ్వరులు అభిన్నులు అనే సాధుజనాంగీకారాన్ని వారుకూడా అభినందిస్తారు.

విశ్వావసువు అడిగాడు. "బ్రాహ్మణోత్తమా ! ఇరవైఅయిదవ తత్త్వమైన జీవాత్మ పరమాత్మ కంటె వేరుకాడు అని చెప్పారుగదా ! వాస్తవంగా జీవాత్మ పరమాత్మకన్న భిన్నమా ! అభిన్నమా ! ఈ విషయాన్ని చెప్పవలసింది. జైగీషవ్యుడు, అసితుడు, దేవలుడు, బ్రహ్మర్షియైన పరాశరుడు, వార్షగణ్యుడు, భృగువు, పంచశిఖుడు, కపిలుడు, శుకుడు, గౌతముడు, ఆర్ష్టిషేణుడు, గర్గుడు, నారదుడు, ఆసురి, పులస్త్యుడు, సనత్కుమారుడు, శుక్రుడు, మాతండ్రి కశ్యపుడు ఈ మహాత్ములు, ధీమంతులు చెప్పగా పూర్వమే దీన్ని విన్నాను. తరువాత రుద్రుడు, విశ్వరూపుడు, ఇతరదేవతలు, పితరులు, దైత్యులు వీరిద్వారా ఇంకా అక్కడక్కడ ఈజ్ఞానం అంతా పొందాను. వారంతా, తెలియవలసిన తత్త్వం పూర్ణం అని, నిత్యం అని చెపుతారు. బ్రాహ్మణోత్తమా ! ఇప్పుడు ఈవిషయంలో మీ వివేకంతో, అనుభవంతో నిర్ణయాన్ని వినాలి అని అనుకొంటున్నాను. మీరు విద్వాంసులలో శ్రేష్ఠులు, శాస్త్రాలలో నైపుణ్యం గల పండితులు, మహామేధావులు గదా ! మీకు తెలియని విషయాలు ఏవీ లేవు. వైదిక విజ్ఞాననిధులు మీరు అని చెపుతారు. దేవలోక పితృలోకాల్లో

కూడా మీరు ప్రఖ్యాతులు. బ్రహ్మలోకానికి వెళ్ళిన మహర్షులు మీ మహత్తును చెపుతారు. తేజోవంతమైన గ్రహాలకు అధిపతి, నిత్యుడు, అదితిపుత్రుడు, సనాతనుడు అయిన సూర్యుని నుండి మీరు అధ్యయనం చేశారు. యాజ్ఞవల్క్య ! మీరు సాంఖ్యశాస్త్ర యోగశాస్త్రాల జ్ఞానం సంపూర్ణంగా, విశేషంగా పొందినవారు గదా ! మీరు పరిపూర్ణజ్ఞానవంతులు అనటంలో సందేహంలేదు. చరాచరజగత్తు అంతా మీకు తెలుసు. నేతితో నిండి ఉన్న మీగడలాగా రుచికరమూ, సారమూ అయిన తత్త్వజ్ఞానాన్ని మీ నోటినుండి వినాలని కోరుతున్నాను.''

యాజ్ఞవల్క్యుడు అన్నాడు. 'గంధర్వశ్రేష్ఠ ! నిస్సందేహంగా నీవు జ్ఞానాన్ని అంతను ధారణచేసే మేధావివి అని నేను భావిస్తాను. సమస్తమూ తెలిసి కూడా, నన్ను ప్రశ్నించి నా సిద్ధాంతాన్ని వినాలి అనుకొంటున్నావు. కాబట్టి నేను విన్నది విన్నట్లుగా చెపుతాను. ప్రకృతి జడం కాబట్టి, దాన్ని ఇరువది అయిదవ తత్త్వమైన జీవాత్మ తెలుసుకొంటాడు. కాని ప్రకృతి జీవాత్మను తెలుసుకోలేదు. సాంఖ్య యోగశాస్త్ర తత్త్వజ్ఞులు వేదాలు నిరూపించిన దాన్ని అనుసరించి, నీటిలో ప్రతిబింబించే చంద్రునితో సమానంగా, ప్రకృతిలో జ్ఞానస్వరూప అయిన జీవాత్మజ్ఞాన ప్రతిబింబం పడటం వలన ఆ ప్రకృతిని ప్రధానం అని చెపుతారు. జీవాత్మ మెలకువ మొదలైన అన్ని అవస్థలలోను సమస్తమూ చూస్తాడు. సుషుప్తి, సమాధి స్థితులలో ఏమీ చూడలేడు. అలాగే పరమాత్మ ఇరవైఆరవ తత్త్వమైన తనను తానే ఇరవైఅయిదవ తత్త్వమైన జీవాత్మను, ఇరవైనాల్గవ తత్త్వ రూపమైన ప్రకృతిని చూస్తుంటాడు. జీవాత్మ 'నన్ను మించినది ఇంకేమీ లేదు' అని భావించినట్లైతే, తనను నిరంతరం చూసే పరమాత్మను తెలుసుకొన్నా తెలుసుకొననట్లే అవుతుంది. తత్త్వజ్ఞులైన మానవులు ప్రకృతిని ఆత్మగా గ్రహింపరాదు. నీటిలో ఉన్నా, దాన్ని అనుకరించినా, చేప తాను నీటి కంటే వేరు అని అనుకొంటుంది. కాబట్టి మనుష్యుడు కూడా దానిలాగే తానూ ప్రవర్తించాలి. కాని ప్రకృతిని తానుగా భావించరాదు. నీటిలో ఉన్నా చేప ఆ నీటి కంటె తనను వేరుగా అనుకొన్నట్లే, ఈ జీవాత్మ ప్రాకృత శరీరంలో ఉన్నా, ప్రకృతి కంటె తాను భిన్నుడను అనుకొంటాడు. అయినా అతడు శరీరం మీద మమకారం, సహవాసం, అభిమానం వల్ల పరమాత్మతో తన ఐక్యాన్ని అనుభవంలోకి తెచ్చుకొనకపోతే కాలమనే సముద్రంలో మునిగి పోతాడు. కాని అతడు సమతా బుద్ధికలిగి పరమాత్మ, తాను ఒకటే అని తెలుసుకొన్నప్పుడు కాలసముద్రం నుంచి బయట పడతాడు. 'నేను వేరు, ఈ ప్రాకృత శరీరం, లేక అనాత్మఅయిన జగత్తు నాకంటే ఇతరమైనది' అని ద్విజుడు

తెలుసుకొన్నప్పుడు, ప్రకృతి సంసర్గం లేక ఇరువది ఆరవతత్త్వమైన పరమాత్మ సాక్షాత్కారాన్ని పొందుతాడు. రాజా ! పరమాత్మ వేరు, జీవాత్మవేరు. పరమాత్మ జీవాత్మకు ఆశ్రయం కావటమే అందుకు కారణం. కాని జ్ఞానులైన మహాత్ములు ఆ ఇద్దరినీ ఒకటిగానే చూస్తారు, భావిస్తారు. కాశ్యపా ! జనన మరణభయంవల్ల భీతులైన యోగసాంఖ్య సాధకులు భగవత్పరాయణులై, శుద్ధమైన మనస్సుతో ఇరవైఆరవ తత్త్వమైన పరమాత్మ దర్శనం చేస్తూ, జీవాత్మ పరమాత్మలను ఒకటిగా భావించటమే కాక, ఈ అభేద దర్శనాన్ని అభినందిస్తారు. జీవాత్మ ప్రకృతిసంసర్గం లేకుండా పరమాత్మ సాక్షాత్కారాన్ని పొందినప్పుడు, సర్వజ్ఞుడైన విద్వాంసుడై ఈ లోకంలో పునర్జన్మను పొందడు. అనఘా ! ఈ రీతిగా జడమైన ప్రకృతి, చైతన్యవంతమైన జీవాత్మ, జ్ఞానస్వరూపమైన పరమాత్మను వేదాన్ననుసరించి ఉన్నది ఉన్నట్లు నిరూపించాను. కాశ్యపా ! జీవాత్మను, ప్రకృతి మొదలైన జడసమూహాన్ని విడివిడిగా తెలుసుకోలేనివాడు, శుభంకరమైన తత్త్వం చూడనివాడు, కేవలమైన (ప్రకృతి సంసర్గం లేని) వానిని, అకేవలుని (ప్రకృతి సంసర్గం కలవాడు) భావించేవాడు, సమస్తానికి ఆదికారణమైన జీవాత్మను, పరమాత్మను యథార్థరూపంగా తెలుసుకొననివాడే (లోకంలోకి రాకపోకలు అనే చక్రభ్రమణంలో పడతాడు).

విశ్వావసువు అన్నాడు. "మహాత్మా ! సర్వదేవతలకు ఆదికారణమైన పరబ్రహ్మ విషయంలో, ఉన్నది ఉన్నట్లుగా మీరు చెప్పినది సత్యం, శుభం, సుందరం, పరమ మంగళకరం. మీ మనస్సు నిరంతరం జ్ఞానయుక్తమై ఉండుగాక. మీకు నిత్యమూ అక్షయమైన మేలు గలుగుగాక. (ఇక నేను సెలవు తీసుకొంటాను)." యాజ్ఞవల్క్యుడు చెప్పాడు. "రాజా ! మహాత్ముడైన గంధర్వరాజు ఇలా పలికి, దివ్యతేజో విరాజితుడై, నాకు ప్రదక్షిణ నమస్కారాలు చేసి, అభినందించి స్వర్గలోకానికి వెళ్ళాడు. ఆ సమయంలో నేను ఆతనిని సంతోషంగా చూశాను. జనక నరేంద్రా ! ఆకాశచారులైన బ్రహ్మాదిదేవతలలోను, భూమి మీద ఉండే మానవులలోను, భూమికి క్రింద భాగంలో ఉన్న వారిలోను మోక్షమార్గం ఆశ్రయించినవారికి అందరికి, విశ్వావసువు నేను చెప్పిన ఈ సమ్యగ్దర్శనాన్ని ఉపదేశించాడు. సాంఖ్య సిద్ధాంతానుసారులైన సాంఖ్యవేత్తలకు, యోగశాస్త్రానుసారులైన యోగులకు, మోక్షకాంక్షులైన మానవులకు అందరికి ఆ ఉపదేశం ప్రత్యక్ష ఫలాన్ని ఇచ్చేది అవుతుంది. రాజశ్రేష్ఠా ! జ్ఞానం వల్లనే మోక్షం కలుగుతుంది గాని అజ్ఞానం వలనగాదు అని విద్వాంసులు చెప్పారు. కాబట్టి యథార్థజ్ఞానాన్ని అనుసంధానం చేయాలి. దానివల్ల స్వయంగానే జన్మమృత్యుబంధం నుంచి ముక్తి కలుగుతుంది. **నాలుగు వర్ణాలలో గాని, నీచవర్ణాలలో**

గాని జనించిన వ్యక్తినుంచి అయినా, లభించిన జ్ఞానాన్ని పొందినవారు శ్రద్ధావంతులై, దానియందు శ్రద్ధఉంచాలి. అందువల్ల వారిలో జనన మరణాలు ప్రవేశించవు.

బ్రహ్మనుండి జనించారు కాబట్టి అన్ని వర్ణాలవారు బ్రాహ్మణులే. అందరూ ఎల్లప్పుడు బ్రహ్మను గురించే చెపుతారు. నేను బ్రహ్మజ్ఞానంతో నిజమైన శాస్త్రసిద్ధాంతాన్ని చెపుతున్నాను. ఈ సమస్త జగత్తు, కనపడుతున్న ఈ ప్రపంచం అంతా పరబ్రహ్మ స్వరూపమే. బ్రహ్మముఖంనుంచి బ్రాహ్మణులు, బాహువుల నుండి క్షత్రియులు, నాభినుండి వైశ్యులు, పాదాలనుంచి శూద్రులు ఆవిర్భవించారు. కాబట్టి సర్వవర్ణాలవారు బ్రహ్మరూపులే. అందు వల్లనే ఏ వర్ణాన్నైనా బ్రహ్మభిన్నం అని అనుకొనరాదు. మానవులు అజ్ఞానం వల్లనే, కర్మానుష్ఠానం చేయటంవలన భిన్నభిన్నమైన జాతులలో జన్మిస్తున్నారు, మరణిస్తున్నారు. జ్ఞానహీనులైన మానవులే, భయంకరమైన తమ అజ్ఞానం వలన నానావిధాలైన ప్రాకృత జాతులలో పడిపోతున్నారు. నరేంద్రా ! కాబట్టి అన్ని విధాల జ్ఞానసంపాదనకే యత్నించాలి. సర్వవర్ణాలవారు తమతమ ఆశ్రమాలలో ఉంటూనే జ్ఞానాన్ని పొందవచ్చు. జ్ఞానస్థితులైన బ్రాహ్మణులకు గాని, జ్ఞాననిష్ఠులైన ఇతరులకు గాని ఎల్లప్పుడు మోక్షం కలుగుతుంది అని చెప్పారు. రాజా ! నీవు అడిగినదానికి ఉన్నది ఉన్నట్లు జ్ఞానాన్ని ఉపదేశించాను. కాబట్టి నీవు శోకరహితుడవు కావలసింది. ఈ తత్త్వజ్ఞానంలో పారంగతుడవు కమ్ము. నీకు జ్ఞానాన్ని చక్కగా చెప్పాను. నిత్యమూ నీకు మేలు కలుగుగాక."

భీష్ముడు చెప్పాడు. "యుధిష్ఠిరా ! మేధావి అయిన యాజ్ఞవల్క్యుడు ఇలా ఉపదేశిస్తే మిథిలాధిపతి చాలా సంతోషించాడు. ఆయన గౌరవపూర్వకంగా మహర్షికి ప్రదక్షిణం చేయగానే ఆయన అక్కడి నుంచి వెళ్ళారు. మోక్షం తెలిసిన దేవరాత పుత్రుడు జనకుడు అక్కడ కూర్చుండి బ్రాహ్మణులకు కోటి గోవులను దానం చేశాడు. ఒక్కొక్క బ్రాహ్మణునికి దోసిళ్ళతో రత్నాలను, బంగారాన్ని దానం చేశాడు. తరువాత మిథిలాధిపతి విదేహదేశ రాజ్యాన్ని తన కుమారునికి ఇచ్చాడు. తాను యతిధర్మాలను పాటిస్తూ అక్కడ ఉన్నాడు. రాజేంద్రా ! ఆయన సాంఖ్యశాస్త్ర జ్ఞానాన్ని, యోగశాస్త్రాధ్యయనాన్ని చేసి ప్రాకృతధర్మాన్ని, అధర్మాన్ని నిరాకరిస్తూ 'నేను అనంతుడను' అని నిశ్చయించుకొని ధర్మాధర్మాలను, పుణ్యపాపాలను, సత్యాసత్యాలను, జన్మమృత్యువులను, వ్యక్తాలను (బుద్ధ్యాదులను), అవ్యక్తాన్ని ((ప్రకృతిని), తత్కార్యాలను అన్నింటిని ప్రాకృతాదులుగా (ప్రకృతిజన్యాలను, మిథ్య అయినవానిగా) తెలుసుకొంటూ, ప్రకృతితో సంసర్గం లేనివాడై శుద్ధం, నిత్యం అయిన స్వస్వరూపాన్ని చింతిస్తూ ఉన్నాడు. యుధిష్ఠిరా ! సాంఖ్య యోగ శాస్త్ర విద్వాంసులు తమతమ శాస్త్రాలలో వర్ణితమైన లక్షణాలను అనుసరించి, ఆ బ్రహ్మపదార్థం

ఇష్టానిష్టవిముక్తమై అచలంగా ఉన్న పరాత్పరతత్త్వమని భావిస్తారు. విద్వాంసులు ఆ బ్రహ్మమును నిత్యం, పవిత్రం అని చెపుతారు. కాబట్టి నీవు కూడా దాన్ని తెలుసుకొని పవిత్రుడవు కావలసినది. ఇచ్చేది, ఇచ్చిన వస్తువు, దానిని పొందేవాడు, దానాన్ని ఆమోదించేవాడు, ఇచ్చేవాడు, తీసుకొనేవాడు, ఈ సమస్తమూ అవ్యక్తమైన పరమాత్మయే. పరమాత్మయే సమస్తమూ ఇస్తున్నాడు, తీసుకొంటున్నాడు. **పరమాత్మ ఒక్కడే ఆత్మీయుడు. ఆయనను మించి ఆత్మీయం అయిన వస్తువు ఇంకొకటి ఏముంటుంది ? నీవు ఎల్లప్పుడు ఇలాగే భావించు. ఇంతకంటె ఇతరమైన ఇంకొక దాన్ని చింతించవద్దు.** అవ్యక్తమైన ప్రకృతిజ్ఞానం కలుగక, సగుణ నిర్గుణ పరమాత్మను గుర్తించలేని విద్వాంసుడు తీర్థయాత్రలను, యజ్ఞాలను చేయాలి. వేదాధ్యయనంచేతగాని, తపస్సుచేతగాని, యజ్ఞాలచేతగాని మోక్ష (లేక పరమాత్మ) పదప్రాప్తి కలుగదు. (ఇవి ఆ తత్త్వాన్ని తెలుసుకోవటానికి ఉపకరిస్తాయి). వీటి వల్ల పరమాత్మకు సంబంధించిన స్పష్ట (అపరోక్ష) జ్ఞానం పొంది, మానవుడు మహిమాన్వితుడు అవుతాడు. మహత్తత్త్వాన్ని ఉపాసించే వారు మహత్తత్త్వాన్ని, అహంకారోపాసకులు అహంకారాన్ని పొందుతారు. అహంకార మహత్తత్త్వాల కంటె కూడా శ్రేష్ఠస్థానాన్ని పొందాలి. శాస్త్రాధ్యయనతత్పరులైన వారు మాత్రమే ప్రకృతికంటె పరం, నిత్యం, జనన మరణరహితం, ముక్తం, సదసద్రూపం అయిన పరమాత్మజ్ఞానం పొందగలరు.

యుధిష్ఠిరా ! ఈ జ్ఞానాన్ని నేను పూర్వం జనకుని నుండి పొందాను. ఆయనకు యాజ్ఞవల్క్యుని వల్ల కలిగింది. జ్ఞానం సర్వోత్తమ సాధనం. యజ్ఞాలు దీనితో సమానంగావు. మానవుడు జ్ఞానం వలననే దుర్గమమైన ఈ సంసార సముద్రాన్ని దాటగలడు గాని యజ్ఞాల వల్లగాదు. భౌతికమైన జనన మరణాలను దాటటం చాలా కష్టం. యజ్ఞాదులవల్లకూడా మానవుడు ఆ దుర్గమ సంసారాన్ని దాటలేడు. యజ్ఞం, తపస్సు, నియమాలు, వ్రతాలను ఆచరించటం వలన స్వర్గాన్ని పొందగలడు. పుణ్యం క్షీణించిన తరువాత మళ్లీ ఈ భూమిమీద పడతారు. కాబట్టి నీవు ప్రకృతికన్న పరం, మహత్తరం, పవిత్రం, మంగలమయం, నిర్మలం, శుద్ధం, మోక్షస్వరూపం అయిన బ్రహ్మోపాసనను ఆచరించు. క్షేత్రం అంటే ఏమిటో తెలుసుకొని, జ్ఞానయజ్ఞాన్ని ఆశ్రయించి, నీవు తప్పక తత్త్వజ్ఞాని అయిన ఋషివి అవుతావు. పూర్వకాలంలో యాజ్ఞవల్క్యమహర్షి జనక మహారాజుకు ఉపదేశించిన ఉపనిషత్తును (జ్ఞానాన్ని) మననం చేయటం వలన మానవుడు వెనక చెప్పిన సనాతనం, అవినాశి, శుభం, అమృతమయం, శోకరహితం అయిన పరతత్త్వాన్ని పొందుతాడు.

319. పంచశిఖ జనక సంవాదము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "భరతశ్రేష్ఠా ! మహత్తరమైన ఐశ్వర్యాన్ని, సర్వసమృద్ధమగు సంపదను, సుదీర్ఘాయువును పొంది, మానవుడు మృత్యువును ఎలా అతిక్రమించగలడు? మహత్తరమగు తపస్సుతో గాని, సర్వోత్కృష్టమగు సత్కర్మలను అనుష్ఠించి గాని, అనేక విధాలయిన రసాయనాలను ఉపయోగించి గాని, వేదశాస్త్రాలను అధ్యయనం చేసి గాని, ఇంకా ఏవైనా ఉపాయాలతో గాని జరామరణాలను మానవుడు పొందకుండా ఉండగలడా ?" భీష్ముడు చెప్పాడు. "యుధిష్ఠిరా ! ఈ విషయంలో కూడా పండితులు యతి యగు పంచశిఖునికి, జనకునికి జరిగిన సంవాదరూపమైన ఈ ప్రాచీనమైన ఇతిహాసాన్ని ఉదాహరిస్తారు. ఒకప్పుడు విదేహదేశాధిపతి అయిన జనకుడు వేదవేత్తలలో శ్రేష్ఠుడు, ధర్మార్థ విషయాలలో సందేహరహితు డైన పంచశిఖు డనే మహర్షిని ఈరీతిగా ప్రశ్నించాడు. "మహాత్మా ! ఏ ఆచారాలను, తపస్సును, బుద్ధిని, కర్మను, శాస్త్రజ్ఞానాన్ని అనుసరించి మానవుడు జరామరణాలను అతిక్రమించగలడు ?" ఈ విధంగా ప్రశ్నించిన జనక మహారాజుకు అపరోక్షజ్ఞానం గల పంచశిఖుడు ఇలా సమాధానం చెప్పాడు. "జన్మించిన వారికి ఎవరికైనా ముసలితనం, మరణం కలుగకుండా ఉండవు. ఏవిధంగాను అవి నివర్తించవు అని ఖచ్చితంగా చెప్పటానికీ వీలులేదు. (ధనాదులతో వాని నివృత్తి జరగదుగాని జ్ఞానంతో పునర్జన్మ కూడా నివృత్తం అవుతుంది. ఇక జరామృత్యువులు నివృత్తి అవుతాయి అని వేరుగా చెప్పవలెనా ?)

రేయింబవళ్ళు, మాసాదులు కలుగకుండా ఎవరూ ఆపలేరు. ఇలాగే జరామరణచక్రం కూడా నడుస్తూనే ఉంటుంది. అశాశ్వత మయిన ప్రాణి, మరణధర్మం గల మానవుడు సుదీర్ఘకాలం తరువాత మోక్షమార్గాన్ని ఆశ్రయిస్తాడు. కాలం సమస్త ప్రాణులను విచ్ఛిన్నం చేస్తుంది. జలప్రవాహం ఏవస్తువునైనా ముందుకు నెట్టుతుంటుంది. అలాగే కాలంకూడా నిరంతరం ప్రాణులను తనవేగంతో ప్రవహింపజేస్తుంది. ఈకాలం నావలేని సముద్రం వలె తరంగితం అవుతుంటుంది. జరామరణాలు పెద్దపెద్ద మొసళ్లవలె దాంట్లో తిష్ఠవేశాయి. ఆ కాలసాగరంలో కొట్టుకుపోతూ, మునుగుతూ ఉండే జీవుని ఎవరూ కాపాడలేరు. **ఈ లోకంలో ఈ జీవునికి తనవారు అంటూ ఎవరూ లేరు. అలాగే ఆ జీవుడూ ఎవరికీ ఏమీ కాడు. భార్యాపుత్రాదులైన ఇతరబంధువులు అందరూ మార్గమధ్యంలో కలిసి విడిపోయే వారు మాత్రమే. ఈ లోకంలో పూర్వం ఎవరూ ఎవరితో కలిసి చిరకాలం ఉండలేరు.** ఆకాశంలో ఉరుముతున్న మేఘాలను వేగవంతమైన గాలి ఛిన్నభిన్నం చేసినట్లు, కాలం ఈలోకంలో జన్మించే

ప్రాణులను, అవి ఏడ్చి మొత్తుకుంటున్నా, నాశనం కావటం అనే మహాగ్నిలోకి నెట్టివేస్తూ ఉంటుంది. ఎంతటి బలిష్ఠులైనా, దుర్బలులైనా, చిన్నవైనా, పెద్దదయినా సమస్త ప్రాణులను ముసలితనం, మరణం పెద్దపులిలాగా మ్రింగివేస్తాయి. ఈ రీతిగా సమస్తప్రాణులు వినాశశీలాలే అవుతున్నవి. అలాంటప్పుడు నిత్యస్వరూపుడైన జీవాత్మ ఆ ప్రాణులకు జన్మించినప్పుడు మహదానందపడటం, గాని మరణించినప్పుడు దుఃఖించటం గాని ఎందుకు ? **నేను ఎవడను ? ఎక్కడినుంచి వచ్చాను ? ఎక్కడికి పోతాను ? ఎవరితోనైనా నాకు ఉన్న సంబంధం ఏమిటి ? ఏ ప్రదేశంలో ఉన్నాను ? ఎక్కడ మళ్ళీ జన్మిస్తాను ? ఈ ప్రశ్నలకు సరైన సమాధానం మనకు తెలుసునా ? ఇవి అన్నీ బాగా ఆలోచిస్తే ఇంక దుఃఖించటం ఎందుకు ?** మంచిపనులు, చెడ్డపనులు చేసేవాడు కాక, ఇతరుడు ఆ కర్మల ఫలస్వరూపమైన స్వర్గనరకాలను చూడటం గాని, అనుభవించే వాడుగాని ఎవడు ఉన్నాడు ? కాబట్టి శాస్త్రం చెప్పిన ఆజ్ఞలను పాటిస్తూ, వాటిని అతిక్రమించకుండా, జనులందరూ దాన యజ్ఞాదులైన సత్కర్మలను చేస్తూ ఉండవలసినదే."

320. సులభా జనక సంవాదము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "కురువంశ రాజర్షిశ్రేష్ఠా ! గృహస్థాశ్రమాన్ని త్యజించకుండ, బుద్ధికి లయస్థానమైన మోక్షాన్ని పొందిన వ్యక్తిని గురించి నాకు వివరించు. ఈ కనిపించే స్థూలశరీరాన్ని సూక్ష్మశరీరం ఎలా వదలి పెడుతుంది ? సూక్ష్మశరీరాన్ని ఆత్మ ఎలా వదలిపెడుతుంది? అంటే జీవుడు స్థూల సూక్ష్మశరీరాభిమానాలు ఎలా వదలుతాడు? ఆ త్యాగస్వరూపాన్ని, మోక్షస్వరూపాన్ని వివరించవలసింది." భీష్ముడు చెపుతున్నాడు. యుధిష్ఠిరా ! ఈ విషయం బాగా తెలిసినవారు జనక - సులభాసంవాదం అనే ఈ ప్రాచీనమైన ఇతిహాసాన్ని ఉదాహరిస్తారు. ప్రాచీనకాలంలో జనకవంశంలో జన్మించిన ధర్మధ్వజుడు అనే మిథిలా నరేశ్వరుడు ప్రసిద్ధుడై ఉండేవాడు. సంన్యాసంయొక్క సమ్యక్‌జ్ఞానం అనే ఫలాన్ని పొందినవాడు ఆయన. ఆయన వేదంలో, శాస్త్రంలో, దండనీతి అనే తన రాజ్యసంబంధ శాస్త్రంలో బాగా కృషిచేసినవాడు. ఆయన ఇంద్రియాలను అదుపులో ఉంచుకొని ఈ భూమండలాన్ని పాలించాడు. రాజా ! వేదవేత్తలు ఆయన సాధు ప్రవర్తన, వృత్తాంతం విని, ఆయన వలెనే తాము కూడా ఉత్తములు కావాలి అని లోకంలో కొంతమంది కోరుకొనే వారు. ధర్మ ప్రధానమైన ఆ యుగంలో సులభ అనే ఒక సంన్యాసిని యోగధర్మాన్ని అనుష్ఠించి, సిద్ధిని పొంది, ఒంటరిగానే భూలోకంలో సంచరిస్తుండేది. ఈ సమస్త జగత్తులో సంచరిస్తున్న సులభ అనేక ప్రదేశాలలో త్రిదండులు అయిన సంన్యాసులు మోక్షతత్త్వజ్ఞుల

ప్రశంసచేస్తూ, జనక మహారాజును గురించి గొప్పగా చెప్పటం విన్నది. వారు చెప్పే అత్యంతసూక్ష్మమైన ఆత్మతత్త్వం ఆయనకు తెలియటం నిజమా ? అసత్యమా ? అని సందేహం కలిగి జనకుని చూడవలె ననే సంకల్పం ఆమెకు కలిగింది. ఆమె యోగశక్తితో తనకున్న శరీరాన్ని వదలి సుందరతరమైన ఇంకొకరూపాన్ని ధరించింది. ఆమె శరీరంలోని సర్వావయవాలు నిర్దోషమైన ఉత్తమ సౌందర్యంతో వెలుగొందుతున్నాయి. చక్కని కనుబొమలు, పద్మ పత్రాలవంటి కన్నులుగల ఆమె, వేగంతో దూసుకుపోయే బాణంలాగా, రెప్పపాటు కాలంలో విదేహరాజధానిలో ప్రవేశించింది. సమధికజనసమూహంతో క్రిక్కిరిసి ఉన్న సుందరమైన మిథిలానగరం చేరి, ఆమె భిక్షాటనం అనే మిషతో జనక రాజును దర్శించింది.

ఆమె సుకుమార సుందరదేహం చూసి, రాజు ఆశ్చర్యచకితుడై, 'ఈమె ఎవరు ? ఎవరికి సంబంధించినది ? ఎక్కడనుంచి వచ్చింది ?' అని మనస్సులో అనుకొన్నాడు. తరువాత ఆయన ఆమెకు స్వాగతం చెప్పాడు. అందమైన ఆసనంమీద కూర్చుండజేశాడు. పాద ప్రక్షాళనాదులైన గౌరవం చేశాడు. చక్కని ఆహారం పెట్టి సంతోషపెట్టాడు. భోజనం చేసి, సంతోషించిన సులభ, సర్వభాష్యాలు తెలిసిన విద్వాంసుల మధ్యలో, మంత్రులతో కూడా కూర్చుని ఉన్న జనకుని కొన్నిప్రశ్నలు వేయదలచుకొన్నది. ఈ రాజు ఈ రాజధర్మాదులనుంచి ముక్తుడైన జీవన్ముక్తుడేనా ? అని ఆమెకు సందేహం కలిగింది. యోగశక్తులు బాగా తెలిసిన ఆమె తనసూక్ష్మబుద్ధితో రాజు బుద్ధిలో ప్రవేశించింది. ఆమె తననేత్ర కిరణాలతో రాజునేత్ర కిరణాలను బంధించి, యోగబలంతో ఆయన చిత్తాన్ని నియంత్రించి, వశం చేసుకొన్నది. ఇక ప్రశ్నలను అడగ సిద్ధమైంది. జనకుడు సులభ అభిప్రాయాన్ని పసిగట్టి, దాన్ని ఆదరిస్తూ, నవ్వుతూ, తనభావంతో ఆమె భావాన్ని గ్రహించాడు. ఛత్రచామరాది రాజచిహ్నాలు లేని జనకమహారాజు, త్రిదండం మొదలైన సంన్యాస చిహ్నాలు లేని సులభ ఒకే శరీరంలో ఉండి చేసిన సంవాదం చెపుతాను, వినుం.

జనకుడు ఇలా అడిగాడు. "భగవతీ ! నీకు ఈ సంన్యాసదీక్ష ఎలా సిద్ధించింది ? ఎక్కడికి వెళ్ళుతున్నావు ? ఎవరిదానివి ? ఎక్కడినుంచి వచ్చావు ?" "ఎవరినైనా అడగకపోతే వారికి గల శాస్త్రజ్ఞానం, వయస్సు, జాతి అనేవి తెలియవుగదా ! నాలో నీవు చేరటం వలన ఈ సమయంలో ఇవి అన్నీ తెలియటానికి నిజమైన సమాధానాలు నీవు చెప్పాలి. ఛత్రాదులైన రాజచిహ్నాలను అన్నిటినీ ఇప్పుడు వదిలాను. కాబట్టి నా అసలు స్థితిని తెలుసుకో. పూజ్యగా కన్పిస్తున్న నిన్ను గౌరవించవలె నని అనుకొన్నాను. పూర్వం నేను మోక్షవిషయజ్ఞానాన్ని పొందిన మహానుభావుని గురించి చెపుతాను. ఆయనవలె దాన్ని వివరించి చెప్పగల వారు మరెవరూ లేరు. పరాశర గోత్రులై, సంన్యాస ధర్మాన్ని అవలంబించే

వృద్ధుడు, మహాత్ముడు పంచశిఖుడు మాగురుదేవులు. నేను వారికి చాలా ఇష్టమైన శిష్యుడను. సాంఖ్యజ్ఞానం, యోగవిద్య, రాజనీతి అనే త్రివిధమైన వానిలో వెళ్ళదగిన త్రోవను గురుదేవులు ఉపదేశించారు. ఈ విషయాలలో నాకు ఉన్న సందేహాలు అన్నీ తొలగినవి.

పూర్వకాలంలో ఒకప్పుడు మా ఆచార్యపాదులు శాస్త్రమార్గాన్ని యధావిధిగా అనుసరిస్తూ, లోక సంచారంచేస్తూ, మా రాజ్యానికి దయచేశారు. వార్షికాలైన నాలుగు మాసాలు నా ఆతిథ్యంలో సుఖంగా ఉన్నారు. వారు సాంఖ్యశాస్త్రంలో గొప్పవిద్వాంసులు. అన్ని సిద్ధాంతాలు ఉన్నవి ఉన్నట్లుగా వారికి అరచేతిలోని ఉసిరికాయవంటివి. త్రివిధమోక్ష ధర్మాలను వారివద్ద శ్రవణం చేశాను. వారు రాజ్యత్యాగం చేయమని చెప్పలేదు. వారి ఉపదేశానుసారం నేను విషయాసక్తిలేకుండా, ముక్తి విషయాలైన మూడు విధాలైన సమస్త వృత్తులను ఆచరిస్తున్నాను. ఏకాకినై పరమపదంలో ఉన్నాను. ఈ మోక్షానికి వైరాగ్యం పరమావశ్యకం. ఆ వైరాగ్యం జ్ఞానం వల్లనే సిద్ధిస్తుంది. దాని వల్లనే వ్యక్తి ముక్తుడు అవుతాడు. మానవుడు జ్ఞానంతో ముక్తిని పొందటానికి ప్రయత్నిస్తాడు. దానివల్ల మహత్తరమైన ఆత్మజ్ఞానం కలుగుతుంది. అదే సుఖదుఃఖాదులైన ద్వంద్వాలనుండి విముక్తి కలిగిస్తుంది. దానిసిద్ధి మృత్యువును కూడా అతిక్రమిస్తుంది. అజ్ఞానం తొలగి, నేను లోకసంబంధాలను అన్నింటిని వదిలాను. కాబట్టే గృహస్థధర్మంలో ఉంటూనే, బుద్ధితో ద్వంద్వాతీత స్థితిని పొందాను. చక్కగా దున్నటంవలన బాగా మెత్తనైన మట్టిగల పాలంలో కావలసినంత నీరువచ్చి తడిసినప్పుడు, వేసిన బీజాలవలన మొలకలు వచ్చినట్లు, మానవుని మంచి చెడు పనులే పునర్జన్మను కలిగిస్తాయి. మూకుడులోగాని, భాండీలోగాని ఇంక దేంట్లోనైనా గింజ వేగితే బీజహీనం కావటంవల్ల తగిన పాలంలో పడినా మొలకెత్తదు. అలాగే యతిశ్రేష్ఠులైన మా గురువులు పంచశిఖుల వారు నాకు అనుగ్రహించిన జ్ఞానం నిర్బీజం కాబట్టి లోకవిషయాలు అనే పాలంలో మొలకెత్తవు. నా బుద్ధికి అనర్థంలోగాని, భోగవస్తు సంపాదనలోగాని ఆసక్తిలేదు. భార్యాపుత్రాదుల అనురాగం గాని, శత్రువుల యందుకలిగే కోపం గాని వ్యర్థం. కాబట్టి రాగద్వేషాలలో నాబుద్ధి ప్రవేశించదు. నాకుడిచేతికి మంచిగంధం పూసినవ్యక్తి, ఎడమచేతిని కత్తితో నరికి వేసిన వ్యక్తి నాకు సమానులే. కోరికలన్నీ సిద్ధించటంచేత ఎల్లప్పుడు సుఖంగా ఉన్నాను. మట్టిముద్ద, బంగారపుముద్ద నాకు సమానం. ఎలాంటి ఆసక్తిలేకుండా రాజపదవిలో ఉన్నాను. అందువల్ల ఇతరసంన్యాసుల కన్నా నేను విశిష్టుడను. అలౌకిక జ్ఞానం, అలౌకిక సంన్యాసం, అలౌకికంగా కర్మలను ఆచరించటం (అంటే నిష్కామకర్మానుష్ఠానం); అనే మూడు రకాల నిష్ఠలనే మోక్షవిషయం తెలిసిన వారు

మోక్షోపాయాలుగా చెపుతారు. సూక్ష్మదర్శనులైన యతులు ఒక వర్గంవారు జ్ఞాననిష్ఠయే మోక్షసాధనం అంటారు. ఇంకొక వర్గంవారు కర్మనిష్ఠయే మోక్షోపాయం అని చెపుతారు.

కాని ఆమహాత్ముడు పంచశిఖుడు కేవలం జ్ఞానం, కేవలం కర్మ అనే రెండు మార్గాలను వదలి మూడవ మార్గం చెప్పాడు. యమ, నియమ, కామ, ద్వేష, పరిగ్రహ, మాన, దంభ, స్నేహాలవల్ల కలిగే లాభనష్టాలలో సంన్యాసులు, సంసారులు సమానమే. అంటే యమ నియమాదులను సాధిస్తే గృహస్థులు కూడా మోక్షం పొందుతారు. కామద్వేషాదులు కలిగితే సంన్యాసులు కూడా ముక్తికి దూరం అవుతారు. సంన్యాసులు త్రిదండధారణ చేస్తారు. సంసారులు ఛత్రచామరాదులను ధరిస్తారు. త్రిదండ ధారణం వల్లనే ఎవరికైనా జ్ఞానం, మోక్షం కలిగితే, ఛత్రాదులు ధరించే సంసారులకు జ్ఞానంతో మోక్షం ఎందుకు కలగదు ? పరిగ్రహణమే ప్రతిబంధకం అవుతుంది. ఒకరు త్రిదండాన్ని ధరిస్తే, ఇంకొకరు ఛత్రాన్ని ధరిస్తారు. రెండూ పరిగ్రహణాలే. తమతమ కోరికలు సిద్ధించటానికి, ఎవరెవరికి ఏయే సాధనాలవల్ల ప్రయోజనం ఉంటుందోవారు అందరూ తమ పని నెరవేరటానికి ఆ యా వస్తువులను ఆశ్రయిస్తారు. గృహస్థాశ్రమాన్ని ద్వేషించి, దాన్నివదలి ఇంకొక ఆశ్రమాన్ని ఆశ్రయించేవారు కూడా ఒకదాన్ని వదలి, ఇంకొకటి గ్రహిస్తారు. కాబట్టి వారికికూడా సంగం అనే దోషంనుంచి విముక్తి ఉండదు. ఒకరిని శిక్షించటం, ఇంకొకరిని అనుగ్రహించటం అనే వాటినే ప్రభుత్వం అంటారు. ఇది రాజులో ఉన్నట్లే సంన్యాసిలోను ఉన్నది. అలాంటప్పుడు సంన్యాసులే ముక్తులు అవుతారు అనటానికి కారణం ఏమిటి ? మానవ రూపమైన ఉత్తమశరీరంలో ఉన్న వ్యక్తి అధికారం కలిగిఉన్నా, జ్ఞానబలంవల్లనే ఈలోకంలో సమస్త పాపవిముక్తుడు అవుతాడు. **కాషాయ వస్త్రధారణం, శిరోముండనం, త్రిదండం, కమండలువు దాల్చటం, ఇవి అన్నీ గొప్పదైన సంన్యాసాన్ని సూచించే చిహ్నాలు మాత్రమే. వీటి వల్లనే మోక్షం సిద్ధించదు.** ఈ చిహ్నాలు అన్నీ ఉన్నా, దుఃఖవిముక్తికి జ్ఞానం ఒక్కటే ముఖ్యం. కాబట్టి ఈ బాహ్యచిహ్నాలు ఎన్ని ధరించినా వ్యర్థమే. సాంసారిక దుఃఖాలు అన్నీ నశిస్తాయి అనే భావంతో సంన్యాసం గ్రహిస్తే బాగుంటుంది అనుకొంటే, అదే భావాన్ని ఛత్రాదులు ధరించటం వల్లకలుగుతుంది అని ఎందుకు అనుకోకూడదు ? **అకించనత్వం (దరిద్రం)లో మోక్షంలేదు. కించనత్వం (అవసరమైన వస్తుసంపాదనం)లో బంధనం లేదు. కాబట్టి అకించనత్వంలో గాని, కించనత్వంలో గాని ఉన్నవ్యక్తి జ్ఞానం వల్లనే ముక్తుడు అవుతాడు.** కాబట్టి ధర్మార్థకామాలు, రాజపదవి అనే బంధనాలలో ఉన్నా, నేను బంధన రహితుడిని (జీవన్ముక్తుడిని) అని తెలుసుకో. ఐశ్వర్యమయ మయిన పాశాన్ని, దారాపుత్రాదులయందు ఉండే బంధాన్ని, నేను మోక్షం అనే రాతిమోద ఉంచి,

త్యాగం అనే పదునైన ఖడ్గంతో ఖండించాను. సంన్యాసినీ ! ఇలాంటి నేను జీవన్ముక్తుడను, నీయోగ ప్రభావాన్ని చూసి నీమీద ఆదరం కలిగినప్పటికి, నీ ఈ రూపసౌందర్యం యోగసాధనకు తగినది అని అనుకోను. కాబట్టి ఈ విషయంలో ఒకమాట చెపుతాను, విను.

సౌకుమార్యం, సౌందర్యం, చక్కనిశరీరం, యౌవనం – వీటి అన్నింటితోపాటు నీకు యోగం, నియమాలు ఉన్నాయనటం ఎంత వరకు వీలు అవుతుంది ? అని నా సందేహం. ఈ సంన్యాసచిహ్నాలకు తగిన విధంగా నీచేష్టలు లేవు. ఇతడు ముక్తుడు అవునా ! కాదా ? అని నన్ను పరీక్షించటానికి నాశరీరాన్ని లొంగదీసి, దాని మీద బలవంతంగా అధికారాన్ని హస్తగతం చేసుకొన్నావు. యోగయుక్తుడు కామాసక్తుడైతే ఆతని త్రిదండ ధారణం అనుచితం, వ్యర్థం. ఈ ప్రవర్తనతో నీవు సంన్యాసాశ్రమనియమాలను భగ్నం చేశావు. అలాకాక నీస్వరూపాన్ని దాచటానికి ఇలా చేసి ఉంటే జీవన్ముక్తులకు ఈ ప్రవర్తన తగదు. నీవు నీమనస్సుతో నాశరీరంలో ఉండే జీవుని ఆశ్రయించావు. నాపక్షాన్ని, నా శరీరాన్ని ప్రవేశించటంచేత నీకు ఒక దోషం కలుగుతుంది. అది చెపుతాను, విను. ఏ కారణంవలన నారాజ్యంలో, నగరంలో ప్రవేశించావు? ఎవరి సాన్నిహిత్యం వల్ల నాహృదయంలో ప్రవేశించావు ? వర్ణశ్రేష్ఠలయిన బ్రాహ్మణకన్యలలో ప్రముఖురాలవు. నీవు బ్రాహ్మణజాతీయవు. నేను క్షత్రియుడిని. కాబట్టి మన కలయిక అనుచితం. ఈ పనివలన వర్ణసాంకర్యం అనే దోషాన్ని కల్పించవద్దు. నీవు సంన్యాసధర్మంలో ఉన్నావు. నేను గృహస్థాశ్రమంలో ఉన్నాను. దీనివల్ల, నీవు ఆశ్రమసాంకర్యం అనే ఇంకొక దోషాన్ని చేస్తున్నావు. ఇది అనేకకష్టాలు కలిగిస్తుంది. నీవు నాకు సగోత్రవా లేక అసగోత్రవా నాకు తెలియదు. అలాగే నేను నీకు సగోత్రుడను అవునో కాదో నీకు తెలియదు. ఒకవేళ మనం ఇద్దరం ఒకే గోత్రం వారమైతే, నీవు గోత్రసాంకర్యం అనే మూడవతప్పు చేశావు. నీ భర్త జీవించి ఉన్నాడా ? లేక దేశాంతరం వెళ్ళాడా ? అలాగయితే నీవు పరస్త్రీవి కావటం వలన నాకు సంయోగయోగ్యవు కావు. ఇది ధర్మసాంకర్యం అనే నాలుగోదోషం అవుతుంది. నీవు ఏదైనా కార్యసాధనకోసం ఈ అకార్యం చేస్తున్నావా ? లేక తెలియకనా ? లేక కపటమైన మిథ్యాజ్ఞానంతోనా ఇన్ని తప్పులు చేశావు ? లేక నీవు ఒకరిచెప్పు చేతలు లేక ఇలా చేసి ఉంటే, ఈదోషం వల్ల ఇంతకుముందు నీవు చదువుకొన్నది, గురువులవల్ల విన్నది అంతా వ్యర్థం అవుతుంది. దీనివల్ల ఇంతవరకు నీవు దాచుకున్న దోషాన్ని నీవే బయట పెట్టుకొన్నావు. ఇందువల్ల దుష్టురాలిగా కన్పిస్తున్నావు. ఇప్పుడూ చెడ్డతనంలోని నాలుగో చిహ్నం అయినదోషం కనపడుతున్నది.

కేవలం విజయం కాంక్షించే నీకు విజయంలో నేను ఒక్కడినే లక్ష్యంకాదు. నీవు ఈ సభను అంతాకూడా జయించగోరుతున్నావు. అందువల్లనే నీవు నా పక్షాన్ని దెబ్బతీయటానికి, నీ పక్షానికి జయం కలగటానికి పూజ్యసభాసదులున్న ఈ సభను మాటి మాటికి చూస్తున్నావు. అసహనం వలన గలిగిన యోగసమృద్ధితో, అజ్ఞానంతో మోహితురాలివై విషాన్ని, అమృతాన్ని ఒకటి చేసినట్లు కామంతో యోగసంబంధాన్ని జోడిస్తున్నావు. పరస్పరం అనురాగం గల స్త్రీపురుషులకు సంయోగసుఖం అనే అమృతసమాన లాభం కలుగుతుంది. కోరికగల స్త్రీకి కోరిక లేని పురుషుడు లభిస్తే, ఆదోషం విషంవలె భయంకరం అవుతుంది. కనుక నన్ను స్పృశించవద్దు. నాశీలం ఉత్తమం, నిష్కళంకం అని తెలుసుకో. శాస్త్రధర్మమైన సంన్యాసాన్ని నిరంతరం పాటిస్తూ ఉండు. నేను జీవన్ముక్తుడిని అవునో కాదో తెలుసుకోవాలి అనుకొన్నావు. ఈ భావం నీమనస్సులో దాగి ఉన్నది. ఇప్పుడు నీవు దాన్ని నా ఎదుట దాచలేవు. నీ పని కోసం కాని, లేక ఇతరరాజుల పనికోసం కాని ఇక్కడికి వేషం మార్చుకొని వచ్చిఉంటే అసలు విషయం దాచటం తగదు. ఎవరైనా ఒక రాజు వద్దకుగాని, బ్రాహ్మణుని వద్దకుగాని, పతివ్రత అయిన స్త్రీ దగ్గరకుగాని దొంగవేషంతో వంచించి పోరాదు. అలా చేస్తే కోపంతో వారు ఆ వ్యక్తులను నాశనం చేస్తారు. **రాజులకు ఐశ్వర్యం బలం. వేదవేత్తలకు వేదం బలం. స్త్రీలకు రూపం, యౌవనం, సౌభాగ్యం అనేవి సర్వోత్తమమైన బలం.** వీరు వైవాటితోనే బలవంతులు అవుతారు. కాబట్టి తమ కోరిక సక్రమంగా నెరవేరాలని కోరుకునేవ్యక్తి, వీరిదగ్గరకు ఋజుప్రవర్తనతోనే వెళ్ళాలి. అలాకాకుండా కుటిలమైన ఆలోచనతో వెళ్ళితే అది వినాశానికి కారణం అవుతుంది. కాబట్టి నీవు నీ జాతిని, శాస్త్రవిజ్ఞానాన్ని, వృత్తాంతాన్ని, ఉద్దేశ్యాన్ని, స్వభావాన్ని, ఇక్కడికి వచ్చిన ఉద్దేశ్యాన్ని యథార్థంగా చెప్పటం మంచిది." భీష్ముడు చెప్పాడు. "ఈ రీతిగా బాధాకరాలు, అనుచితాలు, అయోగ్యాలు అయిన మాటలతో ఆమెను జనకుడు చులకన చేశాడు. అయినా సులభ ఆ మాటలకు ఏ మాత్రం కలత చెందలేదు. జనకరాజు ఇలా మాటాడగా సౌందర్య సమన్వితయైన సులభ ఇంకా మధురమైన వాక్కులను పలకటం ప్రారంభించింది.

"రాజా! మనస్సును, బుద్ధిని పాడుచేసే తొమ్మిది, తొమ్మిది దోషాలు లేక; పదునెనిమిది గుణాలు కలిగి, యుక్తియుక్తమై, అర్థవంతమయిన పదసమూహాన్ని వాక్యం అంటారు. ఆ వాక్యంలో సూక్ష్మత్వం, సాంఖ్యం, క్రమం, నిర్ణయం, ప్రయోజనం అనే ఐదు రకాల అర్థాలు ఉండాలి. ఈ సూక్ష్మత్వాదులైన అర్థాలు పదాలు, వాక్యాలు, పదార్థాలు, వాక్యార్థాలు అనే రీతిగా వివరంగా చెపుతాను. వీటిల్లో ఒక్కొక్కదాని లక్షణాన్ని ప్రత్యేకంగా

చెపుతాను. వినవలసింది. తెలియదగిన విషయాలు వేరువేరుగా ఉన్నప్పుడు, ఇది కుండ, ఇదివస్త్రం అని వస్తువులజ్ఞానం వేరుగా ఉన్నప్పుడు, అలాంటి చోట్ల యధార్థాన్ని నిర్ణయించే బుద్ధిని సూక్ష్మత అంటారు. కొన్నిచోట్ల విశేషమైన అర్థం ఉంటుంది అని భావించి వానిలో దోషాలను, గుణాలను విడివిడిగా లెక్కించటం అనే దాన్ని, సంఖ్య అని గాని సాంఖ్యం అనిగాని అంటారు. తాను అనుకున్న దోషాలలో ఈ గుణాన్ని ముందుచెప్పాలి, ఈ దోషాన్ని తరువాత చెప్పాలి అనే పూర్వాపరాలను నిర్ణయించుకోవటంతో వచ్చే వాక్యాన్ని వాక్యవేత్తలు క్రమయుక్తం అంటారు. 'ధర్మార్థకామమోక్షాలు అనే నాలుగింటిలో ఏదో ఒకదానిని విశేషంగా ప్రతిపాదిస్తాను' అని ప్రతిజ్ఞచేసి, చెప్పిన తరువాత ఇదే నేను చెప్పదలుచుకున్నది 'అని స్థిరమైన సిద్ధాంతాన్ని నిశ్చయించటం నిర్ణయం అంటారు.' ఇచ్ఛవల్ల గాని, ద్వేషంవల్ల గాని కలిగే దుఃఖాలలో ఏదో ఒక దానికి ప్రాధాన్యం కలిగినప్పుడు, అక్కడ ఏర్పడే బుద్ధివృత్తిని ప్రయోజనం అంటారు. రాజా ! వెనుకచెప్పిన సూక్ష్మత మొదలైన గుణాలు ఒకవాక్యంలోని అర్థంలో సమ్మిళితమై ఉండటాన్ని చెపుతాను, విను. సార్థకమైనది, అర్థభేదం లేనిది, న్యాయసంగత మైనది, అవసరమైన దానికంటె అధికం కానిది, చెవికి కర్ణకటువుగా లేనిది, సందేహాస్పదమైన పదాలు లేనిది, సర్వోత్తమమైన వాక్యాన్ని చెపుతాను. నేను చెప్పేదానిలో గుర్వక్షరాల, పరుషాక్షరాల సంయోగం ఉండదు. దానిలో మృదువైన, అందమైన పదాలు ఉంటాయి. అది పెడమొగం పెట్టిన వ్యక్తులకు తృప్తికరంగా ఉండదు. అది అసత్యం కాదు, ధర్మార్థ కామాలకు విరుద్ధం కాదు. సంస్కార రహితం కాదు. దానిలో న్యూనపదత్వం అనేదోషం ఉండదు. కష్టదాయక శబ్దాలు ఉండవు. క్రమరహితమైన ఉచ్చారణ ఉండదు. దానిలోనికి పదాల అధ్యాహారంగాని, లక్షణావసరంగాని ఉండదు. అది నిష్ప్రయోజనం కాదు. యుక్తి రహితం గాదు. నేను కామంతో గాని, కోపంతో గాని, భయంతో గాని, లోభంతో గాని, దైన్యంతోగాని, అనర్థంతో గాని, దయతో గాని, అభిమానంతో గాని, ఏమాటా చెప్పను.

రాజా ! ఒకవిషయం చెప్పవలె ననుకొన్నప్పుడు, చెప్పేవాడు, వినేవాడు, చెప్పేది అనే మూడూ వైకల్యం లేకుండా సమంగా ఉన్నప్పుడు, చెప్పేవాని మాట వినేవాడికి తెలుస్తుంది. **ఒక వాక్యం చెప్పేటప్పుడు వక్త వినేవానిని ధిక్కరించి, ఇంకొకరికి చెప్పేటప్పుడు, ఆ వాక్యం శ్రోత మనస్సులో ప్రవేశించదు.** ఒక మనుజుడు స్వార్థాన్ని వదలి, ఇతరులకు ఏమైనా చెపితే, అప్పుడు చెప్పేవాడి మీద వివేవానికి సందేహం కలుగుతుంది. కాబట్టి ఆ వాక్యం కూడ దోషయుక్తమే అవుతుంది. కాని రాజా ! వక్త తనకు, శ్రోతకు ఇద్దరికి విరుద్ధంకాని విషయాన్ని చెప్పితే అతడే సరియైన వక్త అవుతాడు,

ఇతరుడు కాడు. కాబట్టి రాజా ! నీవు స్థిరమైన మనస్సుతో ఏకాగ్రంగా వాక్యసంపదతో సమన్వితమై, అర్థవంతమైన దాన్ని విను. నీవు ఎవరు ? ఎవరి దానివి ? ఎక్కడిదానివి ? చెప్పుమని అడిగావు. రాజా ! దానికి నేను చెప్పే సమాధానాన్ని ఏకాగ్రమైన మనస్సుతో విను. కట్టతో లక్క, దుమ్ము, నీటి బిందువులు కలిసి ఏకమైనట్లు ఈ జగత్తులో జీవుల జన్మ అనేకతత్వాల కలయికతో జరుగుతుంది. శబ్దం, స్పర్శ, రసం, రూపం, గంధం అనే ఐదు, ఐదుజ్ఞానేంద్రియాలు ఆత్మకంటే భిన్నమైనా కట్టకు అతుక్కొని ఉన్న లక్కవలె ఆత్మతో కలిసి ఉన్నాయి. కాని వీనిలో స్వతంత్రంగా ఎలాంటి ప్రేరణ శక్తిలేదు అని విద్వాంసుల నిశ్చయం. వీటిల్లో ఏ ఒక్క ఇంద్రియానికి స్వజ్ఞానం గాని, ఇతరేంద్రియజ్ఞానం గాని లేదు. నేత్రానికి నేత్రత్వజ్ఞానం లేదు. ఇలాగే చెవులకు గూడా స్వవిషయ జ్ఞానంలేదు. ఇలాగే ఆ ఇంద్రియాలు, విషయాలు పరస్పరం కలిసికూడా తమ కలయిక తెలుసుకోలేవు. నీళ్ళు, దుమ్ముకలిసి కూడా తమకలయిక తెలుసుకోలేవు గదా. శరీరంలో ఉండే ఇంద్రియాలు గంధాది విషయాలను ప్రత్యక్షంగా అనుభవించేటప్పుడు బాహ్యాలయిన ఇతర గుణాలను అపేక్షిస్తాయి. వాటిని విను. రూపం, కన్ను, వెలుగు అనే ఈ మూడూ, ఏవస్తువు నైనా ప్రత్యక్షంగా చూడటానికి హేతువులు.

వీటివలెనే ఇంకా ఇతరాల తెలివి, తెలుసుకొనదగిన వానిలో కూడా మూడేసి హేతువులు ఉంటాయని గ్రహించు. జ్ఞానజ్ఞేయ విషయాల మధ్య, జ్ఞానేంద్రియాల కంటే ఇతరమైన మనస్సు అనే ఇంకొక గుణం కూడా ఉంటుంది. దాని వలననే, ఈ జీవాత్మ, ఏవిషయంలోనైనా మంచి చెడులను నిశ్చయించుకోవాలని ఆలోచిస్తుంది. అక్కడే బుద్ధి అనే పన్నెండవ గుణం ఉంది. దానివల్ల ఏదైనా తెలుసుకోవలసిన ఒక విషయంలో, మానవునికి సందేహం కలిగితే, ఒక నిశ్చయానికి రాగలుగుతాడు. పన్నెండవదైన ఆ బుద్ధిలో సత్వం అనే పదమూడవ గుణం ఉన్నది. దాని వలన మహాసత్వమో, అల్పసత్వమో అయిన ప్రాణిని అనుమానించవీలవుతుంది. ఆ సత్వంలో 'నేను (ఈపనికి) కర్తను' అనే అభిమానంతో గూడిన అహంకారం అనే పదునాల్గవగుణం ఉన్నది. దానివల్ల జీవాత్మ 'ఈ వస్తువు నాది, ఇది నాదికాదు' అని భావిస్తుంది. రాజా ! ఆ అహంకారంలో 'వాసన' అనే పదిహేనవగుణం ఉందని చెపుతారు. అక్కడ ప్రత్యేకించి భిన్నభిన్నంగా ఉండే కళల సమగ్రత అనే ఇంకొక గుణం ఉంది. అది ఒక గుంపులాగా ఉండే పదునారవదిగా చెపుతారు. దానిలో ప్రకృతి (మాయ), వ్యక్తి (ప్రకాశం) అనే రెండు గుణాలు ఆశ్రయించి ఉన్నవి. (ఇంతవరకు అన్నీ కలిపి పద్దెనిమిది అయినవి). సుఖదుఃఖాలు, జరామరణాలు,

లాభనష్టాలు, ప్రియాప్రియాలు మొదలైన ద్వంద్వాల కలయికను పందొమ్మిదివ గుణంగా భావించారు. ఈ పందొమ్మిది గుణాలకంటెపైన కాలం అనే ఇరువదవ గుణం ఉంది. దీనివలన ప్రాణుల సృష్టిలయాలు జరుగుతాయి. ఈ ఇరవై గుణాల సమూహమూ, పంచ మహాభూతాలు, సద్భావయోగం, అసద్భావ యోగం అనే రెండు ప్రకాశకగుణాలు ఉన్నాయి. ఇవి అన్నీకలిపితే మొత్తం ఇరవైఏడు అవుతుంది.* ఇంతకుముందు చెప్పిన ఇరవై గుణాలు, ఏడు గుణాలు కాక విధి, శుక్రం, బలం అనే ఇంకొక మూడు గుణాలు ఉన్నవి.** ఇలా అన్నీ కలిపి లెక్కిస్తే 20+10=30 గుణాలు అవుతాయి. ఈ గుణాలు మొత్తం ఉన్నదాన్ని శరీరం అంటారు.

కొంతమంది విద్వాంసులు అవ్యక్త ప్రకృతిని ఈ ముప్పది కళలకు ఉపాదాన కారణంగా భావిస్తారు. స్థూలదర్శనులైన ఇంకొక వర్గం వారు వ్యక్తాన్ని – అంటే పరమాణువులను కారణంగా తలుస్తారు. మూడవవర్గం వారు అవ్యక్తవ్యక్తాలను, ప్రకృతి పరమాణువులు అనే రెండింటిని, వాటికి ఉపాదానకారణంగా నిశ్చయిస్తారు. అవ్యక్తంగాని, వ్యక్తంగాని ఆ రెండుగాని, లేక బ్రహ్మ, మాయ, జీవుడు, అనే నాల్గుకాని కారణాలు కావచ్చు. కాని అధ్యాత్మచింతనం చేసే విద్వాంసులు, ప్రకృతినే సమస్త భూతాలకు ఉపాదానకారణంగా భావిస్తారు. రాజేంద్రా ! అన్నింటికి ఉపాదానకారణమైన అవ్యక్త ప్రకృతియే, వెనుక చెప్పిన ముప్పది కళల రూపంలో వ్యక్తం అయింది. నేను, నీవు, ఇతర శరీరధారులు అందరి శరీరాల ఉత్పత్తి ప్రకృతి నుంచే కలిగింది. ప్రాణుల వీర్య స్థాపననుంచి రజోవీర్యాల సంయోగం వల్ల కలిగే సంమిశ్రణలవలననే, కలలం అనే పదార్థం ఏర్పడుతుంది. కలలంనుంచి బుద్బుదం కలుగుతుంది. బుద్బుదాన్నుంచి మాంసపేశి ఉత్పన్నం అవుతుంది. పేశివలన విభిన్నమైన అవయవాలు తయారవుతాయి. అంగాల నుంచి రోమాలు, గోళ్ళు వ్యక్తం అవుతాయి. తొమ్మిది నెలలు నిండగానే, గర్భంనుంచి జీవుడు జన్మిస్తాడు. ఆ సమయంలో అతనికి నామ రూపాలు కలుగుతాయి. అప్పుడు ఆ జీవికి ఉండే చిహ్నాలవలన స్త్రీ పురుష వ్యవహారం ఏర్పడుతుంది. జన్మించినప్పుడు కన్పించే బాలకుని రూపానికి ఉండే

---

* *విఁసం॥ ఇహ ఘటః అస్తి (ఇక్కడ కుండ ఉన్నది) మొదలైన సత్తాసూచక (ఉన్నది అని తెలిపే) వ్యవహారాన్ని సద్భావ యోగం అంటారు.*

ఇహ ఘటోనాస్తి (ఇక్కడ కుండ లేదు) మొదలైన రీతిగా సత్తాభావ సూచకం (లేదు అని తెలిపే) లోక వ్యవహారం అసద్భావం. *(నీల)*

** *ఇక్కడ విధి అనే శబ్దం వల్ల వాసనకు బీజమైన ధర్మం, అధర్మం అని తెలుసుకోవాలి. వాసనను ఉద్బోధంచేసే సంస్కారమే శుక్రం. వాసనానుసారం విషయప్రాప్తికి అనుకూలమైన యత్నమే బలం.* *(నీల)*

గోళ్ళు, వ్రేళ్ళు రాగిలాగా ఎర్రగా ఉంటాయి. కౌమారాన్ని పొందిన తరువాత, ఆ వ్యక్తికి శైశవంలో ఉండేరూపం మారుతుంది. ఆ వెనుకటిది కన్పించదు. ఇలాగే కౌమారావస్థనుండి యువావస్థ, యువత్వం నుంచి ముసలితనం ఆ వ్యక్తికి కలుగుతాయి. ఈ వరుసలో తరువాతి వయస్సు లోకి వచ్చిన తరువాత వెనుకటి అవస్థలలో ఉండే రూపం మారుతుంటుంది. ఇది ప్రత్యక్షంగా కన్పిస్తుంది. అన్ని ప్రాణులలోను విభిన్నమైన ప్రయోజనాలు కలగటంకోసం, వెనకచెప్పిన కళల స్వరూపంలో, ప్రతిక్షణమూ మార్పు కలుగుతుంటుంది. ఆపరిణామం గుర్తించటానికి వీలు కానంత సూక్ష్మంగా ఉంటుంది. ప్రతి అవస్థలోను ఈ కళల లయం జరుగుతూనే ఉంటుంది. కాని కంటికి కన్పించదు. దీపజ్వాల ప్రతిక్షణమూ పోతుంటుంది. వస్తుంటుంది. కాని మనకు కన్పించదు, అలాగే ఇది కూడా జరుగుతుంది.

పరుగెత్తే మంచిగుఱ్ఱం, మనం చెప్పలేనంత వేగంగా, ఒక ప్రదేశాన్ని వదలి ఇంకొక చోటికి చేరినట్లుగానే, ఈ ప్రభావవంతమైనలోకం నిరంతరం వేగంగా ఒక అవస్థనుంచి ఇంకొక అవస్థకు చేరుతుంటుంది. కాబట్టి దాని విషయంలో ఎవరు ఎక్కడి నుంచి వస్తారో, ఎక్కడి నుంచి రారో, ఎవరికి సంబంధించినవారు, ఎవరికి సంబంధించినవారు కారు, అనే ప్రశ్నలే కలుగవు. అలాగే ప్రాణికి అవయవాలతో ఏ సంబంధం ఉంది ? అంటే ఏ సంబంధం లేదని భావం. సూర్యకిరణ సంపర్కం వల్ల, సూర్యకాంత మణిలో నుంచి అగ్ని వస్తుంది. రెండుకట్టల మధ్య రాపిడివల్ల అగ్ని పుడుతుంది. ఇలాగే వెనుక చెప్పిన కళలసముదాయం వలన జీవుడు జన్మిస్తాడు. నీలో నీఆత్మను చూచినట్లే, నీ ఆత్మతో ఇతరులలో ఉండే ఆత్మను ఎందుకు చూడలేవు ? నావలెనె ఇతరులు అని సమత్వం ఉంటే, మాటిమాటికి నన్ను నీవు ఎవరివి ? ఎవరి దానవు ? అని ఎందుకు అడుగుతావు ? మిథిలాధిపా ! 'ఇదినాకు కావాలి, ఇది నాకు అక్కర్లేదు' మొదలైన ద్వంద్వభావచింత నుండి నీవు ముక్తుడవు అయితే నీవు ఎవరవు ? ఎవరిదానవు ? ఎక్కడినుండి వచ్చావు ? అని ప్రశ్నించటంవల్ల, నీకు కలిగే ప్రయోజనం ఏముంటుంది ? శత్రువు, మిత్రుడు, మధ్యస్థుడు అనే వారి విషయంలో విజయం, సంధి, విగ్రహాల అవసరం మీద 'తగిన పనులు చేసే రాజులో జీవన్ముక్తుని లక్షణం' ఏముంటుంది ? ధర్మం, అర్థం, కామం అనేమూడింటిని త్రివర్గం అంటారు. ఇది ఏడు విధాలుగా వ్యక్తం అవుతుంది. చేయవలసిన పనులలో ఈ త్రివర్గం తెలియనివాడు, ఎల్లప్పుడు త్రివర్గంతో సంబంధం పెట్టుకోనే పురుషునిలో జీవన్ముక్త లక్షణం ఏముంటుంది ? ప్రియాప్రియాలందు, బలహీన బలవంతులయందు సమదృష్టిలేని వానికి జీవన్ముక్తలక్షణం ఏముంటుంది ?

రాజా ! యోగ యుక్తుడివికాక పోయినా, నేను జీవన్ముక్తుడిని అని నీకు కలిగే అభిమానాన్ని మిత్రులు దూరం చేసుకోవాలి. సరిగా పథ్యంచేయని వ్యక్తికి ఔషధం ఇవ్వక పోవటం వంటిదే నీ స్థితి అవుతుంది. లోకంలో తనకు ఆసక్తి కల్గించే పదార్థాలను అన్నింటిని, బయటి ప్రపంచంలోకాక తనలోనే చూచుకొనటం కంటె ముక్తలక్షణం ఇంకొకటి ఏమున్నది ?

నీవు మోక్షాన్ని ఆశ్రయించి కూడా, నాలుగు అంగాలలో ఉన్న సూక్ష్మాసక్తి స్థానాలను నీలో నిలుపుకొన్నావు. వాటిని చెపుతాను, విను. సమస్తమయిన ఈ భూమండలాన్ని ఏకచ్ఛత్రంగా పరిపాలించే ఏకైక సార్వభౌముడు కూడా, ఒక నగరంలో మాత్రమే ఉంటాడు. (సామ్రాజ్యంలో అంతటా ఒకే మారు ఉండలేడు) ఆ నగరంలో కూడా ఆయనకు ఒక సౌధం మాత్రమే నివాసంగా ఉంటుంది. అంతటి మేడలోకూడా ఆయన రాత్రి నిద్రించటానికి ఒక శయ్యమాత్రమే ఉంటుంది. ఆ పట్టెమంచం పక్కమీద కూడా, ఆయన అర్ధాంగికి సగం భాగం ఉంటుంది. ఈ వివరణవల్ల ఆ సార్వభౌముడు అల్పఫలం పొందే వాడే అవుతాడు గదా ! ఇదే రీతిగా సుఖానుభవం, భోజనం, వస్త్రాది ఆచ్ఛాదనలు, ఇంకా ఇతరమైన పరిమిత విషయానుభవంలోను, దుష్టనిగ్రహం, శిష్టానుగ్రహం మొదలైన విషయాలలో కూడా, రాజు ఎల్లప్పుడు పరతంత్రుడే. ఇలాగే ఆయన ఇంకా అనేక విషయాలలో, చిన్న, పెద్దవాటిలో అన్నింటిలోను స్వతంత్రుడుకాడు. అయినా వాటిలో ఆసక్తు డవుతాడు. సంధి, విగ్రహాలకులోనైన రాజుకు స్వాతంత్ర్యం ఎక్కడుంది ? స్త్రీ సాంగత్యం, క్రీడలు, విహారాదులలో కూడా ఆయన ఎల్లప్పుడూ పరతంత్రుడే. సభలో కూర్చుని మంత్రులతో సమాలోచన చేసేటప్పుడు కూడా ఆయనకు స్వాతంత్ర్యం ఎక్కడుంది ? ఇతరులను ఆజ్ఞాపించటంలో ఆయనకు స్వాతంత్ర్యం ఉంది అని అంటారు. కాని అలాంటి సమయాలలో కూడా, భిన్నభిన్నక్షణాలలో సింహాసనం మీద కూర్చున్నరాజు మంత్రుల సలహాల ననుసరించి, తన ఇష్టానికి వ్యతిరేకంగా చేయవలసి వస్తుంది.

అయన నిద్రించాలి అనుకొంటాడు. కాని కార్యార్థులు చూట్టూ ఉండటంచేత పడుకోలేడు. పక్క మీద నిద్రపోతున్నా, ఆయన జనుల అభీష్టాలకు లొంగే లేవవలసివస్తుంది. 'మహారాజా ! స్నానం చేయండి, నలుగు పెట్టించుకోండి, నీరు త్రాగండి, భోజనం చేయండి, ఆహుతులు ఇవ్వండి, యాగాలు చేయండి. చెప్పవలసింది చెప్పండి. ఇతరులు చెప్పేది వినండి' ఇలాంటి మాటలు ఇతరులు చెప్పి అలా ప్రవర్తింపజేస్తారు. యాచకులు అనేకులు అనేక సమయాలలో వచ్చి, అనేక రీతులుగా ధనాదులు ఇవ్వమని అర్థిస్తుంటారు. వారిలో యోగ్యులు అయిన వారికి కూడా ఇచ్చేసాహసం చేయలేక, తన ధనాగారాన్ని

సురక్షితంగా ఉంచగోరుతాడు. అందరికి ధనాన్ని దానంచేస్తే, కోశాగారం వట్టిపోతుంది. ఎవరికీ ఏమీ ఇవ్వకపోతే అందరితో వైరం కలుగుతుంది. ఇలాంటి సమస్యలు రాజుకు ప్రతిక్షణం కలుగుతుంటాయి. అందువల్ల రాజకార్యాల మీద విసుగు - విరక్తి కలుగుతుంది. పండితులు, వీరులు, ధనికులు ఒక చోట ఉన్నప్పుడు చూస్తే, ఆయనకు అనుమానం కలుగుతుంది. ఆ సన్నివేశం కాకపోయినా ఆయన పరిస్థితి అది. అదిభయకారణం అవుతుంది. నిరంతరం తనదగ్గర ఉండే వారిపైనా ఆయనకు సందేహం కలుగుతుంటుంది. పైన నేను చెప్పిన విద్వాంసులు మున్నగు వారు తమ విషయంలో రాజుసందేహాలను గమనించి నిజంగానే తమ రాజు మీద దురభిప్రాయం ఏర్పరచుకొంటారు. అప్పుడు ఆ రాజుకు ఎలాంటి భయం కలుగుతుందో దాన్ని నీకు నేను చెప్పవలసింది కాదు. జనకా ! ప్రతిఒక్క మనిషీ తమతమ ఇండ్లలో రాజులే. తమ ఇంట యజమానులే. ప్రతివారు ఎవరో ఒకరిపైన ఆగ్రహిస్తారు. ఎవరో ఒకరిని అనుగ్రహిస్తారు. భార్య, పుత్రులు, శరీరం, మిత్రులు, ధనసంపాదన అనేవి అన్నీ రాజుకు ఉన్నట్లు గానే ఇతరులకు ఉంటాయి. ఈయన రాజు అనటానికి ఉండే యుక్తులతోనే, ఇతరవ్యక్తులు కూడా ఈయనతో సమానులని చెప్పవచ్చు. 'దేశం నాశనమైంది, పట్టణం దగ్ధమైంది. పట్టపుటేనుగు మరణించింది'. ఇలాంటి విషయాలు సర్వసామాన్యాలు. కష్టాలుకూడా అంతే. అయినా రాజు మిథ్యాజ్ఞానంవల్ల, తనకు మాత్రమే నష్టం జరిగిందని సంతాపం చెందుతాడు. ఇచ్ఛ, ద్వేషం, భయంవల్ల కలిగే మానసిక బాధ, రాజును ఎప్పుడూ వదలిపెట్టదు. తలనొప్పివంటి శారీరకరోగాలు కూడా, అన్ని విధాలా ఆయనను అదుపులో ఉంచుకొని వ్యాకులపరుస్తాయి. ఆయన సుఖదుఃఖాదులగు నానావిధద్వంద్వాలచే బాధింపబడుతూ, ఏవైపు నుంచి ఏ ఆపదవస్తుందో అని శంకిస్తూ, అనేక శత్రువులు గల రాజ్యాన్ని పరిపాలిస్తూ రోజులు లెక్కపెట్టుకొంటూ ఉంటాడు. సుఖం స్వల్పంగా ఉన్నది, బాధలు దుఃఖాలు అపారంగా గలది, నిస్సారమైనది, దగ్ధమయ్యే ఎండుగడ్డిలాగా క్షణాలలో నాశనమయ్యేది, నురుగు, నీటిబుడగలులాగా క్షణ భంగురమైనది అయిన రాజ్యాన్ని ఎవడు స్వీకరిస్తాడు ? గ్రహించినా, ఎవడు శాంతిని పొందగలడు ?

రాజా ! ఈ నగరం, ఈ రాజ్యం, సైన్యం, ధనాగారం, మంత్రులు - ఈ సమస్తాన్ని నాది అని చెపుతూ, నాది అనుకొంటున్నది అంతా నీభ్రాంతిమూలకమే. ఇవి అన్నీ ఎవరికి చెందినవి ? ఎవరికి చెందనివో చెప్పు అని నేను అడుగుతున్నాను. మిత్రులు, మంత్రులు, నగరం, రాజ్యం, దండనీతి, భాండాగారం, రాజు అని రాజ్యం ఏడుఅంగాలు

గలది. నాచేతిలో త్రిదండం ఉన్నట్లే నీచేతిలో రాజ్యం ఉన్నది. సప్తాంగమైన నీ రాజ్యం, నా త్రిదండం అనే ఈ రెండూ, పరస్పరం ఉత్కృష్ట గుణాలు కలిగి ఉన్నవి. ఈ రెండింటిలో ఏది ఏ కారణం వల్ల అధికమైనది ? రాజ్యానికి సంబంధించిన సప్తాంగాలలో ఆ యా సమయాలలో తమ తమ వైశిష్ట్యాన్ని వ్యక్తం చేస్తాయి. ఏ అంగం వలన ఏకార్యం సిద్ధిస్తే దానికి అదే ప్రధానం అవుతుంది. రాజేంద్రా ! సప్తాంగసముదాయమూ, ఉత్సాహ ప్రభుమంత్రశక్తులు అనే మూడు, మొత్తం పది, రాజ్యానికి అంగాలు అవుతున్నాయి. ఈ పది కలిసి రాజువలెనే రాజ్యాన్ని అనుభవిస్తున్నాయి. మంచి ఉత్సాహవంతుడు, క్షత్రియధర్మ తత్పరుడు అయిన రాజు, ప్రజల ఆదాయంనుంచి పదవభాగాన్ని తీసుకొని సంతోషిస్తాడు. ఇంకొక రాజు పదవభాగాని కంటే తక్కువే తీసుకుని సంతృప్తి పడతాడు. సాధారణ ప్రజలు లేకపోతే ఎవడూ రాజు కాలేడు. రాజు లేకపోతే రాజ్యం నిలువదు. రాజ్యం లేకపోతే ధర్మం ఎక్కడ ఉంటుంది ? ధర్మం లేకపోతే పరమాత్మ ప్రాప్తి ఎలా కలుగుతుంది ?

రాజుకు, రాజ్యానికి పరమ ధర్మమూ, పరమ పవిత్రమైనది చెపుతాను. విను. తనరాజ్యాన్ని అంతటిని దానం చేసేరాజు, అశ్వమేధ యజ్ఞం చేస్తే కలిగేటంతటి ఉత్తమఫలాన్ని పొందుతాడు. మిధిలాధిపా ! రాజ్యానికి కలిగే దుఃఖాలను - బాధలను వందలు, వేలు చెప్పగలను. నా శరీరం మీదనే నాకు అభిమానం లేదు. అలాంటప్పుడు ఇతరుల శరీరం మీద ఆసక్తి ఎలా కలుగుతుంది ? ఈ రకంగా యోగయుక్తుడైన నన్ను నీవు ఇలా అనటం తగదు. రాజా ! నీవు పంచశిఖ మహర్షి వద్ద ఉపాయం (నిదిధ్యాసము)తోను, ఉపనిషత్తు (వాని శ్రవణ మననము) లతో, ఉపాసంగా (యమ నియమాదులగు యోగాంగము) లతో, నిశ్చయం (జీవబ్రహ్మల సమైక్యానుభవము)తో గూడిన సంపూర్ణమైన మోక్ష శాస్త్రాన్ని విన్నావు. అన్ని ఆసక్తుల నుండి విముక్తుడవు. అన్ని ఇహలోకబంధాల నుంచి ముక్తుడవు. అలాంటప్పుడు నీకు ఛత్రచామరాది విశేష వస్తువుల మీద ఆసక్తి ఎలా కలుగుతున్నది ? నీవు పంచశిఖాచార్యుని వద్ద శాస్త్ర శ్రవణం చేసినా చేయనట్లే అని, ఒక వేళ విన్నా దాన్ని మిథ్య చేశావని, లేక ఆయన వలననే వేదశాస్త్రాల లాగా అనిపించే ఇంకొక శాస్త్రం విన్నావని నేను అనుకొంటున్నాను. ఇంతవిన్నా, నీవు విదేహాధిపతి మిధిలాధిపతి అనే లౌకికమైన పేర్లతోనే ప్రతిష్ఠను పొంది, సామాన్యమనుష్యులవలె ఆసక్తి, అవరోధాలతోనే బద్ధుడవై ఉన్నావు. నిజంగా నీవు ముక్తుడివే అయి ఉంటే, నేను బుద్ధి ద్వారా నీశరీరంలో ప్రవేశించి నీకు ఎలాంటి అపకారం చేశాను ? నాలుగు వర్ణాలలో త్రైవర్ణికులకంటే సంన్యాసులు ఏకాంత వాసం చేయాలనే నియమం ప్రసిద్ధంగదా ! నేను కూడా నీ శూన్య

శరీరంలో ఉండి ఏ వస్తువునైనా చెడగొట్టానా ? రాజా ! నిన్ను చేతులతోగాని, బాహువులతోగాని, ఊరువులతో కాని ఇతరమైన ఏ అవయవాలతో కానీ నిన్ను స్పృశించ లేదుగదా ! ఉత్తమ వంశంలో జన్మించి, తప్పుచేస్తానేమో అనే లజ్జగలిగి, ముందుచూపు ఉన్న వ్యక్తివిగదా ! మనిద్దరం మన మధ్య చేసిన మంచిచెడులను నీవు ఈ మహాసభలో చెప్పవచ్చునా ? అన్ని వర్ణాలవారికి గురువులైన బ్రాహ్మణులు ఇక్కడ ఉన్నారు. ఈ గురువుల కంటే కూడా పూజ్యులైన అనేక మహాపురుషులు ఈ సభలో కూర్చుని ఉన్నారు. రాజువుకాబట్టి వీరికి అందరికీ నీవు పూజ్యుడవు. కాబట్టి గురుస్వరూపివి. ఇలా గౌరవం మీలో పరస్పరం అందరికీ ఉన్నది. ఈ విషయాలన్నీ బాగా ఆలోచించి, ఇక్కడ ఏమి చెప్పవచ్చో, ఏమి చెప్పదగదో పరిశీలించాలి. స్త్రీ పురుషుల సంయోగ విషయచర్చ ఎలాంటి సమయంలోను చెప్పదగదు. మిధిలేశా ! తామరాకు మీద ఉండే జల బిందువు ఆ ఆకును అంటకుండా ఉన్నట్లు నేను నిన్ను ఏమాత్రం స్పృశించకుండా ఉన్నాను. ఏ రీతిగాను నిన్ను స్పృశించకుండా నేను ఉన్నా నిన్ను స్పృశించినట్లు అనిపిస్తున్నదా ? అయితే సంన్యాసి, మహాత్ముడు అయిన పంచశిఖుడు నీ హృదయక్షేత్రంలో వేసిన జ్ఞాన బీజాన్ని మొలవనీయకుండా చేసుకొన్నావు అని నేను అనవచ్చుగదా ! పరస్త్రీ స్పర్శను అనుభవించటం చేత, నీవు గృహస్థధర్మం నుంచి పతితుడ వయినావు. తెలియటానికి కష్టమై, దుర్లభమైన మోక్షాన్ని కూడా పొందలేకపోయావు. కాబట్టి మోక్షవిషయాలు మాట్లాడుతూ నీవు గార్హస్థ్య మోక్షాల మధ్య వ్రేలాడుతున్నావు. జీవన్ముక్తుడైన జ్ఞానికి, జీవన్ముక్తుడగు జ్ఞాని తోను. ఏకత్వానికి పృథక్త్వంతోను, భావానికి (ఆత్మకు) అభావంతోను (ప్రకృతితోను) సంయోగం కలిగితే వర్ణసాంకర్యం కలగదు. సమస్తమైన వర్ణాశ్రమాలను ప్రత్యేకించి చెప్పటాన్ని అంగీకరిస్తాను. బ్రహ్మసాక్షాత్కారాన్ని పొంది, అభేద భావం గలిగి, ఆత్మకంటే భిన్నమైన ఇతరవస్తువుకు దేనికి సత్త (ఉనికి) లేదని, దానికి ఇంక దేనితో కూడా సంయోగం కలగదని తెలిసినప్పుడు వర్ణసాంకర్యమే ఉండదు.

చేతిలో కమండలం ఉంది. దానిలో పాలు ఉన్నవి. వాటిల్లో ఈగ ఉన్నది. ఈ మూడూ ఒక దానికంటె ఇంకొకటి వేరుగా ఉన్నప్పటికీ, ఆధారాధేయ భావంతో ఒక దాన్ని ఒకటి ఆశ్రయించి ఏకమయినవి. కమండలంలో క్షీరత్వంలేదు. పాలు ఈగ కాలేదు. ఈ సమస్తమయిన ఆధేయపదార్థాలు స్వయంగానే తమకంటె భిన్నమైన ఆధారాన్ని పొందుతున్నవి. ఆశ్రమాలు నాలుగూ విడివిడిగానే ఉన్నవి. నాలుగు వర్ణాలూ భిన్నాలే. వీటిల్లో ఇలా పార్థక్యం (భిన్నత్వం) ఉన్నప్పుడు, భిన్నత్వాన్ని తెలిసిన నీవర్ణంతో సాంకర్యం

ఎలా కలుగుతుంది ? రాజా ! నేను బ్రాహ్మణ జాతీయనుగాను, వైశ్యస్త్రీనికాను, ఇతర జాతిదాన్ని కాను. నీలాగే నేనూ క్షత్రియజాతీయను. శుద్ధ వంశంలో జన్మించాను. అఖండ బ్రహ్మచర్యాన్ని పాటించాను. ప్రధానుడు అనే రాజర్షి పేరు నీవు విని ఉంటావు. నేను ఆయన వంశంలో జన్మించాను. నాపేరు సులభ అని తెలుసుకో. నాపూర్వులు చేసిన యజ్ఞాలలో, ఇంద్రుని సహాయం వల్ల ద్రోణం, శతశృంగం, చక్రద్వారం అనే పర్వతాలను యజ్ఞకుండాలు కట్టడంలో ఇటుకల లాగా ఉపయోగించారు. అలాంటి గొప్ప వంశంలో నేను జన్మించాను. నాకు తగిన భర్త లభించకపోవటం వలన మోక్షధర్మవిద్యను అభ్యసించాను. ముని వ్రతాన్ని అవలంబించి ఒంటరిగా సంచరిస్తున్నాను. కపట సంన్యాసి వేషం వేయలేదు. ఇతరుల ధనం దోచలేదు. ధర్మ సాంకర్యాన్ని వ్యాపింపజేయటం లేదు. నేను దృఢంగా బ్రహ్మచర్యాన్ని అనుష్ఠిస్తూ స్వధర్మంలో ఉన్నాను. రాజా ! చేసిన ప్రతిజ్ఞలో నిలకడగానే ఉన్నాను. ముందు బాగా ఆలోచించకుండా ఏమీ మాట్లాడను. అన్ని విషయాలు చక్కగా ఆలోచించుకొనే నీవద్దకు వచ్చాను. నీ బుద్ధి మోక్షధర్మంలో లగ్నమై ఉందని విన్నాను. కాబట్టి నీకు మేలు కలగాలనే ఉద్దేశంతో, నీ మోక్షజ్ఞానం లోని నిజాన్ని తెలుసుకోవటానికి ఇక్కడికి వచ్చాను. స్వపక్ష పరపక్షాలలో నాపక్షంలోనే ఉండి పక్షపాతంతో మాట్లాడటం లేదు. మాటలతో కసరత్తు చేయకుండా, శాంతమైన పరబ్రహ్మలో నిమగ్నుడై ఉండే వ్యక్తి మాత్రమే ముక్తుడు. పట్టణంలో ఉండే ఒక జనరహితమైన ఇంట్లో సంన్యాసి నివసించినట్లు, నీ శరీరంలో ఈ రాత్రి ఉంటాను. మిథిలాధిపా ! అలాంటి నన్ను చాలా గొప్పగా గౌరవించావు. నీమాటలతో నాకు మంచి ఆతిథ్యం ఇచ్చావు. ఇప్పుడు నేను చాలా హాయిగా నీ శరీరం అనే అందమైన గృహంలో నిద్రించి, రేపు ప్రొద్దుటనే ఇక్కడ నుంచి వెళ్తాను." భీష్ముడన్నాడు. యుధిష్ఠిరా ! సులభచెప్పిన యుక్తియుక్తమై, అర్థవంతమైన మాటలు విని జనకమహారాజు ఇంక ఏమీ మాట్లాడలేదు."

321. వ్యాసుడు శుకునికి చేసిన ధర్మోపదేశము - పావకాధ్యయనము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "పితామహా ! పూర్వం వ్యాసమహర్షి పుత్రుడైన శుకుడు వైరాగ్యం ఎలా పొందాడు ? ఇది వినాలని నాకు కుతూహలం ఎక్కువగా ఉన్నది. కురుశ్రేష్ఠా ! ఇదేకాక వ్యక్తం, అవ్యక్తం అయిన తత్త్వాలకు బుద్ధితో నిశ్చయించిన స్వరూపాన్ని వివరించాలి. జన్మరహితుడైన నారాయణుని వృత్తాంతాన్ని వినిపించగోరుతున్నాను." భీష్ముడు చెపుతున్నాడు. "రాజా ! సామాన్యవ్యక్తులవలె ఆచరిస్తూ ఎలాంటి భయం లేకుండా సంచరిస్తున్న కుమారుడైన శుకుని చూసి, తండ్రి అయిన వ్యాసుడు

సాంగవేదాధ్యయనం చేయించి, తరువాత ఇలా ఉపదేశించాడు. "కుమారా ! నిరంతరం ధర్మాన్ని ఆచరించు. ఇంద్రియాలను జయించి, బాగా తీవ్రమైన చలిని, వేడిమిని, ఆకలి దప్పులను సహిస్తూ ప్రాణవాయువును జయించు. నిజంచెప్పడం, ఋజుప్రవర్తన, కోపం లేక పోవడం, ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవడం, తపస్సు, అహింస, దయ మొదలైన ధర్మాలను యథావిధిగా ఆచరణలో పెట్టుకో. సత్యాన్ని అనుసరించు. అన్ని రకాల కుటిలత్వాలను వదలి, ధర్మాసక్తుడివి కావలసినది. దేవతలను, అతిథులను సత్కరించి, మిగిలిన ఆహారాన్ని ప్రాణరక్షణకోసం మాత్రమే స్వీకరించు. కుమారా ! నీటిబుడగవంటి దేహంలో జీవుడు పక్షివలె ఉన్నాడు. మిత్రబాంధవులతో ఉండటం కూడా శాశ్వతం కాదు. అయినా నీవు పరాకుగా ఉన్నావేమి ? నీ శత్రువులు నిరంతరం సావధానంగా మెలకువతో ఉండి నీలోని లోపాలను వెతుకుతున్నారు. ఇంకా నీవు చిన్నవాడివే కాబట్టి తెలుసుకోలేకపోతున్నావు. రోజులు దొర్లిపోతున్నవి. ఆయువు తరిగి పోతున్నది. జీవితం వ్రాసినట్లు నిశ్చలం కాబోతున్నది. సమాప్తం కాబోతున్నది. అయినా నీవు లేచి పరుగుతీయవేమిటి ? (తొందరగా కర్తవ్య నిష్ఠుడివి కావేమి ?)

తీవ్రమైన నాస్తికులు ఈ లోకంలో కేవలం స్వార్థాన్నే కోరుతూ, శరీరంలో రక్తమాంసాలను పెంపొందించే పనులే చేస్తున్నారు. పరలోక సాధకాలైన కార్యాలను ఆచరించటంలో, నిద్రపోతున్నట్టు పరాకుగా ఉన్నారు. బుద్ధి కలిగించే వ్యామోహంలో మునిగి, వారు ధర్మాన్ని ద్వేషిస్తూ అపమార్గంలో వెళ్ళుతున్నారు. వారేకాదు, వారివెంట నడిచేవారు కూడా కష్టాలను అనుభవిస్తారు. కాబట్టి మహత్తరమైన ధర్మబల సంపన్నులు, మహాత్ములు, నిత్యసంతుష్టులు, వేదధర్మానుష్ఠితలై నిరంతరం ధర్మమార్గాన్ని అనుసరించే వారిని సేవించు. నీ కర్తవ్యాన్ని అడుగు. ధర్మ్రదష్టులైన ఆ పండితుల అభిప్రాయాలను స్వీకరించి, ఉత్తమమైన నీ వివేకంతో అపమార్గాన వెళ్ళే నీమనస్సును అదుపులో పెట్టుకో. వర్తమానకాలంలో కలిగే సుఖం మీదనే దృష్టి ఉంచి, ముందు కలుగబోయే పరిణామాలను చాలా దూరంగా ఉన్నవని భావించి, నిర్భయులై ఉండి, నానావిధాలైన అభక్ష్యపదార్థాలను తింటూ వివేక హీనులైనవారు ఈ కర్మభూమి మహత్యాన్ని గుర్తించలేకపోతున్నారు. నీవు ధర్మం అనే నిచ్చెనను సంపాదించి, మెల్లమెల్లగా దాని మెట్లను ఎక్కుతూ వెళ్ళు. ఇంకా నీవు పట్టు పురుగులాగా నీలో ఉన్న వాసనలు అనే వలలో చిక్కుకొని ఉన్నావు. తగిన జాగ్రత్త తీసుకొనటంలేదు. తన హద్దులు మీరిన వాడు, ఒడ్డుపడిపోయిన నదీ ప్రవాహంవంటి వాడు, నాస్తికు డైన నరుని, పగిలిపోయిన వెదురు బొంగునువలె, సందేహించక

ప్రక్కనపెట్టు. కామం, క్రోధం, మృత్యువు, పంచేంద్రియా అనే నీటితో నిండిన, భౌతికవిషయాసక్తి అనే నదిని సాత్వికమైన ధీరత అనే నౌకను ఆసరాగా తీసుకొని దాటి ఒడ్డును చేరు. ఇలా జనన మరణరూపమూ, దుర్గమమూ అయిన సంసారం నుంచి బయటపడు.*

సమస్తలోకమూ మృత్యువువలన దెబ్బలు తింటూ, ముసలితనంతో బాధపడుతూ ఉన్నది. ఈ రేయింబవళ్ళు ప్రాణుల ఆయువును అపహరించి, సఫలంగా దొర్లిపోతున్నవి. ధర్మ మనే నౌకను ఎక్కి సంసారసాగరాన్ని దాటు. మానవుడు నిలుచున్నా, పడుకున్నా నిరంతరం మృత్యువు వెతుకుతూ ఉంటుంది. అకస్మాత్తుగా మృత్యువుకు ఆహారమయ్యే నీవు ఇలా నిశ్చింతగా ఎలా ఉంటున్నావు ? భోగసామగ్రిని నిరంతరం సమకూర్చుకొంటూ, కోరికలు తీరుతున్నా తృప్తిపడకుండా ఉండే వ్యక్తిని, గొట్టెపిల్లను తోడేలులాగా వచ్చి, మృత్యువు తీసుకుపోతుంది.** ఈ సంసారం అనే గాఢాంధకారంలోకి వెళ్ళవలసివస్తే, ధర్మబుద్ధిమయమూ, మహత్తరమూ అయిన దీపాన్ని గ్రహించు. ఆ దీపశిఖచాలా చక్కగా ప్రకాశిస్తుండాలి సుమా !*** నాయనా ! జీవుడు అనేక విధాలయిన శరీరాలతో పుడుతూ, గిట్టుతూ ఎప్పుడో ఒకసారి మానవజన్మలో బ్రాహ్మణశరీరాన్ని పొందుతాడు. కాబట్టి నీవు బ్రాహ్మణునికి తగిన విధులను నిర్వర్తించు. ఈ బ్రాహ్మణ శరీరం భోగాలు అనుభవించటానికి జన్మించదు. ఇది ఇక్కడ అనేక విధాల శ్రమపడి, తపస్సు చేయటానికి, మరణానంతరం సుఖాన్ని అనుభవించటానికి ఏర్పడింది. చాలా కాలం తీవ్రమైన మహత్తర తపస్సులుచేయటం వలన బ్రాహ్మణ శరీరం లభిస్తుంది. ఈ జన్మను పొంది, విషయసుఖాలలో పడి, జీవితం వ్యర్థం చేసుకోరాదు. నిజంగా నీవు నీ క్షేమాన్ని కోరుకొంటే, కుశల సంపాదకమయిన పనులలో ఆసక్తుడవై వేదాధ్యయనం, తపస్సు, ఇంద్రియ నిగ్రహాలలో తత్పరుడవై ఉండటానికి ప్రయత్నించు. మానవుల ఆయువు అనే గుట్టం చాలా వేగంగా దౌడు తీస్తున్నది. దీని స్వభావం వ్యక్తంకాదు. కళ,

---

* కామం క్రోధం చ మృత్యుం చ పంచేంద్రియజలాం నదీమ్ ।
నావం ధృతిమయీం కృత్వా జన్మదుర్గాణి సంతర ॥ 17

** సంచిన్వానకమేవైనం కామానామవితృప్తకమ్ ।
వృకీవోరణమాసాద్య మృత్యురాదాయ గచ్ఛతి ॥ 20

*** క్రమశః సంచితశిఖః ధర్మబుద్ధిమయో మహాన్ ।
అంధకారే ప్రవేష్టవ్యం దీపో యత్నేన ధార్యతామ్ ॥ 21

కాష్ఠ (కాలగణన పరిమాణాలు) మొదలైనవి దీని శరీరం. దీని స్వరూపం చాలా సూక్ష్మం. క్షణం, త్రుటి, రెప్పపాటు మొదలైనవి దీని వెండ్రుకలు. ఋతువులు ముఖం. సమానబలం గల శుక్ల కృష్ణ పక్షాలు కన్నులు. నెలలు దీని ఇతరాంగాలు. భయంకర వేగంగల ఆ అశ్వం ఇక్కడి ఏ వస్తువునూ కోరక నిరంతరం విరామం లేకుండా వేగంగా పారిపోతున్నది. దాన్ని చూసి నీ జ్ఞాన దృష్టితో ఇతరులు కదిలిస్తే కదలకుండా ఉంటే నీ మనస్సును ధర్మం మీదనే నిలుపు. ఇతర ధర్మాత్ముల మీద కూడ నీ దృష్టి ఉంచు. ఈ లోకంలో ధర్మాన్నుంచి తొలగి, స్వేచ్ఛాచారంలో మునిగి ఉండి, ఇతరులలోని మంచిచెడులను చెపుతూ, కీడుకలిగించే చెడుపనులలో మునిగితేలే వారు, మరణానంతరం యాతనా శరీరం పొంది, తాము చేసిన అనేక పాపాలవల్ల చాలా కష్టాల పాలవుతారు. ఎల్లప్పుడు ధర్మ పరాయణుడై ఉత్తములు, అధములు అయిన ప్రజలను తగిన రీతిగా విచారించి పాలించేరాజు పుణ్యాత్ముల లోకాలకు వెళ్తాడు. ఆయన తాను కూడా అనేక విధాలయిన మంచిపనులను ఆచరిస్తే, వాటిఫలితంగా ఇహలోకంలో కలుగని, దోషం లేని సుఖం పొందుతాడు.

పెద్దవారి, గురువుల ఆజ్ఞలను అతిక్రమిస్తే, మరణానంతరం నరకంలో ఉండే భయంకర శరీరంగల కుక్కలు, ఇనుపముక్కుల పక్షులు, కాకులు, గ్రద్దలు మున్నగువాని సమూహాలు, రక్తాన్ని పీల్చే పురుగులు వారియాతనా శరీరాల మీదికివచ్చి వాటిని పొడుస్తాయి. కరుస్తాయి.

ఇష్టం వచ్చిన పనులు స్వేచ్ఛగా చేసే మానవుడు, స్వాయంభువ మనువు విధించిన దశవిధ ధర్మ మర్యాదలను అతిక్రమించే పాపాత్ముడు, పితృలోకంలోని అసిపత్రవనం (కత్తులు ఆకులుగా గల చెట్టున్న అడవి)లోకి ప్రవేశించి అనేక బాధలు పడతాడు.* చాలా ఎక్కువ పీనాసి, అబద్ధం, మోసం మాటలు ఎప్పుడూ చెప్పేవాడు, వంచనాసక్తుడు, అనేక విధాలయిన సాధనాలతో ఇతరులను బాధించే వాడు, పాపాత్ముడు, ఘోరనరకంలో పడి, నానాయాతనల పాలు అవుతాడు. ఆ దుర్మార్గుడు చాలవేడినీళ్ళగల వైతరిణీ అనే మహానదిలో మునుగుతాడు. అసిపత్రవనంలో అతని శరీరం అంతా ముక్కలు అవుతుంది. పరశువనంలో (గండ్రగొడ్డళ్ళ అడవి) అతడు పడుకోవాలి. ఈ రీతిగా మహానరకంలో పడి, అతడు సమధికమైన బాధకు లోనౌతాడు. పరవశుడై అక్కడే ఉండవలసివస్తుంది. నీవు బ్రహ్మలోకాదులైన గొప్పగొప్పస్థానాలను గూర్చి మాట్లాడుతావు. కాని పరమ పదం

* *ధృతి, క్షమ, మనోనిగ్రహం, అస్తేయం (ఇతరుల వస్తువులు కావలెనని కోరకుండటం), పవిత్రత, ఇంద్రియ నిగ్రహం, బుద్ధి, విద్య, నిజం చెప్పటం, కోపం లేకుండుట అనే వది ధర్మలక్షణాలు.*

మీదికి నీ చూపు పోదు. ముందు ముందు రాబోయే మృత్యువుకు పరిచారిక అయిన ముసలితనాన్ని గూర్చి ఏ మాత్రం తెలుసుకోలేవు.

నాయనా ! కదలకుండా కూర్చుంటావేమి ? త్వరగా ముందుకు వెళ్ళు. హృదయాన్ని మిక్కిలిగా మధించే భయంకరమైన, మహాపద ఎదురవుతున్నది. కాబట్టి పరమానందప్రాప్తికి ప్రయత్నించు. మరణించిన తరువాత, యమధర్మరాజు ఆజ్ఞానుసారం, యమదూతలు నిన్ను ఆయన ఎదుట నిలుపుతారు. అది కలుగకముందే ఋజుప్రవర్తన మనే ధర్మసంపదకోసం ప్రయత్నించు. సర్వాధిపుడైన యమధర్మరాజు ఎవరి దుఃఖాన్ని, బాధలను పట్టించుకోడు. సమూలమైన బాంధవ్యంతో గూడి ఉన్న నీ ప్రాణాలను హరిస్తాడు. ఆయనను అడ్డుకొనేవారు ఉండరు. ఆ సమయం రాకముందే నీవు నీరక్షణకు, తగిన జాగ్రత్తపడు. యమధర్మరాజుకు ముందు వీచే ప్రచండమైన, కాలరూపమైన గాలి అప్పుడు నిన్ను ఎక్కడికి విసిరివేస్తుందో ? ఆ సమయంరాక ముందే నీవు పరలోకంలో సుఖం కలిగించే ధర్మాన్ని ఆచరించు. పూర్వజన్మలో నీ ముందు ప్రాణనాశకంగా వీచేగాలి ఇప్పుడు ఎక్కడ ఉన్నది ? ఇకముందు మృత్యువనే మహాభయం కలిగినప్పుడు, చిక్కులన్నీ తిరిగి పోతున్నట్టు నీకు అనిపిస్తుంది. కాబట్టి ముందునుంచే తగిన జాగ్రత్త వహించు. పుత్రా ! ఈ శరీరాన్ని వదలి నీవు వెళ్ళేసమయంలో కలవరం వల్ల, నీ వినికిడి శక్తికూడా నశిస్తుంది. కాబట్టి నీవు చాలా దృఢం అయిన సమాధి స్థితిని పొందు. పూర్వం నీవు పరాకులవల్ల చేసిన మంచిచెడు పనులను గుర్తుతెచ్చుకొని, వాటి ఫలితాన్ని అనుభవించేటప్పుడు కలిగే సంతాపం పొందటానికి ముందే నీ కోసం జ్ఞానధనాగారాన్ని నింపుకో. బలాన్ని, దేహాన్ని, రూపాన్ని అపహరించే ముసలితనం, మొదట నీ శరీరాన్ని శిధిలం చేస్తుంది. కాబట్టి అంతకంటే ముందుగానే నీకోసం జ్ఞానధనాగారాన్ని నింపుకో. రోగాన్ని సారథిగా చేసుకొని యముడు హఠాత్తుగా నీ శరీరాన్ని చీల్చివేస్తాడు. కాబట్టి ఈ జీవితం నాశనం కాక ముందే మహత్తర తపస్సును యథావిధిగా చెయ్యి. మానవ దేహంలో నిత్యనివాసంగల కామక్రోధాదు లనే భయంకరమైన తోడేళ్లు నాలుగు వైపుల నుంచి నిన్ను చుట్టుముట్టుతున్నాయి. అందువల్ల ముందుగానే పుణ్యసంపాదనకు ప్రయత్నించు.

మరణం ఆసన్నం అయినపుడు ముందు నీకు గాఢాంధకారం కనిపిస్తుంది. తరువాత కొండ కొమ్ములమీద బంగారపు చెట్లు కన్పిస్తాయి. ఆ సమయం రాకముందే మేలు కలగటానికి త్వరగా యత్నించు. ముందుగా లోకంలో చెడుసావాసాలు, పైకి మిత్రులుగా లోపల శత్రువులుగా ఉండేవారు, నిన్ను నీ కర్తవ్యాల నుండి తొలగించటానికి యత్నిస్తారు. కాబట్టి నీవు ముందునుంచే పుణ్య సంపాదన చెయ్యి. **రాజువల్ల, దొంగలవల్ల**

అపహరింపబడనిది, మరణించినా జీవుని వదలిపోనిది అయిన ధర్మం అనే ధనాన్ని ఆర్జించు. స్వకర్మానుసారం సంప్రాప్తమయిన ఆ ధనాన్ని, పరలోకంలో ఒకరితో పంచుకోవడానికి వీలుపడదు. అక్కడ ఎవరి పుణ్యాది సంపదలను వారే అనుభవిస్తారు. పరలోకంలో కూడా జీవితాన్ని గడపటానికి ఉపయోగపడేది, నశించనిది, శాశ్వతమూ ఐన ధనాన్ని దానం చేయి. దానినే స్వయంగా సంపాదించుకో. ఇంటికి వచ్చిన యోగ్యుడైన అతిథికోసం సిద్ధంచేసే పాయసం ఉడికీ ఉడకకముందే నీకు మరణం కలగవచ్చు. కాబట్టి జ్ఞాన ధనార్జనకు త్వరపడు. జీవుడు ఒంటరిగా పరలోకానికి పోయేటప్పుడు, తల్లి, తండ్రి, సోదరులు, చుట్టాలు, ఇతరమైన ఆప్తులు మొదలైన వారిలో ఒక్కరు కూడా వెంటరారు. నాయనా ! పరలోకానికి వెళ్ళేటప్పుడు, తాను పూర్వంచేసిన మంచి చెడు పనుల ఫలితం మాత్రమే జీవునికి తోడుగా ఉంటుంది. మంచి పనులు గాని, చెడుపనులు గాని చేసి సంపాదించిన బంగారం, రత్నాలరాశులు దేహం విడిచిపోయే వాడికి ప్రయోజనకరాలు కావు. పరలోకానికి యాత్ర సాగించేటప్పుడు, నీవు చేసిన, చేయని కర్మలకు సాక్షిగా ఆత్మ తప్ప మరొక సాక్షి లేరు. పరలోకానికి వేళ్ళేటప్పుడు, ఈ మానవశరీరం ఇక్కడే ఉండిపోతుంది. జీవుడు సూక్ష్మదేహంతో లోకాంతరంలో ప్రవేశించి, తన బుద్ధి అనే కంటితో సమస్తం చూస్తాడు. ఈ లోకంలో అగ్ని, వాయువు, సూర్యుడు అనే ముగ్గురు దేవతలు జీవుని శరీరాన్ని ఆశ్రయం చేసుకొని ఉంటారు. వారే ఆతని ధర్మాచరణాన్ని పరిశీలిస్తుంటారు. ఈ ముగ్గురే పరలోకంలో ఆ జీవునికి సాక్ష్యంగా నిలుస్తారు. వీరు పగలు అన్ని పదార్థాలను కన్పింపజేస్తారు. రాత్రి పూట దాచుతారు. అంతటా వ్యాపించి ఉంటారు. అన్ని వస్తువులను స్పృశిస్తారు. అందువల్ల నీవు ఎల్లప్పుడు నీ ధర్మాన్ని ఆచరించు.

పరలోకమార్గంలో చాలమంది దొంగలు, దోపిడీదారులు ఉంటారు. క్రూరమైన, భయంకరమైన ఈగలు, పాములు, తేళ్ళు ఉంటాయి. అక్కడ కేవలం జీవుడు చేసిన కర్మమాత్రమే తోడవుతుంది. కాబట్టి సత్కర్మను రక్షించుకో. అక్కడ తనకర్మానుసారం లభించే దానిని ఇంకొకరు పంచుకోవడం ఉండదు. అక్కడ తాను చేసిన కర్మఫలం మాత్రమే తాను అనుభవించాలి. అప్సరసల సమూహాలు మహర్షులతో పాటు ఉంటారు. వారు అందరూ పుణ్యఫల స్వరూపంగా భోగాలను అనుభవిస్తారు. అలాగే అక్కడ పుణ్యాత్ములు విమానాలను ఎక్కి, ఇష్టంవచ్చినట్లు సంచరిస్తారు. అలాగే పుణ్యకర్మల వల్ల వచ్చే సుఖాలను అనుభవిస్తారు. పాపరహితులైన పుణ్యాత్ములు ఈ లోకంలో సంపాదించే పుణ్యకర్మల

ఫలితాన్నే, జన్మాంతరంలో పవిత్రజాతిలో జన్మించి పొందుతారు. గృహస్థ ధర్మసంప్రదాయాలను అనుసరించేవారు ప్రజాపతి, బృహస్పతి, ఇంద్రలోకాలలో ఉత్తమగతిని పొందుతారు. వత్సా ! 'సర్వశక్తిమంతుడు, అందరికి పవిత్రంచేసే ధర్మదేవత అజ్ఞానం ఆవహించని ధర్మాత్ములను ఎల్లప్పుడు పుణ్యాలోకాలకు పంపుతాడు' అని నీకు వేలసార్లు, అంతకంటే ఎక్కువసార్లు చెపుతాను. నాయనా ! నీ వయస్సులో ఇరవైనాలుగు ఏండ్లు గడచిపోయాయి. ఇప్పుడు ఇరవైఅయిదు ఏండ్లు నీకు, కాబట్టి ధర్మాన్ని సంపాదించు. నీ వయస్సు ఆగకుండా వెళ్ళుతున్నది. నీ పరాకు అనే గృహంలో తిష్ఠవేసిన కాలుడు, నీ ఇంద్రియ సమూహాన్ని సుఖరహితం (అనుభవించే శక్తిలేనిదాన్ని) చేస్తున్నాడు. అది సామర్థ్యశూన్యం కాకముందే, తగుజాగ్రత్తపడి ధర్మనిర్వహణకు త్వరపడు. శరీరాన్ని వదలి పరలోకమార్గం పట్టినప్పుడు వెనకబడే వాడివి, ముందుకు వెళ్ళేవాడివి నీవే. అక్కడ నీకు ముందు, వెనక వేళ్ళే వారు ఎవరూ ఉండరు. అలాంటప్పుడు నీకు ఆత్మీయునితో గాని, పరాయివానితో గాని ఏం పని ఉంటుంది ? భయాలు కలిగినప్పుడు, ఏకాకిగా వెళ్ళే సత్పురుషులకు, పరలోకంలో మేలు కలిగించే ధర్మం లేక జ్ఞానం అనే నిధిని పవిత్రమైన మనస్సుతో కూడ బెట్టుకో.

సర్వ సమర్థుడైన కాలుడు ఎవరి యందూ ఆత్మీయత చూపడు. కూలమూలాలు - ఆద్యంతాలు గల సమస్త బంధువులను అపహరిస్తాడు. ఆయనను అడ్డగించేవారు ఎవరూ లేరు. కాబట్టి ధర్మాన్ని సంపాదించు. నాయనా ! నాకున్న శాస్త్రవిజ్ఞానంతో, అనుమాన ప్రమాణంతో నేను ఇప్పుడు ఉపదేశించిన జ్ఞానాన్ని అనుసరించి, తగినది ఆచరించు. తన సత్కర్మలతో ధర్మాన్ని ధరించేవాడు, ఎలాంటి కోరికలేకుండా ఎవరికైనా దానం చేసేవాడు మాత్రమే, మోహరహితమైన బుద్ధితో లభించే గుణాలు కలిగి ఉంటాడు. సమస్తశాస్త్రవిజ్ఞానం సంపాదించి, దాన్ననుసరించి మంచి పనులు చేసే వ్యక్తికి ఈ జ్ఞానోపదేశం చేశారు. కృతజ్ఞ డయిన వ్యక్తికి చేసిన ఉపదేశం సఫలం అవుతుంది గదా ! గ్రామాలలో ఉంటూ అక్కడి పదార్థాల మీద ఆసక్తి పెంచుకోవడం, మానవునికి కట్టుత్రాడు అవుతుంది. పుణ్యాత్ములు దీన్ని త్రెంచుకొని ఉత్తమలోకాలకు వెళ్తారు. పాపాత్ములు వాటిని త్రెంచుకోలేరు. కుమారా ! **మరణధర్మంగల నీకు ధనం వల్ల, బంధువుల వల్ల, సంతతివల్ల ఏం ప్రయోజనం కలుగుతుంది ? కాబట్టి హృదయమనే గుహలో ఉన్న ఆత్మతత్త్వాన్ని ఉపాసించు. నీ తాతముత్తాతలు ఎక్కడికి వెళ్ళారు ?*** రేపు చేయవలసిన దానిని నేడే చేయాలి. సాయంత్రం చేయవలసినది

---

* కిం తే ధనేన కిం బంధుభిస్తే కిం తే పుత్రైః పుత్రక యో మరిష్యసి ।
ఆత్మానమన్విచ్ఛ గుహాం ప్రవిష్టం పితామహాస్తే క్వ గతాశ్చ సర్వే ॥ 72

ప్రొద్దుటనే చేయాలి. వ్యక్తి ఒకపని చేశాడా ? చేయలేదా ? అని మృత్యువు ఎదురుచూడదు.* మరణించిన తరువాత సోదరులు, బంధువులు, జ్ఞాతులు, మిత్రులు ఆవ్యక్తి శవం వెంట వెనక వస్తారు. శవాన్ని దగ్ధం చేసి వెళ్లిపోతారు. పరమాత్మ తత్త్వాన్ని పొందదలిస్తే నాస్తికులను, దయలేని వారిని, పాపాత్ములను ఎలాంటి సందేహం లేకుండా వెంటనే ప్రక్కనపెట్టు. పొరపాటున కూడా వారితో కలిసి ఉండకు.

ఈ విధంగా లోకం అంతా కాలబాధితం, పీడితం అవుతున్నది. **నీవు మహత్తర ధైర్యంతో నిండు మనస్సుతో ధర్మాన్ని ఆచరించు.** పరమాత్మ సాక్షాత్కారానికి ఈ ఉపాయాన్ని తెలిసిన మనుష్యుడు, ఈ లోకంలో స్వధర్మాన్ని చక్కగా ఆచరించి పరలోకంలో సుఖపడతాడు. శరీరనాశం తరువాత తమకు మృత్యువు లేదు అని తెలిసిన శిష్టులు అనుసరించిన ధర్మమార్గంలో పయనించే వ్యక్తులకు, ఎలాంటి సమయంలోనూ నాశం ఉండదు. వారే వివేకవంతులు. ఈ విషయాలు అన్నీ బాగా ఆలోచించి, ధర్మాన్ని అభివృద్ధి చేసుకొనేవాడే విద్వాంసుడు. ధర్మంనుంచి దూరమైనవాడు మోహగ్రస్తుడు అవుతాడు. కర్మ మార్గంలో ఆచరణలోకి వచ్చిన శుభాశుభకర్మల ఫలం ఆ కర్త కర్మానుసారం లభిస్తుంది. నీచకర్మలు ఆచరించేవాడు నరకానికి వెళ్తాడు. ధర్మాచరణంలో పారంగతుడు స్వర్గానికి పోతాడు. దుర్లభమై, సోపాన సమానమయిన మానవ జన్మను పొంది, తనను తాను ధర్మంలో ఏకాగ్రచిత్తుని చేసుకోవాలి. అందువల్ల ఆ వ్యక్తి క్రిందపడడు. స్వర్గమార్గాన్ని అనుసరించే బుద్ధి ధర్మమార్గాన్ని అతిక్రమించదు. అలాంటి వానిని పుణ్యాత్ము డంటారు. అతడు బాంధవులకు విచారకారకుడు కాడు. చెడిపోకుండా, దృఢనిశ్చయాన్ని ఆలంబనంచేసుకొన్న వివేకవంతుడు, స్వర్గంలో తన స్థానాన్ని పదిలం చేసుకొంటాడు. మహత్తర నరకభయం అతనికి ఉండదు.

తపోవనాలలోనే జన్మించి అక్కడే మరణించినవారు కామభోగాలను ఎరుగరు. కనుక వారు ఆచరించవలసిన ధర్మం తక్కువగా ఉంటుంది. భోగాలను వదలి, అడవికి వెళ్ళి, శారీరకంగా తపస్సు చేసేవానికి లభించినది ఏదీ ఉండదు. అదే మహత్తర ఫలితం అని నా అభిప్రాయం. **వేలకొలది మాతాపితరులు, భార్యాపుత్రులు పూర్వజన్మలలో ఏర్పడినారు. రాబోయే జన్మలలో ఏర్పడతారు. వీరిలో ఎవరు ఎవరివారు ? మనం ఎవరివారం ?** ఎప్పుడూ నేను ఒక్కడినే. నాకు ఎవ్వరూ లేరు. నేను ఇతరులకు

* శ్వః కార్యమద్య కుర్వీత పూర్వాహ్ణే చాపరాహ్ణికమ్ ।
వహి ప్రతీక్షతే మృత్యుః కృతం వాస్య వ వా కృతమ్ ॥ 73

ఏమీ కాను. నావాళ్ళు కానివారు, నా వాళ్ళు అయిన వారు నాకు ఎవరూ కన్పించటం లేదు. నీవు వారికి ఎవరికి ఏమీ చేయవలసింది లేదు. వారివల్ల నీకు ఎలాంటి ప్రయోజనం లేదు. వారి కర్మానుసారం వారు వెళ్తారు. నీ కర్మానుసారం నీవు వెళ్తావు. **ఈ లోకంలో ధనవంతునికి స్వజనం స్వజనులుగానే ప్రవర్తిస్తారు. దరిద్రులకు జీవించి ఉన్నప్పుడు కూడా తనవారు కన్నులకు కనిపించకుండా ఉంటారు.** మానవుడు తన భార్యకోసం అశుభ కర్మలు కూడబెట్టు కొంటాడు. అందువల్ల ఇహ లోకంలో, పరలోకంలో కూడా కష్టాలు కొని తెచ్చుకుంటాడు. మానవుడు తన కర్మఫలాన్ని అనుసరించే ఈ ప్రపంచాన్ని అనేకంగా చూస్తాడు. కాబట్టి పుత్రా ! నేను చెప్పినదానిని ఆచరణలోకి తెచ్చుకో. ఇహలోకం కర్మభూమి అని తెలుసుకొని చూస్తూ, ఉత్తమ లోకాలను కాంక్షించే వ్యక్తి మంచిపనులనే చేయాలి. కాలం అనే వంటవాడు బలవంతంగా సర్వజీవులను పాకంచేస్తున్నాడు. అందుకు మాసాలు, ఋతువులు గరిటెలుగా చేసుకొని జీవులను ఇటు-అటు తిరగవేస్తుంటాడు. సూర్యుడు అగ్నిగా ఉపయోగపడతాడు. కర్మఫలసాక్షు లయిన రేయింబవళ్ళు అతనికి వంటచెరకు అవుతుంది. **ఎవరికి ఏమీ ఇవ్వని ధనంవల్లనూ, శత్రువును బాధించని బలంవల్లనూ, ధర్మాన్ని ఆచరించని విద్యవల్లనూ, ఇంద్రియాలను జయించి వశం చేసుకోని మనస్సు వల్లనూ ఏమీ ప్రయోజనం లేదు."*** భీష్ముడు చెప్పాడు. "వేదవ్యాసుని ఈ హితవచనాలను శ్రద్ధగా విన్న శుకుడు మోక్షవిద్యను ఉపదేశించిన తండ్రిని వదలి, వెళ్ళిపోయాడు."

322. శుభా శుభ కర్మ ఫలానుభవము. (ధర్మమూలికము)

యుధిష్ఠిరుడు అడిగాడు. "పితామహా ! దానం, యజ్ఞం, తపస్సు, గురుశుశ్రూష - వీని వల్ల కలిగే ఫలితాన్ని చెప్పవలసింది." భీష్ముడు చెపుతున్నాడు. "రాజా ! బుద్ధి కామక్రోధాదులతో గూడినప్పుడు, వాటి ప్రేరణ నందిన మానవుని మనస్సు, పాపపుపనిలో ఆసక్తం అవుతుంది. తరువాత ఆవ్యక్తి చెడుపని చేసి గొప్ప కష్టంలో పడతాడు. పాపకర్మలు చేసే దరిద్రులు ఒక కరువు నుంచి ఇంకొక కరువులోకి, ఒక కష్టంనుంచి ఇంకొక కష్టంలోకి, ఒక భయంనుంచి ఇంకొక భయంలోకి పోతూ, మరణించిన వారికంటే ఎక్కువగా మృతప్రాయులు అవుతారు. **శ్రద్ధాళువులు, జితేంద్రియులు, ధనవంతులు, సత్కర్మ పరాయణులు అయినవారు ఒక సంతోషం నుంచి ఇంకొక సంతోషానికి,**

---

* ధనేన కిం యన్న దదాతి నాశ్నుతే బలేన కిం యేన రిపుం న బాధతే ।
శ్రుతేన కిం యేన న ధర్మమాచరేత్ కిమాత్మనా యో న జితేంద్రియో వశీ ॥ 93

స్వర్గానికంటే అధికమైన స్వర్గానికి, సుఖాని కంటే అధికసుఖానికి చేరుతారు. నాస్తికులయిన వారికి రాజు అరదండాలువేసి రాజ్యబహిష్కృతులను చేస్తాడు. వారు మత్తగజాలు, పాములు, దారిదోపిడిగాండ్రు ఉండే మహాభయంకరమైన మహారణ్యాలలోకి వెళ్తారు. ఇంతకంటే వారికి వేరే శిక్ష ఏముంటుంది ? దేవతార్చన, అతిథి సత్కారం, ఇష్టమైనవారు, ఉదారులు, సాధుసజ్జన భక్తులు, పుణ్యాత్ములు అయిన మానవులు తమ కుడి చేతివలె పుణ్యకర్మలకు, మనస్సును వశం చేసుకొన్న యోగులు మాత్రమే సులభమైన ఉత్తమమార్గంలో పయనిస్తారు. ధర్మానుష్ఠాన దృష్టి లేనివారు ధాన్యంలోని పొల్లువలె, పక్షులలో కుళ్ళిపోయిన గ్రుడ్లవలె మానవ సమాజంలో వ్యర్థులు అవుతారు. ఏయే వ్యక్తి ఎలాంటి కర్మచేస్తాడో అదే అతని వెంట నుంటుంది. కర్త త్వరగా పరుగు తీస్తే, ఆ కర్మకూడా అంత వేగంగా ఆతని వెంట పడుతుంది. అతడు నిద్రించినప్పుడు ఆతని కర్మఫలం విశ్రాంతి తీసుకొంటుంది. అతడు నిలిచినప్పుడు అదిగూడ అతనితోపాటు నిలుస్తుంది. నడుస్తున్నప్పుడు వెంట నడుస్తుంది. ఇంతే కాక ఏపని చేస్తున్నా అతని కర్మసంస్కారం ఆతనిని వదలదు. నీడవలె వెంట ఉంటుంది. తమ పూర్వజన్మలలో చేసిన సమస్త కర్మల ఫలాలను ఎల్లప్పుడు ఆ వ్యక్తులు తాము మాత్రమే అనుభవిస్తారు.

తమ తమ కర్మ ఫలాలు తాకట్టు వస్తువులవంటివి. శాస్త్ర విధానానుసారం అవి సురక్షితంగా ఉంటాయి. తగిన సమయం వచ్చినప్పుడు కాలం ఈ ప్రాణిసముదాయాన్ని కర్మానుసారం లాగుకొనిపోతుంటుంది. ఎవ్వరి ప్రేరణ లేకుండానే పూలు పూస్తాయి. తగిన సమయాల్లో వృక్షాలకు పండ్లు కాస్తాయి. పూర్వజన్మలో చేసిన కర్మకూడా ఫలానుభవ సమయాన్ని అతిక్రమించదు. మానావమానాలు, లాభనష్టాలు, ఉత్థాన పతనాలు పూర్వజన్మ కర్మానుసారంగానే అడుగడుగునా కలుగుతుంటాయి. ప్రారబ్ధకర్మానుభవం తరువాత వెనుదిరుగుతుంటాయి. తాను చేసుకున్న కర్మ ఫలమే దుఃఖం. తాను చేసుకున్న కర్మఫలమే సుఖం. జీవుడు మాతృగర్భంలో శయనించిన నాటి నుండే, పూర్వజన్మలోని శరీరంద్వారా సంపాదించిన సుఖదుఃఖాలను అనుభవింప మొదలు పెడతాడు. బాలుడైనా, యువకుడైనా, వృద్ధుడైనా ఒక వ్యక్తి తానుచేసిన మంచి చెడుపనుల ఫలితాన్ని జన్మజన్మాంతరాలలో ఆయా అవస్థలలోనే అనుభవిస్తాడు. ఆవుదూడ వేలకు వేలు గుంపులుగా ఉన్న గోవులలోని తన తల్లిని గుర్తించి, దగ్గరకు చేరినట్లుగానే, పూర్వజన్మలో చేసిన కర్మకూడా చేసినవాని వద్దకు చేరుతుంది. మురికిపట్టిన వస్త్రం నీటిలో నానబెట్టి,

ఉతికిన తరువాత శుభ్రం అయినట్లే, ఉపవాసాలతో చక్కగా తపస్సు చేసి వారికి (అంతః కరణం పరిశుద్ధమై) అనంతమైన సుఖం కలుగుతుంది. మహామతీ ! సుదీర్ఘ కాలం చేసిన తపస్సుచేతను, ధర్మకార్యాలవల్లనూ పాపాలు పోయిన వారికి కోరికలు అన్నీ నెరవేరుతాయి. ఆకాశంలో పక్షుల పాదచిహ్నాలు, నీళ్ళల్లో జలచరాల పాద ముద్రలు కన్పించనట్లుగానే పుణ్యాత్ముల, జ్ఞానుల గతి కూడా అంతుబట్టదు. **ఇతరులను వెక్కిరించటం, ఇతరమైన తప్పులను ఎత్తిచూపటం, చర్చించటం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. చక్కనిది, అనుకూలమైనది, తనకు మేలు కలిగించేది ఏదో తెలుసుకొని దానిని చేయాలి."**

323. శుకమహర్షి వృత్తాంతము, పుత్రప్రాప్తికి వ్యాసమహర్షి తపస్సు, శంకరుని వలన వరప్రాప్తి.

యుధిష్ఠిరుడు అడిగాడు. "తాతా ! వ్యాసమహర్షికి ధర్మాత్ముడు, తపస్వి అయిన శుకమహర్షి ఎలా జన్మించాడు ? ఆయనకు పరమసిద్ధి ఎలా ప్రాప్తించింది ? ఆ వృత్తాంతం నాకు చెప్పవలసింది. తపోధనుడైన వ్యాసుడు శుకుని ఏ స్త్రీ యందు పొందాడు ? ఆ శుకమహర్షి తల్లి పేరు మాకు తెలియదు. శ్రేష్ఠమైన ఆయన జన్మవృత్తాంతం కూడా తెలియదు. చిన్నతనంలోనే శుకునికి సుసూక్ష్మమైన జ్ఞానంలో బుద్ధి ఎలా ప్రవేశించింది ? ఈ ప్రపంచంలో ఆయనకంటే ఇతరునికి ఎవరికీ ఇలాంటి తెలివి ఉన్నట్లు తెలియదు. మహాత్మా ! ఈ విషయాన్ని వివరంగా వినవలె ననుకొంటున్నాను. అమృతసమం, ఉత్తమం అయిన మీ ప్రవచనాన్ని వింటుంటే నాకు తృప్తి కలగటంలేదు. ఇంకా వినా లనిపిస్తోంది. పితామహా ! మీరు నాకు శుకమహర్షి మాహాత్మ్యాన్ని, ఆత్మయోగాన్ని, విజ్ఞానాన్ని ఉన్నది ఉన్నట్లు, క్రమంగా చెప్పవలసింది." భీష్ముడు చెపుతున్నాడు. **"రాజా ! ఎక్కువకాలం జీవించటంచేత, తలపండటంచేత, సంపదలచేత, లెక్కలేనంతమంది బంధువులు ఉండటం చేత ఎవరూ గొప్పవారు కాజాలరు. వేదాలను అధ్యయనాధ్యాపనాదులు చేయటంచేత మాత్రమే వ్యక్తి గొప్పవాడవి మనమహర్షులు నియమం చేశారు.** పాండుకుమారా ! నీవు నన్ను అడిగిన విషయానికి అంతటికీ తపస్సే మూలం. ఇంద్రియజయంవల్లనే తపస్సిద్ధి కలుగుతుంది కాని, వేరొకరీతిగా కాదు. మానవుడు ఇంద్రియాలకు ఉండే విషయాసక్తి వల్లనే దోషభాజనుడు అవుతున్నాడు అనటంలో సందేహంలేదు. ఆ ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవటంవలననే వ్యక్తి పరమసిద్ధిని

పొందుతాడు. వత్సా ! వేయి అశ్వమేధాలు, వందల వాజపేయ యజ్ఞాలు చేసినందువల్ల కలిగే ఫలితం, యోగానుష్ఠానంలోని పదహారవ వంతు ఫలంతో కూడా సమానం కాదు. ఇప్పుడు నీకు శుకమహర్షి జన్మవృత్తాంతాన్ని, యోగఫలాన్ని, ఆత్మజయం లేనివారికి అంతుబట్టని ఆయన ఉత్కృష్టమైన ఉత్తమగతి ప్రాప్తినీ చెపుతాను.

పూర్వకాలంలో ఒకప్పుడు పరమేశ్వరుడు మనోహరమైన గన్నేరు వనంలో, మేరుపర్వత శిఖరం, మీద భయంకరమైన భూతగణాలతో విహరించసాగాడు. ఆ సమయంలో ఆ స్వామితో పాటు పార్వతీ దేవికూడా ఉన్నది. ఆ రోజులలో అక్కడ కృష్ణద్వైపాయన (వ్యాస) మహర్షి దివ్యమైన తపస్సు చేస్తున్నాడు. కురువంశశ్రేష్ఠ ! యోగధర్మపరాయణుడైన వ్యాసుడు యోగశక్తితో మనస్సును పరమాత్మపై నిలిపి, ధారణతో పుత్ర కాంక్షతో తపస్సు చేయసాగాడు. అగ్ని, భూమి, జలం, వాయువు, ఆకాశంతో సమానమైన ధైర్యశాలి అయిన కుమారుడు కలగాలనే సంకల్పంతో ఆయన తపస్సు ప్రారంభించాడు. ఆ సంకల్పంతో, యోగంతో, ఉత్తమతపోలగ్నుడైన మహర్షి (ఆత్మజయం లేనివారికి దుర్లభమైన) దేవదేవుని వరం అడిగాడు. సర్వసమర్థుడైన ఆయన గాలిని మాత్రమే ఆహారంగా స్వీకరిస్తూ వంద సంవత్సరాలు, నానారూపుడు, పార్వతీపతి అయిన మహాదేవుని ఆరాధించాడు.

అక్కడికి సమస్తబ్రహ్మర్షులు, రాజర్షులు, లోకపాలురు, ఆదిత్యులు, రుద్రులు, సూర్యచంద్రులు, వసువులు, మరుద్గణాలు, సప్తసముద్రాలు, నదులు, అశ్వినులు, దేవతలు, గంధర్వులు, నారద పర్వతులు, విశ్వావసువు అనే గంధర్వుడు, సిద్ధులు, అప్సరసలు, సాధ్యులు వచ్చి లోకేశ్వరుడైన పరమేశ్వరుని సేవిస్తున్నారు. అక్కడ మహాదేవుడైన రుద్రుడు గన్నేరుపూలతో మనోహరమైన మాలికను ధరించి, వెన్నెల వెలుగుతో గూడిన చంద్రునివలె ప్రకాశిస్తున్నాడు. దేవర్షులతో నిండి, దివ్యమై, సుందరమైన ఆ కర్ణికారవనంలో, పుత్రప్రాప్తికై పరమయోగాన్ని ఆశ్రయించి, మునిశ్రేష్ఠుడు నిశ్చలంగా ఉన్నాడు.

మహత్తరమైన కఠోర తపస్సు చేస్తున్నా, ఆయన ప్రాణ శక్తి సన్నగిల్లలేదు. ఎలాంటి శ్రమ ఆయనకు కలగలేదు. ఆ సన్నివేశం మూడులోకాలకు మహాద్భుతంగా కన్పించింది. యోగ యుక్తుడు, అపరిమిత తేజోవంతుడు అయిన ఆ మహర్షి తపస్సు చేస్తున్న సమయంలో, ఆయన జటలు అగ్నిజ్వాలలతో సమానంగా తేజస్సుతో వెలుగులు వెదజల్లుతూ కనిపించాయి. మహర్షితపోవృత్తాంతాన్ని నాకు పూర్వం మార్కండేయ మహాముని చెప్పాడు. ఆయన నాకు ఎల్లప్పుడు దేవతల చరిత్రలను చెప్పేవాడు. నాయనా ! ఇలాంటి

తపస్సుతో సందీప్తాలయిన ఆ వ్యాసుని జటలు ఈనాడు కూడా అగ్నితో సమానంగా ప్రకాశిస్తున్నవి. ఈ విధమైన తపస్సుకూ, భక్తికీ ప్రసన్నుడైన మహేశ్వరుడు, ఆ మహర్షి కోరిన వరాన్ని ప్రసాదించవలె నని తన మనస్సులో నిశ్చయించుకొన్నాడు. మహర్షి సమక్షంలో ప్రత్యక్షమైన ముక్కంటి నవ్వుతూ 'ద్వైపాయనా ! నీవు కోరిన రీతిగానే నీకు కుమారుడు కలుగుతాడు. అగ్నివలె, వాయువు వలె, భూమివలె, జలంవలె, ఆకాశంవలె పరమ పవిత్రుడు, మహాత్ముడు అయిన పుత్రుడు నీకు కలుగుతాడు. నిరంతర బ్రహ్మ భావనగలవాడై, పరబ్రహ్మలగ్న మనస్కుడై, భగవద్బుద్ధి గలవాడై, కేవలం భగవదాశ్రయుడు అయిన ఆ నీపుత్రుడు తేజస్సుతో ముల్లోకాలను వ్యాపిస్తాడు. మహాయశస్వి అవుతాడు.' అని మహాదేవుడు వరం ఇచ్చాడు."

324. శుకజననము, ఉపనయనము, వేదాధ్యయన సమావర్తనములు.

భీష్ముడు చెపుతున్నాడు. "పరమేశ్వరుని వలన ఉత్తమవరాన్ని పొంది, సత్యవతీసుతుడైన వ్యాసుడు, ఒకనాడు అగ్నిని పుట్టింపదలచి రెండు అరణికాష్ఠాలను గ్రహించి, మథించసాగాడు. రాజా ! ఆ సమయంలోనే, స్వతేజస్సుతో దివ్య సౌందర్య వంతమైన రూపాన్ని ధరించివచ్చిన ఘృతాచి అనే అప్సరసను వ్యాసమహర్షి చూశాడు. యుధిష్ఠిరా ! ఆ అరణ్యంలో వ్యాసమహర్షి అప్సరసను చూచి వెంటనే కామమోహితు డైనాడు. ఆయన కామమోహంతో వ్యాకులుడు కావడం చూచి, ఘృతాచి చిలుక రూపాన్ని ధరించి ఆయన వద్దకు వచ్చింది. రూపాంతరంలో దాక్కున్న ఆ అప్సరసను చూచిన ఆయన శరీరాన్ని అంతను కామవేదన వ్యాపించింది. మునిశ్రేష్ఠుడైన వ్యాసుడు సమధికమైన ధీరత్వంతో, తనలో కలిగిన కామవేదనను నియంత్రించ సాగాడు. కాని అప్సరస మీదికి మళ్ళిన మనస్సును నిలువరించటానికి సమర్థుడు కాలేకపోయాడు. అది అలా జరగవలసి ఉన్నది. అందువల్లనే వ్యాసుడు ఘృతాచి శారీరకసౌందర్యానికి ఆకర్షితు డయినాడు. అగ్నిని ఉత్పాదించవలెననే కోరికతో తన కామవేగాన్ని ప్రయత్న పూర్వకంగా అణచుకొంటున్న ఆ మహర్షి వీర్యం వెంటనే ఆ అరణికాష్ఠం మీద పడింది. రాజేంద్రా ! అలాంటి సమయంలో కూడా ఆ ద్విజశ్రేష్ఠుడు నిస్సందేహమైన మనస్సుతో, ఒక అరణితో ఇంకొక అరణిని మథిస్తూనే ఉన్నాడు. అప్పుడే ఆ అరణిలో నుంచి శుకమహర్షి అవతరించాడు. అరణితో కూడా శుక్రమధనం జరగటంచేత మహాయోగి, మహాతపస్వి, పరమఋషి అయిన శుకుడు జన్మించాడు. ఆయన పుట్టుక అరణి నుంచి జరిగింది. యజ్ఞంలో

హవిస్సును వహించే అగ్ని ప్రజ్వలించినట్లు, అగ్ని తేజంతోనే శుకమహర్షి ఆవిర్భవించాడు. ఆ తేజస్సుతో ఆయన వెలిగిపోతున్నాడు. కురునందనా ! తన తండ్రితో సమానమైన పరమోత్తమరూపాన్ని, కాంతిని ధరించి పవిత్రాత్ముడైన శుకుడు పొగలేని నిప్పులాగా దేదీప్యమానంగా ఉన్నాడు.

జననాథా ! అప్పుడు నదీమతల్లి అయిన గంగాదేవి రూపుదాల్చి, మేరుపర్వతం మీదికి వచ్చి, తనజలంతో శుకుని సంతృప్తుని చేసింది. శుకమహర్షికోసం ఆకాశంనుంచి దండం, నల్లజింకచర్మమూ రెండూ భూమి మీద పడ్డాయి. ఆ సమయంలో గంధర్వులు గానం చేశారు. అప్సరసలు నాట్యం చేశారు. దేవదుందుభులు చాలా పెద్ద ధ్వనితో మ్రోగాయి. విశ్వావసువు తుంబురుడు, నారదుడు, హాహా, హూహూ అనే గంధర్వులు శుకదేవుని జన్మకాలమంగళగీతాలను పాడసాగారు. అక్కడికి ఇంద్రుడు మొదలైన లోకపాలకులు, దేవతలు, దేవర్షులు, బ్రహ్మర్షులు వచ్చారు. వాయుదేవుడు నానావిధాలయిన దివ్యపుష్పాలను వర్షించాడు. స్థావర జంగమాత్మకమైన జగత్తు అంతా పరమానందభరితం అయింది. అప్పుడు మహాతేజస్వి, మహాత్ముడు అయిన పరమేశ్వరుడు పార్వతీదేవితో కూడా స్వయంగా సంతోషంతో వచ్చి, వ్యాసమహర్షికి జనించిన పుత్రుని శాస్త్రప్రకారం ఉపనీతుని చేశాడు. రాజా ! దేవతాధిపతి అయిన మహేంద్రుడు ఆయనకు ప్రేమ పూర్వకంగా దివ్యమై, అద్భుతంగా కనిపించే కమండలాన్ని, దేవతలకు తగిన వస్త్రాలను ఇచ్చాడు. వేలకొలది హంసలు, నెమిళ్లు, బెగ్గురు పక్షులు, చిలుకలు, పాలపిట్టలు ఆయనకు ప్రదక్షిణం చేశాయి. మహాతేజస్వి, అరణీగర్భసంభవుడూ అయిన శుకుడు ఆ దివ్యజన్మనంది బ్రహ్మచర్య దీక్షను పాటించి అక్కడే ఉండసాగాడు. ఆయన మహామేధావి, వ్రతరక్షకుడు, ఏకాగ్రచిత్తుడు అయి ఉన్నాడు.

మహారాజా ! జన్మించినంతనే శుకమహర్షికి, రహస్య విషయాలతో, సంగ్రహాలతో సహా సమస్తవేదాలు ఆయన తండ్రికి వచ్చినట్లే హృద్గతాలు అయ్యాయి. వేదవేదాంగాలను విస్తృతమైన వ్యాఖ్యాన విశేషాలతో తెలిసిన ఆయన లోకాచారాన్ని అనుసరించి, ధర్మానుసారం బృహస్పతిని తన గురుదేవునిగా స్వీకరించాడు. శుకమహాముని బృహస్పతి వద్ద సరహస్యంగా, ససంగ్రహంగా వేదాలను, సమస్తమైన ఇతిహాసాలను, రాజశాస్త్రాలను అధ్యయనం చేసి, గురుదక్షిణ ఇచ్చి, సమావర్తన సంస్కారం పొంది తన నివాసానికి వెళ్ళాడు. ఆయన ఏకాగ్రచిత్తుడై, బ్రహ్మచర్య వ్రతాన్ని పాటిస్తూ, మహోగ్రతపస్సు చేశాడు. మహాతపస్వి అయిన శుకుడు జ్ఞానంతో, తపస్సుతో బాల్యంలో కూడా దేవతలకు, ఋషులకు

ఆదరణీయుడు, వారికి సలహాలను ఇవ్వగలిగిన యోగ్యుడూ అయినాడు. రాజేంద్రా ! ఆయన బుద్ధి మోక్షం మీదనే ఉండటంచేత, గృహస్థాశ్రమం మీద ఆధారపడే బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థాలనే మూడు ఆశ్రమాల యందు ఆసక్తం కాలేదు."

325. శుకుని మిథిలా గమనము.

భీష్ముడు చెపుతున్నాడు. "యుధిష్ఠిరా ! శుకుడు మోక్షవిషయాన్నే ఆలోచిస్తూ, తన తండ్రి, గురువు అయిన వ్యాసమహర్షి వద్దకు వెళ్ళి, వినయంతో నమస్కరించి, తన శ్రేయస్సును కోరుకొని ఇలా అన్నాడు. "మహాత్మా ! నీవు మోక్ష ధర్మాలలో నిపుణుడివి. నా మనస్సుకు పరమశాంతి కలగటానికి తగిన దాన్ని చెప్పవలసింది." పుత్రుని ఆ మాట విని వ్యాసమహర్షి 'పుత్రా ! నీవు మోక్షం, తదితరమైన వివిధ ధర్మాలను అధ్యయనం చేయవలసింది' అని చెప్పాడు. భరతవంశీయా ! ధర్మాత్ములలో శ్రేష్ఠుడైన శుకుడు సమస్తమైన యోగ శాస్త్రాన్ని, సాంఖ్యశాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. తన పుత్రుడు బ్రహ్మతేజోయుక్తుడు, బ్రహ్మతో సమానమైన సామర్థ్యం కలవాడు, మోక్ష ధర్మాలలో కుశలుడు అని తెలుసుకొన్న వ్యాసమహర్షి. 'నాయనా ! మిథిలా నగరాధిపతి అయిన జనకమహారాజు వద్దకు వెళ్ళు. ఆ రాజు నీకు సమస్తమైన మోక్షశాస్త్ర సారసిద్ధాంతాన్ని వివరిస్తాడు.' అని చెప్పాడు.

తండ్రి ఆజ్ఞను తలదాల్చి శుకుడు ధర్మోత్కృష్టతను, మోక్షానికి పరమాశ్రయాన్ని అడగటానికి మిథిలానగరానికి ప్రయాణ మైనాడు. వెళ్ళేసమయంలో మహర్షి ఎలాంటి విస్మయం లేకుండా అన్నాడు, 'నాయనా ! సామాన్య మనుష్యులు ప్రయాణించే రీతిగానే వెళ్ళు గాని, యోగశక్తిని ఉపయోగించి, ప్రభావంతో ఆకాశగమనంతో వెళ్ళకు. కపటభావం లేకుండా వెళ్ళు. సుఖాన్ని వెతుక్కోవద్దు. వసతులు చూసుకోవద్దు. విశిష్టులైనవారిని, ప్రత్యేకతగల వాటిని వెదకుకొనవద్దు. అలా చేస్తే వాటి యందు ఆసక్తి కలుగుతుంది. యజ్ఞాదులు చేయించే నాకు ఆయన యజమాని అని తలచి నీవు అహంకరించవద్దు. అన్ని విధాలా ఆయన వశంలో ఉండు. ఆయన నీకు గల అన్ని సందేహాలు తీర్చగలడు. నాకు యజమానుడైన ఆ రాజు ధర్మనిపుణుడు. మోక్ష శాస్త్రంలో పండితుడు. ఆయన చెప్పిన వాటిని అన్నింటిని సంశయించకుండా చేయి !'

తండ్రి ఇలా చెప్పిన తరువాత ధర్మాత్ముడైన శుకముని మిథిలానగరానికి బయలుదేరాడు. ఆయన చతుస్సముద్ర ముద్రితమైన భూమండలాన్ని అంతటిని, ఆకాశ

గమనంలో దాటి పోవటానికి సమర్థుడైనా కాలినడకనే వెళ్ళసాగాడు. ఆయన మార్గమధ్యంలో పర్వతాలను, నదులను, సరస్సులను, నానావిధమైన క్రూరమృగాదులు, సర్పాలు గల మహారణ్యాలను, వనాలను దాటి వెళ్ళుతున్నాడు. క్రమంగా మేరు (ఇలావృత) వర్షాన్ని, హరివర్షాన్ని, (హైమవత) కిం పురుషవర్షాన్ని దాటి భారత వర్షంలో అడుగు పెట్టాడు. చీనజాతి, హూణజాతి నివసించే అనేక దేశాలను చూస్తూ ఆ మహాముని ఈ ఆర్యావర్తానికి వచ్చాడు.

(హిమవత్పర్వత వింధ్యపర్వతాల మధ్య ఉన్న పుణ్యభూమి ఆర్యావర్తం) తండ్రి ఆజ్ఞను గౌరవించి తాను తెలుసుకొనవలసిన విషయాన్నే ఆలోచిస్తూ, ఆకాశసంచారి ఆకాశాన్ని అతిక్రమిస్తున్నట్లు, పాదయాత్రతోనే ఆయన మార్గాన్ని దాటుతున్నాడు. త్రోవలో చాల సుందరమైన పట్టణాలు, సర్వసంపత్స మృద్ధాలయిన నగరాలు కనిపించాయి. నానావిధాలైన విచిత్రరత్నాలు కన్పించాయి. వాటిని అన్నింటినీ ఆయన చూసీ చూడకుండా వెళ్లాడు. అందమైన ఉద్యానాలను, భవనాలను, ఆలయాలను ఆయన పట్టించుకోలేదు. ఎంతో పవిత్రమైన రత్నాలు కన్పించినా, వాటిపై అపేక్ష లేకుండా ముందుకు సాగాడు. ఇలా ప్రయాణం చేసి, ఆయన చాలా అల్పకాలంలోనే విదేహ రాజ్యాన్ని చేరాడు. దాన్ని ధర్మరక్షకుడైన జనకరాజు పాలిస్తున్నాడు. ఆ దేశంలో నానావిధాలయిన ఆహార పానీయాలు, ఇతర భాద్యవస్తువులు సమృద్ధిగా ఉన్నాయి. గ్రామాలు, పల్లెలు, పేటలు, గోకులాలు - సర్వసమృద్ధాలయిన వాటిని ఆయన చూశాడు. ఆ విదేహప్రాంతంలో అంతటా పచ్చని పంటపొలాలు, పచ్చికబయళ్ళు, శాలిక్షేత్రాలు హంసలు, బెగ్గురు పక్షులతో శోభించే సరస్సులు ఆ విదేహరాజ్య శోభను పెంపొందిస్తున్నాయి. సంపత్సమృద్ధిగల జననివాసాలైన విదేహదేశాన్ని అతిక్రమించి, ఆయన సర్వసమృద్ధిగల అందమైన ఒక ఉద్యానవనానికి వచ్చాడు. ఆ ప్రదేశం ఏనుగులు, గుఱ్ఱాలతో నిండి ఉంది. లెక్కలేనంతమంది స్త్రీ పురుషులు రాకపోకలు సాగిస్తున్నారు. వాటిని చూసినా గమనించనట్లే ఆయన వెళ్ళాడు.

తెలుసుకొనదగిన దాని భారాన్ని వహిస్తూ, జ్ఞేయమైన దాన్ని చింతిస్తూ, ఆత్మారాముడు ప్రసన్నచిత్తుడై ఆయన మిథిలానగరంలో ప్రవేశించాడు. నగరద్వార సమీపానికి వచ్చిన ఆయన, ఎలాంటి సంశయం లేకుండా లోపలికి ప్రవేశించబోయాడు. అక్కడ ద్వారపాలకులు పరుషవచనాలతో అదలిస్తూ ఆయనను లోపలికిపోకుండా అడ్డగించారు. శుకుడు మనస్సులో ఎలాంటి బాధ, కోపం లేకుండా శాంతంగా అక్కడ ఉన్నాడు. ఎండవల్ల గాని, ప్రయాణంవల్ల గాని ఆయనకు ఎలాంటి సంతాపం కలగలేదు. ఆకలిదప్పులు

ఆయనను బాధించలేదు. ఆయన ఎండకు తపించలేదు. వాడిపోలేదు. ఎండలో నుంచి తొలగలేదు. ఆ ద్వారపాలకులలో ఒకడు తన ప్రవర్తనకు చాలా బాధపడ్డాడు. ఆకాశమధ్యంలో మధ్యాహ్నంపూట వెలిగిపోతున్న సూర్యుని వలె, మౌనంగా ఉన్న శుకమహర్షిని చూసి, ఆతడు చేతులుజోడించి తగినరీతిగా ఆయనను గౌరవించి, నమస్కరించాడు. ఆయనను రాజభవనానికి సంబంధించిన రెండవ ప్రాకారంలోకి ప్రవేశపెట్టాడు. ఎండ నీడలను సమానంగా చూచే మహాతేజస్వి అయిన శుకుడు, అక్కడ కూర్చుని మోక్షవిషయాన్నే ఆలోచిస్తున్నాడు. కొద్దిసేపటిలో మంత్రి అక్కడికి వచ్చి, నమస్కరించి, ఆయనను తనతో పాటు రాజభవనంలోని మూడవ ద్వారంలో ప్రవేశపెట్టాడు. అక్కడ కుబేరుని చైత్రరథోద్యానవనం వలె రమ్యమైన ఒక అంతఃపురోద్యానవనం ఉన్నది. దానిలో ప్రత్యేకంగా జలక్రీడకు అనేకమైన చక్కని సరస్సులు ఉన్నాయి. ఆ ఉద్యానంలో వికసిత పుష్పాలు గల వృక్షాలు ఉన్నాయి. అలాంటి సుందర ప్రమదావనంలో మంత్రి శుకుని ప్రవేశపెట్టాడు. మంత్రి మహర్షికి ఒక ఆసనం చూపించాడు. ఐదువందల మంది వేశ్యలు వచ్చారు. వారు యువతులు, వారి వేషభూషలు చాల మనోహరంగా ఉన్నాయి. వారంతా సౌందర్యవతులు. ఎట్టని విలువైన చీరలు దాల్చి ఉన్నారు. మేలిమి నగలు వారి సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తున్నాయి. సంభాషణలో, గాననాట్యాలలో వారు నేర్పరులు. అప్సరసలవలె రూపవతులు. చిరునవ్వుతో మాట్లాడుతారు. ఎదుటివారి ఉద్దేశం పసిగడతారు. కామోపచారప్రవీణులు. సమస్తకళలలో పరిజ్ఞానం కలవారు. ఆ వారస్త్రీలు ఆయనకు అర్ఘ్యపాద్యాలను ఇచ్చారు. యథావిధిగా పూజించారు. ఆ సమయానికి తగిన రుచిగల ఆహారంపెట్టి తృప్తి కలిగించారు. ఆయన ఆహారం స్వీకరించిన తరువాత ఆ వేశ్యలు తమతో పాటు తీసుకొని వెళ్ళి, ఆ అంతఃపురోద్యానంలో ఆయనను విహరింపజేస్తూ, అక్కడి ప్రతి వస్తువునూ చూపించారు. అప్పుడు వారు నవ్వుతూ, పాడుతూ, చక్కగా క్రీడిస్తున్నారు. మనోభావాలను బాగా అర్థం చేసుకోగల ఆ సుందరీమణులు, మహోదారచరితుడయిన శుకుని నానారీతుల సేవించారు. కాని అరణీసంభవుడైన ఆయన అంతఃకరణం సంపూర్ణంగా పవిత్రమైనది. ఆయన ఇంద్రియవిజేత, కోపాన్ని జయించినవాడు. సందేహరహితుడు. ఎవరినీ కోపించడు. నిరంతరం స్వకార్యనిరతుడు. మహాసౌందర్యవతులయిన ఆ కాంతలు దేవతలు కూర్చోదగిన మంచాన్ని చూపించారు. అది రత్ననిర్మితం. దాని మీద అమూల్యమైన మెత్తని పరుపు ఉన్నది. ఆయన కాళ్ళు చేతులు కడుగుకొని సంధ్యావందనం చేశాడు. తరువాత పవిత్రాసనం మీద కూర్చుని మోక్షతత్త్వాన్నే

ఆలోచింపసాగాడు. రాత్రి మొదటి జాములో ధ్యానమగ్నుడై ఉన్నాడు. రాత్రి మధ్యభాగంలో (రెండు, మూడు జాములలో) మహాప్రభావసంపన్నుడై నిద్రించాడు. అనంతరం రెండుగడియలలో తెల్లవారుతుందనగా బ్రాహ్మీముహూర్తంలో నిద్రలేచి, కాలకృత్యాలు తీర్చుకొని, స్నానంచేసి, మేధావి అయిన శుకదేవుడు మళ్ళీధ్యాన నిమగ్నుడైనాడు. ఆ సమయంలో కూడా ఆ సౌందర్యవతులు ఆయన చుట్టూ కూర్చునే ఉన్నారు. భరతనందనా ! ఈ విధంగా తన మర్యాదను అతిక్రమించకుండా వ్యాసపుత్రుడైన శుకుడు ఆ పగలూ, రాత్రీ రాజభవనంలో గడిపాడు."

326. శుక జనక సంభాషణము.

భీష్ముడు చెపుతున్నాడు. "భారతా ! తరువాత మంత్రులతో, అంతఃపురస్త్రీలతో, పురోహితులతో కలిసి జనకమహారాజు ఆసనాన్ని, నానారత్నసహిత బహుమతులు తీసుకొని, శిరస్సున అర్ఘ్యపాత్ర నుంచుకొని, గురుపుత్రుడైన శుకుని వద్దకు వచ్చాడు. అప్పుడు పురోహితుడు ఒక ఆసనం తెచ్చాడు, అది మిక్కిలి విలువైన మెత్తని పరుపు పరచినది. సర్వతోభద్రమనే ఆ ఆసనాన్ని రాజు చేతితో పట్టుకొని, గురుపుత్రుడైన శుకమహర్షికి సమర్పించాడు. అది చాలా పూజ్యమైనది. దానిపైన కూర్చున్న శుకుని రాజు శాస్త్రోక్తవిధానంతో పూజించాడు. అర్ఘ్యపాద్యాలు సమర్పించాడు, గోదానం చేశాడు. రాజు మంత్రయుక్తంగా, విధి పూర్వకంగా చేసిన పూజను మునిపుత్రుడు స్వీకరించాడు. పూజాస్వీకరణం తరువాత గోదానం తీసుకుని, రాజును తగినరీతిగా ఆదరించి, మహా తేజస్వి అయిన శుకముని రాజు యొక్క క్షేమాదికం అడిగాడు. సపరివారుడైన రాజు ఆరోగ్యాదికాన్ని అడిగాడు. తరువాత శుకుని అనుమతితో రాజు తన అనుచర సమూహంతో పాటు దోసిలొగ్గి, నేలమీద కూర్చున్నాడు. జనకుని మనస్సు, వంశం చాలా ఉదారమైనవి. రాజచంద్రుడు శుకుని అవ్యయమైన కుశలం అడిగి, 'ఇక్కడికి రావటానికి కారణం ఏమిటి ?' అని అడిగాడు. శుకముని అన్నాడు. "రాజా ! నీకు మేలు కలుగుగాక "నాయజమాని, లోకప్రసిద్ధుడు, విదేహదేశాధిపతి జనకుడు మోక్షధర్మం బాగా తెలిసినవాడు. ప్రవృత్తి ధర్మం (కర్మకాండ లోక వ్యవహారాదులు), నివృత్తి ధర్మం (మోక్షవిషయం) లో నీమనస్సులో సందేహాలు ఉంటే వెంటనే త్వరగా అక్కడికి వెళ్ళు. ఆయన నీ సందేహాలు తీరుస్తాడు" అని మా తండ్రి చెప్పాడు. ధర్మాత్ములలో శ్రేష్ఠా ! అందువల్ల నేను తండ్రిగారి ఆజ్ఞవలన మీ దగ్గరకు వచ్చాను. కాబట్టి నా ప్రశ్నలకు తగిన సమాధానం చెప్పవలసింది. బ్రాహ్మణుని

కర్తవ్యం ఏమిటి ? మోక్షం అనే పురుషార్థస్వరూపం ఏమిటి ? ఆ మోక్షాన్ని పొందటానికి జ్ఞానమా ? తపస్సా ? ఏది సాధనం అవుతుంది ?"

జనకుడు అన్నాడు. "వత్సా ! బ్రాహ్మణుడుగా జన్మించినవాడు ఏయే పనులు చేయాలో చెపుతాను. విను. ఉపనయనం అయిన తరువాత బ్రాహ్మణబాలకుడు వేదాధ్యయన తత్పరుడు కావాలి. తపస్సు, గురుశుశ్రూష, బ్రహ్మచర్య వ్రతపాలనం అనే మూడు పనులతో పాటు వేదాధ్యయనం కూడా చేయాలి. అగ్నికార్యం, దేవపితృదేవతల తర్పణతో, వారి ఋణం నుంచి విముక్తు డవటానికి యత్నించాలి. ఎవరి లోపాలను ఎన్నకూడదు. నియమ పూర్వకంగా వేదాధ్యయనం పూర్తి చేసుకొని, గురువుకు దక్షిణ సమర్పించి, వారి ఆజ్ఞతో సమావర్తన సంస్కారం తరువాత, ఇంటికి తిరిగి రావాలి. స్వగృహానికి వచ్చిన తరువాత వివాహం చేసుకుని స్వభార్యాసక్తుడు కావాలి. ఇతరుల తప్పులను వెదకకుండా అందరితో తగిన రీతిగా వ్యవహరించాలి. నిత్యాగ్ని హోత్రి కావాలి. పుత్రసంతానం కలిగిన తరువాత, ఆ పుత్రుడు సంతాన వంతు డైనప్పుడు, కుమారునికి గృహస్థకర్తవ్యాన్ని అప్పగించి, అరణ్యంలోకి వెళ్ళి, వాన ప్రస్థాశ్రమాన్ని స్వీకరించాలి. అప్పుడు కూడా గార్హపత్యం మొదలైన అగ్నులలో హోమాదులుచేస్తూ ప్రేమపూర్వకంగా అతిథి సత్కారాలు చేయాలి. దీని తరువాత ధర్మజ్ఞుడైన అతడు శాస్త్రానుసారం అగ్నిహోత్రాగ్నులను ఆత్మారోపణం చేసుకొని ద్వంద్వాతీతుడు, వైరాగ్య సంపన్నుడై పరబ్రహ్మ చింతనమే ప్రధానమైన సంన్యాసాశ్రమంలో ప్రవేశించాలి." శుకమహర్షి అడిగాడు. "రాజా ! ఎవరికైనా బ్రహ్మచర్యాశ్రమంలోనే మనస్సులో సనాతన మైన జ్ఞాన విజ్ఞానాలు (ఆత్మజ్ఞానం, తదనుభవం) కలిగితే, హృదయంలో రాగద్వేషాదులైన ద్వంద్వాలు దూరం అయితే, అప్పుడు కూడా ఆ వ్యక్తి తక్కిన మూడు ఆశ్రమాలలో (గార్హస్థ్య, వానప్రస్థ, సంన్యాసాలలో) ఉండటం అవసరమా ? జననాధా ! ఈ విషయం నిన్ను అడుగుతున్నాను. చెప్పవలసింది. వేదంలోని అసలైన సిద్ధాంతానుసారం ఏమి చేయటం సముచితమో చెప్పవలసింది."

జనక మహారాజు చెపుతున్నాడు. "జ్ఞానం, విజ్ఞానం అనే రెండూ లేకుండా మోక్షప్రాప్తికలుగ నట్లే, సద్గురు సంబంధం లేకుండా (గురూపదేశం లేక) జ్ఞాన ప్రాప్తి ఉండదు. గురువు సంసార సాగరం నుంచి ఒడ్డుకు చేర్చేవాడు. ఆయన ప్రసాదించే జ్ఞానాన్నే ఇక్కడ నౌకవంటిదని చెపుతారు. మానవుడు ఆ జ్ఞానాన్ని పొంది, భవసాగరాన్ని తరించి కృతకృత్యుడు అవుతాడు. నదీతీరం చేరిన వ్యక్తి నావను, దాటించిన

నావికుని వీడినట్లు ముక్తపురుషుడు గురువును, జ్ఞానాన్ని - రెండింటిని వదలివేస్తాడు. లోకాలు (సృష్టులు, జనులు) విచ్ఛిన్నం కాకుండటానికి, పరంపరగా వచ్చే కర్మకాండలు భంగం కాకుండటానికి, నాలుగు ఆశ్రమాల, వర్ణాల పరిపూర్ణ సిద్ధికోసం ధర్మాన్ని పూర్వులు ఆచరించారు. ఈ రీతిగా నానావిధాలయిన కర్మలను అనుష్ఠిస్తూ, శుభాశుభకర్మలయందు ఆసక్తిని త్యజించటంవలన మోక్షం అనేది లభిస్తుంది. గతించిన అనేక జన్మలలో మంచి పనులు చేస్తూ చేస్తూ, సర్వేంద్రియాలు పవిత్రం అయినప్పుడు, శుద్ధాంతఃకరణం గల మనుష్యుడు మొదటి ఆశ్రమం (బ్రహ్మచర్యాశ్రమం) లోనే మోక్షజ్ఞానాన్ని పొందుతాడు. ఆ స్థితిని పొంది, బ్రహ్మచర్యాశ్రమంలోనే ఆత్మసాక్షాత్కారం అయితే, పరమాత్మను కోరే జీవన్ముక్తుడైన విద్వాంసునికి మిగిలిన మూడు ఆశ్రమాలలో ప్రవేశించవలసిన అవసరం ఏమి ఉంటుంది ? విద్వాంసుడు రాజస తామసాలైన దోషాలను వదలి, సాత్త్వికమార్గాన్ని ఆశ్రయించి, బుద్ధిద్వారా ఆత్మసాక్షాత్కారాన్ని పొందాలి. సర్వప్రాణులలో ఆత్మను, ఆత్మలో సర్వభూతాలను దర్శించగల వ్యక్తి, జలచరమైన పక్షి నీటిలో ఉండికూడా జలాసక్తం కానట్లు సంసారంలో ఉంటాడు. ఆ వ్యక్తి గూటిని వదలి ఎగిరిపోయే పక్షివలె ఈ దేహాన్ని విడిపోయి ద్వంద్వరహితుడు, శాంతుడు అయి పరలోకంలో అక్షయపదాన్ని (మోక్షాన్ని) పొందుతాడు. వత్సా ! ఈ విషయమై పూర్వం యయాతిమహారాజు గానం చేసిన గాథలను విను. వాటిని మోక్షశాస్త్ర విద్వాంసులైన ద్విజులు ఎల్లప్పుడు గుర్తుతెచ్చుకొంటూ ఉంటారు.

ఆత్మజ్యోతి తనలోనే వెలుగుతున్నది కాని వేరేచోట కాదు. ఆ జ్యోతి అన్నిప్రాణులలోనూ సమానంగానే ఉన్నది. తన మనస్సును ఏకాగ్రం చేయగలవ్యక్తి దాన్ని స్వయంగానే దర్శించగలడు. **ఇతర ప్రాణులను భయపెట్టనివాడు, ఇతరుల వల్ల భయపడనివాడు, ఏ వస్తువును కోరనివాడు, ఎవ్వరినీ ద్వేషించనివాడు బ్రహ్మభావాన్ని వెంటనే పొందుతాడు.*** మనుష్యుడు మనస్సు, మాట, పని అనే మూడింటితో సమస్త ప్రాణులయందు ద్వేషభావాన్ని చూపించనప్పుడు బ్రహ్మభావాన్ని పొందుతాడు. మోహంలో (అజ్ఞానంలో) కి నెట్టే ఈర్ష్యను, కామాన్ని, మోహాన్ని వదలి సాధకుడు తన మనస్సును ఆత్మలో కలిపినప్పుడు బ్రహ్మత్వాన్ని పొందుతాడు.

ఈ సాధకుడు వినదగిన, చూడదగిన వాటిల్లో, సర్వప్రాణుల్లో సమభావం కలవాడు అయినప్పుడు, సుఖ దుఃఖాదులైన ద్వంద్వాలు లేనివాడు అయినప్పుడు బ్రహ్మభావాన్ని

---

* **న బిభేతి పరో యస్మాత్ న బిభేతి పరాచ్చ యః ।**
యశ్చ నేచ్ఛతి న ద్వేష్టి బ్రహ్మ సంపద్యతే తదా ॥ 33

పొందుతాడు. నిందా స్తుతులను సమంగా భావించేవాడు, బంగారాన్ని, ఇనుమును, సుఖదుఃఖాలను, శీతోష్ణాలను, అర్థానర్థాలను, ప్రియాప్రియాలను, జీవన మరణాలను సమంగా చూసేవాడు బ్రహ్మభావాన్ని పొందుతాడు. తాబేలు తన అవయవాలను ముందుకు చాచి, మరల లోపలికి ముడుచుకొన్నట్లుగా, సంన్యాసి మనస్సుతో ఇంద్రియాలను నియంత్రించుకోవాలి. చీకటి అలముకున్న ఇంటిని దీపపు కాంతితో చూచినట్లు, అజ్ఞానాంధకారంతో కప్పబడిన ఆత్మను స్వచ్ఛమైన బుద్ధి అనే దీపంతో సాక్షాత్కరింపజేసికొన వీలవుతుంది. బుద్ధిమంతులలో శ్రేష్ఠుడా ! ఇంతవరకు నేను చెప్పినవి అన్నీ నీయందు చూస్తున్నాను. వీటికంటే ఇంకా తెలుసుకొన వలసిన తత్త్వం కూడా నీకు బాగా తెలుసు. బ్రహ్మర్షీ ! నీవు మీతండ్రిగారి అనుగ్రహంవల్లా, ఆయన చేసిన బోధవల్లా సర్వవిషయాతీతుడవు అయినావు అని నాకు బాగా అర్థమయింది. మహామునీ ! వారి ప్రసాదంవల్లనే నాకుకూడా ఈ దివ్యజ్ఞానం తెలిసింది. అందువల్లనే నిన్ను తెలుసుకోగలిగాను. **నీ జ్ఞానం అధికం. నీగతి, ప్రవర్తన కూడా అధికమైనవే. నీ ఐశ్వర్యం, సామర్థ్యమూ అధికమైనవే. కాని ఈ విషయం నీకు తెలియదు. బాల స్వభావం వల్ల గాని, సంశయం వల్ల గాని, మోక్షం లభించదేమో అనే ఊహాజనిత భయంవల్ల గాని, మానవునికి విశిష్టజ్ఞానం కలిగినా కూడా మోక్షం లభించదు. నావంటివారి ద్వారా సంశయాలు తొలగిన సాధకుడు శుద్ధమైన, నిశ్చయ బుద్ధితో హృదయగ్రంథి విడిపోయి ఆ చరమగతిని పొందుతాడు. నీకు ఉత్తమజ్ఞానం లభించింది. నీ బుద్ధి కూడా స్థిరపడ్డది. లోకవిషయాలలో ఆసక్తి కూడా ఏమాత్రం నీకు లేదు. అయినా విశుద్ధమైన, నిశ్చయబుద్ధి లేకుండా పరమాత్మభావాన్ని పొందలేవు. సుఖదుఃఖాలలో నీకు ఎలాంటి తేడా లేదు. మనస్సులో లోభం లేదు. నాట్యం చూడాలని గాని, పాటలు విందామనిగాని నీకు ఏలాంటి ఆసక్తి లేదు. ఏ ఇంద్రియ విషయాలమీదా నీకు మనస్సులో రాగం లేదు.** మహాత్మా ! నీకు బంధువులపైన ఎలాంటి మమకారం లేదు. భయంకలిగించే వాటివల్ల నీకు ఎలాంటి భయమూ లేదు. మట్టిగడ్డ, రాతి ముక్క, బంగారు కణిక నీకు సమానంగా ఉంటాయని నాకు తెలిసింది. నేనూ, ఇతర విద్వాంసులు నిన్ను అక్షయమూ, అనామయమూ అయిన ఉత్తమ (మోక్ష) మార్గంలో ఉన్నావని భావిస్తున్నాం. బ్రహ్మర్షీ ! ఈ లోకంలో బ్రాహ్మణత్వానికి ఫలమైన, మోక్ష ఫల స్వరూపంలో నీవు ఉన్నావు. ఇంకా ఏమైనా అడగదలచుకొన్నావా ?"

327. శుకదేవుని తిరుగుప్రయాణము, వేదాధ్యయన విధానము.

భీష్ముడు చెపుతున్నాడు. "యుధిష్ఠిరా ! జనకమహారాజు మాటలు విని, నిర్మలాంతఃకరణం గల శుకమహర్షి ఒక దృఢనిశ్చయానికి వచ్చాడు. బుద్ధితో ఆత్మలో స్థిరుడై, ఆత్మసాక్షాత్కారాన్ని పొంది, కృతార్థుడైనాడు. ఆనందమగ్నుడై మహత్తరశాంతిని అనుభవిస్తూ, హిమవంతాన్ని లక్ష్యంగా చేసుకుని మౌనంగా ఉత్తర దిక్కువైపు వాయువేగంతో వెళ్ళాడు. ఈ సమయంలోనే దేవర్షి నారదుడు సిద్ధులకు, చారణులకు నివాసమైన హిమవత్పర్వతానికి వచ్చాడు. ఆ హిమవంతంమీద అప్సరసల సమూహాలు అంతటా వ్యాపించిఉన్నాయి. నానావిధప్రాణులు శాంతస్వరంతో ధ్వనిస్తూ ఉన్నాయి. వేలకొలది కిన్నరులు, తుమ్మెదలు, కోకిలలు, నెమళ్ళు, అడవికోళ్ళు, కాటుకపిట్టలు, విచిత్రాలైన చకోరాలు, నానావిధాలైన కేకలతో మధురంగా ధ్వనించే చిత్రమైన రంగులు గల నెమిళ్ళు, రాజహంసల సమూహాలు, నల్లని కోకిలలు అక్కడ మధుర ధ్వనులను వ్యాపింపజేస్తున్నాయి. ఖగరాజు గరుత్మంతుడు అక్కడ నిత్యం ఉంటాడు. నలుగురు లోకపాలకులు, దేవతలు, ఋషుల సమూహాలు సర్వలోకాలకు మేలు కోరి ఎల్లప్పుడు అక్కడ ఉంటారు. అక్కడ విష్ణువు (శ్రీ కృష్ణుడు) పుత్రప్రాప్తి కోసం తపస్సు చేశాడు. అక్కడే కుమారస్వామి చిన్నతనంలో దేవతలను ఆక్షేపిస్తూ, ముల్లోకాలను అవమానించి, భూమిలో తన శక్తి అనే ఆయుధాన్ని నిలిపాడు. అప్పుడు ఆయన జగత్తును అంతను ఆక్షేపిస్తూ " నాకంటే బలవంతుడైనవాడు, నాకంటే అధికమైన బ్రాహ్మణ భక్తుడు, బ్రాహ్మణ ప్రియుడు, మూడులోకాలలో నాకన్నా పరాక్రమవంతుడు నేను పాతిన ఈ శక్తి ఆయుధాన్ని పైకి తీయవచ్చు లేక కదిలించవచ్చు" అని పలికాడు.

దీన్ని విని లోకం అంతా బాధపడింది. ఎవరు దీనిని పైకి తీయగలరా అని దిగులు పడింది. అప్పుడు దేవసమూహం అంతా ఇంద్రియాలు మనస్సు వికలం అయి ఉండటం, రాక్షసులతో కూడా సర్వలోకాలను స్కందుడు ఆక్షేపించటం చూసి, విష్ణుదేవుడు 'ఇప్పుడు ఏం చేస్తే బాగుంటుంది' అని ఆలోచించాడు. అప్పుడు స్కందుని ఆక్షేపాన్ని (సవాల్‌ను) సహించక, విశుద్ధమనస్కుడైన విష్ణువు కుమారస్వామి వైపు చూచాడు. ఆ పురుషోత్తముడు ఆ ప్రజ్వలించే శక్తి ఆయుధాన్ని కుడిచేతితో పట్టుకొని కదిలించాడు. మహాబలిష్ఠుడైన విష్ణువు ఆ శక్తిని కదిలిస్తుంటే పర్వతాలు, వనాలు, అరణ్యాలతో గూడిన భూమి అంతా కంపించింది. ఆ శక్తిని పెల్లగించటానికి విష్ణుదేవుడు సర్వసమర్థుడైనా, కుమారస్వామిని తక్కువచేయటానికి ఇష్టపడలేదు. అవమానం జరగకుండా ఆయనను

కాపాడినాడు. ఆ శక్తిని కదలించి విష్ణుదేవుడు ప్రహ్లాదునితో 'కుమారుడు ఎంత బలవంతుడో చూచావా ? దీన్ని ఇతరులెవ్వరూ కదిలించలేరు' అని అన్నాడు. ఆ మాటను సహించలేక ప్రహ్లాదుడు ఆ శక్తిని పెళ్ళగించివేయటానికి పట్టుకొని కదిపాడు. కాని దాన్ని కదిలించలేకపోయాడు. హిరణ్య కశిపుని పుత్రుడైన ప్రహ్లాదుడు పెద్దగా కేకపెట్టి, వ్యాకులుడై పర్వతం మీద మూర్ఛపోయి, పడినాడు. వత్సా ! అంతటి విశిష్టమైన హిమవత్పర్వతానికి ప్రక్కగా ఉత్తరదిక్కుకు వెళ్ళి, శంకరుడు చాలా తీవ్రమైన తపస్సు నిత్యం చేసేవాడు. పరమేశ్వరుని ఆశ్రమాన్ని ప్రజ్వలించే అగ్ని నాలుగు వైపులా చుట్టి, వెలుగుతున్నాడు. ఆదిత్యగిరి అనే ఆ పర్వతాన్ని మనోనిగ్రహంలేని వారు ఎక్కలేరు. యక్షులు గాని, రాక్షసులు గాని, దానవులు గాని అక్కడికి వెళ్ళలేరు. ఆ పర్వత శిఖరం పదియోజనాల విశాల ప్రదేశాన్ని అగ్నిజ్వాలలు చుట్టుముట్టి ఉన్నాయి. బలవంతుడైన అగ్నిదేవుడే అక్కడ ఉన్నాడు. మహామేధావి అయిన శంకరుడు వేయి దివ్య సంవత్సరాలకాలం అక్కడ ఒంటి కాలి మీద ఉండి, తపస్సు చేశాడు. ఆయన తపస్సుకు ఎలాంటి విఘ్నం కలగకుండా అగ్నిదేవుడు అక్కడ ఉన్నాడు. మహాతపస్వి అయిన మహాదేవుడు అక్కడ దేవతలకు సంతాపం కలిగిస్తూ మహా తపోమగ్ను డైనాడు.

ఆ హిమవత్పర్వతానికి తూర్పు దిక్కున ఏకాంత ప్రదేశంలో మహాతపస్వి, పరాశరనందనుడైన వ్యాసుడు తనశిష్యులు సుమంతుడు, జైమిని, పైలుడు, వైశంపాయనుడు అనే నలుగురికి వేదాధ్యాపనం చేస్తున్నాడు. తపోమూర్తి అయిన వ్యాసమహర్షి శిష్యపరివృతుడై ఉన్న, ఆ ఆశ్రమాన్ని శుకుడు చూచాడు. అప్పుడు నిర్మలాంతఃకరణుడైన అరణిసంభవుడు ఆకాశంలో ఉన్న సూర్యదేవునిలాగా వెలుగుతున్నాడు. ఇంతలోనే వ్యాసమహర్షికూడా అగ్ని, సూర్యుల వలె అన్నివైపులా తన తేజఃపుంజాలను వ్యాపింపజేస్తూ వస్తున్న పుత్రుని చూచాడు. యోగయుక్తుడై మహాత్ముడైన శుకుడు ధనుస్సులోని అల్లెత్రాటినుండి విడువబడిన బాణంవలె, తీవ్రవేగంతో సూటిగా వస్తున్నాడు. ఆయనకు చెట్లు గాని, పర్వతాలు గాని అడ్డుగా లేవు. శుకుడు తండ్రివద్దకు వచ్చి ఆయన పాదాలు పట్టుకొని నమస్కరించాడు. పితృశిష్యులను ఆత్మీయతతో కలిశాడు. తరువాత శుకుడు సంతృప్త మనస్సుతో జనక మహారాజుతో తనకు జరిగిన సంవాదాన్ని తండ్రికి చెప్పాడు. ఈ రీతిగా తేజస్వియైన పారాశర్య వ్యాసమునీంద్రుడు శిష్యులకు, పుత్రునికి వేదాధ్యాపనం చేశాడు.

అనంతరం ఒకనాడు సాంగవేదాధ్యయనసంపన్నులు, శాంత మనస్కులు, ఇంద్రియ విజేతలు, వేదనిష్ఠ లయిన వ్యాసశిష్యులు గురువుగారి దగ్గర కూర్చుని నమస్కరిస్తూ

ఇలా అన్నారు. శిష్యులు అన్నారు. "గురుదేవా ! మేము మీదయవలన తేజోవంతులమైనాం. మాయశస్సు కూడా పెంపొందింది. ఇప్పుడు ఒక్కసారి మమ్ములను అనుగ్రహించ గోరుతున్నాం." శిష్యుల మాటలు విన్న బ్రహ్మర్షి 'వత్సలారా ! మీకు సంతోషం కలిగించేది ఏమిటో చెప్పండి' అని అన్నాడు. గురువుగారి ఈ మాటలు విన్న శిష్యులు సంతుష్టచిత్తులై, తలలు వంచి ప్రణామాలు చేసి, దోసిలొగ్గి, ఇలా అన్నారు. 'మాకు గురూత్తములు అయిన మీరు ప్రసన్నులు అయితే మేము ధన్యులం.' మేము అందరం మహర్షిగురువులైన మిమ్ములను 'మా అయిదుగురుకంటే వేరొక ఆరవ శిష్యుడు లోకంలో ప్రఖ్యాతుడు ఉండరాదు' అనే వరం ఇయ్యవలసినదని కోరుతున్నాం. ఇలా మా మీద దయచూపాలి. మేము నలుగురం, మీ శిష్యులం. ఐదవ వాడు మీ పుత్రుడు. మా అయిదుగురిలోనే మీరు అధ్యాపనం చేసే వేదాలు ప్రతిష్ఠితాలు కావాలి. ఇదే మేము కోరే వరం. శిష్యుల మాటలు విని వేదార్థతత్త్వం తెలిసినవాడు, పారలౌకికమైన విషయాన్ని చింతించేవాడు, ధర్మాత్ముడు అయిన పరాశరాత్మజుడు ధర్మాత్ములు, మేధావులు అయిన తనశిష్యులు అందరితో ధర్మానుకూలమై, క్షేమంకరమైన మాట ఇలా చెప్పాడు. 'నాయనలారా ! శాశ్వత బ్రహ్మలోక నిత్యనివాసం కోరేవాడై, అధ్యయనం చెయ్యాలి అని దృఢమైనకోర్కెతో వచ్చే బ్రాహ్మణునికి ఎల్లప్పుడు అధ్యాపనం చేయాలి. మీరు అసంఖ్యులై ఈ వేదాధ్యాపనం విస్తరింపజేయండి. శిష్యుడు కానివానికి, మనస్సు స్వవశంలో లేనివానికి, బ్రహ్మచర్య వ్రతాన్ని చక్కగా పాటించని వానికి వేదాధ్యాపనం చేయకూడదు. ఇవి అన్నీ శిష్యగుణాలు. ఎవరినైనా శిష్యునిగా స్వీకరించే ముందు, వానిలో ఈ గుణాలు అన్నీ సరిగా ఉన్నవా అని గురువు తెలుసుకోవాలి. ఎవరిలోనైనా ఈ సదాచార పరీక్ష చేయకుండా వానికి ఏ రీతిగాను విద్యాదానం చేయరాదు. అగ్నిలో కాల్చటం, ముక్కలుచేయటం, గీటురాయి మీద రుద్దటంతో బంగారం స్వచ్ఛతను గుర్తించినట్లే, కులం, గుణాలు మొదలైన వాటితో శిష్యుని పరీక్షించాలి. మీరు మీ శిష్యులను ఎలాంటి అనుచితమూ, మహాభయంకరమూ అయిన త్రోవలో పెట్టకండి. మీరు సరిగా బోధించినా, ఎవరికి ఎలాంటి బుద్ధిసంపద ఉంటుందో, అధ్యయనంలో ఎలాంటి పరిశ్రమచేస్తాడో, దాని బట్టి వానివిద్య సఫలం అవుతుంది. అందరూ దుర్గమ సంకటాలను అతిక్రమింతురుగాక. అందరూ శుభాలు పొందుదురుగాక ! బ్రాహ్మణుని ముందుంచుకొని నాలుగు వర్ణాలవారికి ఉపదేశం చేయాలి. ఈ వేదాధ్యయనం మహత్తర కార్యం అని పెద్దలు చెప్పారు. దీన్ని తప్పక చేయాలి. బ్రహ్మదేవుడు ఈ లోకంలో దేవతలను స్తుతించటానికని వేదాలను సృష్టించాడు.

వేదపారంగతుడైన బ్రాహ్మణుని అజ్ఞానవశాన నిందించినవాడు, బ్రాహ్మణునికి అనిష్టం కోరటంవలన నిస్సంశయంగా పరాభవం పాలవుతాడు. ధర్మ సంప్రదాయాన్ని అతిక్రమించి ప్రశ్నించేవాడు, అధర్మపూర్వకంగా సమాధానం చెప్పేవాడు - వీరిద్దరికి మృత్యువు కలుగుతుంది. లేకపోతే పరస్పరం ద్వేషించుకొంటారు. ఈ స్వాధ్యాయవిధానాన్ని అంతా మీకు చెప్పాను. దీన్ని మీరు మనస్సులలో ఎప్పుడూ గుర్తుంచుకోండి. ఇది శిష్యులకు ఉపకరిస్తుంది."

328. అనధ్యాయ నిమిత్త కథనము.

భీష్ముడు చెపుతున్నాడు. "తమగురువు అయిన వ్యాసుని మాటలు విని, మహాతేజోవంతు లైన వ్యాసశిష్యులు సంతుష్టమనస్కులై ఒకరినొకరు కౌగలించుకున్నారు. "మహాత్మా ! మా మేలుకోరి చెప్పిన మాటలు మా మనస్సులలో నాటుకున్నాయి. ఇకముందు మేము తప్పక అలాగే చేస్తాము." పరస్పరం ఈ రీతిగా మాట్లాడుకొని గురుశిష్యులు అందరూ తమలో తాము ఆనందించారు. సంభాషణంలో విశారదులైన శిష్యులు గురువు గారికి ఇలా విన్నపం చేశారు. "మునీంద్రా ! ఇకమేము ఈ పర్వతం పైనుంచి భూమి పైకి వెళ్ళాలని అనుకొంటున్నాం. వేదాలను అనేక భాగాలుగా చేసి ప్రచారం చేయటమే మా ప్రయాణోద్దేశం. ఇది మీకు ఇష్టమైతే మాకు వెళ్ళటానికి అనుమతి ఇవ్వండి." శిష్యుల మాటలు విన్న పరాశర పుత్రుడు ధర్మార్థసహితమై, హితకరమైన మాటను ఇలా చెప్పాడు. "శిష్యులారా ! ఇది మంచిదని అనిపిస్తే మీరు భూలోకానికి కాని, దేవలోకానికి కాని వెళ్ళండి. కాని పొరపాటు చేయవద్దు. వేదాలలో చాలా ఎక్కువ ఉత్తేజాన్ని కలిగించే మంత్రాలు ఉన్నాయి. అవి వ్యాజంతో ఫలాసక్తిని చూపించి ధర్మప్రతిపాదన చేస్తాయి." సత్యవచనుడైన గురువుగారి ఆజ్ఞను స్వీకరించి, వారంతా గురుదేవులకు ప్రదక్షిణంచేసి, తలలువంచి నమస్కరించి, అక్కడి నుంచి బయలుదేరారు. భూమిమీదికి దిగి, వారు చాతుర్హోత్రమనే కర్మను అగ్నిహోత్రం మొదలు సోమయాగం వరకు గలదానిని ప్రచారం చేశారు. గృహస్థాశ్రమంలో ప్రవేశించి బ్రాహ్మణక్షత్రియ వైశ్యులచేత యజ్ఞాలు చేయిస్తూ, వారు ద్విజాతులతో ఆనందంగా ఉండసాగారు. యజ్ఞాలు చేయించటం, వేదాధ్యాపనం చేయటంలోనే వారు ఆసక్తులై ఉన్నారు. వీటివల్ల వారు శ్రీమంతులు, ప్రఖ్యాతులు అయినారు. శిష్యులు వెళ్ళిన తరువాత వ్యాసుడు కుమారునితో ఏకాంతంలో ధ్యానమగ్నుడై, మౌనంగా ఉన్నాడు. ఆ సమయంలో మహాతేజస్వి నారదుడు ఆ ఆశ్రమానికి వచ్చి, వ్యాసమహర్షిని కలిసి, మధుర వాక్కులతో ఇలా అన్నాడు.

"బ్రహ్మర్షీ వసిష్ఠపౌత్రా ! మీ ఆశ్రమంలో వేదమంత్రధ్వని వినిపించటం లేదే. ఒంటరిగా ధ్యానమగ్నుడవై కూర్చుండటానికి కారణం ఏమిటి ? ఏదో విచారంలో ఉన్నట్టు అనిపిస్తున్నది. దేవతాగణాలు సంచరిస్తూనే ఉన్నా, వేదఘోష లేకపోవటంచేత ఈ పర్వతశోభ వెనకటి లాగా లేదు. రజస్తమస్సులతో కప్పబడి రాహుగ్రస్త చంద్రునివలె ఉన్నది. దేవర్షులు నివసిస్తున్నా, ఈ పర్వతశిఖరం వేదఘోష లేక, కిరాతనివాసం వలె శోభారహితమై ఉంది. ఇక్కడి ఋషులు, దేవతలు, గంధర్వులు వేదఘోష లేకపోవటంచేత వెనకటివలె ప్రకాశించటంలేదు." నారదవచనాలు విని కృష్ణద్వైపాయనుడు ఇలా అన్నాడు. 'వేదవిద్యలో విద్వాంసుడవైన మహర్షీ ! నీవు చెప్పినది నా మనస్సుకు అనుకూలమైనదే. సర్వజ్ఞుడవు, సర్వదర్శివి, అన్నిచోట్ల ఉన్న విషయాలు తెలుసుకోవాలనే ఉత్కంఠగలవాడవు కాబట్టి నీవే ఇలా మాటాడగలవు. ముల్లోకాల్లో జరిగే విషయాలు, జరిగిపోయినవి అన్నీ మీకు తెలుసు. బ్రహ్మర్షీ ! ఇప్పుడు నేను ఏమి చేయాలో చెప్పు, ఆజ్ఞాపించు. బ్రహ్మర్షీ ! ఈ సమయంలో నాకర్తవ్యం ఏమిటి ? అది చెప్పవలసింది. నా ప్రియ శిష్యుల వియోగం వల్ల మనస్సు బాగా సంతోషంగా లేదు.' **నారదమహర్షి ఇలా అన్నాడు. "వేదవ్యాసా ! వేదాభ్యాసంచేసి దానిని మళ్ళీ పారాయణ చేయకపోవటం వేదాధ్యయన దూషణం అవుతుంది. వ్రతనియమాలు పాటించక పోవటం బ్రాహ్మణునికి దోషం అవుతుంది. బాహ్లీక దేశ ప్రజలు భూమికి దోషకారకులు. క్రొత్తక్రొత్త క్రీడాదులమీద కుతూహలం స్త్రీకి దోషహేతువు అవుతుంది.** కాబట్టి నీవు పుత్రునితో కలిసి వేదాధ్యయనం చేయి. దానితో రాక్షస భయరూప తమస్సును నాశనం చేయి."

భీష్ముడన్నాడు. "పరమధర్మ మర్మం తెలిసినవాడు, వేదాభ్యాసం అనే దృఢమైన వ్రతం గల వ్యాసుడు సంతోషంతో 'అలాగే చేస్తా' నన్నాడు. ఆయన పుత్రుడైన శుకునితో కలిసి శిక్షానియమాను సారం, ఉచ్చైఃస్వరంతో, ముల్లోకాలను పరిపూర్ణాలను చేస్తూన్నట్లు, వేదపారాయణం చేయసాగాడు.

నానాధర్మ ప్రతిపాదకులైన ఆ పితాపుత్రులు పైన చెప్పినట్లు వేదాభ్యాసం చేస్తుండగానే, సముద్రవాయువుతో ప్రేరితమైన వాయువు మహావేగంతో వీచసాగింది. అప్పుడు ఇక అనధ్యయన సమయం అని వ్యాసుడు పుత్రుని వారించాడు. అలా వారించినంతనే శుకుడు దీనికి కారణం ఏమిటో తెలుసుకోవాలని కుతూహలపడ్డాడు. 'మహాత్మా ! ఈ వాయువు ఉత్పత్తి ఎలా జరిగింది ? వాయుదేవుని అన్నిచేష్టలను వివరించి చెప్పవలసింది ?' అని శుకుడు అడిగాడు. శుకుని ఈ మాటలు విని ఆశ్చర్యానికిలోనైన

వ్యాసుడు అనధ్యాయ కారణాలను వివరిస్తూ ఇలా చెప్పాడు. 'నాయనా ! నీకు దివ్య దృష్టికలిగింది. నీ హృదయం అత్యంతం నిర్మలం. నీవు తమోగుణరజోగుణ విముక్తుడవై సత్త్వగుణంలో ఉన్నావు. జనులు అద్దంలో తమ ప్రతిబింబాన్ని చూచినట్లు నీవు బుద్ధితో ఆత్మసాక్షాత్కారాన్ని పొందినావు. కాబట్టి నీవు వేదాలను నీలోనే ఉంచుకొని బుద్ధితో అనధ్యాయ కారణమైన వాయువిషయం ఆలోచించు. మరణానంతరం ఊర్ధ్వలోకాలకు వెళ్ళే వారికి, క్రిందిలోకాలకు వెళ్ళేవారికి రెండు త్రోవలు ఉన్నవి. వాటిల్లో ఒకటి విష్ణులోకానికి వెళ్ళే దేవయానం సాత్త్వికం. రెండవది పితృయానం అనే తామసమార్గం. భూమి మీద, అంతరిక్షంలో ఎక్కడ వాయువు వీచినా, దాన్ని అక్కడ ప్రవర్తింపజేసే వాయుమార్గాలు ఏడు ఉన్నాయి. క్రమంగా వానిని గూర్చి చెపుతాను విను.

భూమి ఆకాశాలలో మహాబలులు, మహాభూతస్వరూపులైన సాధ్యగణాలు అదృశ్యరూపంగా ఉంటారు. వారి పుత్రుడే, దుర్జయు డయిన సమానుడు అనే వాయువు. సమానుని పుత్రుడు ఉదానుడు. ఉదానుని పుత్రుడు వ్యానుడు. అతని పుత్రుడు అపానుడు అని తెలుసుకో. అపానుని నుండి ప్రాణుడు జన్మించాడు. ప్రాణునికి సంతానం లేదు. అతడు శత్రుసంతాపకుడు, దుర్జయుడు. వారి అన్ని పనులు వేరువేరుగా ఉంటాయి. వాటిని ఉన్నవి ఉన్నట్లుగా వివరిస్తాను. వాయుదేవుడు ప్రాణులలో ప్రత్యేకంగా సమస్తచేష్టలను కలిగిస్తాడు. అలాగే సర్వప్రాణులను సజీవంగా ఉంచుతాడు. అందువల్లనే ప్రాణం అని వ్యవహరిస్తారు. పొగతో, వేడితో ఏర్పడే మేఘాలను, వడగండ్లను ఇటూ అటూ తిప్పే ప్రథమ మార్గంలో వీచేది ప్రవహం అనే మొదటి వాయువు. ఆకాశంలో రసమాత్రలను, మెరుపులు మొదలైన వాటిని ఉత్పన్నం చేయటానికి ఆవిర్భవించేది, మహాతేజోవంతమయిన ద్వితీయ వాయువు ఆవహం అనే పేరుతో ప్రసిద్ధం. అది పెద్ద ధ్వనితో వీస్తుంటుంది. తృతీయ వాయువుపేరు ఉద్వహం. ఇది చంద్రసూర్యాది గ్రహాలకు ఉదయం కలిగిస్తుంది. మానవ శరీరంలో ఉండటం వల్ల విద్వాంసులు ఉదానంగా వ్యవహరిస్తారు. నాలుగు సముద్రాలలోని నీటిని పైకితీసుకొనిపోయి జీమూతాలు అనే మేఘాలలో ఉంచుతుంది. జీమూత మేఘాలను జల పూర్ణాలు చేసి, పర్జన్యుని స్వాధీనం చేస్తుంది. తృతీయ మార్గంలో వీచటం వల్ల దానిని తృతీయ వాయువు అంటారు.

నాలుగో వాయువు పేరు సంవహం. ఇది ఇటూ అటూ పోయే నానావిధాలయిన మేఘాలను గుంపుగా చేసి నీటిని వర్షిస్తుంది. గుంపులుగా ఏకమైనా తన ప్రేరణతో చిందరవందర చేస్తుంది. వేణువులాగా ధ్వనించటం వల్ల నదం అని అంటారు. ఇది

ప్రాణులను రక్షించటానికి మళ్ళీ నీటిని సంగ్రహించి గడ్డకట్టిస్తుంది. ఆకాశంలో వెళ్ళే దేవతల విమానాలను స్వయంగా వహిస్తుంది. పర్వతాల గర్వాన్ని అణచివేస్తుంది. అయిదో వాయువు పేరు వివహం. ఇది మహాతీవ్రమైన వేగంతో పెద్ద ధ్వని చేస్తూ వీచి, పెద్దపెద్ద చెట్లను విరగగొడుతుంది. వేళ్ళతో కూడా పెల్లగిస్తుంది. ప్రళయకాలంలో గుంపులుగా ఏర్పడే మేఘాలకు వలాహక సంజ్ఞ కలగటానికి హేతు విది. తన సంచారంతో భయంకరమైన ఉత్పాతాలను కలిగిస్తుంది. ఆకాశంలో తనతో కూడా మేఘాల గుంపులను తీసుకుపోతుంది. అత్యంతవేగవంతమైనది. ఆరో వాయువుపేరు పరివహం. తాను ఆధారమై, ఆకాశంలో దివ్యజలాన్ని ప్రవహింపజేస్తుంది. ఇది పవిత్రమైన ఆకాశగంగా జలాన్ని ధరిస్తుంది. సహస్ర కిరణాలకు ఉత్పత్తిస్థానమైన సూర్యుని దూరంగానే ఆపివేస్తుంది. భూమిని ప్రకాశింపజేస్తుంది. ఒకే కిరణం గలదిగా కన్పిస్తుంది. అమృతదివ్యనిధి అయిన చంద్రుని పోషిస్తుంది. విజయశీలవాయువులలో శ్రేష్ఠమైనది. ఇక ఏడవ వాయువు పేరు పరావహం. ఇది అంతకాలంలో సర్వప్రాణుల ప్రాణాలను శరీరాలలో నుంచి బయటకు తీస్తుంది. ఇది ప్రాణ నిష్క్రాసన మార్గానికి మృత్యువు, యముడు వెంట ఉండేటట్లు చేస్తుంది. నిరంతరం శాంతమైన మనస్సుతో అధ్యాత్మచింతామగ్నులై, ఆత్మానుసంధానం చేసే వారికి అమృతత్వాన్ని ఇస్తుంది ! దక్షప్రజాపతి పదివేలమంది పుత్రులు అన్ని దిక్కుల అంతాలకు చేరటానికి హేతువైనది. తన స్పర్శతో విలీనమైన ప్రాణులు ఇక్కడి నుంచి పోవటమే కాని తిరిగి రాకుండా చేస్తుంది. సర్వశ్రేష్ఠమయినది ఈ సప్తమ వాయువు. దీనిని అతిక్రమించటం అందరికీ కష్టమే.

ఈ ప్రకారంగా ఈ సప్తమరుద్గణాలు పరమాద్భుతాలైన దితి సంతానం. ఇవి సర్వగమనం గలవి. ఇవి నిరంతరం వీస్తూ సమస్తాన్ని ధరిస్తూ ఉంటాయి. చాలా వేగంగా వీచే ఈ వాయువువల్ల పర్వతశ్రేష్ఠమైన హిమవంతమే వేగంగా కంపించటం మహాశ్చర్యకరం. **నాయనా ! ఇది విష్ణుదేవుని నిఃశ్వాస వాయువు. ఆ నిఃశ్వాసవాయువు వేగంతో వెడలినప్పుడు ఈ జగత్తు అంతా వ్యథచెందుతుంది. ఇందువలన బ్రహ్మవేత్తలైన వారు తీవ్రంగా వాయువు వీచేటప్పుడు వేదాధ్యయనం చేయరు. వేదాలు కూడా భగవంతుని నిఃశ్వాసాలే. ఆ సమయంలో వేదపారాయణం చేస్తే వాయువువల్ల వాయువుకు భయం కలుగుతుంది. వేదం కూడా కలత చెందుతుంది.** అనధ్యాయ విషయంలో ఇది చెప్పి వ్యాసమహర్షి పుత్రునితో 'వేదాధ్యయనం ఇక ప్రారంభించు' అని చెప్పి ఆకాశగంగవైపు వెళ్ళాడు."

329. శుకునికి నారదుడు చేసిన వైరాగ్యజ్ఞానోపదేశము.

భీష్ముడు ఇలా చెపుతున్నాడు. "ధర్మజా ! వ్యాసమహర్షి వెళ్ళిన తరువాత శూన్యంగా ఉన్న ఆ ఆశ్రమంలో, స్వాధ్యాయ పరాయణుడైన శుకునికి ఆయనకు కావలసిన వేదార్థాన్ని చెప్పటానికి నారదుడు వచ్చాడు. అక్కడకువచ్చిన దేవర్షి నారదుని చూసి శుకుడు వేదోక్తమైన పద్ధతి ననుసరించి అర్ఘ్యం సమర్పించి, పూజించాడు. ప్రసన్నుడైన నారదుడు 'ధర్మాత్ములలో శ్రేష్ఠుడవైన శుకా ! నీకు ఏ శ్రేయస్సును కలిగించాలి ?, అని సంతోషంగా అడిగాడు. నారదుని మాటలువిని శుకుడు 'ఈ లోకంలో మేలు కలిగించేది నాకు చెప్పవలసింది అని అడిగాడు.' నారదుడు చెప్పాడు. 'వత్సా ! పూర్వకాలంలో పవిత్రమైన మనస్సు గల మహర్షులు తత్త్వజ్ఞానాన్ని పొందవలెననే కోరికతో ప్రశ్నించగా సనత్కుమారుడు ఇలా చెప్పాడు. **విద్యతో సమానమైన కన్ను వేరే లేదు. సత్యం వంటి తపస్సు లేదు. రాగంతో సమానమైన దుఃఖం లేదు. త్యాగంతో సమానమైన సుఖం లేదు.* పాపకార్యం చేయకుండటం, నిరంతరం పుణ్యకార్యాలు చేయటం, సత్పురుషులవలె ప్రవర్తించటం, సదాచారాన్ని పాటించటం అనేవి సర్వోత్తమ శ్రేయస్సు సంపాదించటానికి సాధనాలు.** ఏమాత్రం సుఖంలేని మానవ శరీరాన్ని పొంది, విషయాసక్తుడు అయ్యేవాడు మోహాన్ని పొందుతాడు. లౌకిక విషయ సంబంధం దుఃఖరూపమే. కాబట్టి అది దుఃఖవిముక్తిని కలిగించదు. మోహం అనే వలను పెంపొందించే విషయాసక్తుడైన వాని బుద్ధి చంచలం అవుతుంది. మోహజాల బద్ధుడైనవాడు ఈ లోకంలోను, పరలోకంలోను దుఃఖాన్నే పొందుతాడు. **శ్రేయస్సు పొందవలె ననుకొనే వాడు, నానా విధాలైన ఉపాయాలతో కామక్రోధాలను అదుపు చేసుకోవాలి. ఈ రెండూ శ్రేయస్సును నాశనం చేయటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి.**

మనుష్యుడు నిరంతరం తపస్సును క్రోధాన్నుంచి, సంపదను అసూయనుంచి, విద్యను మానావమానాలనుంచి, తనను పారపాట్లనుంచి కాపాడుకోవాలి. క్రూరస్వభావాన్ని వదలటం అన్నిటికంటె ఉత్తమధర్మం. ఓర్పు అన్నిటికంటె బలిష్ఠం. ఆత్మ జ్ఞానమే అన్నిటికంటె ఉత్తమజ్ఞానం. సత్యాన్ని మించింది ఏమీ లేదు. నిజంచెప్పటం అన్నింటి కంటె శ్రేష్ఠం. సత్యాని కన్నా హితకరమైన

---

* నాస్తి విద్యాసమం చక్షుః నాస్తి సత్యసమం తపః ।
నాస్తి రాగసమం దుఃఖం నాస్తి త్యాగసమం సుఖమ్ ॥ 6

మాట చెప్పటం గొప్పది. ప్రాణులకు సమధికంగా హితమైనదే నా అభిప్రాయప్రకారం సత్యం అవుతుంది.* సర్వకార్యాలు ఆరంభించటానికి సంకల్పాలను వదలినవాడు, ఎలాంటి కోరిక లేనివాడు, ఏ వస్తువును సంపాదించనివాడు, సమస్తాన్ని త్యాగం చేసినవాడు మాత్రమే విద్వాంసుడు, పండితుడు అవుతాడు. ఇంద్రియాలను స్వవశం చేసుకొని అనాసక్తుడై విషయాలను అనుభవించేవాడు, చిత్తం శాంతమూ, నిర్వికారం, ఏకాగ్రమూ అయినవాడు, ఇంద్రియాలు, దేహం ఆత్మస్వరూపమే అనే అనుభవం కలవాడు, వాటితో కలిసి ఉండి కూడా, వాటితో ఏకరూపుడు కాకుండా విడిగా ఉన్నట్లు ఉండేవాడు మాత్రమే ముక్తపురుషుడు. అతడే చాల త్వరగా పరమశ్రేయస్సును పొందగలడు. మునీ ! ఏ ప్రాణిమీదా దృష్టి పెట్టనివాడు, ఎవరి స్పర్శను గాని, ఎవరికోసం భాషణం గాని చేయనివాడే పరమశ్రేయస్సును పొందుతాడు. ఏ ప్రాణినీ హింసించరాదు. అందరియందు మైత్రి కలిగి ప్రవర్తించాలి. ఈ మానవ జన్మను పొంది, ఎవ్వరితోనూ వైరం పెట్టుకోరాదు.** ఆత్మతత్త్వం తెలిసిన వానికి, మనస్సు వశమైన వానికి ఏ వస్తువును కూడబెట్టు కోకపోవటం, సంతోషంగా ఉండటం, కోరికలను, చాంచల్యాన్ని వీడటం ఉత్తమశ్రేయస్సు పొందటానికి సాధనాలు అని చెప్పారు. నాయనా ! సంపాదనను వదలి జితేంద్రియుడవు కావలసింది. ఇహలోకపరలోకాలలో నిర్భయమూ, శోకరహితమూ అయిన పదవిని పొందు. భోగాలను వదలినవారు ఏనాడూ శోకమగ్నులు కారు. కాబట్టి ప్రతివ్యక్తి భోగాసక్తిని వదలాలి. భోగాలను వదలిన తరువాత నీవు దుఃఖసంతాపవిముక్తుడవు అవుతావు. పరమాత్మను పొందదలచుకొన్నవాడు తపస్వి, జితేంద్రియుడు, మననశీలుడు, ఇంద్రియాలను అదుపులో ఉంచుకొన్నవాడు, విషయాలలో ఆసక్తి లేనివాడు కావాలి. త్రిగుణాత్మకాలయిన విషయాలలో అనాసక్తుడై, నిరంతరం ఏకాంత వాసం చేసేవాడు త్వరలోనే సర్వోత్తమ సుఖమైన మోక్షాన్ని పొందుతాడు. స్త్రీ సంయోగమే

---

* నిత్యం క్రోధాత్తపో రక్షేత్ శ్రియం రక్షేచ్చ మత్సరాత్ ।
విద్యాం మానావమానాభ్యామ్ ఆత్మానం తు ప్రమాదతః ॥ 11
ఆనృశంస్యం పరో ధర్మః క్షమా చ పరమం బలమ్ ।
ఆత్మజ్ఞానం పరం జ్ఞానం న సత్యాద్విద్యతే పరమ్ ॥ 12
సత్యస్య వచనం శ్రేయః సత్యాదపి హితం వదేత్ ।
యద్భూతహితమత్యంతమ్ ఏతత్సత్యం మతం మమ ॥ 13

**న హింస్యాత్సర్వభూతాని మైత్రాయణగతశ్చరేత్ ।
నేదం జన్మ సమాసాద్య వైరం కుర్వీత కేనచిత్ ॥ 18

సుఖం అనుకొనే ప్రాణులమధ్యలో ఉండికూడా, ఏకాంతంగా ఉండటంలోనే ఆనందం అని అనుకొనే వానిని ఆత్మజ్ఞాన సంతృప్తుడు అనుకోవాలి. జ్ఞానసంతృప్తుడు ఎప్పుడూ శోకమగ్నుడు కాడు.

జీవుడు ఎల్లపుడూ కర్మాధీనుడుగానే ఉంటాడు. పుణ్యకర్మాచరణం వల్ల దేవత అవుతాడు. పుణ్య పాపకర్మల సమ్మిశ్రణంవల్ల మానవజన్మను పొందుతాడు. పాపకర్మలవల్ల పశుపక్ష్యాది నీచ జన్మ పొందుతాడు. ఆ యా జన్మలలో జీవుడు ఎల్లపుడూ జరామరణాలు, ఇంకా ఇతరమైన వివిధ దుఃఖాలతో సంతాపం చెందుతాడు. ఈ రీతిగా సంసారంలో జన్మించే ప్రతివ్యక్తి సంతాపాగ్నిలో పక్వం అవుతాడు. ఈ విషయాన్ని ఎందుకు గమనించవు ! మేలుకాని దాన్నే నీవు హితం అనుకొంటున్నావు. వినాశశీలమైన వాటిని శాశ్వతాలు అనుకొంటున్నావు. అనర్థకాన్ని సార్థకం అని భావిస్తున్నావు. ఈ సత్యం నీకు ఎందుకు తెలియటం లేదు ? పట్టుపురుగు తన శరీరంలో నుంచి వచ్చే దారాలతో తనను కప్పుకొన్నట్లు, నీవు గూడ అజ్ఞానం వల్ల నీలోనుంచే కలిగే సంబంధం అనే బంధంతో బంధించుకొంటూ కూడా ఆ విషయం తెలుసుకోలేకపోతున్నావు. అనేక వస్తువుల సంపాదన, దాచటం అనవసరం. దానివల్ల గొప్ప అనర్థం కలుగుతుంది. పట్టును తయారు చేసే పురుగు ఈ కూడబెట్టటం అనే దోషం వల్లనే బంధాన్ని పొందుతున్నది. అడవిలో ముసలివేనుగులు, సరస్సులో ఉండే బురదలో కూరుకొని పోయి దుఃఖాన్ని పొంది నట్లుగానే, భార్య, పుత్రులు, కుటుంబాలలో ఆసక్తులైన ప్రాణులు కష్టాలపాలు అవుతారు. లోతైన నీటిలో లీనమై నీటి పైకి వచ్చిన చేపలు వలలో చిక్కుకుని తహతహలాడినట్లు, మమకారం అనే వలలో ఆకర్షితులై, సమధిక కష్టాలపాలవుతున్న ఈ ప్రాణులను చూడు.

కుటుంబం, భార్యాపుత్రులు, శరీరం, వస్తుసంచయం అనేవి అన్ని పరాయివాళ్ళవే. అన్నీ నాశనం అయ్యేవే. ఇందులో తనది ఏముంది ? **పాపపుణ్యాలే తనవి. సమస్తాన్ని వదలిపెట్టి, నీవు వివశుడవై ఇక్కడినించి వెళ్ళిపోవలసిందే. అలాంటప్పుడు అవర్థమయమైన జగత్తులో ఎందుకు ఆసక్తుడవు అవుతున్నావు ? నీ అవలైన ప్రయోజనం అయిన మోక్షానికై సాధన చేయ వేమి ?** నిలువనీడ లేనిది, తోడులేనిది, దారిబత్తెము లేనిది, స్వదేశీయుడు గాని, త్రోవ చెప్పువాడు కాని లేనిది, అంధకారబంధురం, అడుగుమోపటానికి వీలుగానిది – ఇటువంటి త్రోవలో ఒంటరిగా ఎలా ప్రయాణిస్తావు ? పరలోక మార్గం పట్టినప్పుడు నీవెంట ఎవ్వడూ రాడు. అక్కడికి వెళ్ళేటప్పుడు నీవు చేసిన

పుణ్యపాపాలే నీవెంట ఉంటాయి. పరమాత్మ ప్రాప్తికి విద్య, కర్మ, పవిత్రత, బహువిస్తారమైన జ్ఞానం సహాయంగా తీసుకోవాలి. పరమాత్మ ప్రాప్తి అయిన తరువాత మానవుడు ముక్తు డవుతాడు. గ్రామాలలో నివసించే వారికి విషయాసక్తి కట్టుతాడు వంటిది. పుణ్యాత్ముడు దాన్ని త్రెంచివేసుకుని పరమార్థ మార్గంలో పయనిస్తాడు. పాపాత్ములు దానిని త్రెంచలేదు.

ఈ సంసారం ఒకనది వంటిది. దీనికి బయలుదేరే చోటు సత్యం. రూపం ఒడ్డు. మనస్సు ప్రవాహం, స్పర్శ ద్వీపం. రసం ప్రవాహం. గంధం దానిలో ఉండే బురద. శబ్దం నీరు. స్వర్గం అనే దుర్గమైన దిగేచోటు. శరీరం అనే నౌకతో దాన్ని దాటాలి. క్షమ అనేది నడిపే తెడ్డు. ధర్మం దీన్ని నిలిపే లంగరు. స్థానం. త్యాగం అనే గాలివాటు లభిస్తే వేగంగా పరుగెత్తే ఈ నదిని దాటవచ్చు. దీన్ని దాటటానికి తప్పక యత్నం చేయాలి. ధర్మాధర్మాలను వదలు. సత్యాసత్యాలను దూరంచేసుకో! దేనితో త్యాగం చేస్తున్నావో దాన్ని కూడ వదలు. **సంకల్పంవదలి ధర్మాన్ని, వాంఛారాహిత్యంతో అధర్మాన్ని వదలు. బుద్ధితో సత్యాసత్యాలను వదలి, పరతత్త్వ నిశ్చయంతో బుద్ధిని కూడా త్యజించు.**

పంచభూతాలకు నివాసం అయినది ఈ శరీరం. దీనిలో ఎముకలు స్తంభాలు. నాడు లనే నరాలతో కట్టబడింది. రక్తమాంసాలు పూతలు. చర్మం మాంసం కప్పిఉంటాయి. మలమూత్రాలతో నిండి ఉంది. వాటివల్ల దుర్వాసన వస్తుంది. ముసలితనం, దుఃఖాలతో వ్యాప్తం. రోగాలకు పుట్టిల్లు. దుఃఖస్వరూపం. రజోగుణం అనే దుమ్ముకొట్టుకున్నది. అనిత్యం కాబట్టి దీనిమీద మమకారాన్ని వదలు. చరాచరమైన ఈ జగత్తు అంతా పంచభూతాలవల్ల పుట్టింది, కాబట్టి మహాభూతస్వరూపం. ఈ శరీరానికి అతీతమైనది మహత్తత్త్వం అంటే బుద్ధి, పంచేంద్రియాలు, పంచసూక్ష్మభూతాలు. అనగా తన్మాత్రలు, పంచప్రాణాలు, సత్త్వరజస్తమోగుణాలు (మూడూ ఒకటి క్రిందే లెక్క), ఈ పదిహేడు తత్త్వాల సముదాయానికి అవ్యక్తం అనిపేరు. ఈ పదిహేడుతోపాటు శబ్దస్పర్శరూపరస గంధాలు అనే ఐదు విషయాలు, మనస్సు, అహంకారం ఈ మొత్తం వ్యక్తావ్యక్తాలు కలిపితే వీర్పడే ఇరవైనాలుగు తత్త్వాల సమూహాన్ని వ్యక్తావ్యక్తమయమయిన సముదాయం అంటారు.

వీటితో అన్నింటితో గూడిన వానిని పురుషుడు అంటారు. ధర్మం, అర్థం, కామం, సుఖదుఃఖాలు, జీవితం, మరణం అనే వాటి తత్త్వాన్ని సరిగా తెలుసుకొన్న వాడే ఉత్పత్తి ప్రళయాల తత్త్వాలు తెలిసిన వాడు. జ్ఞానానికి బంధించిన విషయాలను అన్నింటినీ

పరంపరగా తెలుసుకోవాలి. ఇంద్రియాలతో తెలుసుకునే పదార్థాలను వ్యక్తాలు అంటారు. ఇంద్రియాలకు అగోచరమై అనుమాన ప్రమాణంతో తెలుసుకునే వాటిని అవ్యక్తాలు అంటారు. దప్పిక గొన్నవాడు వర్షధారలతో తృప్తుడైనట్లు, స్వవశమైన ఇంద్రియాలు గల జీవుడు తృప్తుడవుతాడు. జ్ఞాని అయినవాడు సర్వప్రాణులలో తననూ, తనలో సర్వప్రాణులనూ చూడగలడు. పరావరాలను దర్శించగలవాని జ్ఞానమూలకశక్తి ఎప్పుడూ నశించదు. సర్వభూతాలను సర్వావస్థలలో ఎల్లప్పుడూ చూచేవాడు సర్వప్రాణులతో గూడి ఉన్నా అకార్యాలు చేయడు. జ్ఞానబలంతో, మోహంవల్ల కలిగే నానావిధకష్టాలను అతిక్రమించినవారికి, లోకంలో బుద్ధిప్రకాశంవల్ల లోకవ్యవహారమార్గం ఆటంకం కాదు. 'ఆద్యంతరహితం, అవినాశి, కర్తకానిది, నిరాకారమైన జీవాత్మ ఈ శరీరంలో ఉన్నది' అని మోక్షోపాయం తెలిసిన భగవంతుడు చెపుతున్నాడు. తానేచేసిన విభిన్న కర్మలు కారణంగా దుఃఖితుడైన జీవుడే, ఆ దుఃఖనివారణకోసం నానా ప్రాణులను సంహరిస్తాడు. అపథ్యమైన ఆహారాన్ని తిని, బాధపడినట్లు అతడు అనేకమైన క్రొత్త క్రొత్త కర్మలను చేసి, ఆ కర్మల వల్ల ఇంకా ఎక్కువ కష్టాలను పడతాడు. మోహాంధుడు, వివేకం లేనివాడు దుఃఖానుభవంలోనే సుఖాన్ని భావించి, కవ్వంలాగా కర్మ బద్ధుడై మధించబడతాడు. తరువాత ప్రారబ్ధకర్మ ప్రారంభం (ఉదయం) అయిన తరువాత, కర్మబద్ధుడైన ఆ ప్రాణి సంసారంలో దుఃఖాలను అనుభవిస్తూ, దాంట్లో చక్రంలాగా తిరుగుతుంటాడు. కాబట్టి నీవు కర్మ నివృత్తుడవు, సర్వబంధముక్తుడవు, సర్వజ్ఞుడవు, సర్వవిజయ సిద్ధుడవు, సాంసారిక భావం లేనివాడవు కావలసిందే. అనేకులైన జ్ఞానులు సంయమంతో, తపో బలంతో క్రొత్తవైన బంధాలను ఛేదించుకొని, అనంత సుఖాన్ని ఇచ్చేదీ, ఏ బాధలేనిది అయిన సిద్ధిని పొందారు."

330. శుకాభిపతనము.

నారదుడు చెపుతున్నాడు. "శుకా ! శాంతికరమూ, మంగళకరమూ అయిన ఈ శాస్త్రం శోకాన్ని దూరం చేసేది. శోకనాశనం కోసం శాస్త్రాన్ని వినేవాడు ఉత్తమమయిన బుద్ధిని పొంది సుఖిస్తాడు. **వేలకొలది శోకకారణాలు, వందలకొలది భయకారణాలు ప్రతిరోజు మూఢునికే కలుగుతాయి. కాని పండితునికి కలుగవు.** కాబట్టి అనిష్టాన్ని పోగొట్టుకోవటం కోసం నా ఉపదేశం విను. **మంద బుద్ధులైన మానవులు ఇష్టంకానివి కలగటంవల్లా, ఇష్టమైనవి దూరం కావటంవల్లా మానసిక దుఃఖాలకు లోనవుతారు.** పూర్వం కాలగర్భంలో కలిసిపోయిన వస్తువులగుణాలను ఎప్పుడూ గుర్తుకు తెచ్చుకోకూడదు. ఆదర పూర్వకంగా వాటి గుణాలను తలచుకొనేవాడు, వాటి యందున్న ఆసక్తి అనే

బంధంనుంచి ముక్తుడు కాలేడు. ఆసక్తిని పెంచేచోట దోషదృష్టిని ఉంచి, అది అనిష్టాన్ని పెంపొందిస్తుందని తెలుసుకోవాలి. ఇలా చేస్తే త్వరగా విరక్తు డవుతాడు. **గడచిపోయిన వాటిని గురించి శోకించేవానికి ప్రయోజనం గాని, ధర్మం గాని, కీర్తి గాని కలగకపోగా శోకం దూరం కాదు.** సర్వప్రాణులకు ఉత్తమ పదార్థాలతో సంబంధం, వియోగం కలుగుతూనే ఉంటాయి. కేవలం ఒక్కదానికోసమే శోకం కలుగుతుంది అని అనుకోవటానికి వీలులేదు. పూర్వం మరణించిన వ్యక్తికోసం గాని, వస్తువు కోసం గాని నిరంతరం దిగులు పడుతుండేవాడు ఒక దుఃఖంనుంచి ఇంకొక దుఃఖానికి చేరుతాడు. ఆతడు రెండు అనర్థాలను అనుభవించవలసివస్తుంది. **సంసారంలో తమసంతానం నశించినా చూసి కన్నీరు కార్చనివారే ధీరులు. అన్ని వస్తువులను సముచిత రీతిగా చూడటం, చక్కగా వాటిని గూర్చి విచారించటం చేస్తే, దేని కోసంగాని కన్నీరు కార్చటం యుక్తియుక్తం గాదు.** ఏదైనా శారీరకం గాని మానసికం గాని దుఃఖం కలిగినా, దాన్ని తొలగించుకోవటానికి యత్నం ఫలించకపోతే దానికోసం చింత అనవసరం.

మాటి మాటికీ దాన్నిగూర్చి విచారపడకపోవటమే సరియైన మందు. నిరంతరం దాన్ని గూర్చి బాధపడితే బాధ పెరుగుతుందే తప్ప తరగదు. కాబట్టి మానసిక దుఃఖాన్ని బుద్ధితో బాగా ఆలోచించి, శారీరక దుఃఖాన్ని ఔషధం ఉపయోగించి పోగొట్టుకోవాలి. శాస్త్రజ్ఞానంతో ఇది జరుగుతుంది. దుఃఖం కలిగినప్పుడు చిన్న పిల్లలవలె ఏడవగూడదు. **యౌవనం, రూపం, జీవితం, సంపత్సమూహం, ఆరోగ్యం, ఆత్మీయులతో కలసిఉండటం అనేవి అనిత్యాలు. విద్వాంసుడు వాటిల్లో ఆసక్తుడు కారాదు.*** **దేశానికి మొత్తానికి కలిగిన క్లిష్టస్థితిని గూర్చి ఒక్కడే ఉండి దిగులుపడగూడదు. ఆ ఆపదనుంచి బయటపడటానికి మార్గం కనిపిస్తే విచారంవదలి దానిలోనే పయనించాలి.** జీవితంలో సుఖానికంటే దుఃఖమే ఎక్కువ కలుగుతుంది అనటంలో సందేహంలేదు. అందరికీ మోహవశం వలన విషయాల మీదనే ఆసక్తి కలుగుతుంది. మృత్యువు ప్రియం కాదు. సుఖాన్ని గాని, దుఃఖాన్ని గాని రెండింటిని గాని వదలివేసేవాడు అక్షయ పరబ్రహ్మను పొందుతాడు. విద్వాంసులు వానిని గూర్చి చింతించరు.

ధనాన్ని ఖర్చు చెయ్యాలంటే చాలా బాధకలుగుతుంది. దాన్ని రక్షించటంలో సుఖంలేదు. దాన్ని సంపాదించటం కూడా చాలకష్టమే. కాబట్టి ధనం ప్రతిష్ఠితిలోను

---

* అనిత్యం యౌవనం రూపం జీవితం ద్రవ్యసంచయః ।
ఆరోగ్యం ప్రియసంవాసః గృధ్యేత్తత్ర న పండితః ॥ 14

దుఃఖదాయక మని భావించి, అది పోయినప్పుడు దిగులుపడరాదు. మానవులు నిరంతరం ధనాన్ని సంపాదించటంవలన, మొదటికంటే ఎక్కువ స్థితిని పొందాలనే కోరికవల్ల తృప్తి కలగదు. ధన తృష్ణతో వారు నశిస్తారు. సంతృప్తితో పండితులు ఉంటారు. (ధనతృష్ణ వారికి ఉండదు). సంపాదనలకు అన్నింటికి నాశమే తుది అవుతుంది. ఎంత పైకిపోతే అంత పతనం కలుగుతుంది. సంయోగాలు అన్నీ వియోగాంతాలే. మరణంతో జీవితం అంతం అవుతుంది. తృష్ణకు అంతం లేదు. సంతోషమే, సంతృప్తియే పరమ సుఖం. అందువల్ల ఈ లోకంలో సంతోషమే ఉత్తమ ధనం అని పండితులు భావిస్తారు. వయస్సు పోతూ ఉంటుంది గాని ఒక్క నిముష మయినా నిలుకడగా ఉండదు. తన శరీరమే నిత్యం కానప్పుడు ఈ లోకంలో ఏ వస్తువును నిత్యం అనుకోవాలి ? సర్వప్రాణుల్లోనూ మనస్సుకు అతీతంగా పరమాత్మ ఉనికిని తెలుసుకొని, ఆయననే ధ్యానించేవారు ఇహలోకయాత్ర ముగియటంతోనే పరమపదాన్ని సాక్షాత్కరింపజేసుకొని, శోకాన్ని అతిక్రమిస్తారు. అడవిలో క్రొత్త గడ్డికోసం సంచరిస్తూ సంతృప్తి చెందని పశువును హఠాత్తుగా వచ్చి, పులి నోటకరుచుకొనిపోయినట్లు, భోగాలతో తృప్తిపొందని వానిని మృత్యువు తీసుకుపోతుంది.

అయినా ప్రతివ్యక్తీ దుఃఖంనుంచి తప్పించుకోవటానికి ఉపాయాన్ని ఆలోచించాలి. శోకం వీడి, సాధన ప్రారంభించినవాడు, ఎలాంటి వ్యసనంలోను చిక్కుకోనివాడు తప్పక దుఃఖ విముక్తు డవుతాడు. ధనికుని కైనా, దరిద్రుని కైనా ప్రతివానికి అనుభవకాలంలోనే శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం మొదలైన విషయాలలో కొంచెంసుఖం కలుగుతుంది కాని అనుభవం తరువాత, ఏమీ ఉండదు. ఒకరితో ఒకరికి సంబంధం కలగక పూర్వం ఏ దుఃఖమూ ఉండదు. సంబంధం కలిగిన తరువాత వియోగం కలిగినప్పుడే అందరికీ దుఃఖం కలుగుతుంది. స్వస్వరూపంలో ఉండే వివేకవంతుడైన వ్యక్తి ఎవరితో, దేనితో వియోగం కలిగినా విచారపడకూడదు. కాబట్టి మానవుడు ధీరత్వంతో శిశ్నోదరాలను రక్షించుకోవాలి. కన్నులతో కాళ్ళు చేతులను రక్షించుకోవాలి. మనస్సుతో కన్నులు, చెవులను; సద్విద్యతో మనస్సు, వాక్కును రక్షించుకోవాలి. ఇతరం మీద ఆసక్తిని వదలి వినీత భావంతో ప్రవర్తించేవాడు సుఖి, విద్వాంసుడు అవుతాడు. అధ్యాత్మవిద్యలో అనురక్తుడు, కోరికలు లేనివాడు, భోగాసక్తి లేనివా డయి ఏకాకిగా సంచరించే వాడే సుఖపడతాడు."

331. కర్మఫల ప్రాప్తి పరతంత్రము - శుకాభిగమనము.

నారదుడు ఇలా అంటున్నాడు. "మానవునికి సుఖం దుఃఖంగా, దుఃఖం సుఖంగా తోచినప్పుడు బుద్ధి, ఉత్తమనీతి, పురుషార్థం రక్షించవు. కాబట్టి మానవుడు సహజంగానే జ్ఞానప్రాప్తి కోసం యత్నించాలి. ప్రయత్నశీలి ఎప్పుడూ దుఃఖాలపాలు గాడు. ఆత్మఅన్నిటి కంటె ఇష్టమైనది. అందువల్ల ముసలితనం, మృత్యువు, రోగాలు కష్టాలు-వీటినుండి తన్ను ఉద్ధరించాలి. శారీరాలు, మానసికాలు అయిన రోగాలు దృఢమైన ధనుర్ధారణం చేసే వీరులు వదలిన పదునైన బాణాలలాగా శరీరాన్ని భేదిస్తాయి. కోరికలతో బాధపడుతూ, బాధలతోనయినా బ్రతకాలని కోరుకొనే మానవుని శరీరం వినాశంవైపే లాగబడుతుంది. నదుల ప్రవాహం ముందుకే పోతుంది గాని వెనుకకు తిరగదు. అలాగే రాత్రింబవళ్ళు కూడా మానవుని ఆయువును అపహరిస్తూ మాటిమాటికి వస్తుంటాయి, పోతుంటాయి. శుక్ల కృష్ణ పక్షాలతో జరిగే ఈ నిరంతర పరివర్తనం, మానవులను ముసలితనంతో చివికిపోయేటట్లు చేస్తుంది. ఇది ఒక్క క్షణం కూడా ఆగదు. ప్రతిదినం అస్తమించే ఈ సూర్యుడు మరల మరల ఉదయిస్తుంటాడు. ఆయన క్షీణించకపోయినా, ప్రాణులను సుఖ దుఃఖాలతో క్షీణింపజేస్తుంటాడు. ఈ రాత్రులు మానవులకు అనేక విధాల అపూర్వాలై, ఊహించవీలుకాని ప్రియా ప్రియ సంఘటనలను కలిగిస్తూ వస్తూ, పోతుంటాయి.

జీవుడు చేసిన కర్మఫలం పరాధీనం కాకపోతే, తాను కోరిన వస్తువును తన ఇష్టానుసారం పొందుతాడు. మంచి నిగ్రహం గలవారు, బుద్ధిమంతులు, నేర్పుగలవారు కూడా నానావిధాలయిన పనులు చేసి, అలసిపోయినా ఫలితం పొందలేకపోయి కనిపిస్తారు. మూర్ఖులు, గుణహీనులు, అధములు కూడా ఎవరి ఆశీస్సులు లేకపోయినా అన్ని కోరికలు తీరి కనిపిస్తారు. ఇంకొకడు ప్రాణులహింసలోనే మునిగి ఉంటాడు. జనాన్ని మోసగిస్తుంటాడు. అయినా అతడు సుఖపడుతూనే ముసలివాడు అవుతాడు. **ఏ పనీ చేయని సోమరిపోతులు అనేకు లుంటారు. సంపద వారి దగ్గరకు తవంతట తానే వస్తుంది. ఇంకా కొంతమంది ఎంతో కష్టపడి పనిచేసి కూడా కావలసిన దాన్ని పొందలేరు. ఇది సహజంగా మనుష్యుని అపరాధం (ప్రారబ్ధదోషం) గా తెలునుకో. వీర్యం ఒకచోట వీర్పడుతుంది. సంతానోత్పాదనకోసం ఇంకొక చోటికి పోతుంది.** ఒకప్పుడు అది స్త్రీ యోనిలో చేరి గర్భధారణంలో సమర్థం అవుతుంది. ఇంకొకప్పుడు కాదు. అది అప్పుడప్పుడు మామిడి పూవువలె వ్యర్థం అవుతుంది.

కొంతమంది పుత్రులు కలగాలని, వారికి పుత్రులు కావాలని కోరుకొని, ఆ

కోరిక తీరటానికి అనేక ప్రయత్నాలు చేస్తారు. కాని వారి ఒక్క అండం కూడా ఉత్పత్తికాదు. కోపంతో బుసకొడుతున్న విషసర్పానికి భయపడినంతగా, సంతానాన్ని కనటానికి భయపడుతుంటారు. అయినా వారికి దీర్ఘజీవి అయిన సంతతి కలుగుతుంది. అది దృఢశరీరంతో ఉన్నా ఏదో ఒక దోషంతో శవంలాగా ఉంటుంది. పుత్రసంతాన కాంక్షతో కొంతమంది దంపతులు దేవపూజలు, వ్రతాలు చేసినా, పదిమాసాలు మోసిన వారికి వంశనాశకు లయిన పుత్రులు కలుగుతారు. ఎలాంటి సమస్యలు లేకుండా జన్మించిన కొంతమంది, పితరులు సంపాదించిన ధనధాన్యాలకు, సమధిక భోగాలకు అధికారులు అవుతారు. భార్యాభర్తలు కామంతో సంగమించితే, స్త్రీకి కోరకుండానే ఉపద్రవం లాగా గర్భం వస్తుంది. కఫమాంసమయ మయిన స్థూలదేహం నశించిన తరువాత ఆ జీవునికి త్వరగానే ఇతర శరీరాలు లభిస్తాయి.

ఒకనొక భగ్నం అయిన తరువాత అందులోని ప్రయాణీకులను ఇంకొకనావ దాటించటానికి సిద్ధంగా ఉన్నట్లు, మృత్యువుతో శరీరంనుంచి బయటికి వచ్చిన జీవునికి కర్మఫలాన్ని అనుభవించటానికి ఇంకొక నాశన శీలమైన దేహం సిద్ధం అవుతుంది. పురుషుడు స్త్రీతో సమాగమం వలన ఆమెలో నిక్షిప్తం చేసిన వీర్యబిందువు గర్భంగా మారుతుంది. ఆ గర్భం ఏ ప్రయత్నంతో జీవించిఉంటుందో నీవు ఆలోచించావా ? తిన్న ఆహారపదార్థాలు జీర్ణమయ్యే ఆ ఉదరంలోనే అన్నంలాగా గర్భం ఎందుకు జీర్ణం గాదు ? గర్భంలో మలమూత్రాలను ధారణచేయటం, బయటకు పంపటంలో స్వభావ సిద్ధంగా నియమించే కర్త ఎవరూలేరు. కొన్ని గర్భాలు పతనం అవుతాయి. కొన్ని జన్మిస్తాయి. చాలా మంది జన్మించిన వెంటనే మరణిస్తారు. ఈ యోనిబంధంనుంచి ఎవరోఒకరు బ్రతికి బయటపడతారు. అప్పుడు ఏదో ఒక సంతానం కలుగుతుంది. ఆ వ్యక్తీ మళ్లీ అన్యోన్య సంబంధాలలో మునుగుతాడు. అనాదికాలంనుంచి ఏర్పడుతున్న శరీరంతో జీవుడు అనుబంధం కలిగించుకొంటాడు. ఈ శరీరానికి గర్భస్థితి, జననం, బాల్యం కౌమారం, పౌగండం, యౌవనం వృద్ధత్వం, జర, ప్రాణరోధం, నాశం అనే పది దశలు ఉంటాయి. వీటిల్లో ఏడోది వృద్ధత్వం. తొమ్మిదోది ప్రాణరోధం. (ప్రాణాలను నిలుపటం) అనే వాటిని గూడా శరీరంలోని పంచభూతాలే పొందుతాయి. ఆయువు తీరిన తరువాత దశమదశ వచ్చిన తరువాత - పంచభూతాలు ఉండవు. అంటే శరీరం నశిస్తుంది అని అర్థం.

వ్యాధులు చిన్న జంతువులకు బాధలు కలిగించినట్లు, నానావిధరోగాలు మానవుని

వధిస్తాయి. అప్పుడు అతనికి లేవటానికి, కూచోటానికి శక్తి ఉండదు. ఇది నిస్సంశయం. వ్యాధులతో నానా బాధలుపడుతూ బాగా ధనాన్ని వ్యయంచేస్తున్నా, వైద్యులు ఎన్నో ప్రయత్నాలు చేసినా, ఆ రోగబాధను పోగొట్టలేరు. వేటగాండ్రచే బాధపెట్టబడిన మృగాలవలె, ఆ వైద్యులు ఎంత సమర్థులయినా, ఎంతనిపుణులైనా, ఎన్ని రకాల ఔషధాలు ఉన్నా సరే వారు కూడా వ్యాధులతో బాధలు పడతారు. వారు నానావిధాలయిన కషాయాలను, ఘృతాలను తింటూ ఉంటారు. అయినా పెద్ద ఏనుగులు మహావృక్షాలను విరిచివేసినట్లు, వంచివేసినట్లు అలాగే ముసలితనం బాధిస్తుంటుంది. ఇది లోకంలో కనపడుతుంటుంది. ఈ భూమి మీద మృగాలకు, పక్షులకు, క్రూరజంతువులకు, దరిద్రులైన మానవులకు రోగాలు వచ్చినప్పుడు ఎవరు వైద్యంచేయటానికి వెళ్తారు ? పెద్ద పెద్ద జంతువులు చిన్న జంతువులను ఆక్రమించినట్లు, మహాపరాక్రమవంతులు, మహాక్రూరులు, తేరిపారజూడరాని రాజులను కూడా రోగాలు ఆక్రమించి లొంగదీసుకొంటాయి. ఈ రీతిగా లోకం అంతా సంసార సాగరంలో పడి కొట్టుకుపోతూ, శోకమోహాల్లో మునిగితేలుతూ, ఆర్తనాదం కూడా చేయలేని స్థితిలో ఉంటుంది. కర్మఫలాన్ని అనుభవించటానికి విధిచేత నియుక్తులైన శరీరధారులు ధనం, రాజ్యం, తపస్సులతో ప్రకృతిని అతిక్రమించలేరు. **ప్రయత్నఫలితం తమ చేతుల్లో ఉండేటట్లయితే మానవులు ముసలి వారుకారు, మరణించరు. అందరి అన్ని కోరికలూ తీరుతాయి. ఎలాంటి అనిష్టాన్ని చూడరు.** అందరూ పైపై మెట్టుకు వెళ్ళాలనే కోరుకొంటారు. యథాశక్తిగా అందుకు ప్రయత్నిస్తారు. కాని అలా కాలేరు. ఎలాంటి పాపపాట్లు చేయనివారు, మహాపరాక్రమవంతులైన వీరులు కూడా సంపదలమదంతో కన్నుగాననివారిని, మద్యపాన మత్తులను, వంచకులను సేవిస్తూంటారు. చాలా మందికి కలిగే కష్టాలు ఎలాంటి శ్రమ లేకుండానే తొలగుతూ ఉంటాయి. ఇంకాకొంతమందికి తమకున్న ధనంలోనుంచికూడా అవసరమైనప్పుడు ఏమీ లభించదు. కర్మఫల ప్రాప్తిలో కూడా చాలా తేడా ఉంటుంది. కొంత మంది పల్లకీ మోస్తుంటారు. కొంతమంది పల్లకీలలో కూర్చుని ప్రయాణిస్తుంటారు.

మానవులందరూ సంపదను, ఐశ్వర్యాన్ని కోరుకొంటారు. కాని వారిలో కొద్దిమంది మాత్రమే సంపన్నులై రథాదుల్లో ప్రయాణిస్తారు. అనేక పురుషులు భార్యారహితులుగా ఉంటారు. చాలామందికి అనేక భార్య లుంటారు. సర్వప్రాణులు సుఖదుఃఖాదులైన ద్వంద్వాలలో రమిస్తుంటారు. వారిలో కొందరికి సుఖం కలుగుతుంది. మరికొందరికి దుఃఖం కలుగుతుంది. పరబ్రహ్మ వాటన్నిటికంటె భిన్నమైనది. ఈ విషయంలో మోహపడరాదు.

ధర్మాధర్మాలను వదలు. సత్యాసత్యాలను వదులు. సత్యానత్యాలను రెండింటిని వదలి దేనితో వాటిని త్యాగం చేస్తున్నావో దానిని కూడా వదలు.* మునిశ్రేష్ఠా ! నీకు చాలా గొప్ప రహస్యాన్ని చెప్పాను. దానితోనే దేవతలు మర్త్యలోకాన్ని వదలి స్వర్గానికి వెళ్ళారు." నారదుని మాటలు విని మహామేధావి, ధీరుడైన శుకుడు ఆ విషయం బాగా ఆలోచించాడు. కాని త్వరగా ఏ నిశ్చయానికీ రాలేదు. 'భార్యా పుత్రుల జంజాటంలో పడితే అన్నీ కష్టాలే, విద్యాభ్యాసం కూడా శ్రమదాయకమే. సనాతన బ్రహ్మ పద ప్రాప్తిలో స్వల్పకష్టం, మహాఫలం కలిగించే సాధనం ఏమిటి?' అని ఆలోచించాడు. తరువాత ఆయన రెండుగడియలు తన అసలైన మార్గం విషయంలో ఆలోచించాడు. గడిచింది, రాబోయేది ఎరిగిన శుకునికి కల్యాణకరమైన పరమగతి నిశ్చయమైంది.

మళ్ళీకొంత సేపు ఇలా ఆలోచించాడు. 'మళ్ళీ ఈ సంసార సాగరంలో పడకుండా ఉండే సర్వోపాధివినిర్ముక్తమైన ఆ ఉత్తమగతిని ఎలా పొందగలను ? జీవుని పునరావృత్తి కలగని ఆ పరమభావాన్ని పొందగోరుతున్నాను. సర్వసంగాలను వీడి మనస్సుతో ఉత్తమ గతిని పొందగోరుతున్నాను. నా ఆత్మకు శాంతిని కలిగించేది, వినాశరహితం, అక్షయం, అయిన చోటికి వెళ్ళి, సనాతన రూపంలో ఉంటాను. యోగంతో తప్ప ఆ పరమగతి లభించదు. బుద్ధిమంతుడు నికృష్టమైన కర్మ బంధన బద్ధుడై ఉండటం తగదు. కాబట్టి యోగాన్ని ఆశ్రయించి, ఈ దేహ బంధాన్ని వదలి, వాయురూపుడనై తేజోరాశియైన సూర్యమండలాన్ని ప్రవేశిస్తాను. దేవతలు చంద్రునిలోని అమృతరసాన్ని త్రాగటంచేత చంద్రుడు క్షీణిస్తున్నట్లు సూర్యుడు క్షీణించడు. ధూమమార్గంలో చంద్రమండలానికి వెళ్ళిన జీవుడు కర్మానుభవానంతరం వణికిపోయి, భూమి మీద పడతాడు. ఇలాగే క్రొత్త ఫలానుభవంకోసం చంద్ర మండలానికి వెళ్ళుతాడు. (చంద్రలోకగామి రాకపోకల నుండి విముక్తుడు కాడు అని భావం). ఇంతే కాక చంద్రుడు ఎప్పుడూ తగ్గుతూ పెరుగు తుంటాడు. ఈ విషయాలు తెలిసి నేను చంద్రలోకానికి వెళ్ళటమూ, ఎక్కువతక్కువ కావటమూ నాకు ఇష్టంలేదు.

సూర్యుడు తీవ్రకిరణాలతో సమస్త జగత్తును తపింపజేస్తాడు. అన్ని చోట్ల నుంచి తేజస్సును గ్రహిస్తాడు. (ఆయన తేజస్సు ఎప్పుడూ తగ్గదు). అందువల్ల ఆ సూర్యమండలం అక్షయంగా ఉంటుంది. కాబట్టి మహాతేజోవంతమైన సూర్యమండల గమనం నాకు ఇష్టం. అక్కడ ఎలాంటి భయంలేనిచిత్తంతో నివసిస్తాను. ఎవరి వలనా

---

* త్యజ ధర్మమధర్మం చ ఉభే సత్యానృతే త్యజ ।
ఉభే సత్యానృతే త్యక్త్వా యేన త్యజసి తం త్యజ ॥ 44

ఎలాంటి పరాభవం అచట జరగదు. ఈ శరీరాన్ని సూర్యలోకంలో వదలి, బుఘులతో కలిసి, సూర్యుని దుస్సహమైన తేజస్సులో ప్రవేశిస్తాను. అందుకని నేను నగనాగాలను, పర్వతాలను, భూమిని, దిక్కులను, ద్యులోకాన్ని, దేవతలను, దానవులను, గంధర్వులను, పిశాచాలను, సర్పాలను, రాక్షసులను అనుమతి అడుగుతాను. ఈ రోజు నేను నిఃసందేహంగా జగత్తులోని సర్వభూతాలలో ప్రవేశిస్తాను. సమస్త దేవతలు, మహర్షులు నా యోగశక్తిని చూతురుగాక.' 'అలా నిశ్చయం చేసుకుని శుకుడు విశ్వవిఖ్యాతుడైన నారదుని అనుజ్ఞను అడిగాడు. ఆయన అనుమతి పొంది తండ్రివద్దకు వెళ్ళాడు. అక్కడ తండ్రికి నమస్కరించి, ప్రదక్షిణంచేసి, వెళ్ళటానికి అనుమతి కోరాడు. 'శుకుని మాటలు విన్న వ్యాస మహర్షి చాలా సంతోషించి వత్సా ! ఇవ్వేళ ఇక్కడే ఉండు. నిన్ను కన్నులార చూచుకొంటాను.' అన్నాడు. కాని శుకుడు మమకారాన్ని వదలివేసి, నిరపేక్షుడై, తత్త్వవిషయంలో సందేహరహితుడై, మోక్షాన్ని గురించే ఆలోచిస్తూ వెళ్ళటానికి నిశ్చయించుకొన్నాడు. తండ్రిని అక్కడే వదలి మునిశ్రేష్ఠుడైన శుకుడు సిద్ధసమూహం సేవించే విశాలమైన కైలాసశిఖరానికి బయలుదేరి వెళ్ళాడు."

332. శుకాభిపతనము.

భీష్ముడు చెపుతున్నాడు. "భరతవంశీయా ! కైలాస పర్వతశిఖరాన్ని ఎక్కిన వ్యాసపుత్రుడు ఏకాంతంలో గడ్డి కూడా లేని చదునైన చోట కూర్చున్నాడు. శాస్త్రానుసారం విధి పూర్వకంగా కాలినుండి తలదాకా ఉన్న అవయవాలలో క్రమంగా ఆత్మధారణ చేశాడు. జ్ఞాని అయిన శుకుడు సూర్యోదయం ఐనంతనే కాళ్ళు చేతులను ముడుచుకొని, వినీతభావంతో తూర్పుదిక్కువైపు ముఖం ఉంచి, కూర్చుని యోగస్థుడు అయినాడు. అప్పుడు అక్కడ పక్షి సమూహంలేదు. ఎలాంటి శబ్దంలేదు. చూపును ఆకర్షించే ఏ దృశ్యమూ లేదు. అప్పుడు ఆయన సర్వసంగ రహితమైన ఆత్మదర్శనం చేశాడు. ఆ పరతత్త్వదర్శనంతో ఆయన అట్టహాసం చేశాడు. ఆయన మళ్ళీ యోగస్థుడై మోక్ష మార్గ ప్రాప్తికోసం మహాయోగేశ్వరుడై ఆకాశంలోకి ఎగరటానికి సిద్ధం అయినాడు. తరువాత ఆ నారదమహర్షి వద్దకు వెళ్ళి, ఆయనకు ప్రదక్షిణం చేసి, తనయోగ విషయాన్ని ఇలా నివేదించాడు. శుకుడు "తపోధనా ! మీకు మేలు కలుగుగాక. నాకు మోక్షమార్గదర్శనం కలిగింది. మీదయతో నాకు కావలసిన గతిని పొందుతాను" అన్నాడు.

నారదుని ఆజ్ఞను పొంది, శుకుడు ఆయనకు నమస్కారం చేసి, యోగస్థుడై ఆకాశంలో ప్రవేశించాడు. కైలాస శిఖరం నుంచి పైకి ఎగిరి, వెంటనే ఆకాశంలోకి

వెళ్ళాడు. సునిశ్చితజ్ఞానంతో వాయురూపాన్ని ధరించి అంతరిక్షంలో శుకుడు విహరించసాగాడు. గరుత్మంతునితో సమానంగా కనిపిస్తూ పైకి వెళ్ళుతున్న ఆయన వాయువేగం గలిగి ఉండటం సమస్తప్రాణులు చూశాయి. నిశ్చయాత్మక బుద్ధితో ముల్లోకాలను ఆత్మ సమంగా చూస్తూ, చాలా దూరం ముందుకు వెళ్ళాడు. అప్పుడు ఆయన అగ్నితో, సూర్యునితో సమానంగా వెలుగుతున్నాడు. ఏకాగ్రమైన మనస్సుతో నిర్భీతుడై పైకి వెళ్ళేటప్పుడు, సమస్త చరాచరప్రాణులు ఆయనను యథాశక్తిగా, అప్పటికి తగినట్లు పూజించాయి. దేవతలు దివ్యమైన పుష్పవర్షం కురిపించారు. ఆయనను చూచి గంధర్వులు, అప్సరసలు, సిద్ధులు, మహర్షులు చాల ఆశ్చర్యపడ్డారు. 'తపస్సిద్ధుడైన ఈ మహాత్ముడు ఎవరో ఆకాశంలో వెళ్ళుతున్నాడే ! ఈయన ముఖం పైకి, శరీరంలోని తక్కిన భాగం కిందికి ఉన్నదే. బలవంతంగా మన చూపు ఈయన వైపు పోతున్నదే ! 'అని వారు తమలో అనుకొన్నారు. పరమధర్మాత్ముడుగా ముల్లోకాలలో ప్రసిద్ధుడైన శుకుడు తూర్పుకు అభిముఖంగా ముఖం ఉంచి, సూర్యుని చూస్తూ మౌనంగా ముందుకు సాగాడు. ఆకాశాన్ని అంతనూ నింపుతూ వస్తున్న ఆయనను చూసి, అప్సరసల సమూహాలు సంభ్రమించే మనస్సులతో ఆశ్చర్య పడినారు.

ఆశ్చర్యంతో సమధికంగా విశాలమైన కన్నులతో ఆయనను చూచి పంచచూడ మొదలైన అప్సరసలు ఇలా అనుకొన్నారు. 'ఉత్తమ గతిని ఆశ్రయించి ఈ వచ్చే దేవత ఎవరు ? ఈయన దృఢనిశ్చయుడుగా ఉన్నాడు. సర్వబంధవిముక్తుడు, సంశయరహితుడు అయినట్లున్నాడు. ఈయన మనస్సులో ఏకోరికా లేనట్లున్నది.' తరువాత ఆయన ఊర్వశి, పూర్వచిత్తి నిత్యం సేవించే మలయపర్వతం వైపు వెళ్ళాడు. **బ్రహ్మర్షి వ్యాసుని పుత్రుని ఈ ఉత్తమగతిని చూసి, వారు పరమాశ్చర్యాన్ని పొంది, తమలో ఇలా అనుకొన్నారు. 'ఆహా ! వేదాభ్యాసపరుడైన బ్రాహ్మణుని బుద్ధి ఎంత ఏకాగ్రంగా ఉన్నది ! పితృసేవ వలన కొద్దికాలంలోనే ఉత్తమజ్ఞానమందిన ఈయన, చంద్రుని లాగా ఆకాశంలో సంచరిస్తున్నాడు !** ఈయన పితృభక్తుడు, మహాతపస్వి, తండ్రికి ప్రేమ పాత్రుడైన పుత్రుడు. ఆయన మనస్సు ఎల్లప్పుడూ ఈ పుత్రుని మీదనే ఉంటుంది. అయినా ఈయనకు ఆజ్ఞఎలా ఇచ్చాడు ?' ఊర్వశి మాటలు విన్న పరమధర్మవేత్త శుకుడు అన్నిదిక్కులను చూచాడు. అప్పుడు ఆయన మనస్సు వారి మాటలవైపు మళ్ళింది. ఆయన అంతరిక్షాన్ని, సమస్తపర్వతాలు, వనాలు, కాననాలు, సరస్సులు, సరిత్తులతో గూడిన భూమిని అంతటిని చూచాడు. ఆ సమయంలో పైవాటికి అన్నింటికి అధిష్ఠానాలైన దేవతలు, అన్ని దిక్కుల నుండి వ్యాసపుత్రుడైన ఆయనకు నమస్కరిస్తూ చూశారు.

పరమ ధర్మవేత్తయైన శుకుడు 'దేవతలారా ! నా తండ్రి నన్ను పిలుస్తూ ఇటువస్తే, మీరంతా జాగ్రత్తగా నాబదులు సమాధానం ఇవ్వండి. నాపైన ప్రేమ ఉన్నవారు అందరూ నామాట అంగీకరించండి' అని అన్నాడు. ఆయన మాటలు విన్న అడవులు, అన్ని దిక్కులు, సముద్రాలు, నదులు, పర్వతాలు, వాటి అధిష్ఠాతృదేవతలు అన్ని వైపుల నుంచి ఇలా సమాధానం ఇచ్చారు. 'బ్రాహ్మణోత్తమా ! నీవు చెప్పినట్లే జరుగుతుంది. వ్యాసమహర్షి నిన్ను పిలిచినప్పుడు మేమందరం సమాధానం ఇస్తాం.'

333. శుకుని పరమ పదప్రాప్తి.

భీష్ముడు చెపుతున్నాడు. "యుధిష్ఠిరా ! ఈ మాట చెప్పి మహాతపస్వి శుకుడు సిద్ధి పొందగోరి ముందుకు వెళ్ళాడు. బుద్ధిమంతుడైన ఆయన నాలుగురకాల దోషాలను, ఎనిమిది విధాల తమోగుణాన్ని, ఐదురకాలైన రజోగుణాన్ని, వదలి సత్త్వగుణాన్ని కూడా వదిలాడు. ఇది ఒక అద్భుత విషయం. (సత్త్వగుణం గూడా సుఖజ్ఞాన సంబంధంతో బంధకమే అవుతుంది. 'నేను సుఖంగా ఉన్నాను.' అనే అభిమానం కలుగుతుంది. అది జ్ఞానిని గుణాతీత స్థితికి దూరం చేస్తుంది. కాబట్టి ఇక్కడ సత్త్వగుణత్యాగాన్ని కూడా చెప్పారు).* తరువాత ఆయన నిత్యం, నిర్గుణం, పుంలింగాది రహితం అయిన ఆ పరబ్రహ్మపదంలో ఉన్నాడు. అప్పుడు ఆయన పొగలేని అగ్నివలె దేదీప్యమానంగా ఉన్నాడు. ఆ క్షణంలో ఉల్కాపాతాలు కలిగాయి. దిక్కులలో మంటలు ఏర్పడ్డాయి. భూకంపం కలిగింది. ఇదంతా ఆశ్చర్యకరంగా జరిగింది. చెట్టు కొమ్మలను విరుచుకొన్నాయి. కొండలు శిఖరాలను విరగగొట్టుకొన్నాయి. వజ్రాయుధపు దెబ్బలతో హిమవంతం చీలిపోతున్న ట్లనిపించింది. సూర్యుడు ప్రకాశించలేదు. అగ్ని వెలుగలేదు. సరస్సులు, సరిత్తులు, సముద్రం అన్నీ క్షోభించాయి. ఇంద్రుడు, రసవంతం, సువాసనా పూరితమూ ఐన వర్షం కురిపించాడు. దివ్యమైన సువాసనతో, పవిత్రంగా గాలి వీచింది. ముందుకు వెళ్ళిన శుకుడు పర్వతం యొక్క దివ్య సుందరశిఖరాలు చూచాడు. అవి రెండూ కలిసి ఉన్నవి. వాటిల్లో హిమవత్పర్వత శిఖరం ఒకటి, రెండవదిమేరు పర్వత శిఖరం. హిమవత్ శిఖరం రజతమయం కావటంవల్ల తెల్లగా కన్పించింది. మేరుపర్వత శిఖరం స్వర్ణమయం కాబట్టి

---

* *విసం॥ సత్త్వగుణమందలి నాల్గుదోషాలు 1.పాపం, 2. కిల్బిషం, 3. సంసర్గం, 4. అనైశ్వర్యం. తమోగుణ దోషాలు అష్టవిధాలు.*

లోభం, ప్రవృత్తి, ఆరంభం, అశమం, స్పృహ అనే ఐదు రజోగుణం నుంచికలిగేవి అని భగవద్గీత. 14. అధ్యాయం. 12. శ్లోకం.

పచ్చగా ఉన్నది. ఈ రెండింటి పొడుగు వెడల్పు, ఎత్తు ఒక యోజనం ఉన్నది. ఉత్తరదిక్కు వెళ్ళుతున్న శుకుని దృష్టిలో ఇవి పడినవి. వాటిని చూసి, ఆయన నిస్సందేహమయిన మనస్సుతో పైకి వెళ్ళసాగాడు. వెంటనే ఆ రెండు పర్వత శృంగాలు రెండుగా చీలి పోయి, కన్పించాయి. అది చాలా అద్భుతం అనిపించింది. తరువాత ఆయన ఆ పర్వతశిఖరాలనుంచి త్వరగా బయటకువెళ్ళాడు. ఆయన గమనవేగాన్ని ఆ ఉత్తమ పర్వతం ఆటంకపరచలేదు. ఇది చూసి దేవతలు, ఋషులు, ఆ పర్వత వాసులు అందరూ చేసిన హర్షధ్వానాల మహాశబ్దం ఆకాశంలో నాలుగువైపులా ప్రతిధ్వనించింది. శుకుడు పర్వతం దాటి వెళ్ళడం, అది రెండు భాగాలుగా చీలటం చూసిన వారి సాధువాదాల (బాగుంది - బాగుంది అనే) ధ్వనులు అంతటా వినిపించాయి.

మహారాజా ! దేవతలు, గంధర్వులు, ఋషులు, యక్ష రాక్షస సమూహాలు, విద్యాధరగణాలు ఆయనను పూజించారు. అంతరిక్షం అంతా అప్పుడు దివ్యపుష్పాలతో నిండిపోయింది. తరువాత పైనుంచి వెళ్ళుతూ, ధర్మాత్ముడైన శుకుడు పూచిన చెట్లుగల వనాలతో చక్కగా ఉన్న మందాకినిని (ఆకాశ గంగను) చూశాడు. అప్పుడు చాలామంది అప్సరసలు అందులో జలకాలాడుతూన్నారు. వారు అప్పుడు దిగంబరంగా ఉన్నారు. దిగంబరంగా ఉన్న శుకుని చూశారు. అయినా వస్త్రధారణ చేయలేదు. ఆయన ఈ రీతిగా ఉత్క్రమణం చేస్తున్నాడని ఎరిగి, తండ్రి వ్యాసుడు పుత్ర స్నేహంతో ఉత్తమగతిని ఆశ్రయించి, వెంటవెళ్ళ సాగాడు. శుకుడు వాయువుతో ఆకాశంలోకివెళ్ళే ఊర్ధ్వగతిని ఆశ్రయించి, తన ప్రభావంచూపి బ్రహ్మీభూతుడు అయినాడు.

మహాతపస్వి అయిన వ్యాసుడు మహాయోగ గతితో బయలుదేరి, ఒక్క క్షణంలో వెళ్ళి, శుకుడు పర్వతశిఖరాలను రెండుగా చేసి వెళ్ళిన ప్రదేశానికి చేరి, ఆ ప్రదేశం చూశాడు. అక్కడి ఋషులు కుమారుని అలౌకికకార్యాన్ని వ్యాసునికి చెప్పారు. అప్పుడు వ్యాసుడు 'శుకా !' అని పెద్ద స్వరంతో దుఃఖించాడు. ముల్లోకాల్లో ప్రతిధ్వనించేటట్లున్న తండ్రి కేకవిని సర్వవ్యాపి, సర్వాత్ముడు, సర్వతోముఖుడైన శుకుడు జగత్తును ప్రతిధ్వనింపజేస్తూ "భోఃఁ" (ఓం) అని సమాధానం ఇచ్చాడు. దానితోనే సంపూర్ణమైన చరాచరజగత్తు అంతా ఉచ్చైఃస్వరంతో 'భోఃఁ' (ఓం) అని ఏకాక్షరనాదం చేసింది. అప్పటి నుంచి ఇప్పటివరకూ కొండ కొమ్ముల దగ్గరగాని, గుహల దగ్గరగాని కేకవేస్తే, అక్కడి చరాచర ప్రాణులు ప్రతిధ్వనిగా శుకుని వలెనే సమాధానం ఇస్తాయి. ఈ రీతిగా శుకుడు తనప్రభావం చూపి, అంతర్ధానమై శబ్దాదిగుణాలను పరిత్యజించి, పరమపదాన్ని చేరాడు.

మహాతేజస్వి అయిన పుత్రుని ఆ మహిమను చూసి, వ్యాసమహర్షి పుత్రుని

గురించే ధ్యానిస్తూ, ఆ పర్వత శిఖరం మీద కూర్చున్నాడు. అప్పుడు మందాకినీ తీరంలో క్రీడిస్తున్న అప్సరసలు అందరూ తమ సమీపంలో వ్యాసుడు ఉండటం చూసి, గాబరాపడి, కొయ్యబారి పోయినారు. కొంతమంది నీళ్ళల్లో మునిగారు. ఇంకాకొంతమంది పొదలచాటుకు వెళ్ళారు. మరికొంతమంది ఆ మునిశ్రేష్ఠుని చూసి తమ వస్త్రాలు ధరించారు. అప్పుడు పుత్రుని ముక్తస్థితిని తెలుసుకొని ముని సంతోషించాడు. తన ఆసక్తికి సిగ్గు పడ్డాడు. అప్పుడు దేవతలు, గంధర్వులు చుట్టూ ఉండగా, మహర్షి సమూహంచేసే పూజలు అందుకొంటూ, పినాకహస్తుడైన భగవానుడు శంకరుడు అక్కడికి వచ్చి, పుత్రశోకంతో తపిస్తున్న కృష్ణద్వైపాయనుని ఓదారుస్తూ ఇలా అన్నాడు. 'మహర్షీ ! పూర్వం నీవు అగ్ని, భూమి, నీరు, గాలి, ఆకాశాలతో సమానమైన శక్తిశాలి పుత్రుడు కలగాలి అని నా నుండి వరం పొందావు. కాబట్టి నీకు నీతపః ప్రభావంతో, నా అనుగ్రహంతో గూడి బ్రహ్మతేజస్సుగలిగి పరమ పవిత్రుడైన పుత్రుడు కలిగాడు. బ్రహ్మర్షీ ! ఇంద్రియజయంలేని దేవతలకుకూడా పొంద వీలు గాని ఉత్తమ గతిని అతడు పొందాడు. అలాంటి వాడికోసం నీవు ఎందుకు దుఃఖిస్తావు ? **ఈ లోకంలో పర్వతాలు, సముద్రాలు, ఉన్నంత కాలం పుత్రునితో గూడా నీ కీర్తి శాశ్వతంగా ఉంటుంది.** మహామునీ ! నా ప్రసాదం వల్ల నీవు నీపుత్రుని లాంటి ఛాయను చూస్తుంటావు. ఆ ఛాయ అన్ని వైపులా కన్పిస్తుంది. ఎప్పుడూ అది నీచూపుకు దూరంకాదు.' భరతనందనా ! ఈ రీతిగా పరమేశ్వరుడు స్వయంగా వ్యాసుని ఓదార్చాడు. ఆ ముని తన కుమారుని ఛాయచూస్తూ, చాలా సంతోషంతో తన ఆశ్రమానికి తిరిగి వెళ్ళాడు. యుధిష్ఠిరా ! ఇంతకుముందు అడిగిన దానికి సమాధానంగా ఆ శుకుని జన్మ, పరమ పదప్రాప్తి వృత్తాంతాన్ని నీకు విస్తారంగా వినిపించాను. రాజా ! దీన్నంతా పూర్వం దేవర్షి నారదుడు నాకు చెప్పాడు. మహాయోగివ్యాసుడు కూడా ఆ యా ప్రసంగాలలో అడుగడుగునా ఈ విషయం చాలా సార్లు చెప్పాడు. మోక్షధర్మంతో గూడిన ఈ పరమ పవిత్రమైన ఇతి హాసాన్ని విని, చదివి, హృదయంలో నిలుపుకొన్నా శాంతుడై పరమగతిని - మోక్షాన్ని పొందుతాడు."

334. నారాయణీయము - పరమాత్మ సర్వ పూజనీయత.

యుధిష్ఠిరుడు అడిగాడు. "పితామహా ! గృహస్థు, బ్రహ్మచారి, వానప్రస్థుడు, సంన్యాసి అనే నాలుగు ఆశ్రమాల వారిలో ఎవరైనా సిద్ధిని పొందా లనుకొంటే ఏ దేవతను పూజించాలి ? మానవునికి అక్షయమైన స్వర్గప్రాప్తి ఎలా కలుగుతుంది ? పరమమైన నిఃశ్రేయం ఎలా కలుగుతుంది ? ఏ విధి విధానంతో దేవతలను గూర్చి, పితరులను గూర్చి

హోమం చేయాలి ? ముక్తపురుషుడు ఏ గతిని పొందుతాడు ? మోక్షస్వరూపం ఏమిటి ? స్వర్గానికి వెళ్ళినవాడు ఏమి చేయాలి ? ఏం చేస్తే అతడు స్వర్గం నుంచి క్రిందికి రాకుండా ఉంటాడు? దేవతలకు దేవత, పితరులకు పిత ఎవరు ? అంతకంటే శ్రేష్ఠమైన తత్త్వం ఏమిటి ? పితామహా ! ఈ నా ప్రశ్నలకు సమాధానం చెప్పవలసింది." భీష్ముడు చెపుతున్నాడు. "అనఘా ! చాలా రహస్యమైన విషయాన్ని గూర్చి మంచి ప్రశ్నలు వేశావు. రాజా ! భగవదనుగ్రహం గాని, జ్ఞానప్రధానమైన శాస్త్రం గాని లేకుండా, అనేక సంవత్సరాలు కేవలం తర్కించటంవలన ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పటం కష్టం అవుతుంది. ఈ విషయం తెలియజెప్పటం - తెలుసుకోవటం చాల కష్టం. అయినా నీకు వివరిస్తాను. ఈ విషయంలో తెలిసిన వారు నారద నారాయణ ఋషిసంవాదమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తారు.

నా తండ్రి శంతనుడు నాకు ఈ విషయం చెప్పాడు. శ్రీమన్నారాయణుడు సమస్త జగత్తుకు ఆత్మ, నాలుగు మూర్తులు కలవాడు, సనాతనుడైన దైవం ఆయనే ఒకప్పుడు ధర్మదేవతకు పుత్రరూపంలో అవతరించాడు. మహారాజా ! వాసుదేవుడు స్వాయంభువమన్వంతరంలోని కృతయుగంలో వాసుదేవుడు నరుడు, నారాయణుడు, హరి, కృష్ణుడు అని నాలుగు రూపాలుగా అవతరించాడు. వారిలో వినాశ రహితులైన నారాయణనరులు బదరికాశ్రమానికి వెళ్ళి, బంగారు రథం మీద ఉండి, ఘోరతపస్సు చేశారు. మనోహరమైన వారి ఆ రథానికి ఎనిమిది చక్రాలు ఉన్నాయి. దానిలో అనేక ప్రాణులు ఉన్నాయి. లోకేశ్వరులైన ఆ ఆదిపురుషులు నిరంతరం తపస్సు చేయటం వలన చాల చిక్కిపోయారు. వారి శరీరాలలో నరాలు కన్పించసాగాయి. మహాతపస్సువలన వారి తేజస్సు సమధికం అయింది. దేవతలు కూడా తేరిపారజూడ వీలులేనంతగా వారి తేజస్సు ఉంది. వారి అనుగ్రహంగల దేవశ్రేష్ఠులే వారిని దర్శించగలుగుతారు. వారిద్దరి ఇచ్ఛానుసారం, తన హృదయంలో ఉన్న పరమాత్మ ప్రేరణ వల్లనే దేవర్షి నారదుడు మహామేరు పర్వతశృంగం నుంచి గంధమాదన పర్వతం మీద దిగాడు. నారదుడు అన్ని లోకాలలో సంచరిస్తుంటాడు. అందువల్ల శీఘ్రంగా వెళ్ళగల ఆయన, అనేక ప్రాణులనివాసమైన బదరికా శ్రమానికి వచ్చాడు. నరనారాయణులను, నిత్యం వారు చేసే కర్మానుష్ఠాన సమయంలో దర్శించాలని ఆసక్తి నారదునికి గలిగింది. ఆయన మనస్సులో ఇలా ఆలోచించాడు. ఆహా ! దేవతలు, అసురులు, గంధర్వులు, కింనరులు, మహానాగులతో గూడి సర్వలోకనివాసమైన ఇదే గదా భగవంతుని సంనిధానం! పూర్వం ఒకటిగానే ఉన్న మూర్తి, ధర్మవంశాన్ని విస్తరింపజేయటానికి నాలుగు రూపాలలో అవతరించాడు. ఈ

నలుగురు తాము సంపాదించిన ధర్మంతో ధర్మదేవత వంశపరంపరను పెంపొందింపజేశారు. ఈ సమయంలో ఈ నలుగురు దేవతలు నరుడు నారాయణుడు, కృష్ణుడు, హరి అనే వారు ధర్మదేవతను అనుగ్రహించారు. ఈ నలుగురిలో కృష్ణుడు, హరి అనే వారు ఇద్దరు ఇతర కార్యంలో ఉన్నారు. కాని నరనారాయణులు అనే ఇద్దరు ధర్మమే ప్రధానం అని భావించి తపోమగ్ను లయ్యారు. వీరు ఇద్దరే పరమధామ స్వరూపులు. వీరు నిత్యం చేసే కర్మలు ఏమిటి ? యశస్వులయిన ఈ ఇద్దరు దేవతలు సమస్త ప్రాణులకు తండ్రులు, దేవతలు, పరమమేధావులు. ఏ దేవతను గూర్చి యజిస్తున్నారు ? ఏ పితరులను పూజిస్తున్నారు ?' అని ఆలోచించి, నారదుడు నారాయణభక్తి ప్రేరితుడై త్వరగా ఆ ద్వైవాల ఎదుట నిలిచాడు. నరనారాయణులు దేవపితరుల పూజను పూర్తిచేసిన తరువాత ఆ నారదుని చూసి, శాస్త్రవిధితో పూజించారు. వారు శాస్త్రానుసారం అపూర్వంగా, విధివిస్తారంగా, ఆశ్చర్యకరంగా, ప్రవర్తించటం చూచి, వారికి దగ్గరలోనే కూర్చున్న నారదుడు చాలా సంతోషించాడు. ప్రసన్నచిత్తంతో మహాదేవుడైన నారాయణుని చూసి, నమస్కరించి, ఇలా అన్నాడు.

"దేవా ! అంగాలతో, ఉపాంగాలతో గూడిన సంపూర్ణవేదాలలో, పురాణాలలో నీ మహిమ స్తోత్రపాత్రం అవుతున్నది. జననం లేని సనాతనుడవు, అందరి మాతా పితరులు, సర్వోత్తమమైన అమృత స్వరూపుడవు నీవే. భూత భవిష్య ద్వర్తమాన కాలాల్లోని ఈ జగత్తు అంతా నీలోనే ప్రతిష్ఠితమయిఉన్నది. గృహస్థాశ్రమ మూలకమైన నాలుగు ఆశ్రమాల వారు నానారూపాలలో ఉండి నిన్ను ప్రతిదినం పూజిస్తున్నారు. నీవు ఈ జగత్తుకు అంతకు తల్లి, తండ్రి, సనాతనమైన ఆచార్యుడవు. అయినా ఈ రోజు ఏ దేవతలను, ఏ పితరులను పూజిస్తున్నావో నాకు తెలియటం లేదు. అందువల్ల అడుగుతున్నాను. ఎవరిని నీవు పూజిస్తున్నావు ?" శ్రీ భగవానుడు పలికాడు. "దేవర్షి ! నీవడిగిన విషయం నాలోనే దాచుకోవలసింది. ఈ సనాతన రహస్యం ఎవరికీ చెప్పదగదు. అయినా నీ వంటి భక్తునికి తప్పక చెప్పాలి. కాబట్టి దీన్ని యథాతథంగా చెపుతాను. సూక్ష్మం, అజ్ఞేయం, అవ్యక్తం, అచలం ధ్రువం అయినదీ, ఇంద్రియాలకు, ఇంద్రియ విషయాలకు, సర్వభూతాలకు అతీతమైన సర్వప్రాణులకు అంతరాత్మ ఐనదానినే క్షేత్రజ్ఞుడు అనీ, త్రిగుణాతీతం, పురుషుడు అని చెపుతారు. దానినుంచే త్రిగుణమయమయిన అవ్యక్తం ఉత్పన్నం అయింది. ద్విజశ్రేష్ఠ ! దానినే వ్యక్తభావస్థితం, వినాశరహితం అయిన అవ్యక్తప్రకృతి అన్నారు. సదసదాత్మకమైన పరమాత్మయే మా ఉత్పత్తికి కారణమని తెలుసుకో. ఆ పరమాత్మనే మేము పూజిస్తున్నాము. దేవతగా, పితరులుగా భావిస్తున్నాము. ఆయనకంటె ఇతరమైన

దేవతలు గాని, పితరులు గాని లేరు, ఆయనయే మాకు ఆత్మ అని తెలుసుకోవాలి. అందువల్లనే మేము ఆయనను పూజిస్తున్నాం. ఆయనయే లోకాన్ని సమున్నత పథంలో ప్రవర్తింపజేసే ఈ ధర్మమర్యాదను స్థాపించాడు. దేవతలను, పితరులను పూజించాలి అని ఆయన ఆజ్ఞయే !

బ్రహ్మ, రుద్రుడు, మనువు, దక్షుడు, భృగువు, ధర్ముడు, తపుడు, యముడు, మరీచి, అంగిరుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు, పరమేష్ఠి, సూర్యుడు, చంద్రుడు, కర్దముడు, క్రోధుడు, విక్రీతుడు అనే ఇరువది యొక్క మంది ప్రజాపతులు ఆయన నుండి ఉత్పన్ను లయినారని చెప్పారు. ఆ పరమాత్మ స్థాపించిన సనాతన ధర్మమర్యాదను పాలిస్తున్నారు, పూజిస్తున్నారు. ద్విజోత్తములు ఆయనను ఉద్దేశించి చేసే దైవపిత్కకర్మలను సరిగా తెలుసుకొని, తమకు ప్రాప్తించిన వాటిని పొందుతున్నారు. స్వర్గంలో ఉండే ప్రాణుల్లోని ఎవరైనా ఆ పరమాత్మకు నమస్కరించి, ఆయన అనుగ్రహంవలన ఆయన ఆజ్ఞానుసారం ఫలాన్ని ఇచ్చే ఉత్తమ గతిని పొందుతారు. ఐదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు, పంచప్రాణాలు, మనస్సు, బుద్ధి అనే పదిహేడు గుణాలతో, కర్మలతో రహితులై, పదునైదు కళలను వదలినవారు మాత్రమే ముక్తులు అని శాస్త్రనిర్ణయం. ముక్తులయిన వారికి గతి క్షేత్రజ్ఞ డయిన పరమాత్మ అని నిశ్చయించారు. ఆయనయే సర్వసద్గుణ సంపన్నుడనీ, నిర్గుణుడనీ చెపుతారు. ఆ జ్ఞాన యోగంతో ఆయన సాక్షాత్కారం కలుగుతుంది. మా ఇద్దరి ఆవిర్భావం ఆయననుంచి జరిగిందని తెలుసుకొని, మేము ఆ సనాతన పరమాత్మను పూజిస్తున్నాం. నాలుగు వేదాలు, నాలుగు ఆశ్రమాలు, నానావిధాలయిన మతాలను అవలంబించే వారు భక్తిపూర్వకంగా ఆయనను పూజిస్తారు. ఆయన వీరికి అందరికి సత్వరంగా ఉత్తమ గతిని ఇస్తాడు. నిరంతరం ఆయనను స్మరించేవారు అనన్యభావంతో శరణు పొందేవారు, ఆయన స్వరూపంలో లీనం కావటం అనే ఉత్తమగతిని పొందుతారు. బ్రహ్మర్షీ ! నారదా ! నీకు భగవంతుని యందు భక్తి, ప్రేమ ఉన్నవి. మాయందు కూడా నీకు భక్తి ఉన్నది. అందువల్ల మేము ఈ రహస్య విషయాన్ని వినిపించాం. దీనిని వినే ఉత్తమావకాశం నీకు లభించింది."

335. నారాయణీయము - శ్వేత ద్వీపము.

భీష్ముడు చెపుతున్నాడు. "యుధిష్ఠిరా ! పురుషోత్తముడైన నారాయణుడు ఇలా పురుషశ్రేష్ఠుడైన నారదుడికి చెప్పాడు. అప్పుడు ఆయన లోకహితానికి ఆశ్రయమూ, పురుషాగ్రణి అయిన నారాయణునితో ఇలా అన్నాడు. 'దేవా ! నీవు సమస్త పదార్థాల

ఉత్పత్తికి కారణభూతుడవు. ధర్మదేవత గృహంలో నీవు నాలుగురూపాలతో అవతరించటానికి గల ప్రయోజనాన్ని, లోకహితం సిద్ధికరం చేయవలసింది. నీ ఆదిస్వరూపాన్ని చూడటానికి వెళ్ళుతున్నాను. నేను గురువులను పూజిస్తున్నాను. ఇంతకు ముందు ఎప్పుడూ ఎలాంటి రహస్య విషయాన్ని ఇతరుల ఎదుట వ్యక్తం చేయలేదు. వేదాధ్యయనం చేశాను. తపస్సు చేశాను. ఎప్పుడూ అసత్యం చెప్పలేదు. శాస్త్రోక్తిని అనుసరించి కాళ్ళు, చేతులు, ఉదరం, ఉపస్థ అనే నాల్గింటిని రక్షించుకొన్నాను. శత్రుమిత్రుల యందు సమానంగా మెలిగాను. ఆదిదేవుడు, పరమాత్మ అయిన శ్రీ నారాయణుని నిరంతరం శరణంది అనన్య భావంతో ఎల్లప్పుడు ఆయననే భజిస్తున్నాను. ఈ విశేషాలవల్ల నా అంతఃకరణం శుద్ధం అయింది. ఈ స్థితిలో ఆ అనంత పరమేశ్వరుని ఎందుకని దర్శించలేకపోతున్నాను ?" నారదుని ఆ మాటలు విని, సనాతనధర్మరక్షకు డయిన నారాయణమహర్షి ఆయనను శాస్త్రానుసారం పూజించి, వెళ్లటానికి ఆజ్ఞ ఇచ్చాడు. ఆయన అనుమతి పొంది, నారదుడు ఆయనను పూజించి, ఉత్తమ యోగయుక్తుడై ఆకాశంలోకి వెళ్ళి, మేరుపర్వతం చేరి, అదృశ్యమైనాడు.

మేరుపర్వతశిఖరంమీద ఏకాంత స్థానంలో చేరి, నారదుడు రెండుగడియలపాటు విశ్రమించాడు. అక్కడినుండి ఉత్తర పశ్చిమంవైపు-వాయవ్యదిక్కువైపు చూపుపెట్టి ఆయన పూర్వం చెప్పిన రీతిగా ఒక అద్భుత దృశ్యం చూశాడు. పాలసముద్రంలో ఉత్తరభాగంలో ఉన్న శ్వేతద్వీపం ఆయన కన్నులముందు కన్పించింది. ఆ ద్వీపం మేరుపర్వతం కంటె ముప్పది రెండు యోజనాలపైన ఉన్నది అని విద్వాంసులు చెపుతారు. అక్కడివారు ఇంద్రియరహితులు, నిరాహారులు, ఎలాంటిచేష్టలు లేనివారు, జ్ఞాన సంపన్నులుగా ఉన్నారు. ఆ ద్వీపంలో సర్వపాపరహితులు, ధవళవర్ణులైన పురుషులు ఉంటారు. వారి వైపు చూస్తే పాపాత్ముల కన్నులు జిగేల్‌మంటాయి. వారి శరీరం, ఎముకలు వజ్రంవలె దృఢంగా ఉంటాయి. వారుమానావమానాలలో సములు. వారి అంగాలు దివ్యాలు. యోగప్రచారంతో బలిష్ఠాలు. వారి శిరస్సులు గొడుగులవలె ఉంటాయి. వారి కంఠస్వరాలు మేఘగర్జన లాగా గంభీరంగా ఉంటాయి. ప్రతి ఒక్కరికి నాలుగు చేతులు ఉంటాయి. వారి అరికాళ్ళ వేల పద్మాలవలె రేఖలు గలిగిఉంటాయి. వారినోటిలో అరవై తెల్ల పండ్లు, ఎనిమిది కొరుకుడుపండ్లు ఉంటాయి. సూర్యతుల్య కాంతిమంతులైన వారు సర్వప్రపంచాన్ని నోట బట్టే మహాకాలుని కూడా నాలుకలతో నాకుతారు. సర్వప్రపంచోత్పత్తికిహేతువు; సర్వలోకావిష్కర్త; వేదాలను, ధర్మమును, శాంతస్వభావులైన మునులను, సర్వదేవతలను సృష్టించినవాడు, అనంత శక్తి సంపన్నుడు అయిన పరమేశ్వరుని, శ్వేత ద్వీపనివాసులు భక్తితో తమ హృదయాలలో నిలుపుకొంటారు."

ధర్మరాజు అడిగాడు. "పితామహా ! శ్వేతద్వీపనివాసులు ఇంద్రియాలు, ఆహారం, చేష్టలు లేకుండా ఎలా ఉంటారు ? వారి శరీరాల నుంచి సుగంధం రావటానికి కారణం ఏమిటి ? వారు ఎలా జన్మించారు ? వారికి ఎలాంటి ఉత్తమగతి కలుగుతుంది ? భరతవంశశ్రేష్ఠా ! ఈలోకంలో ముక్తపురుషులకు శాస్త్రాలు చెప్పిన లక్షణాలే నీవు శ్వేత ద్వీపనివాసులకు ఉన్నాయని చెప్పావు. అందువల్ల నాకు సందేహం కలుగుతున్నది. కాబట్టి నాసంశయం తీర్చు. ఈ విషయం తెలుసుకోవాలని నాకు కుతూహలం కలుగుతున్నది. జ్ఞానమయమైన సమస్తకథారసాన్ని గ్రహించే నీవే నాకు శరణ్యం." భీష్ముడు చెపుతున్నాడు. "రాజా ! ఈ కథ చాలా విస్తారమైనది. దీన్ని నా తండ్రి నుండి విన్నాను. ఇప్పుడు నేను నీకు చెప్పే ఈ కథ ఆ కథాసారం అని నా ఉద్దేశ్యం.

పూర్వం మా తండ్రి శంతనుమహారాజు అడుగగా మునిశ్రేష్ఠుడైన నారదుడు ఆయనకు చెపుతుండగా నేను విన్నాను.

పూర్వకాలంలో ఉపరిచరుడు అనే రాజు ఉండేవాడు. ఆయన ఇంద్రునికి మిత్రుడు. పాపాలు పోగొట్టే నారాయణ భక్తు డా ప్రఖ్యాతుడు. ఆయన ధర్మాత్ముడు, పితృభక్తుడు. ఎలాంటి సోమరితనం లేనివాడు. పూర్వం నారాయణుని వరం వలన ఆయనకు రాజ్యం సంప్రాప్తం అయినది. మొదట సూర్యదేవుని నుండి వ్యక్తమైన వైష్ణవ శాస్త్రోక్తమైన విధిని అనుసరించి, ఆయన పూర్వం శ్రీమన్నారాయణుని పూజించేవాడు. ఆ తరువాత మిగిలిన పదార్థాలతో పితృదేవతలను, తరువాత మిగిలిన పదార్థాలతో బ్రాహ్మణులను, ఇతరులైన ఆశ్రితులను తగినరీతిగా సంతుష్టి పరిచేవాడు. ఆ తరువాత మిగిలిన ఆహారాన్ని స్వీకరించేవాడు. సత్యతత్పరుడై ఉండి, ఇతర ప్రాణిని దేన్నీ హింసించేవాడు కాదు. ఆది మధ్యాంతరహితుడు, అవినాశి, లోకకర్త అయిన జనార్దనుని సేవలో పూర్తిగా లీనమై ఉండేవాడు. శ్రీమన్నారాయణుని యందు భక్తితత్పరుడు, శత్రునాశకుడు అయిన ఆయనను దేవేంద్రుడు, స్వయంగా తన శయ్య మీద (పక్క మీద) కూర్చో పెట్టుకొనేవాడు. ఆ రాజు తనరాజ్యాన్ని, ధనాన్ని, భార్య, వాహనాలు, సమస్తమూ భగవంతునివే అని ఆ దేవునికి సమర్పించేవాడు. ఆయన జాగరూకుడై సకామాలు, నిష్కామాలు అయిన అన్ని యజ్ఞాల క్రియాకలాపాలను, సాత్వత శాస్త్రానుసారం నిర్వహిస్తుండేవాడు. ఆ మహాత్ముడైన రాజు నివాసంలో, పాంచరాత్ర శాస్త్రంలో శ్రేష్ఠులైన విద్వాంసులు ఎల్లప్పుడూ ఉండేవారు. భగవంతునికి సమర్పించిన ప్రసాదాదులను వారే ముందుగా స్వీకరించేవారు. శత్రుసంహారకుడైన ఆయన ధర్మానుసారం రాజ్యం చేస్తూ ఏనాడూ అబద్ధం చెప్పలేదు. మనస్సు దురాలోచనలు చేయలేదు. శరీరంతో స్వల్పపాపం కూడా చేయలేదు.

(తంత్రం, స్మృతి, ఆగమం ఎలా ఆవిర్భవించాయో చెపుతాను, విను). మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, మహాతేజస్వి వసిష్ఠుడు అనే ఏడుగురు, ప్రసిద్ధఋషులను చిత్రశిఖండులు అని వ్యవహరిస్తారు. వీరు అందరూ మేరుపర్వతం మీద ఉండి ఐక్యంగా నిర్మించినదీ. నాలుగు వేదాల వలె ప్రమాణమైనదీ, వారు సప్తముఖాలతో చెప్పినదీ ఉత్తమమైన లోకధర్మానికి వ్యాఖ్యానమే. ఈ ఏడుగురు ఋషులు ప్రకృతి యొక్క సప్తరూపాలు. అంటే ప్రజాసృష్టి చేసినవారు. ఎనిమిదవవాడు బ్రహ్మ. వీరు అందరు కలిసి జగత్తును అంతను ధరిస్తున్నారు. వీరి ద్వారానే శాస్త్రం ఏర్పడినది. వీరు అందరూ ఏకాగ్రచిత్తులు, జితేంద్రియులు, సంయమం గలవారు, భూతభవిష్య ద్వర్తమానాలు తెలిసినవారు, సత్యధర్మ తత్పరులు. వీరు చక్కగా ఆలోచించి 'ఈ సాధనంతో లోకానికి, మేలే జరుగుతుంది. దీనివల్ల పరమాత్మ ప్రాప్తి కలుగుతుంది, దీనివల్ల లోకానికి సర్వోత్తమమైన మేలు జరుగుతుంది' అని నిశ్చయించి ఈ శాస్త్రాన్ని రచించారు. వాటిల్లో మొదట ధర్మార్థ కామాలను, తరువాత మోక్షాన్ని, అలాగే స్వర్గ మానవలోకాలలో ఆచరణలో ఉండే మర్యాదలను ప్రతిపాదించారు. వారు అందరు శ్రీమన్నారాయణుని వేయి దివ్యసంవత్సరాలు ఇతర ఋషులతో కలిసి ఆరాధించారు. అప్పుడు శ్రీమన్నారాయణుని ఆజ్ఞానుసారం సరస్వతీదేవి లోకాలకు మేలు కలుగటానికి వారిని ఆవేశించింది. అప్పుడు తపస్సులైన ఆ బ్రాహ్మణులు శబ్దార్థ హేతువులతో గూడిన వాక్కును ప్రవర్తింపజేశారు. అది వారి మొదటి రచన. ఆ శాస్త్రానికి మొదట ఓంకారం ప్రయుక్తమైంది. వారు మొట్టమొదట ఆ శాస్త్రాన్ని వినిపించిన చోట కరుణామయుడైన భగవానుడు ఉన్నాడు. అనంతరం అనిర్వచనీయ శరీరంలో ఉన్న పురుషోత్తముడు ప్రసన్నుడై, అదృశ్యుడుగా ఉండి, ఆ ఋషులకు ఇలా చెప్పాడు.

"మహర్షులారా ! మీరు లక్షశ్లోకాలు గల ఈ ఉత్తమ శాస్త్రాన్ని నిర్మించారు. దీనివల్ల లోకవ్యవహారానికి కావలసిన ధర్మం అంతా ప్రచలితమవుతుంది. లోక ప్రవృత్తిలో, మోక్షవిషయంలో ఇది ఋగ్యజు స్సామాథర్వవేద మంత్రాలు గల గ్రంథంతో సమానంగా ప్రమాణం అవుతుంది. నా అనుగ్రహంవల్ల కలిగిన బ్రహ్మ, క్రోధ సంజాతుడైన రుద్రుడు, ప్రజాపతులైన మీరు, సూర్యచంద్ర, వాయు భూమి, జల, అగ్నులు, సమస్త నక్షత్రాలు, భూతనామకాలైన పదార్థాలు, బ్రహ్మవాదులైన ఋషుల సమూహాలు తమ తమ అధికారానుసారం ప్రవర్తిస్తూ ప్రమాణం అయినట్లు, ఈ ఉత్తమ శాస్త్రం కూడా ప్రమాణంగా అంగీకరించాలి. ఈ గ్రంథానుసారమే స్వాయంభువ మనువు ధర్మాలను చెపుతాడు.

తరువాత ఆవిర్భవించే శుక్రాచార్యుడు, బృహస్పతికూడా మీ బుద్ధులనుంచి ఉద్భవించిన ఈ శాస్త్రాన్నే చెపుతారు. ద్విజశ్రేష్ఠులారా ! స్వాయంభువ మను ధర్మశాస్త్రం, శుక్రాచార్య బృహస్పతి సిద్ధాంతాలు లోకంలో ప్రచారం అయినప్పుడు నరపాలుడైన వసువు (ఉపరిచర వసువు) బృహస్పతి వలన మీరు రచించిన ఈ శాస్త్రాన్ని అధ్యయనం చేస్తాడు. సజ్జనపూజితుడైన ఆ రాజు నా భక్తముఖ్యుడు అవుతాడు. లోకంలో ఈ శాస్త్రానుసారం సమస్తక్రియలు చేస్తాడు. మీరు నిర్మించిన ఈ శాస్త్రం సర్వ శాస్త్రశ్రేష్ఠం అవుతుంది. ఇది ధర్మశాస్త్ర, అర్థశాస్త్రమయం, ఉత్తమ రహస్యమయమూ అవుతుంది. దీన్ని ప్రవర్తింపజేయటం వలన మీరు సంతాన వంతులు అవుతారు. మీ సంతానం ప్రవృద్ధం అవుతుంది. ఆ వసురాజు రాజ్యలక్ష్మీ సమన్వితుడు, సుప్రసిద్ధుడు అవుతాడు. ఆ రాజు దివంగతుడు అయిన తరువాత ఈ సనాతన శాస్త్రం అంతర్ధానం అవుతుంది. సామాన్య దృష్టినుంచి తొలగుతుంది. విషయం అంతా మీకు ఇప్పుడే చెప్పాను."

ఇదంతా చెప్పి, ఆ పురుషోత్తముడు ఆ సమస్త ఋషులను అక్కడే వదలి, అంతర్ధానమై ఏదో దిక్కుకు వెళ్ళాడు. తర్వాత సమస్తలోకాలకు మేలును ఆలోచించే లోకపితరులైన ప్రజాపతులు ధర్మ మూలమూ, సనాతనమూ అయిన శాస్త్రాన్ని లోకంలో ప్రచారం చేశారు. ఆదికల్పంలోని మొదటి యుగంలో ఉద్భవించిన బృహస్పతి సాంగాలైన వేదాలు, ఉపనిషత్తులతో గూడిన ఆ శాస్త్రాన్ని వారివద్ద అధ్యయనం చేశాడు. ఆ తరువాత సమస్త ధర్మప్రచారకులు, సమస్తలోకాలను ధర్మమర్యాదలో ఉంచే ఆ ఋషిగణం తపస్సు చేయ నిశ్చయించుకొని, తమకు ఇష్టమైన చోటికి వెళ్ళారు."

336. *ఉపరిచరవసు వృత్తాంతము - శ్వేతద్వీప భగవన్మహిమవర్ణనము.

భీష్ముడు చెపుతున్నాడు. "యుధిష్ఠిరా ! తరువాత గడచిపోయిన మహాకల్పారంభంలో అంగిరసునికి పుత్రుడుగా జన్మించి, బృహస్పతి పురోహితుడు కావటంచేత దేవతలు సంతోషించారు. బృహత్తు, బ్రహ్మ, మహత్తు అనే ఈ మూడు శబ్దాలు ఒకే అర్థాన్ని చెప్పే శబ్దాలు. ఈ మూడు గుణాలు దేవపురోహితుని పేరులో ఉన్నవి. అందువల్ల ఆయనను విద్వాంసులు 'బృహస్పతి' అని వ్యవహరించారు. ఆయన శ్రేష్ఠ శిష్యుడైన ఉపరిచరవసువు, చిత్రశిఖండుల వలన ఏర్పడిన తంత్రశాస్త్రాన్ని యథావిధిగా అధ్యయనం చేశాడు. వసురాజు దైవానుగ్రహం వలన గలిగిన రాజ్యాన్ని ఇంద్రుడు స్వర్గాన్ని పాలించినట్లు

* *॥ ఉపరిచర వసువృత్తాంతం ఆది పర్వం 63 అధ్యాయంలో ఉన్నది.*

పరిపాలించాడు. ఒకప్పుడు ఆ రాజు మహత్తరమైన అశ్వమేధయాగాన్ని చేశాడు. అందులో ఆయనకు బృహస్పతి *హోతృస్థానాన్ని అలంకరించాడు. **వీకతుడు, ద్వితుడు, త్రితుడు అనే ముగ్గురు మహర్షులు ప్రజాపతి పుత్రులు ఆ యాగంలో సదస్యులు అయినారు. వీరే కాక ధనుషుడు, రైభ్యుడు. అర్వావసువు, పరావసువు, మేధాతిథి, తాండ్యుడు, శాంతిముని, వేదశిరుడు, శాలిహోత్రుని తండ్రి కపిలుడు, ఆద్యకఠుడు, వైశంపాయనుని అన్న తైత్తిరి, కణ్వుడు దేవహోత్రుడు అనే పదముగ్గురు, మొత్తం పదునార్వురు సదస్యులు ఉన్నారు.*** రాజా ! ఆ మహాయజ్ఞంలో సర్వ సంభారాలు సమకూడినవి. కాని అందులో ఎలాంటి పశువధ జరుగలేదు. ఈ భావంతోనే రాజు ఆ యజ్ఞంలో ఉన్నాడు. ఆ రాజు అహింసాపరుడు, పవిత్రుడు, ఉదారుడు, నిష్కాముడు అయి ఆ యజ్ఞకార్యంలో ప్రవర్తించాడు. అరణ్యంలో దొరికే కందమూల ఫలాదులతోనే ఆ యజ్ఞంలో దేవతలకు భాగాలు సమర్పింపదలచాడు. పురాణపురుషుడు, దేవాదిదేవుడయిన శ్రీమన్నారాయణుడు ప్రసన్నుడై, ఇతరులకు ఎవరికి కనిపించకుండా ఆయనకు దర్శనం ఇచ్చాడు. హయగ్రీవస్వామి అదృశ్యుడుగా ఉండి తనకు సమర్పించిన పురోడాశాన్ని స్వీకరించి, వాసనచూసి తనవద్ద ఉంచుకొన్నాడు.****

ఇది చూచిన బృహస్పతికి కోపం వచ్చింది. ఆ కోపావేశంతో స్రువాన్ని పైకెత్తి ఆకాశాన్ని కొట్టినట్టు చేశాడు. అప్పుడు ఆయన కన్నుల నుండి అశ్రుపాతం జరిగింది. ఆయన ఉపరిచర రాజుతో "నేను సమర్పించదలచిన యజ్ఞ భాగాన్ని భగవంతుడు నాకు కన్పించి స్వయంగా గ్రహించాలి. ఇందులో సంశయం లేదు ! అని అన్నాడు." యుధిష్ఠిరుడు అడిగాడు. "తాతా ! ఇతరదేవతలు అందరు ప్రత్యక్షంగా కన్పించి తమ తమ భాగాలను గ్రహించినప్పుడు, విష్ణుదేవుడు ఆ యజ్ఞానికి వచ్చి కూడా ప్రత్యక్షదర్శనాన్ని ఎందుకు అనుగ్రహించలేదు ?" భీష్ముడు అన్నాడు. "వత్సా ! దీనికి కారణం చెపుతాను, విను. ఆ వసు మహారాజు ఇతరసదస్యులు 'బృహస్పతి అప్పుడు రోషపరవశుడై ఉన్నా'డని భావించి ఆయనకు నచ్చజెప్పసాగారు. అక్కడివారు అందరూ శాంతచిత్తులై ఇలా అన్నారు. 'మహర్షీ ! కోపించకండి. ఇలా రోషం తెచ్చుకోవటం కృతయుగ ధర్మంకాదు. ఈ

---

* వి॥ హోత = హోమం చేసే ఋత్విక్కు.

** వి॥ వీకత, ద్వీత, త్రితుల వృత్తాంతం శల్యపర్వం 36 అధ్యాయంలో ఉంది.

*** వి॥ రైభ్యాదుల వృత్తాంతం వన పర్వంలో ఉన్నది.

**** పురోడాశం = బియ్యం పిండితో చేసి మట్టిమూకుడులో కాల్చిన ఒక విధమైన రొట్టె. దీన్ని ముక్కలుచేసి యజ్ఞంలో దేవతలకు వేదమంత్రపూర్వకంగా ఆహుతిచేస్తారు.

హవిస్సును గ్రహించవలసిన విష్ణుదేవుడు కోపిష్ఠి కాడు. మనం అందరం ఆయనను మన ఇష్టం వచ్చినట్లు స్వేచ్ఛగా చూడలేము. ఆ స్వామి అనుగ్రహం పొందినవారే ఆయనను ప్రత్యక్షంగా చూడగలరు.' అప్పుడు ఏకత, ద్విత, త్రితులు, చిత్రశిఖండులనే పేరుగల మహర్షులు ఆయనతో ఇలా అన్నారు. "మహర్షీ ! మమ్ములను బ్రహ్మదేవుని మానసపుత్రులు అంటారు. ఒకప్పుడు మేము మా శ్రేయస్సు కోసం ఉత్తరదిక్కుకు వెళ్ళాం. అక్కడ మేరు పర్వతానికి ఉత్తరాన, క్షీరసముద్ర తీరంలో ఒక పవిత్ర ప్రదేశంఉన్నది. అక్కడ మేము ఏకాగ్ర చిత్తులమై, కాష్ఠ సదృశులమై, వేల సంవత్సరాలు మహాకఠోర తపస్సు చేశాము. ఏ విధంగానయినా సరే సనాతనుడు, దేవాది దేవుడు, శ్రీమన్నారాయణుని దర్శించాలి అనే మా కోరిక. శ్రీమన్నారాయణుని ఎలా దర్శించగలమా అని నిరంతరం ఆలోచించాం. అనంతరం వ్రత సమాప్తి అయిన తరువాత మాకు ఆనందం కలిగించే ఒక అశరీర వాక్కు ప్రేమతో, గంభీరస్వరంతో ఇలా విన్పించింది. 'విప్రులారా ! మీరు ప్రసన్నమైన మనస్సుతో ఉత్తమ తపస్సుచేశారు. మీరు భగవానుని భక్తులు. సర్వవ్యాపి అయిన పరమాత్మ దర్శనం కోరుతున్నారు గదా ! దీనికి ఉపాయం వినండి. క్షీరసాగరానికి ఉత్తర దిక్కున మహా ప్రకాశవంతమైన శ్వేతద్వీపం ఉన్నది. అక్కడ చంద్రునితో సమానమైన కాంతిగల మానవులు శ్రీమన్నారాయణుని సేవిస్తుంటారు. వారు ఇంద్రియరహితులు, నిరాహారులు, చేష్టారహితులుగా ఉంటారు. వారి శరీరాల నుండి మనోహరమైన సువాసన వెలువడుతుంటుంది. వారు భగవంతునికి అనన్య భక్తులు. వారు సహస్ర కిరణుడైన సనాతన పురుషోత్తమునిలో ప్రవేశిస్తారు. మునులారా ! శ్వేత ద్వీపనివాసులైన వారు నాకు ఏకాంత భక్తులు. అక్కడికి మీరు వెళ్ళండి. నా స్వరూప ప్రత్యక్ష దర్శనం లభిస్తుంది.' మేమిందరమూ ఆ అశరీరవాణిని విని ఆ చెప్పిన దిక్కుకు ప్రయాణించాము. ఆ స్వామియందే లగ్నచిత్తులమై, ఆయనను దర్శించే కోరికతో మహాశ్వేతద్వీపానికి వెళ్ళాము. ఆయనను దర్శించవలెననే ఉత్కంఠ మాకు అధికం అయింది. అక్కడికి వెళ్ళిన వెంటనే మా చూపు నశించింది. అక్కడివారి తేజస్సుకు కన్నులు మిరుమిట్లు గొలుపగా అక్కడ ఏ పురుషుడూ మాకు కనిపించలేదు. తరువాత దైవికంగా మా మనస్సులో తపస్సు చేయకుండా మేము భగవంతుని సులభంగా చూడలేము, అనే జ్ఞానం కలిగింది. తరువాత మేము వెంటనే మళ్ళీ నూరు సంవత్సరాలు మహత్తర తపస్సు చేశాం. ఆ తపోవ్రతం అయిన తరువాత మాకు అక్కడ శుభలక్షణ లక్షితులైన వ్యక్తుల దర్శనం అయింది. వారు చంద్రునివలె గౌరవర్ణులు, అన్ని శుభలక్షణాలు గలవారు. ప్రతిదినమూ వారు ఈశాన్య దిక్కుకు అభిముఖులై, చేతులు జోడించి, మానసజపం చేస్తుంటారు. వారి ఏకాగ్రమైన మనః

స్థితికి భగవంతుడు సంతోషిస్తుంటాడు. మునిశ్రేష్ఠా ! ప్రళయకాలంలో వెలిగే సూర్యుని కాంతి వంటి కాంతి ఆ ద్వీపంలోని వారికి ఉంటుంది. ఈ ద్వీపం తేజోనివాసం అని మేము అనుకొన్నాం. వారిలో ఎక్కువ తక్కువలు లేక అందరూ సమానమైన తేజోవంతులుగా ఉన్నారు.

బృహస్పతీ ! తరువాత మేము వేయి మంది సూర్యులు ఒకేమారు ఉదయించినప్పుడు ఉండేఅంత తేజస్సును చూశాం. తరువాత అక్కడివారు చాలా సంతోషంతో రెండుచేతులు జోడించి 'నమో నమః' అని అంటూ అందరూ ఒకే సారి ఆ తేజస్సువైపు పరుగుతీశారు. తరువాత వారు చేసే స్తుతుల పెద్ద ధ్వని మాకు వినిపించింది. వారందఱు తేజో రూపుడైన భగవంతునికి పూజాద్రవ్యాలు సమర్పిస్తున్నారు. ఇలాంటిది అని చెప్పవీలుగాని ఆ భగవంతుని తేజస్సుకు మా మనస్సులు పరవశించాయి. కాని అప్పుడు మా కన్నులు, బలం, ఇంద్రియాలు నిష్ఫలాలు అయినవి. అందువల్ల మాకు ఏమీ కనిపించలేదు. కాని ఉచ్చైఃస్వరంతో పలికే కంఠధ్వని చాలా దూరం వరకూ వ్యాపిస్తూ మాకు వినిపించింది. "పుండరీకాక్షా! నమస్సులు. విశ్వభావనా ! ప్రణామాలు. మహాపురుషుల కంటె పూర్వం జనించిన హృషీకేశా ! నమస్కారాలు". ఇలా శిక్షాక్షర సహితమైన వాక్యాలు మా చెవులకు వినిపించాయి. ఇంతలో సుగంధ పూరితంగా వీస్తూ వాయువు చాలా దివ్యపుష్పాలను, అప్పటికి కావలసిన ఓషధులను తెచ్చింది. వాటితో *పంచకాలజ్ఞు లయిన వారు అనన్యభక్తితో మనోవాక్క్రియలతో ఆ శ్రీహరిని పూజించారు. వారి మాటలవల్ల భగవంతుడు తప్పక వచ్చి ఉంటాడు అని గట్టిగా మేము నమ్మాము. కాని పరమాత్మ మాయవల్ల, మోహితులమైన మేము ఆయనను దర్శించలేకపోయాం. బృహస్పతీ ! సువాసనతో గూడిన గాలి వీచటం ఆగిపోగానే, భగవంతుని పూజాదికం పూర్తి కాగానే మేము అందరం దిగులు పడినాం. మహర్షీ ! అక్కడ ఉన్న పవిత్రవంశీయులైన వారిలో ఏ ఒక్కరూ మనస్సును గాని, చూపును గాని మా వైపు ప్రసరింపజేయలేదు. ఆదరించలేదు. అక్కడ నెమ్మదితో ఉన్న మునులు కూడా అనన్యభావంతో భగవత్సేవలోనే మనస్సును నిలిపారు. బ్రహ్మ భావంలో ఉన్న ఆ మునులు కూడా మా వైపు మనస్సు త్రిప్పలేదు. తపస్సుతో చాలా అలసి పోయాం. చాలా బలహీనులమయ్యాం. ఆ సమయంలో మాకు ఒక అశరీరవాణి వినిపించింది.

---

* పంచకాలజ్ఞులు = పంచరాత్రులు. ఇందులో రాత్రి పదంతో దీక్ష, నిత్య నైమిత్తిక కామ్య పూజా ప్రతిష్ఠాకాలాలు. అవి తెలిసిన వారు. లేక పంచయజ్ఞాల సమయం తెలిసినవారు అనికాని అర్థం చెప్పకోవాలి.

దేవత పలికింది. "మునివరులారా ! మీరు శ్వేతద్వీప నివాసులు, శ్వేతశరీరులు, ఇంద్రియ రహితులైన వారిని దర్శించారు. ఈ శ్రేష్ఠదివ్య దర్శనం వల్ల సాక్షాత్తు దేవేశ్వర దర్శనం అవుతుంది. మునులారా ! మీరు అందరూ వచ్చిన త్రోవనే వెళ్ళండి. భగవంతుని యందు అనన్య భక్తిలేకుండా ఎవరికీ, ఏ విధంగాను ఆయన దర్శనం కలుగదు. నిరంతరం చాలాకాలం ఆయన యందు భక్తి కలిగి పూర్తిగా అనన్యభావం కలిగినప్పుడు - జ్యోతిః పుంజం కావటంచేత చర్మచక్షుస్సుతో చూడవీలు గాని ఆ భగవద్దర్శనం లభించవచ్చు. ద్విజశ్రేష్ఠులారా ! ఇప్పుడు మీకు ఒక మహత్కార్యం చెయ్యాలి. ఈ కృతయుగం అయిపోయిన తరువాత కొంచెం ధర్మవ్యతిక్రమం కలిగినప్పుడు వైవస్వతమన్వంతరంలో త్రేతాయుగం ఆరంభం అయినప్పుడు, దేవకార్యసిద్ధికి మీరే సహాయం కావాలి !" అమృత సమానమైన ఆ అద్భుతవచనం విని భగవత్కృపవలన మాకు ఇష్టమైన చోటికి వెళ్ళాం. ఈ రీతిగా మహత్తర తపస్సుతో, హవ్యకవ్య సమర్పణం చేసి పూజించినా భగవద్దర్శనం కలుగలేదు. అలాంటప్పుడు నీవంటి వారికి చాలా సులభంగా ఆయనదర్శనం ఎలా కలుగుతుంది ? శ్రీమన్నారాయణుడు సర్వోత్తమదైవం. ఆయనే జగత్తు సృజించేవాడు, హవ్యకవ్యాలను గ్రహించేవాడు. ఆ అవ్యక్త పరమాత్మను దేవతలు, దానవులు కూడా పూజిస్తుంటారు." ఈ రీతిగా ఏకతుని మాటవలన, ద్విత, త్రితుల సమ్మతితో, ఇతర సదస్యులు నచ్చ చెప్పటంవల్ల బృహస్పతి ఆ యజ్ఞాన్ని పూర్తి చేసి భగవత్పూజ చేశాడు. వసురాజు కూడా యజ్ఞం పూర్తి చేసి రాజ్యం చేయసాగాడు. ఒకప్పుడు ఆ రాజు బ్రహ్మశాపంవల్ల స్వర్గభ్రష్టుడు అయినాడు. అప్పుడాయన భూలోకానికి క్రింద ఉండే రసాతలానికి వెళ్ళాడు. రాజశ్రేష్ఠా ! ఆ రాజు ధర్మవత్సలుడు, సత్యధర్మ పరాయణుడు అవటంచేత భూమి అడుగుకు వెళ్ళినా, నిరంతరం నారాయణ మంత్ర జపంచేస్తూ, ఆయన ఆరాధనలో ఆసక్తి గలిగి ఉండేవాడు. అందువల్ల ఆయన దయవలననే ఆ రాజు పైకి వచ్చి, భూలోకం నుంచి బ్రహ్మలోకానికి వెళ్ళి, పరమగతిని పొందాడు. తేలికగానే ఆయనకు నిష్కామంతుల గతి లభించింది."

337. ఉపరిచరుని అధః పతనము, పునరుత్థానము.

యుధిష్ఠిరుడు అడిగాడు. "తాతా ! వసురాజు భగవంతునికి అత్యంత భక్తుడు, మహాత్ముడు అయినప్పుడు స్వర్గభ్రష్టుడై భూతలంలో నుంచి పాతాళానికి ఎందుకు వెళ్ళాడు ?" భీష్ముడు చెపుతున్నాడు. "భరతవంశీయా ! ఈ విషయంలో జ్ఞానులైన

ఋషులకు, దేవతలకు జరిగిన ఒక పురాతన సంవాదాన్ని చెపుతారు. మేకపోతును పశువుగా ఉపయోగించి యజ్ఞం చేసేవిధానం ఉన్నది ! అని దేవతలు అక్కడికివచ్చిన ఋషులకు చెప్పారు. ఇక్కడ అజ శబ్దానికి మేక అని అర్థం కాని ఇంకొక పశువుకాదు. అది శాస్త్ర నిశ్చయం అని అన్నారు. ఋషులు ఇలా అన్నారు. "దేవతలారా ! యజ్ఞాలలో గింజలను హోమంచేయాలి అని వేదవాక్యం ఉన్నది. గింజలే అజశబ్దానికి అర్థం. కాబట్టి మేకపోతును చంపటం మాకు సముచితంకాదు. **దేవతలారా ! ఎక్కడైనా యజ్ఞంలో పశువధ సజ్జన ధర్మం కాదు. ఇప్పుడు శ్రేష్ఠమైన కృతయుగం వడుస్తున్నది. ఈ కాలంలో పశువధ ఎలా చేస్తారు ?"** భీష్ముడు చెపుతున్నాడు. "ఈ రీతిగా దేవతలకు, ఋషులకు మధ్య సంభాషణ జరుగుతుండగా ఉత్తమరాజైన వసువు ఆ మార్గంలో వస్తూ ఆ ప్రదేశానికి చేరాడు. శ్రీమంతుడైన ఆ రాజు సేనలు, వాహనాలు అన్నిటితో ఆకాశంలో సంచరిస్తుంటాడు. అంతరిక్షంలో వేగంగా వస్తున్న ఆయననుచూచి, బ్రహ్మర్షులు దేవతలతో, 'ఈ రాజు యజ్ఞాలు చేసిన వాడు, దానపతి, శ్రేష్ఠుడు, సర్వప్రాణుల మేలుకోరేవాడు, ఇష్టుడు కాబట్టి మన సందేహం పోగొట్టగలడు అని అన్నారు.' మహాపురుషుడైన ఈ వసువు, శాస్త్రవిరుద్ధమైన మాట ఎలా చెపుతాడు ? అని నిశ్చయించుకొని దేవతలు, ఋషులుకలిసి వసురాజు వద్దకు వెళ్ళి ఇలా అడిగారు.

'రాజా ! యజ్ఞం మేకపోతుతో చేయాలా ? లేక అన్నంతో చేయాలా ? అనే మా సందేహాన్ని నీవే తీర్చాలి. నీవే ఈ విషయంలో ప్రమాణం అని మా ఉద్దేశ్యం.' వసురాజు వారికి నమస్కరించి "బ్రాహ్మణ శ్రేష్ఠులారా! మీలో ఎవరికి ఏ అభిప్రాయం ఇష్టం ? అజపదానికి మేకపోతు అని ఎవరి అభిప్రాయం ? ధాన్యం అని ఎవరి అభిప్రాయం యధార్థం" చెప్పండి. అని అడిగాడు. ఋషులు చెప్పారు. 'రాజా ! ధాన్యంతో హోమం చేయాలి అనే పక్షం మాది. పశువును హోమంలో వినియోగించాలి అనే పక్షం దేవతలది. ఇందులో ఏది నీ నిర్ణయమో చెప్పవలసింది.' భీష్ముడు అన్నాడు. 'దేవతల అభిప్రాయం తెలుసుకుని వసురాజు వారిపక్షాన్ని స్వీకరించి 'అజ శబ్దానికి మేకపోతు అని అర్థం. కాబట్టి దానితోనే యజ్ఞం చేయాలి !' అని నిర్ణయించాడు. ఇది విని సూర్యసమతేజస్సులైన ఋషులు అందరు కోపించి, విమానంలో ఉండి దేవతల పక్షాన నిర్ణయంచేసిన ఆ రాజుతో ఇలా అన్నారు. **'రాజా ! అజపదానికి అర్థం అన్నం అని తెలిసి కూడా దేవతల పక్షాన్ని స్వీకరించావు. కాబట్టి స్వర్గం నుంచి క్రిందికి పడిపోవుదువుగాక. నేటినుంచి నీ ఆకాశగమన శక్తి నశిస్తుంది. మా శాపోపహతుడవై భూమిని భేదించుకొని పాతాళంలో ప్రవేశిస్తావు.**

రాజా ! నీవు చెప్పింది వేదాలకు, సూత్రాలకు విరుద్ధం అయితే నీవు పతితుడ వవుతావు. మేము చెప్పింది విరుద్ధమైతే మేము పతితులం అవుతాము.'

అప్పటిదాకా ఆకాశంలో సంచరిస్తున్న వసురాజు ఆ క్షణంలో ఆకాశంనుంచి క్రిందికివచ్చి భూవివరంలోకి వెళ్ళాడు.

అప్పుడు శ్రీమన్నారాయణుని ఆజ్ఞవలన ఆయన స్మరణశక్తి నశింపలేదు. దేవతలు అందరు ఒక చోటచేరి రాజును శాపవిముక్తుని చేయటానికి ఉపాయం ఆలోచించసాగారు. వారు శాంతభావంతో తమలో తాము 'రాజు పుణ్యం చేసికూడా మనకారణంగానే శాపంపొందాడు. మనం అందరం కలిసి ఈయనకు మేలు చేయాలి.' అని నిశ్చయించుకొని వారు అందరు వసురాజు వద్దకు వచ్చి ప్రసన్నచిత్తంతో ఇలా అన్నారు. 'రాజా ! నీవు బ్రాహ్మణ ప్రియుడైన విష్ణుదేవుని భక్తుడవు. ఆయన దేవదానవులకు అందరికి గురువు. నీపైన ఆయనకు మనస్సులో సంతుష్టి ఉంది. నీ కోరిక ప్రకారం నిన్ను తప్పక శాపవిముక్తుని చేస్తాడు. నీవు మహాత్ములైన బ్రాహ్మణులను గౌరవించాలి. వారి తపోమహత్వం వలననే నీవు ఆకాశం నుంచి పతితుడవై పాతాళానికి వచ్చావు. పూతచరిత్రా ! రాజా ! నిన్ను ఒకరీతిగా అనుగ్రహిస్తున్నాము. శాపకారణంగా నీవు భూవివరంలో ఉన్నతకాలం ఏకాగ్రచిత్తంతో, బ్రాహ్మణులు యజ్ఞాలలో ఇచ్చిన వసుధారాహుతి నీకు లభిస్తుంది. మా అనుగ్రహంవల్ల నీకు వసుధార లభిస్తుంది. దానివల్ల నీకు శ్రమ కలుగదు. ఈ పాతాళంలో ఉన్నా ఆకలిదప్పులు ఉండవు. వసుధారాపానంవలన నీ తేజస్సు పెంపొందుతుంది. మా వరం వల్ల భగవంతుడు నిన్ను బ్రాహ్మణలోకానికి తీసుకొనిపోతాడు.' ఈ రీతిగా వరం ఇచ్చి, దేవతలు తమనివాసాలకు వెళ్ళారు. తపోధనులైన మహర్షులు అక్కడినుంచి వెళ్ళారు.

తరువాత వసువు విష్వక్సేనపూజ చేశాడు. శ్రీమన్నారాయణుని నోటి నుంచి వ్యక్తమైన **ఓం నమోనారాయణాయ** అనే మంత్రాన్ని నిరంతరం జపించసాగాడు. భూమి వివరంలో ఉన్నా ఆయన దేవేశ్వరుడైన శ్రీహరిని పంచకాలాలలో, పంచ యజ్ఞాలతో ఆరాధించాడు. మనోవిజేత, అనన్యభక్తుడు, భగవత్తత్పరుడు అయిన వసువు భక్తికి భగవానుడు సంతోషించాడు. వరప్రదాత అయిన విష్ణుదేవుడు తన వద్ద ఉన్న మహా వేగి, పక్షి శ్రేష్ఠుడు అయిన గరుత్మంతుని చూసి, తనకు అభీష్టమైన మాటను చెప్పాడు. 'ద్విజోత్తమా ! నా ఆజ్ఞానుసారం కఠోరవ్రతం చేస్తున్న ధర్మాత్ముడైన వసురాజు వద్దకు వెళ్ళి ఆయన విషయం చూడు. పక్షిరాజా ! ఆయన బ్రాహ్మణుల కోపం వలన పాతాళానికి వెళ్ళాడు. అయినా ఆయన పూర్వం బ్రాహ్మణులను గౌరవించినవాడే. కాబట్టి

ఆయన వద్దకు వెళ్ళు. భూవివరంలో సురక్షితంగా గుప్తంగా ఉండి, పాతాళ సంచారి అయిన వసురాజును త్వరగా ఆకాశ సంచారిని చేయవలసింది.' అప్పుడు వాయువేగం గల గరుత్మంతుడు రెక్కలు విప్పి, ఆకాశంలో ఎగిరి, వసురాజు ఉన్న భూవివరంలోకి చేరాడు. వినతాసుతుడు త్వరగా రాజును పైకెత్తి, ఆకాశంలోకి వెళ్ళి, అక్కడ వదిలాడు. ఆ క్షణంలోనే వసురాజు ఉపరిచరుడు అయినాడు. సశరీరంగా బ్రహ్మలోకానికి వెళ్ళాడు. కుంతీనందనా ! ఈ రీతిగా మహాత్ముడైన రాజు కూడా దేవతల ఆజ్ఞ వలన వాగ్దోషాన్ని ఆచరించి బ్రాహ్మణ శాపంవలన అధోగతి పొందాడు. ఆయన కేవలం పరమాత్మ అయిన శ్రీహరిని సేవించి, శాపవిముక్తుడై బ్రహ్మలోకం చేరాడు.' భీష్ముడు అన్నాడు. వత్సా ! 'ఈ రీతిగా నీకు శ్వేతద్వీప నివాసులు ఉన్న తీరు అంతా వినిపించాను. ఇప్పుడు దేవర్షి నారదుడు శ్వేతద్వీపానికి వెళ్ళిన వృత్తాంతం అంతా చెపుతాను. ఏకాగ్ర మనస్సుతో వినుము.'

338. ద్విశతనామములతో నారదుడు భగవంతుని స్తుతించుట.

భీష్ముడు చెపుతున్నాడు. "ధర్మజా ! దేవర్షి నారదుడు శ్వేతద్వీపానికి చేరి చంద్రసమాన కాంతిగల శుక్లవర్ణులగు వారిని దర్శించి నమస్కరించి, మానస పూజచేశాడు. వారుకూడ ఆయనను తగురీతిగా సత్కరించారు. భగవద్దర్శన కాంక్షతో కఠోరనియమాలను పాటిస్తూ, భగవన్నామజపంచేస్తూ అక్కడ ఉన్నాడు. నారదుడు అక్కడ రెండు చేతులు పైకెత్తి ఏకాగ్ర చిత్తుడై నిర్గుణ సగుణ రూపుడై, విశ్వాత్ముడైన శ్రీమన్నారాయణుని (రెండు వందల నామాలతో) ఇలా స్తుతిచేశాడు. 1. దేవదేవేశా ! నమస్కారం. 2. నిష్క్రియా 3. నిర్గుణా 4. సమస్త జగత్తునకు సాక్ష్యమైన వాడా 5. క్షేత్రజ్ఞుడా 6. పురుషోత్తమా (క్షరమైన అక్షరమైన పురుషుని కన్న ఉత్తముడా) 7. అనంతా 8. పురుషా 9. మహాపురుషా 10. పురుషోత్తమా (పరమాత్మ) 11. త్రిగుణా 12. ప్రధానా 13. అమృతా 14. అమృతమయా 15. అనంతాఖ్యా (శేష సర్పనామా) 16. వ్యోమా (మహాకాశరూపా) 17. సనాతనా 18. సదసద్వ్యక్తా వ్యక్తా 19. ఋతధామా (సత్యధామస్వరూపా) 20. ఆదిదేవా 21. వసుప్రదా (కర్మఫలదాతా) 22. ప్రజాపతీ (దక్షాది ప్రజాపతిరూపా) 23. సుప్రజాపతీ (ప్రజాపతులలో శ్రేష్ఠా) 24. వనస్పతీ 25. మహా ప్రజాపతీ (బ్రహ్మరూపా) 26. ఊర్జస్పతీ (మహాశక్తి శాలీ) 27. వాచస్పతీ (బృహస్పతీ) 28. జగత్పతీ 29. మనస్పతీ 30. దివస్పతీ (సూర్యా) 31. మరుత్పతీ (వాయు దేవాధిపా) 32. సలిలపతీ (జలాధిపా) 33. పృథివీ పతీ 34. దిక్పతీ 35. పూర్వనివాసా (మహాప్రళయ కాలమున జగత్తునకు

ఆధారరూపా) 36. గుహ్యా (స్వరూపా) 37. బ్రహ్మపురోహితా 38. బ్రహ్మకాయా 39. మహారాజికా 40. చతుర్మహా రాజికా 41. భాసురా (ప్రకాశించువాడా) 42. మహాభాసురా (మహాప్రకాశ మానుడా) 43. సప్తమహాభాగా 44. యామ్యా 45. మహాయామ్యా 46. సంజ్ఞాసంజ్ఞా 47. తుషితా 48. మహాతుషితా 49. ప్రమర్దన (మృత్యురూపా) 50. పరినిర్మితా 51. అపరినిర్మితా 52. వశవర్తీ 53. అపరినిందితా (శమదమాది గుణ సంపన్నా) 54. అపరిమితా (అనంతా) 55. వశవర్తీ 56. అవశవర్తీ 57. యజ్ఞా 58. మహాయజ్ఞా 59. యజ్ఞసంభవా 60. యజ్ఞయోనీ (వేదరూపా) 61. యజ్ఞగర్భా 62. యజ్ఞ హృదయా 63. యజ్ఞస్తుతా 64. యజ్ఞభాగ హరా 65. పంచయజ్ఞా 66. పంచకాల కర్తృపతీ (అహోరాత్రాలు, మాసాలు, ఋతువులు, అయనాలు, సంవత్సరాలు స్వరూపముగా గల కాలానికి అధిపా) 67. పాంచరాత్రికా 68. వైకుంఠా (పరమధామా) 69. అపరాజితా 70. మానసికా 71. నామనామికా (సమస్త నామాల సమాహారమైనవాడా) 72. పరస్వామీ (పరమేశ్వరా) 73. సుస్నాతా 74. హంసా, పరమహంసా 76. మహాహంసా 77. పరమ యాజ్ఞికా 78. సాంఖ్యయోగరూపా 79. సాంఖ్య మూర్తీ (జ్ఞాన మూర్తీ) 80. అమృతే శయ (విష్ణుదేవా) 81. హిరణ్యేశయా 82. దేవేశయా 83. కుశేశయా 84. బ్రహ్మేశయా 85. పద్మేశయా (విష్ణుదేవా) 86. విశ్వేశ్వరా 87. విష్వక్సేనా మొదలైనవి నీ నామాలు 89. జగత్తునకు కారణరూపుడవు నీవే. 90. అగ్ని నీముఖం 91. బడబానలం నీవే. 92. ఆహుతి రూపుడవు నీవే. 93. సారథీ 94. వషట్కారా 95. ఓంకారా 96. తపఃస్వరూపా 97. మనఃస్వరూపా 98. చంద్ర స్వరూపా 99. కన్నులకు దేవతయగు సూర్యుడవు నీవే 100. సూర్యా 101. దిగ్గజా 102 దిగ్భానూ (దిక్కులను ప్రకాశింపజేయువాడా 103. విదిగ్భానూ (విదిక్కులను వెలిగించువాడా) 104. హయగ్రీవరూపుడవు 105. ప్రథమ త్రిసౌపర్ణమంత్రం నీవే. 106. బ్రాహ్మణాదివర్ణాలను ధరించువాడవు 107. పంచాగ్ని రూపుడవు 108 నాచికేతుని నామంతో ప్రసిద్ధమగు త్రివిధాగ్నివి నీవే 109. శిక్ష, కల్పం, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం అను షడంగములకు నిధివి. 110. ప్రాగ్జ్యోతిష స్వరూపా 111. జ్యేష్ఠసామ స్వరూపా 112. సామిక వ్రతధరా 113. అధర్వ శిరోరూపా 114. పంచమహా కల్పరూపా (సౌర, శాక్త, గాణాపత్య, శైవ, వైష్ణవ శాస్త్రో పాస్యదేవుడవు నీవే) 115. ఫేనపాచార్యా 116. వాలఖిల్యమునిరూపా 117. వైఖానసముని రూపం నీవే. 118. అభగ్నయోగా (అఖండ యోగా) 119. అభగ్నపరి సంఖ్యానా (అఖండ విచారా) 120. యుగాదిరూపా (యుగ ఆది ఐనవాడా) 121. యుగమధ్యా (యుగ మధ్యస్వరూపా) 122. యుగాంతా ప్రాచీన గర్భుడవు నీవే 123. ఆఖండలా (ఇంద్రరూపా) 124. ప్రాచీన

గర్భుడవు నీవే 125. కౌశికమునీ 126. పురుష్టుతా (అందరును ప్రచురంగా స్తుతింపదగినవాడు) 127. పురుహూతా 128. విశ్వకృత్తూ (ప్రపంచ నిర్మాతా) 129. విశ్వరూపా 130. అనంతగతీ 131. అనంతభోగా 132. అంతంలేనివాడా 133. అనాది ఐనవాడా 134. మధ్యలేనివాడా 135. అవ్యక్త మధ్యమా 136. అవ్యక్తనిధనా 137. వ్రతవాస (వ్రతాలకు ఆశ్రయమైనవాడా) 138. సముద్రవాసీ (క్షీరసముద్రం నివాసమైనవాడా) 139. యశోవాసా (కీర్తికి స్థానమైనవాడా) 140. తపోవాసా (తపస్సుకు నివాసమైనవాడా) 141. దమావాసా (సంయమానికి నివాసమైనవాడా) 142. లక్ష్మీనివాసా 143. విద్యకు ఆశ్రయమైనవాడా 144. కీర్తికి ఆధారమైనవాడా 145. సంపదకు ఆశ్రయమైనవాడా 146. సర్వావాసా (అందరికి నివాసమైనవాడా) 147. వాసుదేవా 148. సర్వచ్ఛందకా (అందరి కోర్కెలు తీర్చువాడా) 149. హరిహయా 150. హరిమేధా (అశ్వమేధ యజ్ఞరూపా) 151. మహాయజ్ఞ భాగహరా 152. వరప్రదా (భక్తులకు వరాల నిచ్చువాడా) 153. సుఖప్రదా (అందరికిని సుఖాన్ని ప్రసాదించువాడా) 154. ధనప్రదా (అందరికి ధనమునిచ్చువాడా) 155. హరిమేధా (భగవద్భక్తిరూపుడా) 156. యమస్వరూపా 157. నియమరూపా 158. మహానియమాలు మొదలైన విరూపాలవాడా 159. కృచ్ఛ్రా 160. అతికృచ్ఛ్రా 161. మహాకృచ్ఛ్ర 162. స్వర్వకృచ్ఛ్రాదులు, చాంద్రాయణ వ్రతం నీవే 163. నియమధరా (నియమాలు ధరించువాడా) 164. నివృత్తభయా (భయంలేనివాడా) 165. ప్రవచనగీతా (వేదవాక్యాలకు విషయమైనవాడా) 166. పృశ్నిగర్భవృత్తా 167. ప్రవృత్త వేదక్రియా (వైదిక కర్మ ప్రవర్తకుడా) 168. అజా (జన్మరహితా) 169. సర్వగతీ (సర్వవ్యాపి) 170. సర్వదర్శీ 171. అగ్రాహ్యా 172. అచలా 173. మహావిభూతీ (సృష్టిరూపమగు విభూతి గలవాడా) 174. మాహాత్మ్య శరీర (ఎనలేని ప్రభావశాలియైన స్వరూపం గలవాడా) 175. పవిత్రుడా 176. మహాపవిత్రా (అపవిత్రులను పవిత్రులుగా జేయువాడా) 177. హిరణ్మయా 178. బృహత్తు (బ్రహ్మ) 179. అప్రతర్క్యా (తర్కంచే తెలియవీలుగానివాడా) 180. అవిజ్ఞేయా 181. బ్రహ్మాగ్ర్యా 182. ప్రజలను సృష్టించువాడా 183. ప్రజలను అంతం చేయువాడా 184. మహామాయా ధరా 185. చిత్ర శిఖండీ 186. వరప్రదా 187. పురోడాశ భాగం గ్రహించువాడా 188. గతా ధ్వరా (యజ్ఞాలను పొందినవాడా) 189. ఛిన్నతృష్ణ (తృష్ణా రహితుడా) 190. ఛిన్న సంశయా (సంశయాలు లేనివాడా) 191. సర్వతో వృత్తా (సర్వవ్యాపి) 192. నివృత్తిరూపా 193. బ్రహ్మణ్యరూపా 194. బ్రాహ్మణ ప్రియా 195. విశ్వమూర్తీ 196. మహామూర్తీ 197. బాంధవ (జగత్తుకు బంధువు) 198. భక్తవత్సలా 199. బ్రహ్మణ్య

దేవా మున్నగు సంబోధనలు వినువాడా ! పరమేశ్వరా ! నమస్కారం. నేను నీ భక్తుడను, మిమ్ము దర్శింప నిటకు వచ్చితిని. 200. ఏకాంతంలో దర్శనమిచ్చు పరమాత్మవగు నీకు నమస్కారం."

339. చతుర్వ్యూహ స్వరూపము - భవిష్యదవతార కార్యములు.

భీష్ముడు చెపుతున్నాడు. ఈ విధంగా రహస్యమైన, సత్యమైన నామాలతో నారదుడు స్తుతించగా విశ్వరూపధారియైన భగవంతుడు ఆయనకు దర్శనం అనుగ్రహించాడు. ఆ స్వామి స్వరూపం చంద్రునికన్నా కొంచెం అధిక నిర్మలం, చంద్రునికంటే కొంచెం విలక్షణమైనది. కొంత అగ్నివలె దేదీప్యమానం, కొంత నక్షత్రాలవలె వెలిగిపోతున్నది. కొంత చిలుక రెక్కలవలె పచ్చనిది, కొంత స్ఫటికంతో సమానమైన ప్రకాశం కలది. ఒక చోట కాటుక కొండవలె నల్లనిది, ఇంకొకచోట బంగారంవలె కాంతిమంతం. ఒకచోట చివురు మొలకలవలె ఉంది. ఒక చోట తెల్లగా కన్పిస్తున్నది. ఒక చోట బంగారురంగుతో ఉన్నది. ఇంకొక చోట వైడూర్యమణివలె ఉన్నది. ఒకచోట నీలవర్ణ వైడూర్యం వలె, ఇంకొకచోట ఇంద్రనీలం వలె, వేరొకచోట నెమలి కంఠవర్ణంవలె, మరొకచోట ముత్యాల సరంవలె ఉన్నది. ఈ రీతిగా సనాతనుడైన భగవానుడు తన స్వరూపంలో అనేక విధాలైన రంగులను ధరించాడు. ఆయన సహస్రనయనుడు, సహస్ర శిరస్కుడు, సహస్రపాదుడు, సహస్రోదరుడు, సహస్రబాహుడు. అపూర్వ కాంతి సంపన్నుడైన ఆయన ఆకృతి అక్కడక్కడ అవ్యక్తంగా ఉన్నది. ఆ శ్రీమన్నారాయణుడు ఒక నోటితో ఓంకార పూర్వకంగా గాయత్రీమంత్రాన్ని జపిస్తున్నాడు. ఇతరముఖాలతో నాలుగువేదాలను, వాటి ఆరణ్యకభాగాలను జపిస్తున్నాడు యజ్ఞస్వామి అయిన స్వామి, అప్పుడు చేతులతో యజ్ఞవేదిని, కమండలాన్ని, శుభ్రమయిన మణులను, పాదుకలను, దర్భలు, జింకచర్మం, దండం, ప్రజ్వలించే అగ్ని - ఈ వస్తువులను స్వీకరించి ఉన్నాడు.

ఆ ప్రభువును దర్శించటం చేత ప్రసన్నుడైన ద్విజశ్రేష్ఠుడు నారదుడు మౌనంతో తలవంచి పరమేశ్వరునికి నమస్కరించాడు. దేవతలకు ఆద్యుడు, అవ్యయుడు అయిన పరమాత్మ తలవంచి నమస్కరిస్తున్న మునితో ఇలా అన్నాడు.

"మహర్షీ ! నా దర్శనంకోరి మహర్షులైన ఏకత, ద్విత, త్రితులు ఈ ప్రదేశానికి వచ్చారు. కాని వారు నన్ను దర్శించలేకపోయారు. వాస్తవానికి నా అనన్య భక్తులు తప్ప మరొకడు ఎవ్వడూ నన్ను చూడలేడు. నీవు నా అనన్య భక్తులలో శ్రేష్ఠుడవు. ద్విజా ! ధర్ముని గృహంలో అవతరించిన నరనారాయణాదులయిన నలుగురు సోదరులు నా

స్వరూపులు. కాబట్టి నీవు సర్వదా వారిని సేవించి వారివల్ల లభించిన ధాన్ని సాధన చెయ్యి. అవ్యయుడను, విశ్వస్వరూపుడ నయిన నేను నీకు ఈనాడు ప్రసన్నుడ నయినాను. నీకు కావలసినవరం కోరుకో." నారదుడన్నాడు. "స్వామి ! నిన్ను నేడు దర్శించటంచేత నా తపస్సు, యమనియమాల ఫలం నాకు లభించింది. సనాతనుడ వయిన నీవు సంపూర్ణ ప్రపంచ స్రష్టవు. సింహంవలె నిర్భయుడవు, స్వస్వరూపుడవు, మహనీయుడవు. నీ దర్శనమే నాకు అన్నిటిని మించిన వరం."

భీష్ముడు చెప్పాడు. "ఈ ప్రకారంగా భగవంతుడు బ్రహ్మపుత్రుడైన నారదునకు దర్శనం ఇచ్చి, మళ్ళీ ఇలా అన్నాడు. 'నీవు ఇక్కడి నుంచి వెళ్ళవచ్చు. ఇంద్రియాలు, ఆహారం లేనివారు, చంద్రునివలె తేజోవంతులు అయిన నా భక్తులు ఏకాగ్రచిత్తులై నన్ను ధ్యానిస్తుంటారు. వీరి ధ్యానానికి విఘ్నంకలుగరాదు. ఇక్కడే ఉండే ఈ మహాత్ములు సిద్ధపురుషులు. పూర్వం కూడా వీరు నాకు అనన్య భక్తులు. తమోగుణ రజోగుణ రహితులు, కాబట్టి నిఃసందేహంగా నాలో ప్రవేశిస్తారు.

కంటికి కన్పించని వాడు, స్పృశింప వీలుగానివాడు, ముక్కులతో వాసన చూడవీలుగానివాడు, నాలుక రుచికి తెలియనివాడు, సత్త్వరజస్తమో గుణాలప్రభావానికి లోనుగానివాడు, సర్వవ్యాపి, సర్వసాక్షి, సర్వజగత్తుకు ఆత్మ, సర్వప్రాణులు నశించినా నశించనివాడు, జననాదులు లేనివాడు, నిత్యుడు, సనాతనుడు, నిర్గుణుడు, నిష్కలుడు, ఇరువది నాలుగు తత్త్వాల కంటె పరమైన ఇరువది యైదవ తత్త్వమైనవాడు, అంతర్యామి అయిన పురుషుడు, నిష్క్రియుడు, ధ్యానమయ నేత్రాలతోనే దర్శింపవీలయిన వాడు ఆ సనాతన పరమాత్మ. ఆయనను ప్రవేశించి శ్రేష్ఠద్విజులు ముక్తు లవుతారు. ఆయననే వాసుదేవుడు అనే పేరుతో తెలుసుకోవాలి. శుభాశుభ కర్మలతో ఎప్పుడూ లిప్తుడు కాని ఆ దేవ దేవుని మాహాత్మ్యాన్ని నారదా ! చూడు. సత్త్వం, రజస్సు, తమస్సు అనే ఈ మూడింటిని గుణాలు అంటారు. ఇవి అన్ని శరీరాలలో ఉంటాయి. సంచరిస్తాయి. ఈ గుణాలను క్షేత్రజ్ఞుడు అనుభవిస్తాడు. కాని ఈ గుణాలు ఆ క్షేత్రజ్ఞని అనుభవించలేవు. ఆయన నిర్గుణుడు, గుణస్రష్ట, గుణభోక్త, గుణాధికుడు కావటమే అందుకు కారణం. దేవర్షీ ! ఈ సంపూర్ణ జగత్తుకు ఆధారమైన భూమి నీటిలో లీనం అవుతుంది. జలం తేజస్సులో లీనం అవుతుంది. తేజస్సు వాయువులో లీనమవుతుంది. వాయువు ఆకాశంలో లీనం అవుతుంది. ఆకాశం మనస్సులో లీనం అవుతుంది. మనస్సు ఉత్కృష్టమైన భూతం. అది అవ్యక్తమైన ప్రకృతిలో లీనం అవుతుంది. బ్రాహ్మణా ! అవ్యక్తం నిష్క్రియుడైన పురుషునిలో లీనం అవుతుంది. ఆ సనాతనుడైన పురుషుని కంటే గొప్పవస్తువు ఇంకొకటి

లేదు. ప్రపంచంలో ఏకైక సనాతన పురుషుడైన వాసుదేవుని కన్న, ఇతరమైన చరాచరప్రాణి సమూహం నిత్యం గాదు. మహాబలుడైన వాసుదేవుడే సర్వభూతాలకు ఆత్మ. భూమి, వాయువు, ఆకాశం, నీరు, తేజస్సు, అనే అయిదు మహాభూతాలు. ఈ పంచభూతాలు కలిసి శరీరం అనే పేరుగలవి అవుతాయి. ఆ సమయంలో, కనిపించకుండా శీఘ్రగామి అయిన చేతన దానిలో ప్రవేశిస్తుంది. అతడే జీవాత్మ.

ఆ జీవుడు శరీరాన్ని ప్రవేశించటమే పుట్టుక అంటారు. అతడే శరీరాన్ని చేష్టాయుక్తం చేస్తాడు. దాన్ని నడపటంలో ఆయనే సమర్థుడు. పంచభూతాల సముదాయం కలియకుండా ఏ శరీరమూ ఉండదు. జీవుడు లేకుండా ప్రాణవాయువు చేష్టాయుక్తం కాలేదు. ఆ జీవునే శేషుడు, లేక సంకర్షణుడు అని వ్యవహరిస్తాడు. ఆ సంకర్షణునితో - జీవునితో తన కర్తవ్యాలయిన ధ్యానపూజాదికాలతో సనత్కుమారత్వాన్ని (జీవన్ముక్తిని) పొందేవాడు, సమస్తప్రాణులను లయంచేసుకొనే వాడు, క్షయం చేసేవాడు సమస్త ప్రాణుల మనోరూపుడే ప్రద్యుమ్నుడు. ఆ ప్రద్యుమ్నుని నుండి ఉత్పన్నమైన ఆ (అహంకారమే) తన్మాత్రాదికానికి కర్త. పరంపరాసంబంధంతో మహాభూతాలకు కారణమూ, మహత్తత్వమూ, కార్యమూ అవుతాడు. దానినుండియే సమస్త చరాచరజగత్తు ఉత్పన్న మవుతుంది. అదే అనిరుద్ధుడు, ఈశానుడు అని అంటారు. అది (కర్తృత్వాభిమానంతో) అన్ని పనులుగా వ్యక్తం అవుతుంది. రాజేంద్రా ! క్షేత్రజ్ఞస్వరూపుడు, నిర్గుణరూపుడుగా తెలియదగిన వాడని చెప్పబడిన భగవంతుడైన వాసుదేవుడే ప్రభావవంతు డయిన సంకర్షణ స్వరూపజీవాత్మ. సంకర్షణుని నుండి ప్రద్యుమ్నుడు ఆవిర్భవించాడు. ఆయనను మనో మయుడు అంటారు. ప్రద్యుమ్ననినుండి వ్యక్తమైన అనిరుద్ధుడే అహంకారం, ఈశ్వరుడు అయి ఉన్నాడు. నారదా ! నానుండియే స్థావరజంగమాత్మకమైన సమస్త జగత్తు జనిస్తుంది. అక్షరమూ (నాశంలేనిది), క్షరమూ (నాశంగలది), సద్రూపమూ, అసద్రూపమూ (శాశ్వతమైన ఉనికి ఉన్నది, లేనిది) నానుండియే వ్యక్తం అవుతుంది. ఇక్కడ ఉన్న నా భక్తులు అందరు నాలోనే ప్రవేశించి ముక్తు లవుతారు. నేనే ఇరువది ఐదవ తత్త్వమయిన పురుషుడ నని తెలుసుకోవాలి. నేను నిర్గుణుడను, నిష్కలుడను, ద్వంద్వాతీతుడను, పరిగ్రహం లేనివాడను (దేనిని గ్రహింపనివాడను), రూపం ఉన్నది కాబట్టి కన్పిస్తున్నానని అనుకొనరాదు. తలుచుకొంటే ఒక్కక్షణంలో అదృశ్యం అవుతాను. నేనే పరమేశ్వరుడను. జగద్గురువును. నారదా ! నీవుచూసే ఈ రూపం నా మాయా సృష్టియే. నీవు నన్ను సర్వభూతగుణాలు కలవానినిగా తలపరాదు. నేను నీకు నాలుగు మూర్తులను (వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధులను) గూర్చి వివరంగా చెప్పాను. జీవుడనే పేరుగలవాడను నేనే. జీవులు నాలోనే ఉన్నారు.

నేను జీవుని చూశాను అని నీవు అనుకొనరాదు. బ్రహ్మర్షీ ! నేను సర్వవ్యాపిని, సమస్త ప్రాణుల అంతరాత్మను. సర్వభూత సముదాయాలు, శరీరాలు నాశనమైనా నాకు నాశంలేదు.

ముని ! ఈ శ్వేత ద్వీపనివాసులు సిద్ధులు. పూర్వం వీరు నాకు అనన్య భక్తులు. తమోగుణ రజోగుణ విముక్తులు కాబట్టి నాలో ప్రవేశిస్తారు. స్వర్వజగత్తుకు ఆది, చతుర్ముఖుడు, అనిర్వచనీయ స్వరూపంగలవాడు, హిరణ్యగర్భుడు, సనాతనుడు అయిన బ్రహ్మ నా అన్ని కార్యాలను చింతించగలవాడు. క్రోధవశుడ నయిన నా నుదుటినుండి రుద్రుడు ఆవిర్భవించాడు. నాకు కుడివైపున నున్న ఈ పదకొండు మంది రుద్రులను చూడు. ఇలాగే నాకు ఎడమవైపున ఉన్న పన్నెండు మంది ఆదిత్యులను, నాకు ముందున్న దేవశ్రేష్ఠులైన అష్టవసువులను చూడు. నాకు వెనక ఉన్న నాసత్యుడు, దస్రుడు అనే దేవవైద్యులను, సమస్త ప్రజాపతులను, సప్తర్షులను చూడు. సమస్తవేదాలను, ఎన్నో యజ్ఞాలను, ఓషధులను, అమృతాన్ని చూడు. తపస్సు, యమనియమాలు ఆకారం దాల్చిఉన్నాయి చూడు.

ఎనిమిది విధాలయిన ఐశ్వర్యం కూడా ఇక్కడ ఒకేచోట సాకారంగా ఉన్నది. చూడు. శ్రీ, లక్ష్మి కీర్తి, పర్వతాలతో గూడిన భూమి, వేదమాత సరస్వతీదేవి నాలో ఉన్నారు. వారిని అందరిని దర్శించు. నక్షత్రశ్రేష్ఠమూ, ఆకాశచరమూ అయిన ధ్రువనక్షత్రాన్ని చూడు. మేఘాలను, సముద్రాలను, సరస్సులను, నదులను, సాకారులయిన వానిని జూడుము. రూపు దాల్చిన నాలుగు విధాల పితృదేవతలను చూడు. ఆకారంలేని నాలో ఉన్న ఈ త్రిగుణాలను చూడు. మహర్షీ ! దేవకార్యానికంటె పితృకార్యం విశేషమైనది. దేవతలకు, పితృదేవతలకు నేనే జనకుడను. నేను హయగ్రీవావతారం ధరించి వాయవ్య దిక్కున ఉండి, శాస్త్రాను సారం హోమంచేసిన హవ్యాన్ని, శ్రద్ధాపూర్వకంగా సమర్పించిన కవ్యాన్ని స్వీకరిస్తుంటాను. పూర్వం నేను సృష్టించిన బ్రహ్మ నన్ను గూర్చి స్వయంగా యజ్ఞం చేశాడు. అందుకు సంతోషించి ఆయనకు వరాలు ఇచ్చాను. బ్రహ్మ ! నీవు ప్రతికల్పం మొదట నా పుత్రునిగా అవతరిస్తావు. నీకు లోకాధిపతి పదవి లభిస్తుంది. అహం అనేది నీకు పర్యాయవాచకం అవుతుంది. నీవు చేసిన మర్యాదను ఎవ్వరూ అతిక్రమించలేరు. బ్రహ్మ ! నీవు వరాలు కావాలని కోరుకునే వారికి వరదుడవవుతావు. దేవతలకు, దానవులకు, ఋషులకు, పితృగణాలకు, సమస్త ప్రాణులకు ఆశ్రితవ్రతుడవు, తపోధనుడవు అయిన నీవు ఉపాస్యుడవు అవుతావు. దేవకార్యసిద్ధికోసం అవతరించినప్పుడు, కుమారునివలె నన్ను నీవు శాసించవచ్చు, ఆ యా కార్యాలలో నియోగించవచ్చు. అని

నేను ఈ వరాలను, ఇంకా ఇతరాలను మహాతేజస్వి అయిన బ్రహ్మకు సంతోషంగా ఇచ్చి, సంతృప్తితో నివృత్తిపరుడను అయినాను. సమస్త కర్మలనుండి విరమించటమే పరమ నిర్వృత్తి అంటారు. కాబట్టి నివృత్తిని పొందినవాడు సర్వాంగ సౌఖ్యాన్ని పొంది, సంచరిస్తాడు.

సాంఖ్య శాస్త్ర సిద్ధాంతాలను నిశ్చయించిన ఆచార్యులు విద్యా సహాయుడు, సూర్యమండలంలో ఉన్న ఏకాగ్ర చిత్తు డైన కపిలాచార్యు డని చెపుతారు. వేదాలలో సంస్తుతు డైన హిరణ్యగర్భభగవానుడు నా స్వరూపమే. బ్రహ్మ ! యోగులు ఆనందించే యోగ శాస్త్రంలో ప్రసిద్ధికెక్కిన పురుషుడను, ఈశ్వరుడను నేనే. ఈ సమయంలో సనాతన పరమాత్మనయిన నేనే వ్యక్తరూపాన్ని ధరించి ఆకాశంలో ఉన్నాను. చతుర్యుగసహస్రం అంతమయినప్పుడు ఈ జగత్తును నేనే సంహరిస్తాను. ఆ సమయంలో చరాచర ప్రాణి సమూహాన్ని అంతను నాలో లీనం చేసుకొని, నేను ఏకాకిగానే, స్వీయ విద్యాశక్తితో ఈ శూన్య జగత్తులో విహరిస్తాను. తరువాత సృష్టిసమయంలో, ఆ విద్యా శక్తితోనే ప్రపంచంలో ఉండే సమస్త చరాచర(ప్రాణి సృష్టిని చేస్తాను. నా నాలుగు స్వరూపాలలో నాలుగవ దైన వాసుదేవ మూర్తి వినాశరహిత మైన శేషుని ఉత్పన్నం చేసింది. ఆయనను సంకర్షణుడు అంటారు. ఆ మూర్తి ప్రద్యుమ్నుని ఉత్పన్నం చేసింది. ప్రద్యుమ్నుని నుండి అనిరుద్ధుడు ఆవిర్భవించాడు. ఈ చతుర్మూర్తులు నేనే. మాటి మాటికి జనించే ఈ సృష్టివిస్తారం నాదే. నా అనిరుద్ధమూర్తి నుండి బ్రహ్మ ఉత్పన్ను డయినాడు. ఆయన నా నాభికమలం నుంచి జన్మించాడు. బ్రహ్మనుండి సమస్త చరాచర భూతసృష్టి జరిగింది. కల్పాదిలో ఈ సృష్టిని అంతను మాటిమాటికి నేను చేస్తుంటాను. (చివరకు సంహారం కూడా నేనే చేస్తుంటాను). ఈ విషయం నీవు బాగా తెలుసుకో. ఆకాశంలో సూర్యోదయం అయి, ఆకాశంలోనే అస్తమయం జరుగుతుంటుంది. ఈ ఉదయాస్తమయాలు నిరంతరం జరుగుతూ ఉంటాయి. (ఇలాగే నా నుండి జగత్తు ఉత్పన్నం అవుతుంది. నాలోనే లీనం అవుతుంది. ఈ సృష్టి క్రమం ఇలాగే జరుగుతుంటుంది). అమితతేజస్వి అయిన కాలం, అదృశ్యం అయిన సూర్యుని మళ్లీబలవంతంగా కన్పించేసినట్లు, నేను కూడా సమస్తప్రాణుల హితంగోరి ఈ భూమిని సముద్రం నుంచి బల(ప్రయోగంతో పైకి తెస్తాను.

భీష్ముడు చెప్పాడు. అప్పుడు నారదుడు భగవంతుడైన జనార్దనుని మహా ప్రభూ ! నిన్ను ఏయే స్వరూపాలలో చూడాలి ? స్మరించాలి?' అని అడిగాడు. శ్రీ భగవానుడు ఇలా చెప్పాడు. "నారదా ! నా అవతార నామాలను విను. మత్స్యం, కూర్మం, వరాహం, నారసింహం, వామనం, పరశురాముడు, దశరధరాముడు, బలరాముడు, కృష్ణుడు, కలికి అని నా దశావతారాలు. మొదట

మత్స్యావతారంధరించి, సమస్త ప్రజలను నిర్భయులను చేస్తాను. మహాసముద్రంలో మునిగిపోతున్న లోకాలను, వేదాలను ఉద్ధరిస్తాను. వత్సా ! మేరుపర్వతం వంటి నా రెండవ అవతారం కూర్మావతారం. దానిలో అమృతం కోసం మందర పర్వతాన్ని ధరిస్తాను. తరువాత వరాహావతారం ధరిస్తాను.

పాపజనభారా క్రాంతమై సముద్రమే వడ్డాణంగాగల భూమిని పైకి తెస్తాను. అప్పుడు బలమద గర్వితుడైన హిరణ్యాక్షుడనే దైత్యుని వధిస్తాను. తరువాత నృసింహావతారం ధరించి యజ్ఞవిఘ్నకర్త, దితికుమారుడూ అయిన హిరణ్యకశిపుని సంహరిస్తాను. విరోచనుని పుత్రుడైన బలి మహాబలవంతుడు, మహాసురుడు. దేవాసుర రాక్షసులతో గూడిన సర్వలోకాలకు వధించవీలుగాని వాడై. ఇంద్రుని సర్వరాజ్యం నుంచి తొలగిస్తాడు. అతడు మూడులోకాలను అపహరించగా, ఇంద్రుడు యుద్ధరంగానికి విముఖుడు కాగా కశ్యపునివలన పన్నెండవ ఆదిత్యునిగా, వామనునిగా జన్మిస్తాను.

ద్విజోత్తమా ! బ్రహ్మచారినై బలి చక్రవర్తి యజ్ఞభూమికి వెళ్తాను. అప్పుడు నన్ను ప్రజలు అందరూ స్తుతిస్తుండగా యజ్ఞస్తుతి చేస్తాను. అందుకు బలిచక్రవర్తి సంతోషిస్తాడు. బ్రహ్మచారీ ! వీం కావాలి ? అని ఆయన అడుగగా గొప్పవరం అడుగుతాను. ఆ మహాసురుని మూడడగులు ఇమ్మని అడుగుతాను. మంత్రులు నివేధించినా ఆయన నాకు ప్రసన్నుడయి నేను కోరినది ఇస్తాడు. సంకల్పజలం నా చేతిలో పడగానే

మూడు అడుగులతో మూడులోకాలను కొలిచి ఆయన రాజ్యాన్ని అంతనూ మహాతేజస్వి అయిన ఇంద్రునికి ఇస్తాను. నారదా ! దేవతలను వారివారి స్థానాలలో నిలుపుతాను. సర్వదేవతలకు వధింపవీలుగాని దానవశ్రేష్ముడైన బలిని పాతాళనివాసిగా చేస్తాను. త్రేతాయుగంలో భృగువంశశ్రేష్ముడైన పరశురాముడను అవుతాను. సైన్యంతో, వాహనాలతో సమృద్ధమయిన క్షత్రియజాతిని సంహరిస్తాను. త్రేతా ద్వాపరయుగాల సంధి కాలం రాగా, జగత్పతినైన నేను దశరధ రాముడనుగా అవతరిస్తాను. త్రితమునికి విశ్వాస ఘాతకులు ఏకతద్వితులు అనే ఇద్దరు ప్రజాపతి పుత్రులు. వారు ఋషులైనా వికారమైన వానరరూపు లవుతారు. వారివంశాలలో జన్మించిన వారు ఇంద్రునితో సమానమయిన పరాక్రమవంతులు, మహాబలవంతులు, మహావీరులు అవుతారు. నారదా ! దేవ కార్యార్థమయి వారు అందరూ నాకు సహాయం అవుతారు. తరువాత లోకకంటకుడు, భయంకరుడు, ఘోరమైనవాడు, పులస్త్యవంశానికి మాయని మచ్చ అయిన రావణుని సైన్యాలతో కూడా సంహరిస్తాను. తరువాత ద్వాపరకలియుగాల సంధికాలం పూర్తి కాబోయేటప్పుడు కంసునికారణంగా మథురానగరంలో నా అవతారం జరుగుతుంది.

అప్పుడు కంసుని, కేశిని, కాలాసురుని, మహోత్కటుడైన అరిష్టుని, మహాపరాక్రమవంతుడైన చాణూరుని, మహా బలుడైన ముష్టికుని, ప్రలంబాసురుని, ధేనుకుని, వృషభరూపంలో వచ్చిన అరిష్టాసురుని

సంహరించి, యమునానదిలోని విశాలమైన సరస్సులో కాళియుడు అనే నాగరాజును వశంచేసుకొంటాను. గోకులంలో ఇంద్రుడు పెద్దవాన కురిపించేటప్పుడు, గోవులను రక్షించటంకోసం మహాపర్వతమైన గోవర్ధనాన్ని వీడు దినాలు రాత్రింబవళ్ళు నా చేతితో గొడుగులాగా పట్టుకుంటాను. వర్షం ఆగిపోయిన తరువాత ఆ పర్వత శిఖరాన్ని ఎక్కి ఇంద్రునితో సంభాషిస్తాను.

అక్కడ నేను చాలమంది దేవతలను బాధించే రాక్షసులను సంహరించి, కుశస్థలంలో ద్వారకానగరం అనే పేరుతో నిర్మించి అక్కడ నివసిస్తాను. ఆ నగరంలో నివసిస్తూ అదితి దేవికి బాధకలిగించిన భూమి పుత్రుడైన నరకాసురుని ముర, పీఠులనే సేనానులతో పాటు సంహరిస్తాను. ఆ రాక్షససంహారం తరువాత నానావిధాలయిన ధనధాన్యాలతో సమృద్ధమైన ప్రాగ్జ్యోతిష పురంలోని వాటిని అన్నింటినీ కుశస్థలికి తెస్తాను.

తరువాత ఊసరవెల్లి (తొండ) అయిన నృగరాజును శాపవిముక్తుని చేస్తాను. అనంతరం పౌత్రుడైన అనిరుద్ధుని కారణంగా, బాణుని రాజధాని అయిన శోణితపురానికి వెళ్ళి, ఆ రాక్షసునితో మహాయుద్ధం చేస్తాను.

లోక నమస్కృతులైనా, బాణునికి సంతృప్తి కలిగించగోరిన శివ స్కందులను పరాజయం పాలుచేస్తాను. బలిపుత్రుడు, సహస్రబాహువు అయిన బాణాసురుని ఓడించి, సాల్వుని విమానంలో ఉండే సమస్త వీరులను నాశనం చేస్తాను. ద్విజోత్తమా ! గర్గాచార్యుని తేజస్సుతో జనించి, శక్తిశాలి అయిన కాలయవనుడు అనే ప్రఖ్యాత రాక్షసుని సంహారం నా వలన జరుగుతుంది. సమస్త రాజులతో విరోధించే జరాసంధుడు అనేరాజు ఆసురబలంతో వృద్ధినంది గిరివ్రజంలో ఉంటాడు. నా బుద్ధివైభవంతో అతడు మరణిస్తాడు. ధర్మరాజు చేసే రాజసూయ యాగంలో, భూమండలంలో ఉండే సమస్తరాజులు రాగా వారి సమక్షంలో శిశుపాలుని వధిస్తాను. అర్జునుడు ఒక్కడే నాకు సహాయం కాగా యుధిష్ఠిరుని స్వీయరాజ్యంలో స్థాపిస్తాను.

అప్పుడు జనులు "పరమాత్మ స్వరూపులయిన నరనారాయణులనే ఋషులు కలిసి ఉద్యమించి, లోకక్షేమంకోసం క్షత్రియజాతిని సంహరిస్తున్నారు." అని అంటారు. సాధుశ్రేష్ఠా ! భూదేవి కోరినట్లు ఆమె భారాన్ని తగ్గించి, ద్వారకానగరం లోని సమస్త యాదవశ్రేష్ఠులను నాశంచేసి, స్వజాతి నాశం అనే ఘోరకార్యం చేస్తాను. శ్రీ కృష్ణుడు, బలరాముడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అనే నాలుగు స్వరూపాలు ధరించే నేను లెక్కలేనన్ని పనులు చేసి, బ్రహ్మదేవుడు గౌరవించే స్వీయలోకాలకు చేరుతాను. ద్విజశ్రేష్ఠా ! హంస, కూర్మం, మత్స్యం, వరాహం, నారసింహం, రాముడు, దశరథరాముడు, యదువంశీయ కృష్ణుడు, కల్కి అనేవి నా అవతారాలు. వేదశ్రుతి నష్టమైనప్పుడు అవతారం ధరించి దానిని ప్రకాశింపజేస్తాను. నేను పూర్వం కృతయుగంలో ఆధ్యాత్మిక విషయాల వాస్తవమైన

జ్ఞానాన్ని, చతుర్వేద సంహితలను ఆవిష్కరించాను. గడిచిపోయిన నా అవతారాలను నీవు పురాణాలలో విని ఉంటావు. ఉత్తమోత్తమ మయిన నా అవతారాలు అనేకం ఇంతకు ముందే అయినవి. ఆ అవతారాలు లోకహితకార్యాన్ని నిర్వహించి మళ్ళీ స్వీయమూల స్వరూపంలో లీన మయినవి. నాయందు అనన్యమైన భక్తి ఉండటంవల్ల నేడు, ఇక్కడ, నీకు, లభించిన నా స్వరూపదర్శనం బ్రహ్మకు కూడా ఇంతవరకు లభించలేదు. బ్రహ్మర్షీ ! నాయందు భక్తిగల నీకు నేను గడచిపోయిన, రాబోయే నా అవతారాలను రహస్యయుక్తాలను పూర్తిగా చెప్పినాను."

భీష్ముడు చెపుతున్నాడు. "అవ్యయుడు, విశ్వస్వరూప ధారి, భగవంతుడు అయిన ఆ దేవుడు ఈ విషయాలు అన్నీ చెప్పి అక్కడనే అంతర్ధానం చెందాడు. మహాతేజస్వి అయిన నారదుడు కూడా తాను కోరిన భగవదనుగ్రహం పొంది, నరనారాయణుల దర్శనం కోసం బదరికాశ్రమానికి వేగంగా వెళ్ళాడు. ఈ మహత్తరమైన జ్ఞానం నాలుగు వేదాల విజ్ఞానంతో సంయుక్తమైనది. దీనిలో సాంఖ్యయోగ సిద్ధాంత విశేషాలు ఉన్నవి. పాంచరాత్రాగమ మని దీని పేరు. శ్రీమన్నారాయణుని ముఖారవిందం నుంచి వ్యక్తమైన దానిని నారదుడు శ్వేతద్వీపంలో విన్నది విన్నట్లుగా, కన్నదికన్నట్లుగా బ్రహ్మదేవుని నివాసంలో చెప్పాడు.' యుధిష్ఠిరుడు అడిగాడు. "మేధావి అయిన శ్రీనారాయణుని మాహాత్మ్యం మహదాశ్చర్యకరం. అయితే నారదుని నుండి వినేదాకా బ్రహ్మకు ఈ విషయం తెలియదా ? పితామహుడయిన బ్రహ్మ ఆ శ్రీమన్నారాయణునికి తరువాతివాడే గదా ! మహాతేజస్వి అయిన ఆ స్వామి ప్రభావాన్ని ఆయన ఎందుకు తెలుసుకో లేకపోయాడు ?" భీష్ముడు చెపుతున్నాడు. "రాజేంద్రా ! ఇంతవరకు లెక్కలేనన్ని వేల మహాకల్పాలు గడచిపోయినవి. అనేక సృష్టిలయాలు జరిగినవి. సృష్టి ప్రారంభంలో బ్రహ్మదేవుడే ప్రజాసమూహసృష్టికర్త అని చెపుతారు. రాజేంద్రా ! ఆయన తన ఉత్పత్తికి హేతువైన దేవశ్రేష్ఠుడైన నారాయణుని, ఇంతకన్న ఎక్కువగానే ఎరుగును. ఆయనను సర్వేశ్వరుడని, పరమాత్మ అని భావిస్తాడు. బ్రహ్మలోకంలో బ్రహ్మదేవుడే కాక ఇతరమైన సిద్ధసమూహాలు వచ్చిఉన్నారు. నారదుడు వేద సమ్మితం, ప్రాచీనం అయిన ఈ పాంచరాత్ర శాస్త్రాన్ని వారికి వినిపించాడు. పవిత్రాంతఃకరణం గల ఆ సిద్ధుల నుండి సూర్యుడు విన్నాడు. ఆయన తాను విన్నదానిని తన వెంటవచ్చే పూతమనస్కులైన అరువదివేల మంది మునులకు వినిపించాడు. లోకాలను తపింపజేస్తూ వెళ్ళుతున్న సూర్యునికి ముందు వెళ్ళటానికి సృష్టినందిన నిర్మల మనస్సు గల ఋషులకు కూడా భగవంతుని ఈ మహిమను భాస్కరుడు వినిపించాడు. వత్సా ! సూర్యుని వెంటవచ్చే ఆ మహాత్ములైన ఋషులు మేరుపర్వతం మీదికి వచ్చిన దేవతలకు

ఈ ఉత్తమ విషయాన్ని చెప్పారు. తరువాత దేవతలనుంచి విన్న దీనిని, ముని శ్రేష్ఠుడైన అసితు డనే బ్రాహ్మణుడు విని, పితరులకు వినిపించాడు. పరంపరగా సంప్రాప్తమైన ఈ ఉత్తమజ్ఞానం శాంతను మహారాజు విన్నాడు. నాయనా ! నాకు మా తండ్రి శాంతనుడు దీన్ని చెప్పాడు. ఆయన చెప్పిన దానిని విన్న నేను నీకు చెప్పాను. దేవతలు, మునులు, లేక ఇతరులు దీనిని విన్నవారు అందరూ, అన్ని విధాలా ఆ పరమాత్మను పూజిస్తుంటారు. రాజా ! ఈ రీతిగా పరంపరగా వచ్చినది, ఋషి సంబంధమైనది ఈ ఆఖ్యానం. వాసుదేవుని భక్తుడు కాని వానికి దీనిని ఏ రీతిగానూ నీవు ఉపదేశించరాదు.

రాజేంద్రా ! ఉత్తమమయిన ఈ ఉపాఖ్యానాన్ని ఎల్లప్పుడు వినిపించే భక్తుడైన మానవుడు ఏకాగ్ర చిత్తుడై చాల త్వరగా విష్ణుదేవుని సనాతనలోకం చేరుతాడు.

రాజా ! నీవు నా వద్ద విన్న అనేకమైన ఉపాఖ్యానాల సారమైన దానిని తీసి నీముందు ఉంచాను. రాజా ! పూర్వం దేవదానవులు సముద్రాన్ని మథించి అమృతాన్ని తీసినట్లు, ప్రాచీన కాలంలో బ్రాహ్మణులు సర్వశాస్త్రాలను మథించి, ఈ అమృతమయమైన కథను ఇక్కడ వ్యక్తం చేశారు. ప్రతిరోజు దీన్ని పారాయణ చేసేవాడు, ఎల్లప్పుడూ వినే వాడు, భగవంతునిపై అనన్యమైన భక్తిగలిగిన భక్తుల యందు ఏకాగ్రచిత్తంతో అనురక్తుడై శ్వేతద్వీపానికి వెళ్ళుతాడు. ఆ వ్యక్తి చంద్రసమానమైన కాంతిరూపాన్ని ధరించి సహస్రకిరణుడైన శ్రీమన్నారాయణునిలో ప్రవేశిస్తాడు. ఇందులో సందేహంలేదు. ఈ కథను మొదటినుండి విన్న ఆర్తుడు రోగవిముక్తుడు అవుతాడు. జిజ్ఞాసువు, కావలసిన వాటిని పొందుతాడు. భక్తుడు ఉత్తమ గతి నందుతాడు. రాజా ! నీవు కూడా నిరంతరం ఆ పురుషోత్తముని అర్చించు. సమస్త జగత్తుకు ఆయనే తల్లి, తండ్రి, గురువు అవుతాడు. మహాబాహూ ! యుధిష్ఠిరా ! సనాతనుడు, బ్రాహ్మణహిత కాంక్షి, మహాబుద్ధిమంతుడు, సనాతన పురుషుడు అయిన జనార్దనుడు సర్వదా నీకు ప్రసన్నుడై యుండుగాక."

వైశంపాయనుడు చెప్పాడు. "జనమేజయా ! ఉత్తమమైన ఈ ఆఖ్యానాన్ని ధర్మరాజు, ఆయన సోదరులు విని అందరూ శ్రీమన్నారాయణునికి పరమభక్తులు అయినారు. భరతవంశీయా ! వారు ప్రతిరోజు భగవన్నామజప తత్పరులై 'పురుషోత్తమ భగవానునికి జయం' అని అనేవారు. మా పరమగురుదేవులు కృష్ణద్వైపాయన మహర్షి మహోత్తమమైన నారాయణ మంత్రాన్ని జపిస్తూ, నిరంతరం ఆ మంత్ర మహిమను వివరిస్తుంటారు. ఆయన ఎల్లప్పుడూ ఆకాశమార్గాన క్షీరసాగర తీరానికి వెళ్ళి, దేవదేవుడైన శ్రీ హరిని పూజించి స్వీయాశ్రమానికి వస్తుంటారు." భీష్ముడు చెప్పాడు. "యుధిష్ఠిరా ! నారదమహర్షి చెప్పిన ఈ ఉపాఖ్యానం అంతా నీకు వివరించి చెప్పాను. ఇది పరంపరగా మొదట మా

తండ్రిగారికి లభించింది. ఆయన నాకు చెప్పారు. సౌతి చెప్పాడు. 'శౌనకా ! వైశంపాయనుడు చెప్పిన ఈ ఆఖ్యానం అంతా నేను నీకు చెప్పాను. జనమేజయుడు దీనిని విని యథావిధిగా భగవంతుని పూజించాడు. మీరు అందరు తపస్సులు, వ్రతపాలన తత్పరులు. నైమిషారణ్యంలో నివసించే వారు దాదాపుగా అందరు వేదవేత్తలయిన ద్విజోత్తములు. వారు శౌనకుని మహాయజ్ఞంలో అక్కడ సమావేశం అయినారు. మీరు అందరు యథావిధిగా హోమాలు చేసి యజ్ఞాలతో ఆ సనాతన పరమేశ్వరుని పూజించండి. పరంపరా ప్రాప్తమైన ఈ ఉత్తమోపాఖ్యానాన్ని నా తండ్రి మొదట నాకు చెప్పాడు."

340. నారాయణీయము.

శౌనకుడు అడిగాడు. "సూతనందనా ! ప్రభావశాలి, వేదవేద్యుడు అయిన శ్రీమన్నారాయణుడు యజ్ఞాలలో ప్రథమభాగం గ్రహించేవాడు గాను, వేదవేదాంగాలు తెలిసిన పరమాత్మ గాను నిత్యమూ యజ్ఞ కర్తగాను చెపుతారుగదా ! ఒకే ఒకడైన భగవంతునిలో యజ్ఞకర్తృత్వం, యజ్ఞ భోక్తృత్వం ఎలా సంభవిస్తాయి ? సర్వప్రభువు, క్షమావంతుడు అయిన శ్రీమన్నారాయణుడు స్వయంగా నివృత్తి ధర్మం అవలంబించి ఉండి, నివృత్తి ధర్మాలను విధించాడు. నివృత్తి ధర్మాన్ని అవలంబించి ఉండి కూడా, ఆయన దేవతలను ప్రవృత్తి ధర్మంలో అంటే యజ్ఞాది కర్మలలో భాగం గ్రహించే వారినిగా ఎందుకు చేశాడు ? మునులను, ఋషులను ఇహలోక విషయ విరక్తులను, నివృత్తి ధర్మపరాయణులనుగా ఎందుకు చేశాడు ? సూతనందనా ! గూఢమై, చాలా ప్రాచీనమైన ఈ సందేహాన్ని నివారించవలసింది. ఇంతకుముందు శ్రీమన్నారాయణుని ధర్మ సంహితలు అనేకం చెప్పావుగదా!' సౌతి చెప్పాడు. "శౌనకాదిమునులారా ! జనమేజయుడు వైశంపాయనుని అడిగిన దానినే మీరు అడిగారు. పురాణోక్తమైన ఆ విషయాన్ని నేను మీకు చెపుతాను. మహామేధావి అయిన జనమేజయుడు సమస్త ప్రాణుల ఆత్మ స్వరూప మయిన పరమాత్మ శ్రీమన్నారాయణుని మాహాత్మ్యాన్ని విని, ఇలా అడిగాడు.

"మునీంద్రా ! బ్రహ్మ, దేవతలు, అసురులు, మానవులతో గూడిన ఈ సమస్తలోకాలు లౌకిక మయిన అభ్యుదయాని (ఇష్టప్రాప్తి)కి ఉపాయాలుగా చెప్పబడిన కర్మలయందే ఆసక్తితో కనిపిస్తున్నాయి. కాని బ్రహ్మర్షీ ! నీవు మోక్షం పరమశాంతి, పరమసుఖం అని చెప్పావు. ముక్తులయినవారు పాప పుణ్య రహితులయి, సహస్రకిరణాలతో ప్రకాశించే శ్రీమన్నారాయణునిలో ప్రవేశిస్తారని నేను విన్నాను. సనాతనమైన ఈ మోక్ష ధర్మాన్ని అనుష్ఠించటం చాలా కష్టం. అందువల్లనే దేవతలు దానిని వదలి హవ్యకవ్యాలు

స్వీకరిస్తారు. వీరే కాక బ్రహ్మ, రుద్రుడు, బలాసురసంహర్త ఇంద్రుడు, సూర్యుడు, నక్షత్రాధిపతి చంద్రుడు, వాయువు, అగ్ని, వరుణుడు, ఆకాశం, భూమి ఇంకా మిగిలిన దేవగణాలు అందరు పరమాత్మ నిర్మించిన తమ మోక్షమార్గాన్ని ఎరుగరా ? దానిని అనుసరించి నిశ్చయమూ, తరుగుదల లేనిదీ, వినాశం లేనిదీ అయిన మార్గాన్ని ఎందుకు అనుసరించరు ? కొంత నియమిత కాలానికి మాత్రమే లభించే స్వర్గాది ఫలాలను దృష్టిలో పెట్టుకొని, ప్రవృత్తి మార్గాన్ని ఆశ్రయించే కర్మపరాయణులు, కాలసీమలకు కట్టుబడి మాత్రమే కర్మఫలాన్ని అనుభవిస్తారు. ఇదే వారి దోషం. ద్విజశ్రేష్ఠా ! ఈ సందేహం నామనస్సులో ముల్లులాగా గ్రుచ్చుకొంటున్నది. కాబట్టి అందుకు తగిన ఇతిహాసాన్ని చెప్పి, నా సందేహం పోగొట్టు. ఇది వినాలి అని నా మనస్సులో అధికాసక్తి ఉన్నది. దేవతలు యజ్ఞాలలో భాగం గ్రహించే అధికారులు అని ఎందుకు చెప్పారు ? స్వర్గంలో ఉండే దేవతలకు మాత్రమే యజ్ఞాలలో ఎందుకు పూజ జరుగుతుంది ? ఉత్తమ బ్రాహ్మణా ! యజ్ఞాలలో భాగాలు గ్రహించే దేవతలు స్వయంగా యజ్ఞాలు చేసి, భాగం ఎవరికి ఇస్తారు ?"

వైశంపాయనుడు చెప్పాడు. "జనాధిపా ! ఆహా ! నీవు ఎంత రహస్య మయిన ప్రశ్న అడిగావు ! మహత్తరమయిన తపస్సు చేయనివాడు, సంపూర్ణ వేదవిషయాలు తెలియని వాడు, పురాణాలు చక్కగా తెలియనివాడు నీ ప్రశ్నకు సరిఅయిన సమాధానం పూర్తిగా చెప్పలేడు. నీ ప్రశ్నకు నేను ఇప్పుడు చాలా సంతోషించి సమాధానం ఇస్తాను. పూర్వం నేను ఈ ప్రశ్న అడగగా వేదవిస్తారం చేసిన మాగురుదేవులు వ్యాసమహర్షి చెప్పినదే నీకు చెపుతాను. సుమంతుడు, జైమిని, పైలుడు, నేను నలుగురం, ఐదవవాడు శుకుడు ఆ మహర్షికి అయిదుగురం శిష్యులం. అంతరింద్రియ నిగ్రహం గలవారు, శౌచాచారానుష్ఠాన పరులు, కోపాన్ని జయించిన వారు, ఇంద్రియాలను జయించివారు, తన సేవకు వచ్చిన ఈ శిష్యులు అందరికి నాలుగు వేదాలను, పంచమ వేద మయిన మహాభారతాన్ని అధ్యయనం చేయించారు గురువుగారు. సిద్ధ చారణులు సంచరించే సుందరగిరి శ్రేష్ఠమైన మేరుపర్వతం మీద వేదాలను అధ్యయనం చేస్తున్న వారికి ఒక సంశయం కలిగింది. అది ఇప్పుడు నీవు అడిగినదే. శిష్యులమయిన మాకు అందరికి గురువుగారు ఇచ్చిన సమాధానమే ఇపుడు నీకు చెపుతాను. శిష్యుల ప్రశ్నను విని, అజ్ఞానం అనే చీకటిని పోగొట్టే వ్యాసమహర్షి ఇలా చెప్పారు. "సాధుపురుష శ్రేష్ఠులయిన శిష్యులారా ! నేను చెప్పేది చాలా పురాతన వృత్తాంతం. భూత భవిష్య ద్వర్తమానాలనే మూడు కాలాలజ్ఞానం పొందటానికి చాలా కఠినమైన తీవ్రతపస్సు చేశాను. ఇంద్రియాలను

వశంచేసుకుని తపస్సు చేసిన నాకు, శ్రీమన్నారాయణుని అనుగ్రహం వలన క్షీరసాగరతీరంలో నా కోరిక మేరకు త్రికాలజ్ఞానం లభించింది. కాబట్టి మీ సందేహం పోగొట్టటానికి ఉత్తమము, న్యాయ సమ్మతమూ అయిన సమాధానం చెపుతాను, వినండి.

కల్పానికి మొదట జరిగినది, జ్ఞాన దృష్టితో నేను చూచినది అయిన వృత్తాంతాన్ని అంతా చెపుతాను. సాంఖ్యయోగ శాస్త్రజ్ఞులు చెప్పే పరమాత్మ స్వీయ కర్మ ప్రభావంతో మహాపురుషుడు అనే పేరు దాలుస్తాడు. ఆయననుంచే అవ్యక్తం ఉత్పన్నం అయింది. దానిని విద్వాంసులు ప్రధానం అని అంటారు. జగత్తు సృష్టికోసం ఆ మహాపురుషుడైన, అవ్యక్తం నుండి వ్యక్తం జనించింది. దానినే సమస్తలోకాలలో అనిరుద్ధుడు, మహత్తయిన ఆత్మ అంటారు. వ్యక్తభావాన్ని పొందిన ఆ అనిరుద్ధుడు పితామహు డయిన బ్రహ్మను సృష్టించాడు. ఆయన సర్వతేజోమయుడు. ఆయనను అహంకారం అంటారు. భూమి, వాయువు, ఆకాశం, జలం, తేజస్సు అనే అయిదు సూక్ష్మమహాభూతాలు అహంకారం నుంచి ఉత్పన్నం అయినాయి. అహంకార స్వరూపుడయిన బ్రహ్మ పంచమహాభూతాలను సృష్టించి, వాటికి శబ్ద స్పర్శాదులయిన గుణాలను నిర్మించాడు. వాటినుంచి ఉత్పన్నమయిన సాకార ప్రాణులను గురించి చెపుతాను విను. మరీచి, అంగిరుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు, స్వాయంభువమనువు. ఈ ఎనిమిది మందిని ప్రకృతి అని తెలుసుకోవాలి. వారిలోనే లోకాలు అన్నీ ప్రతిష్ఠితమయి ఉన్నవి. పితామహుడయిన బ్రహ్మ లోకం జీవనాన్ని గడపటానికి వేదవేదాంగాలు, యజ్ఞాంగాలతో గూడిన యజ్ఞాలను సృష్టించాడు. వెనక చెప్పిన ఎనిమిది ప్రకృతుల నుంచి జగత్తు జనించింది. బ్రహ్మదేవుని రోషంనుంచి రుద్రుడు జన్మించాడు. ఆ రుద్రుడు పదిమంది రుద్రులను సృష్టించాడు. ఈ పదకొండుమంది రుద్రులను వికార పురుషులు అంటారు. లోక రక్షణకు ఉత్పన్నమయిన ఏకాదశ రుద్రులు, అష్టప్రకృతులు, దేవర్షులు బ్రహ్మదేవుని సేవకు వచ్చారు.

"దేవా ! ప్రభావసంపన్నులయిన మీరు మమ్ములను సృష్టించారు. మాలో ఎవరు ఏ అధికారంలో ఏ పనిలో ఉండవలెను ? మీరు నిర్దేశించే అర్థసాధకమయిన అధికారం అహంకారయుక్తుడయిన కర్త ద్వారా ఎలా సాధ్యం అవుతుంది ? ఆ అధికారాన్ని, ప్రయోజనాన్ని గురించి ఆలోచించే వ్యక్తికి తనకర్తవ్యాన్ని నిర్వహించగలిగే శక్తిని ఇవ్వండి" అని వారు అడగగా బ్రహ్మదేవుడు ఆ దేవతలతో ఇలా అన్నాడు. బ్రహ్మచెప్పాడు. "దేవతలారా ! మంచి విషయం గుర్తుచేశారు. మీకు మంచి జరుగుగాక. మీకు వచ్చిన ఆలోచనే నాకూ వచ్చింది. ముల్లోకాల అధికారకర్తవ్యాన్ని ఎలా సంపాదించాలి ? దానివల్ల నాశక్తి, మీ శక్తి ఎలా నష్టం కాకుండా ఉండాలి ? అందుకోసం మనం అందరం ఇక్కడి

నుంచి లోకసాక్షి, మహాత్ముడయిన శ్రీమన్నారాయణుని శరణు వేడుదాం. ఆయన మనకు హితాన్ని చెపుతాడు !" తరువాత ఋషులు, దేవతలు బ్రహ్మదేవునితో కలిసి, లోకహితం కోరి క్షీరసముద్రంవైపు ఉత్తర తీరానికి వెళ్ళారు. అక్కడ బ్రహ్మచెప్పినట్లు వారు అందరు వేదోక్తరీతిగా తపస్సు ప్రారంభించారు. ఆ మహానియమం అన్ని తపస్సుల కంటె కఠినమైనది. వారి చూపులు, చేతులు ఊర్ధ్వదిక్కుకు ఉన్నవి. మనస్సు ఏకాగ్రం అయింది. అందరు ఒంటికాలి మీద నిలుచున్నారు. నిశ్చలంగా నిలబెట్టిన కట్టలవలె ఉన్నారు. వారు వేయి దివ్య సంవత్సరాలు చాలా మిక్కిలి కఠోరమైన తపస్సు చేసిన తరువాత, వారికి వేదవేదాంగాలతో అలం కృతమైన మధురవాక్కు వినిపించింది.

శ్రీభగవానుడు చెప్పాడు. "బ్రహ్మాది దేవతలారా ! తపోధనులైన ఋషులారా ! స్వాగతంతో మిమ్ములను సత్కరించి, ఉత్తమ విషయం చెపుతాను. మీ ప్రయోజనం ఏమిటో నాకు తెలిసింది. అది లోకానికి అంతకు చాలా హితకరం. మీరు ప్రవృత్తితో గూడిన ధర్మాన్ని అనుష్ఠించాలి. అది మీ ప్రాణ పోషకం, శక్తిసంవర్ధకం అవుతుంది. మహాధైర్యశాలులయిన దేవతలారా ! నన్ను ఆరాధింపవలెననే కోరికతో మహత్తర తపస్సు చేశారు. ఆ తపస్సుకు తగిన ఉత్తమ ఫలాన్ని మీరు అనుభవించాలి. సర్వజగత్తులకు గురువు, లోకపితామహుడు అయిన బ్రహ్మ, శ్రేష్ఠులైన దేవతలు మీరు అందరు ఏకాగ్రచిత్తులై యజ్ఞాలతో నన్ను పూజించండి. లోకేశ్వరులారా ! మీరు అందరు యజ్ఞాలలో ఎల్లప్పుడు నాకు భాగాన్ని సమర్పించండి. ఇలా జరిగితే, నేను మీ అధికారానుసారం మేలుగలిగే దాన్ని ఉపదేశిస్తాను." వైశంపాయనుడు చెప్పాడు. "దేవదేవుని ఈ మాటలు విని బ్రహ్మ, దేవతలు, మహర్షులు పులకించారు. తరువాత వారు వేదోక్త విధానంతో వైష్ణవ యజ్ఞాన్ని ఆచరించారు. ఆ యజ్ఞంలో బ్రహ్మ స్వయంగా భగవంతునికి యజ్ఞభాగాన్ని నిర్ణయించాడు. దేవతలు, దేవఋషులు భగవంతునికి తమ తమ భాగాలను నిశ్చయించారు. కృతయుగ ధర్మానుసారం నిశ్చయింపబడిన ఆ యజ్ఞభాగాలను అందరూ ఆదరించారు. 'శ్రీమన్నారాయణుడు సూర్యసమ తేజస్వి, అంతర్యామి, అజ్ఞానాంధకారానికి ఆవలివాడు, సర్వవ్యాపి, అన్ని చోట్లకు వెళ్ళేవాడు, ఈశ్వరుడు, వరదాత, సర్వసమర్థుడు అని ఋషులు చెపుతారు. యజ్ఞ భాగం నిర్ణీతం అయిన తరువాత వరదాత అయన దేవుడు, మహేశ్వరుడయిన నారాయణుడు ఆకాశంలో అశరీరిగా ఉండి ఆ సమస్త దేవతలతో ఇలా అన్నాడు.

"దేవతలారా ! మీలో ఎవరు ఏ భాగం కల్పించారో అది ఆ రూపంలోనే నన్ను చేరింది. ఇందుకు ప్రసన్నుడనై నేను మీకు పునరావృత్తిలక్షణంగల ఫలితాన్ని ఇస్తాను. దేవతలారా ! నా అనుగ్రహం వలన మీకు ఈ లక్షణం కలుగుతుంది. ప్రతియుగంలో

మీరు ఉత్తమ దక్షిణలుగల యజ్ఞాలతో యజిస్తూ ప్రవృత్తి ధర్మఫలాన్ని అనుభవిస్తారు. సర్వలోకాలలోని నరులు యజ్ఞాలతో పూజించేవారు మీకు వేదోక్తరీతిగా యజ్ఞభాగాలను కల్పిస్తారు. ఈ మహాయజ్ఞంలో ఏ దేవత నాకు ఏ యే భాగం నిశ్చయించారో, దాన్ని వైదిక సూత్రాలలో అలాంటి యజ్ఞభాగానికే అధికారులను చేశాను. మీరు యజ్ఞాలలో మీ భాగాలను స్వీకరించి యజ్ఞకర్తలకు వాటికి తగిన ఫలితాలను ప్రసాదించండి. మీ మీ అధికారాలకు తగినట్లుగా, అందరికోరికలను తీర్చటానికి వారిని మంచి శీలం కలవారినిగా చేయండి. ప్రవృత్తి ఫలంలో సమాదరం పొందేవిగా లోకంలో ప్రచారం అయ్యే యజ్ఞాలతోనే మీ బలం పెంపొందుతుంది. ఆ బలంతో మీరు లోకాలను అన్నింటిని పోషించండి. సమస్త యజ్ఞాలతో మానవులు పూజించి, మిమ్ము ఉన్నతి శీలురను, పరిపుష్టులను చేస్తారు. మీరు కూడా అలాగే నన్ను పరిపుష్టుని చేయాలి. ఇందుకోసమే నేను వేదాలు, ఓషధుల (అన్నం, పండు మొ) తో యజ్ఞాలను సృష్టించాను. వీటిని చక్కగా భూమండలం మీద అనుష్ఠిస్తే దేవతలు అందరు తృప్తు లవుతారు. దేవతలారా ! ప్రవృత్తి ప్రధానమైన గుణాలతో మిమ్ము సృష్టించాను. కాబట్టి లోకేశ్వరులారా ! కల్పాంతం వరకు మీరు మీ అధికారానుసారం జనుల హితాన్ని ఆలోచిస్తుండాలి. మరీచి, అంగిరుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు వసిష్ఠుడు అనే ఏడుగురు ఋషులను బ్రహ్మ మనస్సుతో సృష్టించాడు. వీరు ప్రధానమైన వేదవేత్తలు. వీరిని అందరిని వేదాచార్యులు అంటారు. ప్రజాపతులు అని ప్రసిద్ధులు. కర్మ పరాయణులు అయినవారికోసం, ఈ సనాతన మార్గం వ్యక్తం అయినది. ఈ రీతిగా లోకాలను సృష్టించే ప్రభావసంపన్నుని అనిరుద్ధుడు అన్నారు. సనుడు, సనత్సుజాతుడు, సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, కపిలుడు, సనాతనుడు అనే సప్తఋషులను బ్రహ్మమానస పుత్రులు అంటారు. వీరికి సహజంగానే విజ్ఞానం కలిగింది. వీరు నివృత్తి ధర్మంలో ఉన్నారు. వీరు ప్రధాన యోగవిద్వాంసులు, సాంఖ్యజ్ఞాన విశారదులు, ధర్మశాస్త్రాచార్యులు, మోక్షధర్మాన్ని ప్రవర్తింపజేసినవారు. పూర్వకాలంలో అవ్యక్త ప్రకృతి నుండి వ్యక్తమైన త్రిగుణాత్మమూ, మహత్తరమూ అయిన అహంకారం నుంచి పరతరమైన స్థితిగల సమష్టి చేతనను క్షేత్రజ్ఞుడు అన్నారు. ఆ క్షేత్రజ్ఞుడను నేను. కర్మపరాయణు లయిన వారు పునరావృత్తి గలవారు. కాబట్టి వారికి ఈ నివృత్తిమార్గం దుర్లభం. ఏయే ప్రాణి నిర్మాణం ఎలా జరిగిందో, ప్రవృత్తి కర్మలలో, నివృత్తి కర్మలలో ప్రవర్తిస్తారో వారు ఆ మహాఫలం పొందుతారు.

ఈ లోక గురు వయిన బ్రహ్మ జగత్తులో మొదటి సృష్టికర్త, ప్రభువు. ఈయనే మీకు తల్లి, తండ్రి, తాత. నా ఆజ్ఞానుసారం సర్వప్రాణులకు వరప్రదాత అవుతాడు.

ఈయన నుదుటి నుండి ఆవిర్భవించిన రుద్రునికి ఈయన (బ్రహ్మయే) తండ్రి. బ్రహ్మ ఆజ్ఞానుసారం. సమస్త ప్రాణుల రక్షణలో సమర్థుడు. ఇక మీరు అంతా వెళ్లండి. మీ అధికారాలను విధి పూర్వకంగా నిర్వహించండి. సమస్తలోకాలలో అన్ని వైదిక కార్యకలాపాలు త్వరగా ప్రచారం కావాలి. దేవశ్రేష్ఠులారా ! మీరు ప్రాణులకు కర్మలను, ఆ కర్మాను సారం కలిగే గతులను, నియమిత కాలానికి తగిన ఆయువును ఇవ్వండి. **ఇది కృతయుగం, శ్రేష్ఠమైన కాలం జరుగుతున్నది. ఈ యుగంలో యజ్ఞ పశువుల హింస చేయరాదు. అహింపా ధర్మానికి వ్యతిరేకంగా ఇక్కడ ఏమీ జరగదు.** దేవతలారా ! ఈ కృతయుగంలో నాలుగు పాదాల ధర్మానుష్ఠానం జరుగుతుంది. తరువాత త్రేతాయుగం వస్తుంది. దానిలో వేద త్రయ ప్రచారం జరుగుతుంది. ఆ యుగంలో యజ్ఞాలలో మంత్రాలతో పవిత్రం చేయబడిన పశువుల వధ జరుగుతుంది. నాలుగు పాదాల ధర్మంలో ఒక పాద (నాలుగవ) భాగం తగ్గుతుంది. తరువాత ధర్మాధర్మ మిశ్రితమైన ద్వాపరయుగం ఏర్పడుతుంది. ఆ యుగంలో ధర్మం రెండుపాదాలు తగ్గుతుంది. తరువాత పుష్య నక్షత్రంలో కలియుగం అడుగుపెడుతుంది. ఆ సమయంలో (ఎక్కడనో ఒకచోట - కొన్నిచోట్ల) ధర్మం ఒకపాదంతోనే ఉంటుంది." ఇలాగా గురువు శ్రీమన్నారాయణుడు చెప్పగా దేవతలు, దేవర్షులు "దేవా ! ధర్మం ఒంటికాలిపై ఉండగా మేము ఏమి చేయాలో చెప్పవలసినది" అని అడిగారు. శ్రీభగవానుడు చెప్పాడు. **"దేవశ్రేష్ఠులారా ! వేదాలు, యజ్ఞాలు, తపస్సు, సత్యం, దమం, అహింపా ధర్మం ఉన్నచోట మీరు ఉండాలి. ఇలా చేస్తే అధర్మం ఒక పాదంతో కూడా మిమ్ము తాకదు."** వ్యాసమహర్షి చెప్పారు. "శిష్యులారా ! భగవానుడు ఇలా ఉపదేశించగా ఋషులతో కూడా దేవతలు ఆయనకు నమస్కరించి, తమకు ఇష్టమైన చోట్లకు వెళ్ళారు. స్వర్గవాసులయిన దేవతలు వెళ్ళిన తరువాత బ్రహ్మఒక్కడే అక్కడ నిలుచున్నాడు. ఆయన అనిరుద్ధరూపంలో ఉన్న భగవానుని చూడదలచాడు. అప్పుడు విష్ణుదేవుడు మహత్తరమయిన హయగ్రీవ రూపాన్ని ధరించి బ్రహ్మకు దర్శనం ఇచ్చాడు. ఆయన కమండలాన్ని, త్రిదండాన్ని ధరించి షడంగాలతో గూడిన వేదపారాయణం చేస్తున్నాడు. అప్పుడు మహాపరాక్రమవంతు డయిన హయగ్రీవస్వామిని చూసి, సకల జగత్తులకు మేలు కోరి, లోకకర్త అయిన బ్రహ్మ తలవంచి, నమస్కరించి, ఆయన ఎదుట చేతులు జోడించి, నిలుచున్నాడు. భగవానుడు ఆయనను హృదయానికి హత్తుకొని ఇలా అన్నాడు.

శ్రీభగవానుడు చెప్పాడు. "బ్రహ్మ ! సమస్తలోకాలను సర్వకర్మలను, వాటితో లభించే గతులను గూర్చి యథావిధిగా ఆలోచించు, నీవే సర్వప్రాణులకు ధాతవు,

ప్రభువువు, ఈ జగత్తుకు గురువువు గదా ! సర్వభారం నీ మీద వేసి, నేను నిశ్చింతగా, ధైర్యంగా ఉంటాను. దేవకార్యం నీకు మించినప్పుడు ఆత్మజ్ఞానోపదేశం చేయటానికి నీకు ప్రత్యక్షం అవుతాను" అని చెప్పి హయగ్రీవస్వామి అక్కడనే అంతర్ధానం అయినాడు. భగవదుపదేశం విన్న బ్రహ్మకూడా త్వరగా తన లోకానికి వెళ్ళాడు. ఈ విధంగా మహానుభావుడు, సనాతనుడు అయిన పద్మనాభుడు యజ్ఞాలలో అగ్రభాగ భోక్త, యజ్ఞపోషకుడు, ప్రవర్తకుడు అయినాడు అని చెప్పారు. ఆయన ఒకప్పుడు అక్షయధర్మ తత్పరు లయిన మహాత్ముల నివృత్తి ధర్మాన్ని అనుష్ఠిస్తాడు. మరొకప్పుడు లౌకికమైన విచిత్రచిత్తవృత్తిని గ్రహించి, ప్రవృత్తిధర్మ విధానాన్ని ఏర్పరుస్తాడు. ఆ భగవంతు డయిన నారాయణుడే ప్రజలకు ఆది మధ్యాంతాలు మూడూ అవుతాడు. ఆయనే ధాత, ధేయం, కర్త, కార్యం అవుతాడు. యుగాంతంలో సర్వలోకాల సంహారం చేసి నిద్రిస్తాడు. ఆయనే కల్పాదిలో మేలుకొని సర్వజగత్తును సృష్టిస్తాడు. నిర్గుణుడు, మహాత్ముడు, జన్మలేనివాడు, విశ్వరూపుడు, దేవతలకు అందరికి ఆశ్రయం అయిన పరమాత్మ శ్రీమన్నారాయణునికి నమస్కారం చేయండి. ఆయనయే మహాభూతాలకు అధిపతి. రుద్రులకు పతి, ఆదిత్యపతి, వసువులకు ప్రభువు. అశ్వినీ దేవతలకు అధిపతి, మరుత్తులకు ప్రభువు. వేదాలకు, యజ్ఞాలకు, వేదాంగాలకు స్వామి ఆయనయే. సముద్రనివాసి, ముంజెగడ్డివంటి శిరోజాలు గలవాడు, శాంతుడు. సమస్త మోక్షధర్మాలను ఉపదేశించే ఆ శ్రీహరికి నమస్కరించండి. తపస్సులకు, తేజస్సులకు, యశస్సులకు, వచస్సులకు, సరస్సులకు ప్రభువు అయిన శ్రీహరికి నమస్కరించండి. జటాజూటం ధరించినవాడు, ఏక శృంగవరాహరూపుడు, బుద్ధిమంతుడు, వివస్వంతుడు, హయగ్రీవుడు, చతుర్మూర్తులు దాల్చినవాడు, అయిన శ్రీమన్నారాయణునికి నమస్కారం చేయండి. గుహ్యస్వరూపుడు, జ్ఞాననేత్రాలకు మాత్రం కనిపించేవాడు, అక్షర, క్షరరూపాలు గలవాడు, అయిన శ్రీహరికి నమస్కరించు. వినాశరహితుడయిన నారాయణుడు అంతటా సంచరిస్తుంటాడు. సర్వత్ర గమనం గలవాడు. ఈయనయే పరబ్రహ్మ. విజ్ఞాన మయమయిన చూపుతోనే ఈయన దర్శనం, జ్ఞానం కలుగుతాయి. పూర్వం నేను జ్ఞానదృష్టితోనే ఈయనను ఈ రీతిగా దర్శించాను. శిష్యులారా ! మీరు అడుగగా ఈ విషయాలు అన్నీ యథార్థంగా చెప్పాను. నా మాటలను స్వీకరించి పరమాత్మ అయిన శ్రీహరిని సేవించండి. వేదమంత్రాలతో ఆయన మహిమను స్తుతించండి. ఆయనను యధాశాస్త్రంగా పూజించండి."

వైశంపాయనుడు చెప్పాడు. "జనమేజయా ! మతిమంతుడయిన వేదవ్యాసుడు శిష్యుల మయిన మాకు అందరికీ, పరమధర్మజ్ఞు డయిన పుత్రుడు శుకునకు ఇలాగే

ఉపదేశించాడు. నరాధిపా ! మా ఉపాధ్యాయు డయిన వ్యాసుడు మాతో కూడా నాలుగువేదాల బుక్కులతో శ్రీమన్నారాయణుని స్తోత్రం చేశాడు. రాజా ! నీవు అడిగిన దానికి ఇది అంతా చెప్పాను. పూర్వం మా గురువుగారు కృష్ణ ద్వైపాయనులు నాకు ఇలాగే ఉపదేశించారు. ప్రతిదినం దీనిని వినేవాడు, భగవంతునికి నమస్కరించి, ఏకాగ్ర చిత్తంతో దీన్ని ఎల్లప్పుడు పారాయణ చేసేవాడు బుద్ధిమంతుడు, బలవంతుడు, రూపవంతుడు, రోగరహితుడు అవుతాడు. రోగి రోగం నుంచి, బద్దుడు బంధాల నుంచి ముక్తుడు అవుతాడు. కోరికలు కలవానికి కోరికలు తీరుతాయి. దీర్ఘాయువు పొందుతాడు. బ్రాహ్మణుడు సర్వవేదజ్ఞుడు, క్షత్రియుడు విజయి అవుతాడు. దీనిని వినటం, చదవటం వలన వైశ్యునికి మంచిలాభాలు వస్తాయి. శూద్రుడు సుఖపడతాడు. పిల్లలు లేనివానికి పిల్లలు కలుగుతారు. కన్య తాను కోరుకొన్న భర్తను పొందుతుంది. శిశువు అడ్డం తిరిగిన స్త్రీలు దీన్ని వింటే ఆ ఆపద నుండి విముక్తులు అవుతారు. గర్భవతి తగిన సమయంలో పుత్రుని కంటుంది. గొడ్రాలు ప్రసవం పొందుతుంది. ఆమె సంతతిపుత్ర పౌత్రాభివృద్ధి పొందుతుంది. ప్రయాణించేవాడు దీన్ని పఠిస్తే క్షేమంగా త్రోవలో ప్రయాణం సాగిస్తాడు. ఎవడు దేన్ని కోరితే వాడు దానిని పొందుతాడు. ఇది నిశ్చయం. పురుషశ్రేష్ఠుడు, మహాత్ముడు మహర్షి అయిన వ్యాసుడు చెప్పిన సిద్ధాంత రూప మయిన ఈ మాటలను, దేవతలు, ఋషులు కూడిన వృత్తాంతాన్ని విన్న భక్తులు ఉత్తమ సుఖం పొందుతారు."

341. శ్రీకృష్ణుడు అర్జునునకు చెప్పిన స్వప్రభావము, భగవన్నామవ్యుత్పత్తి, మహత్త్వము.

జనమేజయుడు చెప్పాడు. "మహాత్మా ! శిష్యులతో కూడా వ్యాసమహర్షి మధుసూదనుని స్తుతించిన వివిధనామాల నిర్వచనం వినగోరుతున్నాను కావున చెప్పవలెనని ప్రార్థన. అది విని శరత్కాలంలో చంద్రునివలె నిర్మలుడను, పవిత్రుడను అవుతాను." వైశంపాయనుడు చెప్పాడు. "రాజా ! శ్రీహరి అర్జునునికి ప్రసన్నుడై గుణకర్మాను సారం తన పేర్లను వివరించినదానిని నీకు వినిపిస్తాను, విను. రాజా ! మహాత్ము డయిన కేశవుని స్తోత్రం చేసిన నామాల గూర్చి శత్రునాశకుడయిన అర్జునుడు శ్రీకృష్ణుని ఇలా అడిగాడు. "త్రికాల ప్రభూ ! సర్వభూతస్రష్టా ! వినాశరహితా ! జగదాధారా ! సర్వలోకాలకు అభయం ఇచ్చే జగన్నాథా ! శ్రీకృష్ణా ! మహర్షులు చెప్పినవి, పురాణాలలో వేదాలలో కర్మానుసారం పఠితమైన నామాలు అన్నింటి వివరణను నీ నుండి వినగోరుతున్నాను. కేశవా ! నీవు తప్ప ఆ నామాలకు నిర్వచనం వేరెవ్వరూ చెప్పలేరు."

శ్రీభగవానుడు చెప్పాడు. "అర్జునా ! ఋగ్వేదం, యజుర్వేదం, అధర్వవేదం సామవేదాలలో, ఉపనిషత్తులలో, పురాణాలలో, జ్యోతిషంలో, సాంఖ్యంలో, యోగశాస్త్రంలో, ఆయుర్వేదంలో మహర్షులు నా అనేక నామాలను చెప్పారు. వాటిల్లో కొన్ని గుణాలకు సంబంధించినవి. మరికొన్ని నేను చేసిన పనులవలన ఏర్పడినవి. వాటి వ్యుత్పత్తిని చెపుతాను, శ్రద్ధగా విను. పూర్వకాలం నుంచి నీవు నా శరీరంలో సగభాగం అని పూర్వకాలంలోనే నిర్ణీతం అయింది. అందువల్ల నీకు ఆ నామాలను, వ్యుత్పత్తిని చెపుతాను. సమస్త శరీర ధారులకు ఉత్కృష్టమయిన ఆత్మ అయిన వాడు, మహాకీర్తి సంపన్నుడు, నిర్గుణ సగుణ రూపుడు, విశ్వాత్మ అయిన శ్రీమన్నారాయణునికి నమస్సులు. ప్రసన్నతా క్రోధాలవల్ల బ్రహ్మరుద్రులకు ఆవిష్కరించిన ఆ శ్రీహరియే చరాజగత్తు కలగటానికి కారణం గదా ! వివేకిశ్రేష్ఠ ! అర్జునా ! పదునెమిది గుణాలు ఉన్న *సత్త్వం - ఆదిపురుషుడే నా పరాప్రకృతి. భూమ్యాకాశాలకు ఆత్మఅయిన అది యోగబలంతో సమస్త లోకాలను ధరిస్తుంది. అదియే ఋతం (కర్మఫలమయిన గతి రూపము), సత్యం (త్రికాలాబాధితమయిన బ్రహ్మరూపము), అమరం, అజేయం, సర్వలోకాత్మ అయి ఉన్నది. దానినుంచే సృష్టి, ప్రళయం మొదలయిన వికారాలు (మార్పులు) వ్యక్త మవుతాయి. అదియే తపస్సు, యజ్ఞం, యజమాని. పురాతను డయిన విరాట్పురుషుడు అదే. దానినే అనిరుద్ధుడు అన్నారు. ఆయన వల్లనే లోకాల సృష్టి, ప్రళయం కలుగుతుంది. ప్రళయరాత్రి గడచిన తరువాత, మహాతేజస్వి అయిన అనిరుద్ధుని దయవలన ఒక కమలం ఆవిర్భవించింది. అందులో బ్రహ్మ అనిరుద్ధుని అనుగ్రహం వలననే వ్యక్తం అయినాడు. బ్రహ్మదేవుని దినం గడచిన తరువాత, క్రోధవివశు డయిన ఆ దేవుని నుదుటినుండి ఆయన పుత్రునిగా సంహారకర్త అయిన రుద్రుడు అవతరించాడు. శ్రేష్ఠదేవత లయిన ఈ బ్రహ్మ రుద్రులు ఆయన ప్రసన్నతా క్రోధాలవల్ల కలిగారు. ఆయన చెప్పిన మార్గాన్ని అనుసరించి సృష్టిసంహారాలు

---

* ప్రీతి, ప్రకారం, ఉత్కర్షం, తేలికదనం, సుఖం, పీనాసితనం లేకపోవటం, రోషంలేకపోవటం, సంతోషం, శ్రద్ధ, క్షమ ధృతి, అహింస, శౌచం, కోపాభావం, ఋజుప్రవర్తన, సమత్వం, సత్యం, దోషదృష్టి లేకపోవటం - ఇవి సత్త్వానికి ఉండే 18 గుణాలు.

ప్రీతిః ప్రకాశముద్రేకో లఘుతా సుఖమేవ చ,
అకార్పణ్య మసంరంభః సంతోషః శ్రద్దధానతా,
క్షమాధృతి రహింసా చ శౌచమక్రోధ ఏవ చ
ఆర్జవం సమతా సత్యమనసూయా తథైవ చ

ఆయాగుణాలకు ఉపాధి అయినది, ప్రీతి మొదలయిన శబ్దాలతో చెప్పబడుతుంది, కాబట్టి ఇవి గౌణనామ నిర్వచనాలు. అష్టాదశగుణమయిన అది నా పరా ప్రకృతి అంటే స్వరూపం.(నీల)

చేస్తారు. సర్వప్రాణులకు వరాలను ఇచ్చే ఆ దేవులు ఇద్దరు సృష్టి ప్రళయాలకు నిమిత్తమాత్రులు (నిజానికి అవి అన్నీ భగవదిచ్ఛవలననే జరుగుతుంటాయి). వీరిలో సంహారకర్త అయిన రుద్రునికి కపర్ది, జటిలుడు, ముండి, శ్మశానవాసి, ఉగ్రవ్రతానుస్థాత, రుద్రుడు, యోగి, పరమదారుణుడు, దక్షయజ్ఞధ్వంసకుడు, భగనేత్రహరుడు మొదలయిన చాలా పేర్లు ఉన్నాయి.

ఈ రుద్రదేవుడు నారాయణ స్వరూపుడే అని తెలుసుకో. ప్రతియుగంలో దేవదేవు డయిన మహేశ్వరుని పూజించటం వల్ల శ్రీమన్నారాయణుని పూజించినట్లవుతుంది. సమస్త జగత్తులకు ఆత్మ నయిన నేను నా ఆత్మ అయిన రుద్రుని పూజిస్తాను. వరదు డయిన శివుని నేను అర్చించకపోతే ఆత్మరూపు డయిన ఆ శంకరుని ఎవరూ పూజించరు అని నా భావం. **నేను చేసిన పనిని ప్రమాణం, లేక ఆదర్శంగా తీసుకొని లోకం దాన్ని అనుసరిస్తుంది. వేద శాస్త్రాలవల్ల ప్రమాణితం అయిన దేవతలను పూజించాలి అని భావించి, నేను రుద్రుని పూజిస్తాను. రుద్రుని తెలుసుకొన్నవాడు నన్ను తెలుసుకొంటాడు. ఆయనను అనుసరించేవాడు నా అమయాయి అవుతాడు. కుంతీనందనా ! రుద్రుడు నారాయణుడు ఏక రూపులు. ఒకే సత్వం ఈ రెండు రూపాలు ధరించి, భిన్న భిన్న వ్యక్తులుగా ఉండి లోకంలో యజ్ఞాదికర్మలలో ప్రవృత్తం అవుతుంది.** పాండవానందకారకా ! నాకు వేరొకడు వరం ఇవ్వలేడు అని భావించి నేను పుత్రునికోసం నా ఆత్మ స్వరూపుడు, పురాణపురుషుడు, జగదీశ్వరుడు అయిన రుద్రుని ఆరాధించాను. విష్ణువు తన ఆత్మస్వరూపం అయిన రుద్రుని తప్ప, ఇతర దేవతకు ఎవరికీ నమస్కరించడు. అందుకనే రుద్రుని సేవిస్తాడు. బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు, ఋషులతో కూడా ఎల్ల దేవతలు దేవశ్రేష్ఠ డయిన శ్రీమన్నారాయణుని అర్చిస్తారు. భారతా ! భూతభవిష్యద్వర్తమాన కాలాలలో ఉండే సర్వప్రాణులు సర్వశ్రేష్ఠ డయిన విష్ణువును సేవించాలి, పూజించాలి. కౌంతేయా ! హవ్యాన్ని ఇచ్చే విష్ణువుకు నమస్కరించు. శరణు ఇచ్చే శ్రీహరికి ప్రణతులు చెయ్యి. వరదాయకు డయిన విష్ణువుకు వందనం చెయ్యి. హవ్యభోక్త అయిన భగవంతునికి నమస్కారం చెయ్యి. పూర్వం (గీతలో) నా భక్తులు నాలుగు విధాలుగా ఉంటారని చెప్పాను. వారు, ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులు, జ్ఞానులు అని ఆవిభజన. వీరిలో నన్ను ఏకాంతులై భజించేవారు, ఇతర దేవతలను తమ ఆరాధ్య దేవతలుగా భావించనివారు అందరికంటె శ్రేష్ఠులు. ఎలాంటి కోరికలు లేకుండా సమస్త కర్తవ్యాలను నెరవేర్చే ఆ భక్తులకు నేనే పరమగతి అవుతాను. ఇంక మిగిలిన (జ్ఞానికంటె ఇతరులు), ఆర్తులు,

జిజ్ఞాసువులు, అర్థార్థులు అనే మూడు రకాలవారు ఫలకాంక్ష గల భక్తులని నా ఉద్దేశ్యం. వీరు అందరూ పతన ధర్ములు అవుతారు. పుణ్యానుభవానంతరం వారు అందరు స్వర్గాదికాలనుంచి మర్త్యలోకానికి వస్తారు. జ్ఞాను లయిన భక్తులు శ్రేష్ఠ ఫలభోక్తలు అవుతారు.

జ్ఞానులయిన భక్తులు బ్రహ్మ, శివుడు మున్నగు దేవతలను నిష్కామభావంతో సేవిస్తున్నా, చివరకు పరమాత్మ నయిన నన్నే చేరుతారు. పార్థా ! ఇక్కడ నీకు భక్తులలో ఉండే తేడాలను చెప్పాను. మనం ఇద్దరం నరనారాయణులు అనే ఋషులం. భూభారాన్ని తొలగించటానికి మానవ శరీరాలు దాల్చాం. పార్థా ! నాకు అధ్యాత్మ యోగం తెలుసు. నేను ఎవరిని ? ఎక్కడి నుంచివచ్చాను ? అన్నది నాకు తెలుసు. లౌకికమయిన అభ్యుదయాన్ని సాధించే ప్రవృత్తి ధర్మం, నిఃశ్రేయసం (మోక్షం) ఇచ్చే మోక్ష ధర్మం నాకు తెలియనివి కావు. సనాతన పురుషుడ నయిన నేను ఒక్కడినే మానవులకు తెలిసిన ఆశ్రయమైన నారాయణుడను. నరుని నుండి ఉత్పన్నం కావటం వలన ఆపస్సును (నీటిని) నారం అంటారు. ఆ నారం (జలం) నా అయనం నివాసస్థానం). కాబట్టి నన్ను నారాయణుడు అంటారు. (అన్నిటిలో వ్యాపించిన వానిని లేక ఎవరికైనా నివాస స్థానం అయినవానిని వాసు అంటారు). సూర్యరూపం దాల్చి, నేనే నాకిరణాలతో సర్వజగత్తును వ్యాపిస్తాను. నేనే సమస్త ప్రాణులకు నివాసం కావటం వలన నా పేరు వాసుదేవుడు. ఎల్లప్రాణులకు గతి, ఉత్పత్తికి స్థానం అవుతాను. నేనే ఆకాశాన్ని, భూమిని వ్యాపించి ఉన్నాను. నా కాంతి అన్నిటి కన్న అధికమయినది. సమస్త ప్రాణులు అవసాన సమయంలో పొందగోరే బ్రహ్మను కూడా నేనే. నేను అంతను అతిక్రమించిఉన్నాను. ఈ కారణాలు అన్నింటివల్ల నా పేరు విష్ణువు అయింది. మానవులు దమం (ఇంద్రియ నిగ్రహం) వల్ల సిద్ధిని పొందగోరి నన్ను పొందా లనుకొంటారు. వారు దమంతోటే భూమి, ఆకాశాల మధ్యలో ఉండే లోకాలలో ఉన్నత స్థితిని పొందగోరుతారు. కాబట్టి నాకు దామోదరుడు అనే పేరు వచ్చింది. (దమమే దామం. దాని వల్ల పొందేవాడు దామోదరుడు ఇది దామోదర శబ్దవ్యుత్పత్తి). అన్నం, వేదం, నీరు, అమృతాలకు పృశ్ని అని పేరు. అవి గర్భంలో కల నేను పృశ్నిగర్భుడను. త్రితమునిని ఆయన సోదరులు బావిలోనికి త్రోసి వేసినప్పుడు, ఋషులు నన్ను 'పృశ్నిగర్భా ! ఏకత, ద్వితులు బావిలోనికి త్రోసిన త్రితుని మునిగి పోకుండ రక్షించు' అని ప్రార్థించారు. పలుమారులు వారు అప్పుడు పృశ్నిగర్భనామంతో కీర్తించటం చేత బ్రహ్మదేవుని మొదటి పుత్రుడు, ఋషిశ్రేష్ఠుడు త్రితుడు బావిలో నుంచి ఒడ్డుకు చేరాడు. జగత్తును తపింపజేసే సూర్య, అగ్ని, చంద్రులలో ప్రకాశించే కిరణాలు అన్నీ నా కేశాలు అంటారు. ఆ కేశాలు

కలిగి ఉండటం వలన సర్వజ్ఞ లయిన ద్విజశ్రేష్ఠులు నన్ను కేశవుడు అంటారు. అర్జునా ! ఈ రీతిగా నాకు గల కేశవ నామం సర్వదేవతలకు, ఋషులకు వరదానం చేస్తుంది. అగ్ని సోమునితో కలిసి ఒకటి (ఒకజాతి) అయినాడు. కాబట్టి చరాచర మయిన జగత్తు అంతా అగ్నీషోమమయం అయింది. అగ్ని సోములు ఏక యోనులు. సర్వదేవతలకు ముఖం అగ్ని. ఒకే యోనివారు కావటంచేత వీరు ఒకరికి ఒకరు ఆనందప్రదులు అవుతూ సమస్త లోకాలను ధరిస్తారు."

342. పృష్ట్యారంభము, బ్రాహ్మణమహిమ, భగవన్నామహేతువు, శివకేశవయుద్ధము.

అర్జునుడు అడిగాడు. "మధుసూదనా ! అగ్ని, సోముడు పూర్వకాలంలో ఏక గర్భజనితులు ఎలా అయినారు ? అని నా మనస్సులో సందేహం కలిగింది. దీనిని పోగొట్టు." శ్రీభగవానుడు చెప్పాడు. "పాండుపుత్రా ! నా తేజస్సు సంభవించటానికి గల పూర్వ వృత్తాంతం నీకు చెపుతాను, ఏకాగ్రచిత్తుడవై విను. ఒక చతుర్యుగ సహస్రం గడచిన తరువాత సమస్త లోకాలకు ప్రళయ కాలం వచ్చింది. సమస్త ప్రాణులు అవ్యక్తంలో లయమయినవి. స్థావర జంగమా లయిన సమస్త ప్రాణులు విలీనం అయినవి. భూమి, తేజస్సు, వాయువులు శూన్యం అయినవి. నాలుగు వైపుల ఘోరమయిన అంధకారం అలముకొన్నది. సమస్త ప్రపంచం ఏకార్ణవ మయిన జలంలో మునిగి పోయింది. అన్నిదిక్కులా జలమే అయిపోయింది. అద్వితీయ బ్రహ్మ ఒక్కటే తన మహిమలో నిలచినట్లు ఉన్నది. (నాసదీయ సూక్తంలో చెప్పినట్లు) ఆ సమయంలో రాత్రింబవళ్ళు లేవు. సద్వస్తువూ లేదు. అసద్వస్తువూ లేదు. వ్యక్తమూ లేదు, అవ్యక్తమూ లేదు. ఈ స్థితిలో శ్రీమన్నారాయణుని గుణాలను ఆశ్రయించి ఉండే ఆ అజరం, అమరం, ఇంద్రియ రహితం, అగ్రాహ్యం, అసంభవం, సత్యస్వరూపం, హింసారహితం, సుందరం, నానావిధాలయిన విశేష ప్రవృత్తులకు కారణమైనది, శత్రుత్వం లేనిది, అక్షయం, అమరం, జరారహితం, నిరాకారం, సర్వవ్యాపి, సర్వకర్త అయిన తత్త్వం నుండి వినాశరహితుడు, సనాతన పురుషు డయిన హరి అవతరించాడు. ఈ విషయంలో ఈ క్రింది వేదభాగం దృష్టాంతం. ఆ ప్రళయ కాలంలో పగలు లేదు, రాత్రిలేదు. సత్తులేదు, అసత్తులేదు. కేవలం తమస్సే ముందుఉన్నది. అదే సమస్తరూపం అవుతున్నది. విశ్వరూపునికి అదే రాత్రి. ఈ రకంగా ఈ వేదవాక్యానికి అర్థం చెప్పాలి, తెలుసుకోవాలి.

ఆ సమయంలో మాయా విశిష్టుడయిన ఆ ఈశ్వరునినుండి వ్యక్తమయిన

బ్రహ్మయోని అయిన పురుషుని నుండి, బ్రహ్మఅవతరించినప్పుడు ఆ పురుషుడు ప్రజా సృష్టి కాంక్షతో తన నేత్రాలనుంచి అగ్ని సోములను సృష్టించాడు. ఇలా భౌతిక సృష్టిజరిగిన తరువాత ప్రజల ఉత్పత్తి సమయంలో బ్రాహ్మణ క్షత్రియ జాతులు క్రమంగా ఆవిర్భవించాయి. సోముడే బ్రహ్మ. బ్రహ్మయే బ్రాహ్మణుడు. క్షత్రియ జాతికంటె బ్రాహ్మణ జాతి గొప్పది. ఎలా అంటే బ్రాహ్మణుని ఈ ప్రాబల్యం అందరికి ప్రత్యక్షమే. బ్రాహ్మణుని మించిన ఏ ప్రాణి పూర్వం జనించలేదు. బ్రాహ్మణుని నోటికి అన్నం అందించినవాడు, జల్వించే అగ్నిలో ఆహుతి ఇచ్చే వాడే అవుతాడు. ఇదంతా ఆలోచించే నేను ఇలా చెప్పాను. బ్రహ్మ భూతసృష్టిని చేశాడు. సర్వప్రాణులను యథాస్థానంలో ఉంచి ఆయన ముల్లోకాలను ధరిస్తున్నాడు. ఈ మంత్ర వాక్యం కూడా దీనికి సమర్థకం అవుతుంది. అగ్నీ ! నీవు యజ్ఞాలకు హోతవు. సర్వదేవతలకు, మానవులకు, సమస్త జగత్తుకు మేలు కోరేవాడవు. 'అగ్నిదేవా ! నీవు సమస్త యజ్ఞాలకు హోతవు. దేవతలతో, మానవులతో కూడిన జగత్తుకు హితుడవు. ఆ అగ్ని బ్రాహ్మణుడు' అనే వాక్యం దీనికి దృష్టాంతం. అగ్ని దేవుడే యజ్ఞాలకు హోత, కర్త అవుతాడు. ఆ అగ్నియే బ్రాహ్మణుడు. మంత్రాలు లేకుండా హవనంలేదు. వ్యక్తిలేక తపస్సు సంభవించదు. హవిష్యంతో గూడిన మంత్ర సంబంధంతో దేవతలు, మనుష్యులు, ఋషుల పూజ ఉంటుంది. కాబట్టి అగ్నీ ! నిన్ను హోతగా నియోగించారు. మానవులలో హోతగా నియుక్తులు అయ్యే అధికారి బ్రాహ్మణుడే. ఆయనయే యజ్ఞం చేయించటం అనే విధానం ఉన్నది. ద్విజాతు లయిన క్షత్రియ వైశ్యులకు యజ్ఞాలు చేయించే అధికారం లేదు. కాబట్టి అగ్నిస్వరూపు లయిన బ్రాహ్మణులే యజ్ఞాలు చేయించటం అనే భారాన్ని వహిస్తారు. వారు యజ్ఞదేవతలను తృప్తులను చేస్తారు. దేవతలు భూమండలాన్ని ధనధాన్యపూర్ణం చేస్తారు. శత పథ బ్రాహ్మణంలో కూడా బ్రాహ్మణ ముఖంలో ఆహుతి ఇచ్చే విషయం ఉంది. బ్రాహ్మణముఖంగా హోమంచేసేవాడు ప్రజ్వలించే అగ్నిలో హోమంచేసిన వాడే అవుతాడు. ఇలా అయి ఉండి కూడా విద్వాంసు లయిన బ్రాహ్మణులు అగ్నిని ఆరాధిస్తారు. అగ్నియే విష్ణువు. ఆయన సమస్త ప్రాణులలో ప్రవేశించి, వారి ప్రాణాలను ధరిస్తారు. ఇంతేకాక ఈ విషయంలో సనత్కుమారుడు గానం చేసిన శ్లోకాలు ఉన్నవి. బ్రాహ్మణరూపు డయిన బ్రహ్మయే మొదట నిర్మల విశ్వాన్ని సృజించాడు. బ్రహ్మవలన ఉత్పన్నులయిన అమర్త్యులగు దేవతలు బ్రాహ్మణులవేద ధ్వనులతోనే స్వర్గలోకానికి వెళ్తారు. ఉట్టి పెరుగును, పాలను ధరించినట్లు బ్రాహ్మణులవాక్కు, కర్మ, శ్రద్ధ, తపస్సు, వాగమృతం భూమిని, స్వర్గాన్ని ధరిస్తున్నది. **సత్యాన్ని మించిన గొప్పధర్మం లేదు.**

తల్లితో సమానమైన గురువు లేదు. ఇలాగే ఇహలోకపరలోకాలలో మేలు కలిగించేవారు బ్రాహ్మణులకంటె వేరుగా ఎవ్వరూ లేరు.* బ్రాహ్మణులకు బ్రతుకు తెరువు లేని రాజుల రాజ్యాలలో ఆ రాజులకు వాహనాలు, ఎద్దులు, గుఱ్ఱాలు ఉండవు. ఇతరులకు ఇవ్వటానికి వారినివాసాలలో పాలు, పెరుగు కుండలు చిలకటం ఉండదు. వారు తమ మర్యాదలను అతిక్రమించి దోపిడిదొంగలు అవుతారు. వేదాలు, పురాణాలు. ఇతిహాసాల ప్రామాణ్యం వల్ల బ్రాహ్మణుల ఉత్పత్తి – శ్రీమన్నారాయణుని ముఖం నుండి కలిగారనీ, అందువల్ల ఆ బ్రాహ్మణులు సర్వాత్ములు, సర్వకర్తలు, సర్వభావ స్వరూపులు అని సిద్ధిస్తున్నది.

వాక్కును సంయమనంచేసిన కాలంలో హితకరుడు, వరప్రదాత, దేవదేవుడూ అయిన బ్రహ్మదేవుని వలన అన్నిటికంటె ముందు బ్రాహ్మణులు ఆవిర్భవించారు. తరువాత ఇతర వర్ణాలు ఏర్పడ్డాయి. ఈ రీతిగా బ్రాహ్మణులు దేవతలు, అసురులకంటే కూడా శ్రేష్ఠులు. పూర్వ కాలంలో నేను బ్రహ్మకై ఆ బ్రాహ్మణులను ఉత్పన్నులను చేశాను. దేవతలు, అసురులు, మహర్షులు మున్నగు ప్రాణివిశేషాలను బ్రాహ్మణులే వారి వారి అధికారాలలో నిలిపారు. తప్పులు చేస్తే వారికి శిక్షకూడా వేస్తారు. అహల్యను బలాత్కరించటం చేత గౌతముని శాపంవలన ఇంద్రుడు ఎట్టని మీసాలు, గడ్డం గలవాడు అయినాడు. విశ్వామిత్రుని శాపం వలన ఇంద్రుడు అండకోశాన్ని పోగొట్టుకొని మేషవృషణుడు అయ్యాడు. అశ్విని కుమారులకు ప్రాప్తం కావలసిన యజ్ఞభాగాన్ని నిషేధించటానికి వజ్రాయుధాన్ని ఎత్తటంచేత ఇంద్రుని చేతులను చ్యవనమహర్షి స్తంభింపజేశాడు. ఇలాగే దక్షప్రజాపతి తనయజ్ఞాన్ని ధ్వంసంచేసిన శివునిపై కోపించి, మహత్తర తపస్సుజేసి, రుద్రునిముఖాన మూడవకంటిని కలిగించాడు. రుద్రుడు త్రిపురాసురులను వధించటానికి దీక్ష స్వీకరించినపుడు, శుక్రాచార్యుడు తన జటలను పీకి, ఆయనపైకి విసిరాడు. ఆ జటల నుండి చాల సర్పాలు జనించి, శివుని కంఠానికి చుట్టుకొని, కరిచినవి. అందువలన ఆయనకంఠం నీల వర్ణం అయింది. స్వాయంభువ మన్వంతరంలో నారాయణుడు శివునికంఠం పట్టుకొన్నాడు. ఇందువల్ల కూడా ఆయన కంఠం నీలవర్ణం అయింది. అంగిరసుని పుత్రుడయిన బృహస్పతి అమృతం ఉత్పన్నం అయ్యేటప్పుడు జలం ఆచమనం చేశాడు. అప్పుడు నీరు మురికిగా ఉంది. అందుకు కోపించి దేవగురువు 'నా ఆచమన సమయంలో నీరుమురికి కావంటంచేత నీవు ఇప్పటినుంచి మురికిగానే – మలినంగానే ఉంటావు. నీలో చేపలు, మొసళ్ళు,

---

* నాస్తి సత్యాత్పరో ధర్మః నాస్తి మాతృసమో గురుః ।
బ్రాహ్మణేభ్యః పరం నాస్తి ప్రేత్య చేహ చ భూతయే ॥ 18

తాబేళ్ళతో కలుషితం అవుతావు' అని శపించాడు. అప్పటినుండియే జలాశయాలు జలజంతువులతో నిండి ఉన్నాయి.

త్వష్టకుమారుడయిన విశ్వరూపుడు దేవతలకు పురోహితుడు అయినాడు. ఆయన అసురులకు మేనల్లుడు. అందువల్ల దేవతలకు ప్రత్యక్షంగా, అసురులకు పరోక్షంగా యజ్ఞ భాగాలు ఇస్తుండేవాడు. కొంతకాలం తరువాత అసురులు విశ్వరూపుని తల్లిదగ్గరకు వెళ్ళి 'సోదరీ ! నీ పుత్రు డయిన విశ్వరూపు డయిన త్రిశిరుడు దేవతలకు పురోహితుడుగా ఉన్నాడు. ఇతడు ప్రత్యక్షంగా దేవతలకు, చాటుగా మాకు యజ్ఞభాగాలు ఇస్తున్నాడు. ఇందువల్ల దేవతలు వృద్ధినందుతున్నారు. మేము క్షీణిస్తున్నాం. కాబట్టి వీనిని దేవతల పౌరోహిత్యం నుంచి నివారించు. ఆ కారణాన మా పక్షంలో చేరుతాడు' అని వరంకోరారు. తరువాత విశ్వరూపుడు నందన వనానికి వెళ్ళాడు. తల్లి, 'వత్సా ! నీవు ఇతరపక్షాన్ని వృద్ధిచేస్తూ, మేనమామ పక్షాన్ని నాశనం చేస్తున్నావు. ఇది తగదు' అని చెప్పింది. విశ్వరూపుడు 'మాతృవచనం అతిక్రమించ రాదు !' అని తలచి, గౌరవించి, హిరణ్యకశిపుని పక్షంలో చేరాడు. ఇది తెలిసి బ్రహ్మ పుత్రుడయిన వసిష్ఠుడు హిరణ్యకశిపుని 'నీవు నన్ను అవమానించి ఇతర హోతను స్వీకరించావు. కాబట్టి ఈ యజ్ఞం పూర్తి అయ్యేలోపుగానే నీవు అపూర్వ ప్రాణిచేతులలో మరణిస్తావు, అని శపించాడు. ఈ వసిష్ఠ శాపంవల్ల హిరణ్యకశిపుడు మరణించాడు. తరువాత విశ్వరూపుడు మాతృపక్షం పెంపొందటానికి మహత్తర తపస్సులో నిమగ్నుడు అయినాడు. ఇది తెలిసి ఇంద్రుడు వ్రతభంగానికి దివ్య సుందరులయిన అప్సరసలను పంపాడు. వారిని చూచిన విశ్వరూపుని మనస్సు చలించింది. అందుచే వారిమోహంలో పడినాడు. ఆతని ఆసక్తిని గమనించి అప్సరసలు 'ఇకమేము వచ్చిన చోటికే వెళ్తాము' అన్నారు. అప్పుడు విశ్వరూపుడు 'ఎక్కడికి వెళ్తారు ? నాతో పాటు ఉండండి. మీకు మేలు జరుగుతుంది.' అన్నాడు. అప్సరసలు 'మేము అందరమూ అప్సరసలం. దేవతాస్త్రీలం. మేము ఇంతకు పూర్వమే వరదుడయిన, దేవుడయిన ఇంద్రుని స్వీకరించిఉన్నాం' అని అన్నారు. అంత విశ్వరూపుడు 'నేటినుండియే ఇంద్రునితో గూడ దేవతలు ఉండరు' అని మంత్రజపం చేశాడు. ఆ మంత్రబలంతో పెరిగిన త్రిశిరుడు ఒక నోటితో, యథావిధిగా లోకంలోని ద్విజులు యజ్ఞాలలో హోమంచేసిన హవిస్సు సోమరసాన్ని, రెండవదానితో అన్నాన్ని, మూడవ శిరస్సుతో దేవాదుల తేజస్సును పానంచేయసాగాడు. సోమపానంతో, సమస్త శరీరం పరిపుష్టం అయిన త్రిశిరుని చూసి, ఇంద్రుడు దేవతలతో కలిసి చింతించాడు.

ఆ దేవతలు ఇంద్రునితో కూడా బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి 'అన్ని యజ్ఞాలలోను

హుతమయిన సోమరసాన్ని విశ్వరూపుడు త్రాగుతున్నాడు. అందువల్ల మాకు భాగాలు లేకుండా పోయినవి. రాక్షసపక్షం పెంపొందుతున్నది. మేము క్షీణిస్తున్నాము. కాబట్టి మాకు మేలు కలిగేది నీవు చేయాలి' అని చెప్పారు. 'భృగువంశీయమహర్షి దధీచి తపస్సు చేస్తున్నాడు. ఆయనను స్వశరీరం త్యాగం చేసే విధంగా వరం కోరండి. ఆయన తనువు వదలిన తరువాత ఆ శరీరంలోని ఎముకలతో వజ్రాయుధం చేయండి' అని బ్రహ్మ వారికి చెప్పాడు. తరువాత దేవతలు దధీచిమహర్షి తపస్సు చేస్తున్న చోటికి వెళ్ళారు. ఇంద్రునితో గూడిన దేవతలు 'మహాత్మా ! మీ తపస్సు బాగా జరుగుతున్నదా ! దానికి ఎలాంటి విఘ్నాలు కలగటం లేదు గదా !' అని అడిగారు. 'మీకు అందరికి స్వాగతం. నేను మీకు ఏమి చేయాలో చెప్పండి. అది చేస్తాను' అని దధీచి అన్నాడు. 'భగవానుడా ! లోకహితం కోసం మీ శరీరాన్ని త్యజించండి' అని దేవతలు అన్నారు. అది విని, దధీచి కలత చెందకుండా, ఉదాసీనుడు కాకుండ ఉన్నాడు. ఆయన సుఖదుఃఖాలలో సమానంగా ఉండే మహాయోగి. ఆయన ఆత్మను పరమాత్మతో ఏకం చేసి శరీరం వదిలాడు. ఆయన పరమాత్మలో లీనం కాగా ఆయన అస్థులను సంగ్రహించి వజ్రాన్ని నిర్మించాడు. దుర్జయం అయిన బ్రాహ్మణుని వజ్రాయుధంలో విష్ణుదేవుడు ప్రవేశించాడు. దానితో ఇంద్రుడు విశ్వరూపుని సంహరించాడు. ఆతని మూడు తలలను ఖండించాడు. తరువాత ప్రజాపతి త్వష్ట విశ్వరూపుని శరీరాన్ని మథించి పుట్టించిన తన శత్రువైన వృత్రాసురుని, ఇంద్రుడు ఆ వజ్రాయుధంతోనే సంహరించాడు.

అప్పుడు రెండు విధాలయిన బ్రహ్మహత్య వెంటపడటంతో ఇంద్రుడు దేవరాజ్యం వదలాడు. మానససరోవరజలంలో పుట్టిన ఒక చల్లని కమలం వద్దకు చేరాడు. అక్కడ అణిమాద్యైశ్వర్య యోగంతో ఇంద్రుడు అణుమాత్ర రూపం దాల్చి తామర తూడులో ప్రవేశించాడు. ఇలా బ్రహ్మహత్యాభయంతో త్రిలోకాధిపతి అయిన శచీపతి అదృశ్యం కాగా జగత్తునకు రాజు లేకపోయాడు. దేవతలలో రజోగుణతమో గుణాలు ప్రవేశించాయి. మహర్షుల మంత్రాలు నిష్ప్రయోజనా లయ్యాయి. రాక్షసులు వృద్ధి చెందారు. వేదాధ్యయనం విచ్ఛిన్నం అయింది. ఇంద్ర రక్షితాలు కాకపోవటంచేత ముల్లోకాలు బలహీనా లయ్యాయి. తేలికగా జయింపవీలయ్యాయి. తరువాత దేవతలు, మహర్షులు ఆయువుపుత్రు డయిన నహుషుని స్వర్గాధిపతిని చేశారు. నహుషుని నుదుట సమస్త ప్రాణుల తేజస్సును హరించే అయిదు వందల జ్వాలాయుక్త జ్యోతులు వెలుగుతుండేవి. వాటితో ఆయన దేవరాజ్యాన్ని పరిపాలించసాగాడు. అప్పుడు లోకులు సహజ స్థితిలోకి వచ్చారు. అందరు ప్రశాంతులు, ప్రసన్నులు అయినారు. కొంతకాలం గడచిన తరువాత నహుషుడు దేవతలతో 'శచీదేవి

తప్ప ఇంద్రుడు అనుభవించిన ఇతర వస్తువులు అన్నీ నాకు లభించాయి !' అని పలికి, శచీదేవి వద్దకువెళ్ళి, 'సౌభాగ్య వతీ ! నేను దేవరాజును ఇంద్రుడను. నన్ను స్వీకరించు' అన్నాడు. శచీదేవి 'రాజా! నీవు సహజంగా ధర్మవత్సలుడవు. చంద్ర వంశశ్రేష్ఠుడవు. పరస్త్రీని బలాత్కారం చేయటం నీకు తగదు' అన్నది. అప్పుడు నహుషుడు 'నేను ఇప్పుడు ఇంద్ర పదవిని అధిష్ఠించి ఉన్నాను. ఇంద్రుని రాజ్యానికి, రత్నాలకు అధికారినయినాను. కాబట్టి నిన్ను కోరటం అధర్మం కాదు నీవు ఇంద్రుడు అనుభవించిన దానవే కదా !' అన్నాడు. ఆమె 'రాజా ! నేను ఒక వ్రతనియమంలో ఉన్నాను. అది ఇంకా పూర్తి కాలేదు. అది పూర్తి అయిన తరువాత కొద్దిరోజులలోనే నేను నీవద్దకు వస్తాను !' అన్నది. శచీదేవి మాటలు విని నహుషుడు వెళ్ళాడు. నహుషునికి భయపడిన శచీదేవి దుఃఖార్తయై భర్తను దర్శించవలెననే కోరికతో బృహస్పతి వద్దకు వెళ్ళింది. ఆమె ఉద్విగ్నతనుచూచి దేవ గురువు ధ్యానస్థితిలో ఉండి, ఆమె భర్తృకార్యసాధన లగ్న అని తెలుసుకొని, ఆమెతో ఇలా అన్నాడు. 'అమ్మా ! వ్రతనిష్ఠవైన నీవు వరదాత్రి అయిన ఉపశ్రుతి దేవిని ఆహ్వానించు. ఆమె నీ భర్తృదర్శనం చేయిస్తుంది.' గురుదేవుని ఈ ఆదేశాన్ని అనుసరించి శచీదేవి ఉపశ్రుతిని మంత్రాలతో ధ్యానించింది. మహావ్రతతత్పరయైన శచీదేవికి ఉపశ్రుతి ప్రత్యక్షమై 'నీకేం కావాలి ? కోరుకో !' అన్నది. ఆమె దేవికి నమస్కరించి 'దేవీ ! నా భర్తృదర్శనం చేయించు సత్యానివి, ఋతానివి' అని అన్నది. ఉపశ్రుతి శచిని మానససరోవరానికి తీసికొని పోయింది. అక్కడ తామర తూడు రంధ్రంలో దాగి ఉన్న ఇంద్రుని చూపించింది.

దుర్బలురాలు, దుఃఖిత అయిన శచీదేవిని చూచి ఇంద్రుడు మనస్సులో ఇలా అనుకొన్నాడు. 'ఈ స్థితి చాలా దుఃఖకరం. నేను ఇక్కడ దాగుకొని కూర్చున్నాను. నా భార్య దుఃఖార్తయై నన్ను వెతుకుకొంటూ ఇక్కడి దాకా వచ్చింది'. అప్పుడు దేవితో ఇంద్రుడు 'దేవీ ! ఎలా కాలం గడుపుతున్నావు?' అని అడిగాడు. 'దేవా ! ఇంద్రపదవినధిష్ఠించిన నహుషుడు నన్ను తనపత్ని కావలెనని కోరాడు. నేను "వ్రతనియమంలో ఉన్నాను. కొద్దిసమయం కావాలి !" అన్నాను.' అని చెప్పింది. అప్పుడు ఇంద్రుడు నీవు నహుషుని వద్దకు వెళ్ళి 'రాజా ! నీవు ఋషులు లాగే అపూర్వ వాహనం ఎక్కి నావద్దకు వచ్చి నన్ను తీసికొని పొమ్ము. ఇంద్రుని వద్ద మనోహరమైన పెద్ద పెద్ద వాహనాలు అనేకం ఉన్నాయి. వాటిని అన్నింటిని నేను ఎక్కాను. కాబట్టి నీవు వాటికి అన్నింటికంటె విలక్షణమయిన వాహనాన్ని ఆరోహించి నావద్దకు రావలసింది' అని చెప్పమని చెప్పాడు. భర్త ఇచ్చిన ఆ సలహాను విని శచీదేవి సంతోషంగా వెనుదిరిగింది. ఇంద్రుడు మళ్ళీ కమల నాళ గ్రంథిలో ప్రవేశించాడు. వచ్చిన ఇంద్ర పత్నిని చూచి నహుషుడు 'దేవీ ! నీవు కోరిన సమయం

పూర్తి అయింది' అన్నాడు. శచీదేవి ఇంద్రుడు చెప్పిన దాన్ని అనుసరించి తన కోరిక వివరించింది. నహుషుడు మహర్షులు వహించే వాహనాన్ని ఎక్కి శచీదేవి వద్దకు బయలుదేరాడు. అప్పుడు ఇంద్రుడు మిత్రావరుణాత్మజుడయిన అగస్త్యుడు మొ వాహకు లయిన మహర్షులను వేగంగావెళ్ళండని నిందిస్తూ పాదాలతో తన్నాడు. పాద ప్రహారం తనకు తగలటంతో అగస్త్యుడు "చేయతగని నీచపు పని చేస్తున్న పాపాత్ముడా ! భూమి, పర్వతాలు ఉండేటంతకాలం సర్పమవై భూమి మీద పడిఉండు" అని శపించాడు. మహిర్షి శపించిన వెంటనే నహుషుడు వాహనం నుండి క్రిందపడ్డాడు. ముల్లోకాలు ఇంద్ర రహితాలయ్యాయి. అప్పుడు దేవతలు, ఋషులు ఇంద్రునికోసం, విష్ణుదేవుని శరణందారు. "దేవా ! బ్రహ్మహత్యా పీడితుడయిన ఇంద్రుని రక్షించవలసింది" అని అర్థించారు. వరప్రదాత అయిన విష్ణుభగవానుడు వారితో "ఇంద్రుడు విష్ణువునుద్దేశించి అశ్వమేధయాగం చేస్తే స్వపదవిని పొందుతాడు". అని చెప్పాడు. అది విని దేవతలు, మహర్షులు ఇంద్రుని వెదికారు. కాని ఆయన జాడ తెలియలేదు. అప్పుడు శచీదేవిని 'కల్యాణి ! నీవే వెళ్ళి ఇంద్రుని తీసికొనిరా ! అన్నారు. శచీదేవి మానస సరోవరానికి వెళ్ళి జరిగిన వృత్తాంతం చెప్పగా ఇంద్రుడు ఆ సరస్సులో నుంచి బయటికి వచ్చి బృహస్పతి వద్దకు వచ్చాడు. బృహస్పతి ఇంద్రుని కొరకు అశ్వమేధం అనే మహాయజ్ఞం చేశాడు. ఆ యజ్ఞంలో కృష్ణసారంగ మనే యజ్ఞాశ్వాన్ని వదిలాడు. బృహస్పతి దాన్నే వాహనం చేసి ఇంద్రుని స్వపదస్థుని చేశాడు. ఆ తరువాత దేవతలు, ఋషులు స్తుతిస్తుండగా, ఇంద్రుడు పవిత్రుడై స్వర్గాధిపతి అయినాడు. బ్రహ్మహత్యా పాపాన్ని స్త్రీలు, అగ్ని, చెట్లు, గోవులు అనే నాలుగు స్థానాలకు విభజించి ఇచ్చాడు. ఈ రీతిగా ఇంద్రుడు బ్రహ్మతేజస్సుతో అభివృద్ధి పొంది శత్రుసంహారం చేసి మరల స్వస్థానం పొందాడు.

నహుషునికి శాపమోక్షం కలిగించటానికి దేవతలు, ఋషులు ప్రార్థించగా, ఆయన 'నహుషుని వంశంలో జన్మించే ధర్మ రాజు యుధిష్ఠిరుడు ఆయన ప్రశ్నలకు తగిన సమాధానాలు చెప్పి భీముని బంధవిముక్తుని చేసినప్పుడే నహుషుని శాపవిమోచనం కలుగుతుంది' అని పలికాడు.

పూర్వకాలంలో భారద్వాజుడు, ఆకాశ గంగాజలంలో నిలిచి ఆచమనం చేసేటప్పుడు ముల్లోకాలను మూడు పాదాలతో కొలుస్తూ విష్ణుదేవుడు, ఆయనను సమీపించాడు. అప్పుడు భారద్వాజుడు నీటితోగూడిన చేతితో ఆయనను కొట్టాడు. అందువల్ల విష్ణుదేవుని వక్షఃస్థలంలో ఒక మచ్చ ఏర్పడ్డది. భృగుమహర్షి శాపంవల్ల అగ్ని సర్వభక్షుడైనాడు. అదితి తాను చేసే పాకం తిని, దేవతలు రాక్షసులను చంపగలరు అనే ఉద్దేశ్యంతో ఆహారం సిద్ధం చేసింది. అప్పుడు బుధుడు తన వ్రత చర్యను పూర్తి చేసి వచ్చి అదితిని భిక్షపెట్టమని కోరాడు. ఆమె ముందు దీన్ని దేవతలే భుజించాలి, ఇతరులు కాదు, అనే

ఉద్దేశంతో ఆయనకు భిక్షపెట్టలేదు. అందుకు కోపించి బ్రాహ్మణుడయిన బుధుడు 'అండనామంతో వివస్వతుండు రెండవ జన్మను పొందేటప్పుడు అదితి గర్భంలో బాధకలుగుతుంది. ఆ బాధలో ఆపిండం మృతి బొందుతుంది.' అని శపించాడు. మృతాండం నుంచి జనించటం చేత శ్రాద్ధదేవు డనే వివస్వంతుడు మార్తండనామంతో ప్రసిద్ధు డవుతాడు. దక్షుడు తాను కనిన అరువది మంది పుత్రికలలో కశ్యపునికి పదముగ్గురిని, ధర్మదేవునికి పదిమందిని, పదిమందిని మనువుకు, ఇరవైఏడు మందిని చంద్రునికి ఇచ్చి వివాహం చేశాడు ఆ ఇరువదియేడ్గురు నక్షత్ర నామంతో ప్రసిద్ధులైనారు. వారంతా సమాన సౌందర్యవతులే. కాని చంద్రుడు రోహిణియందు అధికప్రేమకలిగి ఉన్నాడు. అందుకు మిగిలిన భార్యలు ఈర్ష్య పడి తండ్రి వద్దకు వెళ్ళి "భగవానుడా ! మేము అందరమూ సమాన ప్రభావతులం. అయినా చంద్రుడు రోహిణి యందు అధికానురాగంతో ఉన్నాడు" అని చెప్పారు. అదివిని ఆయన 'ఆతనికి క్షయవ్యాధి కలుగుగాక !' అని శపించాడు. దక్షశాపం వల్ల సోమునికి క్షయ, కలిగింది. ఆయన దక్షుని వద్దకు వెళ్ళి ఆయన కోపానికి కారణం ఏమిటని ప్రశ్నించాడు. "నీవు భార్యలందరి యందు సమానాదరం చూపకపోయినందుకు ఇది శిక్ష" అన్నాడు. ఇతర ఋషులు సోమునితో, 'క్షయతో నీవు చిక్కి పోతున్నావు. కాబట్టి పడమటి దిక్కున సముద్రపుటొడ్డున ఉన్న హిరణ్య తీర్థంలో స్నానం చెయ్యి' అని చెప్పారు. అప్పుడు సోముడు హిరణ్యతీర్థానికి వెళ్ళి అక్కడస్నానం చేశాడు. అందువల్ల ఆయన పాపం తొలగిపోయింది. ఆ తీర్థంలో ఆయన దివ్య ప్రభాభాసితు డయినాడు. అందువల్ల అప్పటినుంచి ఆ ప్రదేశం ప్రభాసతీర్థం అనే పేరుతో ప్రసిద్ధమయింది. ఆశాపం వల్ల చంద్రుడు ఇప్పటికీ కృష్ణపక్షంలో అమావాస్య వరకు క్షీణిస్తుంటాడు. శుక్లపక్షంలో పూర్ణిమదాకా వృద్ధిచెందుతాడు. ఈయన గుండ్రని స్వరూపం మేఘశ్యామ రేఖతో కప్పుకొన్నట్లు కన్పిస్తుంది. ఆయన శరీరంలో కుందేలు వంటి ఆకారం మేఘంవలె శ్యామవర్ణంతో ఉన్నది. అది స్పష్టంగా కన్పిస్తుంటుంది.

పూర్వకాలంలో మేరుపర్వతానికి ఈశాన్యదిక్కున స్థూలశిరుడనే మహర్షి మహోతపస్సు చేయసాగాడు. ఆ సమయంలో నానావిధాల సుగంధవాయువు వీచసాగింది. ఆ వాయుస్పర్శ ఆయన శరీరానికి తగిలింది. తపస్సుతో వేడెక్కిన ఆయన ఆ సుగంధ మందవాతానికి చాలా సంతోషించాడు. అందుకు అక్కడి వృక్షాలు వెంటనే పూలతో సుందరంగా కన్పించాయి. అందుకు కోపించి ఆయన "మీరు అన్నివేళల పూలతో నిండి ఉండకుందురు గాక" అని శపించాడు. ఒకప్పుడు శ్రీమన్నారాయణుడు లోకహితం కోసం బడబాముఖుడు అనే మహర్షి అయినాడు. మేరుపర్వతం మీద తపస్సు చేస్తున్న

సమయంలో ఒకనాడు సముద్రాన్ని పిలిచాడు. కాని సముద్రం అక్కడకు రాలేదు. అందువల్ల కలిగిన అమర్ష (తప్పుచేసిన వారిమీద కలిగే కోపం)తో ఆయన తన శరీరోష్ణంతో సముద్రాన్ని స్తిమితజలంగా (నిశ్చలంగా) చేశాడు. ఆ నీటిని స్వేదప్రవాహం వలె చేశాడు. దానిలో ఉప్పదనం కల్పించాడు. 'సముద్రా !నీ జలం త్రాగరానిది అవుతుంది. నీ నీరు బడబాముఖం నిరంతరం త్రాగటంవలన మధురం అవుతుంది.' అని చెప్పాడు. ఇది ఇప్పటికీ కన్పిస్తుంటుంది. బడబాముఖం అనే అగ్ని సముద్రజలాన్ని గ్రహించి, త్రాగుతుంటుంది.

హిమవంతుని పుత్రిక అయిన ఉమాదేవి కన్యగా ఉన్నప్పుడు రుద్రుడు పొందగోరాడు. భృగుమహర్షి గూడా హిమవంతుని వద్దకు వచ్చి ఈ కన్యను నాకు ఇమ్మని అడిగాడు. హిమవంతుడు ఈ కన్యకు ఉద్దేశింపబడినవాడు రుద్రుడు అని చెప్పాడు. అప్పుడు భృగువు 'కన్యను వరించవలెననే ఉద్దేశ్యంతో వస్తే నీవు ఉపేక్షించావు. కాబట్టి నీవు రత్నభాండాగారం కాకుందువుగాక !' అని శపించాడు. ఇప్పటికి కూడా ఆ మహర్షి మాట అదేరీతిగా సమన్వయిస్తున్నది. బ్రాహ్మణ మాహాత్మ్యం ఇలా ఉన్నది. క్షత్రియజాతి కూడా బ్రాహ్మణానుగ్రహంతో ఎల్లప్పుడు ఉండే వినాశరహితమయిన భూమిని పత్నివలెపొంది అనుభవిస్తున్నది. అగ్ని సోములతో సంబంధం గల బ్రహ్మయే సమస్త జగత్తును ధరిస్తున్నది. ఈ రీతిగా చెపుతున్నారు. సూర్యచంద్రులు (అగ్నిసోములు) నా కన్నులు. వారి కిరణాలను కేశాలు అని వ్యవహరిస్తారు. సూర్యుడు వేడిమిని, చంద్రుడు ప్రమోదాన్ని కలిగిస్తూ ఎవరికి వారు ఉదయిస్తుంటారు.

ఇప్పుడు నీకు నా నామాల వ్యుత్పత్తిని చెపుతాను, ఏకాగ్ర మనస్సుతో విను.

జగత్తుకు బోధను, తాపాన్ని ఇవ్వటంవలన చంద్రసూర్యులు హర్షదాయకులు అవుతున్నారు. పాండు కుమారా ! అగ్ని సోములు చేసే ఈ పనులవల్ల విశ్వభావనుడను, వరదాతనై నందువలన ఈశ్వరుడనైన నేను **'హృషీకేశుడను'** అని అంటారు. (జగత్తుకు హర్షప్రదులు అగుటచేత అగ్నిసోములైన సూర్యచంద్రులను 'హృషీ' అంటారు. వారే భగవంతునికి కేశాలు - అంటే కిరణాలు. కాబట్టి హృషీకేశుడు భగవన్నామం.) యజ్ఞాలలో 'ఇలోహూతా సహాదివా' మొదలయిన మంత్రంతో ఆవాహనం చేయగా నాభాగాన్ని హరిస్తాను (స్వీకరిస్తాను). నా శరీరవర్ణం గూడా హరిత (శ్యామ) వర్ణం. కాబట్టి నన్ను **'హరి'** అని పిలుస్తారు. ప్రాణసారం పేరు ధామం, ఋతం అంటే సత్యం. అని విద్వాంసులు విచారించి చెప్పారు. ఇందువల్ల బ్రాహ్మణులు నాకు ఆ సమయంలోనే **'ఋత ధామ'** అని పేరు పెట్టారు. పూర్వం అదృశ్యమై రసాతలానికి పోయిన భూమిని, మళ్ళీ వరాహ రూపం దాల్చి ధరించాను. కాబట్టి దేవతలు నన్ను **'గోవింద'**నామంతో స్తుతించారు.

(గాం విందతి ఇతి గోవిందః) భూమిని ప్రాప్తింపజేసిన వాడు గోవిందుడు.) 'శిపివిష్ట' అనే నా పేరుకు వివరణ ఇది. రోమరహితమైన ప్రాణిని శిపి అంటారు. 'విష్ట' అంటే వ్యాపకం అని అర్థం. నేను నిరాకార రూపంతో సమస్త జగత్తును వ్యాపించి యున్నాను. కాబట్టి నన్ను **'శిపివిష్టుడు'** అంటారు. శాంతచిత్తుడైన యాస్కుడు అనే బుషి అనేక యజ్ఞాలలో **శిపివిష్ట** అని నన్ను స్తుతించి, నా మహిమను గానం చేశాడు. కాబట్టి నేను ఈ రహస్య నామాన్ని ధరిస్తున్నాను. ఉదారచిత్తుడయిన యాస్కముని శిపివిష్ట అనే నామంతో నన్ను స్తుతించి, నా దయవలననే పాతాళలోకంలో నష్టమైన నిరుక్తశాస్త్రాన్ని మళ్ళీ పొందాడు. ఇంతకు ముందు ఎప్పుడు నేను పుట్టలేదు. ఇప్పుడు పుట్టటంలేదు. ఇకముందు జన్మించను. సమస్త ప్రాణుల శరీరాలలో క్షేత్రజ్ఞు డయిన ఆత్మను నేనే కనుక నాపేరు **అజుడు.** నేను ఎప్పుడూ తక్కువ రకం మాటలు, అశ్లీలమైనవి పలకలేదు. సత్యస్వరూపురాలు, బ్రహ్మసుత అయిన సరస్వతి నావాక్కు. సత్తును, అసత్తును నాలోనే ఉంచుకొన్నాను. కాబట్టి నా నాభికమల గృహంలో బ్రహ్మలోకంలో ఉండే బుషులు నన్ను **'సత్యం'** అని చెపుతారు. ధనంజయా ! పూర్వం ఎప్పుడూ నేను సత్త్వం నుండి చ్యుతుడను కాలేదు. నా నుంచే సత్త్వం ఉత్పన్న మయింది. చాలా పురాతనమైన నా సత్త్వం ఈ అవతారాలకాలంలో కూడా ఉన్నది. సత్త్వంవల్లనే నేను పాపరహితుడ నయి నిష్కామకర్మాసక్తుడ నవుతున్నాను. భగవంతుని వల్ల ప్రాప్తించిన పురుషుల సాత్వతజ్ఞానం (పాంచరాత్రాదివైష్ణవ తంత్రాల) వలన నాస్వరూపజ్ఞానం కలుగుతుంది. ఇన్ని కారణాలవల్ల నన్ను లోకం 'సాత్వతుడు' అంటుంది.

అర్జునా ! నేను కృష్ణలోహం – ఇనుముతో చేసిన విశాలమయిన కర్రుగానయి ఈ భూమిని దున్నుతాను. నా శరీ వర్ణం గూడ నల్లనిదే. కాబట్టి ***కృష్ణుడు'** అని నన్ను అంటారు. భూమిని జలంతో, ఆకారాన్ని వాయువుతో, వాయువును తేజస్సుతో కలిపాను. అందువల్ల నాకు **'వైకుంఠత్వం'** కలిగింది. పరమశాంతిమయ బ్రహ్మమే పరమధర్మం. నేను ఎప్పుడూ దాన్నుంచి చ్యుతుడను (జారిన వాడను) కాను. అందువల్ల జనులు నన్ను **'అచ్యుతుడు'** అంటారు. (అధః అంటే అర్థం పృథివి. అక్షం అంటే ఆకాశం. 'జ' అంటే ఈ రెంటిని ధరించేవాడు). పృథివి, ఆకాశం అనే రెండూ సర్వతో ముఖాలు (నాలుగు వైపుల ఉన్నాయి), ప్రసిద్ధాలు. వాటిని రెంటిని సులువుగా ధరించటం వలన జనులు

---

* *కృష్ణ నామానికి ఇంకొకవ్యుత్పత్తి ఉన్నది – నత్‌కు కృష్ అని పేరు. 'ణ' కు ఆనందం అని అర్థం. ఈ రెండింటి చేత సూచితుడయ్యే సచ్చిదానందమనుడు, శ్యామసుందరుడు, గోలోకవిహారి, నందనందనుడైన శ్రీకృష్ణుడు.*

నన్ను **'అధోక్షజుడు'** అంటారు. వేద శబ్దార్థాలను ఆలోచించే వేదవేత్త లయిన విద్వాంసులు ప్రాగ్వంశం (యజ్ఞశాల లోని ఒక భాగం) లో కూర్చుని అధోక్షజనామంతో నా మహిమను గానం చేస్తుంటారు. ఇందువల్ల కూడా నా పేరు అధోక్షజుడు.

*జీవుడు ఎవరి అనుగ్రహంవలన అధోగతిలో పడి, క్షీణించకుండా ఉంటాడో ఆ భగవంతుని ఇంకొందరు ఈ వ్యుత్పత్తితో **'అధోక్షజుడు'** అంటారు.*

మహర్షులు అధోక్షజ శబ్దాన్ని మూడు భిన్న భిన్న పదాల సముదాయంగా భావిస్తారు. 'అ' అంటే అర్థం లయస్థానం. 'ధోక్షం' అంటే పాలన స్థానం. 'జ' అంటే ఉత్పత్తిస్థానం. ఉత్పత్తి, స్థితి, లయాలకు స్థానం నారాయణుడు ఒక్కడే. ఆ భగవానుడైన నారాయణుని కన్నా ఇతరుని ఎవరిని లోకంలో **అధోక్షజుడు** అని వ్యవహరించరు. ప్రాణుల ప్రాణాలను పరిపుష్టం చేసేది ఘృతం. నా స్వరూపమయిన అగ్నిదేవుని అర్చిస్సులను - జ్వాలలను, జాగృతం చేసే నన్ను శాంత చిత్తులు, వేదవేత్తలయిన విద్వాంసులు **'ఘృతార్చి'** అని వ్యవహరిస్తారు.

శరీరంలో వాతం, పిత్తం, కఫం అని మూడు ధాతువులు ప్రఖ్యాతమై ఉంటాయి. అవిమూడూ కర్మలవల్ల కలుగుతాయి. వీటిని త్రిధాతువులు అంటారు. ప్రాణి ఈ మూడు ధాతువులు సరిగా ఉంటే బ్రతుకుతాడు. అవి క్షీణిస్తే క్షీణిస్తాడు. కాబట్టి ఆయుర్వేదవిద్వాంసులు నన్ను **'త్రిధాతువు'** అని వ్యవహరిస్తారు. భరతవంశీయా ! ధర్మదేవత అన్నిలోకాలలో వృష నామంతో విఖ్యాతుడు. వైదిక శబ్దార్థ బోధకనిఘంటువు **వృష** శబ్దానికి ధర్మం అని అర్థం చెపుతున్నది. కాబట్టి ఉత్తమ ధర్మ స్వరూపునిగా నన్ను తెలుసుకో. కపిశబ్దానికి వరాహం, శ్రేష్ఠం అని అంటారు. వృషం అంటే ధర్మం. నేను ధర్మాన్ని, శ్రేష్ఠ వరాహరూపధరుడను. అందువల్ల కశ్యపప్రజాపతి నన్ను **'వృషాకపి'** అని చెపుతాడు. నేను జగత్సాక్షిని, సర్వవ్యాపి అయిన ఈశ్వరుడను. దేవతలు, అసురులు నా ఆది, మధ్య, అంతాలను తెలుసుకోలేరు. కాబట్టి నన్ను అనాది, అమధ్యుడు, అనంతుడు అని అంటారు. ధనంజయా ! నేను ఇక్కడ పవిత్రాలు, వినదగినవి అయిన మాటలను వింటాను. పాపవచనాలను వినను. కాబట్టి నేను **'శుచిశ్రవుడను'**. పూర్వం నేను ఒక కోర (కొమ్ము) గల వరాహావతారం ధరించి, ఈ భూమిని నీటి నుంచి ఉద్ధరించాను. అందువల్ల నన్ను **ఏకశృంగుడు** అంటారు. ఇలాగే వరాహరూపాన్ని ధరించినప్పుడు గౌరవర్ణశరీరం మీద మూడు మూపురాలు (ककుత్తులు) ఉన్నాయి. కాబట్టి శరీరాకృతివలన **'త్రికకుత్'** అనే పేరుతో విఖ్యాతుడ నైనాను. కపిల మహర్షి విరచిత సాంఖ్య శాస్త్రజ్ఞులు విరించ అని చెప్పిన సర్వలోక స్రష్ట అయిన **'విరించమడను'** నేనే. సర్వానికి చేతన

ప్రదాతను. తత్త్వాన్ని నిశ్చయించే సాంఖ్య శాస్త్రాచార్యులు నన్ను అదిత్య మండలంలో ఉన్నవాడు, విద్యాసహాయ సంపన్నుడు, సనాతన దైవం అయిన **'కపిలు'**నిగా చెప్పారు. వేదసంస్తుతుడు, ఈ జగత్తులో ఎల్లప్పుడు యోగిజన పూజితుడు, సంస్మృతుడు, తేజస్వి అయిన **హిరణ్య గర్భుడను** నేనే. వేదవేత్తలు నన్ను ఇరవైయొక్క వేల శాఖలుగల ఋగ్వేదమనీ, వేయిశాఖలు గల సామవేదమనీ చెపుతారు.

బ్రాహ్మణులు ఆరణ్యకాలలో నన్నే గానం చేస్తారు. ఆ నా పరమ భక్తులు దుర్లభులు. యజుర్వేదంలో (ఏబది యారు, ఎనిమిది, ముప్పదియేడు) నూట ఒక్క శాఖలు ఉన్నవి. ఆ యుజుర్వేదంలో కూడా నన్నే గానం చేస్తారు. అథర్వవేదవేత్త లయిన విప్రులు కృత్యలు - ఆభిచారిక ప్రయోగాలుగల పంచకల్పాత్మకమైన అధర్వవేదంగా నన్ను భావిస్తారు. వేదాలలో ఉన్న భిన్న భిన్న శాఖలలో గల గీతాలు, ఆ గీతాలలోని స్వరాల, వర్ణాల ఉచ్చారణలో గల రీతులు అన్నింటినీ నేనే నిర్మించాను. కుంతీకుమారా ! అందరికీ వరప్రదాత హయగ్రీవ స్వామిగా నేనే అవతరించాను. ఉత్తర భాగంలోని *వేదమంత్రాల క్రమవిభాగాన్ని, అక్షర విభాగాన్ని తెలిసినవాడను నేనే. మహాత్ముడైన పాంచాలుడు నామదేవుడు చెప్పిన ధ్యానపద్ధతిలో నన్ను ఆరాధించి, సనాతనుడ నైన నా దయ చేతనే వేదక్రమవిభాగాన్ని పొందాడు. బాభ్రవ్యగోత్రుడైన గాలవ మహర్షి నారాయణునివలన వరాన్ని, పరమోత్తమ యోగాన్ని పొంది, వేదానికి క్రమవిభాగాన్ని శిక్షను చెప్పి, అందరికంటెముందు క్రమవిభాగంలో పారంగతుడైన విద్వాంసు డయినాడు. కండరీక వంశంలో జన్మించిన ప్రతాపవంతు డైన బ్రహ్మదత్తు డనే రాజు, ఏడుజన్మల జననమరణ దుఃఖాలను పలుమారులు స్మరించి, తీవ్రవైరాగ్యం వలన త్వరగా యోగం వల్ల కలిగిన ఐశ్వర్యం పొందాడు. కురువంశశ్రేష్ఠ ! పార్థా! పూర్వకాలంలో నేను ఒక కారణం వలన ధర్మదేవతపుత్రుడనుగా ప్రసిద్ధుడ నైనాను. ఇందువల్ల నన్ను **ధర్మజుడు** అన్నారు.

పూర్వం నరనారాయణులు ధర్మమయ మయిన రథాన్ని ఎక్కి, గంధమాదన పర్వతం మీద అక్షయ తపస్సు చేసే సమయంలో దక్షప్రజాపతి యజ్ఞం ప్రారంభం

---

* *వి॥ వేదమంత్రాలలోని రెండు రెండు పదాలను ఉచ్చరించి మొదటి మొదటి పదాన్ని వదిలేస్తూ ఉతరోత్తరపదాలను కలిపి పరిస్తూ ఉండటాన్ని 'క్రమం' అంటారు. ఉదా "అగ్ని మీళే పురోహితమ్" అనే దాని క్రమపారం ఇలా ఉంటుంది. అగ్ని మీళే, ఈళే పురోహితం, పురోహితం యజ్ఞస్య ఇత్యాదిగా, అక్షర విభాగం అంటే పదవిభాగం అని అర్థం. ఉదా అగ్నిమ్ ఈళే, పురోహితం ఇలాగా పదాలను విడదీసి చదివే విద్వాంసుని పదపారి అని, పద ద్వయాన్ని విడదీసి చదివే వానిని క్రమ పారి అని అంటారు.*

అయింది. ఆ యజ్ఞంలో దక్షుడు రుద్రునికి యజ్ఞ భాగం ఇవ్వలేదు. ఈ విషయం దధీచి చెప్పగా రుద్రుడు దక్షయజ్ఞాన్ని విధ్వంసం చేశాడు. రుద్రుడు కోపంతో ప్రజ్వలిస్తున్న త్రిశూలాన్ని పలుమారులు ప్రయోగించాడు. ఆ త్రిశూలం దక్షుని సువిశాల యజ్ఞాన్ని భస్మంచేసి, వేగంగా బదరికాశ్రమంలో ఉన్న నరనారాయణులమైన మావద్దకు వచ్చింది. ఆ సమయంలో ఆ త్రిశూలం నారాయణుని వక్షఃస్థలంలో తగిలింది. అక్కడినుండి వచ్చిన తేజస్సు వలన నారాయణుని కేశాలు ముంజగడ్డి రంగుకు తిరిగాయి. అందువల్ల నాపేరు **'ముంజకేశుడు'** అయినది. అప్పుడు మహాత్ముడైన నారాయణుడు చేసిన హుంకారం వలన ఆ శూలం వెనకకు తగ్గి, తిరిగి శివుని చేతికి వచ్చింది. అప్పుడు రుద్రుడు తపోలగ్నులయిన ఆ మహర్షుల పైకి వచ్చాడు. తన మీదికి వచ్చిన రుద్రుని మెడను నారాయణుడు పట్టుకొన్నాడు. ఈ కారణం వల్ల కంఠం నీలం కాగా ఆయన **'నీలకంఠుడు'** అనే పేరుతో ప్రసిద్ధుడయినాడు. అప్పుడు రుద్రుని నాశనం చేయటానికి నరుడు ఒక దర్భపోచను (రెల్లు పుల్లను) తీసి, మంత్రంతో అభిమంత్రించి, త్వరగా విడిచాడు. అది ఒక గొప్ప పరశువుగా మారింది. నరుడు ప్రయోగించిన ఆ పరశువును రుద్రుడు ముక్కలు చేశాడు. అందువల్ల నేను **'ఖండపరశువు'** అయినాను."

అర్జునుడు అడిగాడు. "వృష్ణివంశీయా ! కృష్ణా ! ముల్లోకాలను ఉపసంహరించే ఆయుద్ధంలో రుద్రనారాయణులలో ఎవరు జయం పొందారో నాకు చెప్పవలసింది." శ్రీభగవానుడు చెప్పాడు. "అర్జునా ! రుద్రనారాయణులు ఆ యుద్ధంలో తలపడినప్పుడు సర్వలోకాలలోని సమస్త ప్రాణులు ఉద్వేగం చెందాయి. యజ్ఞాలలో యథావిధిగా హోమంచేసిన పవిత్రమైన హవిస్సును అగ్నిదేవుడు గ్రహించ లేకపోయాడు. పవిత్రహృదయు లయిన మహర్షులకు వేదాలు స్ఫురించలేదు. అప్పుడు దేవతలను రజోగుణ తమో గుణాలు ఆవేశించాయి. భూమి కంపించింది. ఆకాశం సంచలించింది. గ్రహనక్షత్రాదు లయిన తేజస్సులన్నీ కాంతిని కోల్పోయాయి. బ్రహ్మదేవుడు పద్మాసనం నుంచి పడిపోయినాడు. సముద్రం ఎండిపోసాగింది. హిమవత్పర్వతం చీలిపోసాగింది. పాండుకుమారా ! ఇలా అన్నీ అపశకునాలు గలుగగా బ్రహ్మదేవుడు దేవసమూహాలతో, మహర్షులతో కలిసి యుద్ధం జరిగే చోటికి త్వరగా వచ్చాడు. వేదాంగమైన నిరుక్తం చేత తెలియదగిన చతుర్ముఖబ్రహ్మ చేతులు జోడించి, రుద్రునితో 'దేవా ! సమస్తలోకాలకు మేలు కలుగుగాక. విశ్వేశ్వరా ! లోకహితం కోసం ఆయుధాన్ని ఉపసంహరించు. సమస్తజగత్తును ఉత్పన్నం చేసేది, వినాశరహితమూ, అవ్యక్త పరమేశ్వర స్వరూపమూ, జ్ఞానులు కూటస్థం, ద్వంద్వరహితం, కర్త, అకర్త అని భావించేది, వ్యక్తీభావం చెందిన ఆ పరమాత్మ పరమమంగళ స్వరూపమే

ఇది. ధర్మదేవతకులంలో అవతరించిన మహావ్రతులు, దేవశ్రేష్ఠులు అయిన నరనారాయణులు మహత్తరతపోమగ్నులు. ఒకానొక కారణంచేత ఆ నారాయణుని అనుగ్రహం వలన నేను జన్మించాను. నాయనా ! పూర్వ సృష్టిలో నీవు కూడా ఆ భగవానుని క్రోధం వల్ల జనించిన సనాతన పురుషుడవే. వరప్రదా ! మహర్షులతో, దేవతలతో, నాతో కలిసి నీవు ఈ భగవానుని ప్రసన్నుని చేయవలసింది. అందువల్ల సమస్తలోకాలు శాంతిస్తాయి. ఇక ఆలస్యం చేయవద్దు.'

బ్రహ్మ ఇలా చెప్పగా రుద్రుడు క్రోధాగ్నిని వదిలాడు. అప్పుడు ఆది దేవుడు, శ్రేష్ఠుడు, వరప్రదాత, సర్వసమర్థుడు అయిన నారాయణుని ప్రసన్నుని చేసికొని ఆయనను శరణు పొందాడు. క్రోధవిజేత, ఇంద్రియజేత అయిన నారాయణుడు ప్రసన్నుడై రుద్రుని ఆలింగనం చేసుకొన్నాడు. **తరువాత దేవతలచేత, ఋషులచేత, బ్రహ్మదేవుని చేత చక్కగా పూజితుడయి, జగదీశ్వరు డయిన హరి రుద్రునితో 'దేవా ! నిన్ను తెలుసుకొన్నవాడు నన్నుకూడా తెలుసుకొంటాడు. నిన్ను అనుసరించేవాడు నన్ను అనుసరించేవాడవుతాడు. మన ఇద్దరిలో ఏమీ భేదంలేదు. నీ మనస్సులో ఇందుకు విరుద్ధ భావం పెట్టుకొనకు.*** నీ శూలం వల్ల నా వక్షఃస్థలంతో గలిగిన ఈ చిహ్నం **'శ్రీవత్సం'** అనే పేరుతో ప్రసిద్ధం అవుతుంది. నా చేతివల్ల నీ కంఠంలో కలిగిన చిహ్నం కారణంగా నేటి నుండి నీవు **'శ్రీకంఠుడవు'** అవుతావు.' శ్రీభగవానుడు చెప్పాడు. "అర్జునా ! వారిద్దరు ఒకరికొకరు ఇలా చిహ్నాలను ఏర్పరచుకొన్నారు. ఆ ఋషులు ఇద్దరు రుద్రునితో గాఢమైత్రిని ఏర్పరచుకొని, దేవతలకు సెలవిచ్చి, శాంతచిత్తులై, వెనుకటివలెనే తపస్సు చేయసాగారు. ఈ రీతిగా యుద్ధంలో నరనారాయణుల విజయవృత్తాంతం నీకు చెప్పాను. భరతవంశీయా ! రహస్యమయిన నా నామాల వ్యుత్పత్తిని చెప్పాను. ఋషులు నాకు నిశ్చయించిన నామాలను కూడా వివరించాను. కుంతీకుమారా ! ఇలా అనేక రూపాలను దాల్చి నేను భూమి మీద సంచరిస్తాను. బ్రహ్మలోకంలో ఉంటాను. సనాతన మయిన గోలోకంలో విహరిస్తాను. నాచే సురక్షితుడవై నీవు పూర్వం యుద్ధంలో విజయం పొందావు. యుద్ధం జరిగినప్పుడు నీకు ముందు నడచిన వ్యక్తి జటాజూటధరుడు, దేవదేవుడు అయిన రుద్రునిగా తెలుసుకో. క్రోధజాతుడు అని నేను నీకు ఆయనను గురించియే చెప్పాను. ఆయననే కాలస్వరూపుడు అంటారు. నీవు చంపిన శత్రువులు అంతకుముందే రుద్రదేవుని చేతిలో హతు లయినారు. ఆయన ప్రభావం ఇంత అని

---

* **యస్త్వాం వేత్తి న మాం వేత్తి యస్త్వామను న మామను।**
నావయోరంతరం కించిత్ మా తేఽభూద్బుద్ధిరన్యథా ॥ 133

చెప్పలేనిది. దేవాధిదేవుడు, పార్వతీ వల్లభుడు, విశ్వనాథుడు, పాపహారి, వినాశ రహితుడు అయిన ఆ మహాదేవుని నిశ్చల చిత్తుడవై నమస్కరించు. ధనంజయా ! క్రోధజుడు అని నేను పలుమారులు ఆయనను గూర్చియే చెప్పాను. ఇంతకు ముందు నీవు విన్నది అంతా ఆ రుద్రదేవుని ప్రభావమే."

343. నారాయణీయము - 10.

శౌనకుడు చెపుతున్నాడు. "సూతపుత్రా ! నీవు చాలా గొప్ప కథను చెప్పావు. దీనిని విని, మునులందరూ పరమాశ్చర్యం పొందారు. పుణ్యాశ్రమాలన్నీ సందర్శించడం, అన్ని పుణ్యతీర్థాలలో స్నానం చేయడం కూడా నారాయణ కథ ఇచ్చినంత పుణ్యాన్ని ఇవ్వవు. పుణ్యప్రదమూ, పాపవినాశకమూ అయిన నారాయణుని కథ మొదటి నుండి విని, మా మనస్సులు పవిత్రా లయ్యాయి. సర్వలోకాలూ నమస్కరించే దేవుడు నారాయణుడు. బ్రహ్మాది దేవతలూ, మహర్షులూ కూడా ఆయనను దర్శించలేరు. అటువంటి నారాయణుని నారదుడు దర్శించాడు. నిజంగా ఇది నారాయణుని అనుమతితోనే జరిగింది. అనిరుద్ధస్వరూపంలో ఉన్న జగన్నాథు డయిన శ్రీహరిని చూసిన నారదుడు, నరనారాయణులను మళ్ళీ దర్శించటానికి వెళ్ళిన కారణం ఏమిటో చెప్పవలసింది."

సౌతి చెప్పాడు. "శౌనకా ! జనమేజయ మహారాజు ! యజ్ఞం యథావిధిగా జరిగే సమయంలో నానా విధ కర్మ కాండలో అవకాశం లభించినప్పుడు తన పితామహులకు పితామహుడై వేదనిధి అయిన శ్రీకృష్ణద్వైపాయనవ్యాసమహర్షిని ఇలా అడిగాడు. "మహాత్మా ! భగవంతుడయిన శ్రీమన్నారాయణుడు చెప్పిన విషయాన్నే ఆలోచిస్తూ, శ్వేత ద్వీపాన్నుంచి వెనుదిరిగి వచ్చిన దేవర్షి నారదుడు ఏం చేశాడు ? ఆయన బదరికాశ్రమానికి వచ్చి ఆ నరనారాయణ మహర్షుల వద్ద ఎంత కాలం ఉన్నాడు ? ఏ విషయం అడిగాడు ? లక్ష శ్లోకాలతో విస్తార మయిన మహాభారతే తిహాసాన్నుంచి తీసి వినిపించిన సారభూతమయిన ఈ కథ బుద్ధి అనే కవ్వంతో జ్ఞాన సముద్రాన్ని చిలికి, తీసిన అమృతంతో సమాన మయినది. మహాత్మా ! పెరుగు నుంచి వెన్నను, మలయ పర్వతాన్నుంచి మంచి గంధాన్ని, ఓషధులనుంచి అమృతాన్ని తీసినట్లు నీవు ఈ కథ అనే అమృతాన్ని తీసి పెట్టావు. తపోనిధీ ! నీవు నారాయణుని కథాశ్రయమయిన విషయాలు చెప్పావు. అవి అన్నీ ఈ గ్రంథానికి సారమయినవి. సర్వేశ్వరుడయిన శ్రీమన్నారాయణుడు సర్వప్రాణి సృష్టికర్త. ద్విజశ్రేష్ఠా ! ఆ నారాయణుని దివ్యతేజస్సు పరమాద్భుతం గదా ! అది తేరిపారజూడటానికి మానవులకు అశక్య మయినది. కల్పాంతంలో, ఆయనలో బ్రహ్మాదులయిన సమస్త దేవతలు,

ఋషులు, గంధర్వులు, సర్వచరాచరజగత్తు విలీనం అవుతుంది. ఆ స్వామిని మించిన పరమ పావనమూ, మహత్తరమూ అయినది ఈ భూలోకంలో గాని, స్వర్గంలోకంలో గాని ఇంకొకటి లేదని నా విశ్వాసం.

శ్రీమన్నారాయణుని కథ ఇచ్చేఫలితాన్ని సమస్త ఋషుల ఆశ్రమాలకు యాత్ర చేయటం, సమస్త తీర్థాలలో స్నానం చేయటం కూడా ఇవ్వలేవు. విశ్వేశ్వరుడయిన శ్రీహరికథ సర్వపాపాలను నాశనం చేసేది. దాన్ని మొదటినుంచి విని, ఇక్కడ ఉన్న మేము అందరమూ పరమ పవిత్రులమయినాం. మా పితామహు డయిన అర్జునుడు శ్రీవాసుదేవుని సహాయంతో పొందిన మహత్తర విజయంలో, ఆయన చేసిన అద్భుతకార్యం ఏమీ లేదు అని అనుకొంటాను. త్రైలోక్యనాథుడయిన శ్రీకృష్ణుడు సహాయంగా ఉన్నప్పుడు ఆయనకు లభించని వస్తువు ఏదీ ఉండదని నా భావన. మహర్షీ ! హితాన్ని, మేలును కలిగించటానికి సాక్షాత్తుగా జనార్దనుడే సిద్ధంగా ఉండటం వలన నా పూర్వజులు ధన్యు లయినారు. సర్వలోకపూజితు డయిన ఆ భగవంతుని తపస్సువలననే దర్శించ వీలవుతుంది. కాని మా తాతలు శ్రీవత్సాంకు డయిన శ్రీహరిని అనాయాసంగా సాక్షాద్దర్శనం చేశారు. వారందరికంటె బ్రహ్మపుత్రు డయిన నారదమహర్షి ధన్యతరుడు. శ్వేతద్వీపానికి వెళ్ళి, సాక్షాత్తుగా శ్రీహరిని దర్శించిన అవ్యయు డయిన నారద మహర్షిని అల్పతేజస్వి అని అనుకొనను. ఆయనకు భగవద్దర్శనం ఆ భగవానుని కృప వలననే కలిగింది.

ఆ సమయంలో నారదుడు శ్వేతద్వీపానికి వెళ్ళి, అని రుద్ధస్వరూపంలో ఉన్న నారాయణుని దర్శించాడు గదా ! మళ్ళీ నరనారాయణులను దర్శించటానికి బదరికాశ్రమానికి వెళ్ళటానికి కారణం ఏమిటి ? పరమేష్ఠి పుత్రుడయిన నారదుడు శ్వేతద్వీపాన్నుంచి వచ్చి, బదరికాశ్రమానికి వెళ్ళి, ఆ ఇద్దరు మునులను దర్శించినప్పుడు అక్కడ ఎంతకాలం ఉన్నాడు ? వారిని ఏయే ప్రశ్నలు అడిగాడు ? శ్వేత ద్వీపాన్నుంచి వచ్చిన ఆ నారదునికి మహాత్ము లయిన నరనారాయణులు చెప్పిన దానిని అంతా ఉన్నది ఉన్నట్లు చెప్పవలసింది.' వైశంపాయనుడు చెప్పాడు. "మహాతేజస్వి అయిన వ్యాసభగవానునికి నమస్కారం. ఆయన అనుగ్రహం వలననే ఈ నారాయణుని కథను చెపుతాను. రాజా ! శ్వేత ద్వీపానికి వెళ్ళి, నారదుడు అవ్యయుడయిన శ్రీమన్నారాయణుని దర్శించి, తిరిగి వచ్చి, వేగంగా మేరు పర్వతం మీదికి వెళ్ళాడు. పరమాత్మ చెప్పిన కార్యభారాన్ని ఆయన మనస్సుతో వహించి ఉన్నాడు. తరువాత ఆయనకు అంతదూరాన్నుంచి చాలా వేగంగా తాను అక్కడికి రావటం ఎలా జరిగింది ? అని ఆశ్చర్యం కలిగింది. తరువాత మేరుపర్వతం నుంచి గంధమాదన పర్వతం వైపు వెళ్ళి, బదరీవిశాలతీర్థం సమీపంలో చాలా వేగంగా

ఆకాశాన్నుంచి కిందికి దిగాడు. అనంతరం ఆయన పురాతన మహర్షులై, మహత్తరమైన ఆత్మనిష్ఠలో ఉండి, మహావ్రతులై, తపస్సు చేస్తున్న నరనారాయణులను దర్శించాడు. వారిద్దరు సర్వలోకాలను ప్రకాశింపజేసే సూర్యుని కన్నా అధిక తేజోవంతులు. ఆ మహాత్ముల వక్షఃస్థలంలో శ్రీవత్సలాంఛనం ఉన్నది. జటాసమూహధారు లయిఉన్నారు.

వారి చేతులలో హంస చిహ్నాలు, పాదాలలో చక్రచిహ్నాలు ఉన్నాయి. విశాలవక్షఃస్థలం, పొడవైన భుజాలు, అండకోశాలలో నాలుగు నాలుగు బీజాలు, అరువది దంతాలు, ఎనిమిది కోరలు, మేఘగంభీర కంఠస్వరం, చక్కని ముఖాలు, విశాలమైన లలాటాలు, చక్కని దవడలు, కనుబొమలు, అందమైన నాసిక వారికి ఉన్నాయి. ఆ ఇద్దరి దేవుల శిరస్సులు గొడుగు వలె ఉన్నవి. ఇలాంటి శుభలక్షణాలు గల ఇద్దరిని దర్శించిన నారదునికి సంతోషం కలిగింది. నరనారాయణులు నారదునికి స్వాగత సత్కారాలు చేసి, కుశలం అడిగారు. వారిద్దరిని దర్శించిన నారదుడు మనస్సులో, 'ఆహా ! నేను శ్వేతద్వీపంలో భగవానుని సభలో సర్వభూత నమస్కృతులయిన సదస్యులను చూశానుగదా ! ఈ పురుషోత్తములు కూడా వారి వలెనే ఉన్నారే !' అని అనుకొన్నాడు. ఇలా భావించి, వారికి ప్రదక్షిణం చేసి, చక్కని ఒక దర్భాసనం మీద కూర్చున్నాడు అక్కడ.

తరువాత తపస్సుకు, యశస్సుకు, తేజస్సుకు స్థానమైన ఆ ఋషులు శమదమాలు కలిగి ఉదయ కాలాన చేయవలసిన విధులను ఎలాంటి తొందర లేకుండా చేశారు. అనంతరం నారదమునిని అర్ఘ్యపాద్యాలతో అర్చించారు. రాజా ! వారు నిత్యకార్యకలాపాలను ముగించి, నారదునికి ఆతిథ్యాన్ని ఇచ్చి, కుశాసనాల మీద కూర్చున్నారు. అలా వారు ముగ్గురు కూర్చున్న ఆ ప్రదేశం ఆజ్యాహుతులతో ప్రజ్వరిల్లుతున్న విశాల జ్వాలలుగల మూడు అగ్నులున్న యజ్ఞశాలవలె విరాజిల్లింది. అప్పుడు ఆతిథ్యం స్వీకరించి, విశ్రాంతి తీసుకొంటూ, సుఖంగా కూర్చుని ప్రశాంతంగా ఉన్న నారదునితో నారాయణముని ఇలా అన్నాడు. దేవర్షీ ! నీవు ఈ సమయంలో శ్వేతద్వీపానికి వెళ్ళి మా ఇద్దరికి పరమకారణ రూపుడు, సనాతనుడు, పరమాత్మ అయిన ఆ భగవానుని దర్శించావా ?" నారదుడు చెప్పాడు. "మాన్యులారా ! విశ్వరూపధరుడు, అవినాశి, కాంతి మంతుడయిన ఆ పరమ పురుషుని దర్శించాను. ఋషులతో కూడ దేవతలు, అన్ని లోకాలు ఆయనలోనే విరాజిల్లుతున్నాయి. ఇప్పుడు కూడా సనాతన పురుషు లయిన మిమ్ములను చూస్తుంటే, శ్వేతద్వీప నివాసి అయిన ఆ భగవానుని దర్శనం చేస్తున్న అనుభవమే కలుగుతున్నది. అక్కడ అవ్యక్త రూపధారి అయిన శ్రీహరిలో చూసిన లక్షణాలే, వ్యక్త రూపు లయిన మీ యిద్దరిలో అలాగే కన్పిస్తున్నాయి. ఆ స్వామికి ప్రక్కన మిమ్ములను ఇద్దరిని చూశాను. ఆ పరమాత్మ అనుమతి పొంది, ఇవ్వాళ ఇక్కడికి వచ్చాను.

ముల్లోకాలలో ధర్మ పుత్రులయిన మీ ఇద్దరు తప్ప తేజస్సు, యశస్సు, శోభలలో ఆ పరమాత్మతో సమానుడు వేరెవ్వ డున్నాడు ? ఆ శ్రీహరి సర్వధర్మాలు సంపూర్ణంగా చెప్పాడు. క్షేత్రజ్ఞుని తెలిపాడు. భవిష్యత్తులో ఎక్కడెక్కడ ఏయే అవతారాలు కలుగుతాయో అది అంతా వివరించాడు ? అక్కడ అందరూ చంద్ర సమానశ్వేత వర్ణులు, అందరూ పంచేంద్రియ రహితులు. (అనగా పాంచభౌతిక శరీర రహితులు) జ్ఞానులు, పురుషోత్తముడయిన శ్రీహరి భక్తులు. వారు ఎల్లప్పుడు ఆ పరమాత్మను అర్చిస్తుంటారు. ఆయన కూడా వారితో క్రీడిస్తుంటాడు. పరమాత్మ భక్తప్రియుడు, ద్విజప్రియుడు గదా ! జగత్పరిపాలకుడు, సర్వవ్యాపి అయిన భగవంతుడు భక్తవత్సలుడు. భక్తులకు ప్రియుడు, భాగవత ప్రియు డయిన శ్రీహరి వారి పూజలను స్వీకరిస్తూ ప్రసన్నంగా ఉంటాడు. మహత్తరబలం, తేజస్సు గల ఆయన కర్త, కారణం, కార్యం, అయి ఉంటాడు. మహా యశస్వి అయిన ఆ పరమాత్మ హేతువు, ఆజ్ఞ, విధి, తత్త్వం అయి ఉన్నాడు. ఆయన తనంత తానే తపస్సులో మగ్నుడై, శ్వేతద్వీపానికి అవతల కూడా వెలుగులు వెదజల్లే తేజోమయ రూపంతో ప్రఖ్యాతుడై ఉంటాడు. ఆయన ఆ తేజస్సు స్వప్రకాశంతో ప్రకాశిస్తుంటుంది. పరమ పవిత్రాత్ము డయిన ఆ పరమాత్మ ముల్లోకాలలో శాంతిని విస్తరింపజేశాడు. ఈ మంగళమయచిత్తంతో ఆయన నైష్ఠిక వ్రతాన్ని స్వీకరించి ఉన్నాడు. అతి కఠినమయిన తపస్సులో ఆయన ఉండగా అక్కడ సూర్యుడు ఎండకాయడు, చంద్రుడు వెన్నెల వెదజల్లడు, గాలి వీచదు. అక్కడ భూమి మీద ఎనిమిది అంగుళాల వెడల్పు గల పెద్దవేదిక ఉన్నది. దాని మీద ఆయన చేతులు పైకెత్తి, ఏక పాదం మీద నిలచి, ఉత్తర ముఖంగా ఉన్నాడు. ఆయన సాంగాలైన వేదాలను పారాయణం చేస్తూ, చాల కఠోరమైన తపస్సులో లీనమయి ఉన్నాడు. బ్రహ్మ, మహేశ్వరుడు, ఋషులు, సమస్త దేవతలు, దైత్యులు, దానవులు, రాక్షసులు, నాగులు, గంధర్వులు, సిద్ధులు, రాజర్షులు ఎల్లప్పుడు విధి పూర్వకంగా సమర్పించే హవ్యకవ్యాలు సమస్తమూ ఆయన పాదాల వద్ద ఉంటాయి. అనన్య భావంతో ఏకాగ్రచిత్తులై ఆయనయందు మనస్సు లగ్నం చేసినవారు చేసే క్రియలు అన్నింటిని ఆ స్వామి తలదాలుస్తాడు. అక్కడ ఉన్న మహాత్ములయిన భక్తులకంటె ఆ భగవంతునికి మూడు లోకాలలో అధిక ప్రియులు వేరే ఎవరూ లేరు. కాబట్టి నేను అనన్యభావంతో ఆయనను శరణు పొందాను. ఆ పరమాత్మ పంపటం వల్లనే నేను ఇక్కడికి వచ్చాను. భగవంతుడే నాకు అలా చెప్పాడు. ఇప్పుడు నేను ఆయన ఆరాధనలో తత్పరుడనై ఇక్కడ మీతో పాటు నిత్య నివాసం చేస్తాను."

344. నరనారాయణులు చెప్పిన వాసుదేవ మాహాత్మ్యము.

నరనారాయణులు పలికారు. 'నారదా ! నీవు శ్వేతద్వీపానికి వెళ్ళి సాక్షాత్తుగా భగవద్దర్శనం చేసి ధన్యుడవు అయినావు. నీవు తప్ప ఆయనను బ్రహ్మకూడా స్వయంగా చూడలేదు. అవ్యక్తప్రకృతికి మూలకారణమైన ఆ పురుషోత్తముని దర్శించటం చాలా కష్టమైన పని. నీకు నిజం చెపుతున్నాము. ఆ భగవంతునికి భక్తునికంటె ప్రియతరుడు మరొకడు లేడు. కాబట్టే నీకు స్వయంగా దర్శనం అనుగ్రహించాడు. ద్విజోత్తమా ! ఆ పరమాత్మ తపస్సు చేస్తున్న ప్రదేశానికి మాకు ఇద్దరికి తప్ప ఇంకెవ్వరికీ ప్రవేశం ఉండదు. ఆ భగవంతుడు విరాజిల్లే చోటు వేయిమంది సూర్యులు ఒక్కటైతే కలిగేటంత కాంతిమంతంగా ఉంటుంది. ఓర్పుగల వారిలో శ్రేష్ముడవైన నారదా ! బ్రహ్మదేవునికి కూడ ప్రభు వయిన ఆ పరమేశ్వరుని నుండియే క్షమాగుణం ఉత్పన్నమయి భూమిలో కలిసి ఉంది. సమస్త ప్రాణుల హితాన్ని కోరే ఆ నారాయణుని నుండియే రసం వ్యక్తమయి, జలంతో సంయోగం చెందింది. ఆ రసం వల్లనే జలం ద్రవీభూత మయి ఉన్నది. రూపగుణం గల తేజస్సు ఆయన నుండియే ఉత్పన్నమయి, సూర్యునిలో కలిసి ఉన్నది. అందువల్లనే సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. ఆ పురుషోత్తముని నుండి ఆవిర్భవించిన స్పర్శగుణంతో, వాయువు సంయోగం చెందాడు. అందువల్లనే వాయువు వీస్తున్నాడు. సర్వలోకేశ్వరుడు, మహాప్రభువు అయిన ఆయన నుండియే శబ్దగుణం వ్యక్త మయింది. ఆకాశం దానితో నిత్యసంయుక్త మయి ఉన్నది. అందువల్లనే ఆకాశం ఆవరణ రహితమైంది. సర్వప్రాణులలో ఉండే మనస్సు శ్రీమన్నారాయణు నుండియే ఉత్పన్నం అయింది. ఆ మనస్సుతో గూడి ఉండటం చేతనే చంద్రుడు వెలుగుతున్నాడు.

శ్రీహరి హవ్యకవ్యాలను స్వీకరిస్తూ, విద్యాశక్తితో విరాజిల్లే వేదం అనే పేరుగల స్థానాన్ని సద్భూతోత్పాదకం అంటారు. ద్విజసత్తమా ! పుణ్య పాపరహితు లయి నిర్మలు లయినవారు మంగళ మార్గంలో వెళ్ళేటప్పుడు సర్వలోకాలలోని అంధకారాన్ని నాశనం చేసే సూర్యభగవానుడే వారికి ఆ మోక్ష ధామానికి ద్వారం అని చెపుతారు. సూర్యదేవుడు వారి సర్వాంగాల్ను దగ్ధం చేసి బూడిద చేస్తాడు. అప్పుడు వారిని ఎవ్వడూ చూడలేడు. వారు పరమాణు రూపులయి సూర్యునిలో ప్రవేశిస్తారు. ఆయననుంచి కూడా విముక్తులై, వారు అనిరుద్ధ స్వరూపంలో ఉంటారు. తరువాత మనో మయరూపులై ప్రద్యుమ్ననిలో ప్రవేశిస్తారు. ప్రద్యుమ్నముక్తులయి వారు సాంఖ్యజ్ఞాన సంపన్న లయిన ఆ బ్రాహ్మణశ్రేష్ములు భగవద్భక్తులతో పాటు జీవస్వరూపు డయిన సంకర్షణునిలో ప్రవేశిస్తారు. తరువాత త్రిగుణవిముక్తులయిన ఆ ద్విజసత్తములు నిర్గుణస్వరూపుడయిన పరమాత్మలో ప్రవేశిస్తారు.

సర్వనివాసస్థాన మయిన వాసుదేవభగవానుడే క్షేత్రజ్ఞుడని తెలుసుకో. మనస్సును ఏకాగ్రం చేసిన వారు, శౌచ, నియమాదులు గలవారు, అనన్యభావంతో భగవంతుని శరణందిన భక్తులు సాక్షాత్తుగా వాసుదేవునిలో ప్రవేశిస్తారు. ద్విజశ్రేష్ఠా ! మేము ఇద్దరము ధర్మదేవుని ఇంట జన్మించి, మనోహరమయిన ఈ విశాల బదరీ తీర్థాన్ని ఆశ్రయించి, కఠోర తపోమగ్నులమై ఉన్నాము. ముల్లోకాల్లో దేవతలకు ప్రియం చేసే, ఆ పరమాత్మ అవతారాలకు ఎల్లప్పుడు పరమ మంగళం కలగటమే మా ఈ తపస్సుకు ప్రధానోద్దేశ్యం. విప్రశ్రేష్ఠా ! మేము వెనుకటి వలెనే మా కర్తవ్యాలలో నిమగ్నుల మయి బహుశ్రమతో గూడిన సర్వోత్తమ వ్రత తత్పరులమయి కూడా ఆ శ్వేతద్వీపానికి వచ్చి అక్కడ నిన్ను చూశాము. తపోధనా ! నీవు అక్కడ భగవంతుని దర్శించి ఆయనతో సంభాషించావు. ఈ విషయాలు అన్నీ మాకు బాగా తెలుసు. చరాచర ప్రాణులతో కూడిన ముల్లోకాలలో కలిగిన మంచి చెడు విషయాలు, జరిగేవి, జరుగబోతున్నవీ, ఆ సమయంలో భగవంతుడు నీకు చెప్పాడు."

వైశంపాయనుడు చెప్పాడు. "జనమేజయా ! కఠోరతపోమగ్ను లయిన నరనారాయణుల మాటలు విని నారదుడు చేతులు జోడించి నమస్కరించి, శ్రీమన్నారాయణుని శరణంది, ఆ స్వామి సేవలో లీనమయ్యాడు. ఆయన నరనారాయణాశ్రమంలో ఉండి, వెయ్యి దివ్యసంవత్సరాల కాలం నారాయణమంత్రాలను అనేకం జపం చేస్తూ ఉన్నాడు. మహాతేజస్వి అయిన నారద మహర్షి ప్రతిదినమూ ఆ శ్రీమన్నారాయణుని, ఆ నరనారాయణులను ఆరాధిస్తూ అక్కడ ఉండసాగాడు."

345. వరాహస్వామి స్థాపించిన పితృపూజా విధి.

వైశంపాయనుడు చెప్పాడు. "జనమేజయా ! తరువాత ఒకానొకప్పుడు బ్రహ్మపుత్రుడయిన నారదుడు శాస్త్రవిధి ననుసరించి మొదట హోమపూజాదు లయిన దేవకార్యాలను చేసి, తరువాత శ్రాద్ధ తర్పణాదు లయిన పితృకర్మలను చేశాడు. అప్పుడు ధర్మపుత్రు డయిన నరుడు ఆయనను "ద్విజశ్రేష్ఠా ! నీవు బుద్ధిమంతులలో అగ్రగణ్యుడవు. దేవ పితృకర్మలను చేశావు గదా ! అందువల్ల ఎవరిని పూజించినట్లవుతుంది ? దీన్ని శాస్త్రానుసారం తెలియజెయ్యి. నీవు చేసేది ఇది ఏమిటి ? ఈ కర్మవల్ల ఏ ఫలం కోరుతున్నావు?" అని అడిగాడు. నారదుడు అన్నాడు. "దేవా ! పూర్వం నీవు దేవకార్యం అందరూ చేయవలసింది అనీ, అది ఉత్తమ యజ్ఞం అనీ, యజ్ఞం సనాతన పరమాత్మ స్వరూపం అనీ చెప్పావు గదా ! నీ ఉపదేశ ప్రభావంతో ప్రతిదినమూ శాశ్వతు డయిన వైకుంఠుని పూజిస్తున్నాను. లోక పితామహు డయిన బ్రహ్మ ఆయన నుండియే మొదట

ఆవిర్భవించాడు. పరమేష్ఠి ప్రసన్నుడై నా జనకు డయిన ప్రజాపతిని జన్మింపజేశాడు. నేను ఆయనకు సంకల్పం వల్ల గలిగిన ప్రథమ పుత్రుడను.* అందువల్ల మొదట నారాయణుని అర్చన పూర్తిచేసి పితృపూజ చేస్తున్నాను. ఈ రీతిగా ఆ నారాయణుడే తండ్రి, తల్లి, తాత అవుతున్నాడు. పితృయజ్ఞాలలో ఎల్లప్పుడు జగత్పతి అయిన శ్రీహరి పూజనమే జరుగుతుంది. తండ్రులు (దేవతలు) పుత్రులను (అగ్ని ష్వాత్తాదులను)** పూజించారని ఇంకొక శ్రుతివాక్యం చెపుతున్నది. దేవతల వేదజ్ఞానం నశించింది. అందువల్ల వారి పుత్రులే వారి చేత వేదాలను అధ్యయనం చేయించారు. కాబట్టి మంత్రదాత లయిన పుత్రులు పితృభావాన్ని పొందారు. పుత్రులు, పితరులు ఒకరినొకరు పూజించారు అనే విషయం పవిత్ర పురుషు లయిన మీకు తెలిసియే ఉంటుంది. దేవతలు భూమి మీద మొదటదర్భలను పరచి, వాటి మీద పితరులనుద్దేశించి మూడు పిండాలను పెట్టి, వాటిని పూజించటానికి గల కారణం ఏమిటి ? పూర్వకాలంలో పితరులు పిండాలు అనేపేరును ఎలా పొందారు ? నరనారాయణులు చెప్పారు. మహర్షీ ! సముద్ర పరివేష్టిత అయిన ఈ భూమి పూర్వం ఏకార్ణవ జలంలో మునిగి అదృశ్యం అయింది. అప్పుడు గోవిందుడు వరాహావతారం ధరించి ఈ భూమిని త్వరగా ఉద్ధరించాడు. ఆ పురుషోత్తముడు భూమిని స్వస్థానంలో నిలిపి, నీరు, బురద అంటుకొన్న అవయవాలతోనే లోకహితకార్యం చేయటానికి సిద్ధమయినాడు. సూర్యుడు మధ్యాహ్నానికి వచ్చినప్పుడు ఆ సమయానికి చేయవలసిన నిత్యకర్మ కాలం ఆసన్న మయింది. అప్పుడు ఆ స్వామి కోరలకు అంటుకొన్న మట్టిని త్వరగా మూడు పిండాలు చేశాడు. నారదా ! తరువాత ఆయన భూమి మీద దర్భలను పరచి, వాటి మీద ఆ పిండాలను ఉంచాడు. తరువాత తనను ఉద్దేశించి, ఆ పిండాల మీద విధివిధానంతో పితృపూజాకార్యక్రమాన్ని నిర్వహించాడు. ఆ స్వామి స్వీయ విధానంతోనే ఆ పిండత్రయాన్ని సంకల్పించి, తన శరీరపు వేడిమితో ఉత్పన్న మయిన మూనెగల మూవులతో అపసవ్యంగా ఆ పిండాలను ప్రోక్షించాడు. శ్రీహరి తరువాత తూర్పుకు తిరిగి ప్రార్థన చేశాడు. ధర్మ మర్యాదాస్థాపన కోసం ఇలా పలికాడు.

(వృషాకపి) వరాహస్వామి అన్నాడు. "సర్వలోక కర్త నయిన నేను స్వయంగా

---

* *విు నారదుడు బ్రహ్మపుత్రుడయినా దక్షుని శాపం వలన ప్రజాపతి వలన జన్మింప వలసి వచ్చింది అని హరివంశంలో ఉన్నది.*

** *విుసం॥ అగ్ని ష్వాత్తాదులయిన పితృగణం దేవతల పుత్రులే. ఒకప్పుడు దేవతలకు అసురులతో బహుకాలం యుద్ధ జరిగింది. అందువల్ల వారు తాము చదువుకొన్న వేదం మరిచి పోయారు. తరువాత తమ పుత్రుల వల్ల వేదాధ్యయనం పొంది వారిని పితృపదవిలో ప్రతిష్ఠించారు. (నీల)*

పితృదేవతలను సృష్టించటానికి ఉద్యమించి, పిత్కకార్యానికి సంబంధించిన అన్నవిధానాలను చింతించే క్షణంలోనే, నా రెండు కోరలనుండి ఈ మూడు పిండాలు దక్షిణపు దిక్కున, భూమిపైన పడ్డవి. కాబట్టి ఈ పిండాలు పితృస్వరూపాలు. ముగ్గురు పితృదేవతలు అమూర్తులు, ఆకార రహితులు అయి ఉంటారు. పిండ రూప మయిన ఆకారాన్ని ధరించి వ్యక్తమయిన వీరు నేను ఉత్పన్నం చేసినవారు, సనాతను లయిన పితరులు ఆగుదురుగాక. పిత, పితామహుడు, ప్రపితామహుడు (తండ్రి, తండ్రి తండ్రి, తాత తండ్రి) వీరి రూపంలో నేనే ఈ మూడు పిండాలలో ఉన్నానని తెలుసుకోవాలి. నాకన్న శ్రేష్ఠుడు ఎవ్వడులేడు. అలాంటప్పుడు నాకన్న ఇతరుడు నాకు పూజ్యుడు ఎవడు ఉంటాడు ? నాకు తండ్రి ఎవరు ! నేనే అందరికి తండ్రిని, తాతను. ముత్తాతనూ (ప్రపితామహుడను) నేనే. ఈ జగత్తుకు అంతకు నేనే కారణం.' బ్రాహ్మణ శ్రేష్ఠా ! దేవాధిదేవుడయిన వరాహ భగవానుడు ఇలా చెప్పి, వరాహ పర్వతం మీద సవివరంగా పిండప్రదానం చేసి, పితృదేవతల రూపంలో స్వపూజను స్వయంగా చేసుకొని, అక్కడే అంతర్ధాన మయినాడు. విప్రా ! భగవంతుడే ఈ మర్యాదను ఏర్పరిచాడు. ఈ రీతిగా పితృదేవతలకు పిండ సంజ్ఞ ఏర్పడింది. వరాహదేవుడు చెప్పటంచేత ఆ పితరులు ఎల్లప్పుడు అందరి పూజలను అందుకొంటున్నారు. దేవతలను, పితరులను, గురువులను, అతిథులను, ద్విజశ్రేష్ఠులను, భూమిని, తల్లిని మనస్సు, మాట, క్రియ అనే మూడింటితో పూజించేవారు నిజానికి శ్రీహరిని పూజించేవారే అవుతారు. శ్రీవిష్ణు భగవానుడే సమస్త ప్రాణుల శరీరంలో అంతరాత్మ రూపంతో విరాజిల్లుతున్నాడు. సుఖదుఃఖాలు రెండింటికి ప్రభు వయిన శ్రీమన్నారాయణుడు సమస్త ప్రాణులలో సమభావంతో ఉన్నాడు. నారాయణుడు మహాన్, మహాత్ముడు, సర్వాత్ముడు అని శ్రుతులు చెపుతున్నవి."

346. నారాయణ మహిమోపాఖ్యానోపసంహారము.

వైశంపాయనుడు అన్నాడు. "జనమేజయా ! నరనారాయణులు చెప్పినది విన్న నారదునికి భక్తి పెరిగింది. ఆయనకు పరమాత్మయందు అనన్య భక్తి కలిగింది. నరనారాయణాశ్రమంలో భగవంతుని కథలను వింటూ, ప్రతిదినమూ ఆ అవ్యయ పరమాత్మను దర్శిస్తూ నారదుడు ఉండగా వేయి దివ్యవత్సరాలు పూర్తి అయినవి. అప్పుడు ఆయన హిమవంతం మీద ఉన్న తన ఆశ్రమానికి త్వరగా వెళ్ళాడు. ఆ తరువాత సుప్రసిద్ధ తపస్వులయిన నరనారాయణ మహర్షులు మళ్ళీ ఆ మనోహరమయిన ఆశ్రమంలో ఉంటూ తపోమగ్నులు అయినారు. పాండవ వంశాలంకారమై, పరాక్రమవంతుడ వయిన

నీవు కూడా ఈ కథను మొదటినుండి విని పవిత్రాత్ముడ వయినావు. రాజేంద్రా ! అవ్యయు డయిన విష్ణువును మనోవాక్కాయ కర్మలతో ద్వేషించేవానికి ఇహలోకపరలోకాలలో ఉనికియే లేదు. సర్వదేవశ్రేష్ఠ డయిన శ్రీమన్నారాయణుని ద్వేషించేవాని పితృదేవతలు సర్వకాలం నరకంలో పడి ఉంటారు. విష్ణు దేవుడు సర్వాత్మకు డనేది వాస్తవస్థితి. ఏ వ్యక్తి అయినా తన ఆత్మను తాను ద్వేషిస్తాడా ? వత్సా ! మాకు గురుదేవుడు, గంధవతీ పుత్రు డయిన ఈ వేదవ్యాసమహర్షియే ఉత్తమమూ, అవ్యయమూ అయిన భగవన్మాహాత్మ్యాన్ని వివరించారు. వారి వల్ల విన్నదే నేను నీకు చెప్పాను. దేవర్షి నారదుడు రహస్యమూ, సంగ్రహమూ అయిన ఈ ధర్మాన్ని, సాక్షాత్తుగా జగదీశ్వరు డయిన నారాయణుని నుండియే పొందాడు. రాజోత్తమా ! ఈ రీతిగా ఈ మహాధర్మాన్ని ఇంతకు ముందు హరిగీతలో సంక్షిప్తంగా చెప్పాను. **పురుషశ్రేష్ఠా ! శ్రీకృష్ణ ద్వైపాయన వ్యాసమహర్షిని ఈ భూమి మీద ఉన్న శ్రీమన్నారాయణునిగానే తెలుసుకో. ఆ భగవంతునికంటె వేరెవరు మహాభారతకర్త కాగలరు?*** ఆ భగవంతుడు తప్ప ఇంకొకడు నానా విధాలయిన ధర్మాలను చెప్పగలడా ? నీవు సంకల్పించిన రీతిగానే, ఈ మహాయజ్ఞం నిరంతరంగా జరుగుగాక. నీవు అశ్వమేధయాగాన్ని చేయ సంకల్పించావు. సర్వధర్మాలను యథార్థరూపంగా విన్నావు."

సౌతిచెప్పాడు. శౌనకా ! రాజ శ్రేష్ఠుడయిన జనమేజయుడు వైశంపాయనుడు చెప్పిన ఈ మహోపాఖ్యానాన్ని విని, తన యజ్ఞాన్ని పరిపూర్ణం చేయటానికి కావలసిన పనులు చేయసాగాడు. శౌనకా ! ఈనాడు నీ ప్రశ్ననుసారం నైమిషారణ్య వాసులయిన ఈ మునుల సమక్షంలో ఈ నారాయణీయో పాఖ్యానాన్ని నీకు వినిపించాను. రాజా ! పూర్వకాలంలో నారదుడు, ఋషులు, పాండవులు, శ్రీకృష్ణుడు, భీష్ముడు వింటూ ఉండగా ఈ విషయాన్ని మాగురుదేవులు వ్యాసమహర్షి చెప్పారు. పరమగురువు, జనపతి, లోకాధిపతి, విశాలభూమిని ధరించినవాడు, వేదజ్ఞానానికి, వినయానికి నిధి అయినవాడు, శమనియమాలకు నిధి, బ్రాహ్మణులకు పరమహితకరుడు, దేవతల హితం కోరేవాడు అయిన శ్రీహరి నీకు ఆశ్రయం అగు గాక. అసుర సంహారకుడు, తపోనిధి, విశాలయశోభాజనుడు, మధుకైటభ సంహారకుడు, కృతయుగధర్మజ్ఞానం కలిగి వాటిని అనుష్ఠించేవారికి సద్గతిని ప్రసాదించేవాడు, అభయ దాత, యజ్ఞభాగగ్రహీత అయిన శ్రీమన్నారాయణుడు ఆశ్రయం అగుగాక. గుణత్రయం కలవాడైనా నిర్గుణుడు, వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు,

---

* కృష్ణద్వైపాయనం వ్యాసం విద్ధి నారాయణం భువి ।
కో హ్యన్యః పురుషవ్యాఘ్రః మహాభారతకృద్భవేత్ ॥ 12

అనిరుద్దుడు అనే నాలుగు రూపాలు ధరించేవాడు, ఇష్టాలు (యజ్ఞాదులు), పూర్తాలు (వాపీ కూపతటాకాది నిర్మాణం) అనే వాటి ఫల భాగగ్రహీత, ఎప్పుడూ పరాజితుడు కానివాడు, అచంచల ధైర్యం గలవాడు అయిన శ్రీహరి పుణ్యాత్ములయిన ఋషులకు ఆత్మజ్ఞానం వల్ల కలిగే సద్గతిని ఇచ్చుగాక. సర్వజగత్తులకు సాక్షి, జనన రహితుడు, అంతర్యామి, పురాణ పురుషుడు, సూర్యునివలె తేజస్వి, ఈశ్వరుడు, సర్వవిధాల అందరికి గతి అయిన పరమేశ్వరుని, మీరు అందరూ ఏకాగ్రచిత్తులయి నమస్కరించండి. వాసుదేవ స్వరూపు డయిన ఆ నారాయణ ఋషికి శేషశయనుడు కూడా నమస్కరిస్తాడు. ఆయనయే జగత్తుకు ఆదికారణం, అమృత పదం (మోక్షానికి ఆశ్రయం), సూక్ష్మస్వరూపుడు, శరణదాత, అచంచల, సనాతన స్థానం అయినవాడు శౌనకా ! మనస్సును స్వాధీనం చేసుకొన్న సాంఖ్యయోగులు బుద్ధితో ఆయననే వరిస్తారు."

347. హయగ్రీవావతార వృత్తాంతము.

శౌనకుడు అన్నాడు. "సూతనందనా ! షడైశ్వర్య సంపన్ను డయిన శ్రీహరి మాహాత్మ్యాన్ని మేము అందరం విన్నాం. ధర్మ దేవుని ఇంట నరనారాయణాత్మకుడుగా ఆయనే అవతరించాడని విన్నాము. వరాహదేవుడు ప్రాచీన కాలంలో పిండాలను ఉత్పన్నం చేసి, పిండప్రదానం అనే ఆచారాన్ని ప్రవేశపెట్టా డనీ, ప్రవృత్తినివృత్తిధర్మాలను కల్పించిన వృత్తాంతాన్ని, వీటిని అన్నింటినీ నీవు చెప్పగా విన్నాం. సముద్రంలోని ఈశాన్య భాగంలో హవ్యకవ్యభోక్త శ్రీహరి మహావరాహావతారం దాల్చాడు అని ఇంతకు ముందు చెప్పావు. బ్రహ్మదేవుడు ఆ రూపాన్ని ప్రత్యక్షంగా దర్శించాడు అని కూడా చెప్పావు. మేధావి శ్రేష్ఠా ! సర్వజగత్తులను ధరించే శ్రీహరి పూర్వకాలంలో అద్భుతమూ, ప్రభావ సంపన్నమూ అయిన ఆ రూపంలో ఎందుకు అవతరించాడు ? పూర్వం ఎప్పుడూ అలాంటిరూపం ఆయనలో కన్పడలేదు. మునీంద్రా ! మహాబలశాలి, అపూర్వ రూపం ధరించిన పవిత్రుడూ అయిన హయగ్రీవస్వామిని దర్శించి బ్రహ్మదేవుడు ఏం చేశాడు ? మహాత్మా ! మీ మేధ చాల శ్రేష్ఠమయినది. మహాపురుషు డయిన భగవానుని అవతార సంబంధ మయిన ఈ పురాతన జ్ఞానవిషయంలో మాకు సంశయం కలుగుతున్నది. దీనికి సమాధానం చెప్పవలసింది. ఈ పవిత్రకథను చెప్పి మమ్ములను పవిత్రులను చేశారు." సౌతి అన్నాడు. "శౌనకా ! వ్యాస మహర్షి జనమేజయునకు వినిపించినదై, వేదంవలె ప్రమాణభూతమయిన సమస్త వృత్తాంతాన్ని చెపుతాను. విష్ణుదేవుని హయగ్రీవావతార వృత్తాంతం విన్న నీకు కలిగినట్లే జనమేజయునికి కూడ సందేహం కలిగింది. అప్పుడు ఇలా ప్రశ్నించాడు. జనమేజయుడు

అన్నాడు. "సజ్జన సత్తమా ! బ్రహ్మదేవుడు దర్శించిన హయగ్రీవావతారం ఏకారణంగా కలిగిందో నాకు వివరించవలసింది."

వైశంపాయనుడు చెప్పాడు. "నరేంద్రా ! ఈ లోకంలో ఉండే సమస్తమైన దేహ ధారులు భగవత్సంకల్పంవల్ల ఏర్పడిన పంచమహాభూతాలతో గూడి ఉంటారు. విరాట్స్వరూపుడయిన శ్రీమన్నారాయణుడు జగదీశ్వరుడు, జగత్తును సృష్టించినవాడు. ఆయనయే సర్వజీవుల అంతరాత్మ, వరదాత, సగుణుడు, నిర్గుణుడు కూడా. రాజా ! పంచభూతాలకు కలిగే ఆత్యంతికప్రళయవృత్తాంతం మొదట విను. పూర్వకాలంలో ఈ భూమి నీటిలో లీన మయిపోయింది. జలం తేజస్సులో, తేజస్సు వాయువులో, వాయువు ఆకాశంలో, ఆకాశం మనస్సులో, మనస్సు వ్యక్తం (మహత్తత్త్వం)లో, వ్యక్తం అవ్యక్త ప్రకృతిలో, అవ్యక్తం పురుషునిలో అంటే మాయా యుక్తుడయిన ఈశ్వరునిలో, పురుషుడు సర్వవ్యాపి అయిన పరమాత్మలో లయమయ్యారు. అప్పుడు అన్ని వైపులా చీకటి అలముకొన్నది. ఆది తప్ప ఇంక ఏమీ తెలియటం లేదు. తమస్సు వల్ల జగత్తుకు కారణం అయిన బ్రహ్మ (పరమవ్యోమం) వ్యక్తం అయింది. తమస్సుకు మూలం అధిష్ఠానమయిన అమృత తత్త్వం. ఆ మూల భూత మయిన అమృతమే తమోయుక్తమై, సర్వనామ రూపాత్మక మయిన ప్రపంచాన్ని వ్యక్తం చేస్తుంది. అది విరాట్ శరీరాన్ని ఆశ్రయించి, ఉంటుంది. దానినే అనిరుద్ధుడు అన్నారు. దానినే ప్రధానం అని కూడా అంటారు. అదే త్రిగుణమయ మయిన అవ్యక్తమని తెలుసుకోవాలి. ఆ స్థితిలో విద్యాశక్తి యుక్తుడయిన సర్వవ్యాపి, భగవంతుడు, శ్రీహరి యోగనిద్రను ఆశ్రయించి, జలంలో శయనించాడు. అప్పుడు నానాగుణాలతో ఉత్పన్నమయ్యే జగత్తు యొక్క అద్భుతసృష్టిని గూర్చి ఆలోచించసాగాడు. అలా ఆలోచిస్తున్న ఆయనకు, స్వగుణం అయిన మహత్తత్త్వం గుర్తువచ్చింది. దానినుంచి అహంకారం వ్యక్తం అయింది. ఆ అహంకారం చతుర్ముఖ బ్రహ్మయే. ఆయన సర్వలోక పితామహుడు, హిరణ్యగర్భుడు అనే పేరుతో ప్రసిద్ధుడు. బ్రహ్మాండంలోని కమలంలో అనిరుద్ధుని (అహంకారము) నుండి బ్రహ్మ ఆవిర్భవించాడు. అద్భుత రూపధరుడు, తేజస్వి, సనాతనుడయిన బ్రహ్మ సహస్రదళకమలంతో ఉండి ఇటు – అటు చూచినప్పుడు ఆయనకు సమస్తజగత్తు జలమై కన్పించింది. అప్పుడు బ్రహ్మ సత్త్వగుణంలో ఉండి, ప్రాణుల సృష్టిలో ప్రవృత్తు డయినాడు. ఆ బ్రహ్మ కూర్చున్న కమలపురేకులు సూర్యునివలె వెలుగుతున్నాయి. వాటిమీద అంతకుముందే శ్రీమన్నారాయణుని ప్రేరణవలన నీటి బిందువులు రెండు పడిఉన్నాయి. అవి రజోగుణ తమోగుణాలకు ప్రతీకలుగా ఉన్నాయి. ఆద్యంత రహితు డయిన అచ్యుతుడు ఆ రెండు బిందువులను చూశాడు. వాటిలో ఒక

బిందువు భగవంతుని దృష్టి పడగానే ఆ ప్రేరణతో తమోమయు డయిన మధువు అనే దైత్యుని ఆకారంలోకి మారింది. తేనెవంటి వాని ఆకారం చాల సుందరంగా ఉన్నది. రెండవ జలబిందువు ముద్దఅయి నారాయణుని ఆజ్ఞతో రజోగుణంతో ఉత్పన్న మయిన కైటభదైత్యరూపం దాల్చింది. తమోగుణ రజోగుణాలతో గూడిన మహాబలవంతులు మధుకైటభులు తమ చేతులతో గదలను ధరించి, కమలనాభాన్ని అనుసరించి ముందుకు వచ్చారు. పైకి వెళ్ళి వాళ్ళు, పద్మంలో ఆసనం మీద కూర్చుని సృష్టిలో ప్రవృత్తుడయిన బ్రహ్మను చూశారు. ఆయన వద్ద మనోహరరూపంలో ఉన్న నాలుగు వేదాలను చూశారు. విశాలకాయులయిన ఆ అసురశ్రేష్ఠులు వేదాలను చూశారు. వెంటనే బ్రహ్మ చూస్తుండగానే ఆ వేదాలను తీసుకొన్నారు. సనాతన వేదాలను తీసుకొని ఆ దానవులు ఈశాన్య దిక్కులో ఉన్న మహోదధిలో మునిగి, పాతాళానికి వెళ్ళారు. వేదాపహరణం జరగటం వలన బ్రహ్మకు చాల బాధ కలిగింది. మోహం ఆయనను ఆవేశించింది. వేదరహితు డయిన ఆయన పరమాత్మను ఈ రీతిగా ప్రార్థించసాగాడు.

బ్రహ్మ పలికాడు. "దేవా ! వేదాలే నా పరమ దృష్టి. వేదాలే నాకున్న మహత్తర బలం. వేదాలే నాకు గల పరమాశ్రయం. వేదాలే నాకు పరమోపాస్యదైవాలు. దానవులు బలాత్కారంగా నా వేదాలను అపహరించారు. వేదాలు లేకపోవటం వలన లోకాలు నాకు అంధకార మయా లయ్యాయి. వేదాలు లేకుండా ఉత్తమ మయిన లోకసృష్టిని ఎలా చేయగలను? ఆహా ! వేదనాశంవలన నాకు మహత్తర మయిన దుఃఖం కలుగుతున్నది. దీనివల్ల శోకమగ్న మయిన మనస్సులో చాలా బాధ కలుగుతున్నది. దుఃఖ సముద్రంలో మునిగిన నన్ను ఎవరు ఉద్ధరిస్తారు ? వేదాలను ఎవరు తీసుకొని వస్తారు ? నాకు ఇప్పుడు సహాయంచేసే ఆప్తులు ఎవరు ఉన్నారు ?" ఇలా పలుకుతున్న బ్రహ్మదేవుని మనస్సులో శ్రీహరిని స్తుతించవలె ననే ఆలోచన కలిగింది. బుద్ధిమదగ్రగణ్యా ! రాజా ! అప్పుడు బ్రహ్మ చేతులు జోడించి ఉత్తమమై, జపించదగిన శ్రీహరిస్తోత్రాన్ని గానం చేశాడు. బ్రహ్మ పలికాడు. "దేవా ! వేదాలు నీ హృదయం. నీకు నమస్కారం. నాకు పూర్వం జనించిన దేవా ! నీకు ప్రణామం. జగత్తుకు ఆదికారణమైన వాడా ! భువన శ్రేష్ఠా ! సాంఖ్య యోగ నిధీ! ప్రభూ ! నీకు నమస్సులు. వ్యక్తమయిన జగత్తును, అవ్యక్త మయిన మహత్తును ఉత్పన్నం చేసే పరమాత్మా ! నీవు అచింత్యరూపుడవు. మంగళకర మార్గంలో ఉన్నవాడా ! విశ్వపాలనా ! సర్వప్రాణులకు అంతరాత్మ అయిన వాడా ! ఎలాంటి పుట్టుక లేనివాడా ! లోకాధారా ! స్వయం వ్యక్తరూపా ! స్వయంభువు వయిన నీదయవలన కలిగిన వాడను నేను. మీవల్ల నాకు గలిగిన మొదటి జన్మ ద్విజులు

పూజించిన మానస జన్మగా వ్యవహృతం అయింది. (అంటే నేనే మొదట మీ మనస్సునుండి ఆవిర్భవించాను అని భావం). తరువాత నేను మీ నేత్రాల నుండి జన్మించాను. అది నా రెండవ జన్మ. మీ అనుగ్రహం వలన నా తృతీయజన్మ వాచికం. (అంటే మీ వాక్కు వల్లనే సులభం అయిందని భావం). అనంతరం మీ చెవుల నుండి నాలుగవ జన్మ కలిగింది. అటుపిమ్మట మీ ముక్కునుండి నా అయిదవ జన్మ కలిగింది అని చెపుతారు. తరువాత నన్ను మీరు బ్రహ్మాండం నుంచి ఉత్పన్నం చేశారు. అది ఆరవ జన్మ. దేవా ! ఈ నా సప్తమజన్మ పద్మం నుంచి కలిగింది. త్రిగుణరహితా ! ప్రతికల్పంలోనూ మీ పుత్రునిగానే ఆవిర్భవిస్తుంటాను. కమలాక్షా ! మీ పుత్రుడ నయిన నేను శుద్ధ సత్త్వమయ శరీరంతో ఉత్పన్నుడ నయినట్లు ప్రసిద్ధ మయింది. ఈశ్వరుడవు, స్వభావానివి, స్వయంభువుడవు, పురుషోత్తముడవు నీవు. నన్ను వేదనేత్రునిగా చేశారు. మీదయవల్ల కాలాతీతుడను. నా పైన కాల ప్రభావం ఉండదు. నా నేత్రాల వంటి వేదాలను దానవులు అపహరించటం చేత గ్రుడ్డి వాడను అయినాను. దేవా ! ఇక నిద్రను వీడి, నా నేత్రా లయిన వేదాలను తిరిగి ఇవ్వండి. నేను మీ ప్రియభక్తుడను. నాకు ఇష్టదైవం మీరు."

ఇలా బ్రహ్మ స్తుతించగా ఆ భగవంతుడు - సర్వతో ముఖు డయిన పరమాత్మ నిద్రను వదలి, వేదాలను తీసుకొని రావటానికి సిద్ధమయినాడు. ఆయన తన ఐశ్వర్యయోగంతో ద్వితీయజన్మను దాల్చాడు. అది చంద్రునివలె కాంతిమంతం. సుందర నాసిక కల శరీరంతో ఆయన గుఱ్ఱపు మెడవంటి మెడ, ముఖంగలిగి ఉన్నాడు. ఆయన ఆ పవిత్రముఖం సమస్త వేదనిలయం అయిఉన్నది. తారలు, నక్షత్రాలు గల స్వర్గలోకం ఆయన శిరస్సు అయినది. సూర్యకిరణాలతో సమానమయి మెరిసే దీర్ఘమయిన వెండ్రుకలు ఉన్నాయి. ఆకాశ పాతాళాలు ఆయన చెవులు, భూతధారణచేసే ధరణి నుదురు, గంగా సరస్వతులు ఆయన పిరుదులు అయినవి. చంద్ర సూర్యులు ఆయన కన్నులు; ముక్కు సంధ్య; ఓంకారం అలంకారం; విద్యుత్తు (మెఱుపు) నాలుకగా అయినవి. సోమపానం చేసే పితరులు ఆయన దంతాలు. గోలోక బ్రహ్మలోకాలు ఆ మహాత్ముని రెండు పెదవులు అయినవి. తమో మయమయిన కాళరాత్రి ఆయన మెడ అయింది. ఈ రీతిగా అనేక మూర్తులతో ఆవృతమయిన హయగ్రీవావతారం దాల్చి, జగత్ప్రభువు శ్రీహరి అంతర్ధానమయి రసాతలానికి వెళ్ళాడు. రసాతలంతో ప్రవేశించి పరమ యోగాన్ని ఆశ్రయించి, శిక్షానియమానుసారంగా, ఉదాత్తాది స్వరసహిత ఉచ్చైఃస్వరంతో సామవేదగానం చేయసాగాడు. నాద స్వరాలతో విశిష్టమయిన స్నిగ్ధమధుర సామగాన ధ్వని రసాతలంలో అంతటా వ్యాపించింది. అది సమస్త ప్రాణులకు గుణసంపాదకం అయింది. అప్పుడు ఆ అసురులు

ఆ ధ్వనిని విని, వేదాన్ని కాల పాశంతో బంధించి రసాతలంలో పడేసి, ఆ శబ్దధ్వని వైపు పరుగుపెట్టారు. ఇంతలో హయవదను డయిన శ్రీహరి రసాతలంలో ఉన్న వేదాలను అన్నింటిని తీసుకొని వచ్చి, బ్రహ్మకు ఇచ్చి, మళ్ళీ మొదటి రూపాన్ని ధరించాడు. ఆయన మహోదధిలోని ఈశాన్య భాగంలో వేదాలకు ఆశ్రయ మయిన హయగ్రీవ స్వరూపాన్ని స్థాపించి, మళ్ళీ స్వస్వరూపాన్ని దాల్చాడు. అప్పటి నుంచి హయగ్రీవ స్వామి అక్కడే ఉండసాగాడు. ఆ తరువాత మధుకైటభులు తాము దాచిన చోట వేదాలు కనిపించక పోవటంలో కలవరపాటు చెందారు.

అప్పుడు బలిష్ఠ లయిన ఆ దానవులు మళ్ళీ చాలా వేగంగా రసాతలం నుంచి పైకివచ్చి, చూడగా ఆదికర్త అయిన ఆ పురుషోత్తముడు కన్పించాడు. ఆయన చంద్రునివలె స్వచ్ఛమయిన ఉజ్జ్వల ప్రభాలంకృతమయిన గౌరవర్ణుడుగా ఉన్నాడు. అప్పుడు ఆయన అనిరుద్ధరూపంలో ఉన్నాడు. మహాపరాక్రమంవంతు డయిన భగవంతుడు యోగనిద్రలో ఉన్నాడు. నీటిపయిన ఆదిశేషుని శరీరంతో నిర్మితమై, ఆయన ఆకారానికి తగినదై, జ్వాలామాలికలతో ఆవృతమయిన శయ్య మీద పరిశుద్ధసత్త్వగుణ యుక్తుడై, మనోహర కాంతి సమన్వితు డయిన భగవానుని చూచి ఆ దానవ శ్రేష్ఠులు అట్టహాసం చేయసాగారు. రజోగుణ తమోగుణావిష్టలయిన ఆ దానవులు నిద్రపోతున్న ఈ వ్యక్తియే రసాతలం నుంచి వేదాలను తీసుకువచ్చి ఉంటాడు. ఈయన ఎవరి పుత్రుడు ? ఎవరు? సర్పశయనం మీద ఎందుకు నిద్ర పోతున్నాడు ? అని వారిలో వారు ప్రశ్నించుకొన్నారు. ఇలా అనుకొంటూ వారు ఆయనను మేలుకొలిపారు. లేచిన పురుషోత్తముడు వారు యుద్ధకాంక్షులని తెలుసుకొని, వారిని చూసి యుద్ధం చేయ నిశ్చయించుకొన్నాడు. అప్పుడు ఆ రాక్షసులకూ శ్రీమన్నారాయణునికి మధ్య యుద్ధం ఆరంభమయింది. మధుసూదనుడు రజోగుణతమో గుణావిష్ట లయిన ఆ మధుకైటభులను, బ్రహ్మగౌరవాన్ని కాపాడటానికి చక్రాయుధంతో శిరస్సులు ఖండించి, సంహరించాడు. ఈ రీతిగా వేదాలను తీసుకురావటంతో, ఆ రాక్షసుల సంహారంతో పురుషోత్తముడు బ్రహ్మ దుఃఖాన్ని పోగొట్టాడు. అప్పుడు వేదప్రదానంతో సమ్మానితుడు, భగవ ద్రక్షితుడు అయిన బ్రహ్మదేవుడు సమస్త స్థావర జంగమాలతో గూడిన అన్నిలోకాలను నిర్మించాడు. శ్రీహరి పితామహునికి లోక సృష్టికి కావలసిన వేదవిద్యను ప్రసాదించి, అక్కడ అంతర్ధానమై, తాను వచ్చిన చోటికే వెళ్ళాడు. ఈ విధంగా పరమాత్మ హయగ్రీవావతారందాల్చి, ఆ దానవులను వధించాడు. ఆయన మళ్ళీ లోకప్రవృత్తి ధర్మాన్ని ప్రచారం చేయటంకోసమే ఆ శరీరాన్ని ధరించాడు. మహాత్ముడయిన శ్రీహరి హయగ్రీవ రూపాన్ని ధరించాడు. భగవంతుని వరప్రదాయక

మయిన ఈ రూపం పురాతనం, పురాణప్రసిద్ధం అయింది. ప్రతిదినం దీనిని వినిన, స్మరించిన బ్రాహ్మణుని వేదాధ్యయనం ఎప్పుడూ నిష్ఫలంకాదు.

పరమేశ్వరుడు ఉపదేశించిన రీతిగా ప్రవర్తించి, మహోగ్ర తపస్సుతో హయగ్రీవస్వామిని ఆరాధించి, పాంచాల దేశీయు డయిన గాలవముని వేదవిభాగ క్రమాన్ని పొందాడు. రాజా ! నీవు అడిగిన ఈ హయగ్రీవావతార వృత్తాంతం అనే వేదామోదిత మయిన కథను నీకు వినిపించాను. ఆ పరమాత్మ కార్యసాధన కోసం ధరించదలచుకొన్న శరీరంతో ఆ పనిచేసే సమయంలో స్వయంగా అవతరిస్తాడు. ఈ శ్రీహరియే వేదాలకు, తపస్సుకు నిధి. ఈయనయే యోగం, సాంఖ్యం, బ్రహ్మ, ఉత్తమహవిస్సు, విభువు అయి ఉన్నాడు. వేద పర్యవసానం శ్రీమన్నారాయణునిలోనే ఉన్నది. యజ్ఞం కూడా నారాయణ స్వరూపమే. తపస్సుకు పరమఫలం కూడా నారాయణుడే. నారాయణ ప్రాప్తియే సర్వోత్తమగతి. సత్యానికి పరమఫలం నారాయణుడే. ఋతం నారాయణస్వరూపమే. పునర్జన్మ లేకుండా చేసే నివృత్తి ధర్మానికి చరమలక్ష్యం కూడా శ్రీమన్నారాయణుడే. ప్రవృత్తి లక్షణమయిన ధర్మం కూడా నారాయణస్వరూపమే. భూమికి శ్రేష్ఠతమ మయిన గుణం గంధం కూడా నారాయణమయమే. రాజా ! జలగుణ మయిన రసం కూడా నారాయణాత్మకమే. తేజస్సుకు గల ఉత్తమ గుణం కూడా నారాయణమయమే. వాయుగుణమైన స్పర్శకూడ నారాయణాత్మక మని అంటారు. ఆకాశంనుంచి జనించిన శబ్ద గుణమూ నారాయణ స్వరూపమే. అవ్యక్త గుణము, లక్షణమూ గల మనోభూతమూ, కాలమూ, నక్షత్ర మండలం అనేవీ నారాయణాశ్రయాలే.

కీర్తి, శ్రీ, లక్ష్మి మున్నగు దేవతలు నారాయణుని పరమాశ్రయాలే. సాంఖ్యమూ నారాయణపరమే. యోగమూ నారాయణాత్మకమే. పురుషుడు, ప్రధానం, స్వభావం, కర్మ దైవం అను వానికి కారణాలు కూడా నారాయణ రూపాలే. అధిష్ఠానం, కర్త, భిన్న భిన్న కారణాలు, నానావిధా లయిన ప్రత్యేక మయిన కర్మలు, ఐదవదైన దైవం, ఈ అయిదు కారణాల రూపంలో అంతటా శ్రీహరియే విరాజిల్లుతున్నాడు. సర్వవ్యాపకా లయిన హేతువులతో తత్త్వాన్ని తెలుసుకో గోరే వారికి, మహాయోగి అయిన శ్రీమన్నారాయణుడే తెలియదగిన తత్త్వం. కేశవుడు బ్రహ్మాది దేవతల, సమస్త లోకాల, మహాత్ములయిన ఋషుల, సాంఖ్యవేత్తల, యోగుల, ఆత్మ జ్ఞానులయిన యతుల మనస్సులలోని విషయాలను తెలుసుకోగలడు. కాని వారు ఆయన మనస్సులో ఏముందో తెలుసుకోలేరు. సమస్త ప్రపంచంలో దేవతల నుద్దేశించి యజ్ఞాలను, పితరులనుద్దేశించి శ్రాద్ధాలను, దానాలను చేసేవారు, మహత్తర తపస్సు చేసేవారు, వీరికి అందరికీ ఆశ్రయం శ్రీహరియే. ఆయన

తన ఐశ్వర్యయోగంలో ఉంటాడు. సర్వప్రాణులకు నివాసస్థానం కావటం వల్ల ఆయనను వాసుదేవుడు అంటారు. ఈ పరమమహర్షి నారాయణుడు నిత్యుడు, మహదైశ్వర్య యుతుడు, గుణరహితుడు. అయినా కాలం ఋతువుల గుణాలతో కూడి ఉన్నట్లు, ఆయన కూడా ఆ యా సమయాలనుబట్టి గుణాలను గ్రహించి, వాటితో కలిసి ఉంటాడు. ఆ మహాత్ముని గతిని ఎవరూ తెలుసుకోలేరు. ఆయన రాక కూడా ఇక్కడి వారికి ఎవరికీ తెలియదు. జ్ఞాన స్వరూపులయిన మహర్షులే నిత్యుడు, అంతర్యామి, అనంతగుణ సంపన్నుడూ అయిన పరమాత్మ యొక్క సాక్షాత్కారం పొందగలరు."

348. సాత్వత ధర్మోపదేశ పరంపర.

జనమేజయుడు అన్నాడు. "మహాత్మా ! భగవంతుడు అనన్యభావంతో సేవించే భక్తులను సంతోష పెడతాడు. వారి పూజలను స్వయంగా స్వీకరిస్తాడు, ఆహా ఇది ఎంత ఆనందదాయకం ! లోకంలో సర్వవాసనలు దగ్ధమయిన, పుణ్య పాప రహితులకు కలిగే గతిని వివరించావు. భగవంతుని అనన్య భక్తులయిన సజ్జనులు అనిరుద్ధ, ప్రద్యుమ్న, సంకర్షణులను ఆశించక వాసుదేవ నామక మయిన చతుర్థ గతిని చేరి, భగవంతుని పరమపదాన్ని, పొందుతారు. ఈ ఏకాంతభక్తితో భగవంతుని సేవించటం అనే శ్రేష్ఠధర్మం నారాయణునకు పరమప్రియ మైనది. దీన్ని ఆశ్రయించే భక్తులు పయిన చెప్పిన మూడుగతులను అతిక్రమించి, సరాసరి నాలుగవ గతిని పొంది, శాశ్వతు డయిన శ్రీహరిని పొందుతారు. ఉపనిషత్తులతో గూడిన సంపూర్ణ వేదాలను ఆశ్రయించి, వానిని సంపూర్ణంగా అధ్యయనంచేసిన వారి కన్నను, సంన్యాసాశ్రమాన్ని ఆశ్రయించి, ఆ ధర్మాలను పాటించే వారికన్నను, భగవంతుని ఏకాంతభక్తులు ఉత్తమ గతిని పొందుతారు. మహాత్మా ! భక్తి అనే ధర్మాన్ని ఏ దేవతలు, ఏ మహర్షులు ఉపదేశించారు ? అనన్యభక్తుల జీవన విధానం ఏమిటి ? అది ఎప్పటినుంచి ప్రచారం అయినది ? నా ఈ సంశయాన్ని నివారించు. ఈ విషయాన్ని వినాలని నా మనస్సులో ఎంతో ఆసక్తి కలుగుతున్నది."

వైశంపాయనుడు చెప్పాడు. "రాజా ! కౌరవపాండవసేనలు యుద్ధం చేయటానికి ఎదురుకొనిన సమయంలో అర్జునుడు యుద్ధం చేయటానికి విముఖుడు అయినప్పుడు భగవానుడు స్వయంగా గీతలో దీన్ని చెప్పాడు. ఇంతకు ముందు నీకు గతి, అగతుల స్వరూపం చెప్పాను. ఈ ధర్మం గహన మయినది, మనోజయం లేనివారికి దుర్గమ మయినది. ఈ ధర్మం సామవేద సమానం. పూర్వకాలంలో కృతయుగం నుంచి వ్యాప్త మయినది. జగదీశ్వరు డయిన శ్రీమన్నారాయణుడే ఈ ధర్మాన్ని ధరించాడు. యుధిష్ఠిరుడు

ఋషుల మధ్యలో ఉన్న నారద మహర్షిని ఈ విషయమే అడిగాడు. ఆ సమయంలో శ్రీకృష్ణ భీష్ములూ దీనిని వింటున్నారు. రాజేంద్రా ! మా గురుదేవులు వ్యాసుల వారు, నేను ఈ విషయాన్ని చెప్పాం. కాని అప్పుడు నారద మహర్షి చెప్పినదానినే ఇపుడు చెపుతాను. విను. భూపాలా ! సృష్ట్యాదిలో శ్రీమన్నారాయణుని ముఖం నుంచి జన్మించిన బ్రహ్మ దేవునికి ఆ నారాయణుడే స్వయంగా దీన్ని ఉపదేశించాడు. నారాయణుడు ఆ ధర్మంతోనే దేవతలను, పితృదేవతలను పూజించాడు. తరువాత ఫేనపులు (ఆవుపాల నురుగే ఆహారముగ గల తపో మగ్నులయిన) మహర్షులు ఆ ధర్మాన్ని పొందారు. ఫేనపానం చేసే వారి నుండి వైఖానసులు ఆ ధర్మాన్ని పొందారు. వైఖానసుల నుండి సోమకుడు దాన్ని గ్రహించాడు. అపుడు ఆ ధర్మం మళ్లీ కనుమరుగైంది. నేత్రాల నుండి బ్రహ్మ ద్వితీయ జన్మ కలిగినప్పుడు ఆయన సోమునినుండి ఆ నారాయణ స్వరూపధర్మాన్ని విన్నాడు. బ్రహ్మదేవుడు రుద్రునికి దీన్ని ఉపదేశించాడు. తరువాత యోగనిష్ఠుడయిన రుద్రుడు కృతయుగంలో వాలఖిల్య ఋషులకు అందరికీ ఈ ధర్మాన్ని బోధించాడు. తరువాత విష్ణుమాయవలన ఆ ధర్మం మళ్ళీ లోపించింది. భగవానుని వాక్కు నుండి బ్రహ్మ దేవుని మూడవజన్మ కలిగినప్పుడు సాక్షాత్తుగ నారాయణుని నుండియే ఈ ధర్మం వ్యక్త మయింది. సుపర్ణుడనే ఋషి ఇంద్రియాలను నిగ్రహించి, మనో నిగ్రహంతో కఠోరతపస్సుచేసి, పురుషోత్తముని నుండి ఈ ధర్మాన్ని పొందాడు. సుపర్ణుడు ప్రతిదినమూ ఉత్తమ మయిన ఈ ధర్మాన్ని మూడుసార్లు ఆవృత్తి చేశాడు. అందువల్ల ఈ వ్రతాన్ని లేక ధర్మాన్ని 'త్రిసౌపర్ణం' అని అంటారు. దుష్కరమయిన ఈ ధర్మం ఋగ్వేద పాఠంలో స్పష్టంగా పఠితమైంది. సుపర్ణునినుండి ఆ సనాతన ధర్మాన్ని ఈ జగత్తుకు ప్రాణరూపుడయిన వాయుదేవుడు పొందాడు. వాయుదేవునినుంచి విఘసాశను లయిన మహర్షులు ఈ ధర్మాన్ని ఉపదేశం పొందారు. తరువాత ఉత్తమ మయిన ఈ ధర్మాన్ని మహోదధి పొందాడు. తరువాత మళ్ళీ ఈ ధర్మం లోకంలో లోపించి నారాయణునిలో లీనం అయింది. పురుషశ్రేష్ఠా ! భగవంతుని చెవుల నుంచి బ్రహ్మ నాలుగవమారు జన్మించినపుడు ఈ ధర్మం ఏ రీతిగా వ్యక్తం అయిందో చెపుతాను, విను.

శ్రీమన్నారాయణుడు స్వయంగా సృష్టింపగోరి, జగత్తును సృజింప సమర్థుడయిన వాడు ఎవడా ? అని ఆలోచించాడు. అలా చింతించే సమయంలో భగవానుని చెవులనుండి ఒక పురుషుడు ఆవిర్భవించాడు. జగత్పతి అయిన నారాయణుడు బ్రహ్మతో 'వత్సా ! ముఖం నుంచి పాదాల వరకు ఉండే నీ అవయవాలనుంచి సమస్త ప్రజాసృష్టిని చేయవలసింది. ఉత్తమ వ్రతాధిష్ఠానం చేసే పుత్రా ! నేను నీకు మేలు చేస్తాను. నీలో తేజస్సును, బలాన్ని

అభివృద్ధి చేస్తుంటాను. నీవు నా నుండి ఈ సాత్వతధర్మాన్ని గ్రహించు. దానితో యథావిధిగా కృతయుగాన్ని సృష్టించి స్థాపించు !' అని చెప్పాడు. తరువాత బ్రహ్మ శ్రీహరికి నమస్కరించి ఆ స్వామి ముఖం నుండి వ్యక్తమయిన ఆరణ్యకమూ, రహస్యమూ, సంగ్రహమూ గల ఆ శ్రేష్ఠధర్మాన్ని ఉపదేశం పొందాడు. తరువాత మహాతేజస్వి అయిన బ్రహ్మకు ఈ ధర్మాన్ని ఉపదేశించి, 'ఆ సమయంలో భగవంతుడు ఆయనతో నీవు నిష్కామభావంతో సమస్త కర్మలను ఆచరిస్తూ యుగధర్మ ప్రవర్తకుడవు కావలసినది.' అని ఆదేశించి ఆయన అజ్ఞానాంధ కారానికి ఆవల విరాజిల్లే పరమావ్యక్తమయిన స్వధామానికి వెళ్ళాడు. తరువాత వరదాత, లోకపితామహు డయిన బ్రహ్మదేవుడు స్థావర జంగమాత్మకాలు అయిన సమస్తలోకాలను సృజించాడు. తరువాత పవిత్ర మయిన కృతయుగం సృష్టి ఆరంభంలో ప్రవర్తిల్లింది. అప్పటి నుంచి సాత్వతధర్మం లోకంలో వ్యాప్త మయింది. ఆ మొట్ట మొదటి ధర్మంతోనే లోక స్రష్టఅయిన బ్రహ్మ పరమాత్మ, దేవేశుడు అయిన నారాయణుని పూజించాడు. తరువాత ధర్మ ప్రతిష్ఠకోసం, స్వారోచిషమనువుకు లోక హితం కోరి ఈ ధర్మాన్ని ఉపదేశించాడు. ఆ తరువాత సర్వలోకాలకు ప్రభువు అయిన స్వారోచిషుడు శాంతభావంతో, మొదట తన పుత్రు డయిన శంఖపదునికి స్వయంగా ఈ ధర్మజ్ఞానాన్ని ప్రసాదించాడు. అంతట శంఖపదుడు తన ఔరసపుత్రుడు, దిక్పాలుడూ అయిన సువర్ణభునిచేత ఈ ధర్మాన్ని అధ్యయనం చేయించాడు. దీని తరువాత త్రేతాయుగం రాగా ఈ ధర్మం మళ్ళీ అంతర్ధానం చెందింది. రాజోత్తమా ! పూర్వకాలంలో బ్రహ్మ ఆ స్వామి నాసికనుండి అయిదవ జన్మను పొందినప్పుడు పద్మాక్షు డయిన శ్రీమన్నారాయణుడు స్వయంగా తన ఎదుట ఉన్న బ్రహ్మకు ఈ ధర్మాన్ని ఉపదేశించాడు.

తరువాత భగవంతు డయిన సనత్కుమారుడు ఆయన నుండి సాత్వత ధర్మాన్ని గ్రహించాడు. సనత్కుమారుని నుండి వీరణప్రజాపతి కృతయుగాదిలో ఈ ధర్మోపదేశం పొందాడు. వీరణుడు దీనిని అధ్యయనంచేసి, రైభ్యమునికి ఉపదేశించాడు. రైభ్యుడు ఉత్తమ వ్రతపాలకుడు, శుద్ధుడు, మహామేధావి, పవిత్రుడు, దిక్పాలకుడు తన పుత్రుడు అయిన కుక్షికి దీన్ని ఉపదేశించాడు. తదనంతరం నారాయణముఖం నుంచి ఆవిర్భవించిన ఈ ధర్మం మళ్ళీ అంతర్ధానం చెందింది. దీని తరువాత అండం నుంచి ఆరవ జన్మనందిన బ్రహ్మ కోసం ఈ ధర్మం మళ్ళీ నారాయణుని ముఖం నుంచి ఆవిర్భవించింది. ఈ ధర్మాన్ని గ్రహించిన బ్రహ్మ విధి పూర్వకంగా ఉపయోగించుకొని, బర్హిషదులు అనే మునులకు దీన్ని అధ్యాపనం చేశాడు. బర్హిషదుల నుండి ఈ ధర్మం సామవేదపారంగతుడై, జ్యేష్ఠుడనే పేరుతో ప్రసిద్ధు డయిన బ్రాహ్మణునికి లభించింది.

జ్యేష్ఠసామమును ఉపాసించటం వ్రతంగా పాటించటం వల్ల, ఆయనను జ్యేష్ఠ సామవ్రతు డయిన హరి అని అంటారు. ఆ జ్యేష్ఠుని నుండి అవికంపనుడు అనే రాజుకు ఇది సంక్రమించింది. రాజా ! తరువాత ఈ హరిధర్మం మళ్ళీ అంతర్ధాన మయింది.

నరేశ్వరా ! భగవంతుని నాభికమలం నుంచి సప్తమ జన్మనందిన బ్రహ్మకు శ్రీమన్నారాయణుడు ఈ కల్పారంభంలో ఈ ధర్మాన్ని ఉపదేశించాడు. జగద్ధారకుడు, శుద్ధస్వరూపుడు అయిన బ్రహ్మ అందరికంటె ముందు దక్షప్రజాపతికి దీన్ని ఉపదేశించాడు. తరువాత దక్షుడు తన జ్యేష్ఠదౌహిత్రుడు, సూర్యుని కన్న అదితికి ముందు జన్మించిన పెద్దకుమారునికి ఈ ధర్మాన్ని ఉపదేశించాడు. ఆయన నుంచి సూర్యుడు ఈ ధర్మోపదేశం పొందాడు. తరువాత వివస్వంతుడు (సూర్యుడు) త్రేతాయుగాదిలో మనువుకు, సర్వజగత్తుకు క్షేమంకోరి, మనువు తన పుత్రుడైన ఇక్ష్వాకునికి దీన్ని ఉపదేశించాడు. ఇక్ష్వాకుని నుండి ఈ ధర్మం సమస్త లోకాలలో ప్రచారం అయింది. రాజా ! కల్పాంతరంలో ఈ సాత్వతధర్మం మళ్ళీ నారాయణునిలోకే వెళ్ళుతుంది. రాజేంద్రా ! యతిధర్మాన్ని ఇంతకు ముందే హరిగీతలో సంక్షేపంగా చెప్పాను. రాజా ! ఈ ధర్మాన్ని నారదుడు జగదీశ్వరు డయిన శ్రీమన్నారాయణుని నుండి సరహస్యంగా, ససంగ్రహంగా, చక్కగా గ్రహించాడు. ఈ రీతిగా ఆద్యమూ, మహత్తరమూ అయిన ఈ ధర్మం సనాతనకాలంనుంచి వస్తున్నది. ఇది ఇతరులకు తెలియ వీలుగానిది, దుష్కరము అయి ఉన్నది. భగవద్భక్తులు దీన్ని ఎల్లప్పుడు ధరిస్తారు. ఈ ధర్మాన్ని తెలుసుకోవటం వలన, అహింసాయుక్తమయిన ఈ సాత్వత ధర్మాన్ని క్రియారూపంగా ఆచరించటంవలన జగదీశ్వరు డయిన శ్రీహరి ప్రసన్నుడు అవుతాడు. భగవద్భక్తులు కేవలం ఒక వ్యూహాన్ని వాసుదేవుని ఒకప్పుడు, రెండు వ్యూహాలను (వాసుదేవ సంకర్షణులను) ఇంకొకప్పుడు, ఇంకొకప్పుడు ప్రద్యుమ్న సహితమయిన మూడు వ్యూహాలను, మరొకప్పుడు అనిరుద్ధ సహితమయిన నాలుగు వ్యూహాలను ఉపాసించటం కనిపిస్తుంది. శ్రీహరియే క్షేత్రజ్ఞుడు, మమకారం లేనివాడు, నిష్కలుడు. ఈయనయే సమస్త ప్రాణులలో పాంచభౌతికాలు అయిన గుణాలకంటె అతీతు డయిన జీవాత్మరూపంలో విరాజిల్లుతున్నారు. రాజా ! పంచేంద్రియాలను ప్రేరేపించేదిగా విఖ్యాతమయిన మనస్సు కూడా శ్రీహరియే. సమస్త ప్రాణులతో పంచభూతాలకు సంబంధించిన గుణాలకు అతీతమైన జీవాత్మ రూపంగా విరాజిల్లేదీ ఆయనయే. వినాశ రహితు డయిన నారాయణుడే అకర్త, కర్త, కార్యం, కారణం అవుతున్నాడు. తన ఇష్టానుసారమే ఈయన క్రీడిస్తుంటాడు. రాజశ్రేష్ఠా ! గురుదేవుల కృపవల్ల, నాకు తెలిసిన అనన్య భక్తి రూప మయిన భక్తి ధర్మాన్ని నీకు వివరించాను. అపవిత్ర మయిన అంతఃకరణం కలవారికి ఈ ధర్మం

తెలియటం చాల కష్టం. కురునందనా ! భగవంతుని అనన్య భక్తులు దుర్లభులు. ఇలాంటి వారు కొద్దిమందే ఉంటారు. సర్వభూత హితాసక్తులు, ఆత్మజ్ఞానం గలవారు, అహింసా తత్పరులు అయిన భక్తులతో జగత్తు నిండిపోతే కృతయుగమే ఏర్పడుతుంది. ఎక్కడా సకామ కర్మానుష్ఠానమే ఉండదు. ప్రజానాథా ! ఈ రీతిగా ధర్మజ్ఞులైన మా గురువుగారు ద్విజశ్రేష్ఠులు, వ్యాస భగవానులు, శ్రీకృష్ణ భీష్ములు వింటుండగా మహర్షుల సమీపంలో ధర్మరాజుకు ఈ ధర్మాన్ని ఉపదేశించారు. పూర్వం మహాతపస్వి అయిన దేవర్షి నారదుడు దీనిని మా గురువులకు తెలిపాడు. శ్రీమన్నారాయణుని ఆరాధనలో మగ్నులయిన అనన్యభక్తులు, చంద్రునివలె గౌరవర్ణం గల ఆ పరబ్రహ్మ స్వరూపుడయిన అచ్యుతునే పొందుతారు." జనమేజయుడు అడిగాడు. "మహర్షీ ! మీరు చెప్పినట్లు జ్ఞానులు అనుష్ఠించిన అనేక సద్గుణ సంపన్న మయిన ఈ ధర్మాన్ని నానావ్రతా సక్తు లయిన ఇతర బ్రాహ్మణులు ఎందుకని ఆచరించటం లేదు ?" వైశంపాయనుడు చెప్పాడు. "భరత వంశీయా ! శరీర పంజరంలో బద్ధులయిన జీవులకు భగవంతుడు సాత్త్వికం, రాజసం, తామసం అనే మూడు ప్రకృతులను ఏర్పరిచాడు. ఈ త్రివిధ ప్రకృతి గల జీవులలో సాత్త్విక ప్రవృత్తిగల సాత్త్వికులే శ్రేష్ఠులు. వారే మోక్షానికి సునిశ్చితు లయిన అధికారులు. పరమ పురుషు డయిన నారాయణుడే సర్వోత్తమ వేదవేత్త అని, మోక్షానికి పరమాశ్రయం శ్రీమన్నారాయణుడే అనీ ఆతడు చక్కగా తెలుసుకొంటాడు. అందువల్ల ఆ వ్యక్తిని సాత్త్వికుడని అంటారు. నారాయణుని ఆశ్రయించిన అనన్యభక్తుడు, తన మనస్సుకు కావలసిన శ్రీ పురుషోత్తముని ధ్యానిస్తూ ఆయననే పొందుతాడు. మోక్ష ధర్మతత్పరులు, సర్వవిధాల తృష్ణానాశనం అయిన వివేకవంతు లయిన యతుల యోగక్షేమాల భారాన్ని శ్రీమన్నారాయణుడే ధరిస్తాడు. జనన మరణాత్మక మయిన చక్రంలో తిరిగే వ్యక్తిని మధుసూదనుడు దయాదృష్టితో చూస్తే ఆతనిని సాత్త్వికు డని తెలుసుకోవాలి. అతడు మోక్షానికి సునిశ్చితు డయిన అధికారి అవుతాడు. ఏకాంతభక్తులు సేవించే ధర్మం సాంఖ్యయోగాలతో సమానం. దాన్ని పాటించటంవల్ల మానవుడు నారాయణ స్వరూపమయిన మోక్షంలోనే పరమగతిని పొందుతాడు. నారాయణుని కృపాదృష్టిని పొందిన వాడే జ్ఞాని అవుతాడు. అంతేకానీ తాను కోరుకోవటం వలన మాత్రమే ఎవడూ జ్ఞాని కాలేడు. ప్రజానాథా ! రాజసతామసప్రకృతులు రెండు దోషమిశ్రితాలు. రజస్తమో గుణాల ప్రకృతితో జన్మించేవ్యక్తి సామాన్యంగా సకామకర్మలో ప్రవర్తించే లక్షణాలతో ఉంటాడు. కాబట్టి శ్రీహరి ఆతని వైపు కన్నెత్తిచూడడు. ఇలా జన్మించిన వ్యక్తిమీద బ్రహ్మదేవుని దయా వీక్షణం పడుతుంది. (అందువల్ల ఆతనిని ప్రవృత్తి మార్గంలో నియోగిస్తాడు) వాని

మనస్సు రజోగుణ తమోగుణ ప్రవాహంలో మునిగిపోతుంది. దేవతలు, ఋషులు నిజానికి సత్త్వగుణంలో ఉంటారు. వారిలో గూడా శుద్ధ సత్త్వగుణం లోపిస్తుంది. కాబట్టి వారిని వైకారికులు (వికారవంతులు) అని అంటారు."

జనమేజయుడు అడిగాడు. "మహర్షీ ! వైకారికు డయిన వ్యక్తి పురుషోత్తముని ఎలా పొందుతాడు ? దీన్ని అంతను మీ అనుభవానుసారం చెప్పవలసింది. ఆ వ్యక్తి ప్రవర్తనను కూడ విశదీకరించవలసింది." వైశంపాయనుడు చెప్పాడు. "అత్యంత సూక్ష్ముడై, సత్త్వగుణయుక్తుడై, అకార ఉకార, మకారములనే మూడక్షరాలు గల ప్రణవ స్వరూపు డయిన పరమాత్మను ఇరువదియైదవ తత్త్వ మయిన జీవాత్మ కర్తృత్వాహంకారం లేనప్పుడు పొందుతాడు." ఈ రీతిగా ఆత్మానాత్మ వివేచనం చేసే సాంఖ్యులు, చిత్తవృత్తి నిరోధాన్ని ఉపదేశించే యోగులు, జీవబ్రహ్మల అభేదాన్ని బోధించే వేదభాగాలైన ఆరణ్యకాలు (ఉపనిషత్తులు), భక్తిమార్గాన్ని ప్రతిపాదించే పాంచరాత్రాగమాలు - ఇవన్నీ ఏక లక్ష్య సాధకాలు కావటం వల్ల ఒకటే అంటారు. ఇవి అన్నీ ఒక దానికొకటి అంగాలు. **సర్వకర్మలను నారాయణ పాద పద్మాలయందు సమర్పించటం ఏకాంతభక్తుల ధర్మం.** రాజా ! సముద్రం నుంచి తయారయిన మేఘాల నుండి కురిసిన నీరు మళ్ళీ సముద్రంలోనే కలిసినట్లు జ్ఞాన జల ప్రవాహాలు నారాయణుని నుండి ఆవిర్భవించి, మళ్ళీ ఆయనలోనే లీనమవుతాయి. కురునందనా ! ఈ సాత్వత ధర్మాన్ని నీకు వివరంగా చెప్పాను. నీకు చేతనయితే తగిన విధంగా దీన్ని ఆచరించు.' ఈ విధంగా మహానుభావు డయిన నారదుడు మా గురువు గారికి, శ్వేతవస్త్రధారులయిన గృహస్థులకు, కాషాయవస్త్ర ధారులయిన సంన్యాసులకు శాశ్వతమయిన ఏకాంతగతిని చెప్పాడు. వ్యాసమహర్షి ధీమంతు డయిన ధర్మపుత్రునికి ఆదరంతో ఈ ధర్మాన్ని ఉపదేశించాడు. గురుముఖం నుండి వ్యక్తమయిన ఆ ధర్మాన్నే నీకు చెప్పాను. రాజశ్రేష్ఠా ! ఈ రీతిగా ఈ ధర్మం దుష్కర మయినది. నీ లాగనే ఇతరులు కూడా ఈ విషయంలో మోహితులు అవుతారు. ప్రజాపాలకా ! శ్రీకృష్ణ పరమాత్మయే సర్వలోకాలను సృజించేవాడు, పాలించేవాడు, సంహరించేవాడు, కారణ భూతుడు కాబట్టి నీవు ఆయననే భక్తితో సేవించు."

349. అపాంతరతముని జన్మ వృత్తాంతము.

జనమేజయుడు అడిగాడు. "బ్రహ్మర్షీ ! సాంఖ్యం, యోగం, పాంచరాత్రం, వేదాలలోని ఆరణ్యక భాగాలు అనే నాలుగు విధాలయిన జ్ఞానాలు సమస్త లోకాలలో ప్రచారమవుతున్నాయి. ఇవి అన్నీ ఒకే లక్ష్యాన్ని బోధించేవా ? లేక భిన్న భిన్న లక్ష్యాలను

ప్రతిపాదించేవా ? నా ఈ ప్రశ్నకు తగురీతిగా సమాధానం చెప్పవలసింది. వీటి ప్రవృత్తిని కూడా క్రమంగా చెప్పగోరుతాను." వైశంపాయనుడు చెప్పాడు. "సత్యవతీదేవి యమునాతీరంలో ఉన్న ద్వీపంలో పరాశరమునితో గలిగిన సంపర్కంవల్ల బహువిషయాలు తెలిసి, ఉదారుడు అయిన మహర్షిని కన్నది. అజ్ఞానాంధకారాన్ని పటాపంచలుచేసే జ్ఞాన సూర్యు డయిన ఆ గురువు వేదవ్యాసులకు నమస్కరిస్తాను. బ్రహ్మకు జనకుడయిన నారాయణుని నుండి* ఆరవ తరం వాడు, ఋషుల సంపూర్ణమయిన ఐశ్వర్యం కలిగిన, నారాయణాంశలో పుట్టినవాడు, ఆ తండ్రికి ఏకైక పుత్రుడు, ద్వీపంలో జన్మించటంచేత ద్వైపాయన నామకుడు, వేదమహాభాండార మయిన వ్యాసదేవునికి నా నమస్కారాలు. పూర్వకాలంలో మహాతేజస్వి, వైభవ సంపన్ను డయిన నారాయణుడు వైదిక జ్ఞానానికి మహానిధి, మహాత్ముడు, పుట్టుక లేనివాడు, పురాణపురుషుడు అయిన వ్యాసమహామునిని తన పుత్రునిగా జనింపజేశాడు." జనమేజయుడు అడిగాడు. "ద్విజశ్రేష్ఠా ! నీవు ఇంతకు ముందు ఆదిపర్వకథను చెపుతూ వసిష్ఠపుత్రుడు శక్తి, శక్తి పుత్రుడు పరాశరుడు, పరాశర పుత్రుడు శ్రీకృష్ణ ద్వైపాయన వ్యాసుడు అని చెప్పావు. మళ్ళీ ఇప్పుడు నీవే ఈయనను నారాయణ పుత్రు డని చెపుతున్నావు. మహామతీ ! మునీశ్వరా ! మహాతేజస్వి అయిన వ్యాసమహర్షికి ఇంతకు ముందు కూడా ఒక జన్మకలిగిందా ? ఈ విషయం దయచేసి చెప్పవలసింది."

వైశంపాయనుడు చెప్పాడు. "రాజా ! ధర్మాత్ము డయిన మా గురువు వ్యాసమహర్షి తపోనిధి, జ్ఞాననిష్ఠుడు. మొదట ఆయన వేదార్థ వాస్తవ జ్ఞానాన్ని పొందవలెననే కోరికతో హిమాలయ శిఖరం మీద ఉండేవాడు. ఆయన మహాభారతాన్ని రచించి తపస్సు చేసి చేసి అలసిపోయాడు. ఆ రోజులలో మహామేధావి అయిన గురువుగారి సేవలో తత్పరులమై ఐదుగురు శిష్యులం ఆయనతో పాటు ఉన్నాం. సుమంతుడు, జైమిని, ఉత్తమ ధర్మానుష్ఠాత ఐనపైలుడు, నాలుగో వాడిని నేను, ఐదవవాడు వ్యాసపుత్రుడు శుకుడు. ఈ ఆయిదుగురు శిష్యులు చుట్టు గల వ్యాసమహర్షి హిమవత్పర్వతం మీద భూతపరివేష్టితు డయిన భూతపతి పరమేశ్వరునివలె విరాజిల్లాడు. అక్కడ వ్యాసమహర్షి సాంగాలయిన వేదాలను, మహాభారతార్థాన్ని ఆవృత్తి చేస్తూ, శిష్యులు అందరికి పారం చెపుతూ ఉన్నాడు. అప్పుడు మేము ఎల్లప్పుడు సప్రయత్నంగా ఏకాగ్రచిత్తుడు, జితేంద్రియుడూ అయిన ఆ గురువుగారిని సేవిస్తున్నాం. ఒక రోజు సంభాషణ సందర్భంలో మేము ద్విజోత్తముడైన వేదవ్యాస మహర్షిని వేదార్థాలు, మహాభారతార్థాలు, శ్రీమన్నారాయణుని నుండి ఆయన జన్మ

---

* *1. నారాయణుడు 2. బ్రహ్మ 3. వసిష్ఠుడు 4. శక్తి 5. పరాశరుడు 6. వ్యాసుడు - ఈ విషయం హరివంశం మొదట్లో ఉంది.* *(నీల)*

వృత్తాంతాన్ని అడిగాం. తత్త్వవేత్త అయిన వ్యాసమహర్షి మొదట మాకు వేదాల అర్థాన్ని, మహాభారతార్థాన్ని చెప్పారు. ఆ తరువాత నారాయణునినుండి తాను జన్మించిన వృత్తాంతాన్ని చెప్పారు. ద్విజులారా ! ఋషిసంబంధ మయిన ఈ ఉత్తమాఖ్యానాన్ని వినండి. చాల పూర్వకాలంలో జరిగిన ఈ వృత్తాంతాన్ని తపః ప్రభావంతో తెలుసుకొన్నాను. సప్తమ కల్పారంభంలో ఏడవ సారి బ్రహ్మదేవుడు జన్మించినప్పుడు, శుభాశుభరహితు డయిన శ్రీహరి మొట్టమొదట తననాభికమలంనుంచి బ్రహ్మను ఉత్పన్నుని చేశాడు. ఆవిర్భవించిన బ్రహ్మతో మహాతేజస్వి అయిన భగవానుడు ఇలా అన్నాడు.

"బ్రహ్మ ! నా నాభికమలం నుంచి నీవు ప్రజాసృష్టి చేయటానికి జన్మించావు. ఈ పనిలో సమర్థుడవు. జడాలు, చేతనాలు అయిన నానావిధ సంతతిని సృష్టించు." అని శ్రీహరి చెప్పగా, చింతావ్యాకులుడయిన బ్రహ్మ సృష్టి చేయటానికి విముఖుడయి వరదుడు, సర్వేశ్వరుడూ అయిన శ్రీహరికి నమస్కరించి ఇలా అన్నాడు. "దేవాధిపా ! ప్రజా సృష్టిచేయటానికి తగిన శక్తి నా కెక్కడిది ? నమస్కారం. సృష్టి విషయజ్ఞానం నాకు ఏమాత్రంలేదు. కాబట్టి సముచిత మయినది చేయవలసింది." ఆ మాటలు విన్న భగవంతుడు అంతర్ధానం చెందాడు. బుద్ధిమంతులలో శ్రేష్ఠుడయిన శ్రీహరి బుద్ధిని గూర్చి ఆలోచించాడు. ఆయన చింతించినంతనే బుద్ధి ఆకారం దాల్చి శ్రీహరి సన్నిధికి వచ్చింది. ఇతరులకు ఎవ్వరికీ వశంకాని నారాయణుడు స్వయంగా ఆ బుద్ధిని యోగశక్తితో సంపన్నం చేశాడు. అవ్యయు డయిన నారాయణుడు ఐశ్వర్య యోగయుక్త మయి ప్రగతి శీలమయిన బుద్ధితో ఇలా అన్నాడు. 'ప్రపంచ సృష్టి అనే అభీష్టకార్యం సిద్ధించటానికి నీవు బ్రహ్మలో ప్రవేశించు' అన్నాడు. పరమాత్మ ఆదేశాన్ని తలదాల్చి, బుద్ధి త్వరగా బ్రహ్మలో ప్రవేశించింది. బ్రహ్మ సృష్టి పరిజ్ఞాన సంయుక్తు డయినప్పుడు ఆయనను శ్రీహరి ప్రేమగా చూచి 'ఇప్పుడు నీవు నానావిధాలయిన ప్రజాసృష్టి చేయవలసింది' అని అన్నాడు. బ్రహ్మ 'సరే' అని శ్రీహరి ఆజ్ఞను శిరసావహించాడు. ఈ రీతిగా సృష్టిచేయమని బ్రహ్మను ఆజ్ఞాపించి, నారాయణుడు అంతర్ధానం చెందాడు.

ఆయన ఒక్క క్షణంలో స్వీయదేవధామానికి వెళ్ళి, స్వీయ ప్రకృతిని పొంది, దానితో ఏకమయినాడు. తరువాత కొంతకాలానికి భగవంతుని మనస్సులో ఇంకొక ఆలోచన వచ్చింది. 'పరమేష్ఠి అయిన బ్రహ్మ ఈ ప్రజా సృష్టి నయితే చేశాడు. కాని దైత్యులు, దానవులు, గంధర్వులు, రాక్షసుల సమూహాల భారంతో క్రుంగిపోయిన ఈ భూమి పీడింపబడుతున్నది. బలవంతులైన దైత్య దానవ రాక్షసులు అనేకులు ఈ భూమి మీద జన్మించి, మహత్తర తపస్సు చేసి గొప్ప వరాలను పొందుతారు. వరదానంతో

మదించిన వారు అందరూ దేవతలను, తపోధను లయిన మహర్షులను తీవ్రంగా బాధిస్తారు. కాబట్టి ఇప్పుడు నేను భూమిపై క్రమంగా అనేకావతారాలను ధరించి, ఈ భూభారాన్ని తగ్గించవలసి ఉన్నది. **పాపాత్ములను శిక్షించటం చేత, పుణ్యాత్ములను రక్షించటంచేత దీనురాలు, సత్యస్వరూప అయిన ఈ భూదేవికి భారం తగ్గుతుంది.** పాతాళంలో ఆదిశేషుని రూపంలో ఉండి, నేనే ఈ భూమిని ధరిస్తున్నాను. నేను ధరించటం వలన ఈ భూమి సంపూర్ణ మయిన చరాచరజగత్తును ధరిస్తున్నది. కాబట్టి నేను అవతారాలు దాల్చి, ఈ భూమిని తప్పక రక్షిస్తాను' అని భగవంతుడు ఆలోచించి, జగత్తు కోసం అవతారాలు గ్రహించటానికి, తన అనేక స్వరూపాలను సృష్టించుకొన్నాడు. అంటే వారాహం, నారసింహం, వామనం మానవ రూపాదులను స్మరించాడు. ఈ అవతారాలతో అపమార్గంలో పోయే దైత్యులను సంహరించాలి అని ఆయన నిశ్చయించుకొన్నాడు.

తరువాత జగత్తును సృజించే శ్రీహరి 'భోః' అనే శబ్దంతో సర్వదిక్కులు ప్రతి ధ్వనించేటట్లు వాక్కును ఉచ్చరించాడు. దీని వలన అక్కడ సారస్వతుడు ఆవిర్భవించాడు. సరస్వతి వలన అంటే వాక్కువలన జనించిన శక్తిశాలి అయిన ఆ పుత్రునిపేరు 'అపాంతరతముడు' అని ఏర్పడింది. ఆ అపాంతరతముడు భూత భవిష్యద్వర్తమానాలు అనే మూడు కాలాలలో జరిగేది తెలిసినవాడు, సత్యం పలికేవాడు, దృఢంగా వ్రతాలను నియమాలను పాటించేవాడు. శిరస్సు వంచి నిలిచిన ఆ పుత్రునితో దేవతలకు మొదటి కారణ మయిన శ్రీహరి ఇలా అన్నాడు. "బుద్ధిమంతులలో శ్రేష్ఠుడా ! వేదాలను వ్యాఖ్యానించటానికి నీవు ఋక్ సామ యజురాది వేదాలను విడివిడిగా చేయాలి. కాబట్టి మునీ ! నా ఆజ్ఞానుసారం చేయవలసింది. ఇది నా మాట." అప్పుడు అపాంతరతముడు స్వాయంభువ మన్వంతరంలో భగవంతుని ఆజ్ఞానుసారం వేదవిభాగం చేశాడు. ఆ ముని చేసిన ఈ పనికి, చేసిన తపస్సుకు, యమనియమాలకు సంతోషించి, శ్రీహరి 'వత్సా ! నీవు అన్ని మన్వంతరాలలో కూడా ఇలాగే ధర్మ ప్రవర్తకుడవు అవుతావు. ఎల్లప్పుడు నిశ్చలుడవు, అజేయుడవు అవుతావు. ద్వాపర కలియుగాల సంధి కాలంలో భరతవంశంలో కురువంశ క్షత్రియులు కలుగుతారు. అభిమానధనులయిన ఆ రాజులు సమస్త భూమండలంలో విఖ్యాతులు అవుతారు. ద్విజశ్రేష్ఠా ! నీ వలన పుట్టిన వంశంలో, పరస్పర వినాశంకోసం విభేదం ఏర్పడుతుంది. నీ ప్రమేయం లేకుండానే వారి మధ్య యుద్ధం జరుగుతుంది. ఆ కాలంలో కూడా నీవు తపో బల సంపన్నుడవై వేదాన్ని అనేక విభాగాలు చేస్తావు. ఆ సమయంలో కలియుగం రాగా నీ శరీరవర్ణం నీలం అవుతుంది.

నీవు నానా విధాలయిన ధర్మాలకు ప్రవర్తకుడవు, జ్ఞాన దాతవు, తపస్వివి

అవుతావు. కాని రాగ విముక్తుడివి కాలేవు. నీ కుమారుడు మాత్రం మహేశ్వరానుగ్రహం వలన విరాగి అయి, పరమాత్మ స్వరూపుడు అవుతాడు. ఈ నా మాట వ్యర్థం కాదు. బ్రాహ్మణుల చేత బ్రహ్మ మానస పుత్రుడుగా పిలువబడేవాడు, మహా మేధావి, తపోనిధి, సర్వశ్రేష్ఠుడు, వసిష్ఠుడు అనే పేరుతో ప్రసిద్ధుడై, సూర్యుని మించిన తేజస్సుతో ప్రకాశించే ఆయన వంశంలో, మహాప్రభావ సంపన్ను డయిన పరాశరమహర్షి జన్మిస్తాడు. తపోనివాస మయిన ఆ మహర్షి నీ తండ్రి అవుతాడు. పుట్టింటిలో ఉండే ఒక కన్యకు, ఆ మహర్షి వలన పుత్రునిగా జన్మిస్తావు. కానీనుడు (పెళ్ళికాని పిల్లకు కలిగిన కొడుకు) అని నిన్ను లోకం వ్యవహరిస్తుంది. భూత, వర్తమాన, భవిష్యత్కాలాల సర్వవిషయాలలో నీ సంశయాలు నశిస్తాయి. పూర్వం గడచి పోయిన సహస్రయుగాలు గల కల్పాలు కూడా నా ఆజ్ఞ వలన నీవు చూడగలవు. తపోబల సంపన్నుడవు అవుతావు. ఇకముందు కలుగబోయే అనేకకల్పాలు కూడా నీకు కన్పిస్తాయి. మహర్షీ ! నిరంతరం నీవు నన్ను ధ్యానించటం చేత జగత్తులో ఆద్యంతాలు లేని పరమేశ్వరుని, చక్రహస్తుని నన్ను జగత్తులో చూడగలవు. ఈ నా మాట ఎప్పుడూ అసత్యంగాదు. మహాశక్తి సంపన్నా ! సాటిలేని కీర్తి నీకు కలుగుతుంది. వత్సా ! సూర్యపుత్రుడు శని మన్వంతర ప్రవర్తకు డయి, మహా మను పదవిలో ప్రతిష్ఠితుడైనప్పుడు, ఆ మన్వంతరంలో నా అనుగ్రహం వలన, నీవే మన్వాది గణంలో ముఖ్యుడవు అవుతావు. ఇందులో సందేహం లేదు. ప్రపంచంలో జరిగేది అంతా నా చేష్టాఫలమే. ఇతరులు తలకొక రీతిగా ఆలోచిస్తుంటారు. నేను సర్వస్వతంత్రుడనై నా ఇష్టప్రకారం ప్రవర్తిస్తాను.' ఈ రీతిగా పరమాత్మ సారస్వతు డయిన అపాంతరతమ మహర్షితో చెప్పి, వెళ్ళిరమ్మని పలికాడు. ఈ విధంగా విష్ణుదేవుని అనుగ్రహం వలన మొదట అపాంతరతముడు అనే పేరు గలిగి జనించాను. ఇప్పుడు ఆయన ఆజ్ఞానుసారమే, వసిష్ఠవంశానందకరుడనై, వ్యాసనామంతో జన్మించి ప్రసిద్ధుడను అయినాను. నారాయణప్రసాదం వలన ఆయన అంశతోనే జన్మ కలిగిన వృత్తాంతం మీకు వినిపించాను. శ్రేష్ఠ బుద్ధిమంతులారా ! పూర్వ కాలంలో నేను ఉత్తమ సమాధిస్థితిలో మిక్కిలి కఠోర మయిన మహత్తర తపస్సు చేశాను. పుత్రులారా ! మీరు అడిగినది అంతా చెప్పాను. మీ యందలి ప్రేమతో నా భక్తులయిన మీకు నా పూర్వజన్మను, భవిష్యత్తును చెప్పాను."

వైశంపాయనుడు చెపుతున్నాడు. "రాజా ! నీవు అడిగిన ప్రశ్నకు సమాధానంగా క్లేశరహితు డయిన మా గురువుగారి జన్మవృత్తాంతం మొదట చెప్పాను. ఇప్పుడు తరువాతి విషయం చెపుతాను, విను. రాజర్షీ ! సాంఖ్యం, యోగం, పాంచరాత్రం, వేదాలు, పాశుపతం అనేవి నానావిధాలయిన మతాలని తెలుసుకో. సాంఖ్య శాస్త్ర ప్రవక్త అయిన కపిలుడు

పరమర్షిగా ప్రసిద్ధుడు. యోగశాస్త్రాన్ని తెలుసుకొన్న పురాతనుడు హిరణ్య గర్భుడే కాని ఇతరుడు కాడు. అపాంతరతముని వేదాచార్యుడు అని అంటారు. ఇక్కడ కొంతమంది ఆయనను ప్రాచీన గర్భుడు అని అంటారు. బ్రహ్మపుత్రుడు, భూతాధిపతి, ఉమాపతి, శ్రీకంరు డయిన శంకరుడు శాంతచిత్తుడై పాశుపతజ్ఞానాన్ని ఉపదేశించాడు. పాంచరాత్రాన్ని సంపూర్ణంగా తెలిసినవాడు శ్రీమన్నారాయణుడే. వేదశాస్త్రాలను అనుసరించి, అనుభవాను సారం ఆలోచిస్తే, ఈ సమస్త జ్ఞానాలలో వీని పరమ తాత్పర్యంగా శ్రీమన్నారాయణుడే ఉన్నట్లు కన్పిస్తుంది. ప్రజాపాలకా ! అజ్ఞానంలో మునిగిన వారు శ్రీహరిని ఈ రూపంగా తెలుసుకోలేరు. శాస్త్ర కర్తలు, జ్ఞానులయిన వారు, ఆ నారాయణ ఋషినే సమస్త శాస్త్రాలకు పరమ లక్ష్యంగా చెపుతారు. ఆయనతో సమానుడు వేరెవరూ లేరన్నది నామాట. **జ్ఞానబలంతో నిస్సంశయులయిన వారు అందరిలో, ఎల్లప్పుడు శ్రీహరి నివసిస్తుంటాడు. కుతర్కబలంతో సంశయ గ్రస్తులైతే మాధవుడు నివసించడు.** రాజేంద్రా ! పాంచరాత్రం చక్కగా తెలిసినవారు, అందులో చెప్పిన క్రమానుసారం సేవా పరాయణు లయి అనన్య భావంతో భగవంతుని శరణుపొందిన వారు ఆ శ్రీహరిలోనే ప్రవేశిస్తారు. రాజా ! సాంఖ్యం, యోగం అనే రెండు సనాతన శాస్త్రాలు, సమస్త వేదాలు, సమస్త ఋషులు ఈ ప్రాచీన మయిన విశ్వం అంతా శ్రీమన్నారాయణుడే అని చెపుతున్నారు. స్వర్గం, అంతరిక్షం, భూమి, జలం అనేవాని అన్నింటి స్థానాలలో, సంపూర్ణలోకాలలో కలిగే శుభాశుభకర్మలు అన్నీ శ్రీమన్నారాయణుని ఉనికితోనే జరుగుతున్నవి అని తెలుసుకోవాలి."

350. నారాయణ మహిమవర్ణనము.

జనమేజయుడు అడిగాడు. "ద్విజోత్తమా ! పురుషులు అనేకులా ! లేక ఒక్కడా ! ఈ లోకంలో ఏ పురుషుడు శ్రేష్ఠుడు ? ఈ లోకంలో సర్వోత్పత్తికి స్థానం ఎవరు ?" వైశంపాయనుడు చెప్పాడు. "కురువంశ భారధారీ ! రాజా ! సాంఖ్యశాస్త్ర యోగశాస్త్రాల ఆలోచనా రీతి ననుసరించి, ఈ జగత్తులో పురుషులు అనేకులు. ఏక పురుషుడు అనే వాదాన్ని వీరు అంగీకరించరు. అనేక పురుషుల ఉత్పత్తి స్థానం ఒకే పురుషుడని ఎలా చెపుతారు ? ఈ విషయాన్ని తెలియజేయటానికి ఆత్మ జ్ఞాని, జితేంద్రియుడు, తపస్వి, నమస్కరింపదగినవాడు, పరమర్షి మా గురుదేవులయిన వ్యాసమహర్షికి నమస్కారం చేసి అధిక గుణవంతుడు, విశ్వాత్ముడయిన పురుషుని గూర్చి వివరిస్తాను. రాజా ! ఈ పురుషసూక్తం, ఋతం, సత్యం అనేవి అన్ని వేదాలలో ప్రసిద్ధాలు. ఋషి శ్రేష్ఠుడయిన వ్యాసుడు దీన్ని చాలా బాగా ఆలోచించాడు. కపిలాది మహర్షులు

సామాన్యరూపంగా, విశేషరూపంగా అధ్యాత్మతత్వాన్ని చింతించి, విభిన్నశాస్త్రాలను ప్రతిపాదించారు. కాని వ్యాసమహర్షి సంక్షిప్తంగా పురుషైకత్వాన్ని ప్రతిపాదించాడు. ఆ విషయాన్ని నేను కూడా. అమిత తేజస్వి అయిన గురుదేవుల కృపతో నీకు చెపుతాను. రాజా ! ఈ విషయం బాగా తెలిసిన వారు, బ్రహ్మరుద్రుల సంవాద రూప మయిన ఈ ప్రాచీనేతిహాసాన్ని ఉదహరిస్తారు. క్షీరసాగర మధ్యంలో వైజయంతమనే పేరుగల ప్రఖ్యాత పర్వతం ఉన్నది. అది బంగారు కాంతితో మెరిసిపోతుంటుంది. అక్కడ బ్రహ్మ ఒంటరిగా ఉండి, అధ్యాత్మచింతనం చేయటానికి ప్రతిరోజు వస్తుంటాడు. ఆ వైజయంత పర్వతాన్ని సేవిస్తుంటాడు. పూర్వం ఒకప్పుడు మేధావి అయిన బ్రహ్మదేవుడు అక్కడ ఉండగా ఆ సమయాన ఆయన నుదుటి నుంచి జనించిన పుత్రుడు, మహాయోగి, త్రినేత్రుడు అయిన శివుడు అలవోకగా ఆకాశ మార్గంలో సంచరిస్తూ, వైజయంతపర్వతం వద్దకు వచ్చి త్వరగా ఆకాశం, నుంచి పర్వతం మీదికి దిగివచ్చాడు. ఎదురుగా బ్రహ్మను చూసిన ఆయనకు చాలా ఆనందం కలిగింది. బ్రహ్మపాదాలకు ఆయన నమస్కరించాడు. తన పాదాల మీద పడిన శివుని, సర్వ-సమర్థుడు, ప్రజాపతి అయిన బ్రహ్మ కుడిచేతితో లేవదీశాడు. చాలాకాలం తరువాత తన వద్దకు వచ్చిన కుమారునితో ఇలా అన్నాడు.

పితామహుడు అన్నాడు. "మహాబాహూ ! నీకు స్వాగతం. భాగ్యవశాన నావద్దకు వచ్చావు. పుత్రా ! నీ స్వాధ్యాయం, తపస్సు చక్కగా సాగుతున్నవా ? నీవు ఎల్లప్పుడూ, కఠోరతపస్సులో నిమగ్నుడవై ఉంటావు. అందువలననే నిన్ను మాటిమాటికి నీ తపస్సును గురించే అడుగుతుంటాను." రుద్రుడన్నాడు. "దేవా ! నీ అనుగ్రహంవల్ల నా స్వాధ్యాయమూ, తపస్సు చాలా చక్కగా సాగుతున్నాయి. వాటికి ఏనాడూ విఘ్నం కలగటంలేదు. సర్వజగత్తూ క్షేమంగానే ఉన్నది. దేవా ! చాలా కాలానికి పూర్వం నిన్ను ఈ బ్రహ్మలోకంలో చూశాను. అందువల్ల నీ పాద సేవిత మయిన ఈ పర్వతం మీద నీ దర్శనానికి వచ్చాను. పితామహా ! నీవు ఒంటరిగా వచ్చి ఇక్కడ ఉండటం నాకు ఉత్కంఠను కలిగించింది. దీనికి కారణం చిన్నది కాదని నేను అనుకొన్నాను. నిరంతరం దేవతలు, అసురులు, మహాతేజస్వులయిన ఋషులు, గంధర్వులు, అప్సరసల సమూహాలు నీ సేవలో ఉంటారు. ఆకలిదప్పులు లేని ఆ ఉత్తమనివాసాన్ని వీడి, నీవు ఒంటరిగా ఈ శ్రేష్ఠపర్వతం మీదికి రావటానికి కారణం ఏమిటి ?'

బ్రహ్మ చెప్పాడు. "వైజయంతం అనే ఈ పర్వతం మీద ఎక్కువ కాలం ఉంటాను. ఇక్కడ ఏకాగ్రమయిన మనస్సుతో విరాట్పురుషుని ధ్యానిస్తుంటాను." రుద్రుడు అడిగాడు. "బ్రహ్మ ! స్వయంభువు అయిన నీవు ఇంతకు ముందు అనేక పురుషులను

సృష్టించావు. ఇప్పుడుకూడా సృష్టిస్తున్నావు. ఆ విరాట్టుకూడా ఒక పురుషుడే అయితే ఆయన విశేషం ఏమిటి ? బ్రహ్మా ! నీవు ధ్యానించే ఆ ఏకైక పురుషోత్తముడు ఎవరు ? నా ఈ సందేహాన్ని తీర్చు. నాకు చాలా కుతూహలంగా ఉన్నది." బ్రహ్మ అన్నాడు. "పుత్రా ! నీవు చెప్పినట్లుగా నేను అనేక పురుషులను సృష్టించినది నిజమే. నేను సృష్టించిన వానినే నేను ఎందుకు ధ్యానిస్తాను. సమస్త పురుషులకు ఆధారం ఐన ఒక పురుషుని గురించి చెపుతాను. అనేక పురుషులకు హేతువు అయిన ఆ ఏకపురుషుని గూర్చి వివరిస్తాను. సాధన చేస్తూ చేస్తూ గుణాతీతులయిన వారే విశ్వరూపుడు, మహత్తరుడు, సనాతనుడు, నిర్గుణుడు అయిన ఆ పరమ పురుషునిలో ప్రవేశిస్తారు."

351. బ్రహ్మరుద్ర సంవాదము - నారాయణ మహిమా వైశిష్ట్యము.

బ్రహ్మ చెప్పాడు. "పుత్రా ! ఈ విరాట్పురుషుడు సనాతనుడు, వికార రహితుడు, వినాశం లేనివాడు, అప్రమేయుడు, సర్వవ్యాపి అని ఎందుకు అంటారో చెపుతాను. విను. సాధుశ్రేష్ఠా ! నీవు గాని, నేను గాని, ఇతరులు గాని సగుణుడు, నిర్గుణుడు, విశ్వాత్ముడు అయిన పురుషుని, ఈ చర్మచక్షువులతో చూడలేము. జ్ఞానంతోనే ఆయనను చూడ వీలవుతుంది. ఆయన స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు మూడూ లేని వాడయినా శరీరం అంతటా నివసిస్తాడు. ఆ శరీరాలలో ఉన్నా వాటి కర్మలతో ఏనాడూ లిప్తుడు కాడు. ఆయన నీకు, నాకు, దేహధారులు అనే పేరుగల జీవులకు కూడా అంతరాత్మయే అయిఉన్నాడు. సర్వసాక్షి అయిన ఆ పురుషోత్తముని ఎవరికీ ఎవరివలనా పట్టుకొన వీలుగాదు. సమస్త విశ్వమూ ఆయన శిరస్సు, చేతులు, కాళ్ళు, కన్నులు ముక్కు ఇష్టమైన రీతిగా సంచరించే ఆ ఏకైక పురుషోత్తముడు, అన్ని క్షేత్రాలలో సుఖంగా సంచరిస్తాడు. యోగాత్ముడయిన ఆ శ్రీహరి క్షేత్రజ్ఞులు అనే పేరు గల శరీరాలను, శుభాశుభ కర్మ రూపాలయిన వాటి కారణాలను ఎరుగును. కాబట్టి ఆయనను క్షేత్రజ్ఞుడు అని అంటారు. ఆయన సమస్త శరీరాలలోకి ఎలా వస్తాడో, ఎలా వెళ్తాడో ప్రాణులలో ఎవరికీ తెలియదు. నేను సాంఖ్యశాస్త్రాను సారం, యోగశాస్త్రానుసారం ఆయన గమనాన్ని గూర్చి ఆలోచిస్తాను. కాని ఆ ఉత్తమగతిని తెలుసుకోలేను. అయినా నా అనుభవానుసారం ఆ సనాతన పురుషుని వర్ణిస్తాను. ఆయనకు ఏకత్వమూ ఉన్నది, మహత్త్వమూ ఉన్నది. కాబట్టి ఆయన ఒక్కడే పురుషుడు అని చెపుతారు. సనా తనుడయిన శ్రీహరి మాత్రమే మహాపురుషు డనే పేరు ధరిస్తాడు. అగ్ని ఏక రూపమే. కాని అది అనేక రూపాలలో వెలుగుతుంది. సూర్యుడు ఒక్కడే జగత్తుకు అంతటికీ వేడిమిని, వెలుగును ప్రసాదిస్తాడు. తపస్సు

ఒక్కటే అయినా అది అనేక విధాలుగా ఉంటుంది. ఒకటే అయిన గాలి ఈ లోకంలో నానా రూపాలుగా వీస్తుంది. జలానికి అంతకు ఉత్పత్తి లయస్థానాలు సముద్రం ఒకటే అవుతుంది. నిర్గుణుడు, విశ్వరూపుడు అయిన పురుషుడు కూడ ఒకడే. ఆ నిర్గుణు డయిన పురుషునిలో సర్వమూ లయ మవుతుంది. దేహం, ఇంద్రియాలు మొదలయిన సమస్త గుణమయ పదార్థాలమీద ఉండే మమకారాన్ని వదలి, పాపపుణ్య కర్మలను పరిత్యజించి, సత్యాసత్యాలను వీడిన ఒకానొక సాధకుడే నిర్గుణుడు అవుతాడు.

నాలుగు సూక్ష్మ భావాలు గల ఆ నిర్గుణ పురుషుని అచింత్యునిగా తెలుసుకొని, అహంకార రహితుడుగా ప్రవర్తించే వాడే మంగళ రూపు డయిన పరమాత్మను పొందగలడు. ఈ రీతిగా కొందరు విద్వాంసులు తమ కన్న భిన్నమయిన పరమాత్మను పొందగోరుతారు. కొంతమంది తమ కన్న అభిన్న మయిన పరమాత్మను ఏకాత్మత్వాన్ని పొందగోరుతారు. ఇంకకొందరు జ్ఞానచింతకులు ఆత్మనే తెలియగోరుతారు. వీరిలో పరమాత్మ నిర్గుణుడు, నిత్యుడు అని చెప్పారు. ఆయనే నారాయణుడు. ఆయనయే సర్వాత్మకు డయిన పురుషుడు. నీటిలో ఉన్నా, తామరాకును ఆ నీరు అంటనట్లే, పరమాత్మను కూడా కర్మఫలం అంటదు. కాని కర్మలు చేసేవాడు, బంధ మోక్ష సంబంధంగల వాడు అయిన జీవుడు ఆ పరమాత్మ కన్న భిన్నుడు. ఆ జీవునికే అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు, పంచభూతాలు, మనో బుద్ధులు అనే పదిపేడు తత్వాలు రాశీభూతమయిన సూక్ష్మ శరీరంతో కూడిక కలుగుతుంది. అతడే కర్మభేదం వల్ల దేవ తిర్యగాది భావాలను పొందటంచేత అనేక విధాలు అని చెప్పారు. ఈ రీతిగా క్రమంగా పురుషుని ఏకత్వాన్ని, అనేకత్వాన్ని చెప్పారు. **లోకతంత్రానికి పూర్తిగా స్థానం, ప్రకాశం అయిన ఆ పరమాత్మయే తెలియదగిన పరమతత్వం. ఆయనయే తెలుసుకొనేవాడు, తెలుసుకోదగినవాడు. ఆయనయే మనవం చేసేవాడు, మననం చేయదగిన వస్తువు. ఆయనయే భోక్త, భోజ్య పదార్థమూను. వాసన చూచేవాడు, వాసన చూడదగినది ఆయనయే. స్పృశించేవాడు, స్పృశించదగిన వస్తువు ఆయనయే. చూచేవాడు, చూడదగినది ఆయనయే. వినేవాడు, విన దగినది ఆయనే. తెలుసుకునే వాడు, తెలియదగినది; సగుణుడు, నిర్గుణుడూ ఆయనయే. నాయనా ! ప్రధాన తత్వం అని చెప్పబడినది కూడా ఆ పురుషుడే. ఆయన నిత్యుడు, సనాతనుడు, వినాశరహిత మయిన తత్వమూ అవుతాడు.** ఆయనయే బ్రహ్మ (నేను) మొదలయిన రీతిని ఉత్పన్నం చేస్తాడు. వేదవేత్తలయిన విద్వాంసులు ఆయననే అనిరుద్ధుడు అంటారు. లోకంలో సకామ భావంతో చేసే వైదిక సత్కర్మలు ఆయన ప్రసన్నత కోసమే అవుతాయి అని భావించాలి. సమస్త దేవతలు, శాంత స్వభావంగల మునులు, యజ్ఞశాలలో ఆయననుద్దేశించియే

యజ్ఞం చేస్తారు. ప్రజలలో మొదటి వాడ నయిన నేను - బ్రహ్మను ఆ పరమపురుషుని నుండియే జనించాను. నా నుండి నీవు జనించావు. పుత్రా ! నా నుండి ఈ చరాచర జగత్తు, సరహస్యాలు అయిన వేదాలు వ్యక్తం అయ్యాయి. వాసుదేవాది చతుర్వ్యూహాలుగా విభాగం పొందిన ఆ పరమపురుషుడే, తన ఇష్టానుసారం క్రీడిస్తాడు. ఈ రీతిగా ఆ భగవంతుని ఆయన స్వరూప మయిన జ్ఞానంతోనే తెలుసుకోవాలి. వత్సా ! నీ ప్రశ్నానుసారం నేను యథారూపంగా ఉన్న ఈ విషయాలు అన్నీ చెప్పాను. సాంఖ్య యోగ శాస్త్రాలలోని యథార్థస్వరూపాన్ని చెప్పాను."

352. ఉంఛ వృత్త్యుపాఖ్యానము - 1.

యుధిష్ఠిరుడు అడిగాడు. "పితామహా ! బ్రహ్మ చెప్పిన శుభప్రదాలైన మోక్ష ధర్మాలను విన్నాను. ఇక చతురాశ్రమాలలోని వారికి శ్రేష్ఠమయిన ధర్మాను చెప్పండి."

భీష్ముడు చెపుతున్నాడు. **"అన్ని ఆశ్రమాలలోను ధర్మం స్వర్గఫలంగా, సత్యఫలంగా, మోక్షఫలంగా విధింపబడింది. ధర్మానికి యజ్ఞాదిద్వారాలు చాలా ఉన్నాయి. ఏక్రియ వ్యర్థం కాదు.*** మానవుడు తాను పొందిన ఫలాలను బట్టి ఆ యా విషయాల్లో తాను సాధించిన తీరులనే శ్రేష్ఠాలని భావిస్తాడు. కాని ఇతరాలను అంగీకరింపడు. నరోత్తమా ! ఈ విషయంలో పూర్వం నారదుడు ఇంద్రునికి చెప్పిన కథ ఒకటి నీవు వినాలి. రాజా ! నారద మహర్షి మూడులోకాల్లోను ప్రఖ్యాతుడు, సిద్ధపురుషుడు. అతడు వాయువువలె అన్నిలోకాల్లోను అడ్డులేకుండా సంచరించగలడు. మహాధనుర్ధరా ! అతడు ఒకసారి ఇంద్రుని ఇంటికి వెళ్లాడు. ఇంద్రుని సత్కారం పొంది, సమీపంలో కూర్చున్నాడు. విశ్రాంతిగా కూర్చున్న నారదుని ఇంద్రుడు ఇలా అడిగాడు. 'మహర్షీ ! ఇక్కడ మీరు ఆశ్చర్యకర మయినది ఏదయినా చూశారా ? బహ్మర్షీ ! మీరు చరాచర సహితమయిన మూడులోకాలలో కుతూహలంతో నిత్యమూ సాక్షివలె సంచరిస్తూ ఉంటారు. దేవర్షీ ! మీకు లోకంలో తెలియని విషయం లేదు. మీరు ఏదయినా అద్భుత విషయం వినడం కాని, అనుభవించడం కాని, చూడడం కాని చేశారా ? చెప్పండి నాకు.' ప్రవక్త అయిన నారదుడు, తన్ను ఆశ్రయించి తన వద్దనే కూర్చున్న ఇంద్రునికి విపులమైన కథను చెప్పాడు. అతడు ఇంద్రునికి చెప్పినట్లుగా ఆ కథను నేను నీకు చెపుతాను, విను."

---

* సర్వత్ర విహితో ధర్మః స్వర్గః సత్యఫలం మహత్ ।
బహుద్వారస్య ధర్మస్య నేహాస్తి విఫలా క్రియా ॥ 2

353. ఉంఛవృత్త్యుపాఖ్యానము - 2.

భీష్ముడు చెపుతున్నాడు. "గంగానదికి దక్షిణ తీరంలో, మహాపద్మం అనే పురంలో ఒక విప్రుడు ఉన్నాడు. అతడు సౌమ్యుడు, సోమ వంశంలో పుట్టిన వాడు. సంశయం లేకుండా వేదమంతా చదివిన వాడు. ధర్మపరుడు - కోపం లేనివాడు - సంతుష్టమైన స్వభావం కలవాడు - ఇంద్రియాలను జయించి, నిత్యమూ తపస్సు, స్వాధ్యాయమూ చేసే వాడు - సత్యశీలం కలవాడు, సజ్జన సమ్మతుడు. న్యాయార్జిత విత్తంతో, సచ్ఛీలంతో గడిపేవాడు. అతనికి చాలా మంది జ్ఞాతు లుండేవారు. సత్త్వగుణ ప్రధానులు వారు. ఆయన సద్వంశంలో పుట్టి చక్కని ప్రవృత్తి కల్గి ఉండేవాడు. అతనికి చాలామంది పుత్రు లుండేవారు. అతడు లౌకిక కార్యాలు విడిచి విపుల సత్కర్మ అయిన మోక్షం మీది ఆసక్తితో, కుల ధర్మాన్ని ఆశ్రయించి, ధర్మాచరణం చేసేవాడు. చాలామంది పుత్రులు కలగటం వల్ల లౌకిక విషయాలలో విరక్తుడై, మహత్కర్మలో నిమగ్నుడయి, కులధర్మాన్ని ఆశ్రయించి, స్వధర్మాచరణ తత్పరు డయినాడు. అతడు వేదోక్త ధర్మాలను, శాస్త్రోక్తధర్మాలను, శిష్టాచార ధర్మాలను ఇలా మూడు రకాల ధర్మాలను మనసా ధ్యానించేవాడు. నేను ఏం చేస్తే నాకు శుభం కలుగుతుంది ? అసలు నేను ఏం చెయ్యాలి ? నాకు పరమగతి ఏది ? అని నిత్యమూ ఆలోచిస్తూ ఒక నిశ్చయానికి రాలేకపోయాడు. పరమ ధర్మం ఆశ్రయించి, కర్తవ్యం ఆలోచించే అతని యింటికి, ఒకనాడు ఒక శ్రద్ధాళు వయిన బ్రాహ్మణుడు అతిథిగా వచ్చాడు. ఆ బ్రాహ్మణునికి అతడు శాస్త్రోక్తంగా అతిథి సత్కారాలు చేశాడు. వచ్చిన బ్రాహ్మణుడు అతిథ్యం పొంది విశ్రమించాడు. అపుడు బ్రాహ్మణునితో అతడు ఇలా అన్నాడు."

354. ఉంఛవృత్త్యుపాఖ్యానము - 3.

బ్రాహ్మణుడు చెపుతున్నాడు. పుణ్యాత్మా ! మీ మధురమైన మాటలతో నేను మీతో మైత్రీబంధాన్ని ఏర్పరచుకొన్నాను. మీరు నాకు మిత్రులు. నేను చెప్పేది కొద్దిగా వినండి. విప్రోత్తమా ! నేను గృహస్థధర్మాన్ని పుత్రులకు అప్పజెప్పి పరమ ధర్మాన్ని ఆచరించాలనుకొంటున్నాను. ఏ మార్గం ఆచరించాలో ఏది నాకు శ్రేయస్కరమో చెప్పండి మహాత్మా ! నేను ఒంటరిగా ఉండి, ఆత్మజ్ఞానం కోసం సన్యాసం స్వీకరించాలని అనుకొంటున్నాను - కాని సాధారణ మయిన బంధన గుణాలతో, భోగాసక్తితో నా కోరిక నెరవేర్చుకోలేక పోతున్నాను. ఇంతవరకు నా వయసంతా పుత్రఫలాశ్రితమై గడిచింది. ఇపుడిక పరలోకప్రయాణంలో పనికి వచ్చే ధర్మధనాన్ని తీసుకువెళ్ళా లనుకొంటున్నాను.

ఈ సంసారం అనే సముద్రం యొక్క ఒడ్డుకు చేరాలను కొంటున్నాను. నాకు ధర్మమయమైన పడవ ఎక్కడ (ఏ ఆశ్రమంలో) లభిస్తుందా ? అనుకొంటున్నాను. సాత్వికులు కూడా సాంసారిక విషయాల సంపర్కంతో ఎన్నో కష్టాలు పడుతున్నారని వింటున్నాను. అలాగే అన్ని ప్రాణుల మీదా యమ ధర్మరాజు యొక్క ధ్వజం (రోగాదులు) ఎగురుతూ ఉండటం చూస్తున్నాము.

అనుభవించగల రోజుల్లో కూడా, నా మనస్సు వాటి మీదకు పోయేది కాదు. సన్యాసాశ్రమంలో కూడా అన్న వస్త్రాలు యాచించడం కనిపిస్తోంది. అందుచేత సన్యాస ధర్మం మీద మనసు కలగడం లేదు. అందుచేత తమ బుద్ధి బలంతో నన్ను ధర్మ మార్గంలో నియోగించండి.' ధర్మాన్ని గురించి మాట్లాడే గృహస్థు వచనాలు విని, విద్వాంసుడయిన ఆ అతిథి వినయంతో మృదుమధురంగా ఇలా అన్నాడు.

అతిథి అంటున్నాడు. 'విప్రోత్తమా ! ఈ విషయంలో నేనూ అజ్ఞానంతోనే ఉన్నాను. నాకూ ఈ కోరిక ఉంది. చాలా మార్గాలున్న స్వర్గం గురించి ఒక మంచి నిశ్చయానికి రాలేకపోతున్నాను. కొందరు మోక్షాన్ని ప్రశంసిస్తారు. కొందరు ద్విజులు యజ్ఞఫలాన్ని ప్రశంసిస్తారు. వాన ప్రస్థాశ్రమం కొందరు, గృహస్థాశ్రమం కొందరు ప్రశంసిస్తారు. రాజ ధర్మాలను కొందరు, ఆత్మజ్ఞానాన్ని కొందరు, గురు శుశ్రూషా ధర్మాన్ని కొందరు, కొందరు మౌన వ్రతాన్ని ఆశ్రయిస్తారు. కొంతమంది తల్లిదండ్రులకు శుశ్రూష చేస్తూ స్వర్గం పొందారు. అహింసతో కొందరు, సత్యంతో కొందరు స్వర్గం పొందారు. యుద్ధంలో ఎదురు నిలిచి, పోరాడి, స్వర్గానికి చేరారు కొందరు. కొందరు ఉంఛవృత్తి ద్వారా స్వర్గ మార్గం పట్టారు. కొందరు బుద్ధిమంతులు సంతుష్టాత్ములై ఇంద్రియాలను జయించి, వేదవ్రత పరాయణులై స్వర్గం పొందారు. ఆర్జవం కలవారు కుటిలుల చేత చంపబడి శుద్ధాత్ములై స్వర్గంలో నిలిచారు. ఇలా లోకంలో అనేక విధాల ధర్మ ద్వారాలు తెరిచి ఉన్నాయి. వాయువుచేత మేఘమాలికలవలె నా బుద్ధి ఉద్విగ్నమై ఉంది."

355. ఉంఛవృత్త్యు పాఖ్యానము - 4.

అతిధి చెపుతున్నాడు. "మా గురువుగారు నాకు చెప్పినది క్రమం తప్పకుండా నీకు చెపుతాను. దాని అర్థతత్త్వాన్ని విను. పూర్వ కల్పంలో ప్రజాపతి ధర్మ చక్రం ప్రవర్తింపజేశాడు. అపుడు గోమతీ నదీతీరంలో నైమిశారణ్యంలో నాగపురం ఉండేది. అక్కడ దేవతలంతా యజ్ఞం చేశారు. అందులో మాంధాతచక్రవర్తి ఇంద్రుని కూడా మించిపోయాడు. అచట ధర్మాత్ముడయిన నాగరాజు ఉండేవాడు. అతని పేరు పద్మనాభుడు.

పద్ముడనే పేరుతో ఖ్యాతి వహించాడు. అతడు త్రికరణ శుద్ధిగా కర్మ, ఉపాసనా, జ్ఞాన మార్గాలు అనుసరిస్తూ, ప్రాణులన్నిటినీ ప్రసన్న భావంతో చూసేవాడు. ఆ నాగరాజు చెడుమార్గంలో నడిచే వారిని సామభేదదాన దండోపాయాలతో శిక్షించేవాడు. సన్మార్గంలో నడిచే వారిని రక్షించేవాడు. నేత్రాదీంద్రియాలను సదాలోచన ద్వారా రక్షించేవాడు. ఆ నాగరాజు దగ్గరకు వెళ్లి, యథావిధిగా నీకు కావలసిన దానిని అడుగు. అతడు నీకు పరమ ధర్మాన్ని చూపిస్తాడు. ఎన్నడూ మిథ్యా ధర్మాన్ని చూపించడు. ఆ నాగరాజు అందరికీ అతిథ్య మిస్తాడు. బుద్ధిమంతుడు. సర్వశాస్త్ర విశారదుడు. అందరూ కోరదగిన సద్గుణాలు కలవాడు. అతని స్వభావం నీరు వంటిది. సదా స్వాధ్యాయపరుడై ఉంటాడు. తపస్సు, దమాలతో కూడి ఉత్తమ ప్రవర్తన కలిగి ఉంటాడు. అతడు యజ్ఞాలు, దానాలు చేస్తూ ఉంటాడు. క్షమా సహితమైన ఉత్తమ ప్రవర్తన కల్గి ఉంటాడు. సత్యం మాట్లాడుతాడు. అసూయ లేనివాడు, శీలవంతుడు, జితేంద్రియుడు. **యజ్ఞం చేసి, మిగిలిన అన్నం తింటాడు. అనుకూలంగా మాట్లాడుతాడు. హితమూ, ఆర్జవమూ కలవాడు. కృతాకృతా లెరిగినవాడు. వైరం లేనివాడు. సర్వభూతదయ కలవాడు. గంగమడువు వంటి పవిత్ర వంశంలో పుట్టాడు."**

356. ఉంఛవృత్త్యుపాఖ్యానము - 5.

బ్రాహ్మణు డన్నాడు. 'ఇప్పటి దాకా నాకు చాలా భార మున్నది. ఆ భారం తీసివేసే మీ ఓదార్పు మాటలు నేనిపుడు విన్నాను. చాలా దూరం నడచి అలసి పోయిన వానికి, చక్కని శయనం కావాలి. చాలా సేపు నిలబడిన వానికి చక్కని ఆ సనం కావాలి. దప్పిగొన్న వానికి నీరు, ఆకలి గొన్నవానికి భోజనమూ కావాలి. కోరినది లభించడమూ, భోజన సమయానికి అతిథి లభించడమూ, కోరిన వెంటనే వృద్ధునికి కొడుకు లభించడమూ, మనసులో అనుకొన్న వెంటనే ఇష్టుడైన ప్రియమిత్రుడు దర్శన మివ్వడమూ - ఇవి ఎంత ఆనందం కలిగిస్తాయో అంత ఆనందాన్ని మీ మాటలు కలిగించాయి. మీ ఉపదేశమూ, జ్ఞానపూర్ణ మయిన వాక్యాలూ వింటే, నాకు చూపు లభించి నట్లయింది. నేనిపుడు ఆకాశం వైపు చూసి కర్తవ్యం ఆలోచిస్తున్నాను. మంచిది మీరు నాతో చెప్పినట్లే చేస్తాను. మీరీ రాత్రి నాతోనే ఉండండి. విశ్రాంతితో సుఖనిద్ర పొంది ఉదయమే వెళ్లవచ్చు. ఇప్పుడు సూర్యుడు కాంతితరిగి అస్తమిస్తున్నాడు.' భీష్ముడు చెపుతున్నాడు. "తరువాత ఆతని ఆతిథ్యం పొంది, ఆ అతిథి ఆ రాత్రి అక్కడనే, ఆ బ్రాహ్మణునితో గడిపాడు. మోక్ష ధర్మాలు చెప్పుకొనే వారిద్దరికీ ఆ రాత్రి అంతా హాయిగా పగలు వలెనే గడిచి

పోయింది. తెల్లవారగానే ఉదయమే స్వకార్యసిద్ధిని కోరే ఆ బ్రాహ్మణుడు ఆ అతిథిని సత్కరించాడు. వెంటనే అతిథి వెళ్లిపోయాడు. అపు డా విప్రుడు ధర్మాచరణశీలంతో తన కార్యం నిశ్చయించుకొన్నాడు. తన వారి అనుమతి తీసుకొన్నాడు. సత్కర్మాచరణ పరుడై అతిథి చెప్పినట్లు నాగరాజు దగ్గరకు బయలు దేరాడు. ఆయన తన సత్కార్య సిద్ధికోసం దృఢనిశ్చయం చేసుకొన్నాడు."

357. ఉంఛవృత్త్యుపాఖ్యానము - 6.

భీష్ముడు చెపుతున్నాడు. "అతడు ఎన్నో విచిత్రవనాలను, తీర్థాలను, సరస్సులను దాటి ఒక మహర్షిని దర్శించాడు. బ్రాహ్మణుడు అతిథివలన తానువిన్న నాగరాజును గురించి ఆ మహర్షిని అడిగాడు. అతడు చెప్పిన దాన్ని విని, మళ్లీ బయలుదేరాడు. మార్గం, స్వప్రయోజనం తెలిసిన ఆయన యథావిధిగా నాగరాజ గృహానికి వెళ్ళి "లోపల ఎవరైనా ఉన్నారా ? నేను వచ్చాను" అన్నాడు. ఆ మాటలు విని ధర్మవత్సల అయిన నాగరాజుభార్య అతనికి కన్పించింది. ఆమె ధర్మపరాయణ. ఆ బ్రాహ్మణునికి యథావిధిగా పూజచేసి స్వాగతం పలికి, 'నేనేం చెయ్యాలో చెప్పండి' అని అడిగింది. బ్రాహ్మణుడు అన్నాడు. 'మీ పూజలందుకొన్నాను. మీ మంచి మాటలతో విశ్రమించినట్లయింది. పుణ్యశీలా ! సర్వోత్తము డయిన నాగరాజును దర్శించాలనుకొంటున్నాను. అమ్మా ! మీ తీయని మాటలతో నాకు విశ్రాంతి, పూజ లభించాయి. ఇదే నా ముఖ్యకార్యం. ఇదే నా కోరిక. ఇందు కోసమే ఇపుడు నాగరాజు ఆశ్రమానికి వచ్చాను.' అపుడు నాగరాజు పత్ని ఇలా అంది. 'విప్రోత్తమా ! నా భర్త, సూర్యుని రథాన్ని ఒక నెలపాటు పగ్గమై లాగటానికి వెళ్లాడు. పదిహేను రోజులలో తిరిగి వచ్చి మిమ్ము దర్శిస్తాడు. సంశయం లేదు. నా భర్త బయటకు వెళ్ళటానికి కారణమూ, ఇంట లేనట్లూ మీకు తెలిసింది కదా ! నా పతి దర్శనం కాక మరేమి కావలసినా చెప్పండి. చేస్తాను.' అపుడు బ్రాహ్మణుడు అన్నాడు. 'నాగరాజును దర్శించాలనే నిశ్చయంతో ఇక్కడకు వచ్చాను. ఆయన రాకకోసం ప్రతీక్షిస్తూ ఈ మహావనంలో ఉంటాను. నాగరాజు వచ్చాక స్తిమితంగా నేను ఇక్కడకు వచ్చినట్లు చెప్పు. నీ మాట విని నాగరాజు నాకు దర్శన మివ్వాలి. నేనిక్కడ పరిమిత మయిన ఆహారంతో గోమతీనదీ తీరంలో మీరు చెప్పినంత కాలం నిరీక్షిస్తూ ఉంటాను.' ఆ విప్రు డలా నాగరాజ పత్నికి మళ్లీ మళ్లీ చెప్పి, నదీ తీరంలోని ఇసుక తిన్నెల దగ్గరకు వెళ్లాడు."

358. ఉంఛవృత్త్యుపాఖ్యానము - 7.

భీష్ముడు చెపుతున్నాడు. "తపస్వి అయిన బ్రాహ్మణుడు నిరాహారంగా ఉండటం వల్ల నాగు లందరూ దుఃఖించారు. నాగరాజు భార్య, సోదరులు, కొడుకులు, ఇతర బంధువులూ అందరూ ఒక చోట కలిసి, బ్రాహ్మణుని దగ్గరకు వెళ్లారు. అక్కడ గోమతీ నదీతీరంలో ఒక్కడూ, వ్రతదీక్షతో జపిస్తూ, నిరాహారుడై ఉన్న బ్రాహ్మణుని వారంతా చూశారు. నాగరాజు బంధువు లందరూ వెళ్లి, ఆ బ్రాహ్మణుని పలుమార్లు పూజించి, స్పష్టంగా ఇలా అన్నారు. 'తపోధనా ! నీ విచటికి వచ్చి ఈ రోజు ఆరవ రోజు. మీరు మీ భోజనం గురించి మా కేమీ చెప్పటం లేదు. నీవు మా దగ్గరకు వచ్చావు. మేమందరమూ నిన్ను సేవించాలని వచ్చాము. మేము గృహస్థులం. మీకు అతిథిపూజ చేయాలి. బ్రాహ్మణా ! మీరు ఆహారంగా కందమూలాలు కాని, ఫలాలు కాని, ఆకులు కాని, పాలు కాని, అన్నం కాని తినాలి. ఏదయినా తీసుకోండి. మీ రీ వనంలో ఉండి, ఆహారం తీసుకోకపోవడం వలన ధర్మ సంకటం కలుగుతోంది. దానివల్ల ఇక్కడి బాలురు, వృద్ధులూ కూడా బాధపడుతున్నారు. మా వంశంలో ఇంతరవరకూ ఎవరూ భ్రూణహత్య చేసినవారు లేరు. ఆపదలో కూడా అబద్ధమాడిన వారు లేరు. దేవతలకూ, అతిథులకు, బంధువులకు నివేదించకుండా ముందు భోజనం చేసిన వారూ లేరు.' బ్రాహ్మణుడు చెప్పాడు. 'మీ ఉపదేశమే నాకు ఆహారం అయింది. నేను ఈ ఆహారం తీసుకొన్నట్లే. నాగరాజు మరో ఎనిమిది రోజుల్లో వస్తాడు గదా ! ఎనిమిది రాత్రులు గడిచినా కూడా నాగరాజు రాకపోతే అపుడు ఆహారం తీసుకొంటాను. అతనిరాక కోసమే ఈ వ్రతం ఆచరిస్తున్నాను. మీరు ఏమీ బాధపడకండి. మీ మీ నివాసాలకు వెళ్లండి. అతని కోసమే ఇదంతా. ఈ వ్రత భంగం చేయకండి. అపుడా బ్రాహ్మణుని అనుజ్ఞతో నాగులందరూ తమ పని నెరవేరకుండానే ఇళ్లకు వెళ్లారు."

359. ఉంఛవృత్త్యుపాఖ్యానము - 8.

భీష్ముడు చెపుతున్నాడు. "చాలాకాలం పూర్తి అయ్యాక, తనవిధి నిర్వహించి, నాగరాజు సూర్యుని అనుమతి పొంది తన నివాసానికి వచ్చాడు. వెంటనే నాగపత్ని తన భర్తకు పాదాలు కడగటం మొదలయిన ఉపచారాలతో భర్తను సేవించింది. అపుడు నాగరాజు భార్యను ఇలా అడిగాడు. 'కల్యాణీ ! నేను చెప్పినట్లు నీవు దేవతాతిథి పూజలను నేను చేసినట్లు చేస్తున్నావు కదా ! భర్త వియోగంతో ఖిన్నురాలవై, సహజమైన స్త్రీ స్వభావంతో మృదుప్రవర్తన కలదానివై, ధర్మం అనే చెలియలి కట్టను దాటలేదుకదా !'

అపుడు నాగభార్య ఇలా అంది. 'శిష్టులకు గురు శుశ్రూష, బ్రాహ్మణులకు వేదాధ్యయనం, భృత్యులకు స్వామి మాట ఆచరించడం, రాజులకు లోక రక్షణం ధర్మాలు. ముఖ్యంగా సర్వ ప్రాణిరక్షణం క్షత్రియుల ధర్మంగా చెప్పబడింది. వైశ్యులకు అతిథి మర్యాదలతో కూడిన యజ్ఞ ప్రవృత్తి వైశ్యుల ధర్మం. నాగేంద్రా ! విప్రులకు, క్షత్రియులకు, వైశ్యులకు శుశ్రూష చేయుట శూద్రుని ధర్మం. సర్వప్రాణుల హితమూ కోరుట గృహస్థ ధర్మం. నిత్యమూ మితంగా ఆహారం తీసుకోవడం, శాస్త్రోక్తమైన వ్రతాచరణం, సర్వులకూ సామాన్య ధర్మాలు. ధర్మ సంబంధం చేత ఇంద్రియాలు పరిశుద్ధమవుతాయి. నేను ఎవరివాడిని ? ఎక్కడ నుండి వచ్చాను ? నా వాడు ఎవడు ? నా కిక్కడ ఏమి ప్రయోజనం కలుగుతుంది ? సన్యాసాశ్రమంలో ఉన్నవాడికి ఇటువంటి ఊహలు కలుగుతూ ఉండాలి. నాగరాజా ! పతివ్రతా స్వభావం భార్యకు ఉత్తమధర్మ మని, మీ ఉపదేశం వల్ల తత్త్వం తెలుసుకొన్నాను. అలా ధర్మం తెలిసిన దానను నేను, మీరు ధర్మం నిత్యమూ ఆచరిస్తున్నవారు. అటువంటప్పుడు నేను ధర్మం విడిచి అపమార్గంలో ఎందుకు నడుస్తాను ? దేవతారాధనం అనే ధర్మానికి ఏ లోపమూ లేదు. అతిథి సత్కారం కూడా ఏమరకుండా నిత్యమూ చేస్తున్నాను. అయినా ఒక విప్రుడు పదిహేను రోజులయి ఇక్కడకు వచ్చి ఉన్నాడు. వచ్చిన పనేమిటో నాకు చెప్పటం లేదు. మీ దర్శనం కోరుతున్నాడు. కఠోరవ్రతం ఆచరిస్తూ మీ దర్శనం కోరి, గోమతీ తీరంలో వేదం ఆవృత్తి చేస్తూ ఉన్నాడు. "నాగరాజు వచ్చాక వెంటనే నా దగ్గరకు పంపాలి" అని నాచేత సత్యప్రమాణం చేయించాడు. ప్రాజ్ఞా ! నీ విపుడు అక్కడకు వెళ్ళాలి. ఆ విప్రునకు దర్శన మివ్వాలి.'

360. ఉంఛవృత్త్యుపాఖ్యానము - 9.

నాగరాజు అన్నాడు. 'శుచిస్మితా ! నీవు చూసిన బ్రాహ్మణరూపంలోని వాడెవరు ? మనిషియా ? లేక దేవుడా ? యశస్వినీ ! నన్ను చూడగలిగిన మానవు డెవడు ? ఒక వేళ చూడాలనుకొన్నా అంత ఆజ్ఞాపూర్వకంగా చెప్పగలవాడెవడు ? సురస యొక్క వంశంలో పుట్టిన నాగులు మహావీర్యులు - వేగవంతులు. దేవతలకూ, దేవర్షులకూ, వందనీయులు. మేమూ అటువంటి వారమే. విశేషించి మనుష్యులకు సులభంగా కనిపించని వారమని నా అభిప్రాయం.' అపుడు నాగభార్య ఇలా అంది. 'వాయుభోజనా ! త్రికరణ శుద్ధిగా అతడు దేవత కాడు. తమపై ఆయనకు విశేష భక్తి ఉందని మాత్రం తెలుస్తోంది. వర్షంమోద ప్రీతికల చాతక పక్షి వర్షమే కోరినట్లు, ఆయన ఇంకేమీ అక్కర లేదని మీ దర్శనం ఒక్కటే కోరుతున్నాడు. నీ దర్శనం తప్ప మిగిలిన దేదీ కోరటంలేదు. సరికదా

మిగతా పని ఏదయినా నీ దర్శనానికి విఘ్నంగా భావిస్తున్నాడు. నీ వలె ఉత్తమవంశ సంజాతుడు ఎవడూ అతిథిని ఉపేక్షించడు. మీ వంశానికి సహజమైన కోపం వదలి ఆయనను దర్శించండి. ఆయనకు ఆశాభంగం కలిగించకండి. అలా చేస్తే మనం మాడిపోతాం. **ఆశపడి దగ్గరకు వచ్చిన వారి కన్నీరు తుడవని రాజూ, రాజపుత్రులూ భ్రూణహత్యాపాపం పొందుతారు. మౌనం వల్ల జ్ఞాన మనే ఫలం కలుగుతుంది. దానం వల్ల కీర్తి, సత్యవాక్యంతో వాగ్మిత్వం కలుగుతుంది. పరలోకంలో కూడా వైభవం కలుగుతుంది.** భూదానం చేస్తే ఉత్తమాశ్రమఫలితం లభిస్తుంది. న్యాయ పూర్వకంగా సంపాదించిన ధనం మరింత ఉత్తమ ఫలం కలిగిస్తుంది. తమకు ఇష్టమైన కర్మ పాపరహితమై, ఆత్మహితకరమూ అయితే అటువంటి కర్మచేసేవారు నరకానికి వెళ్ల రని ధర్మవేత్త లంటారు.'

నాగరాజు అన్నాడు. 'అభిమానంతో కూడిన కోపం నాకు లేదు. కాని జాతి సహజమైన కోపం మాత్రం చాలానే ఉంది. సంకల్పంతో నాలో ఏర్పడిన కోపాన్ని నీ మాట లనే అగ్నితో దగ్ధం చేశావు. **రోషాన్ని మించిన అజ్ఞానం ఇంకొకటి లేదు. రోషం వల్ల నాగులే ఎక్కువ అపనిందలకు గురి అవుతున్నారు.** ఇంద్రుని కూడా ఎదిరించగల రావణుడు, కోపానికి వశమవడం వల్లనే రామునిచే సంహరింపబడ్డాడు. తమ ఆవుదూడను అపహరించి, అంతఃపురంలో ఉంచారని విన్న పరశురాముడు, పరాభవ క్రోధంతో కార్తవీర్యుని కొడుకు లందరినీ చంపాడు. కోపంతో పరశురాముడు ఇంద్రునితో సమాన పరాక్రమం కల కార్తవీర్యుని సంహరించాడు. **కోపం తపస్సుకు శత్రువు. సకల శ్రేయస్సులూ కోపంతో నశించిపోతాయి. అటువంటి కోపాన్ని నీ మాటలవల్ల విడిచి పెట్టాను.** విశాలాక్షీ ! నన్ను, నా అదృష్టాన్ని నేను అభినందించక తప్పదు. నీ వంటి సద్గుణవతి నా భార్య అవడం నిజంగా నా అదృష్టం. అందుచేత ఇపుడే ఆ ద్విజు డున్న చోటికి వెడతాను. ఆయన కోరినది ఇస్తాను. కృతార్థుడై వెళతాడు.'

361. ఉంఛవృత్త్యుపాఖ్యానము - 10.

భీష్ముడు చెపుతున్నాడు. "నాగరాజు విప్రుని కార్యాన్నే మనసులో ఆలోచిస్తూ, అతని దగ్గరకు వెళ్లాడు. రాజా ! సహజంగా ధర్మవాత్సల్యం కల నాగరాజు విప్రుని సమీపించి, మృదుమధురమైన మాటలతో ఇలా అన్నాడు. 'మహాత్మా ! నన్ను క్షమించండి. నాపై కోపం వహించకండి. మీరిక్కడకు ఎవరి పని మీద వచ్చారు ? ఏ ప్రయోజనం కోసం వచ్చారు ? విప్రోత్తమా ! మీ ముందు నిలిచి స్నేహంతో అడుగుతున్నాను.

నిర్జనమైన ఈ గోమతీనదీ తీరంలో ఎవరిని ఉపాసిస్తున్నారు ? అపుడా విప్రుడిలా అన్నాడు. నేను ధర్మారణ్యుడను. పద్మనాభుడనే నాగరాజును దర్శించటానికి వచ్చాను. అతనితో నాకు పనిపడింది. నాగరాజు ఇక్కడ లేడని, దూరం వెళ్లాడని బంధువులు చెప్పగా విని, మేఘంకోసం వ్యవసాయదారుడు నిరీక్షిస్తున్నట్లు నిరీక్షిస్తున్నాను. ఆ నాగరాజుకు ఏ బాధలూ కలగకుండా స్వస్తి కలగాలనే తలంపుతో యోగసహితుడనై, స్వస్థచిత్తుడనై వేదమంత్రాలు ఉచ్చరిస్తున్నాను.'

నాగరాజు వెంటనే ఇలా అన్నాడు. 'ఆహా ! తాము శుభచరితులు. సజ్జన వాత్సల్యం కలవారు. ఏ దృష్టితోనూ మీరు నిందింపదగిన వారు కారు. ఎదుటివారిని స్నేహంతో చూస్తున్నారు. బ్రహ్మర్షీ ! మీరు చెప్పిన ఆ నాగరాజును నేనే. మీ కే హితం చేకూర్చాలో యథేచ్ఛగా ఆజ్ఞాపించండి. తాము నన్ను చూడటానికి వచ్చారని నా భార్య చెప్పితే విని, మిమ్ము దర్శించాలని నేనే స్వయంగా వచ్చాను. ఇపుడు మీరు మీ పనిని సఫలం చేసుకొనే తిరిగి వెళతారు. మీరు సంకోచించకుండా మీ పనిలో నన్ను నియోగించండి మీరు మీ సద్గుణాలతో మమ్ము కొనేశారు. మీ హితాన్ని విడిచి నా శుభాన్ని కోరుతున్నారు మీరు.' అపుడు బ్రాహ్మణుడు ఇలా అన్నాడు. 'మహాభాగా ! నేను మిమ్ము దర్శించాలని ఇచ్చటకు వచ్చాను. నాకు తెలియని విషయం ఒకటి అడగాలని మీ దగ్గరకు వచ్చాను. నేను విషయాలనుండి నివృత్తి పొందాను. ఆత్మలోనే ఉండి ఆత్మయొక్క గమనాన్ని అన్వేషిస్తున్నాను. చాలా ప్రజ్ఞ కల వాడిని. కాని గృహాల్లో ఆసక్తి కలవాడిని. చంచలమైన చిత్తాన్ని ఉపాసిస్తున్నాను. (అనగా ఆసక్తీ లేదు - విరక్తీలేదు) చంద్రకిరణాలు ఆహ్లాదాన్ని, చల్లదనాన్ని కలిగిస్తాయి. అలాగే స్వయం ప్రకాశకాలైన కీర్తి కిరణాలతో చక్కని సుగుణాలతో మీరు ప్రకాశిస్తున్నారు. నాగరాజా ! నా మనసులోని ప్రశ్నకు సమాధానం చెప్పండి. తరువాత నా పని ఏమిటో చెపుతాను. విందురు గాని.'

362. ఉంఛవృత్త్యుపాఖ్యానము - 11.

బ్రాహ్మణుడు ఆడిగాడు. 'నాగరాజా ! సూర్యుని రథానికి ఒకే చక్రం ఉంది. దాన్ని వంతువారీగా లాగటానికి మీరు వెళ్లుతున్నారు. అక్కడ ఏదయినా ఆశ్చర్యకరమైన సంఘటన మీరు చూసి ఉంటే నాకు చెప్పండి.' నాగరాజు చెపుతున్నాడు. 'భగవంతుడయిన సూర్యుడు ఎన్నో ఆశ్చర్యాలకు నిలయం. మూడు లోకాలలోని ప్రాణులన్నీ అతని ప్రేరణ వల్లనే ప్రవర్తిస్తాయి. చెట్ల కొమ్మలలో పక్షులు నివసిస్తున్నట్లుగా, సూర్యుని వేల కిరణాల్లో మునులు, సిద్ధులు, దేవతలూ నివసిస్తూ ఉంటారు. మహాబలు డయిన వాయువు సూర్యుని

నుండి వెలువడి, సూర్యునికిరణాలను ఆశ్రయించుకొని ఆకాశ మంతటా విస్తరిస్తాడు. ఇంతకంటె ఆశ్చర్యం ఏముంటుంది ? సూర్యుడు జనహిత కాంక్షతో ఆ వాయువును విభజించి వర్షఋతువులో జలంగా పరిణమింపజేస్తాడు. ఇంతకంటె ఆశ్చర్యం ఏముంటుంది ? సూర్యమండల మధ్యస్థుడయిన మహాత్ముడు తన దివ్యతేజస్సుతో ప్రకాశిస్తూ, లోకాల నన్నిటినీ సమీక్షిస్తూ ఉంటాడు. ఇంతకు మించిన ఆశ్చర్యం ఏమిటి ? శుక్రు డనే పేరు గల కాలమేఘం వర్షఋతువులో, ఆకాశంలో నీటిని సృష్టిస్తుంది. ఆ కాలమేఘం సూర్యస్వరూపమే. ఇంతకంటె ఆశ్చర్యం ఏముంటుంది ? వర్షఋతువులో (నాలుగు నెలలు) భూమి మీద కురిపించిన నీటినే సూర్యుడు తన పరిశుద్ధకిరణాలతో ఎనిమిది నెలల పాటు మళ్లీ లాగుకొంటాడు. ఇంతకంటె ఆశ్చర్యం ఏముంటుంది ? విప్రోత్తమా ! సూర్య భగవానుని తేజస్సులలో స్వయంగా పరమాత్మ నిలిచి ఉంటాడు. అక్కడ నుండియే బీజాలన్నీ పుడతాయి. అతని ప్రభావంతోనే చరాచర మయిన పృథివి అంతా ప్రాణిమయమై నిలుస్తోంది. సూర్యమండలంలోనే మహాబాహువు, శాశ్వతుడు, పురుషోత్తముడు, ఆద్యంతరహితుడు అయిన పరమాత్మ నివసిస్తాడు. ఇంతకు మించిన ఆశ్చర్యం ఏముంది ? ఈ ఆశ్చర్యాలన్నిటినీ మించిన మహాశ్చర్యం మరొకటి ఉంది. చెపుతా విను. సూర్యుని దగ్గర ఉండటం వలన, నేను విమలాకాశంలో చూసినది చెపుతాను. ఒకప్పుడు మధ్యాహ్న సమయంలో సూర్యుడు లోకాలన్నిటినీ తపింపజేస్తున్నపుడు రెండవ సూర్యునివలె అంతటా ఒక పురుషుడు కనిపించాడు. అతడు తన తేజస్సుతో సర్వతేజస్సులనూ వెలవెల పోయేటట్లు చేస్తూ, ఆకాశాన్ని బ్రద్దలు చేస్తున్నట్లుగా, సూర్యునికి అభిముఖంగా వస్తున్నాడు. ఆహుతులు స్వీకరించిన అగ్నిలా తేజఃకిరణాలతో, చూడశక్యం కాని రూపంతో రెండవ సూర్యుని వలె అత డున్నాడు. ఆ దివ్య పురుషుడు దగ్గరకు వస్తూఉంటే సూర్యుడు తన చేతులతో స్వాగతం చెప్పాడు. ఆ పురుషుడు తన కుడిచేతిని ప్రత్యర్చనం కోసం ముందుకు చాచాడు. అపు డా పురుషుడు ఆకాశం బ్రద్దలు చేస్తూ సూర్యమండలంలో ప్రవేశించాడు. వెంటనే ఆ తేజస్సు, సూర్యతేజస్సూ రెండూ కలిసి ఒకటై పోయి ఆదిత్యుని వలె భాసించాయి. ఆ రెండు తేజస్సులూ ఒకటై పోయే సరికి మాకు ఒక సంశయం కలిగింది. ఈ రథం మీద ఉన్నవాడు సూర్యుడా లేక ఇపుడు వచ్చిన వాడు సూర్యుడా ? అని సంశయం కలిగింది. సందేహం కలిగి మేము "సూర్యుని వలె ఆకాశ మాక్రమించి రెండవ సూర్యుని వలె వచ్చినవాడెవరు ?" అని సూర్యుని అడిగాం.'

363. ఉంఛవృత్త్యుపాఖ్యానము - 12.

అపుడు సూర్యుడు ఇలా చెప్పాడు. 'అతడు అగ్నీ కాదు, అసురుడూ కాదు, పన్నగుడూ కాదు. ఉంఛవృత్తితో సిద్ధిపొందిన ముని అతడు. అతడు పరంధామాన్ని పొందాడు. ఈతడు కందమూలాలూ, ఫలాలూ, ఎండుటాకులూ తినేవాడు. నీటిని, వాయువునూ తీసుకొంటూ ఏకాగ్రచిత్తంతో ఉండేవాడు. ఈ విప్రుడు వేదమంత్రాలతో శంకరుని స్తుతించాడు. స్వర్గంకోసం ప్రయత్నించాడు. అతడు త్రిదివం పొందాడు. నాగరాజా ! అతనికి దేని మీదా ఆసక్తి లేదు. ఏమీ కోరడు. నిత్యమూ ఉంఛవృత్తితోనూ, శిలవృత్తితోనూ లభించినదే తినేవాడు. సర్వభూత హితాన్ని చేసేవాడు. ఉంఛవృత్తితో గడిపేవారు పొందే ఉత్తమలోకాలను దేవతలు కాని, గంధర్వులు కాని, అసురులు కాని నాగులు కాని పొందలేరు. సూర్య సన్నిధిలో నేను ఇటువంటి ఆశ్చర్యం చూశాను. ఉంఛవృత్తితో సిద్ధి పొందినవాడు సూర్యునితో కలిసి భూమి చుట్టూ పరిభ్రమిస్తున్నాడు.'

364. ఉంఛవృత్త్యుపాఖ్యానము - 13.

బ్రాహ్మణుడు అన్నాడు. 'నాగరాజా ! ఇందులో ఆశ్చర్యమే కాని సందేహం లేదు. నాకు చాలా ప్రసన్నత ప్రీతి కలిగింది. సార్థకమైన మాటలతో నాకు సరియైన మార్గం చూపించారు. నాగరాజా ! నీకు శుభమస్తు. నేను వెళ్లి వస్తాను. ఎక్కడి కయినా పంపాలన్నా, ఏ పనిలో అయినా నియోగించాలన్నా నన్ను స్మరించండి.' అపుడు నాగరాజు ఇలా అన్నాడు. 'మీ మనసులోని పని చెప్పకుండానే ఎక్కడికి వెళుతున్నారు ? విప్రోత్తమా ! ఇచటికి మీరు వచ్చిన పని ఏమిటో తెలపండి. మీరు చెప్పినా, చెప్పక పోయినా మీ కార్యం నావల్ల సిద్ధిస్తే నా అంగీకారం పొందిన తరువాతనే వెళ్లాలి. బ్రహ్మర్షీ ! నా మీద మీకు ప్రేమ ఉన్నది. అట్టి మీరు చెట్టు క్రింద కూర్చుని, లేచి వెళ్లిపోయే బాటసారి వలె మొగం చూపించి వెళ్లి పోవటం తగదు. విప్రోత్తమా ! మీలో నేనున్నాను. నాలో మీరున్నారు. ఈ లోకమంతా మీదే. నేనుండగా మీకు ఏ చింతా ఉండదు.' బ్రాహ్మణుడు అన్నాడు. 'ఆత్మజ్ఞానీ ! మహాప్రాజ్ఞా ! నాగరాజా ! నీవు చెప్పినది అంతా నిజమే. దేవతలు కూడా తమను దాటలేరు. ఇది నిజం. నేను, మీరు, సకల ప్రాణులు శ్రీమన్నారాయణునిలోనే ఉంటారు, చేరుతారు. అందుచేత ఆ నారాయణుడే మీరు. అతడే నేను. నేనే మీరు. నాగరాజా ! పుణ్య సంపాదన విషయంలో నాకు సందేహం ఉండేది. ఇపు డది లేదు. ఇక నా కోరిక తీరటానికి ఉంఛవ్రతం ఆచరిస్తాను. ఇది నా నిశ్చయం. మీ వల్ల నా పని తీరింది. నేను కృతార్థుడనయ్యాను. నీకు శుభమగుగాక ! వెళ్లి వస్తాను.'

365. ఉంఛవృత్త్యుపాఖ్యానము - 14.

భీష్ముడు చెపుతున్నాడు. బ్రాహ్మణుడు నాగరాజును విడిచి, నిశ్చయం చేసుకొని, ఉంఛవృత్తి దీక్షను స్వీకరించటానికి భార్గవవంశస్థుడయిన చ్యవనమహర్షి దగ్గరకు వెళ్లాడు. చ్యవనమహర్షి ద్వారా అతడు దీక్షను స్వీకరించి ఉంఛవృత్తితో గడిపాడు. అలాగే ఈ కథనంతా ధర్మారణ్యుడు చ్యవనునికి చెప్పాడు. ఆ చ్యవనుడు జనకమహారాజుసభలో ఉంఛవృత్తి ఉపాఖ్యానం నారదునికి చెప్పాడు. నారదుడు దేవేంద్రుని భవనంలో దేవేంద్రు డడిగితే అతనికి చెప్పాడు. ఇంద్రుడు శుభప్రదమయిన ఈ కథను బ్రాహ్మణు లందరకూ బోధించాడు. రాజా ! నాకు పరశురామునితో యుద్ధం వచ్చినపుడు నాకు వసువులు ఈ కథను చెప్పారు. ధర్మ తత్త్వం అడిగిన నీకు, ధర్మబద్ధమై పరమపావన మయిన ఈ కథను నేను చెప్పాను. భరతోత్తమా ! నీవు నన్నడిగిన ధర్మం ఇదే. ఆతడు కోరికలేకుండా ధర్మార్థ కార్యాలు ఆచరించినవాడు. నాగరాజు యొక్క ఆదేశానుసారంగా తన కర్తవ్యం నిశ్చయించుకొన్న విప్రుడు మరోవనానికి వెళ్లి, ఉంఛశిలవృత్తిని స్వీకరించి, మితభోజియై యమనియమాలు ఆచరించాడు."

ఇది శాంతిపర్వం



భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా పెరగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా రక్షించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందకు తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నపుడే భారతం చదివితే ఇహపర సౌఖ్యాలు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.